మహాసేనాని గోపన్న

(చారిత్రక కాల్పనిక నవల)

రచన

డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య,

M.A., M.Phil, Ph.D.,

ప్రచురణ:

టేకుమళ్ళ ప్రచురణలు

16-6-81 శ్రీనివాస అగ్రహారం

నెల్లూరు - 524 001 (ఆంధ్రప్రదేశ్)

మహాసేనాని గోపన్న
(చారిత్రక కాల్పనిక నవల)
రచన : డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య
ప్రతులకు:
డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య
శ్రీనివాస అగ్రహారం
నెల్లూరు - 524 001, ఆం.ప్ర.
ముద్రణ : ప్రథమ ముద్రణ
క్రోధినామ సంవత్సరం, చైత్రమాసం
ఏప్రిల్ 2024.
ప్రతులు : 300 కాపీలు
మూల్యం: రూ. 150/-
రచయిత చిరునామా:
డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య
3 వ మెయిన్ రోడ్డు
16-6-81 శ్రీనివాస అగ్రహారం
విజయమహల్ దగ్గర
నేతాజి పైలట్ స్కూల్ ప్రక్కన
నెల్లూరు - 524 001, ఆం.ప్ర.
ఈమెయిల్: tekumalla.venkatappaiah@gmail.com
ఫోను: 9490400858, 91105 80418

డి.టి.పి: **డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య**
కవర్ డిజైన్: జోస్యుల వేణుగోపాల్, విజయవాడ (94404 36806)
ముద్రణ: అళహరి రాము, విజయవాడ (94402 77811)

అంకితం



మా తల్లిగారైన
శ్రీమతి టేకుమళ్ళ (ఓరుగంటి) హనుమాయమ్మ గారికి
భక్తి పూర్వకంగా అంకితం

కృతజ్ఞతలు



మథురా విజయం రచయిత శ్రీ పేరాల భరతశర్మ గారికి, "వాక్" మాసపత్రిక వ్యాసకర్తలు సి.ఎస్.ఎల్.నరసింహన్ గారికి, శ్రీమతి సుధారంగరాజన్ గారికి, తమిళ మాన్యుస్క్రిప్ట్ రచించిన వేణుగోపాలన్ గారికి, కోయిళ్ ఒళుగు రచించిన డా.వి.ఎన్ హరిరావు గారికి, ఇబిన్ బట్టుటా ఆంగ్ల అనువాదం చేసిన హెచ్.ఎ.ఆర్.గిబ్ గారికి, ఆంధ్ర వైష్ణవ వాఙ్మయము వ్యాసకర్త శ్రీనిడదవోలు వేంకటరావు గారికి, మథురావిజయం ఆఫ్ గంగాదేవి రచించిన ఎస్.తిరువేంకటాచారి గారికి, మథురా విజయముపై సిద్ధాంత వ్యాసములు రచించిన పరిశోధకులకు, చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధానార్చకులు శ్రీ సి.ఎస్.రంగరాజన్ గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు మరియూ ధన్యవాదములు.

– డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య.

‘

‘నరహంతలు ధరాధిపతులై’

“నరహంతలు ధరాధిపతులై చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి. రణరంగం కానిచోటు భూస్థలమంతా వెదికిన దొరకదు. గతమంతా తడిసె రక్తమున, కాకుంటే కన్నీళ్ళతో” అని మహాకవి శ్రీశ్రీ తన ‘మహాప్రస్థానం’ లో చెప్పడం ఏమాత్రం అతిశయోక్తి కాదు, అబద్ధమూ కాదు. ఈ కవిత సత్యాన్ని ప్రజలకు సాక్షాత్కారం చేసి, నిష్ఠురనిర్వేదంగా నిలిచింది. చరిత్ర గురించి నిస్సంకోచంగా, నిర్భీతిగా, నిర్మొహమాటంగా కవితాత్మకతతో బోనెక్కించిన కవి శ్రీశ్రీ. ఆయన చెప్పిన చరిత్ర కవితా పాఠాలన్నీ చేదునిజాలన్నది నగ్నసత్యం!

ఈ నా “మహాసేనాని గోపన్న” చారిత్రిక నవలకూ శ్రీశ్రీ మాటలు యథాతథంగా వర్తిస్తాయని విశ్వసిస్తున్నాను. ఢిల్లీ సుల్తాను అలావుద్దీన్ ఖిల్జీ (క్రీ.శ. 1296–1316) ఆస్థానములో మాలిక్ కాఫూర్ సేనాధిపతి. వింధ్య పర్వతములకు దక్షిణమునగల హిందూరాజ్యముల వినాశనముకు, ప్రాచీన దేవాలయముల విధ్వంసమునకు, లక్షలాది హిందువుల బలాత్కార మతమార్పిడికి, ఎనలేని సంపద కొల్లగొట్టి ఢిల్లీ చేర్చుటకు కారణభూతుడైన, మాలిక్ కాఫూర్ యధాతధంగా, శ్రీ.శ్రీ. చెప్పినట్లు చరిత్రలో అక్షరాలా ‘నరహంతకుడు’. మాలిక్ కాఫూర్ ఓరుగల్లును, హొయసలలను ముట్టడించి గెలిచిన తర్వాత, దక్షిణాదిన ఉన్న శ్రీరంగంవెళ్ళి అక్కడి ఆలయంలోని శ్రీరంగనాథుని ఉత్సవ విగ్రహాన్ని తీసుకొని వెళ్ళి ఢిల్లీ యువరాణి సురాధారిణికి కానుకగా ఇచ్చాడు. ఢిల్లీ వెళ్ళిన నాట్య బృందం సుల్తానును మెప్పించి, యువరాణి ఇష్టపడిన ఆ విగ్రహాన్ని ఆమె కన్ను గప్పి తీసుకుని వచ్చి శ్రీరంగం చేర్చారు. సురాధారిణి విగ్రహం వెదుక్కుంటూ శ్రీరంగం చేరి భక్తి పరవశంతో, స్వామిని సేవించి, అక్కడే తుది శ్వాస విడిచిపెట్టింది. అంతటితో కథ సుఖాంతం కాలేదు.

క్రీ.శ. 1323 సం.లో మళ్ళీ ఇంకో తురుష్కుల దండయాత్ర జరిగింది. గజీ మలిక్ కుమారుడైన ఉలుగ్ ఖాన్ (మహమ్మద్–బీన్–తుగ్లక్) సైన్యాధ్యక్షుడిగా

హొయసల సైనికుల సహాయం తీసుకుని దక్షిణభారతదేశంలోని ఆలయాలన్నిటిని ధ్వంసంచేస్తూ శ్రీరంగానికి చేరుకున్నారు. ఆ విషయం తెలిసిన ఆలయ పూజారి పిళ్ళై లోకాచార్యులవారు, వేదాంత దేశికాచార్యులవారు ఆలయంలోని మూలవిరాట్టు కనిపించకుండా రాతిగోడను నిర్మించి, మూలవిరాట్టైన లక్ష్మీ అమ్మవారిని అక్కడే ఒక సంపంగి చెట్టుక్రింద గోయి త్రవ్వి పాతిపెట్టారు. శ్రీరంగనాథ స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఇతర నగలను తీసుకుని శ్రీరంగం ఆలయ ప్రధానార్చకుడు పిళ్ళై లోకాచార్యులు, కులశేఖరుడనే క్షత్రియుని సహాయంతో ఆలయాన్ని దాటించారు. ఆ విగ్రహం అనేక స్థలాల్లో దాచిన పిదప, జరుగుతున్న మహమ్మదీయుల దాడులలో, చివరకు కొంతమంది శ్రీరంగనాథ స్వామి పరమ భక్తులైన కొడవరులనే వారి ద్వారా తిరుమల కొండలపై ఉన్న అంజనాద్రి కారడవుల్లోకి చేరుతుంది. కులశేఖరుని కుమారుడైన రాజ వల్లభుడు, అతని స్నేహితుడు దత్తుడు అష్టకష్టాలు పడి అంజనాద్రి అడవుల్లో ఉన్న విగ్రహాన్ని కనిపెట్టి తిరుమల చేరుస్తారు. ఆ విగ్రహం తిరుమల చేరుకునే లోపు ఎంతో మంది వైష్ణవభక్తులు, కొడవరుల ప్రాణాలు గాలిలో కలిసి పోయాయి. మహమ్మద్–బిన్–తుగ్లక్ క్రీ.శ 1325సం.లో ఢిల్లీ పాదుషా అయ్యాడు. మధుర సుల్తాన్ ఢిల్లీకి సామంతుడుగా ఉన్నా, తరువాయి కాలంలో స్వతంత్ర్యం ప్రకటించుకొని మధురకు సుల్తానుగా ఆ శ్రీరంగం పరిసర ప్రాంతాలకు మహారాజుగా ఉంటాడు.

కాకతీయ రాజులనుండి బందీలుగా కొనిపోబడి, ముసల్మానులుగా మారిన హరిహర, బుక్కరాయలు సమర్ధులని గ్రహించిన ఢిల్లీ పాదుషా వారిద్దరిని దక్షిణాపథంలో చెలరేగుతున్న అల్లర్లను అణచమని పంపుతాడు. కానీ వారు ముస్లింమతస్తులుగా మారడం వల్ల వారి అధికారం దక్షిణాపథంలో ఎవ్వరూ అంగీకరించరు. విద్యారణ్యస్వామి హరిహర, బుక్కరాయలు సమర్ధులని గ్రహించి వారిని తిరిగి హైందవ మతంలోకి రప్పించి, విజయనగర సామ్రాజ్యాన్ని శాశ్వత మహావీర నగరంగా నిర్మించాలని సంకల్పించి, క్రీ.శ.1336 సం.లో ఒక గొప్ప ముహూర్తం నిర్ణయం చేశారు. అదే ముహూర్త సమయానికి క్షణం కూడా దాటకుండా ఒక యంత్రనిర్మాణం చేయాలి. ఆ రోజులలో ఘడియలను, విఘడియలను సరిగ్గా

తెలిపే కాల ఘంటికలు లేవు. అందువల్ల ఆకాశంలోని నక్షత్రదర్శనం ద్వారానే అది సాధ్యం. సరైన ముహూర్తానికి శంకుస్థాపన మరియు యంత్రనిర్మాణం ఒకరివల్ల అయే పని కాదని గ్రహించిన విద్యారణ్యులు కాశీ క్షేత్రం నుండి నక్షత్రశాస్త్రంలో దిట్టైన ఒక మహా పండితుడిని పిలిపించారు. ఆ పండితుడు కాల నిర్ణయము చేయడానికి, స్వామివారు యంత్ర నిర్మాణం చేయడానికి పూనుకున్నారు. కాశీ పండితుడు తెల్లవారుఝామున ఘడియలలో నక్షత్ర దర్శనం చేయడానికి సమీప పర్వతంపైకి ఎక్కారు. స్వామివారు కాశీపండితుని శంఖారావం విన్న వెంటనే కరిగి యున్న తామ్రలోహాన్ని యంత్రపు అచ్చులో పోయవలసి యున్నది. ముహూర్తమాసన్నం కాగానే కొండపై నుండి శంఖారావం వినిపించింది. వెంటనే స్వామివారు తామ్రయంత్ర నిర్మాణం అచ్చులోపోసి పూర్తిచేశారు. బహుస్వల్ప వ్యవధిలో మరొక శంఖానాదం వినిపించింది. కాశీ పండితుడు కొండదిగి స్వామివద్దకు వచ్చారు. కాశీపండితుడు ప్రథమ శంఖారావం తనది కాదని ఎవరో జంగమ బిక్షకుడు చేసినదని, తనది ద్వితీయ శంఖారావమని తెలియజేశారు. స్వామివారు మిగుల బాధపడ్డా, విధి బలీయమని గ్రహించి, చల్లారిన అచ్చుపోతను పరిశీలించగా అది రెండుబావు బీటలు వారి యున్నది. అప్పుడు స్వామివారు బాధాపూరిత హృదయులై "ఈనగరము రెండువందల యిరువది ఐదు సంవత్సరములు మించి మనజాలదు" అని సెలవిచ్చి, మీ వంశం ఆ సమయానికి పదితరాలు పైన వెళ్ళిపోతాయి. పరిపాలకులు బలపరాక్రమాలను నిత్యం చూపుతూ శతృవులను ఎప్పటికప్పుడు అణచివేస్తూ అనుక్షణం జాగరూకులై ఉండాలి. మీరు హైందవధర్మరక్షణకు నడుంకట్టి, తురుష్కులను మట్టుబెట్టడానికి తగిన ముహూర్తం చూసుకోండి." అని వారికి ప్రబోధించారు.

హరిహరుడు రాజ్యవిస్తరణకు పూనుకోగా, రాజ్యపాలన బుక్కరాయలు గావిస్తుంటాడు. బుక్కరాయల కుమారుడైన కంపన ముళ్ళై దేశాధిపతి. కంపనకు గోపన్న సైన్యాధిపతిగా ఉంటాడు. హరిహరుల కొలువులో అమాత్యుడిగా పనిచేసిన నరసింహామాత్యుని కొడుకు గోపన్న వేదవేదాంగాలు చదివి, యుద్ధవిద్యలను కూడా

అంతే పట్టుగా, సంపూర్ణంగా నేర్చి, కంపనకు అభిమాన పాత్రుడిగా ఉంటాడు. గోపన్న చిన్నతనం నుండి విచిత్ర స్వప్నాలతో సతమతం అవుతుంటాడు. గురువైన వేదాంత దేశికుని ద్వారా ఈ శ్రీరంగం వృత్తాంతంవిని, మధుర సుల్తాన్ తల త్రుంచి, శ్రీరంగనాథుని విగ్రహం జాడ కనిపెట్టి శ్రీరంగంలో తిరిగి ప్రతిష్టిస్తానని గురువైన దేశికుల ముందు ప్రతిజ్ఞ చేస్తాడు.

కాలం పాతిక సంవత్సరాలు గడిచి పోయింది. విజయనగర రాజులు ఎన్నో దుర్గాలను జయించినప్పటికి, ఉత్తరాన బహమనీ సుల్తానులతో ఉన్న విరోధం వల్ల, దక్షిణాన ఉన్న మధురను ముట్టడిస్తే, బహమనీ సుల్తానులతో సమస్య అని ఆలోచిస్తుండగా, కాలం కలిసి వచ్చి క్రీ.శ.1362 సం.లో సుల్తానుకు చెందిన కాంచీపురాన్ని, గోపన్న ధైర్య సాహసాలతో జయిస్తాడు. తర్వాతి కాలంలో గోపన్న జెంజికి ప్రభువై, విగ్రహాన్ని తిరుమల నుండి జెంజికి తరలిస్తాడు. కానీ బహమనీ సుల్తానులవల్ల మధురలో ఉన్న అపారసైన్య బలగం వలన యుద్ధానికి భయపడుతూ ఉండగా 10 సం.ల కాలం గడిచిపోతుంది. క్రీ.శ.1371 లో గోపన్న పన్నిన రాజతంత్రం వల్ల మధుర సుల్తానుకు సుఖవ్యాధి సోకి వైద్య నిమిత్తం కన్ననూరు నుండి మధురకు వెళ్తాడు. గోపన్న గ్రామాలలో ఉన్న ప్రజానీకంతో అపార సైన్యబలగంతో కన్ననూరు జయిస్తాడు. తరువాత జరిగిన మహాసంగ్రామంలో కంపన మధుర సుల్తానుతో ద్వంద్వ యుద్ధంచేసి మధుర సుల్తానును కత్తితో పొడవగానే, వెంటనే వచ్చి గోపన్న సుల్తాను తలను బంతిలా నేలకు పడగొడతాడు. మహాసేనాని గోపన్న ప్రతిజ్ఞ నెరవేరుతుంది. శ్రీరంగనాథుడు శ్రీరంగంలో ప్రతిష్టించబడటంతో కథ సుఖాంతం అవుతుంది.

తర్వాతి కాలంలో, ఈ నవలతో సంబంధంలేకపోయినప్పటికి, ఒక విషయం చెప్పవలసి యున్నది. క్రీ.శ.1752 లో శ్రీరంగ క్షేత్రాన్ని వశపరచుకోవాలని, అక్కడి అపార సంపద కొల్లగొట్టాలని ఫ్రెంచ్ వారు విఫల ప్రయత్నం చేశారు. శ్రీరంగంలో చందాసాహెబ్ చే నియమిపబడ్డ వెయ్యిమంది రాజపుత్ర సైనికులు ఆలయ ప్రాంగణంలో నిలబడి, తమ్ము సంహరించిన తర్వాతే ఆ శ్రీరంగనాథుణ్ణి తాకాల్సి ఉంటుందని వీరోచిత ఖడ్గప్రదర్శన జరిపే సరికి, రాజ పుత్ర సైనికులకు భయపడి ఫ్రెంచ్ అధికారులు తోకముడిచి పారిపోయారు. ఈ విధంగా మధుర, శ్రీరంగపట్టణాలను, అక్కడి దేవతా మూర్తులను అనేక సార్లు హైందవ వీరులు ప్రాణాలకు తెగించి కాపాడుకున్నారన్నది రక్తచరిత్ర చెబుతున్న వాస్తవాలు.

గోపన్న తర్వాతి కాలంలో, ముసల్మానుల పాలనలో జీర్ణమైపోయి విజయనగర సామ్రాజ్యంలో పాడుపడిన ఎన్నో దివ్య క్షేత్రాలను పునరుద్ధరణ గావించి కైవల్యం పొందాడు. అతని ధైర్య సాహసాల వల్ల హైందవధర్మం కాపాడబడింది. అతను ధార్మిక, చారిత్రక నాయకుడై కంచి, శ్రీరంగం ఆలయలలో ఉన్న శిలాశాసనాలలో ఈనాటికి చిరంజీవిగా నిలిచి ప్రస్తుతింపబడుతున్నాడు. అలాంటి గొప్ప ధార్మిక వ్యక్తి, మహాసేనాని గోపన్న చరిత్ర ఇంతవరకూ గ్రంధస్తం కాలేదని, ఈ నా ప్రయత్నం జరిగింది. అందరూ చదివి ఆశీస్సులు అందిస్తారని ఆశిస్తూ...

– డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య.

కృతజ్ఞతాంజలి

తిరుపతి దగ్గర ఉన్న బొమ్మవరం గ్రామంలో ఉన్న వీరనరసింహరాజుగారు ఒక సంవత్సరం క్రితం మహాసేనాని గోపన్న గురించి నాకు తెలియజేశాడు. గంగాదేవి సంస్కృతంలో రచించిన "మధురావిజయం" అనబడే "కంపన మహారాజు చరిత్ర" గురించి విన్నాను. కానీ, గోపన్న గురించి తెలియదు. సదరు గోపన్న కంపనకు సర్వ సైన్యాధ్యక్షుడే కాక ప్రాణ స్నేహితుడనీ, ఆ వ్యక్తి గురించి ఒక తెలుగు చారిత్రిక నవల రాస్తే బావుంటుందన్న ఉద్దేశం వీరనరసింహరాజు తెలియజేశారు. చరిత్ర పుస్తకాలను కొనడానికి, వివిధ ఆర్కీవ్స్‌లో ఉన్న పి.డి.ఎఫ్ పుస్తకాల ముద్రణకు, మిగతా పురాతత్త్వ శాఖలకు, గ్రంధాలయలకు వెళ్ళడానికయ్యే ప్రయాణఖర్చులకు, ద్రవ్య సహాయం చేస్తానని మాట ఇచ్చారు. అన్న మాట ప్రకారం చెల్లించడమూ జరిగింది కూడా! నాచే పట్టుబట్టి ఈ గ్రంథాన్ని వ్రాయించినందుకు వారికి నా కృతజ్ఞతలు! కానీ, గ్రంథ ముద్రణకు వ్యయం కూడా తనే భరిస్తానని చెప్పడంవల్ల ఇంత పెద్ద గ్రంథం ధైర్యంగా వ్రాశాను. కానీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోవడం వల్ల నా కృషి వ్యర్థం కారాదని భావించి భారమైనా నేనే స్వయంగా ముద్రణకు పూనుకున్నాను.

బహుశః నవంబరు 2021 అంటే సుమారు రెండు సంవత్సరాల క్రితం, "గోపన్న" కు సంబంధించిన నా అన్వేషణ ప్రారంభమయింది. అనేక ఆంగ్ల పుస్తకాలను చదివాను. శ్రీ పేరాల భరత శర్మగారి "మధురా విజయం" చదివాను. అంతర్జాలంలో వెదకగా వెదకగా గోపనకు సంబంధించిన సమాచారం కొంత దొరికిది. పేరాల వారి మధురావిజయం ముందుమాటలో చెప్పబడ్డట్టుగా "నాకుపకరించిన గ్రంథములను విడిగా పేర్కొంటిని. ఆ గ్రంథకర్తలకు కృతజ్ఞతలు" అని అన్నారే తప్ప, అట్టి గ్రంథముల సూచిక ఏదీ లేకపోవడం నాకు ఆశానిపాతమైనది. ఆగ్రంధంలో

కొన్ని సంఘటనలు మాత్రమే గోపన్నకు సంబంధించి ఉన్నవి. ఆ రాజసభల సన్నివేశాలు, కంపనప్రేమ వ్యవహారాలు, గంగాదేవి వృత్తాంతం, విజయనగర వివిధ వ్యక్తుల గురించి, పర్యాటనకై తిరిగిన వైష్ణవభక్తుల గురించి వారి రచన ద్వారా తెలుసుకొన్నాను. కొన్ని ఉపయుక్తమైన సంఘటలను ఆ గ్రంథం నుండి యధాతథంగా తీసుకున్నాను. వారికి, వారి వంశీయులకు నా కృతజ్ఞతలు.

తరువాత కొంతకాలానికి చిలుకూరు బాలాజీ ఆలయం వారు నడుపుతున్న "వాక్" మాసపత్రికలో ఆంగ్లంలో "శ్రీరంగనాధుని పర్యటన-2" రచించిన సి.ఎస్.ఎల్ నరసింహన్ గారిని సంప్రదించడం ద్వారా, వారు నా మీద దయతో శ్రీమతి సుధా రంగరాజన్ గారు చేసిన అనువాదాన్ని పి.డి.ఎఫ్ రూపంలో పంపారు. ఆ వృత్తాంతం తమిళంలో ఒక మాన్యుస్క్రిప్ట్ రూపంలో చెన్నైకి చెందిన వేణుగోపాలన్ రచించినదని ఆ పత్రికలో పేర్కొన్నారు. వీరు ముప్వురూ చేసిన కృషి సామాన్యమైనది కాదు. వారికి నా ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. వీరి కథలో ప్రాముఖ్యత శ్రీరంగనాథుని విగ్రహం ఎప్పుడెప్పుడు ఎలా ఎక్కడెక్కడికి తరలింపబడినది అనే విశేషాలు ఎక్కువగా ఉన్నాయి. గోపన్నపాత్ర తక్కువేనని చెప్పుకోవాలి. ఎక్కువగా రాజవల్లభుడు, దత్తుడు అంజనాద్రిలో చేసిన విగ్రహాన్వేషణ ఎక్కువగా ఉంది. అలాగే రాజవల్లభుడు, మధురాంగిణి ప్రేమ వ్యవహారం చాలా ఎక్కువభాగం ఆక్రమించినది. వర్ణనలు అనంతంగా ఉన్నాయి. వీరి రచనలో ఎక్కువభాగం సంక్షిప్తీకరణచేసి ఆ గ్రంథం నుండి చాలా సంఘటనలను యధాతథంగా తీసుకున్నాను. మరొక్క సారి వీరి అనంతకృషిని శ్లాఘిస్తూ శ్రీ వేణుగోపాలన్, శ్రీ సి.ఎస్.ఎల్ నరసింహన్, శ్రీమతి సుధారంగరాజన్ త్రయానికి పాదాభివందనాలు తెలియజేస్తున్నాను. అలాగే వారి

గురించి నాకు విషయం అందజేసిన చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధానార్చకులు శ్రీ సి.ఎస్.రంగరాజన్ గారికి నా ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసుకుంటున్నాను.

ఈ నరహంతక మధుర సుల్తాన్ పరిపాలిస్తున్న కాలంలో ఇబిన్ బట్టుటా అనే మొరాకో దేశానికి చెందిన యాత్రీకుడు భారతదేశాన్ని పర్యటించాడు. హజ్ తీర్థయాత్ర కోసం మొదటిసారి మొరాకో నుండి బయలుదేరి, ఈజిప్ట్, అరేబియా, ఇరాన్, సిరియా, క్రిమియాలను సందర్శించి, ఆ తర్వాత మధ్య ఆసియా మరియు ఆఫ్ఘనిస్తాన్ మీదుగా భారతదేశానికి చేరుకున్నాడు. బట్టుటా "రిహ్లా" (ట్రావెలాగ్) అనే యాత్రా గ్రంధాన్ని అరేబియా భాషలో వ్రాశాడు. ఆయన తన ప్రయాణాలలో సేకరించిన ముస్లిం ప్రపంచం గురించి, తను సేకరించిన సమాచారాన్ని గ్రంధంగా మా మొరాకో చక్రవర్తికి కానుకగా ఇచ్చాడు. ఆ "రిహ్లా"ను ఆంగ్లంలో హెచ్.ఎ.ఆర్. గిబ్ 1929 సం.లో అనువదించాడు. దానిలో బట్టుటా ముస్లిం అయినా, మధురసుల్తాను హైందవులను పెట్టిన బాధలను, కిరాతకంగా మతం మారమని చేసిన అకృత్యాలను, హైందవులను సామూహికంగా నరుకుతున్న తీరును, అల్లా సాక్షిగా ద్వేషిస్తూ, జుగుప్సాకరంగా వర్ణించిన తీరును చదివితే కన్నీటి పర్యంతం కాక తప్పదు. బట్టుటా అనే యాత్రీకుడు గోపన్నను కలిసినా, కలవకపోయినా, పాఠకులకు మధురసుల్తాను కిరాతకాలు 'రిహ్లా' లో పేర్కొన్నవి, కళ్ళకు కట్టినట్లు చెప్పడానికి, వారిద్దరూ కలసినట్టు ఒక సన్నివేశం సృష్టించి, మధుర సుల్తానుచేసే అకృత్యాలను బట్టుటా గోపన్నకు చెప్పినట్లు ఈ గ్రంధంలో వ్రాశాను.

1991సం.లో బి.ఎ దోడామణిగారిచే కర్ణాటక విశ్వవిద్యాలయం వారు, 2002 సం.లో గాయత్రీ కణ్ణన్ గారిచే మదరాసు విశ్వవిద్యాలయం వారు, గంగాదేవి రచించిన మధురా విజయంపై చేయించబడ్డ ఆంగ్ల పరిశోధనలు, ''కోయిల్ – ఒళుగు" (ఆలయ నిర్మాణరీతి) పేరుతో డా.వి.ఎన్ హరిరావుగారు, తమిళంలో రచించబడ్డ గ్రంథానికి ఆంగ్లంలో తర్జుమాలాంటి అనేక విలువైన గ్రంథాలు, వ్యాసాలు నాకు ఉపయోగపడ్డాయి. అలాగే అలాగే నా సాహిత్య గురువైన డా.అద్దేపల్లివారికి గురువైన శ్రీపువ్వాడ శేషగిరిరావు వ్రాసిన పద్యం ఒకటి సందర్భానుసారంగా ఉన్నదని గ్రహించడమైనది. వారికి, వారి వంశీయులకు నా కృతజ్ఞతలు.

నాకు కనిపించిన కాలానికి సంబంధించిన ఒకటి, రెండు వైరుధ్యాలను ప్రస్తావించక తప్పడంలేదు. అప్పట్లో వేంకటనాథునిగా పిలవబడే శ్రీవేదాంత దేశికాచార్యులవారు క్రీ.శ 1268 సంవత్సరంలో జన్మించాడు. మరణించిన సంవత్సరం క్రీ.శ.1369 అని నేను పరిశీలించిన అన్నిచోట్లా, గ్రంథాలలో, అంతర్జాలంలో ఒకే విధంగా రికార్డు కాబడి ఉన్నది. అనగా ఆయన 101 సం. జీవించాడన్నది మాత్రం కాదనలేని సత్యం. చిక్కెక్కడ ఉన్నదంటే, కంపరాయలు, గోపన్న మధురపై దండెత్తి మధుర సుల్తాను చంపిన సం. క్రీ.శ.1371. అంటే అప్పటికే ఆయన నిర్యాణం చెంది 2 సంవత్సరములైనది. కానీ ఈ మధురావిజయం తర్వాత వేదాంత దేశికులు గోపన్న గురించి రచించిన శ్లోకాలు శ్రీరంగం రెండవ తూర్పు ప్రాకారంపై ఉన్నట్టు చెప్తున్నారు. ఇదొక చిక్కుముడి. ఆయన శిష్యబృందం లేక వారి కుమారుడు ఈ కార్యానికి పూనుకుని ఉండవచ్చా? అన్న నా సందేహం నాకు ఉంది. దీనికి కాలమే సమాధానం చెప్పుగాక! ఇంకొక చారిత్రక తప్పిదమేటంటే "గోలకొండకవుల సంచిక

(1934)" లో398వ పేజీలో గోపమంత్రి "సింధుమతీ విలాసం" వ్రాశాదని చెప్పి, అతని కాలము 1700 ప్రాంతం వాడని పేర్కొనబడినది. బహుశః విజయనగర గోపన్నను, కంచెర్ల గోపన్నగా భావించి, కాలం గురించి పొరబాటుగా వ్రాసి ఉండవచ్చు. కంచెర్ల గోపన్న ప్రబంధములు ఏవీ వ్రాయలేదు. ఆయన వ్రాసినవి కీర్తనలు, దాశరథీ శతకము మాత్రమే! కంచెర్ల గోపన్న మంత్రిగా పనిచేయలేదు. పాల్వంచ పరగణా తహసిల్దారు గా పనిచేశారు.

గోపన్న విరచిత "సింధుమతీ విలాసం" లోని ఆశ్వాసాంత గద్యలలో గోపన్నతండ్రి, గోత్ర నామాదులు, వేదాంత దేశికుల శిష్యుడనని చెప్పుకోవడం తప్ప మిగతా వివరాలేమీ కానరావు. ఆ గ్రంధం నా శక్తిమేరకు ప్రయత్నించినా దొరకలేదు. గోపన్న జననము, బాల్యము విద్యాభ్యాసము గురించి, నేను పరిశీలించిన ఏ గ్రంధములోను పేర్కొనబడలేదు. అందువల్ల గోపన బాల్యవృత్తాంతం, విద్యాభ్యాసము, ॅణం, వివాహఘట్టాలు కూడా కల్పింప బడ్డవే! గోపనను ధీరోదాత్తునిగా చిత్రీకరించడంలో కొన్ని సాహసాలను చేసినట్టు కూడా కల్పనచేశాను.గోపన నారాయణపురానికి సైన్యాధికారి కావడం, కాంచీపురవిజయం తర్వాత జెంజికి ప్రభువైనట్లు, మధురా విజయానంతరం కూడా జెంజిలోనే ఉండి అనేక ధర్మ కార్యాలు చేసినట్లు మాత్రమే చరిత్ర ద్వారా తెలుస్తున్నది. భారతి మాసపత్రిక 1952 అక్టోబరు (ఖర-మార్గశీర్ష) మాసంలో నిడదవోలు వెంకటరావుగారు "ఆంధ్ర వైష్ణవ వాఙ్మయము"అనే వ్యాసంలో గోపన సింధుమతీ విలాసం అనే ప్రబంధ గ్రంధాన్ని, అనే వ్యాసంలో గోపన సింధుమతీ విలాసం అనే ప్రబంధ గ్రంధాన్ని, అగస్త్య సంహితకు వ్యాఖ్యానం వ్రాసినట్టు చెప్పి, ఆయనపేరుతో కంచిలోను, శ్రీరంగంలోను ఉన్న కొన్ని శాసనాలులిఖించబడ్డట్టు, సాక్ష్యంతో నిరూపించారు. సింధుమతీ విలాసంలోని ఒక పద్యాన్ని, ఒక శ్లోకాన్ని ఉదాహరించారు. గోపనకు అయ్యన అనే కుమారుదున్నట్టుగా ఆ వ్యాసం ద్వారా తెలుస్తున్నది. అంతర్జాలంలో గోపనకు సంబంధించిన సమాచారం చాలా చాలా తక్కువగానే దొరికింది. వాటిలో నాకు అత్యంత ఉపయోగపడినవి,

నేను ఏ ఏ గ్రంథాల్లోని విషయాలను తీసుకున్నది చివరలో "ఉపయుక్త గ్రంథసూచి" గా పేర్కొన్నాను. నాకు ప్రత్యక్షంగా పరోక్షంగా ఈ గ్రంథ రచనకు ఉపకరించిన వారందరికి నా హృదయ పూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నాను.

దాదాపు మూడువందల పైచిలుకు పుటలున్న ఈ నవలను శ్రీ విహారిగారు (జొన్నలగడ్డ సత్యనారాయణ మూర్తి) ప్రముఖ పద్య కవి, కథా రచయిత, విమర్శకుడు, బహుగ్రంథ కర్త అయిన వారు నా కోరిక మన్నించి, వారి అమూల్యమైన అభిప్రాయాన్ని "లక్ష్యశుద్ధితో నడిపించిన నవలా సంవిధానం" పేరుతో ముందుమాటగా వ్రాయడమే కాకుండా, ఈ నవల విషయంలో పలు సూచనలు, సలహాలు అందించారు. పాఠకులకు సందిగ్ధత, సందేహాలు కలుగుతాయని భావించిన చోట్ల విషయ స్పష్టత, కాల స్పష్టత ఉండాలని సూచించి, నవలకు కథకూ మధ్య ఉండాల్సిన విషయాలు, విశేషాలు స్పష్టంగా రేఖగీచి చూపించారు. వారి సహృదయతకు నేను మనస్ఫూర్తిగా నమస్సులర్పిస్తున్నాను. నేను వారికి సర్వదా కృతజ్ఞుడిని.

ఇంత విస్తారమైన విషయ సేకరణతో, శ్రీవిహారి గారి సూచనలను అందిపుచ్చుకొని రచించబడ్డ "ఈ మహాసేనాని గోపన్న" మిమ్ములను తప్పక అలరిస్తుందని ఆశిస్తున్నాను.

మరొక్కసారి "వాక్" పత్రిక యాజమాన్యానికి, "శ్రీరంగనాథుని పర్యటన–2" రచయితలైన శ్రీ సి.ఎస్.ఎల్ నరసింహన్ మరియూ శ్రీమతి సుధారంగరాజన్ గార్లకు, "మథురా విజయము" గ్రంథకర్త శ్రీమాన్ పేరాల భరతశర్మగారి వంశీకులకు నమస్కరిస్తూ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

– డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య.

లక్ష్యశుద్ధి నడిపించిన నవలా సంవిధానం

డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య, కవి, విమర్శకుడు, కథకుడు, పరిశోధకుడు, నవలా కారుడు. ప్రవృత్తి మార్గంలో సాహిత్య పథగామి.

ఇది "మహాసేనాని గోపన్న" చారిత్రక కాల్పనిక నవల. 'ఇతహాసపు చీకటికోణం అట్టడుగున దాగిన కథలన్నీ కావాలిప్పుడు ' అన్నాడు శ్రీ.శ్రీ. శతాబ్దాల తరబడి మరుగునబడిన ఒక వాస్తవం శ్రీరంగం, శ్రీరంగనాథుని విగ్రహ గాథ. చరిత్ర ఉన్నది. అయితే సాహిత్య ప్రక్రియా రూపంలో పదుగురికీ తెలియదు. ఆ విగ్రహం పరిరక్షణ, అన్వేషణ, పునఃప్రతిష్ఠ – వీటిలో క్రియాశీల కార్యకర్త, కార్య దక్షుడు, కార్యదర్శి – కంపరాయల అమాత్యుడు, ముల్బుగల్ సర్వసైన్యాధ్యక్షుడు – గోపన్న.

ఇది ఆ గోపన్న చరిత్ర. నవల అనగానే సహజమగానే – కల్పనాత్మకమైన ఊహ, ఊహాకాల్పనికత తప్పకుండా చోటు చేసుకుంటాయి. వస్తువు కేంద్రం నుండి నవలేతివృత్తాన్ని నిర్మించుకునేటప్పుడు రచయితకు ఇది అనివార్యమవుతుంది. అయితే ఆ కల్పనలు, ఊహలు – 'సంభావ్యత' కు ఒదిగి ఉండాలి నవలాశిల్ప మర్మజ్ఞుండైన వెంకటప్పయ్య ఈ కథ గురించి జాగ్రత్త వహించి, మేలి కథనాన్ని సమకూర్చుకున్నారు.

గోపన్న జననంతో మొదలై, ఆయన లక్ష్యశిద్ధితో ముగుస్తుంది నవల. ఆ విజయఫలం – శ్రీరంగనాథుని పునఃప్రతిష్ఠ, ఈ మంగళాంతానికి అనుగుణంగా నవల ముగింపులో – గోపన్న భార్య కుముదశ్రీ తమకు పుట్టిన కొడుకు అయ్యన్నని మహావీరుణ్ణి చేయాలనే వాంఛిత ధ్వని మ్రోగుతుంది.

మహాసేనాని నవలను ప్రణాలికా బద్ధమైన నిర్మాణంతో వెలువరించారు రచయిత. కాలిక స్పృహతో, సంఘటనాత్మకంగా ఇతివృతాన్ని 'జరుగ' నిస్తూ, ఎక్కడికక్కడ చారిత్రక నేపథ్యాన్ని వివరిస్తూ కథని నడిపారు. గతం, వర్తమానం నిరంతరాయంగా నిర్వహిస్తూ, వర్తమానం విశిష్టంగా నిర్వర్తించారు.

చారిత్రక నవల కనుక ఈ విధానం అనివార్యమైంది. అయితే సన్నివేశాల కూర్పులో వరుసనీ, అనుసంధాన ప్రయుక్తినీ – నైపుణ్యంతో నిర్వహించడం వలన, కథా కథనం బిగువుగానే సాగింది.

నవల – గోపన్న జీవితమంత విస్తృతమైనది కనుక, అనేకమంది వ్యక్తులూ, అనేక కలయికలు, నిష్క్రమణలు జరిగిపోతూ ఉంటాయి. ముఖ్య పాత్రలుగా గోపన్న, భార్య కుముదశ్రీ, కంపన రాజు, గోపన మిత్రులు దత్తుడు, వల్లభుడు మొదలైన వారు పాఠకుల మదిలో నిలుస్తారు. వల్లభుని ఏకపక్ష ప్రేమ గాథ – అతని ప్రేయసి మధురాంగిణి వివాహం ఇతర వ్యక్తితో జరగడం, వల్లభుడు విరాగియై, శ్రీరంగనాథుని సేవకు అంకితం కావడంతో ముగుస్తుంది. ఈ పాత్రపోషణ తగుమాత్రం కల్పనతో, ఎంతో రసవంతమూ, అనుభూతి ప్రదమూ చేశారు రచయిత.

నవలలో నలుగురు ప్రశిద్ధులైన గురువులు, ఆచార్యులు, మతప్రబోధకులు పరిచయం అవుతారు. వారు – వేదాంత దేశికాచార్యులు, విద్యారణ్యులు, పిళ్ళైలోకాచార్యులు, క్రియాశిద్ధిపండితులు. వీరిలో మొదటివారు లోకప్రశిద్ధి పొందిన వైష్ణవ మతజీవి, సాహిత్య స్రష్ట. రెండవవారు విజయనగర స్థాపనకే అంకురార్పణ చేసిన ప్రధాన వైతాళికుడు. వీరందరి పాత్ర చిత్రణని అనవసరమైన మేరకు – ఎలాంటి అనవసర ఉన్నతీకరణ లేకుండా నిర్వహించి తమ రచనా నైపుణిని చూపారు రచయిత.

చారిత్రక నవలలో తప్పనిసరిగా చెప్పవలసిన వృత్తాంతాలు కొన్ని రచయిత మనసుని పట్టుకుని ఊపుతాయి. వాటిని చెప్పేటప్పుడు కొంత 'అవస్థ ' కు లోనవుతాడు రచయిత. కారణం ఆ వృత్తాంతం కథలో రావాలి. ఎంత రావాలి అనేదే కీలకమైన ప్రశ్న. ఈ ప్రశ్నను వెంకటప్పయ్య చాలా సందర్భాలలో ఎదుర్కొన్నట్టు కనిపిస్తుంది. వాటిలో అతి ముఖ్యమైనది గంగాదేవి పాత్ర – మధురా విజయంలో ఆమె ప్రమేయం. దీనికీ అసలు ఈ నవల ఇతివృత్తమైన శ్రీరంగనాథ స్వామి పునఃప్రతిష్ఠకీ గల సంబంధం. కంపరాయలు పాత్ర చిత్రణకు ఈమె ముఖ్యమే అయినా, నవలేతివృత్తంలో దీనిని

అనుసంధానించడం ఎలా? – ఇవన్నీ రచయిత ఎదుర్కొన్న ప్రశ్నలు అయిఉండాలి. తగు జాగ్రత్తతో వీటికి సమాధానాలు చెప్పుకుని, ఆయా ఘట్టాల్లో ఆమెనీ, కంపరాయల్నీ, కుంతలాదేవినీ (కంపన ధర్మపత్ని), ఆవిష్కరించారు రచయిత.

తిరుమల కొండమీద (అంజనాద్రి) విగ్రహం దొరికింది. చంద్రగిరి ఏలిక ఆధ్వర్యంలో దాన్ని తిరుమల 'రంగమంటపం 'లో భద్రంచేసి నిత్యార్చనలు జరుపసాగారు. ఇక్కడి నుండి నవల వేగాన్ని పుంజుకుంటుంది. వెంకటప్పయ్య కథన శైలి ఎంతో సరళంగా, సులభగ్రాహ్యంగా ఉంది. చారిత్రాకాంశాలు కాకుండా, ప్రదర్శితమైన సంఘటనలన్నీ అక్షరాలతో చిత్రించిన సజీవ దృశ్యాలుగా వచ్చాయి, వీటిని చెప్పిన(చూపిన) తీరు ఎక్కువభాగం "విజువల్ నెరేటివ్" లో సాగింది.

"మహాసేనాని గోపన్న" రచనా లక్ష్యం, హరిహర రాయల అమాత్యుడైన నరసింహామాత్యుని కుమారుడిగా – గోపన్న – బుక్కరాయల కుమారుడైన కంపన సైన్యాధిపతిగా, శ్రీరంగం వృత్తాంతం విని, సంవేదన పొంది, మధుర సుల్తాన్ తల త్రుంచి, శ్రీరంగనాథుని విగ్రహాన్ని ప్రతిష్ఠ చేయించడం – ఎలా జరిగింది అనే చరిత్రని గ్రంథస్తం చేయడం కనుక, ఇక్కడ వ్యక్తి ప్రాధాన్య గాథ, చరిత్ర చిత్రణ పాధాన్యం వహించాయి. రచన లక్ష్య సాధనని ఎంతో ఆరాధనా భావంతో నిర్వహించి కృతకృత్యుడైనారు – వెంకటప్పయ్య. శతధా అభినందనీయులు.

శుభాకాంక్షలతో



విహారి

(జె.ఎస్.మూర్తి)

ప్రముఖ రచయిత, కవి, విమర్శకుడు

హైదరాబాదు (98480 25600)

మహాసేనాని గోపన

(చారిత్రక కాల్పనిక నవల)

అది భాద్రపదమాసం, (తమిళమాసమైన పురతాసి) ఛలికాలం ప్రారంభమవడం వలన, తెల్లవారినా జనం ఇంకా ముసుకు దన్ని నిద్రిస్తున్నారు. సమయం ఉదయం ఆరుగంటలయిందన్నట్లుగా విజయనగరం కోటలో ఘంటలు మ్రోగాయి. పురప్రజలు విధులకు హాజరవడానికి తయారవుతున్నారు.

"ఒరే నరసింహా! శ్రీలక్ష్మికి ఉదయం నుండి ఆరోగ్యం బాగోలేదురా.. ఒకసారి ఆ కేశవాచారి గారిని పిలిపించరా.." అన్న అమ్మ మాటలకు పూజలో కర్పూరహారతి ఇస్తున్న నరసింహ ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు. "ఏమైందమ్మా!" అన్నాడు కంగారుగా లేస్తూ. "ఒంట్లో నలతగా ఉందట. తెల్లవారుఝామున రెండు మూడు మార్లు వాంతులు కూడా అయ్యాయట!" అని అనగానే నరసింహ బయటకు వెళ్ళి ఒక సైనికుడికి ఆ విషయం చెప్పడం, వాడు గుర్రంపై వెళ్ళడం, పది పదిహేను నిముషాల్లో భిషక్ రావడం జరిగిపోయాయి. ఈలోపు నరసింహ కంగారుగా ఇంట్లోకి బయటికి తిరుగుతూనే ఉన్నాడు. "రండి ఆచార్యా.." అంటూ సాదరంగా ఆయన మందులున్న తోలుసంచీని అందుకుని లోపలికి తీసుకెళ్ళాడు.

ఆచారి మూడు, నాలుగు విఘడియలు శ్రీలక్ష్మి నాడి పరీక్షించి చిరునవ్వు నవ్వి "నరసింహార్యా!...మీరేం బెంగ పడాల్సిన పనిలేదు. అమ్మాయి ఆరోగ్యంగా ఉంది. అమ్మాయి గర్భవతి. నేనిచ్చే మందులు వాడండి. అలాగే ఉదయపు అనారోగ్యం సాధారణంగా కొన్ని వారాలు

ఉంటుంది. వాంతులు, వికారం, మైకం, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటాయి. ఏమీ కంగారు పడకండి. ప్రస్తుతం పథ్యం అంటూ ఏమీ లేదు. తర్వాత చూద్దాం. అయితే బొప్పాయి పండు వంటి వేడి చేసే వస్తువులు మాత్రం పొరబాటున కూడా పెట్టకండి చాలు" అంటూ ఆచారి వెళ్ళిపోయాడు.

నరసింహ, లక్ష్మి పడుకున్న మంచంపై కూచోడం గమనించిన అమ్మ, నరసింహ సంతోషాన్ని గమనిస్తూ, వంటింట్లోకి వెళ్ళబోతూ ఉండగా బయట "ఏడుకొండలవాడా! వెంకటరమణా! ఆపద మొక్కులవాడా అనాథ రక్షకా!" అంటూ కేకలు వినబడడంతో కొడుకును ఎవరో ఏమిటో చూసి రమ్మంది.

"ఎవరో కాలినడకన తిరుమల వెళ్తున్న బృందమట అమ్మా!"

"ఒరే..వాళ్ళు..... ఈ శుభ వార్త విన్న వెంటనే, మనకు తారసిల్లడం విచిత్రంగా ఉందిరా.. ఆ తిరుమలేశుని కరుణా కటాక్షాలు పుట్టేబిడ్డ మీద ఉండాలని కోరుకుంటూ ఒక ఐదువరహాలు వాళ్ళకిచ్చిరా! శుభం జరుగుతుంది. ఆ స్వామి ఆశీస్సులతో నీ వంశాన్ని ఉద్ధరించే ఉద్దండ పిండం పుడతాడు" అన్న తల్లి ఆదేశంతో వెళ్ళి వాళ్ళను పరామర్శించి, కొంత ధనం వాళ్ళకిచ్చి వచ్చాడు.

"అబ్బాయ్... మనం పాకనాడు నుండి తిరుచురాపల్లికి, అక్కడనుండి ఇక్కడకు, కడుపు చేతబట్టుకుని వచ్చినవాళ్ళం. మీ తండ్రిగారు కాలధర్మం చెందాక, నీమీదనే ఆశలు పెట్టుకుని పెంచాను. ఆ శ్రీరంగనాథుని చల్లని చూపు ఉండడం వల్ల ఈ విజయనగరం కొలువులో నీకు అమాత్య పదవి లభించింది" అంటూ కొంగుతో కళ్ళు తుడుచుకుంటూ లోనకు వెళ్ళింది.

అది వైశాఖమాసం. తెల్లవారడానికి ఇంకా 4 ఘడియల కాలం ఉంది. నరసింహ భార్యకు పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. వెంటనే మంత్రసాని సులగట్టి నరసమ్మను పిలిపించారు. ఆ చుట్టుపక్కల చాలా వూళ్ళకు మంత్రసాని నరసమ్మే! కన్నడభాషలో సులగట్టి అంటే ప్రసవాలు చేసే దాది. ఆపేరే ఇంటిపేరుగా మార్చుకుంది నర్సమ్మ. ఆ చేతుల్తో ఎన్ని వందలమందికి పురుళ్ళుపోసి, చిన్నారులకు ఈ అందమైన ప్రపంచాన్ని చూపించిందో! పురుడుపోసి అందరికి బంధువయింది నర్సమ్మ.

రాగానే మిరియాల కషాయం కలిపి ఇచ్చింది. నొప్పులు ఎక్కువవడంతో పురిటి నొప్పులుగా నిశ్చయించి కార్యరంగంలోకి దిగింది. ఉలవలరసం కలిపి తాగించింది. మారేడు పట్టించింది. శుభ నక్షత్రాగమనంతో సుఖప్రసవం జరిగింది. కేర్ మన్న బిడ్డ ఏడుపు విని మగసంతానం కలగాలని భగవద్ధ్యాన్నంలో ఉన్న నరసింహకు మంత్రసాని బయటికి వచ్చి “అయ్యా.. మీకు మగశిశువు..... ఐదు నిముషాల క్రితం శిరశోదయం. ఒక నిముషం క్రితం ప్రసవం పూర్తిఅయింది. జాతక నిమిత్తం ఈ వివరాలు చాలుగదా!. అమాత్యులకు సంతోషమేగా! బొడ్డుతాడుతీసి జాగ్రత్త చేశాను” కిల కిలా నవ్వుతూ తియ్యటి వార్త చెప్పింది.

నరసింహుని ఆనందం అర్ణవమయింది. మంత్రసానికి తన మెడలో ఉన్న ముత్యాలహారాన్ని తీసి బహూకరించబోయాడు. “అయ్యా! ఇది నా వృత్తి. మామూలు ప్రతిఫలం ఇస్తే చాలు. దీనికి ఇంత పెద్ద బహుమానాలు అవసరం లేదు. నేనేనాడూ.... బహుమతులకు ఆశించి ఈవృత్తిని చేపట్టలేదు. ఈ హారం మీ కుమారునికి వేస్తాను. నాగుర్తుగా ఇది అతని మెడలోనే ఉంచండి. బిడ్డ ఈ పురిటిగడ్డకు మంచి పేరు తేవాలని, ఈదేశానికి,

ఈ గడ్డకు పట్టిన నరహంతక ముసల్మానుల పాలన విరగడవ్వాలని కోరుకుంటున్నాను. నమస్కారం" అని తగిన జాగ్రత్తలు చెప్పి వెళ్ళిపోయింది.

బిడ్డ పుట్టిన 11వ రోజున భారసాల జరిపించడంకోసం పుట్టిన సమయంలో ఉన్న నక్షత్ర వివరాలు వ్రాసి శిరోమణి దగ్గరకు వెళ్ళాడు నరసింహ. జాతకచక్రం, నవాంశచక్రం వేసి క్షుణ్ణంగా పరిశీలించి, నాలుగైదు తాళపత్ర గ్రంథాలు నిశితంగా చూసి ఇలా చెప్పసాగాడు. "నీ పుత్రుని లగ్నము కర్కాటకము. ఈ రాశికి అధిపతి చంద్రుడు లగ్నములో నున్నాడు. ఈ జాతకుడు దృఢ శరీరము కలవాడు, నిర్భయుడు, బలిష్టుడు, అవుతాడు. రవి మేషమున ఉచ్ఛస్థితి పొందియున్నాడు కాబట్టి భూములు, ధనము, భార్య పుత్రులు, కీర్తి, శౌర్యము, పరాక్రమము, ఎక్కువ. కాని విరోధులు ఎక్కువ. ఒక్కోసారి దేశము విడిచిపోవడం సంభవిస్తుంది. పూర్ణాయుర్దాయానికి ఢోకా లేదు. కానీ కొంత కాలం యుద్ధ ప్రీతితో, కొంతకాలం వైరాగ్యంతో ఉంటాడు. ఇక కుజుడు మకరంలో ఉచ్ఛలో యున్నాడు కాబట్టి రాజ్యము, రాజస్నేహము, భూమి ధనము, వాహనములు, రాజ సన్మానము, జయము కలుగుతాయి. ఇక్కడ కొంచం కుజదోషము గురించి కూడా చెప్పాల్సి ఉంటుంది. సప్తమంలో కుజుడు దోషమైనా, కర్కాటక లగ్నం వలన, చంద్ర, గురు దృష్టి వలన కొంత దోషం నివృత్తి అయినది. అందుచే కొంత కాలము భార్యతో ఎడబాటు తప్పదు. గురుడు కర్కాటకమున ఉచ్ఛస్థితి పొందియున్నాడు కాబట్టి రాజ్యము, మహా సౌఖ్యము, కీర్తి, మనోవిలాసము, రాజ్యాభిషేకము, అధిపతి అవడం జరుగుతుంది. శుక్రుడు మీనమున ఉచ్ఛస్థితి పొందియున్నందువల్ల సదా రాజసన్మానాలు, మృష్టాన్నభోజనాలు, భార్యాపుత్రులతో సుఖము ఉంటుంది.

ఈ శుక్రుడు ఉచ్ఛలో ఉన్నప్పటికి శత్రువుయింట ఉన్నాడు కాబట్టి అతి కష్టం మీద కానీ శుభాలు సిద్ధించవు. శని తులలో ఉచ్ఛలో ఉన్నాడు కాబట్టి సభలకు అధిపతి. దేశాటన చేయుట, శత్రు రాజులతో వైరము, యుద్ధము మామూలే! మహా సంగ్రామాలలో పాల్గొని, క్షత్రియులను మించి పోరాడి పరాక్రమం చూపి ఈ భరతవర్షానికి పేరు ప్రతిష్టలు తెస్తాడు. నీ బిడ్డ చరిత్ర కీర్తి ప్రతిష్టలు ఆచంద్ర తారార్కం నిలుస్తాయి. నీకు తెలియని జ్యోతిషమా? నరసింహార్యా! ఏదో నా మీద అభిమానం కొద్దీ వచ్చావు" అని వివరాలు తెలియజేశాడు. "చాలా సంతోషం శిరోమణిగారూ.. ఎల్లుండి బాలసారె నిశ్చయించాం. తమరు తప్పక దయచేయవలసిందిగా ప్రార్థిస్తున్నాను" అన్న నరసింహ మాటలకు నవ్వి "శుభం! అలాగే! తప్పక!" అన్నాడు.

నరసింహ తన తల్లిగారి సూచన మేరకు, పరంధాముడైన ఆ శ్రీనివాసుని అశీస్సులతో జన్మించాడని "గోపన" అని నామకరణం చేసి అల్లారుముద్దుగా పెంచసాగారు. గోపనకు 11 మాసాలు నిండి 12వ మాసం వచ్చింది." గోపనకు అన్న ప్రాశన చేయాలనుకుంటున్నాను" అన్న మాటకు హరిహరరాయలు "శుభం! నరసింహామాత్యా.. శుభం! మా నుంచి నీకు ఏ సహాయం కావాలన్నా తీసుకో! అన్నాడు. "ఊరంతటికి అన్నదానం చేయాలనుకుంటున్నాను. మీ సహాయం అర్థిస్తున్నాను" అన్న మాటకు "మీరు ఇంతగా అడగాలా అమాత్యా!... గోపన మీవలె గొప్ప పండితుడై, భావి విజయనగర అమాత్యులు అవాలని, మనస్ఫూర్తిగా

ఆ విరూపాక్షస్వామిని ప్రార్థిస్తున్నాను" అని వెంటనే కోశాధికారికి ఉత్తర్వులు జారీ చేయించాడు.

వెంటనే ఈ వార్త శిరోమణికి తెలియజేశాడు. శిరోమణి "నరసింహా! విను. అన్నప్రాశన ముహూర్త ప్రభావం శిశువు జీవితం, ఆరోగ్య విషయాల మీద ఆధారపడి ఉంటుంది. అందువలన తప్పకుండా మంచి ముహూర్తబలం చూసుకుని అన్నప్రాశన చేయాలి. శుక్లపక్షమి రోజులలో అన్నప్రాశన ఉదయం పూట మాత్రమే చేయాలని శాస్త్రం చెబుతున్నది. వృషభ, కర్కాటక, మిధున, కన్య, ధనస్సు, మీన లగ్నమందు, ముహూర్తమునకు లగ్నం నుండి దశమ స్థాన శుద్ధి, అష్టమ స్థాన శుద్ధి ఉండాలి. శుద్ధి అంటే దశమంలో, అష్టమంలో ఏ గ్రహాలు ఉండరాదని అర్థం. లగ్నం నుండి నవమంలో బుధుడు, అష్టమంలో కుజుడు సప్తమంలో శుక్రుడు లేకుండా ముహూర్తం ఉండాలి. అన్నప్రాశన మూహూర్త లగ్నంలో రవి, శని, కుజుడు, రాహు కేతువులు ఉండరాదు. పూర్ణ చంద్రుడు ఉన్న అన్నదాత గాను, బుధుడున్న విశేషజ్ఞాన వంతుడిగాను, గురువున్న భోగమంతుడుగాను, శుక్రుడున్న దీర్ఘాయువు గలవాడు అవుతాడని కాలామృత గ్రంథంలో తెలియజేయబడినది నరసింహా.. ఇవన్నీ మనసులో ఉంచుకుని నీ కర్తవ్యం నిర్వహించు.. శుభం!" అని ఆశీర్వదించాడు.

ఆరోజు ఊరు ఊరంతా సంబరం జరుపుకున్నారు. అంతా విచ్చేసి ఆశీర్వదించారు. శుభముహూర్త సమయం ఆసన్నం కాగానే నరసింహ ఒకసారి బయటకువచ్చి సూర్యుడిగమనాన్ని చూసి, "శుభ ఘడియలు ఆసన్నమౌతున్నాయి. ఇక ఏర్పాట్లు త్వరగా!" అన్నాడు. ఊరిజనం యావన్మంది అక్కడే ఉన్నారు. ఆడవారు చీరెలతో నగలతో ముస్తాబైనారు.

చిన్న పిల్లలు చప్పట్లు కొడుతున్నారు. శుభముహూర్తం వచ్చిందని అమాత్యులవారు చెయ్యెత్తి సైగ చేయగానే, జనం అంతా నిశ్శబ్దం అయ్యారు. గోపన్నను తల్లి ఒడిలో కూర్చోబెట్టుని స్వర్ణపాత్రలో ఏర్పాటు చేసుకున్న నెయ్యి, తేనె, పెరుగులను ముద్దగా చేసి నరసింహామాత్యులవారు కుడి చేతిలో బంగారు ఉంగరాన్ని పట్టుకుని ఉంగరం సహాయంతో శిశువునకు తినిపించారు. అందరూ కరతాళ ధ్వనులతో "దీర్ఘాయుష్మాన్భవ! విజయీభవ!" అని గోపనను మనసారా ఆశీర్వదించారు.

జీవికాపరీక్ష జరపవలసిన సమయాన్ని గుర్తించి పురహితులు ఆదేశించడంతో నరసింహ గోపనకు కొంచెం దూరంలో దైవసన్నిధిలో ఒక చీనా కంబళిని పరచి, నగలు, బంగారు వెండి నాణేలు, తాళపత్ర గ్రంథం, ఘంటం, కత్తి, విల్లంబు, మరొక మూల వివిధ పుష్పాలు, పంచలోహాలు ఉంచారు. కొంచెం దూరంగా హరిహరుల వారి కోశాగారం నుండి తెచ్చిన నవనిధులు పద్మం, మహాపద్మం, శంఖం, మకరం, కచ్ఛపం, ముకుందం, కుందం, నీలం, వరం ఉంచారు. దానికి కొంచెం ప్రక్కగా నవరత్నాలు కెంపు, వజ్రం, నీలం, పుష్యరాగం, మరకతం, ముత్యం, పగడం, గోమేధికం, వైడూర్యం ఉంచారు.

అమర్చిన వస్తువులలో శిశువు మొదటిసారిగా ఏ వస్తువు తాకుతాడో ఆ వస్తువుతో సంబంధమైన జీవనోపాధి ఆ శిశువుకు ఉంటుందని భావన అనాదిగా ఆపస్థంభుల వారి దగ్గర నుంచి వస్తున్న ఆచారం. సమస్త వస్తు సముదాయం అలా ఉంచి గోపనను వదలగానే అంతటా ఉత్కంఠ నెలకొనింది. ఊరి జనం మొత్తం ఊపిరి బిగపట్టి తిలకిస్తున్నారు. కొందరు చప్పట్లు కొట్టి గోపనను పిలుస్తున్నారు.

గోపన మెల్లిగా దోగాడుతూ ప్రాకుతూ ముందుకు సాగుతున్నాడు. గోపన మొదటగా వెళ్ళి కుడి చేతిలోకి కత్తిని తీసుకున్నాడు.. అటూ ఇటూ చూసి నవ్వుతూ ఎడమచేత్తో ఘంటాన్ని తీసుకున్నాడు. ఒక్కసారి లేచి నిలబడి చిరునవ్వు నవ్వుతూ ఆ రెండిటిని ఒక్కసారి పైకెత్తాడు. ఎదురుగా కొంచెం దూరంగా రాతిబండపై కూర్చొని ఉన్న ఒక రాజహంస జరుగుతున్న విషయాలన్నీ గమనిస్తున్నది. బిగ్గరగా శంఖధ్వానం వినిపించింది. వేదపారాయణందార్ల వేదవచనాలతో శాంతి మంత్రాలతో అన్నప్రాశన ముగిసింది.

అన్నప్రాశన వృత్తాంతం మొత్తం విన్న శిరోమణి దీర్ఘంగా నిట్టూర్చి, జాతకం ఒకసారి పున:పరిశీలించి "నరసింహా.. వేద వేదాంగాలు చదివి అమాత్యుడై, నీ కోరిక తీరుస్తాడు కానీ.." అనగానే "చెప్పండి.. సందేహించకండి.." అన్న మాటలకు నవ్వి "నీ పుత్రుడు వీరపుత్రుడు. సాహితీ సమరాంగణామాత్యుడౌతాడు". అనేక గ్రంధాలను రచిస్తాడు. అంతేకాదు. కత్తిపట్టి కదనరంగంలో శత్రువుల గుండెల్లో గుబులు పుట్టిస్తాడు. మంత్రాంగంలో మిమ్మల్ని మించిన వాడౌతాడు. దీర్ఘాయుష్మంతుడు. దిగులు పడకండి. అతని కర్తవ్యాలకు అడ్డుపడకండి. అతని వల్ల హైందవజాతికి మహెూదయం కలుగుతుంది. అతన్నిచూసి భావిహైందవతరాలు పులకిస్తాయి. అతనిఘనత చిరకాలం హైందవగడ్డపై శిలాశాసనాలపై నిలుస్తుంది. శుభం! " అన్నాడు. ఆ మాటలు విన్న అమాత్యుడు మౌనంగా ఇంటిదారి పట్టాడు. కుమారుడు ఒక గొప్ప పండితుడు, గ్రంధ రచయిత, తనవలె అమాత్యుడు అవుతాడన్న దానికి సంతోషించాలా! లేక బ్రాహ్మణుడైపుట్టి కదనరంగంలో గొప్ప వీరుడై యుద్ధాలుచేస్తాడన్న మాటలకు విచారించాలా అర్ధం కాలేదు.

గోపనకు మూడేళ్ళ వయసు వచ్చింది. నాయనమ్మ వస ఎక్కువగా పెట్టిందో ఏమో, మాటలన్నీ వచ్చేశాయి. గోపన అప్పుడప్పుడూ నిద్రలో ఉలిక్కిపడి లేచేవాడు. నాలుగు చేతులతో ఎవరో ఒక వ్యక్తి రమ్మని పిలుస్తున్నట్టు అనిపించేది. అమ్మ అలా ఏవైనా కలలు వచ్చినప్పుడు, చెంబులో ఉన్న మంచి నీళ్ళు త్రాగి, ఎదురుగా ఉన్న విష్ణుమూర్తి చిత్రపటానికి నమస్కరించి పడుకోమని చెప్పేది. గోపన తరచూ "అమ్మా! నాకు నిద్ర పట్టడంలేదు" అని లేచి కూర్చునేవాడు. శ్రీలక్ష్మి ఏమైంది గోపనా! అని అడిగితే "అమ్మా..నాకు ఏవేవో కలలు వస్తున్నాయి. కలలో ఏదో సింహంలాంటి జంతువు పెద్దగాఅరుస్తున్నట్టు...గాండ్రిస్తున్నట్టు వినపడుతున్నది" అనగానే తల్లి "రామస్కందం హనూమంతం వైనతేయం వృకోదరం – శయనే యః స్మరేన్ నిత్యం దుస్స్వప్నం తస్య నశ్యతి" అన్న శ్లోకం చెప్పించి నిద్దురపుచ్చేది. తెల్లవారి ఈవిషయం భార్య చెబితే నరసింహ "నా పేరు నరసింహం కదా! అందుకే అలా సింహం కనిపిస్తున్నదేమో!" అని నవ్వేసేవాడు. లక్ష్మికి మాత్రం గోపన్నను గూర్చి లోలోన ఏదో తెలీని భయం ఎప్పుడూ వెంటాడుతూ ఉండేది.

గోపన్న ఆడుతూ పాడుతూ ఐదో సంవత్సరంలో ప్రవేశించాడు. నరసింహ గోపన్నకు అక్షరాభ్యాసం చేయించాలని నిర్ణయించాడు. సరస్వతీదేవి ఉపాసకుడైన విద్యానందసరస్వతిని దర్శించి జాతకం చూపించి సుముహూర్తం నిశ్చయించమని కోరగానే చిరునవ్వు నవ్వి ఒక్కసారి కన్నులు మూసుకొని ఆ వాణీమాతను ధ్యానించి ఇలా అన్నాడు "నారసింహా! నీ బిడ్డది మహర్జాతకం. దైవవరప్రసాది. నీకుటుంబానికి వెలుగునిస్తాడు.

సత్కార్యాలు చేస్తాడు. ధర్మపరుడౌతాడు. హైందవ ధర్మాన్ని సంరక్షిస్తాడు. విద్య కేవలం బ్రతుకుతెరువును చూపేది మాత్రమే కాదు. బ్రతుకు పరమార్థాన్ని కూడా తెలిపేది సుమా! వచ్చే వసంత పంచమి నాడు ఏర్పాట్లు చేసుకో! శ్రీపంచమినాడు అక్షరాభ్యాసం చేస్తే విద్యార్థులకు సరస్వతి కటాక్షం తథ్యం. విధి విధానాలు నీకు తెలిసినప్పటికి ఇంకోమారు శ్రద్ధగా విను" అని ఒకసారి తాళపత్రగ్రంధం తిరగేసి.."ఆ రోజున ప్రాత:కాలంలో నిద్రలేచి స్నానం ఆచరించి, నిత్య సంధ్య పూర్తిచేసుకుని, తెల్లని వస్త్రాలను ధరించి, నుదుట గంధము, కుంకుమ ధరించి, ముందుగా ఒక ప్రదేశం బాగా శుభ్రం చేసి అక్కడ పద్మము, శంఖము, చక్రము వేసి పీట మీద సరస్వతీ దేవి ప్రతిమను ఉంచి, ముందుగా గణపతి పూజ చేసిన తర్వాత అమ్మవారి ప్రతిమ ముందు మినపపిండితో చేసిన ప్రమిదలో నెయ్యి వేసి వత్తిపెట్టి దీపం వెలిగించి కొత్త తాళపత్ర గ్రంథాలను, ఓనమాలు దిద్దే ఒక పెద్ద పలకని, ఒక ఘంటాన్ని అక్కడ ఉంచి ఆరాధించాలి. ఆ తల్లిని తెల్లని కమలాలతో లేదా ఏవైనా తెల్లని పుష్పాలతో అర్చించాలి. తెల్లని పుష్ప మాలవేయాలి. సుగంధ ద్రవ్యాలను రంగరించిన గంధమును సమర్పించాలి. అమ్మవారికి ఇష్టమైన అన్నంతో చేసిన పాయసం, తెల్లని నువ్వులతో చేసిన ఉండలు, ఆవుపాలు, ఆవు పెరుగు, ఆవు నెయ్యి, ఆవు వెన్న, ఇలా మీశక్తి కొలది అమ్మవారికి నైవేద్యం సమర్పించాలి. తెల్లని వస్త్రాలను సమర్పించాలి. 'ఓం సరస్వత్యైనమ:' అనే మంత్రాన్ని భక్తితో, ఏకాగ్రతతో కనీసం 108 సార్లు గోపన్న తరపున సంకల్పం చెప్పుకుని జపం చెయ్యి. హయగ్రీవుడు, దక్షిణామూర్తి, దత్తాత్రేయుడు, విష్వక్సేనుడు మొదలైనవారిని విద్యాదేవతలుగా పూజిస్తారు కనుక వారి ధ్యాన శ్లోకాలు,

మూలమంత్రాలు పఠించు. ఆ తరువాత 'ఓం నమః శివాయః నమ:' అనే అక్షరాలను గోపన చేత దిద్దించు. విద్యాధి దేవత సరస్వతి అయినా, జ్ఞానస్వరూపుడు శివుడు కాబట్టి 'నమశ్శివాయ' అక్షరాలు దిద్దడంతో అక్షరాభ్యాసం ప్రారంభమవుతుంది. తొలి అక్షరాలను బియ్యంపై రాయించే ఆచారం మీకు ఉంటే అలా చేయవచ్చు . ఆ చిన్నారికి ఎప్పుడూ ధనధాన్యాలు సమృద్ధిగా చేకూరాలని దీవించడమే ఇందులోని అంతరార్థమని తెలుసుకో!" అని దీవించి పంపారు.

అక్షరాభ్యాసం సాగుతుండగా అక్కడికి వచ్చిన శిరోమణి 'ఓం నమః శివాయః నమ:" అని వ్రాసిన అనంతరం 'సిద్ధం నమ:' అని నరసింహ వ్రాయబోతూ ఉండగా అడ్డుకుని ఇలా అన్నాడు "నారసింహా.. చాలు.. చాలు! సిద్ధం నమ: వద్దు. అలా అనగానే కొన్ని తరాల నుంచి వస్తున్న ఆచారాన్ని ఎందుకు వద్దన్నాడా అని చూశాడు. " నీకు ఈ సిద్ధం నమ: అని వ్రాయడంలో ఆంతర్యాన్ని చెప్పాలి" అన్నాడు. అదే ఆచారాన్ని పాటిస్తున్న అక్కడున్న చుట్టపక్కాలు ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డారు. సిద్ధం నమ: అని వ్రాసే అలవాటును ఎందుకు వద్దన్నాడా అని ఆసక్తిగా చూశారు. "సిద్ధం నమ: అనేది జైనమత ఆచారం. మన ఆచారం కాదు. మన దేశంలో జైనమతం బాగా వ్యాప్తి అవడం, జైనులే విద్యాబోధకులవడంచేత వారు "ఓం నమ: సిద్ధేభ్య:" అని అక్షరాభ్యాసము చేయిస్తూ ఉన్నారు క్షేమేంద్రుడు తన 'కవికంఠాభరణము' అను గ్రంథములో వర్ణమాలను చమత్కారముగా శ్లోక బద్ధము చేశాడు. అందు మొదటి శ్లోక చెప్తాను విను.

"ఓం స్వస్త్యంకం స్తుమ: సిద్ధమంతర్యాద్యమితీప్సితం
ఉద్యదూర్జపదం దేవ్యా ఋఋూ లులూ గూహనం"

క్షేమేంద్రుడు ఇంకా చివరలో ఇలా అన్నాడు. "ఏతాం నిమ: సరస్వత్యైయ: క్రియామాతృకాం జపేత్". శ్లోకములో "స్తుమ: సిద్ధం" అను పదాలు గమనించే ఉంటావు. క్షేమేంద్రుడు కాశ్మీరకవి, కాశ్మీర శైవము, తమిళ శైవముతో కొంచెం బేధంతో ఉన్నది మనకు తెలిసినదే కదా! పెద్దల అభిప్రాయము. ప్రాచీన భారతావనిలో దేశమందంతటను "ఓం నమ: శివాయ:" అని, "ఓం స్వస్త్యంకం స్తుమ: సిద్ధం" అని, కొందరు "స్తుమ: సిద్ధం" అని విద్యాభ్యాసము చేయించేవారు 'స్తుమ: సిద్ధం' అనే పదాలు " సిద్ధం నమ: " అని కాలక్రమేణా జైనగురువుల, సిద్ధుల, ఆచార్యుల చేతుల్లో మారింది. నీవు 'నమ: సిద్ధేభ్య:' అని రాయి. అదే శాస్త్ర సమ్మతం. . "సిద్ధం నమ:" వద్దు. గాథా సప్తశతిలో 2వ శతకములోని 91 వ శ్లోకం చెప్తానువిను.

"వర్ణావశీమప్యజానంతో లోకాలోకై ర్గౌరవాభ్యధికా:
సువర్ణ కారతులా ఇవ నిరక్షరా అపిస్కంధైరుద్యంతే."

శ్లోకంపై వ్యాఖ్యానించిన పెద్దలు "జనై: ఓం నమ: సిద్ధం సిద్ధిరస్తు, ఇత్యారభ్యాం వర్ణమాలా మప్యజానంతో లోకా: గౌరవాభ్యధికా: పరమాదరణీయా ఇతి కృత్వా నిరక్షరా అపి నిర్విద్యా అపి సువర్ణకారతులా ఇవ స్కంధై రుద్యంతే సాదరం నీయంత ఇత్యర్థ:" అన్నారు. "ఓం నమ: సిద్ధం" అని సర్వ జనులూ విద్యాభ్యాసారంభమున చేస్తున్నారు. ఉత్తర హిందూ స్థానమువారు 'సిద్ధం నమ:' అను దేశాచారమును తెలుపుటచేత అది తెనుగువారిలోనే కాక ఇతర దక్షిణ దేశ భాషలలో కూడా ప్రాచుర్యం పొందింది. గాథాసప్తశతి దక్షిణదేశ కవిత కాబట్టి, దాక్షిణాద్యాచారమని పెద్దలు భావించి వ్యాఖ్యానించిరో ఏమో గాని వివరాలు తెలియరావడం లేదు. ఇది మన ఆచారం మాత్రం కాబోదు" అని సెలవిచ్చారు.

అనంతరం దేశికాచార్యుల వద్ద గురుకులంలో విద్యాభ్యాసానికి గోపనను తీసుకువెళ్ళిన నారసింహామాత్యుడు ఆయనకు నమస్కరించి "గురుదేవా! నా ఒక్కగానొక్క కుమారుణ్ణి నీకప్పగిస్తున్నాను. వీడిని జ్ఞానిని చేయవలసిన బాధ్యత నీకప్పగిస్తున్నాను" అనగానే గోపన, తండ్రి చేసిన సైగతో, దేశికాచార్యుల ముందు సాగిలపడి "చతుస్సాగర పర్యంతం గోబ్రాహ్మణేభ్యః శుభంభవతు. ఆంగీరస, భార్హస్పత్య, భరద్వాజస త్రయా ఋషేయ ప్రవరాన్విత, భరద్వాజస గోత్రోద్భవస్య ఆపస్తంబ సూత్రః, తైత్తిరీయ యజుర్వేద శాఖాధ్యాయినే, శ్రీ గోపనారాయణాచార్య అహంభో అభివాదయే!" అన్నాడు. దేశికాచార్యులు పరమానంద భరితుడై "ఇలాంటి శిష్యుడు ఒక్కరున్న చాలు. నా జన్మ ధన్యం" అనగానే రథంపై తెచ్చిన సంభారాలు, కట్న కానుకలు గురువుగారి గృహంలో పెట్టించి సెలవు తీసుకున్నాడు నారసింహామాత్యుడు.

గోపన ఏకసంధాగ్రాహి కావడంతో ఆరేళ్ళలోపే శబ్దమంజరి, ధాతుమంజరిపై పట్టు సాధించి, తైత్తిరీయ యజుర్వేదాన్ని సుస్వరంతో అధ్యయనం చేయనారంభించాడు. ఒకనాడు గురుకుల వాతావరణం ప్రశాంతంగా ఉంది. గోపన దేశికుల పూజ నిమిత్తం పుష్పాలను తీసుకు రావడానికి ఆశ్రమం బయట ఉన్న చిట్టడవిలో సంచరిస్తున్నాడు. ఇద్దరు ఏడుస్తూ ఆశ్రమం ముందునుండి వెళ్తున్నారు. గోపనకు విషయం ఏమిటో తెలియలేదు. ఆశ్రమానికి చేరుకున్నాక అదేవిషయం గురువును అడిగాడు. గురువు "నాయనా గోపనా! అదంతా హైందవ జాతి చేసుకున్న దౌర్భాగ్యం! తెలుసుకోవలసిన సమయం వచ్చినప్పుడు చెప్తాను. నా కోరికను తీర్చగలవన్న నమ్మకం కూడా నాకు ఉంది. ప్రస్తుతానికి ఏమీ అడక్కు.

నీవు పసిబాలుడవు. తర్వాత అన్నీ చెప్తాను" అంటూ లోపలికి వెళ్ళబోతుండగా గోపన "ఆచార్యా! ఒక చిన్న సందేహం. నాకు చిన్నతనం నుండి ఏవో కలలు వస్తున్నాయి. ఆ కలల్లో ఒక సింహం భీకరంగా గాండ్రిస్తున్నది. ఆ సింహంతల కలిగిన వ్యక్తికి నాలుగు చేతులు ఉన్నాయి. ఏవో చక్రాలు, ఇంకా శంఖువులు ఆ సింహం చుట్టూ గిరగిరా తిరుగుతున్నాయి. ఇంకా చిత్రమేమిటంటే ఆ సింహం గర్జిస్తూ ఉంటుంది. మా తల్లి దండ్రులను ఎన్ని పర్యాయాలు అడిగినా విషయమేమిటో చెప్పడంలేదు" అనగానే దేశికులు అలాగే నిశ్చేష్టులై నిలబడిపోయారు. ఒక్క క్షణం తర్వాత తేరుకుని గోపనను కౌగలించుకున్నాడు. "నీవల్ల ఒక సత్కార్యం జరుగవలసి యున్నది. నీ విద్యాభ్యాసం పూర్తిగానీ.. కల గురించి ఏమీ భయపడకు. ఆ సింహంచెర విడిపించవలసినవాడవు నీవే! గోపనా! ఆ స్వప్నాన్ని దుస్స్వప్నంగా భావించకు. అది సుస్వప్నంగా అనుకో! ఈసారి అలాంటి కలవస్తే లేచి కూర్చుని "ఓం నమో నారాయణాయ!" అని విష్ణుమూర్తిని ప్రార్థించి నాకు బలాన్ని, ధైర్యస్థైర్యాలను ఇవ్వమని ప్రార్థించు చాలు" అని లోపలికి వెళ్ళిపోయాడు. గోపనకు ఏమీ అర్థం కాకపోయినా ఆ కల చెడ్డ కలగాదని, మంచి కలే అనీ, భయపడవలసిన పని లేదని మాత్రం ఆ క్షణంలో అర్థమయి సంతోషం వేసింది. నిశ్చింతగా నిలబడ్డాడు. ఇంతలో ఒక గరుడపక్షి ఆకాశం నుండి దిగి ఆశ్రమ ప్రాంగణంలోకి వచ్చి నిలబడింది. గోపనకు కొద్ది గజాలదూరంలో నిలబడి గోపననే కొద్ది క్షణాలు చూసి మళ్ళీ ఎగిరి వెళ్ళిపోయింది..

గోపనకు పదిహేను సంవత్సరాలు పూర్తయ్యాయి పదహారులో అడుగుపెట్టాడు. పది సంవత్సరముల కాలం వేదాంతదేశికర్ శిష్యరికంలో వేద వేదాంగాలను నేర్చుకున్నాడు. తాను నేర్చుకోడమే కాక శిష్యులకు నేర్పించే విషయంలో, వేదం వల్లెవేయించే విషయంలో గురువుకు సహాయంగా ఉంటున్నాడు. ఆరోజులలో ఒకనాడు వేదాంత దేశికర్ అగస్త్యసంహిత తాళపత్రగ్రంధం తీసి చదువుతుండడం గమనించిన గోపన "గురువర్యా! అసలు ఎవరీ అగస్త్యుడు? ఆ వివరాలు చెప్పండి అనగా దేశికర్ "నాయనా గోపనా! తమిళదేశంలో చాలా ప్రసిద్ధి పొందిన ముని అగస్త్యమహాముని. అతన్ని ముద్దుగా కురుముని (పొట్టి ముని) అని పిలుస్తారు. తమిళభాషకూ వ్యాకరణానికీ ఆద్యునిగా ఆయన్ను గౌరవిస్తారు. తమిళదేశంలో చాలాచోట్ల అగస్త్యేశ్వర ఆలయాలున్నాయి. గొప్ప ఔషధసిద్ధునిగా కూడా పేరు ప్రసిద్ధి చెందినవాడు. దక్షిణభారతదేశంలో ప్రసిద్ధమై తమిళదేశంలో వైదీశ్వరన్ కోవెల వద్దనున్న నాడీ జ్యోతిషానికి కూడా అగస్త్యుడే ఆద్యుడని అనేక శాస్త్రాల ప్రమాణంగా నమ్ముతున్నాం. అంటే...అగస్త్యుడు భారతదేశం మొత్తం మీద గొప్ప పేరున్న ముని అన్నమాట! అగస్త్యుడు నర్మదా నది ఒడ్డున ఉన్న గరుడేశ్వర అనే ప్రదేశం వద్ద తపస్సు ఆచరించినట్లుగా ఆధారాలున్నాయి. భారతీయ సంప్రదాయం ప్రకారం అగస్త్యుడు చాలా భారతీయ భాషల్లో గొప్ప పండితుడు. ఋగ్వేదంలో 1.165వ శ్లోకం నుంచీ 1.191వ శ్లోకం వరకూ అగస్త్య మహర్షి, అతని భార్య లోపాముద్రలు రాసినవేనని చెబుతారు. ఋగ్వేదమే కాక, వరాహ పురాణంలోని అగస్త్యగీత, ద్వైదనిర్యాణ తంత్రం, స్కంద పురాణంలోని అగస్త్యసంహితలను రచించాడు. దక్షిణభారతదేశం లోనే

కాక ఉత్తర భారతదేశ సంస్కృతులలో కనిపించే ప్రసిద్ధ వ్యక్తి కావడంతో, ప్రాచీన భారతచరిత్ర పరిశోధకులకు కూడా అగస్త్యుడు చాలా ముఖ్యమైన వ్యక్తి. మన ప్రాచీన సింధునాగరికతలో కనిపించే రెండు ప్రముఖ చిహ్నాలు అగస్త్యుని పేరుని సూచిస్తాయి. అగస్త్యునికున్న మరో ప్రత్యేకత, తమాషాగా చెప్పుకోవాలంటే, మనకు తెలిసిన మొట్టమొదట మాతృగర్భంలో కాక కుండలలో పుట్టినవారిలో అతనొకడు! రెండవవాడు వశిష్ఠుడు. మిత్రావరణులు అనే దేవతల ద్వారా కుండలో పుట్టిన కవల పిల్లలు అగస్త్యుడు, వశిష్ఠుడు కూడా. అగస్త్యుణ్ణి మన, కలశజ, కుంభజ, కుంభయోని, మైత్రావరుణి అని కూడా అంటారు. వారి అగస్త్య సంహితలోని శ్లోకాలు వేదాలవలె చాలా కఠిన తరవ్మైనవి. అవి కొన్నైనా, నీకు బోధించాలని చూస్తున్నాను నాయనా!'' అన్నాడు.

"వారి గురించి ఇంకేమైనా ఆసక్తికరమైన సంగతులు ఉంటే చెప్పండి గురువర్యా!" అన్న గోపన ప్రశ్నకు నవ్వుతూ "అగస్త్యుడు వింధ్యుని గర్వ మణచడం మంచివిశేషం. విను. పూర్వం మేరు పర్వతం అన్నింటికన్నా ఎత్తైన పర్వతంగా ఉండేది. దాని ఎత్తును చూసి భరించలేక ఈర్ష్యతో వింధ్యపర్వతం కూడా దానికంటే ఎత్తుగా ఎదిగి సూర్యుని గమనాన్ని కూడా అడ్డగించసాగింది. దీంతో రాత్రింబవళ్ళూ సక్రమంగా రాక వేద విధులకు ఆటంకం కలగసాగింది. అప్పుడు దేవతలందరూ కలిసి అగస్త్యమునిని ఏదో ఒకటి చేయమని ప్రార్థించారు. వారి ప్రార్థనను మన్నించిన అగస్త్యుడు తన భార్యతో కలిసి ఆ పర్వతం వద్దకు వచ్చాడు. తాము దక్షిణ దిశగా వెళుతున్నామనీ, అంత పెద్ద పర్వతాన్ని ఎక్కి దిగలేమనీ దాని ఎత్తుని తగ్గించుకోమన్నారు. మహర్షులంటే భక్తి ప్రపత్తులు గల వింధ్యుడు తక్షణమే

తన ఎత్తుని ఉపసంహరించుకుని వెంటనే వారు నడచి వెళ్ళడానికి వీలుగా దారి ఇచ్చాడు. తర్వాత అగస్త్యుడు తాము మరలా తిరిగి ఉత్తర దిశగా తిరిగి వస్తామని అప్పటిదాకా అలాగే ఉండమని చెప్పాడు. కానీ మళ్ళీ తిరిగి రానేలేదు. అప్పటి నుంచీ ఇప్పటిదాకా ఆ పర్వతం అలాగే ఉంది. కార్యక్రమాలు యదావిధిగా కొనసాగుతూనే ఉన్నాయి. ఇంకో ఆసక్తికరమైన విషయం కూడా చెప్తా విను. నువ్వు "జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం" అని నీ తల్లి చిన్నప్పుడు నీకు పాలు పట్టినప్పుడు అనడం విన్నావు కదా! అది ఎలా వచ్చిందో చెప్తాను విను. ఒకానొకప్పుడు వాతాపి, ఇల్వలుడు అనే ఇద్దరు రాక్షసులు నివసించేవారు. వీరు అడవిలో నివసిస్తూ దారిన పోయే బాటసారులను ఒక విచిత్రమైన రీతిలో చంపి తినేవారు. వాతాపికి కామరూప విద్య (సులభంగా తను కోరుకున్న జీవి రూపంలోకి మారే విద్య) తెలుసు. ఇల్వలుడికి చనిపోయినవారిని బ్రతికించే సంజీవనీ విద్య తెలుసు. ఎవరైనా బాటసారి వచ్చినపుడు వాతాపి ఒక మేక రూపంలోకి మారిపోయేవాడు. ఇల్వలుడు ఒక బ్రహ్మచారి వేషం వేసుకుని అతిథులను భోజనానికి ఆహ్వానించేవాడు. వారు ఆ మేక మాంసాన్ని ఆరగించగానే ఇల్వలుడు వాతాపిని బ్రతికించడానికి సంజీవినీ మంత్రం పఠించేవాడు. అప్పుడు వాతాపి ఆ బాటసారి పొట్టను చీల్చుకుని బయటకు వచ్చేసేవాడు. అలా ఒకసారి అగస్త్యుడు ఆ అరణ్యం గుండా వెళుతుండగా ఈ రాక్షససోదరులు గమనించారు. అతణ్ణి విందుకు ఆహ్వానించి అందరికీలానే మేక మాంసం వడ్డించాడు ఇల్వలుడు. అతను భోంచేసిన తరువాత ఇల్వలుడు యథావిధిగా వాతాపిని బయటకు రప్పించడానికి సంజీవనీ మంత్రం పఠించాడు. కానీ వాతాపి మాత్రం తిరిగి రాలేదు. ఎందుకంటే ఈ విషయం

ముందుగా తెలుసుకున్న అగస్త్యుడు జీర్ణం జీర్ణం, వాతాపి జీర్ణం అనగానే వాతాపి జీర్ణమైపోయాడని ఇల్వలుడికి తెలియజేశాడు. అంత గొప్పవాడు అగస్త్యుడు. అగస్త్యముని అంటే నాకు ఎందుకో చెప్పలేని అభిమానం. ఆయన ఒక సాహసికుడు. వింధ్య గర్వాన్ని అణచినా, సముద్రాన్ని పుక్కిటబట్టినా, వాతాపిని జీర్ణం చేసుకొన్నా, అతని కథలన్నీ అద్భుత సాహసాలే! పైగా, ఈ పనులన్నీ ఆయన చేసింది తన స్వార్థం కోసమో, లేదా తన కోపకారణంగానో కావు. అన్నీ పరోపకారం కోసం చేసిన మహాకార్యాలే. సాక్షాత్తూ ఆయనకు సహచరి, సహధర్మచారిణి, లోపాముద్ర. వాళ్ళది ఒక అపురూపమైన దాంపత్యం! తనకు దీటైన అమ్మాయి ఎవరూ భూప్రపంచం మొత్తంలో కనిపించకపోతే అగస్త్యుడే స్వయంగా ఆమెను తయారు చేశాడని ఒక కథ. లోపాముద్ర అగస్త్యునికి సరైన జోడీగా కనిపిస్తుంది. తాపసులకు కూడా సంసార బాధ్యత ఉందనీ, తనను పట్టించుకోవడం అతని కర్తవ్యమనీ, ఆమె అగస్త్యుని నిలదీసినట్టు అర్థం వచ్చే రెండు సూక్తాలు, ఆమె పేర అతి ప్రాచీనమైన ఋగ్వేదంలో ఉన్నాయి! జ్ఞానమూ సౌందర్యమూ కలగలిసిన లలితాదేవి స్వరూపంగా లోపాముద్రను చాలామంది భావిస్తారు. అగస్త్యుని విషయం సరేసరి! అతను సాహసికుడే కాదు గొప్ప శస్త్రాస్త్ర కోవిదుడు కూడా. ఆదికావ్యమైన రామాయణంలో అతను ప్రముఖంగా కనిపిస్తాడు. అగస్త్యుని గొప్పతనం తెలిసిన రాముడు అరణ్యవాసంలో అతని గురించి వెతుక్కుంటూ వెళతాడు అగస్త్యుడు రామలక్ష్మణులకి అనేక అస్త్రాలను ప్రసాదిస్తాడు. తిరిగి యుద్ధకాండలో దర్శనమిచ్చి, రామునికి ఆదిత్యహృదయాన్ని బోధిస్తాడు. ఉత్తరరామాయణంలో కూడా అగస్త్యుని ప్రస్తావన ప్రముఖంగా వస్తుంది.

మహాభారతంలో కూడా ద్రోణునికి బ్రహ్మాస్త్రాన్ని అందించిన మహర్షి అగస్త్యుడే. లోకకల్యాణం కోసం అగస్త్యుడు ఉత్తరభారతం నుండి దక్షిణానికి తరలి వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు.

ఒక్కసారి నిట్టూర్చి దేశికర్ మరలా ఇలా చెప్పసాగారు. "అగస్త్య సంహితలో ఆ మహర్షి ఆరు రకాల విద్యుత్తుల గురించి వివరించారు. అవి "తడిత్" అంటే పట్టువస్త్రాల ఘర్షణ నుండి పుట్టునది. "సౌదామిని" అంటే రత్నముల ఘర్షణ నుండి పుట్టునది. "విద్యుత్" అంటే మేఘముల ద్వారా పుట్టునది. "శతకుంభి" అంటే వంద ఘటముల ద్వారా పుట్టునది. "హృదని" అంటే నిలువ చేయబడిన విద్యుత్తు. "అశని" అంటే కర్రల రాపిడి నుండి పుట్టునది. ఇలా వారు విద్యుచ్ఛక్తికి ప్రాథమిక సూత్రాలు తెలియజేశారు. అంతే కాదు. దానిలో ఘటవిద్యుత్ గురించి చెప్పబడినది. ఆ వర్ణనలో '**సంస్థాప్య మృణ్మయే పాత్రే తామ్రపత్రం సుసంస్కృతమ్, ఛాదయే చ్ఛిఖిగ్రీవేన చార్ద్రాభిః కాష్ఠపాంసుభిః, దస్తాలోష్టో నిఘాతవ్యః పారదాచ్ఛాది దస్తతః, సంయోగా జ్జాయతే తేజో మిత్రావరుణ సజ్ఞితమ్**' దీని భావం తెలుసుకోవడం చాలా కష్టతరం నాయనా! చూడు ఒక మట్టి కుండను తీసుకుని దానిలో రాగి పలక పెట్టాలి. తరువాత దానిలో మైలతుత్తం వేయాలి. తర్వాత మధ్యలో తడిసిన రంపపు పొట్టువేయాలి. పైన పాదరసము, యశదము వేయాలి తర్వాత తీగలను కలపాలి. అప్పుడు దాని నుండి మిత్రావరుణ శక్తి ఉద్భవిస్తుందని అన్ని వేల సంవత్సరాల పూర్వం చెప్పిన మహర్షి. భవిష్యత్తులో మానవులు విద్యుచ్ఛక్తిని చౌకగా తయారుచేయడం ఈ పద్ధతుల ద్వారా కనుగొన్నట్లైతే చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

"గురువర్యా! మీరు ఈ గ్రంథం అర్థం చేసుకోవడం కష్టం అంటున్నారు కాబట్టి దీనికి మీరు చెప్పినట్లు సులభతరంగా ఉండేట్టుగా ఒక వ్యాఖ్యానం మీరే రచిస్తే మంచిది కదా!" "అవును గోపనా! తప్పక వ్యాఖ్యానం ఉండవలసిన గ్రంథం ఇది. నీ వంటి శిష్యులు ఆ పని చేస్తే నాకు సంతోషంగా ఉంటుంది. నేను సంస్కృతములోను, తమిళంలోను, మణి ప్రవాళములోను అనేక రచనలను స్తోత్రాలను గ్రంథస్తం చేసిన సంగతి నీవెరిగినదే. సంస్కృతములో ఇరవై ఎనిమిది స్తోత్రములను, యాదవాభ్యుదయం అనే మహా కావ్యాన్ని, సంకల్ప సూర్యోదయం అనే నాటకాన్ని, హంస సందేశం అనే లఘుకావ్యాన్ని, హయగ్రీయస్తోత్రమును, సుదర్శనాష్టకాన్ని రచించాను. ఆ గ్రంథాలన్నీ తీరిగ్గా వ్రాసుకొని నీవు చదవాలని నా కోరిక! వయసు మీద పడుతున్నది. నాకు ఆ రంగనాథుడు మళ్ళీ ప్రతిష్ఠించబడే వరకూ నాకు వేరే ఆలోచనలు రావడంలేదు. ప్రస్తుతం ఏమీ రచించలేని పరిస్థితిలో ఉన్నాను. రేపు ఉదయం నా గురుదేవులు మరియూ నాకు మేనమామ అయిన ఆత్రేయ రామానుజాచార్యుల వారు వస్తున్నారు. వారు వేద వేదాంగ పండితులు. అన్ని విద్యలలోను తలపండిన వారు. వారిని సత్కరించుకున్న తర్వాత, నీ విద్య వారిచే పరీక్షింపబడిన తర్వాత, నిన్ను మీ తండ్రిగారి వద్దకు పంపే ప్రయత్నం చేస్తాను. "చిత్తం గురుదేవా!"

ప్రాత:సమయం. ఆశ్రమ ప్రాంగణంలో వేదఘోష వినిపిస్తున్నది. గోపన ఆధ్వర్యంలో శిష్యులు కర్ణపేయంగా పనసలు వల్లె వేస్తున్నారు. అక్కడ ఒక గుర్రపుబండి వచ్చి ఆగింది. అందులోనుండి ఆత్రేయ

రామానుజులవారు సతీ సమేతంగా దిగారు. ఆ అలికిడికి దేశికులవారు బయటికివచ్చి "రండి రండి మామగారూ...అత్తయ్యా..బాగున్నారా అంటూ వారిని సాదరంగా ఇంట్లోకి తీసుకుని వెళ్ళారు.

రామానుజుల వారు రావడం, లోనకు వెళ్ళడం వచ్చిన అలికిడికి ఆగిన వేదఘోష మళ్ళీ అందుకుంది. కొంతసేపటికి బయటికి వచ్చిన ఆచార్యులవారు, దేశికులవారు ఒక నాలుగ్గాళ్ళ మండపంపై కూర్చున్నారు. కుశలం మాట్లాడుకున్నాక ఆచార్యులవారి దృష్టి గోపన మీదకు మళ్ళింది. "ఎవరోయ్.. దేశికా! మంచి శిష్యుణ్ణి పట్టుకున్నావ్. నీ తర్వాత గురుకులానికి అధిపతా?" అని అడగ్గానే నవ్వి "మామయ్యా... అతను హరిహరరాయల వద్ద అమాత్యులుగా ఉన్న నరసింహామాత్య కుమారుడు. పేరు గోపనారాయణుడు. గోపన అనీ గోపన్న అనీ పిలుస్తుంటాం. విద్యాభ్యాసం ముగిసింది. నేడో రేపో అతను ఇంటికి వెళ్ళాలి" అనగానే ఒక్కసారి గోపన వైపు తేరిపార జూసి "ఆహా! ఏమి కంఠధ్వని! ఏమి ఆకారం అతనిది. కండలు తిరిగిన అతణ్ణి చూస్తుంటే బ్రాహ్మణునిలా కాక నాకు వానిలో ఒక వీరకుమారుడు కనిపిస్తున్నాడు. అతని జాతక చక్రం ఉంటే ఒక సారి చూపించు" అనగానే, దేశికులవారు లోపలికి వెళ్ళి ఒక తాళపత్రం తెచ్చి ఆచార్యుల చేతిలో పెట్టారు. దానిని నిశితంగా చూసి "లేదు దేశికా! ఈతని విద్యాభ్యాసం నీ వద్ద పూర్తయింది కానీ.. ఇతను జాతకరీత్యా ఇంకో ఐదు సంవత్సరాలు, యుద్ధవిద్యలు నేర్చుకొనవలసి ఉన్నది" అనగానే "బ్రాహ్మణ కుమారునికి యుద్ధవిద్యలా?" అని ఆశ్చర్యంగా చూసి "దానికి వారి తండ్రి గారు ఒప్పుకుంటాడా అని?" ఆలోచనా నిమఘ్నుడై అన్నాడు. "నీవే ఒప్పించాలి దేశికా! ఎందుకంటే హైందవ ధర్మ రక్షణకు, ముసల్మానులను పాలకులను

ఎదిరించి, ఢీ కొని మనకు సహాయపడగలడు. నా తరువాతి మజిలీ విజయనగరం. నేను అక్కడకు వెళ్ళి వారితండ్రిగారిని ఒప్పించే ప్రయత్నం చేస్తాను. నీవు గోపనను ఇక్కడి తాలింఖానాకు పంపి ఒక ఆరునెలలు కసరత్తులు మల్లవిద్య నేర్చుకోమను. దేహం వజ్రసదృశం అయ్యాక, ఆ తర్వాత విజయనగరంలో యుద్ధ విద్యలు నేర్చుకుంటాడు.''

"తమ అనుజ్ఞ ! "

తాలింఖానాలో ఆరు నెలల పాటు ప్రాథమిక మల్లయుద్ధం, దేహదారుఢ్యం విషయాలు అర్ధం చేసుకుని, విజయనగరం చేరుకుని, యుద్ధశాలలో గోపనకు ఖడ్గవిద్యలో ప్రవీణులైనవారు శిక్షణనిచ్చారు. ధనుర్విద్య, శూలంతో విన్యాసాలు, మొదలైనవన్నీ సాంగోపాంగంగా నేర్చుకున్నాడు. ఎంతటి పొగరుబోతు గుర్రాన్నైనా అవలీలగా తన స్వాధీనంలోకి తెచ్చుకునే నేర్పు అతడు స్వంతమయింది. అతని ఆకారాన్ని చూసి సాటి విప్రులు ఇతను రాజకుమారుడా? లేక విప్రకుమారుడా ? అని ఆశ్చర్యపోతున్నారు.

ఆరోజులలో ఒకనాడు అక్కడికి దేశికాచార్యులవారు సత్యమంగళం నుండి విచ్చేయగా అందరూ గౌరవంగా వందనం చేశారు. గోపనను దగ్గరకు పిలిచి తలపై చేయివేసి నిమురుతూ..''నీకు ఇప్పుడు 19 సంవత్సరాలు దాటుతున్నాయి. నూనూగు మీసాలు కూడా వచ్చాయి. నీకు కొన్ని విషయాలు చెప్పాలి ఇలా రా!" అని నది ప్రక్కన ఉన్న ఒక కొండ మీదకు తీసుకెళ్ళి ఒక పెద్ద బండపై కూర్చున్నారు. పిల్ల గాలులకు ప్రకృతి పులకించి పోతోంది.

"గురువర్యా చూశారా! ఆ నది ఎన్ని సోయగాలు పోతున్నదో! ఆ పక్షులు నదిలో ఎలా జలకాలాడుతున్నాయో చూశారా! ఆ తెల్లటి నీరు ఎంత స్వచ్ఛంగా ప్రవహిస్తున్నదో చూశారా! నాకు మీరు చెప్పిన కాళిదాసు శ్లోకాల వర్ణన గుర్తుకొస్తున్నది" అంటూ దేశికాచార్యులవేపు చూశాడు. ఆయన ఎన్నడూ చూడని విధంగా నదివైపు తీక్షణంగా చూస్తున్నాడు. మొహంలో ఒక విధమైన దిగులు. గొంతు వణుకుతుండగా "పొరబడ్డావు గోపనా! ఆ నీళ్ళు స్వచ్ఛమైనవి కాదు. రుధిరమయమైన నీరు లాగా ఎర్రగా నాకు కనిపిస్తున్నవి." అంటూ దు:ఖాన్ని ఆపుకుంటూ... "నిజమే! ఈ నదినీళ్ళే కాదు, ఒకప్పుడు తామ్రపర్ణి, కావేరీ, వైఘై నదుల్లో నీరు తెల్లగా ఘుమఘుమలాడుతూ ప్రవహించేదట. నదీ పరీవాహక ప్రదేశాలలోని స్త్రీల శరీరానికి అలముకున్న స్వచ్ఛమైన గంధము వంటి సుగంధ ద్రవ్యాల వల్ల ఆ నదికే పరిమళం అబ్బేదట..అయితే.. అదంతా ఒకప్పటి వైభవం. కానీ అది నేడు రక్తసిక్తమై అక్కడ హైందవ శవాలు దిబ్బలు దిబ్బలుగా తేలుతున్నాయట. అందులో... రాబందుల గుంపులను నేను గమనించాను. మన హైందవ జాతి శవాలను ఎలా పీక్కుని తింటున్నవో! హైందవ ఆలయలను ధ్వసంచేస్తూ.. ముష్కరుల సాగిస్తున్న ఈ దుష్టపాలనలో ఆ పవిత్ర నదుల నీళ్ళు నేడు... నేడు...నేడు..." అంటూ ఉండగా గొంతు పూడుకుని పోయింది. దుఃఖపూరితం అయిన గురువు యొక్క కంటి నీటి బిందువులు జారి బండపై పడేంతలో గోపన తన చేతితో ఒడిసిపట్టాడు.

"గురువర్యా! జన్మతః బ్రాహ్మణవర్ణానికి చెందిన నాకే ముసల్మానుల ఆగడాలు, అకృత్యాలు వింటుంటేనే నవనాడుల్లో నా రక్తం ఉడికిపోతోంది. మీ కంట నుండి జారుతుంటే పట్టిన ఈ అశ్రువుల సాక్షిగా... తప్పక

ప్రతీకారం చేస్తాను. ముష్కరుల విషయం నాకు సవిస్తరంగా తెలియజెయ్యండి" అని పాదాలు పట్టుకున్నాడు.

"అదే నాకు కావలసిన గురుదక్షిణ! గోపనా.. నీవు చిన్నవాడవని ఇంతకాలం చెప్పకుండా నాలోనేనే మధన పడ్డాను. ఇంక చెప్పక తప్పదు. నాయనా విను! పది సంవత్సరాల వ్యవధిలోనే ఈ దక్షిణ భారత దేశం రెండు సార్లు తురుష్కుల దండయాత్రకు గురయింది. క్రీ.శ.1311 సం.లో అల్లాఉద్దీన్ ఖిల్జీ సైన్యాధికారి మాలిక్‌కాఫూర్ మొదటిసారి ఓరుగల్లును, హొయసల రాజ్యాలను ముట్టడించి గెలిచాడు. అక్కడనుండి కనిపించిన ఆలయాలను ముట్టడిస్తూ కూల్చివేస్తూ శ్రీరంగం చేరి, అక్కడి శ్రీరంగనాథుని విగ్రహాన్ని తనతో ఢిల్లీ తీసుకుని వెళ్ళాడు. ఒక నాట్యబృందం ఢిల్లీ వెళ్ళి సుల్తానును మెప్పించి ఆ విగ్రహాన్ని తెప్పించి శ్రీరంగంలో మళ్ళీ ప్రతిష్టించారు. అందరం సంతృప్తిగా ఊపిరి పీల్చుకున్నాం. కానీ ఆసంతోషం మాకు ఎక్కువ కాలం నిలవలేదు". అంటూ ఒక్క సారి గొంతు సవరించుకొని, "మళ్ళీ దురదృష్టశావత్తూ... 1323 వేసవి కాలంలో ఇంకో దండయాత్ర జరిగింది. ఈ దండయాత్రలో గజీ మలుక్ కుమారుడు ఉలుగ్ ఖాన్ సైన్యాధ్యక్షుడు. హొయసల సైనికుల సహకారంతో వారు దక్షిణ భారత దేశంలోని ఆలయలన్నింటిని ధ్వంసం చేస్తూ శ్రీరంగం చేరుకున్నారు. రంగనాథుని పరమ భక్తుడు..యోధుడైన కులశేఖరుడు ఈ వార్తను ఆలయ నిర్వాహకులకు చేరవేసి అప్రమత్తం చేశాడు. ఆ సమయంలో పాండ్యరాజులు అంత:కలహాల కారణంగా నిస్సహాయంగా ఉండిపోయారు. ఆలయ రక్షకుల ఆదేశానుసారం పంజుకొండప్ప అనే వీరుడు ఇంకా శ్రీరంగవాసులు కలిసి ఆలయ రక్షణకు పూనుకొన్నారు. ఆలయ ప్రాకారాలను కోటగోడలుగా

భావించి సైన్యంలా నిలబడ్డారు. తరుణ వయస్కులందరూ రక్షణకు నిలబడగా స్త్రీలు పిల్లలను సురక్షితంగా బయటకు పంపించారు. నేను ఆలయంలోపల నుండే సైన్యాన్ని నడిపించసాగాను. నా ఈ హస్తాలతో రాతిపరదాను నిర్మించి మూలవిరాట్టును సుదర్శనబంధ మంత్రాన్ని జపించి, స్వామి ఆయుధమైన సుదర్శన చక్రాన్ని ప్రేరేపించాను. మూలవిరాట్టయిన మహాలక్ష్మి విగ్రహాన్ని ఆలయ ప్రాంగణంలోని సంపంగె చెట్టుక్రింద పాతిపెట్టించాను.

శ్రీరంగనాథుని ఉత్సవ విగ్రహాలను ఇతర వస్తువులు తీసుకుని ఒక పల్లకీలో పెట్టుకుని, ఆలయ ప్రధానార్చకుడైన పిళ్ళై లోకాచార్యులు అనే మహానుభావుడు ఆలయప్రాంగణాన్ని దాటారు. ఈ బృందాన్ని సురక్షితంగా కావేరీనదిని దాటేలా కులశేఖరుడు చూసుకున్నాడు. నేను వారు అలా విగ్రహాలతో ప్రాంగణం దాటగానే ఆలయ ద్వారాలన్నిటిని రాతి కట్టడాలతో మూసివేసే ఏర్పాటు చేశాను. రాళ్ళపైన పేడవంటి పదార్థాలు పూయించి అక్కడ లోపల ఏమీ లేదన్న భ్రమ కలిగేలా చేశాను ప్రధాన ద్వారం వద్ద వివిధ అవరోధాలయిన ఇనుపముళ్ళు, అగ్నివ్యాపకాలు ఏర్పాటు చేశాం. సుల్తాను సేనలు ఆలయం ముట్టడించే సమయానికి ఆలయంలోపల సైన్యం ఎదుర్కోడానికి సిద్ధంగా నిలబడింది. పంజుకొండప్ప, కులశేఖరుడు కలిసి సుల్తానుసైన్యానికి గట్టిపోటీ ఇచ్చారు. శత్రుసైన్యాన్ని రెండురోజులపాటు ఆలయంలోకి ప్రవేశించకుండా ఆపగలిగారు. వెల్లాయి అనే దేవదాసి సైన్యాధ్యక్షుణ్ణి తన అందచందాలతో ఒకరోజు మొత్తం ఆడించి తూర్పు వైపు గోపురం మీదనుండి అతణ్ణి త్రోసివేసి తనూ ఆత్మాహుతి చేసుకుంది. ఈ విషయం గ్రహించి కోపంగా, ఆవేశంగా, సుల్తాను సైన్యం ఆలయంలోకి ప్రవేశించగలిగింది. ఈ ముష్కరులు

ఆలయాన్ని శ్రీరంగాన్ని మొత్తం నాశనం చేసి అగ్నికి ఆహుతిచేసి పైశాచికానందంతో మధురై నగరానికి వెళ్ళిపోయారు. నేను ఆలయం నుండి ఎలాగో తప్పించుకుని శ్రీరంగనాథస్వామి విగ్రహం తీసుకుని వెళ్తున్న బృందాన్ని తిరుకోష్టియూరులో కలిసాను. అంతగా శ్రమపడిన పరాక్రమశాలి కులశేఖరుని వృత్తాంతం విషాదాంతం అయింది. ఇప్పటికే బాగా పొద్దుపోయింది. ఆ వివరాలు తర్వాత చెప్తాను. వెళ్దాం పద" అని గోవన్నను తీసుకుని వేదాంత దేశికులు ఆశ్రమం చేరారు.

"గోపనా! నీపై ఈ విజయనగర రాజులు అనేక ఆశలు పెట్టుకున్నారు. నా తదనంతరం నీవు ఒక అమాత్యునివే కాక యుద్ధవీరుడవై, ఒక సైన్యాధిపతివై సామ్రాజ్య రక్షణ చేయవలసి ఉన్నది" అన్న తండ్రి నరసింహామాత్య మాటలకు "మీ ఆజ్ఞ తప్పక శిరసావహిస్తాను!. నాకు కథలు కథలుగా చెప్పుకునే ఈ విజయనగర సామ్రాజ్య స్థాపన గురించి తెలుసుకోవాలని ఉంది. చెప్పండి. దేశికులవారు మొన్న కొండపై కూర్చున్నప్పుడు శ్రీరంగ ఆలయ ముట్టడి గూర్చి చెప్పినప్పుడు నా రక్తం ఉడికిపోయింది. ప్రతీకారం చేస్తానని వారికి మాట కూడా ఇచ్చాను. ఆయన పూర్తి వివరాలు చెప్పలేదు. తర్వాత చెబుతానన్నారు. మీరు చెప్పండి. ఎవరీ హరిహరరాయలు? ఎవరీ బుక్కరాయలు? ఎక్కడివారు? సవిస్తరంగా చెప్పండి" అన్న మాటకు "చాలా సంతోషం నాయనా! హైందవ వీరుల చరిత్రలు తెలుసుకోవలసిన అగత్యం ఎంతో ఉంది. నీకు ఇలాంటి గాథలే ఆవేశాన్నిస్తాయన్న విషయం నాకు తెలుసు. విను!

ఇది చాలా పెద్ద గాథ. 14వ శతాబ్దం మధ్యకాలంలో దక్షిణభారతదేశం యావత్తూ తురుష్కుల దండయాత్రలవలన తునాతునకలై రామేశ్వరం వరకూ మొత్తం వారి వశమైపోయింది. సేవున దేశ రాజైన రామచంద్రదేవుని అధికారంలో ఉండిన దేవగిరి కోట 1295 నుండి 1314 సం.ల మధ్యకాలంలో ముస్లిం పాలకుడైన అల్లా ఉద్దీన్ ఖిల్జీ కర్కశహస్తాల బారిన పడి, రామచంద్రుని మరణానంతరం ఢిల్లీ సామ్రాజ్య అధికారంలోకి వెళ్ళిపోయింది. మాలిక్కాఫూర్ సైన్యం ద్వారసముద్రం, ఓరుగల్లు, మధుర రాజ్యాలను కొల్లగొట్టాయి. మన హిందూ రాజులు తేరుకునేలోపే ఢిల్లీలో మహమ్మద్బిన్ తుగ్లక్ ప్రభుత్వం పరిపాలన ప్రారంభం కావడంతో మనకు మళ్ళీ చేటుకాలం ప్రారంభమయింది. హిందూ రాజ్యాలన్నీ క్రమంగా తుడిచిపెట్టుకుని పోయాయి. కాకతీయుల ఓరుగల్లుకోట 1323 సం.లో పడిపోయింది. క్రమంగా దక్షిణాదిన తీరప్రాంతాలలోని ఆంధ్ర, తమిళదేశాల కోటలన్నీ మహమ్మదీయుల వశమయ్యాయి. పాండ్యరాజులకు చెందిన మాబరు ఇంకా మధుర కూడా బలవంతంగా ఢిల్లీ సామ్రాజ్యంలో విలీనమయిపొయ్యాయి. ఇంత వినాశనం చేసినా దండయాత్రలు ఆగలేదు. కర్నాటకదేశంలో హొయసల, కంపిల్య రాజ్యాలు అప్పటికింకా స్వతంత్ర జీవనం సాగించడం వారికి కంటకింపుగా మారింది. వీటిని సైతం జయిస్తే తప్ప దక్షిణ భారతదేశం యావత్తూ వారి హస్తగతం కాదని భావించారు.

కాంపిలి రాజ్యస్థాపకుడైన కంపిలి యాదవ రామచంద్రుడు-1, అనేక హొయసల రాజులతో యుద్ధాలు చేసి గొప్ప అనుభవం గడించాడు. రామచంద్రుడు ముస్లిం సుల్తానులకు చిక్కి ఢిల్లీకి తరలించబడ్డాడన్న వార్త విని కంపిలుడు తిరుగుబాటు చేశాడు. ఢిల్లీ ఆధిపత్యానికి లొంగక,

తురుష్కులపై అనేక యుద్ధాలు చేశాడు. తర్వాత తనను స్వతంత్రునిగా ప్రకటించుకుని తన రాజ్యాన్ని సుస్థిరం చేసుకోవడమే కాక ప్రక్కనున్న బళ్ళాల రాజ్యంలో కూడా కొంత జయించగలిగాడు. అల్లాఉద్దీన్ ఖిల్జీ యొక్క దండనాయకుడు మాలిక్ కాఫూర్ కంపిలి రాయుని ఓడించలేక వెనుదిరిగి ఢిల్లీ వెళ్ళిపోయాడు. అప్పటినుండి కంపిలి రాజ్యం స్వతంత్ర రాజ్యంగా మెలుగుతోంది.

కాకతీయ సామ్రాజ్యం క్షీణదశలో ఉన్న సమయంలో కంపిలి అక్కడి మంత్రులైన హరిహర, బుక్కరాయలను, పిలిపించి తన కొలువులో ఉంచుకుని పాలించసాగాడు. ఐతే ఇక్కడ ఒక సంఘటన జరిగింది. ఉత్తరభారతదేశంలో ఢిల్లీ రాజైన మహమ్మద్ బీన్ తుగ్లక్ చుట్టమైన బాహుద్దీన్ సుల్తాను, తుగ్లక్ సైన్యాన్ని గుతప్ఖుర్ వద్ద ఎదిరించి ఓడిపోయి పారిపోయి వచ్చి కంపిలి రాయని శరణు వేడాడు. కంపిలి రాజు బాహుద్దీన్‌కు ఆశ్రయం కల్పించాడు. ఈ విషయం తుగ్లక్‌కు కోపం తెప్పించడంతో తుగ్లక్ సైన్యం కంపిలి రాజుపై చేసిన యుద్ధాలు నిష్ఫలమయ్యాయి. కాని విధి వక్రించి 1327 సం.లో హొసకోట ముట్టడి సమయంలో కంపిలి రాజు మరణించాడు.

ఇక్కడ ఒక ముఖ్య విషయం చెప్పాల్సి ఉంది. ఆసక్తికరమైన ఘట్టం. కంపిలి రాజ్యం మహమ్మదీయుల వశం కాకముందు జరిగిన ఉదంతం. ఈ కంపిలి రాయల కుమారు డైన కుమారరాముని గుర్రం ఉదంతం ఒకటి చెప్తాను. విను! ఉత్తర భారత దేశాన్ని పూర్తిగా మహమ్మదీయ ముష్కరులు స్వాధీనం చేసుకుని దక్షిణాదిలో ఉన్న అమితసంపద దోచుకోవడానికి అల్లాయుద్దీన్ ఖిల్జీ దక్షిణ దేశం మీద దండయాత్ర

చేసినపుడు ఎదుర్కొని మాలిక్ కాఫిర్ సైన్యాన్ని తరిమికొట్టిన కంపిలి రాయని (జంబుకేశ్వరుడు) ప్రతాపం గురించి ఇంతకు ముందే నీకు చెప్పాను కదా! ఆతని కుమారుడి పేరు కుమారరాముడు. ఆరివీర భయంకరుడైన వీరుడు. చిన్నతనంలోనే తండ్రితో కలిసి అనేక యుద్ధాలలో పాల్గొని తమ రాజ్యాన్ని సుస్థిరం చేసుకున్నారు. ఈ సమయములోనే మన ఆంధ్ర సామ్రాజ్యాన్ని కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడు పరిపాలిస్తున్నాడు. కాకతీయ సామ్రాజ్యములో అంతర్భాగం అయిన గుత్తికోట దుర్గాధిపతి జగదాభిరాజు. ఇతనికి కంపిలి రాయనికి మంచి మైత్రి ఉండేది. ఓ సారి జగదాభిరాజుకు, ప్రతాపరుద్రుడి సామ్రాజ్య సైన్యాధిపతులకు మాట మాట వచ్చింది. తాను ఇంక కాకతీయ సామ్రాజ్య చక్రవర్తికి కప్పము కట్టేది లేదని జగదాభిరాజు తిరస్కరించారు. దీనికి చిలువలు పలువలు అల్లి చక్రవర్తి ప్రతాపరుద్రుడుకి జగదాభి రాజు మీద ఆగ్రహం కలిగేట్టు చేయగా..దీనికి కంపిలి రాయని అండ జూచికొనియే తన సార్వభౌమత్వాన్ని తిరస్కరించారు అని ప్రతాప రుద్రుడు జగదాభిరాజు ను పట్టి తెమ్మని ఆజ్ఞాపించారు. సైన్యాధిపతులు సైన్యంతో గుత్తి కోట మీద దండయాత్ర చేశారు. జగదాభిరాజు తన మిత్రుడు అయిన కంపిలిరాజుకు కబురు పంపగా ఆయన తన కుమారుడు అయిన కుమారరాముని సైన్యముతో వెళ్లి తన మిత్రునికి బాసటగా నిలబడమని చెప్పి పంపారు. ప్రతాపరుద్రుడు సైన్యానికి, కంపిలి రాజు సైన్యంతో గూడిన గుత్తి సైన్యానికి పెద్ద యుద్ధమే జరిగింది. ఈ యుద్ధములో ఉన్నట్లు ఉండి అమిత సైన్యంతో వచ్చి గుత్తి కోటకు వచ్చి రక్షణ కవచము గా ఏర్పడిన కుమారరాముని ధాటికి కోటను ముట్టడించలేక తమతో యుద్ధం చేస్తున్న గుత్తి దుర్గాధిపతి జగదాభిరాజుకు

చెందిన గుఱ్ఱాన్ని చేజిక్కించుకుని ప్రతాపరుద్రుని సైన్యాలు వెనుదిరిగారు. ఆ గుఱ్ఱం పేరు బొల్ల . ఆ గుఱ్ఱము అరేబియా గుఱ్ఱము మరియు దేశీయ గుఱ్ఱాల సంపర్కంతో తో జనించిన అమిత పొగరుబోతు గుఱ్ఱము. దాని అందం చెప్పనలవి కాదు. దీనిని ఆ రోజుల్లో లొంగదీయ గలిగినవాడు కేవలం గుత్తిదుర్గాధిపతి జగదాభిరాజు ఒక్కడే. ఆ గుఱ్ఱం అంటే ఆయనకు అమిత ప్రాణము. యుద్ధంలో గుత్తి కోట దక్కినా తనకు ప్రాణప్రదమైన గుఱ్ఱాన్ని పట్టుకు పోయారని జగదాభిరాజు ఇది తనకు ప్రాణం పోయినదానితో సమానం అని చింతించ సాగాడు. గుత్తి కోట దుర్గాధిపతి దుఃఖాన్ని విన్న కంపిలి యువరాజు కుమారరాముడు మారు వేషముతో ఓరుగల్లుపుర పట్టణానికి చేరాడు. అక్కడ ఓరుగల్లు పురములో ఆ గుఱ్ఱము ఎవరికీ లొంగలేదు. దానిని లొంగదీసిన వారికి తగు బహుమతి ఉంటుందని విని దానిని తాను లొంగదీస్తాను అని అక్కడి రాజప్రతినిధులకు తెలియజేస్తారు. ఆ సవాల్ లో అతి కష్టం మీద అందమైన ఆ పొగరు బోతు గుఱ్ఱం 'బొల్ల' ను కుమారరాముడు లొంగదీస్తాడు. దానిని లొంగదీసినందులకు తగిన బహుమతి, సన్మానము అంద జేయబోయిన ప్రతాపరుద్రుడుకి తాను కంపిలిపుర యువరాజును అని, ఆ గుఱ్ఱాన్ని తనకు బహుమతిగా ఇవ్వాలని, ఓ వైపు ముస్లిం మహమ్మారులు దండయాత్రలు చేస్తూ ఉంటే, ఇక్కడ చెప్పుడు మాటలు విని మనలో మనం యుద్ధాలు చేసుకోవడం హితం కాదని, ప్రతాపరుద్రునికి నచ్చజెప్పి ఆ గుఱ్ఱాన్ని బహుమతి గా పొంది, గుత్తి దుర్గాధిపతికి తిరిగి ఇచ్చాడు. తన కోటను, తనకు ఎంతో ఇష్టం అయిన గుఱ్ఱాన్ని తెచ్చి ఇచ్చినందులకు గుత్తి దుర్గాధిపతి జగదాభిరాజు ఆ గుఱ్ఱాన్ని కుమార రామునికే బహుమతిగా

ఇస్తాడు. ఈ గుఱ్ఱము తరువాత రోజుల్లో కంపిలి రాజ్యానికి తుగ్లక్ తో సాగిన యుద్ధములో కుమారరామునికి మంచి సహకారం అందిస్తుంది. బొల్ల ఉండగా కుమార రాముని యుద్ధంలో ఆపతరము కాదని మోసముతో బొల్ల గుఱ్ఱాన్ని మహమ్మదీయ సైనికులు కుట్ర పూని కాలు నరికి చంపివేస్తారు. ఆ యుద్ధములోనే కుమారరాముడు కూడా వీరోచిత మరణం పొందుతాడు. పిమ్మట కంపిలిరాజు కూడా యుద్ధములో మరణిస్తారు.

ఢిల్లీ సుల్తానులు కంపిలి రాజు కొడుకులనే కాక హరిహర బుక్కరాయలను కూడా బంధించి వారిని బలవంతంగా ఇస్లాం మతంలోకి మార్పించారు. కంపిలి రాజ్య పతనానంతరం బాహుద్దీన్ హొయసలరాజు వద్దకు చేరి శరణువేడాడు. రాజైన బల్లాలుడు కరుణజూపి ఆశ్రయం కల్పించాడు. ఈ విషయం గ్రహించిన ఢిల్లీ సైన్యం హొయసల చేరుకున్నది. ఆ సైన్యాన్ని ఎదిరించే శక్తిసామర్థ్యాలు లేని బల్లాలుడు తుగ్లక్ శరణుజొచ్చి బాహుద్దీన్‌ను ఢిల్లీ సుల్తానులకు అప్పజెప్పాడు. ఇందుకు సంతోషం వ్యక్తం చేసిన తురుష్కులు, తుగ్లక్ ఆదేశాలమేరకు బల్లాలుడి సామ్రాజ్యాన్ని జయించకుండా వదలి వెళ్ళిపోయారు.

దీనితో మహమ్మద్ బీన్ తుగ్లక్ అఖండ భారతదేశ చక్రవర్తి అయ్యాడు. అతని సామ్రాజ్యం పెషావర్ నుండి బంగాళాఖాతం వరకూ, హిమాలయాలనుండి దక్షిణాన రామేశ్వరం వరకూ వ్యాపించింది. ఈలోపు కంపిల రాజ్యం కూడా ఛిన్నాభిన్నమయింది. అక్కడి పరిస్థితులను చక్కబరచి రాజ్యాన్ని సుస్థిరం చేసుకోడానికి రెండేళ్ళు సుల్తాను కంపిలి ప్రాంతంలో ఉండిపోవలసి వచ్చింది. కానీ 1329 సం.లో సుల్తాన్ పంజాబులోని తిరుగుబాటును అణచివేయడానికి తిరిగి ఢిల్లీ వెళ్ళిపోయాడు. దీనిని

అదనుగా తీసుకుని తెలంగాణా వీరులు ముసునూరి ప్రోలయనాయకుని నాయకత్వంలో సుల్తాను సైన్యాన్ని ఎదిరించారు. ప్రోలయనాయకుడు విజయాన్ని పొందడంతో ఆంధ్ర ప్రాంతంలోని తీరప్రాంతాలన్నీ ప్రోలయనాయకుని వశమయ్యాయి. దీన్ని చూసి పడమర ప్రాంతపు అరవీటి రాజవంశ మహావీరుడైన సోమదేవుడు తిరుగుబాటు లేవదీసి ఇతర హిందూ రాజుల సహాయంతో సుల్తాను కంపిల రాజ్యంలో ఏర్పరచిన సైయెబ్ మహమ్మదును ఓడించి ఆనగొంది, రాయచూరు, మద్గల్ కోటలను స్వాధీనం చేసుకొన్నాడు. ఇతర రాజులు కంపిల సుల్తానుకు, బియ్యం మరియూ ఇతర ఆహార పదార్థాల సరఫరా నిలిపివేశారు. భరించలేక కంపిలి రాజు ఢిల్లీ సుల్తాను శరణుజొచ్చాడు. ఢిల్లీ సుల్తాన్ తన చెరలోనున్న హరిహర, బుక్కరాయలను చెరవిడిపించి, కంపిలి పరిస్థితులు చక్కదిద్దడానికి పంపించాడు. అలా వారిరువురూ మళ్ళీ దక్షిణాపథం చేరుకున్నా, వారు ఇస్లాం మతం స్వీకరించడంవల్ల వారి పెత్తనం, అధికారం అంగీకరించక మద్దతు ఇవ్వకపోవడంతో బల్లాలుడి చేతిలో ఓడిపోయి, విద్యారణ్యస్వామి శరణు జొచ్చి హంపీ దగ్గర పంపాతీ ఆలయంలో తలదాచుకొన్నారు. వారిని విద్యారణ్యులు తిరిగి హిందూ మతంలోకి మార్చి, హిందూ మత పునరుద్ధరణ చేయమని కోరాడు. క్రమంగా వారిద్దరూ శక్తిపుంజుకుని, బల్లాలుడిని, సోమదేవుని ఓడించి ఆనగొందిని రాజధానిగా చేసుకుని పాలించసాగారు. మాబరు అధిపతైన జలాలుద్దీన్ తిరుగుబాటును కూడా సుల్తాను అణచలేకపోయాడు. ఆ తర్వాత అనేక రాజులు తిరుగుబాట్లు చేసారు. 1334 సం.లో జలాలుద్దీన్ ఢిల్లీ సుల్తానుల ప్రాభవం తగ్గడం గమనించి తను సామంతరాజును కాదని మధురైకి సుల్తానుగా స్వాతంత్ర్యం

ప్రకటించుకొన్నాడు. ఆయన ఐదేళ్ళ పాలన అనంతరం గయాజుద్దీన్ దాంఘాని అక్కడ మధురైకి సుల్తానయ్యాడు. గత కొన్ని దశాబ్దాలుగా దారుణ కాండలు సాగిస్తున్నాడు. హిందువులను ఊచకోత కోస్తున్నాడు. దానికి ముందు విజయనగర సామ్రాజ్య స్థాపన మంచి ఆసక్తికరమైన విషయం అది రేపు చెప్తాను. విశ్రాంతి తీసుకో అని తండ్రి నిష్క్రమించాడు. చాలా సేపటివరకూ గోపనకు నిద్ర పట్టలేదు. తెల్లవారు ఝామున కలలో మళ్ళీ నారసింహస్వామి గర్జన వినపడడంతో ఉలిక్కిపడి లేచాడు.

గోపన్న పెందలకడనే నిద్రలేచి స్నానాది కార్యక్రమాలు సంధ్య పూర్తి చేసుకుని దివాణం నుండి తండ్రి రాకకై ఎదురు చూస్తున్నాడు. సూర్యుడు నడినెత్తిమీదకు వచ్చిన వేళలో నరసింహామాత్యుడు రథంపై దిగి అమితానందం వ్యక్తం చేస్తూ గాఢంగా కౌగలించుకుని "శుభం! గోపనా! శుభం! నిన్ను నారాయణపురానికి రాబోయే పున్నమి నుండి పాలకునిగా, సామంతునిగా, సైన్యాధ్యక్షునిగా నియమించనున్నారు. పన్నులు వసూలుచేయించి రాజధాని మండలేశ్వరునికి అప్పగించవలెను. నీవు అదృష్టవంతుడవు. నేను సాధారణ అమాత్యుడిని మాత్రమే! నీవు పాలకుడవయ్యావు. అంతే కాదు మన బుక్కరాయలవారి పుత్రుడైన కంపనకు ముల్బుగల్ రాజ్యానికి సర్వ సైన్యాధ్యక్షుడివి కూడా! జ్యోతిష్యులు నీ జాతకం చూసి చిన్నప్పుడు చెప్పినవన్నీ ఇప్పుడు నిజయమయ్యాయి." అని ఆశీర్వదించగానే "తండ్రీ! నా కర్తవ్యం నేను నిర్వహిస్తాను. మీకు మన వంశానికి పేరు తెస్తానని, హైందవధర్మ దీక్ష వహిస్తానని మాట ఇస్తున్నాను." భోజనానంతరం గోపన నిన్నటి విషయాల్ని నెమరు వేసుకుంటూ "తండ్రీ!

విజయనగర సామ్రాజ్య స్థాపన గురించి ఏవో ఆసక్తి దాయకమైన విషయాలు చెప్తానని అన్నారు. చెప్పండి" అనగా "అవును నాయనా! పాలకుడైన వారు గత పాలకుల గురించి విజయాల గురించి విషయాలను క్షుణ్ణంగా తెలుసుకొని ఉండాలి. నిన్నటి పరిస్థితి వేరు. నేడు జరిగిన నీ నియామకం వల్ల సవిస్తరంగా చెప్పక తప్పదు. విను" అంటూ కొనసాగించాడు.

"ఆనెగొందితో ఆగకుండా సామ్రాజ్య విస్తరణ చేయాలనుకొని హరిహర, బుక్కరాయలు విద్యారణ్యస్వామిని సంప్రదించారు'' "విద్యారణ్యస్వామి ఎవరు? అన్న గోపన ప్రశ్నకు నరసింహుడు నవ్వి "మీ గురువైన దేశికాచార్యుల సహాధ్యాయి. విద్యారణ్యులు హైందవ రక్షణకు నడుంకట్టిన మహానుభావుడు! ఆయన గురించి కొంత చెప్ప వలసిన అవసరం కూడా ఉంది. విద్యారణ్యుడు అని పిలవబడే శ్రీమాధవాచార్యుడు శృంగేరి శారదా మఠానికి 12వ పీఠాధిపతి. శంకరాచార్యుల తరువాత ఐదు శతాబ్ధాలకు శారదా పీఠాన్ని అధిరోహించాడు. విజయనగర సామ్రాజ్య స్థాపనకు మూల ప్రేరకుడు.

"విజయనగర సామ్రాజ్యానికి ముందు ఇక్కడ ఏ చక్రవర్తి పాలించే వాడు?" అన్న గోపన్న మధ్యలో అడిగిన ప్రశ్నకు " అలాగే గోపనా! వారి గురించి చెప్పిన తర్వాతనే ఈ విద్యారణ్యస్వామి విజయనగర సమ్రాజ్యాన్ని గురించి చెప్తాను విను. విజయనగర సామ్రాజ్య స్థాపనకు పూర్వము నేడు "హంపి" (ఆనెగొంది) ఉన్న పరిసర ప్రాంతాలను కుంతల దేశం లేదా కంపిలి సామ్రాజ్యం అనేవారు. అక్కడ చాలా దుర్గాలు ఉండేవి. ఆ ప్రాంతాలన్నింటినీ చాల ధర్మబద్ధంగా పాలించే రాజు పేరు జంబుకేశ్వర రాయలు. ఈ కుంతల దేశం లేదా కంపిలి రాజ్యం దాదాపు ఆరు

దశాబ్దాలపాటు ఉచ్ఛ స్థితిలో ఉండినది . జంబుకేశ్వరుడు లేదా కంపిలి రాయదని ఆయనకు పేరు. ఈ కంపిలి రాయని తండ్రి పేరు ముమ్మడి సింగరాయదు. ఇతడు పూర్వము హొయసల రాజుల వద్ద సైన్యాధ్యక్షుడు. వారు అక్కడ నుండీ స్వతంత్ర రాజులుగా ప్రకటించుకుని కంపిలి రాజ్యాన్ని నెలకొల్పి పాలించేవారు. సింగరాయని అనంతరం ఆతడి కుమారుడు రాజ్యానికి వచ్చారు జంబుకేశ్వరుడు. అతడు అరివీర భయంకరుడు కుంతల దేశము చెప్పడానికి చాలా చిన్నరాజ్యమే అయినప్పటికి, జంబుకేశ్వరుని పరాక్రమం ముందు ఇతర రాజులెవ్వరూ అతడి ముందు నిలువలేకపోయేవారు. ఈతని గూర్చి జానపదులు ఇప్పటికీ కథలుగా చెప్పుకుంటూనే ఉన్నారు.

ఈ కుంతల దేశములో నేటి రాయచూరు, దావణగిరి, బళ్ళారి , చిత్రదుర్గము, ధార్వాడ ఇవన్నీ ఆ రాజ్యములోని ప్రాంతములే. అందువల్ల దక్షిణ దేశానఉన్న అమూల్యమైన సంపద మీద ఢిల్లీనేలుతున్న ఖిల్జీ కన్నుబడింది. అతని సైన్యం ఎందరో హిందూ సామ్రాజ్యాలను నేలకూల్చుతూ దిగ్విజయం సాగిస్తున్నది. అతని సైన్యాధ్యక్షుడైన మాలిక్కాఫూర్ లక్షల సైన్యముతో మొదట దేవగిరిని జయించి అక్కడ ఉన్న ఊళ్లన్నీ కొల్లగొట్టి అధిక సంపదను ఢిల్లీకి పంపినాడు. ఆ మార్గ మధ్యమున విజయ గర్వముతో మదాంధుడై స్వర్గతుల్యముగా అమిత సంపదలతో విలసిల్లుతున్న కుంతలదేశము లేదా కంపిలి రాజ్యములోని కుమ్మటం అనే దుర్గాన్ని జయించడానికి ఎత్తు వేసాడు. కంపిలిరాయలు తన సైన్యముతో మాలిక్ కాఫర్ ని ఎదుర్కొని ఆరు రోజులు అరివీర భయంకరంగా పోరాడారు . తురుష్క సైన్యాన్ని తన భుజ బలముతో

ఊచకోత కోసి భూమి మీద రక్తంపారేట్టు చేసిన ఘనత జంబుకేశ్వర రాయలది. అలా ఆరు రోజులు పోరాడాక మాలిక్ కాఫర్ సైన్యం పలుచబడసాగగానే వాడి వెన్నులో భయంపుట్టింది. సైన్యం వెనక్కి తగ్గుతున్నది గమనించగానే సైన్యాన్ని తీసుకుని పారిపోవడానికి ఎత్తులు వేయ సాగాడు. అలా ఒక్కసారిగా గాక వెనుదిరుగుతున్నట్టే నటించి ఒక్క సారిగా ఎదురు దాడులు చేయాలనీ ఆ కుతంత్రుని కుయుక్తి. కానీ అరివీర భయంకరుడైన కంపిలిరాయని పరాక్రమం ముందు అవేమీ చెల్లకపోగా, మాలిక్ కాఫూర్ని అతని సైన్యాన్ని కృష్ణానది సరిహద్దులవరకు తరిమి తరిమి కొట్టాడు. ఈ జంబుకేశ్వర రాయలు ఈ రాజ్యాన్ని 1297 నుండీ 1334 వరకు పరిపాలించాడు. స్వల్ప కాలమే అయిన కంపిలి రాజ్యం ధర్మంకోసం నిలబడిన రాజ్యము. జంబుకేశ్వరుడు ఎంతటి ధర్మబద్ధుడో తురుష్కులు వారు స్వయంగా వ్రాసుకున్న చరిత్రలోనే మనకు స్పష్టంగా తెలుస్తుంది. ఈ కంపిలిరాయని కుమారుడే నేను ముందు చెప్పిన 'బొల్ల' గుర్రాన్ని లొంగదీసుకున్న అరివీర భయంకరుడైన కుమార రాముడు". తరువాత రోజుల్లో కంపిలి రాజ్యానికి తుగ్లక్ తో సాగిన యుద్ధములో తండ్రీ, కుమారులిద్దరూ వీరమరణం పొందడంతో కంపిలి రాజ్య పాలను ముగిసిపోయింది.

ఇప్పుడు విజయనగర సామ్రాజ్య స్థాపన గురించి చెప్పుకుందాం. ప్రజలలో అధ్యాత్మిక భావాలు పెంపొందించడానికి అవతరించిన మూర్తిగా విద్యారణ్యుడిని భావిస్తారు. సన్యాసం తీసుకొన్నాక, విద్యారణ్యుడు కాశీ, బదరీకి తీర్థయాత్రకు వెళ్ళారు. అక్కడ నుండి వేదవ్యాసుల మార్గదర్శకత్వములో బదరికాశ్రమానికి వెళ్ళి అక్కడ శ్రీ విద్య గ్రహించారు.

నవనిధులూ ఆయన వశమయ్యాయి. కానీ సన్యాసిగా అతనేమి చేసుకోగలడు. అందుకే ఉత్తర భారత యాత్ర పూర్తి చేశాక తిరిగి దక్షిణ భారత దేశానికి వచ్చి హంపి సమీపంలో ఉన్న మాతంగ పర్వతం వద్ద యోగ నిష్ఠలో కొంత కాలం గడిపాడు. అలా కాలం గడుపుతున్న సమయములో ఒక రోజు భారద్వాజస గోత్రీకుడైన మయన కుమారులు మాధవ, సాయనలు విద్యారణ్యుడి దర్శనం చేసుకోగా, విద్యారణ్యుడు తాను అసంపూర్తిగా రచించి వదిలి పెట్టిన వేదభాష్యాలను పూర్తి చేయమని వారితో చెప్పాడు. ఆ వేదభాష్యాలకు వారి పేర్లు పెట్టమనికూడా చెప్పాడు. ఆవిధంగా అవి సాయనీయం, మాధవీయం అని ప్రాచుర్యంలోకి వచ్చాయి. శృంగేరి పీఠంలో హరిహరబుక్కరాయలు విద్యారణ్యుని గురించి ఒక శాసనంలో ఏమని లిఖింపజేశారో తెలుసా? విద్యారణ్యుడు బ్రహ్మయా? కాని నాలుగు ముఖాలు కనిపించడం లేదే! విష్ణువా? నాలుగు చేతులు కనిపించడం లేదే! శివుడా? మూడో నేత్రం కనిపించడం లేదే! ఈప్రశ్నలు మమ్మల్ని వేధించగా మేము తెలుసుకొన్నది విద్యారణ్యుడు భగవంతుడు పంపిన ఒక అద్వితీయ శక్తి" అని వ్రాయించారు.

విద్యారణ్యస్వామి లక్ష్మీకటాక్షం చేత నవనిధులను కైవసం చేసుకున్న మహానుభావుడని చెప్పాను కదా! విజయనగర సామ్రాజ్యాన్ని శాశ్వత మహావీర నగరంగా నిర్మించాలని సంకల్పించాడు. దానికి ఒక గొప్ప ముహూర్తం నిర్ణయం చేశారు. ఆరోజు ధాత్రి నామ సంవత్సర వైశాఖ శుక్ల సప్తమి, పుష్యమి నక్షత్ర యుక్త సింహలగ్నం. ముహూర్తము నిర్ణయించి అదే సమయానికి క్షణం కూడా దాటకుండా ఒక యంత్రనిర్మాణం చేయాలి. ఆ రోజులలో ఘడియలను, విఘడియలను సరిగ్గా తెలిపే కాల ఘంటికలు

లేవు. అందువల్ల ఆకాశంలోని నక్షత్రదర్శనం ద్వారానే అది సాధ్యం. సరైన ముహూర్తానికి శంకుస్థాపన మరియు యంత్రనిర్మాణం ఒకరివల్ల అయ్యే పని కాదని గ్రహించిన విద్యారణ్యులు కాశీ క్షేత్రం నుండి నక్షత్రశాస్త్రంలో దిట్టైన ఒక మహా పండితుడిని పిలిపించారు. ఆ పండితుడు కాల నిర్ణయము చేయడానికి, స్వామివారు యంత్ర నిర్మాణం చేయడానికి పూనుకున్నారు. కాశీ పండితుడు తెల్లవారుఝాము ఘడియలలో నక్షత్ర దర్శనం చేయడానికి సమీప పర్వతంపైకి ఎక్కారు. స్వామివారు కాశీపండితుని శంఖారావం విన్న వెంటనే కరిగి యున్న తామ్రలోహాన్ని యంత్రపు అచ్చులో పోయవలసి యున్నది. ముహూర్తమాసన్నం కాగానే కొండపై నుండి శంఖారావం వినిపించింది. వెంటనే స్వామివారు తామ్రయంత్ర నిర్మాణం అచ్చులోపోసి పూర్తిచేశారు. బహుస్వల్ప వ్యవధిలో మరొక శంఖానాదం వినిపించింది. కాశీ పండితుడు కొండదిగి స్వామివద్దకు వచ్చారు. కాశీపండితుడు ప్రథమ శంఖారావం తనది కాదని ఎవరో బిక్షకుడు చేసినదని, తనది ద్వితీయ శంఖారావమని తెలియజేశారు. స్వామివారు మిగుల బాధపడ్డా, విధి బలీయమని గ్రహించి, చల్లారిన అచ్చుపోతను పరిశీలించగా అది రెండుబావు బీటలు వారి యున్నది. అప్పుడు స్వామివారు బాధాపూరిత హృదయులై “ఈనగరము రెండువందల యిరువది ఐదు సంవత్సరములు మించి మనజాలదు” అని సెలవిచ్చి, అపశకునములు జరిగినవి మనస్సులో పెట్టుకోవద్దు. మీ వంశం పది తరాలు వెళ్ళిపోతాయి. పరిపాలకులు బలపరాక్రమాలను నిత్యం చూపుతూ శత్రువులను ఎప్పటికప్పుడు అణచివేస్తూ అనుక్షణం జాగరూకులై ఉండాలి. మీరు తురుష్కులను మట్టుబెట్టడానికి తగిన సమయం చూసుకోండి“ అని వారికి ప్రబోధించారు.

దక్షిణ భారతదేశంపై తురుష్కుల పట్టు సడలుతున్న సమయాన్ని హరిహర రాయలు, బుక్కరాయలు సద్వినియోగ పరుచుకోవాలని తమ రాజ్య విస్తరణ గావించే పనిలో పడ్డారు. బుక్కరాయలు రాజ్య నిర్వహణ చేస్తుండగా హరిహరరాయలు మంత్రి మాధవుని సహాయంతో దండయాత్రలు ప్రారంభించి రాజ్య విస్తరణ మొదలు పెట్టాడు. ఈ విస్తరణ సామ్రాజ్యానికి కావలసినంత అర్థ అంగబలాన్నైతే ఇచ్చింది కానీ.. సుస్థిర సామ్రాజ్యమైన హొయసల 3వ భల్లాలుని ఆధీనంలో అత్యంత వైభవోపేతంగా వెలుగుతూ, విజయనగర సామ్రాజ్య విస్తరణకు పక్కలో బల్లెమై నిలిచింది. అందువల్ల వీరు మొదట మెల్లిమెల్లిగా హొయసల చుట్టుప్రక్కల ఉన్న రాజ్యాలను జయించడానికి నడుంకట్టారు. 1340 సం. ప్రాంతానికి కుక్కలనాడు ప్రాంతం వరకూ విస్తరించారు. కానీ భల్లాలుడు 1342 సం.లో విజయనగర రాజులను ఎదిరించి గెలిచి మళ్ళీ స్వాధీనం చేసుకున్నాడు. అయితే ఇంతలో విజయనగర రాజుల అదృష్టం వల్ల, విద్యారణ్యుని ఆశీర్వాద బలం వల్ల, విజయలక్ష్మి మనలను వరించే విధంగా అడుగులు పడ్డాయి. అదేమిటంటే మధుర సుల్తానుపై ప్రకటించిన యుద్ధంలో భల్లాలుడు ఖియాజుద్దీన్ చేతిలో మరణించాడు. రాజు రక్షణ లేకపోవడంవల్ల బుక్కరాయలు హొయసల రాజ్యాన్ని ముట్టడించి పెనుగొండకోటవద్ద విజయం సాధించాడు. మెల్లిమెల్లిగా హొస పట్టణం, ద్వారసముద్రం, ముల్బగల్ ప్రాంతాలు జయించి 4వ బల్లాలుణ్ణి వెళ్ళగొట్టి, విజయనగర రాజ్యంలో విలీనం చేసుకున్నారు. అంతే కాదు, హరిహరరాయలు తమ్ముడైన మారపరాయలుతో కలిసి ధార్వాడ, గోకర్ణం మొదలైన ప్రాంతాలను విజయనగర సామ్రాజ్యంలో విలీనమయ్యాయి.

1344 వ సం.లో బుక్కరాయలు తుళునాడును కూడా కైవసం చేసుకున్నాడు. దీనితో సామ్రాజ్యం తూర్పుదిశలో పాకనాడు నుండి పడమట కొంకణదేశం, తుళునాడు వరకూ విస్తరించింది. తొండయమండలం, మాబారు ప్రాంతాలు కూడా ప్రస్తుతం విజయనగర రాజ్యంలోనే ఉన్నాయి.

బుక్కరాయలు తన కుమారుడైన కంపరాయుణ్ణి ఈమధ్యనే కోలార్ ప్రాంతానికి ఉత్తరాధికారిగా నియమించాడు. ఆ కంపరాయునికి నీవు అమాత్యుడివే కాదు నారాయణపురానికి సర్వాధికారివి! కూడా! నిన్ను నీ సామర్థ్యాన్ని కంపరాయలు బుక్కరాయలవారి ముందు ఎంతో గొప్పగా ప్రశంసించారు. నీవు విద్యారణ్యునికి సహాధ్యాయియైన వేదాంతదేశికుల శిష్యుడవని పొంగిపోయారు. మీ ప్రభువు కంపరాయలు అతి సాహసవంతుడు, శతృభయంకరుడు కూడా! మీ ఇద్దరి కలియిక ఈ హైందవజాతి వైభవాన్ని పునరుద్ధరిస్తుందని భావిస్తున్నాను. అంతేకాదు! సాళ్వమంగు శతృభయంకరుడు. భవిష్యత్తులో రాజు కాగల లక్షణాలు సాళువ వారి వంశరక్తంలో ఉన్నాయని విద్యారణ్యులు ఒకసారి అన్నాడట. అతనితో స్నేహంగా ఉండు. అలాగే సోమప్ప విఠ్ఠప్పలు కూడా అతి సాహసవంతులు. కొలువులో ఉన్నవారి గత చరిత్ర తెలుసుకోవడం అవసరమని నీకు చెప్పాను. అభిప్రాయ బేధాలు తలెత్తినా సున్నితంగా నీ ఉద్దేశాలు చెప్పు. మాట కఠినంగా ఉండకూడదు. రాజాస్థానాలలో మాట్లాడే ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించి మాట్లాడ్డం అలవాటు చేసుకో! నీవు త్వరలో నారాయణపురం వెళ్ళవలసి ఉన్నది. ముందుగా కంపరాయలు నిన్నుకలిసి మాట్లాడాలని ఉత్సాహంగా ఉన్నాడు. రేపే వెళ్ళి కలువు. శుభం! అని ముగించాడు." దానికన్నా ముందు విద్యారణ్యస్వామి వారిని

వారి ఆశ్రమంలో కలిసి ఆశీస్సులు తీసుకోవలసి ఉన్నదని గోపన్న మనసులో అనుకున్నాడు.

గోపన్న విద్యారణ్యస్వామి ఆశ్రమానికి వెళ్ళేసరికి ఉదయం ఏడు గంటలవుతున్నది. ఆ సమయంలో స్వామి ధ్యానంలో ఉన్నారు. ఆయన కండ్లు తెరిచేవరకూ దాదాపు ఒక గంటకాలం ఎదురుగా నేలమీద మోకాళ్ళపై కూర్చున్న గోపన్న ఆయన కళ్ళు తెరవగానే పాదాభివందనం చేశాడు.

"లే..నాయనా..ఎవరు నీవు?"

"నా పేరు గోపన..నన్ను గోపన్న అని కూడా పిలుస్తారు. నేను నరసింహామాత్యుని కుమారుడను" అంటూ ప్రవర చెప్పి నమస్కరించాడు.

"శుభం. నీ గురించి విన్నాను. మీ గురువైన దేశికాచార్యులు నాకు సహాధ్యాయి. మీ శక్తి సామర్థ్యాల గురించి బుక్కరాయలు చెప్పాడు. నీవంటి బ్రాహ్మణులందరూ ఇలా వేదం మాత్రమే కాక యుద్ధ విద్యలు గూడా నేర్చుకున్నట్లైతే ఈ దేశమాత దాశ్య శృంఖలాలు ఎప్పుడో వీడిపడేవి. తురుష్కుల అకృత్యాలు వినే వుంటావు. మధురకు పట్టిన శనిలా దాపురించారు. వారిపీడ విరగడ చేయడంలో నీ కృషి ఉంటుందని నేను విశ్వసిస్తున్నాను. ఆ విరూపాక్షుడు నీకు మేలు చేయాలని కోరుతున్నాను.

"ధన్యుణ్ణి గురుదేవా!"

"దేశికాచార్యులవారిని చూసి ఎన్ని వత్సరములు దాటిందో! వారి ఆరోగ్యం బాగున్నదా!"

"ఎల్లరునూ క్షేమమే గురుదేవా! వారిని ఒక్కసారి ఇక్కడికి పంపే ఏర్పాటు చేయమంటారా?"

చిరునవ్వు నవ్వు నవ్విన విద్యారణ్యుడు "అది అంత సులభం అనుకుంటున్నావా గోపన్నా! ఆయన అనుకుంటే తప్ప ఎక్కడికీ రారు! అదీ ఆయన మదిలో ఏదైనా దైవసంబంధిత సత్కార్యం సంకల్పిస్తే తప్ప. నేను ఒకసారి దేశికులవారిని విజయనగర రాజ్యానికి బుక్కరాయలవారి సమక్షానికి తీసుకురమ్మని కబురు చేస్తూ ఒక పెద్ద రాజ పల్లకీని పంపాను. వారు నాకు వైరాగ్య పంచకం రూపంలో ఒక తీక్షణమైన సందేశాన్ని పంపారు. దాని సారాంశం విను" అని కొనసాగిస్తున్న విద్యారణ్యులవారిని ఆశ్చర్యంతో గమనిస్తున్నాడు గోపన్న. 'ఈ భూమి మీద ఒక చిన్న భాగాన్ని పరిపాలిస్తున్న, ఒక సామాన్యమైన రాజును చేరుకోవడం నేను గొప్పపనిగా ఎప్పటికి భావించడంలేదు. నాకు ఈ పల్లకీలు, పరివారాలు, రాజదర్శనాలు ఏమాత్రం అవసరం లేదు. నన్ను నేను ఆ శ్రీరంగనాథునికి సమర్పించుకోవాలని, ఆయననే సేవించుకోవాలని నిర్ణయించుకున్నాను. దేవతలకే దేవుడైన ఆ స్వామి గుప్పెడు అటుకులకే కుచేలుణ్ణి కుబేరునిగా చేశాడు. అటువంటి స్వామి పాదాలనే, వారి సేవలనే పరమావధిగా భావిస్తున్నాను' అని ఒక తాళపత్రంపై వ్రాసి పంపాడు" అంటూ నవ్వాడు. గోపన్నా! అటువంటి పరమ భక్తశిఖామణి నీకు గురువు కావడం నీ పూర్వపుణ్య ఫలం. వారు చెప్పిన అతిభీస్తవ శ్లోకాలను నీకు చెప్పాలని ఉంది"

''తప్పక స్వామీ! చెప్పండి'' అని నమస్కరించిన పిమ్మట విద్యారణ్యులవారు "అతిభీస్తవం అంటే నిర్భయత్వం కలగాలని ఆ స్వామిని ప్రార్థించడం. దేశికులు తన శిష్యులచే ఈ శ్లోకాలు పఠింపజేసి ఉత్సాహాన్ని పెంపొందింపజేసి, వారిలో నిర్భయత్వాన్ని కలిగించేవారు. ఎప్పటికైనా

శ్రీరంగంలో శ్రీరంగనాథుని విగ్రహం తిరిగి ప్రతిష్ఠింపబడాలని ప్రతిరోజూ రంగనాథస్వామిని నీవే మాదిక్కు అంటూ కాపాడమని ప్రార్థించడం ఆయన దినచర్యగా మారింది. నీవు ఏకసంధాగ్రాహివని విన్నాను. వాటిని శ్రద్ధగా విని మననం చేసుకోదగినవి. ఇవి మానవజాతికి గొప్ప సందేశాన్నిచ్చే శ్లోకాలు నీవూ నిత్యం, సంధ్యావందన అనంతరం ఈ శ్లోకాలను పఠించవలసినదిగా ఆదేశిస్తున్నాను.

''చిత్తం గురుదేవా! ముందుగా ఒక్క సందేహ నివృత్తి చేసుకోవాలనుకుంటున్నాను"

"అడుగు గోపనా!"

చిన్నతనం నుంచి వస్తున్న కలగురించి చెప్పి "ఇలా సింహం ఎందుకు గర్జిస్తున్నది? అని అడగ్గానే విద్యారణ్యులు చిరునవ్వు నవ్వి "దేశికులవారు నీ సందేహాన్ని తీర్చలేదా? నీ సందేహం తీరడానికి ఈ అతిభీస్తవ స్తోత్రం పఠిస్తూ ఉండు. అర్థ తాత్పర్యాలతో వివరిస్తాను. జాగరూకుడవై విను. ఒకనాటికి నీకు తప్పక మహావిష్ణువు రూపంలో దర్శనమిస్తాడు. దానికి కారణమేమిటో నీవే స్వయంగా తెలుసుకుంటావు"

"ధన్యోస్మి గురుదేవా! ఆ శ్లోకాలను నాకు ఒక్కసారి వినిపించండి!"

అభీతిరిహ యజ్జుషాం యదవధీరితినాం భయం
భయా భయ విధాయినో గతి యన్నదేశే స్థితా:
తదే తదతిలఙ్ఘిత ద్రుహిణ శంభు శక్రాధికం
రమాసఖమధీమహే కిమపి ర్గధుర్యం మహ:

దీనికి అర్థం ఏమిటంటే తన భక్తులకు అభయమొసగి నిర్భయత్వాన్ని ప్రసాదించి రక్షించే అపారతేజస్సును స్మరించెదము.

జగత్తులో భయము-అభయము ఆ తేజస్సుయొక్క అధీనం. ఆ తేజస్సు శత్రువులకు అగ్ని, వాయువు, వర్షం, రోగములు మొదలగు సాధనములద్వారా భయాన్ని కలిగించే అపార శక్తి గలది. ఆ తేజస్సు లక్ష్మీదేవికి ప్రియుడైన సకల దేవతా సార్వభౌముడు దేవదేవడనే తేజస్సు.

అతర్కిత హితాహిత క్రమ విశేషమారభ్యతే
తదప్యుచితమర్చనం పరిగృహాణర్గశ్వర

ఓ స్వామీ నేను మంచి చెడ్డల మధ్యనున్న అంతరాన్నిగుర్తించే పరిస్థితిలోలేను. శక్తిసామర్ధ్యాలు లేని నిరుపేదనయ్యాను. నా ప్రార్ధనను ఆలకించి, నేను చేసే ప్రతిపని నీకనుకూలమైన పనిగా సేవగా మార్చి కృతార్థుడను గావించు. అంటూ భక్తులకు రక్షణనిచ్చే భగవంతుని దివ్య నామాలను గానం చేస్తూ అనునిత్యం రంగనాథుని సేవిస్తూ ఉండేభాగ్యం కల్పింపమని ప్రార్థించేవాడు.

రమాదయితర్గభూరమణ కృష్ణ! విష్ణో! హరే!
త్రివిక్రమ! జనార్ధన! త్రియుగ నాథ! నారాయణ!
ఇతీవ శుభదాని య: పఠతి నామధేయాని తే
న తస్య యమవశ్యతా నరక పాత భీతి: కుత:

ఓ! రమాదేవికి భర్తగా వెలసి శ్రీరంగ క్షేత్రాన్ని అలంకరించి ఆనందపడే స్వామీ! కృష్ణ! విష్ణో! హరే! త్రివిక్రమ! జనార్ధన! త్రియుగ నాథ (జ్ఞాన, బల, వీర్య, శక్తి, ఐస్వర్య, తేజస్సు అనే ఆరుగుణాలకు నాథుడైనవాడా!) నారాయణా! అని శుభమైన మంగళప్రదమైన నామములను ఎవరు కీర్తించునో వారికి నరకముండదు. యమవశ్యకారాగారముండదు. స్వామీ నన్నీ నరకమునుండి కాపాడండి అని ప్రార్ధన.

కదాచిదపి ర్గభూరసిక యత్రదేశే వశీ
త్వదేక నియతాశయస్త్రిదశ వందితో వర్తతే
తదక్షత తపోవనం తవ చ రాజధానీ స్థిరా
సుఖస్య సుఖమాస్పదం సుచరితశ్య దుర్గం మహత్

స్వామీ! శ్రీరంగంలో మరియూ శ్రీరంగం లాంటి ఇతర ఆలయాలలో నీ ఇచ్ఛానుసారం వెలిసావు. నీ అస్థిత్వం ఈ ప్రదేశానికి పవిత్రతను ఆపాదించినది. కావున దయచేసి ఈ ప్రదేశానికి మునుపటి పవిత్రత తిరిగి వచ్చేలా చేసి ఈ ప్రదేశం ధార్మిక జీవన ప్రవృత్తులను రక్షించే కంచుకోటలా స్థిరమైన రాజధానిగా నిలపమని మా ప్రార్ధన!

భయం శమయ ర్గధామ్న్య నితరాభిలాష స్పృశాం
శ్రియం బహులయ ప్రభో శ్రిత విపక్షమున్మూలయ
స్వయం సముదితం వపుస్తవ నిశామయంత: సదా
వయం త్రిదశ నిర్వృతి భువి ముకుంద విందేమహి

స్వామీ..శ్రీరంగధామంలో నేడు ఆవరించిన భయాన్ని పోగొట్టి అక్కడ నిస్స్వార్ధ భక్తకోటి శ్రీని పెంపొందించుము. దయచేసి నీ భక్తుల శత్రువులను నాశనము చేసి వారికి నిజమైన ఆనందపు అనుభవాన్ని అనుగ్రహించు అని ప్రార్ధించాడు.

శ్రియ: పరిబృఢే త్వయి శ్రిత జనస్య సమ్రక్షకే
సదద్భుత గుణౌదధావితి సమర్పితోయం భర:
ప్రతిక్షణమత:పరం ప్రథయ ర్గధామాదిషు
ప్రభుత్వమనుపాధికం ప్రథిత హేతిభిర్హేతిభి:

దేశికులవారు ఈ శ్లోకంలో భగవంతునికి తనను నివేదించుకొని, ధర్మ

పునరుద్ధరణ మరియూ ధర్మ పరిరక్షణ చెయ్యవలసినదిగా శ్రీరంగనాథుని వేడుకునేవారు. ఆయన భగవంతుని పాదాలచెంత ఆయనను నివేదించుకునే కారణాలు ఏమిటంటే ఒకటి శ్రీరంగనాథుని శక్తులను ఆయుధాలను అత్యంత తేజోమయముగా చేసి శత్రునాశనము గావించడానికి, రెండు అన్ని పుణ్యక్షేత్రాలలో ఆలయాలలో ధార్మికకట్టుబాట్లను, విధులను పునరుద్ధరణ చేయడానికి అని చెప్తున్నారు.

కలి ప్రణిధి లక్షణై: కలిత శాక్య లోకాయతైః
తురుష్క యవనాదిభిర్జగతి జృంభమాణం భయం
ప్రకృష్ట నిజశక్తిభిః ప్రసభమాయుధైః ప్రభిః
క్షితి త్రిదశ రక్షకైః క్షిపయ రంగనాథ క్షణాత్

స్వామి పాదాలచెంత, రక్షణ బాధ్యతను నిలిపి తమ రక్షణకార్యంలో, స్వామి తన ఆయుధాలైన శంఖం, చక్రం, గద, ఖడ్గం మరియూ ధనుస్సు ఇత్యాదులను ఉపయోగించి, ఉబికి విజృంభిస్తున్న కలి లక్షణమైనటువంటి తురుష్క యవనాది రాజుల సైన్య శక్తులనుండి తమను కాపాడాలని ఆచార్యులవారు స్వామిని ప్రార్థించారు. శత్రుసంహారము వలన సజ్జనులు క్షేమంగా ఊపిరి పీల్చుకోగలరని ఆయన నమ్మకం. ఈ శ్లోకంతో యుద్ధం ప్రారంభించేముందు వీరులను ఆయుధ పూజ చెయ్యమని ఉత్సాహపరుస్తున్నారు.

భుజంగమ విహంగమ ప్రవర సైన్యనాథా! ప్రభో
తథైవ కుముదాదయో నగర గోపుర ద్వారపాః
అచింత్య బల విక్రమాస్త్వమిహ రంగ సంరక్షకాః
జితం త ఇతి వాదినో జగదనుగ్రహే జాగ్రతు

భక్తుని జీవితంకంటే అతి ముఖ్యమైనది శ్రీరంగనాథుని ఉనికిని

చూపే పుణ్యక్షేత్రాలు, స్వామియొక్క సైన్యాధికారులైన ఆదిశేషుడు, గరుత్మంతుడు, విష్వక్సేనుడు, కుముదులు మరియూ స్వామి ద్వార పాలకులను కూడా దేశికులవారు కీర్తించారు. వారు అత్యంత బలవిక్రమాలు కలిగినవారు. వారిని వెంటబెట్టుకుని వచ్చి స్వామివారి పుణ్యక్షేత్రాలను రక్షించమని ఆచార్యులవారు స్వామిని ప్రార్ధించారు. అలాగే ఆయన భక్తులను జితంత శ్లోకాలను జపించమని కోరారు.

"పరస్పర హితైషిణాం పరిసరేషు మాం వర్తయ" – ప్రజలు స్వప్రయోజనాలే కాక ఇతరుల శ్రేయస్సును కూడా కోరుకునేటువంటి క్రొత్త ప్రపంచాన్ని సృష్టించమని దేశికులవారు ఆ సర్వాంతర్యామిని కోరుకున్నాడు. అని చెప్పి అప్పటికి ముగించారు విద్యారణ్యులు.

" మీ ఆశీర్వాదానికై వచ్చాను స్వామీ! నేను తప్పక ఈ శ్లోకాలను మననం చేసుకుంటూ ఉంటాను. శెలవిప్పించండి" అంటూ మరలా నమస్కరించి గుర్రం ఎక్కాడు గోపన. విద్యారణ్యస్వామి తన్మయత్వంతో గోపన్నను చూస్తూ ఉండిపోయాడు.

"కంపరాయలవారికి గోపన నమస్కారములు" అంటూ దివాణంలో ఒక ఉన్నతాసనం మీద ఆశీనుడై, పది మంది సైనిక, అమాత్య బృందంతో ముచ్చటిస్తున్న కంపరాయలు ముందు నిలిచాడు గోపన.

"రా! గోపన్నా రా! సుస్వాగతం!" అని "దండనాయకా! అమాత్యశేఖరులారా! చూడండి! వీరే! గోపన గారు. మన నారసింహామాత్యులవారి కుమారుడు. మన నారాయణపురానికి అధికారి!" అన్న కంపరాయుని మాటలకు అందరూ ఆసక్తిగా చూశారు. కండలు తిరిగిన శరీరం. పౌరుషాన్ని సూచించే

కోర మీసాలు. మెడలో జంధ్యమే కాదు. ఒరలో కత్తి కూడా ఉండడంతో ఒకింత ఆశ్చర్య పోయారు.

కంపరాయలవారు చిరునవ్వు నవ్వి "సేతుపతీ! దండనాయకునిగా కత్తిసాములో మిమ్మల్ని మించిన వీరులు లేరని సైనికులందరూ అంటారు గదా! ఒక్కసారి మీరిద్దరూ తలపడితే చూడాలని ఆసక్తిగా ఉంది"

"క్షమించండి! వారి పరాక్రమం నాకు తెలుసు. విజయనగర యుద్ధశాలలో వీరిని చూశాను. బహు నైపుణ్యశాలి. నా శక్తిపై నాకే అపనమ్మకం కలుగుతుందేమో! వద్దు లెండి"". సున్నితంగా తిరస్కరించాడు.

"ఆశీనులవండి గోపనామాత్యా! ఎప్పుడు మీ ప్రయాణం? మీకొరకు అక్కడ ఒక భవనాన్ని తయారుగా ఉంచాము. గత రెండు సంవత్సరాలుగా కొంత మంది భూస్వాములు సరిగా శిస్తు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నారని విన్నాం. మీరు మొదటగా ఆ వ్యవహారం చూడండి. ఇంకో మాసంలోగా అందరూ శిస్తు సక్రమంగా చెల్లించాలని ఆదేశించండి. అలా చెల్లించని వారిని శిక్షించే హక్కుకూడా మీకు ఇస్తున్నాం. శిక్షాస్మృతి గురించి మీకు నేను చెప్పనవసరం లేదు కదా! అక్కడ 30 మందికి సరిపోయే కారాగారం ఉంది. 50 మంది సైనిక బృందం ఉంటుంది. మీకు రాజ ముద్రతో ఒక లేఖ వ్రాసి పంపుతాను. మీరు నారాయణపురంలో సర్వాధికారిగా ఉండవచ్చు. ప్రతి పదిరోజులకు ఒకసారి మాకు అక్కడి విశేషాలు తెలియజేస్తూ లేఖవ్రాసి పంపండి. అత్యవసరమనుకుంటే మీరు ఇక్కడకు ఎప్పుడైనా.. ఏ సమసయంలోనైనా రావచ్చును...నన్ను కలుసుకోవచ్చును"

"చిత్తం మహారాజా! సెలవు."

"విజయోస్తు! ఈసారి వచ్చినప్పుడు మీనుండి మంత్రాంగ రహస్య విశేషాలు వినాలని ఉంది" అన్నాడు నవ్వుతూ. "తప్పక మహారాజా!" అని నమస్కరించి బయటకు వచ్చాడు.

సంధ్యా సమయం సాయంత్రం ఐదు గంటలు. గోపన రథం నారాయణపురం సమీపిస్తున్నది. ఊరి శివార్లలో దూరంగా ఒక పెద్ద గాలిగోపురం కనుపించింది. రథం వెంట వస్తున్న ఇద్దరు సైనికులను వివరాలడిగాడు. వారు అది పెద్ద ప్రాచీన శ్రీవేంకటేశ్వరుని దేవాలయం అని చెప్పడంతో, మొదట దేవాలయన్ని దర్శించుకున్న తర్వాతే తనకు నిర్దేశించిన రాజభవనానికి వెళ్ళాలని సారధికి చెప్పాడు.

రథం కొద్ది దూరంలో ఆపి, పాదరక్షలు విడిచిపెట్టి, కాలినడకను ఇద్దరు సైనికులతో గుడిని సమీపిస్తుండగా, పది మంది స్త్రీలు గుంపుగా మెట్ల దగ్గరకు రావడం కనిపించింది. మధ్యలో ఒక సుందరాంగి. విద్యుల్లతలా ఉన్న అద్భుతమైన సౌందర్యరాశి. ఇద్దరి చూపులు ఒకేసారి కలిశాయి. గోపన చిరునవ్వు నవ్వాడు. ఆ కన్నె సిగ్గుతో తలవంచుకున్నది.

దేవాలయం ప్రదక్షణం చేస్తున్నా, శిల్ప సౌందర్యాన్ని చూస్తున్నా, గోపనకు ఆమె సౌందర్యమే గుర్తొస్తోంది. మరలా గర్భగుడి ముందు పురోహితునితో అర్చన చేయిస్తున్న ఆమె కనుపించింది. ఆమె పూజ ముగించే వరకూ అలాగే చూస్తూ ఉండిపోయాడు. ఆమె తత్తరపాటును గమనించి లోలోపల నవ్వుకున్నాడు. ఆమె నిష్క్రమించిన తరువాయి, తనను పూజారికి పరిచయం చేసుకుని, గోత్రనామాలతో పూజ చేయించుకొని వెళ్తూ "ఇంతకు ముందు వచ్చిన కన్యామణి ఎవరో తెలుసుకోవచ్చునా! పురహితాగ్రణీ!'అంటూ

అమాయకంగా ఏమీ తెలియనట్టు ప్రశ్నించాడు.' ఆయన చిరునవ్వు నవ్వి "ఆమె..మా అన్నగారి పుత్రిక. పేరు కుముదశ్రీ." అని చెప్పాడు. "నేను వేదాంత దేశికాచార్యులవద్ద శిష్యరికం చేశాను. ఆయన నాకు పంచసంస్కారాలు గావించారు" అనగా "చాలా సంతోషం! నాపేరు గోపాలాచార్యులు. మా తండ్రిగారి పేరు నారాయణాచార్యులు. మా సోదరుడు అంటే కుముదశ్రీ తండ్రి పేరు గోవిందాచార్యులు" అని పరిచయ వాక్యాలు పలికాడు. "మీకు నారాయణపురం స్వాగతం పలుకుతున్నది. మీరు ముందుగా ఈ జగత్కల్యాణధాముడైన శ్రీనివాసుని దర్శించడం వల్ల అంతా శుభం జరుగుతుంది. మీ కార్యాలన్నీ సఫలమవుతాయి. జయోస్తు. విజయోస్తు! అని ఆశీర్వదించాడు.

గోపన్నకు కేటాయించిన రాజభవనం చేరుకున్నది రథం. గోపన్న తనకు ప్రత్యేక అనుచరుడిగా ఏర్పాటు చేసిన కాలదత్తునితో కలిసి భవనమంతా అంగుళం అంగుళం తిరిగి క్షుణ్ణంగా పరిశీలించాడు. ముందు చిన్న ఉద్యానవనం. రథం గుర్రాలు నిలిపేందుకు ప్రత్యేకమైన వసారా లాంటి నిర్మాణం. పన్నెండు గదుల రెండస్తుల భవంతి. క్రింద ఎనిమిది గదులు. పైన నాలుగు గదులు. 50 మంది ఒకేసారి ఆశీనులవగల విశాలమైన సమావేశ మందిరం. బూరుగ దూదితో చేసిన హంసతూలికా తల్పాలున్న పడక గదులు రెండు గదులు ప్రత్యేకంగా తనకు కేటాయించినవి. లోపల వంటగది, భోజనశాల. వంట పని వాళ్ళు ఉండేగదులు వెనుకగా నిర్మింపబడ్డాయి. ప్రతిగదిలోను స్వచ్ఛమైన గాలి వెలుతురూ వచ్చేందుకు చేసిన ఏర్పాటు చాలా బావుంది. మొదటి అంతస్తులో కేవలం నివాసముండేందుకు ఏర్పాటు చేయబడ్డ గదులు.

ఒక చిన్న అత్యవసర రహస్య సమావేశ మందిరం. రెండవ అంతస్తులో ఎనిమిది దిక్కులా ఎనిమిది బురుజులు. సైనికులు కాపలా ఉండడానికి చేయబడ్డ ఏర్పాటు చాలా బాగా నచ్చింది గోపన్నకు. పైనుండి చూస్తే నారాయణపురం మొత్తం కనిపిస్తుంది. మొత్తం వేయి గడపలు పైగా ఉన్నట్టు భావించాడు. దానికి వేయి గజాల దూరంలో కోటలాంటి ఇంకో కట్టడం మహారాజుగారు వచ్చినప్పుడు ఉండే విశ్రాంతి విడిది భవనమని కాలదత్తుడు చెప్పాడు. ఈ భవనానికి దానికి ఒక రథం వెళ్ళే మార్గం ఉన్నది. అద్భుతమైన భవనాన్ని తన నివాసానికి ఇచ్చినందుకు, ఆనందంతో కంపరాయలవారికి ధన్యవాదములతో ఒక లేఖ వ్రాసి పంపాలని నిశ్చయించుకున్నాడు.

గోపన్న ఒక ముసలివేషం వేసుకుని ఆ నారాయణపురంలో జరుగుతున్న విశేషాలను అక్కడి జనం గురించి తెలుసుకోవాలని గుర్రంపై ఎవ్వరూ సైనికులను తోడు తీసుకోకుండా ఒకరోజు ఉదయాన్నే బయలుదేరాడు. అలా ప్రయాణిస్తూ ఊరి చివరకు వచ్చాడు. అక్కడ కొంతమంది ప్రయాణీకులే కాక ఒక విచిత్ర వేషంలో ఉన్న ఒక విదేశీయుణ్ణి అక్కడ వారితో కలిసి రహదారిపై గుర్రంపై సాగిపోతూ ఉండడం గోపన్న చూశాడు. అంతకు ముందు ఎన్నడూ అలాంటి దుస్తులు ధరించిన మనిషిని చూడలేదు. పైగా అతను శరీరకాంతి ఉత్తరభారత దేశ వ్యక్తులకంటే చాలా కాంతివంతంగా మెరసిపోతున్నది. ఆశ్చర్యపోతూ అతని ప్రక్కగా వెళ్ళి గుర్రాన్ని నెమ్మదిగా నడిపిస్తూ “నమస్కారం! ఎవరు మీరు?” అని అడిగాడు. అతను తురక యాసలో “నేను ఒక విదేశీ యాత్రికుడిని” అన్నాడు.

"విదేశమా? ఏ దేశం మీది? మీ పేరు?"

"మాది మూరిష్ దేశం (స్పెయిన్ దేశానికి అప్పటిపేరు) నేనొక అరబ్ ముస్లింను. నాపేరు ఐనా ఇబున్ బట్టుటా. అనేక దేశాలు తిరిగాను."

"మా దేశం ఎలా ఉంది?"

"కొన్ని బాధపడవలసినవి, కొన్ని సంతోషించవలసినవి రెండూ ఉన్నాయి"

"సంతోషపడే విషయాలు వదిలెయ్యండి. బాధపడ్డ విశేషాలేమున్నాయో చెప్పండి?"

"సతీ సహగమనం చాలా అన్యాయం భయ్యా! ఆడవారిని మొగవారి చితిపై బలవంతంగా దహింపజెయ్యడం చాలా బాధాకరం. ఉత్తర భారతదేశంలో ఒక సంఘటన చూశాను. మూడు రోజులు ఖానా కూడా తినలేకపోయాను"

"ఇంకా.."

"మా ముస్లిం మతం ప్రకారం ఎన్ని షాదీలైనా చేసుకోవచ్చు. కానీ మీ దేశంలో మొగవారు షాదీచేసుకోకుండానే డజన్లకొద్ది ఆడవారితో సంబంధాలు పెట్టుకుంటున్నారు. అది ఒక గొప్పమొగతనంగా భావిస్తున్నారు. మిగతా విషయాల్లో భారతదేశం ఆశియా ఖండంలోనే గొప్పగా ఉంది. కానీ ఈ మధుర సుల్తాను పాలన ఒక్కటే ప్రత్యేకమవడమే విషాదం. అన్నట్టు మీ పరిచయం?

"నేను విజయనగర వాసిని! మీరు అన్ని వందల మైళ్ళనుండి ఇక్కడకు వచ్చారా? కారణం?" గుర్రాన్ని దిగి నడవసాగాడు.

"యా. అల్లాహ్! ఎంత మంచి రాజులు మీ విజయనగర రాజులు!" అని నిట్టూర్చి బట్టుటా కూడా గుర్రాన్ని దిగి నడుస్తూ చెప్పసాగాడు. "నేను పుట్టిన స్థలం టాంజియర్, నాకు దేశాలు అన్నీ సందర్శించలని ఉన్న

కోరిక వల్ల ఈ భారతదేశానికి వచ్చాను. గత ఇరవై సంవత్సరాల క్రితం హజ్ తీర్థయాత్ర కోసం మొదటిసారి మొరాకో నుండి బయలుదేరిన నేను ఈజిప్ట్, అరేబియా, ఇరాన్, సిరియా, క్రిమియాలను సందర్శించి, వోల్గాకు చేరుకుని, గోల్డెన్ హోర్డ్లో కొంతకాలం నివసించాను. ఆ తర్వాత మధ్య ఆసియా మరియు ఆఫ్ఘనిస్తాన్ మీదుగా భారతదేశానికి చేరుకున్నాను. నేను "రిహ్లా" అనే యాత్రా గ్రంధాన్ని వ్రాస్తున్నాను. నా ప్రయాణాలలో సేకరించిన ముస్లిం ప్రపంచం గురించి సమాచారాన్ని ఒక గ్రంధంగా లిఖించి మా మొరాకో చక్రవర్తికి కానుకగా ఇవ్వాలనుకుంటున్నాను. ఈ ఇరవై సంవత్సరాలలో సుమారు 45 వేల మైళ్ళు ప్రయాణించాను. ఇస్లామిక్ రాజ్యాలన్నిటిని చూశాను. ఇక్కడి మధుర సుల్తాను వంశానికి చెందిన ఒక ముస్లిం కన్యను తొందరపడి వివాహం చేసుకున్నాను. త్వరలో సింహళదేశాన్ని దర్శించి, తిరుగు ప్రయాణంలో ఇండోనేషియా, చైనాలను కూడా చూసి మా దేశం వెళ్ళిపోవాలనుకుంటున్నాను. ప్రపంచంలో ఏ ముస్లిం రాజ్యంలో లేని భయంకర వాతావరణం ఈ మధుర సుల్తాన్ పాలనలోనే చూశాను" అంటూ ఉండగా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. కళ్ళనీళు ్ళ తుడుచుకోవడం ప్రారంభించాడు.

గోపన్న అతణ్ణి "హయ్యో! ఏమైంది? వివరంగా చెప్పండి!" అన్నాడు. బట్టుటా రెండు నిముషాలు మౌనం వహించాడు. చాలా ఆవేదనతో ఉన్నాడన్న విషయం తెలుస్తున్నది. ఇద్దరూ గుర్రాలను చెట్టుకు కట్టి ఒక చెట్టు నీడన ఉన్న ఒక పెద్ద బండపై కూర్చున్నారు. బట్టుటా మళ్ళీ ఒకసారి కళ్ళుతుడుచుకుని ఇలా చెప్పడం ప్రారంభించాడు "ఇస్లాం చరిత్ర ప్రకారం ఆదమ్ అలైహిస్సలామ్ తొలి మానవుడిగా ఆవిర్భవించినట్లుగా ఉంది.

అతన్నే ఇస్లాంలో తొలి ప్రవక్తగా సంభోదిస్తారు. దేవుని సందేశాన్ని తన సంతానానికి బోధించినట్లు ఇస్లాం చరిత్ర గ్రంధాలు తెలియజేస్తున్నాయి. ఆ తరువాత నూహ్ అలైహిస్సలామ్ ...ఇబ్రహీం అలైహిస్సలామ్, మూసా అలైహిస్సలామ్, ఇసా అలైహిస్సలామ్, ఇలా అనేకమంది ప్రవక్తలు వివిధ కాలాల్లో జన్మించి, గతి తప్పుతున్న మానవ సమాజానికి హిత బోధ చేశారు. అయితే చిట్టచివరిగా జన్మించింది మహమ్మద్ ప్రవక్త. ఈ దివ్యవచనాలలో సజ్జనత్వం, నైతికత మరియు దైవభీతి గురించి చక్కని వివరణ ఇవ్వబడింది. శ్రేయస్కరమైన నిబంధనలకు అతడు విధేయత చూపాలి కానీ, అతడు తన దృష్టిని దైవభీతిపై మరియు తోటి మానవుడిని ప్రేమించడంపై కేంద్రీకరించాలి. అందులో నాలుగు శిరస్సులు ఇవ్వబడినాయి. ఒకటి, మన విశ్వాసం నిజమైనది మరియు నిష్కపటమైనదై ఉండాలి రెండు, తోటి మానవులకు దానధర్మాలు చేయడం, తోడ్పడటం ద్వారా అది ఇతరులకు కనబడేలా మనం ప్రయత్నించాలి కానీ అది కీర్తిప్రతిష్ఠల కొరకు అవకూడదు. మూడవది, తప్పకుండా అందరూ మంచి పౌరులుగా మారాలి మరియు సామాజిక సంస్థలకు సహాయపడాలి. నాల్గవది, అన్ని పరిస్థితులలోనూ మన స్వంత మనస్సు దృఢంగా, నిశ్చలంగా ఉండటం తప్పనిసరి. ఏ పనైనా మంచిదా లేక చెడ్డదా అనే విషయంపై తీర్పునిచ్చే మరియు వర్గీకరించే కొలమానం ఇదే. ఇది ఒక కేంద్రబిందువును ఏర్పరచగా, మొత్తం నైతిక వ్యవస్థంతా దాని చుట్టూ పరిభ్రమిస్తుంది. ఇస్లాం ధర్మం నైతిక ప్రవర్తన గురించి ఏదైనా ఆదేశం వెలువడక ముందు, అది మానవుడి హృదయంలో స్థిరంగా నాటుకు పోవాలని కోరుకుంటుంది. తద్వారా అతని లావాదేవీలు, ఆచారవ్యవహారాలు అన్ని వేళలా, అన్ని

చోట్లా అతడిని చూస్తూ ఉండే ఆ దేవుడి వద్ద ఉంటాయి. అతడు ప్రపంచం మొత్తం నుండి దాక్కోవచ్చేమో గానీ ఆ దేవుడి నుండి అతడు ఏమాత్రం దాక్కోలేడు. ఎవరినైనా అతడువంచించగలడేమో గానీ ఆ దేవుడిని మాత్రం వంచించలేడు. ఇవన్నీ తెలిసి కూడా మధుర సుల్తాను ఎందుకు హిందువుల పట్ల ఇలా అన్యాయంగా ఉంటున్నాడో అర్థం కాలేదు. ఏ ముస్లిం దేశంలోను లేని అకృత్యాలు ఇక్కడ జరుగుతున్నాయి. ఈ భారతదేశంలో ఉన్న ముసల్మానులు, మరీ ముఖ్యంగా మధురసుల్తానుతప్ప మిగతాదేశాలలో ఎంతో కొంత మంచిగానే పాలన జరుగుతున్నది.”

“ఎలాంటి వాతావరణం ఉంది అక్కడ? దయచేసి చెప్పండి! నేను మధుర దేశ పౌరుణ్ణి కాదు. మీకు ఎలాంటి సమస్యా రాదు” అన్న గోపన్న మాటలకు తేరుకుని కొనసాగించాడు. “ఆ పాలన భయంకరమైనది. శత్రువుకు కూడా రాకూడదు. మీరు నమ్మే నరకం కన్నా ఘోరమైన వాతావరణం. మీ యమధర్మరాజు కూడా అలా శిక్షించకపోవచ్చు. మధురలో అడవులు, పొదలు ఎక్కువగా ఉన్నాయి. అక్కడి హిందువులనంతా ఆ అడవుల్లో బంధించి ఉంచాడు సుల్తాను. అక్కడ వారి వారి భార్యా పిల్లలను కూడా బంధించాడు. మతం మారమని చిత్రహింసలు పెడుతున్నాడు. ఆ పొదల చుట్టూ నాలుగువేపులా నాలుగు పెద్ద పెద్ద బలిష్టమైన ఇనుపలోహ తలుపులను పెట్టించాడు. రాత్రివేళల్లో పటిష్టమైన కాపలా ఉంటుంది. ఒక్కోరోజు కొంతమందిని తెల్లవారగానే ముస్లిం సైనికులు చుట్టుముట్టి మొదట భార్యల తలలను నరికివేస్తారు. ఆ తరువాత పిల్లల తలలను, చివరకు మొగవారి తలలు బంతుల్లా నేలరాల్తాయి. మతం మారనని మరీ మొండికేసిన వారి బిడ్డలను పైకి ఎగురవేసి క్రింద కత్తిపెట్టి రెండు

ముక్కలయి నేలబడేట్టు చేసి పైశాచికానందం అనుభవిస్తున్నారు. ఇలా కొన్ని వందల, వేల మంది తలలు నేలరాలుతున్నాయి. ఇక్కడ దేవుడిలా పూజింపబడే బ్రాహ్మణులను సైతం ఊచకోత కోయిస్తున్నాడు. కేవలం మతం మార్పిడి కోసం ఇన్ని వందల, వేల మంది ప్రాణాలు బలితీసుకోవడమనే అసహ్యకరమైన అలవాటు ఈ మధుర సుల్తాన్ మాత్రమే చేస్తున్నాడు. అంతే కాదు. అక్కడి వయసులో ఉన్న హిందూ స్త్రీలను చెరపట్టి బలవంతంగా లొంగదీసుకుంటున్నాడు. రోజుకొక అమ్మాయితో కాలక్షేపం చేస్తున్నాడు. అతణ్ణి ఆ అల్లాహ్ తప్పక శిక్షించి తీరుతాడు. హిందువులను వంచించగలడేమో కానీ అల్లాహ్ నుండి తప్పించుకోవడం సాధ్యం కాదు. హిందువుల తలలను అతడు త్రుంచినట్టే అతని తలకూడా ఒక రోజు నేలరాలుతుంది. అల్లాహ్ ఈ పాటికే అతన్ని శిక్షించేందుకు ఒకణ్ణి తప్పక పుట్టించే ఉంటాడు."

గోపన్నరక్తం ఉడికిపోయింది. నరాలుఉబ్బి పైకికనిపించ సాగాయి. మొహం ఎర్రబడింది. భయంకరంగా హూ! అని అరిచి "నరహంతక సుల్తాన్! నీకు వినాశనం దాపురించింది. నీ తల నేలరాల్చేవాడిని నేనే! నీకోసమే పుట్టాను. అతి త్వరలో అది జరుగుతుంది!" అంటూ లేచి అప్పటివరకూ కూర్చునిఉన్న పెద్దబండ మధ్యలోగట్టిగా ఒక్కటే ఒక్క పిడిగుద్దు గుద్దాడు. అంతే! అంత పెద్ద బండా రెండు ముక్కలై విరిగిపోయింది! ఇబున్ బట్టుటా కూర్చుని ఉన్న ముక్క ఒరిగి క్రింద పడడంతో భయంతో పైకి లేచి వంగి "సలామాలేకుం! ఎవరు మీరు? ఎవరో ముసలి బాటసారి అనుకున్నాను. అందువల్లనే నా మనోగతం గుట్టు విప్పాను. మీరు ముసలివారు కాదు. మీరెవరు చెప్పండి? నాకేమీ అపాయం లేదు కదా!"

అన్నాడు వణికిపోతూ.

"నాపేరు గోపన్న. విజయనగర వాసిని. ప్రస్తుతం మీరు ప్రయాణిస్తున్న ఈ నారాయణపురానికి సైనికాధికారిని! కంపరాయలకు అమాత్యుణ్ణి కూడా! మీరు మంచి మనసు కలవారు. మీరు దయచేసి వీలైనంత త్వరగా ఈ దేశం విడిచిపెట్టి వెళ్ళండి. త్వరలో మీరు మీ దేశంచేరే లోపు మధుర సుల్తాన్ తల నేలరాలుతుంది. చావు కబురు వింటారు. ఈ విషయం కూడా మీ రిహ్లాలో లిఖించండి." అని గుర్రమెక్కి వెళ్ళిపోయాడు. ఇబున్ బట్టుటా గోపన్న వెళ్ళిన వైపే అలా చూస్తూ "అల్లాహ్ ఉన్నాడు! అన్నీ చూస్తాడు" అంటూ రెండు చేతులూ దోసిలిపట్టి పైకెత్తి ఆకాశంకేసి చూస్తూ ఉండిపోయాడు.

అప్పటికి సమయం ఉదయం తొమ్మిది గంటలయింది. గోపన్న ఒకసారి దైవ దర్శనం చేసుకుని, తన విన్నపం చెప్పుకోవాలని వీలైనంత తొందరలో ఆ మధుర సుల్తాన్ ను దునుమాడే శక్తి యుక్తులు ప్రసాదించమని ప్రార్థించడానికి బయలుదేరాడు.

దారిలో మరలా చెలికత్తెలతో కుముదశ్రీ గుడికి బయలుదేరడం గమనించి నిదానంగా వారిని గుర్రాన్ని మెల్లిగా నడిపిస్తూ అనుసరించాడు. "కుముదా! వెనక్కు చూడవే ఒకసారి! ఎవరో ముసలాడు. గుర్రంపై మనలను అనుసరిస్తూ వస్తున్నాడు. నిన్నే చూస్తున్నాడు. ముసలాళ్ళు కూడా నిన్ను చూస్తే కళ్ళు తిప్పుకోలేక పోతున్నారే! హా.. ఏమి అందం సుందరీ నీది!" అంటూ హాస్య మాడింది. వెనక్కి తిరిగిచూసిన కుముద నుదుట తిరునామం, తలగుడ్డా చూసి " ఛీ! ఊరుకోవే! ఎవరో వేదాంతి. లేకపోతే హరిదాసో

అయి ఉంటాడే!" అనింది.

"హరిదాసో...లేక నీ ప్రేమదాసో ఎవరికి తెలుసు తల్లీ.. గుడిలో మేం విచారణ చేసి తేలుస్తాము. పద!" అన్నారు.

"ఛీ..ఊరుకోవే! వాడు వింటాడు"

గోపన్న దగ్గరలో ఉన్న ఒక అరుగుపై కూర్చుని ధ్యానం చేస్తున్నట్టు నటించసాగాడు. ఇంతలో దైవ దర్శనం చేసుకుని కుముదశ్రీ బృందం అక్కడకు వచ్చి అందరూ గోపన్న ముందు కూర్చున్నారు. గోపన్న ఓరకంట ఇదంతా గమనిస్తున్నాడు. వాళ్ళు అందరూ ఆశీనులవగానే కళ్ళు తెరిచి "నారాయణ! నారాయణ! ఎవరమ్మా మీరు?" అని ఏమీ తెలియనట్టు ప్రశ్నించాడు.

"మా బాబాయి ఇక్కడ పూజారి. దైవ దర్శనం కోసం వచ్చాము" అన్న కుముదశ్రీ మాటలు విని "శ్రీఘ్రమేవ కల్యాణ ప్రాప్తిరస్తు!" అన్నాడు ఆశీర్వదిస్తూ.

"స్వామీ! మా కుముదశ్రీకి కాబోయే భర్త గురించి తెలుసుకోవాలని మాకు ఆతృతగా ఉన్నది" ఒక చెలికత్తె అన్నది.

"సహజమే కదా! బాలా! ఇలా రా! ఇటు కూర్చో! అరచేయి చూపించు" అన్నాడు.

సిగ్గుతొ బుగ్గలెర్రబడి ఏం మాట్లాడకుండా కూర్చునే సరికి "రా బాలా సిగ్గు పడకు! నీకు ఎన్నో విషయాలు చెప్పాలి రా!" అన్న మాటకు చెలికత్తెలు ఆమెను బలవంతంగా గోపన్న ముందు కూర్చుండబెట్టారు. గోపన్న ఆమె కుడి చేయిని పట్టుకోగానే చిగురుటాకులా వణికింది. అదే మొదటిసారి పరపురుషుని స్పర్శ తగలడం. చెలికత్తె స్వామీ "కుడి చేయి

చూస్తారా!" అన్నది.

గోపన్న "హుష్! అరవకండి! అంటూ కుముద చెయ్యి నిమురుతూ "భవిష్యత్తు కుడి చేతిలో కనిపిస్తుంది, గతం ఎడమ చేతిలో కనిపిస్తుంది. ఎడమ చేయి అనేది మనతో పాటు పుట్టింది మరియు కుడి చేయి మనం తయారు చేసుకున్నది. "పురుషులకు కుడి చేతిని పరీక్షిస్తారు. కానీ మహిళలకు ఎడమ చేతిని పరీక్షిస్తారని శాస్త్రంలో ఉన్నా సహజ జ్ఞానమూ, అనుభవంతో మాత్రమే ఉత్తమమైన చేయిని గుర్తించడం సాధ్యమవుతుంది. ఎడమ చేయి అంతర్గత వ్యక్తి, సహజ ఆత్మ, అహం మరియు పార్శ్విక ఆలోచనను ప్రతిబింబిస్తుంది. కుడి చేయి బాహ్య వ్యక్తి, వాస్తవిక నిజాలు, సామాజిక పరిస్థితులచే ప్రభావం, విద్య మరియు అనుభవాలను ప్రతిబింబిస్తుంది. ఇది దీర్ఘ ఆలోచనను సూచిస్తుంది. మీరు మాట్లాడకుండా ఉండండి కాసేపు" అన్నాడు బొటనవేలితో అరచేయిపై సుతారంగా నిమురుతూ... కుముదకు వళ్ళంతా ఏదో లాగా అయిపోతోంది. వదనం పై చిరు చెమటలు పట్టాయి.

"బాలా! భయమేల? ఈ గోపాలకృష్ణస్వామి భూత భవిష్యత్ వర్తమాన కాలాలను చెప్పగలడు. విను పదిరోజుల క్రితం ఒక బాలకుణ్ణి ఇదే ఆలయంలో చూసి మనసు పారేసుకున్నావు కదూ!" అనగానే ఉలిక్కిపడి చూసింది.

"అవునా మరి! ఆ బాలుడూ నీ మీద మనసు పడ్డాడు. వైష్ణవ కుటుంబీకుడు. వేదాంత దేశికాచార్యుల శిష్యుడు. అందగాడు. పేరు గోపన! ఈ నారాయణపురానికి కంపరాయలవారు నియమించిన అధిపతి. అతడు వేద వేదాంగాలే కాదు. యుద్ధ విద్యలూ నేర్చాడు. నీకు సరిజోడు.

ఆ పైన నీ ఇష్టం" అంటూ చటుక్కున చూపుడు వేలితో ఆమె నుదుటనున్న స్వేదాన్ని సుతారంగా తుడిచాడు.
"స్వామీ!" అని ఒక అంగుళం వెనక్కు జరిగింది.
"భయపడకు బాలా! గోపాలకృష్ణ స్వామి ఎరుగని వారు లేరు ఈ ప్రాంతంలో."

"స్వామీ! మరి గోపనకు ఈ విషయం ఎలా తెలియజేయాలి?" అన్న ఒక అమ్మాయి మాటలకు నవ్వి.."నేను చెప్పేది శ్రద్ధగా వినండి. పదిహేను రోజులలో అణివార పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని శుద్ధి చేయడంతో పాటు ఆలయంలో స్వామివారికి ఉదయం ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించబోతున్నారు. ఆరోజు గోపన తప్పక వస్తాడు. కుముదినిచేత లేఖ వ్రాయించి మీలో ఒకరు గోపనకు అందజేయండి చాలు. మిగతా వ్యవహారాలన్నీ ఆయనే చూసుకుంటాడు" అనగానే వారు "గోపనా?" అన్న ప్రశ్నకు కాదు కాదు "గోవిందుడు" అని ఆలయాన్ని చూపిస్తూ చిరునవ్వుతో అన్నాడు. కుముదిని వెంటనే లేచి నిలబడింది. "బాలా! మరి సెలవా!" అనగా తలవంచుకుని సిగ్గుతో నిలబడిపోయింది.

ఒకనాడు గోపన్న కంపరాయుని దర్శనం కోసం విజయనగరం చేరుకోవాలని గుర్రంపై బయలుదేరాడు. విజయనగరం చుట్టూ సప్తప్రాకారాలు. వెలుపలి ప్రాకారము వలయాకారముగా ఉండే చిన్న చిన్న పర్వతాల సమూహంతో ఏర్పడ్డది. పర్వతాల మధ్య రాతి గోడలతో పూడ్చి దుర్భేద్యంగా చేశారు. దక్షిణాన రామదుర్గం వద్ద అలాంటి రాతి గుట్టలే

దర్శనమిస్తాయి. ఉత్తరాన తుంగభద్రానది కొన్ని పర్వతమాలికలు ఉన్నాయి. దక్షిణ దిక్కులో నదీ ప్రవాహం లేకపోవడం వల్ల అక్కడ ఒక కోట కట్టి దాన్ని పర్వతాలతో కలిపారు. ఆకోటపై అనేక బురుజులున్నాయి. ఆ బురుజులపై సదా రక్షక భటులు కాపలా ఉంటారు. నైరుతి దిక్కున ఒక పెద్ద విశాలమైన చెరువున్నది. శిలానిర్మితమైన ఆ చెరువు అరక్రోసు వెడల్పు ఉండి, నాలుగు చదరపు మైళ్ళ వైశాల్యంతో ఉంది. అక్కడ అన్ని కాలాల్లో నిండుగా నీళ్ళుంటాయి.

ఆ చెరువు కట్టమీద వస్తున్న గోపన్నకు ముందు ఒక ఫర్లాంగు దూరంలో పదిమంది ఎవరో బాటసారులు చిన్నగా అడుగులు వేస్తున్నారు. వారి మొహాలు వడలిపోయి ఉన్నాయి. వారు కట్టపక్కగా ఉన్న మెట్లను దిగి దక్షిణపు కోట గుమ్మం చేరుకున్నారు. గోపన్న వారిని పరిశీలిస్తూ ముందుకు సాగిపోయాడు.

వారు కోటగుమ్మం దాటబోతుండగా రక్షక భటులు వారిని నిలువరించారు. "మీ వేషములు విచిత్రముగా ఉన్నాయి" అంటూ మీరు ఇటు ఆంధ్రా ప్రాంతము వారునూ కాదు. అటు కర్ణాటక ప్రాంతం వారూ కాదు. చూడబోతే ద్రావిడులవలే నున్నారు. నడుముల చుట్టూ పెద్ద వస్త్రాన్ని అడ్డంగా కట్టుకున్నారు. భుజాల మీద నీరుకావి యంచు ఉత్తరీయాలున్నాయి. వారి జుట్లు తలలపై అర్ధ భాగము వరకే ఉన్నాయి. వెనుక జడలాంటి జుట్టును ముడివేశారు. ఒకరిద్దరు తలపాగాలు ధరించి ఉన్నారు. మొహములపై ఊర్ధ్వ పుండ్రములు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ద్రావిడ దేశస్తులని పసిగట్టిన భటులు పరీక్షగా చూస్తున్నారు. ఎందుకంటే ద్రావిడ రాజు సాంబువరాయలు ఒక ఆటవిక రాజు. ఆతడు మధురను

పాలిస్తున్న సుల్తానుకు సదా కొమ్ము కాస్తుంటాడు. మరొక వంక బహమనీ సుల్తానులు. వారితో యుద్ధం ఎప్పుడైనా రావచ్చున్నట్లు పరిస్థితులున్నాయి. గూఢచారులు మారువేషములలో ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి. దుర్గ రక్షణాధికారి అనంత సాగరామాత్యుడు తెలియని వారిని లోనకు రానివ్వ వద్దని హుకుం జారీ చేసి యున్నాడు.

"ఎవరు మీరంతా! చెప్పండి" అని రక్షక భటులు శూలాలు అడ్డుపెట్టి నిలబడ్డారు.

"మేము ద్రావిడులం"

"ప్రాంతం సరే! తెలుస్తూనే ఉంది. మీ ఊరు ఏది?" గద్దించారు.

"అన్ని ఊరులూ మావే! మా ఊరిలో లేనప్పుడు ఏ ఊరైననేమి చెప్పండి? నీవు లోనకు పంపినచో ఇదే మావూరగును. దయచేసి లోనకు పంపమని మా విన్నపం!"

"సరే! సరే! మీరు ఇంతకు ముందు ఉన్న పేరైనా చెప్పండి" అన్నారు బతిమాలాడుకుంటున్నారన్న ఆనందంతో

"మాది శ్రీరంగము. శ్రీరంగనాథుని సేవలో ఉన్న వారము. విధి వక్రించి వీధులపాలైతిమి"

"మీది శ్రీరంగమా!" అని నవ్వి "మీ ఆకారాలు చూసే అనుకున్నానులే!" అన్నాడు.

"ఎంత రక్షకభటుడవైనా మా పై చిన్న చూపు తగునా? మా ఊర్ధ్వ పుండ్రములు, శిఖలు చూసి నవ్వుట తగునా? రంగ రంగ! ఎంత లోకువైతిమి? ప్రభువులను దర్శించుకుంటాము దయచేసి లోనకు పంపండి" రాజ భటులాలోచించారు. వీరు నగరప్రవేశము చేసి రాజ దర్శనము

సమయములో తమ గురించి దైవ భక్తుల గురించి చులకనగా మాట్లాడినామని తెలిసినచో మొదట తన ఉద్యోగమూడును. తరువాయి కారాగృహములో పడవేసిననూ పడవేయవచ్చును. బుక్కరాయలు అన్ని మతములను సమానముగా చూడవలెనని చెప్పియున్నాడు. పరమత సహనము విజయనగర సిద్ధాంతమని పలు సార్లు చెప్పి యున్నాడు. అని అలోచించి, లోని బింకమును దాచుకొని "సరే! లోనకు వెళ్ళండి!" అని శూలాలు అడ్డు తీశారు.

లోనకు ఆశగా లోనకు పోవుచుండగా మరొక భటుడు "ఆగండి! నగర ప్రవేశ రుసుము చెల్లించి పోవలెను అనగానే నివ్వెరపడినవారు. "హయ్యో! శ్రీరంగనాథా ఎన్ని ఇక్కట్ల పాలవుచుంటిమి. అని ఆలోచించి పంచెల మాటున లోపలికి దోపిన చిన్న మూటలను బయటకు దీసి కొన్ని వారికి సమర్పించగా వారు "ఇవి మధుర సుల్తాను ముద్రలతో నున్నవి. ఇక్కడ చెల్లవు. అటుప్రక్కగా టంకశాల యున్నది. అచటికి వెళ్ళి వీటిని మార్పిడి చేయించి తీసుకుని రండి." అనగానే వారు టంకశాలలో అధికారిని బ్రతిమాలి వారి పరిస్థితిని విన్నవించగా అతడు వాటిని కరిగించి శుద్ధ బంగారాన్ని వేరుచేసి ధర్మ తూకము వేసి వారికి సమానమైన బంగారమునివ్వగా ఎంతో సంతోషపడ్డారు. వారికి వెంటనే తాళపత్రాలపై అనుమతి పత్రాలను వ్రాసి ఇవ్వగా వారు "రంగ రంగా! యనుచు ప్రధమ ప్రాకారము దాటిలోనకు ప్రవేశించారు.

వారు ప్రథమ ప్రాకారము దాటగానే వారికి వివిధ ఫలపుష్పభరితమైన వృక్షాలు కనిపించాయి. దూరంగా వరి పొలాలు. ఫలపుష్పాలతో వంగిన వృక్షాలు నిండు గర్భిణులవలె ఉన్నాయి. పూల

చెట్లు ఒకే వరుసలో రంగు రంగుల తోరణాలు కట్టినట్లు కనిపిస్తున్నాయి. బారులు తీరిన తోటలు. దూరంగా మామిడి, అశోక, నిమ్మ, ఉసిరి, సపోటా, అరటి వృక్షాలు హృద్యంగా కనిపించాయి. ఆకలితో నకనకలాడే వారికి పండ్ల చెట్లను చూడడంతో సగం కడుపులు నిండినట్లైంది. రైతులు ఏతముల నుండి నీటిని తోటలకు ప్రవహింపజేస్తున్నారు. కొందరు చిన్న బావులనుండి నీటిని చేదల ద్వారా తోడి పొలాలకు పారిస్తున్నారు. అరేబియా దేశం నుండి వచ్చిన వివిధ రకాలైన గులాబీ మొక్కలు ఆహ్లాదాన్నిస్తున్నాయి. ఆ ఆరామాల్లో చిన్న చిన్న పొదరిళ్ళు. యువతీ యువకుల సయ్యాటలు..చిలిపి చేష్టలను చూసి నవ్వుకుంటూ ముందుకు సాగారు.

రెండవ ప్రాకారం చేసేసరికి పెద్ద ద్వారం దాని ముందు రక్షభటులబృందం తారస పడింది. వారు నిశితంగా చూస్తూ "అనుమతి పత్రములేవి?" అని ప్రశ్నించారు. అనుమతి పత్రములు చూపగానే ఎక్కువ తిప్పట లేకుండా "లోనకు వెళ్ళండి" అన్నారు. బృందం చాలాసేపు అక్కడి ప్రధానద్వార శిల్పకళా సౌందర్యం తిలకిస్తూ ఆశ్చర్యం అనుభవించారు. మూడవ ప్రాకారం వేపు అడుగులేస్తూ అక్కడి కేదారాలను, ఆరామ శోభను తిలకించి తన్మయులైనారు.

చిన్నగా అడుగులో అడుగులేస్తూ మూడవ ప్రాకారం చేరే సరికి బారెడు పొద్దెక్కింది. అనుమతి పత్రములు వారికి చూపించి మూడవ ద్వారం దాటే సరికి అంగళ్ళు, వివిధాకృతులలో ఉన్న గృహాలు కనిపించాయి. అక్కడి నుండి రాచబాట స్పష్టంగా కనిపిస్తోంది. బాటకు అటూ ఇటూ పెద్ద పెద్ద నీడనిచ్చే మహా వృక్షాలున్నాయి. దాని కొంచెం వెనుకు అనేక అంగళ్ళు కనిపించాయి. అంగళ్ళను, తినుబండారాలను, అందమైన

గృహాలను చూడ్డగానే వారికి ఆకలి రెట్టింపైనది. ఇచట భోజనము చేసి కానీ కదలలేమని నిశ్చయించుకొని వారు పది మంది సైగలతో రెండు గుంపులుగా విడిపోయారు. ఒక బృందము ఏవో మంత్రములు వినపడుతున్న ఇంటివైపు వెళ్ళి నమస్కరించి "మహాను భావా! కొంచెం మా మొర వినండి" అనగానే యజమాని సద్బ్రాహ్మణుని వలెనున్నాడు. "అయ్యా! లోనకు దయచేయండి" అని ఆ బృందాన్ని ఆహ్వానించి వారికి షడ్రుచోపేతమైన భోజనం వడ్డింప జేసి "అభ్యాగత్సః స్వయం విష్ణు" అని కీర్తించి విసనకర్రలతో విసరి వారిని విశ్రమింపజేశారు.

వేరొక బృందం ఊర్ధ్వపూండ్రములచే అలకరింపబడిన గృహంలో ప్రవేసించి తమ క్షుద్బాధను తీర్చుకున్నారు. ఆయాసపడుచూ వారిని బహుధా కీర్తిస్తూ మరలా అందరూ బయట కలుసుకుని వారి వారి అనుభవాలను చెప్పుకున్నారు. అంతే కాదు గృహస్తుల ద్వారా నగర మర్యాదలు, పాటింప వలసిన నియమాలు క్షుణ్ణంగా తెలుసుకుని ఒకరి కొకరు ఆ విషయాలను చెప్పుకున్నారు. వారు తమందరమూ అదృష్టవంతులని, విజయనగర సామ్రాజ్యమునకు అందరూ ఎందుకు వలసలు పోతారో తెలిసినదని, తమకు దక్కిన భోజనము గురించి వర్ణనచేసి చెప్పుకుని, దక్షిణ తాంబూలాదులు ప్రశంసించుకొన్నారు. తాంబూలములో పచ్చకర్పూరము, పునుగు, జాజికాయ, జాపత్రి, కుంకుమపువ్వు, ఏలకులు వేసుకొనుటకు వారి గృహములలో ఉన్న దంతపు భరిణెలు, వెండి భరిణెలు, పంచలోహ పాత్రలు, ముత్తెపు పాత్రలు. అవన్నీ దాచుకొనుటకు రత్న మంజూషలను తలుచుకొని వారి భోగమే భోగము అని మెచ్చుకున్నారు. అలా ప్రాకారాలన్నీ దాటుకుంటూ వింతలు విశేషాలు పరికిస్తూ భుక్తాయాసం మధ్య మధ్యలో

తీర్చుకుంటూ ఏడవ ప్రాకారం చేరారు.

అచ్చట పరిస్థితులు గమనిస్తే అంత సులభంగా వారు లోపలికి పంపేట్టు కనపడ్డంలేదు. విదేశీయులంటే నఖశిఖ పర్యంతం పరీక్ష చేస్తున్నారు. ఆయుధాలు వున్నవా? అని వెదుకుతున్నారు. అనుమతి పత్రాలున్నప్పటికి, రాచనగరులో ఎవరైనా తెలిసినవారు, బంధువులు ఉంటేనే లోనకు ప్రవేశం అన్నట్టు ప్రవర్తిస్తున్నారు.

"మేము ఈ ప్రాంతానికి క్రొత్త వాళ్ళం. మాకెవరునూ తెలియదు. అనుమతిపత్రాలు చూసి మమ్మలను లోనకు వదలండి" అని వేడుకున్నారు. "మీ వద్ద ఆయుధములేమీ లేకున్ననూ మీ తెలివి తేటలే మీ ఆయుధములు. రాచనగరులో ప్రవేశించి రహస్యములు తెలుసుకొని ముసల్మానులకు అమ్మేవారిలా వున్నారు" అని చెప్పి శూలాలను అడ్డుపెట్టి నిల్చున్నారు. కానీ వచ్చిపోయే బండ్లు, శకటాలు, అశ్వికులు, ఏనుగులు, పల్లకీలు నిరంతరం వచ్చిపోతూనే ఉన్నవి. ఇదంతా చూసిన కొందరికి గతంలో పాండ్యరాజుల పాలనలో తమ మధురా నగరము శ్రీరంగములను తలుచుకొని అశృవులు వస్తున్నాయి.

మరొకసారి విన్నపము చేయమని పెద్దాయన మాటమీద ఒక యువకుడు ఇలా అన్నాడు "అయ్యా! మేము దొంగలమో, గూఢచారులమో కాదు. యాత్రకై వచ్చి ప్రభువుల వారి దర్శనం కోసం వచ్చాము. ఇంత పెద్ద నగరులో ఈ వైష్ణవ బ్రాహ్మణులే మీకు దొంగలవలే కనిపిస్తున్నారా? మేమును ఒకప్పుడు సప్తప్రాకార నిర్మితమైన శ్రీరంగంలో నివసించేవాళ్ళం.. విధి వక్రించి మా శ్రీరంగనాథుడే అనాధయై ఎక్కడెక్కడో అగచాట్లకు లోనై ఉన్నాడు. ఆ రంగనికే నీడలేదు మా భక్తులకు అదే గతి పట్టినది. ఈ

దురవస్త శతృవుకు గూడా రాకూడదు. రంగ..రంగా" అని చేతులెత్తి మ్రొక్కాడు.

ఇదంతా ప్రాకారం ప్రక్కన ఒక అశ్వికునితో మాట్లాడుతున్న గోపన్న విన్నాడు. వెంటనే ఈ గొడవ ఏమిటని రక్షక భటులను ప్రశ్నించాడు. వారు చెప్పినది విని "సరే! వీరికి నేను పూచీగా ఉంటాను. లోనకు అనుమతించండి" అన్న గోపన్న మాటలు విని, మరు మాట్లాడకుండా వెంటనే వారికి లోనకు ప్రవేశం కలిగించారు.

యాత్రీకులు దారిలో వస్తున్నప్పుడు తమవంకే చూస్తూ వెళ్తున్న గోపన్నను గమనించారు కానీ ఎవరో సాధారణ బాటసారిగా భావించారు. ఇప్పుడు అతణ్ణి దగ్గరగా చూసింతర్వాత ఏ వీరుడో ఏ సైన్యాధికారో అయి ఉంటాడు అనుకున్నారు. లేకపోతే ద్వారపాలకులను ఎలా ఆజ్ఞాపించగలడు? అనుకుంటూ మనసులోనే గోపనకు కృతజ్ఞతలర్పించారు.

వారు ద్వారం దాటగానే ద్వారానికి ఉత్తరంగా రాయలవారి నగరు. ఆ నగరుకు చక్కని రాచబాట, ఆ బాటలో దగ్గరలో విరూపాక్షస్వామి ఆలయం. నాలుగు రాచవీధులు. నాలుగు రాచబాటల చివర ఎత్తైన తోరణాల్లాంటి గోపురాలు కనుపించి కనువిందు చేశాయి. గోపన వారినందరిని అచటనున్న ఒక మండపంలో సమావేశపరచి వారికి రాచనగరులోని విశేషాలు, అచట చూడవలసిన గుడులు, గోపురాలు, వింతలు విశేషాలు అన్నీ చెప్పాడు. వారు దగ్గరలో విరూపాక్షస్వామి ఆలయ దర్శనం చేసుకున్న అనంతరం వారికి ఆలయ అధికారితో మాట్లాడి కడుపు నిండా ప్రసాదాలను పెట్టించాడు. వారు తిని ఒక మండపంలో భుక్తాయాసము తీర్చుకొనుచుండగా గోపన్న వారి దగ్గరికి వచ్చి వారి

విషయాలను వివరించవలసినదిగా అడిగాడు.

వారిలో ఒక వృద్ధుడు కన్నీరు పెట్టుకుంటూ ఇలా "అయ్యా! మేము శ్రీరంగవాసులము. మాకు శ్రీరంగనాథుడే శరణ్యము అని నమ్మిన వారము. మేమందరము దాదాపు ముప్పై ఐదు సంవత్సరములు పైగా అనేక చోట్ల తిరుగుతూ వున్నాము. శ్రీరంగనాథుడే పరుల పంచలో యుండగా మా కష్టనష్టములెంతవో చెప్పండి?" అని కళ్ళు తుడుచుకొన్నాడు. గోపన వారిని ఆశ్చర్యంతో అలా చూస్తూ ఉండగా వారు వీనికి విషయం కొంత తెలిసే యుండునని ఆగారు. గోపన మీరు కొనసాగించండి అని సైగ చేశాడు. "అయ్యా! అది అక్షయ నామ సంవతసరము. ఇది ప్లవంగ నామ సంవత్సరము కదా! అనగా అంటూ చేతి వేళ్ళతో లెక్కిస్తుండగా గోపన కలిపించుకొని " విషయం చెప్పండి. నేను త్వరగా రాచనగరుకు వెళ్ళాలి." అన్నాడు. "అలాగే బాబూ! అది అక్షయ నామసంవత్సరము. ఫాల్గుణ మాసము. మఖా నక్షత్రయుక్త పౌర్ణమి. స్వామివారికి శ్రీరంగంలో గొప్ప యుత్సవములు జరుగుతున్నాయి. ఆనాడు తెప్ప ఉత్సవము. స్వామివారిని, అమ్మవారిని పెద్ద ఊరేగింపుగా కొల్లడము దాకా పిళ్ళై లోకాచార్యులవారు, వేదాంత దేశికాచార్యులవారు, నంబులు, స్తలత్తారులు, ఆరయర్లు చాలా సంరంభముతో కొనిపోయారు. కొల్లడము ఒడ్డున శ్రీరంగమును జుట్టి ప్రవహించుచున్న నదిని ఉత్తరకావేరీ అని, దక్షిణ ప్రాంతాన్ని కొల్లడమనీ పిలుస్తారు. పెరుమాళ్ళను, అమ్మవారిని పీఠములపై అధిష్టింపజేసి విప్రోత్తములు అభిషేకము జేసి పూజలు ఆరంభించారు. ఇంతలో నొక బ్రాహ్మణుడు రొప్పుతూ పరుగులెత్తుతూ వచ్చి "స్వామీ! మన ఊరిపైకి

పెద్ద యెత్తున యవన సైన్యం దండెత్తి వచ్చుచున్నది. తొండై మండలాన్ని వశం చేసుకున్నారట. వారి చేతికి జిక్కిన ఆడా, మొగా, పిల్లా, జల్లా, బ్రాహ్మణులు వాళ్ళూ వీళ్ళూ అని తేడాలేకుండా అందరినీ ఊచకోత కోస్తూ ధ్వంసం జేస్తున్నారట. సమయవరం దాకా వచ్చారట స్వామీ!" అని బిగ్గరగా ఏడువసాగాడు. అచటి దేశికాచార్యుల వారికి ఏమి చెయ్యాలో పాలుపోలేదు. ఈ సమయంలో ఉత్సవములు జరుపవలెనా? మాని గుడి మూసి వేయవలెనా? అని తేల్చుకోలేక పోతున్నారు. అప్పుడు పెద్దలంతా ఆలోచించి ఒక చీటీపై "జరుపవలెను" అని మరొక చీటీపై "ఆపవలెను" అని వ్రాసి స్వామి ముందుంచారు. అంతలో ఒక పెద్ద గాలిదుమారము వీయగా ఒక చీటీ గాలిలో ఎగిరిపోయినది. స్వామివద్ద నున్న మిగిలిన చీటీని చూడగా "జరుపవలెను" అని ఉన్నది. ఆ విషయము ప్రకటించగానే జనము ఉత్సాహము పెల్లుబికి ఆనందముగా "రంగా! శ్రీరంగనాథా !" అని కేకలు వేశారు. జరుగుచున్న ఉత్సవాలను భక్త్యావేశముగా తిలకించుచుండగా, ఒక గూఢచారి మిక్కిలి రొప్పుతూ నోట నురగలు క్రక్కుతూ "స్వామీ! స్వామీ!" అని అరుస్తూ వచ్చి దేశికుల వారి పాదాలపై పడ్డాడు. స్వామి వానిని లేవదీయగా లేచి బిగ్గరగా ఏడుస్తూ "స్వామీ! యవనులు కన్ననూరుకు చేరుకున్నారు. ఇంక పరిస్థితి చేజారి పోయినట్లే! తీవ్ర వేగంతో శ్రీరంగం చేరుకుంటారు" అని చెప్పి ఏడుస్తూ కూలబడి పోయాడు. అంతా నిశ్శబ్దమై నిలబడ్డారు. ఏమి చేయడానికి పాలుబోని పరిస్థితి. అంటే శ్రీరంగానికి యవనులు కేవలం క్రోసు దూరం కూడా లేదు. వెంటనే లోకాచార్యులవారు, దేశికులవారు మాట్లాడుకొని ఉత్సవములు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ప్రజలంతా విచారవదనాలతో, ప్రాణ భయంతో ఎవరి దారిన వారు

చెల్లాచెదురైపోయారు. ఒక పల్లకీలో పెరుమాళ్ళను, అమ్మవారిని పెట్టుకుని మాలో కొంతమంది లోకాచార్యులవారిని ముందుంచుకుని తిరుకొట్టియూర్ దారిలో పలాయనం చిత్తగించాము. ఆ గొడవలో వేదాంత దేశికులవారు ఎక్కడున్నారో కూడా మేము గమనించలేదు. మేము ప్రయాణిస్తున్న సమయంలో చాలా ఘోరమైన వార్తలను విన్నాము. పెరుమాళ్ళ కోవెలపై యవనసేన నాశనం చేశారని, యువకులను బలిష్ఠులైన సైనికులను కూడా తమ బల్లెములకు బలి తీసుకున్నారని, మా చుట్టపక్కములలో అధిక శాతము వారి చేతుల్లో హతులైనారని కొంతమంది వచ్చి చెప్పారు. మాకందరకూ నీరసం వచ్చి స్పృహ తప్పినట్లైనది. కానీ శ్రీరంగనాథుని మాత్రము విడిచే ప్రసక్తే లేదని అందరం ప్రతిన పూనాము. చివరకు రహదారిలో కాక ఆ దారులలో అనుభవం ఉన్న భక్తుల ద్వారా ఎలాగో తిరుకొట్టియూరు పొలిమేరలకు చేరుకున్నాము. అంతలో ఎవరో యవనులు ఆ సరికి రహదారి ద్వారా తిరుకొట్టియూరు చేరారని ఉప్పందించారు. మేము భయపడి అక్కడనుండి మూడు క్రోసులలో ఉన్న తిరువత్తూరును కూడా దాటి జ్యోతిష్కుడి అనే ప్రాంతానికి ప్రయాణమయ్యాము. విధి వెంటాడింది. ఆ అడవులలో మా జాడ ఎలా కనిపెట్టారో తెలీదు. యవనులకు మా జాడ తెలిసి మమ్మలను చుట్టుముట్టారు. స్వామి వారి బంగారు కవచము, అమ్మవారి ఆభరణములు కొన్ని లాక్కొని, మమ్మలను చిత్ర హింసలు పెట్టారు. కర్రలతో అందరిని రక్తం కారేట్టు బాదారు. ఈ వార్తలు ఇలా ఉండగా శ్రీరంగము వార్తలు మరీ విషాదము. లోకాచార్యులవారి శిష్యులను, బంధువులను ఘోరంగా హింసించారట. అక్కడి బాగున్న కుటుంబము లేదు. దేవాలయమంతా దోచుకుని ధ్వంసము జేశారని ఒక వార్తాహరుడు

వచ్చి చెప్పగా విని లోకాచార్యుల వారు మూర్ఛిల్లారు. వారికి వారం రోజులకు స్పృహ వచ్చి పరిస్థితులను తెలుసుకొని వెంటనే వలవలా దుఃఖించాడు.

ఆ గుంపులోనున్న ధృఢకాయుడు, కోరమీసాలతో, చింతనిప్పులవంటి నేత్రములతో ఒకడు గోపన్నను చూస్తూ “బాబూ! తమరెవరో చాలా మంచివారుగా తోస్తున్నారు. ఈ విలపిస్తున్న వృద్ధుని పేరు వేంకటాచార్యులవారు. ఈయన భార్య బిడ్డలు శ్రీరంగములో ఏమైనారో తెలీదు. వచ్చిన వార్తలను బట్టి బహుశః వధింపబడి ఉన్నారనుకోవచ్చు. వారిని గూర్చి ఎన్నడూ కంటతడికూడా పెట్టలేదు. కానీ లోకాచార్యులన్న మహాప్రీతి వారి విషయం వస్తే మాత్రం అన్నపానాదులు మాని దుఃఖిస్తారు అంటూ అంత పెద్ద వస్తాదు కూడా నీళ్ళు నిండిన కండ్లతో పై పంచతో మొహం తుడుచుకున్నాడు. మరియొకడు “చూశారా బాబూ! ఈ విలపిస్తున్న వస్తాదు పేరు తిప్పన్న. వీరి తాత తండ్రులు ఆదినుండి శ్రీ రంగనాథ పెరుమాళ్ళ సేవలో ఉన్న రజకులు. వీరి తాతగారు స్వయంగా పరిశు భ్రముగా ఉతికిన వస్త్రములు మాత్రమే స్వామికి కట్టబెట్టే ఆచారం ఉంది. వీరి తాతగారన్న ఊరందరికి ఎంతో మర్యాద ఆదరము. బాబూ.. అంటూ ఉండగా కండ్ల వెంట వర్షించిన కన్నీళ్ళు ఆయన అంగవస్త్రంపై బడి తడుస్తూ ఉండగా కళ్ళు తుడుచుకొన్నాడు. ఆగుంపులోని మరొకడు “విషాదమేమిటంటే.. వీరి తాతగారిని క్రూరంగా హింసించారట.” అంటుండగా కంఠం రుద్ధమయింది. గోపన్న ఆశ్చర్యంతో “అదెట్లు జరిగింది. చెప్పండి” అన్నాడు. ఆ గుంపులో నొకడు లేచి “మా బాధలనార్చే వారూ తీర్చే వారెవరూ ఇన్నేళ్ళుగా కనిపించలేదు. అందరూ మా కథలను విని

జాలిపడడమే తప్ప మాకుపయోగపడే వారే లేరు. మాకు చెప్పి చెప్పి నోరు నొప్పి దప్ప" అన్నాడు. ఆ మాటలకు తిప్పన్న కోపంగా "ఇన్నాళ్ళూ ఎవరు ఆరుస్తారని తీరుస్తారని మన బాధలను అందరికి విన్నవించుకున్నాం? మన వంట్లో చీమూ నెత్తురూ ప్రవహిస్తున్నంతవరకూ ఎవరూ తీర్చనక్కరలేదు. కాలం కలిసి వస్తే మనకు మంచిరోజులు రాకపోవు. ఆ శ్రీరంగనాథుని దయ మనకు ఉన్నది. అయినా అడిగిన వారికి అడగనివారికి మన గొడవ చెప్పుకోలేదు కదా! ఆప్తులయినవారికి మాత్రమే చెప్పుకుంటున్నాము. అయినా వీరెవరో మహావీరునిలాగా కనిపిస్తున్నాడు. వీరు కచ్చితంగా విజయనగర రాజపురుషులని మనలను ద్వారప్రవేశం సునాయాసంగా చేయించడంతో వీరి ఔదార్యం అర్థమయింది. మనకు జరిగిన అన్యాయమునకు కచ్చితంగా ప్రతీకారం జరిగితీరవలెను. నాకెందుకో ఈ పురుషుడు మన బాధలను తీర్చడానికి ఆ శ్రీరంగనాథుడు పంపిన దూతవలె కనిపిస్తున్నది. మన పౌరుషాగ్ని ఎప్పటికి చల్లారనీయ రాదు. నాకునూ మీ వేదాంత పిరికి మందు నూరిపోయకండి" అని నిట్టూర్చి ఇది దుఃఖము వెళ్ళబుచ్చుకోవలసిన సమయం కాదు వీరత్వం ప్రదర్శించాల్సిన సమయం. తగిన అంగబలం సమకూర్చుకోవలసిన సమయం. మా తాతగారైన అళగియ మనవాళన్ను చంపినా నేనింత దుఃఖపడేవాణ్ణి కాదు. కానీ వారి క్రూరత్వమునకు భరించజాలకున్నాను. ఆ దుష్టులకు తగినజవాబు చెప్పే నేను మరణిస్తాను" అని కోరమీసాలను మెలివేశాడు. వాని ఆవేశం సమయోచిత సంభాషణకు ముగ్ధుడైన గోపన్న ఛాతీ విశాలమయింది. ఇటువంటి వీరులు కొంత మంది యున్న చాలు. తురుష్కులను సులభముగా తుదముట్టించవచ్చు అని మనసులో తలచి

"తిప్పన్నా! భయంలేదు! నేనున్నాను.. చెప్పు.. మీ తాతను అంత క్రూరంగా హింసకు గురిచేసినదెవరు? ఆ దుష్టుడెవరు?" అని తీవ్ర ప్రతీకార వాంఛ ఉప్పొంగుతుండగా అడిగాడు. "ఎవరు? ఇంకెవరు? మా తొండై మండలాన్ని, చోళ మండలాన్ని ధ్వంసం చేసినవారు. అమాయక ప్రజలను దోచుకున్నవారు. మా ఊళ్ళకు ఊళ్ళను విధ్వంసం చేసినవారు. మా గుడులను గోపురాలను నాశనంచేసి దోపిడీ చేసినవారు. మా శ్రీరంగనాథుని మాకు దూరం చేసిన వారు. తురుష్కులను మట్టుబెట్టి గానీ నా కాయం నేలలో కలియదు అని మీసాలు మెలివేసి...ఒక్కసారి ఆకాశంవైపు చూసి రంగనాథా! నీవు అండగా ఉండు, ఇలాంటి వీర పురుషులను మాకు అండగా నిలబెట్టు చాలు.... వాళ్ళ ఆటలు కట్టిస్తాను అని ఒక్కసారి నిట్టూర్చి లోకాచార్యులవారి రక్షణలో మేము పెరుమాళ్ళ, అమ్మవిగ్రహాలను తీసుకుని అడవుల పాలయ్యాము కదా! మా తాతగారు కూడ రంగని పరమ భక్తుడు. ప్రతి మాటకు ముందు శ్రీరంగనాథా! అని ఉచ్చరించి కానే ఏపని చేసేవాడు కాడు. అలాంటి మా తాతకు రంగనాథుడు తరలి వెళ్ళిపోతున్నాడని విలపిస్తూ నన్ను వీపున ఉప్పుమూటవలె మోసుకుంటూ ఈ బృందాన్ని పరుగు పరుగుల మీద అనుసరించసాగాడు. వీరు పల్లకీతో కాస్త ముందు వెళ్ళిపోయారు. తాతగారు నన్ను మోస్తూ..రంగ రంగా..అని బాధపడుతూ మెల్లిగా నడుస్తున్నాడు. ఇంతలో ఎవరో ఒకడు మాతాత రెండు కాళ్ళు బట్టి ముందుకు పడేశారు. ఆ పడిన మా తాతను కొంతమంది కుళ్ళబొడిచేశారు. నన్ను దూరంగా ఒక చెట్టుకు కట్టేశారు. "ఓయ్. ముసలీ! మీ రంగడెక్కడ? ఎవరు ఎటువేపు తీసుకెళ్ళారు? చెప్తావా లేదా? అని గద్దిస్తూ శూలాలతో కొట్టసాగారు. ఆయన రోదిస్తూ "నాకు తెలియదు..నాకు

తెలియదు" అని అంటూ రోదిస్తూ ఉన్నాడు. "నాకు కూడా ఆ రంగని కళ్ళారా చూడాలని ఉంది" అని అనేసరికి వారిలో ఒక ఉన్మాది రెచ్చిపోయాడు. "ఓహో! నీ రంగని కళ్ళారా చూడాలని ఉందా?" అని వికటాట్టహాసం చేస్తూ చేతిలో ఒక చురిక ధరించి మా తాత రెండు కనుగుడ్లు పీకి ఆయన చేతులలో పెట్టి " ముసలీ! ఈ కళ్ళతోనా ఆ రంగని చూసేది! ఇప్పుడు చూడు రంగని బాగా కనిపిస్తాడు" అంటూ పెద్దగా నవ్వుతూ కిర్రుచెప్పు కాలితో బలంగా మాతాత డొక్కలో ఒక్క తన్ను తన్నగానే కళ్ళనుంచి రక్తం ధారాపాతంగా కారుతూ మూర్ఛిల్లాడు. ఇక మాయమ్మ భయపడి దూరంగా ఉండడం చూసి ఆమెను చెరపట్టి, పెద్దగా కేకలు పెడుతూ అరుస్తూ ఉండగా వారామెను కొనిపోయారు. నేను రాత్రంతా అలాగే చెట్టుకు కట్టబడి ఉండిపోయాను. గండు చీమలు కుట్టినా పాములు ప్రాకుతున్నా ఏమిచేయలేని స్థితిలో ఉన్నాను. నిలబడే నిద్దురపోయాను.

తెల్లవారి నేను అలాగే నిలబడి మగత నిద్దురలో ఉండగా మా తాత "అయ్యా..నాయనా..తిప్పా..మనకే గతి పట్టిందో చూశావా? అని ఏడుస్తూ నన్ను బంధ విముక్తుణ్ణి చేసి "తిప్పా నన్ను శ్రీరంగమునకు తీసుకుని వెళ్ళు" అని కోరాడు. నేను మా తాతగారిని కౌగలించుకుని ఆయన దుస్థితి చూసి పెద్దగా ఏడ్చాను. ఆయన ఏడవకు బాబూ..నా జీవితంలో ఇలా రాసిపెట్టి ఉంది అంతే! అని నన్ను ఓదార్చి "మీ అమ్మ.." అంటూ కింద కుప్పగూలిపోయాడు. అప్పుడు అయన్ను నేనే సమాధాన పరచవలసి వచ్చింది. మెల్లిగా అడవిలో వంటచెరకుతో రెండెడ్ల బండి ఒకటి శ్రీరంగమునకు వెళ్తుండగా నేను వానిని బతిమాలి మా పరిస్థితి చెప్పి దానిలో ఎక్కి శ్రీరంగం చేరాము.

అక్కడి పరిస్థితి దయనీయంగా ఉంది. ఊరు వల్లకాడైంది. నేనప్పటికి పదేండ్ల బాలుడను. మా తాతగారి అప్పటి వైభవము చూసినవారు జాలిపడి మాకు తినడానికి అన్నపానాదులు ఇచ్చేవారు. మా తాతగారు ఆ రంగనాథుని విగ్రహాలకు కట్టిన వస్త్రాలను ఉతికే ముందుగా ఆ గుడ్డలను నీటితో తడిపి పిండి ఆ నీటిని తీర్థంగా సేవించేవాడు. ఆ తీర్థం సర్వవ్యాధి నివారణంగా, పరమౌషధంగా భావించే వాడు. అంతటి పరమ భక్తుడు మాతాత. మా తాత వలన ఏదో సత్కార్యం కలగాలని ఉంది కాబట్టే మా తాతగారు ఇన్ని సంవత్సరాలైనా ఇంకా రంగా! రంగా! అని కలవరిస్తూ అక్కడే జీవిస్తున్నారు. ఆ రంగనాథుడు ఇంకా ఆయన ప్రాణాలను ఉంచడంలో ఏదో పరమార్థం ఉందని నా భావన. ఊరివారు పెట్టిన అన్నం నాకు పెట్టి ఆయన పస్తులుండేవాడు. కొద్ది రోజులకు మా అమ్మ వచ్చి మమ్ములను కలుసుకుంది. చాలా బలహీనమై పోయింది. నన్ను కౌగలించుకుని గంటలకొద్దీ ఏడ్చేది. తాను అన్ని చిత్రహింసలకు గురయినా నా కోసం అన్నీ ఓర్చుకుని జీవించానని చెప్పడంతో నాకు ఆవేశం పెల్లుబుకింది. నా నెత్తురిడికిపోయింది. నేను ఎప్పటికైనా వారిని నామరూపాల్లేకుండా చేయాలని సంకల్పించాను. నా ఈజీవితానికదే పరమార్థంగా భావించాను. కొంతమంది యువకులను ప్రోత్సహించి సాముగరిడీలు నేర్పించి దేహధారుఢ్యం పెంచుకునేట్టు చేశాను. నా గొడవ విన్న ఒకప్పటి సైనికాధికారి మాకు కత్తి యుద్ధం, గుర్రపు స్వారి మొదలైన విద్యలన్నీ శ్రమపడి నేర్పించాడు. తనకు ఇంతజరిగినా మా తాతగారికి ఆ రంగనాథుడే సర్వస్వం. ఒకనాటి రాత్రి కలలో ఆ స్వామిని దర్శించి “అదుగో ఆ శ్రీరంగనాథుడు. వచ్చేశాడు. నాకోసం. స్వామి వారి బట్టలు శుభ్రంగా

ఉతకాలి. వస్తున్నా స్వామీ!" అని అరుస్తూ మంచం గుంజ తట్టుకుని క్రింద పడిపోయాడు. లేచిన వాడు మోకాళ్ళకు రక్తం కారుతున్నా నవ్వుతూ "ఒరే! తిప్పా ఆ రంగనాథుని దివ్య వస్త్రాలను ఒక్కసారి స్పృశించి, అభిషేకానంతరం ఒక్కటంటే ఒక్కసారి జీవితంలో ఆఖరుసారి ఆ దివ్య వస్త్రతీర్థం సేవించి, ప్రాణం విడవాలని ఉందిరా! ఆ పని నీకే ఒప్పజెపుతున్నాను" అని చేతిలో చెయ్యి వేయించుకుని పెద్దగా ఏడుస్తూ అనేసరికి నాకు దుఃఖం ఆగలేదు.

ఆరోజు నుండి ఒక ఆలోచనకు వచ్చాను. ఎలాగైనా స్వామిని మళ్ళీ శ్రీరంగంలో పునఃప్రతిష్ఠ చెయ్యాల్సిందేనని గట్టిగా నిర్ణయించుకున్నాను. మా అమ్మకు తాతగారిని జాగ్రత్తగా చూసుకోమని చెప్పి ఊళ్ళను పట్టి తిరిగాను యువకులను పోగు చేశాను. ఆ రంగని దయవలన అందరూ నా నిర్ణయాన్ని మెచ్చుకుని సహాయం చేస్తామన్నారు. పాతికమందిమి వంద అయ్యాము. వంద వేలయ్యారు. ప్రతి గ్రామంలో ఇప్పుడు యుద్ధవిద్యలు వచ్చినవారు కనీసం వెయ్యిమంది యున్నారు. నా ఉజ్జాయింపు లెక్క ప్రకారం అన్ని గ్రామాలలో కలిపి దాదాపు మొత్తం 20 వేలమందిమి ఉన్నాము. కానీ దానికి మీ వంటి రాజవంశీయుల సహాయం కావాలి. మీరు పూనుకుంటేనే జరుగుతుంది. కాదనకండి!" అని గోపన్న కాళ్ళను పట్టుకుని వదల్లేదు.

గోపన్న చలించి పోయాడు. వళ్ళు గగుర్పొచ్చింది. వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. ఆనంద భాష్పాలు నేలమీద పడ్డాయి. తనకు తరచూ నారసింహస్వామి కల రావడం కూడా గుర్తొచ్చింది. కర్తవ్యం బోధపడింది కానీ తాను నారాయణపురానికి మాత్రమే అధికారి. స్వతంత్రించి ఏ

నిర్ణయాలు కంపరాయలవారికి బుక్కరాయలవారికి తెలియకుండా తీసుకొనకూడదు..సరే!.. కర్తవ్యం ఆలోచించాలి.

ఇంతలో వారిలో నొకడు "అయ్యా! శ్రీరంగనాథుని విగ్రహములు జ్యోతిష్కుడిలో భద్రముగా నుంచిన పిళ్ళై లోకాచార్యులవారు, పరమపదించే సమయంలో తన ప్రియ శిష్యుడు మరియూ ఆగమ శాస్త్ర విద్వాంసుడైన వెలాంజోళై పిళ్ళైకు ఆవిగ్రహ రక్షణబాధ్యత అప్పజెప్పాడు. గురువు ఆదేశానుసారం పిళ్ళై వాటిని తీసుకుని తిరువనంతపురమునకు వెళ్ళాడు. మాలో కొందరు పిళ్ళైకు రక్షణగా తిరువనంతపురం వెళ్ళాము. మరి కొందరము హెూయసల సామ్రాజ్యాధీశుడైన వీరబల్లాల దేవుని ఆశ్రయించడానికి వెళ్ళాము. అక్కడ బల్లాల మహారాజును కలిసేందుకు మాకు దణ్ణాయకుడైన బల్లప్ప ఎంతో సహాయం చేశాడు. మధుర ప్రభువైన జలాలుద్దీన్ హసన్ షా తమ సామ్రాజ్యాన్ని ఎప్పటికప్పుడు సైనిక బలంతో పటిష్టం చేసుకుంటున్నాడు. అది విభవ నామ సంవత్సరము. దణ్ణాయకుడైన బల్లప్ప అతి బలవంతుడు, ధైర్యశాలి, వ్యూహకర్త, మీదు మిక్కిలి ప్రభుభక్తి పరాయణుడు. ఒక లక్ష సైన్యాన్ని సమీకరించి జలాలుద్దీన్ ఆట కట్టించాలని బల్లాలుని చేరాడు" అంటుండగా గోపన్న "ఇవన్నీ మాకు తెలిసిన విషయములే!" అంటూ వారికొక సత్రమునేర్పాటు చేసి అచ్చట అన్నివసతులు సమకూర్చి "నేను మళ్ళీ తిరిగి వచ్చేంతవరకూ ఇక్కడే సురక్షితంగా ఉండండి" అని గుర్రమెక్కి స్వారీ చేస్తూ అతివేగంగా స్వారి చేస్తున్నాడు.

అతని ఆలోచనలూ అంతే వేగంగా సాగుతున్నై. గతం మొత్తం అతని మస్తిష్కంలో తిరుగుతోంది. బల్లాలుడు శక. 1213 నుండి 1264 వరకూ హొయసల ప్రభువు. అతడు 1264లో గయజుద్దీన్ చేతిలో హతుడయ్యేంతవరకూ ఆ ప్రాంతంలో తన ప్రభావాన్ని చూపించాడు. బలహీనులైతే రణము. బలవంతులైతే శరణము. ఇదే ఆతని లక్ష్యం. ఇదే విధానం కొనసాగిస్తాడు. అయితే బల్లాలుడు తన లక్ష్యసిద్ధికోసం చివరకు మిత్రద్రోహానికి కూడా వెనుకాడలేదు. ఆశ్రితులను కూడా కాపాడకపోవడం అతని విచిత్ర రాజ్యకాంక్షకు కారణం.

మహమ్మద్ బీన్ తుగ్లక్ దేవగిరికి రాజధానిని మార్చేనాటికి పాండ్య రాజుల పాలనలో ఉన్న మాబర్ ప్రాంతం కూడా ఢిల్లీ సుల్తానుల పాలనక్రిందికి వెళ్ళి ఉన్నది. తుగ్లక్ ప్రతినిధి మధురలో ఉండి దక్షిణదేశ ప్రాభవాన్ని కాపాడుతూ వస్తున్నాడు. అయితే దక్షిణ ప్రాంతంలో హొయసల కంపిలి రాజ్యాలు మాత్రమే స్వేచ్ఛగా స్వయం పాలన సాగిస్తూ ఉండడం సుల్తానులకు కంటకింపుగా ఉండేది. ముఖ్యంగా కంపిల దేవుని పాలనలో కంపిలి మంచి ఉచ్ఛస్థితిలో ఉండేది. కంపిలునకు బల్లాలుడు పక్కలో బల్లెంలా ఉండేవాడు. కప్పం చెల్లించాల్సిందిగా వచ్చిన ఢిల్లీ సుల్తాను లేఖను కంపిల దేవుడు తిరస్కరించాడు. అంతే కాదు తుగ్లక్ మేనల్లుడైన బహాఉద్దీన్ సాగర్‌కు పతినిధిగా ఉండి సుల్తానుపైనే తిరుగుబాటు జెండా ఎగరేయగా అతనికి ఆశ్రయమిచ్చాడు కంపిల దేవుడు. తుగ్లక్ సైన్యం కంపిలునిపై దాడిచేశారు. అతను దుర్గాలన్నిటిని కాపాడుకోలేక పోయాడు. బహాఉద్దీన్ ను తెలివిగా బల్లాలుని ఆశ్రయానికి పంపించగా బల్లాలుడు అంగీకరించి ఆశ్రయమిచ్చి కంపిలునితో సఖ్యత పెంచుకున్నాడు. బల్లాలుని ఆలోచనలు ఎప్పుడూ వేరుగా ఉంటాయి. ఒకవేళ కంపిలుడు గెలిస్తే తాను కూడా కప్పం కట్టాల్సిన

అవసరం లేదు. కంపిలుడు ఓడితే సుల్తాను కాళ్ళుపట్టుకుని కప్పం కట్టి ఆత్మరక్షణ చేసుకోవచ్చునే తంత్రం.

ఇటు కంపిలుని యుద్ధంలో సహాయ పడకుండా అటు సుల్తానుతో విరోధం తెచ్చుకోకుండా తటస్థంగా ఉండిపోయాడు. గోడమీద పిల్లి తరహాలో ఉండిపోయాడు. యుద్ధంలో జయాపజయాలు దైవాధీనాలు కదా! తుగ్లక్ పంపిన మాలిక్ జుదా గొప్ప యుద్ధ వ్యూహ కర్త. అతని వ్యూహం ఫలించి కంపిలుని చంపి అతని తలను శూలానికి గుచ్చి తుగ్లక్‌కు కానుకగా సమర్పించాడు. కంపిలదేవుని అంతఃపుర స్త్రీలు సహగమనం చేశారు. తుగ్లక్ సేనాని బల్లాలునిపైకి రాగా లొంగిపోయి బహాఉద్దీన్‌ను సకుటుంబ సమేతంగా వారికి సమర్పించి తమకు విధేయుణ్ణి అన్నాడు. అట్టి దుర్మార్గ రాజకీయం బల్లాలుడిది. ఆశ్రితులను కూడా తన ప్రాణాలకోసం ఫణంగా పెట్టే బుద్ధి వానిది.

జలాలుద్దీన్ హసన్ షా మధురకు ప్రతినిధి అయ్యాడు. హసన్ శక. 1257 నుండి, ఢిల్లీ సుల్తాన్ ప్రతినిధిగా కాక, సర్వస్వతంత్ర్యంగా వ్యవహరించడం మొదలుపెట్టాడు. దానితో ఇంతకుముందు ఢిల్లీ సుల్తానుకు లోబడి ఉన్న రాజులంతా కప్పం కట్టడం నిలిపివేశారు. వారిలో మొదటివాడు భల్లాలుడు. అలాంటి నీచ రాజకీయాల్లో ప్రథముడు. కొంచెం పుంజుకొని సామ్రాజ్యానికి ఉణ్ణాములై పురం, సేలం దగ్గర ఉన్న కుండని, మహిశూరం వద్దనున్న ద్వార సముద్రం అనే మూడు రాజధానులుగా ఏర్పాటు చేసుకుని స్థిరపడ్డాడు. అప్పటికి బల్లాలుడు లక్షకు పైచిలుకు సైన్యాన్ని సమీకరించుకొన్నాడు. శ్రీరంగం నుండి వచ్చి సత్రంలో బసచేసిన వారు బల్లాలుని ఆశ్రయించినది ఆ సమయంలోనే అని స్ఫురణకు వచ్చింది గోపన్నకు.

అతడెంత దుర్మార్గ మనస్తత్వమో తెలియనిది కాదు. అలాంటి బల్లాలుడు శ్రీరంగవాసులకు నిస్వార్థంగా ఆశ్రయం కల్పిస్తాడా? ఇందులో యేదో తిరకాసు లేకపోలేదు అని గోపన్న ఆలోచిస్తున్నాడు. కంపిలిని స్వాధీనం చేసుకున్న తర్వాత అచట తుగ్లక్ మాలిక్ మహమ్మదును ప్రతినిధిగా నియమించి వెళ్ళాడు. మాలిక్‌ను పడగొట్టడానికి చాళుక్య వంశీయుడైన సోమదేవరాజు తెలుగుదేశం పడమటి భాగంలో సైన్యాన్ని సమీకరించడం ప్రారంభించాడు. కందనోలును కేంద్ర స్థానంగా హొూస్పేట, రాయచూరు, ముదిగల్లు దుర్గాలు అతని స్వాధీనంలో ఉండేవి. కంపిలిని ఆక్రమించడానికి పథకం వేశాడు. అదే సమయంలో బల్లాలుడు కూడా కంపిలి స్వాధీనానికై యుద్ధం ప్రకటించాడు. మహమ్మదు అరాచకాల కారణంగా అతనిపై ప్రజలు తిరగబడ్డారు. ఆహార ద్రవ్యాలు కూడా కోటలోనికి రాకుండా అడ్డుపడడంతో మహమ్మదు సుల్తానుకు తనగోడును రహస్య గూఢచారుల ద్వారా తెలియజేశాడు. సుల్తానుకు ఏమి చేయాలో తోచలేదు. అక్కడి మంత్రులను సంప్రదించి కర్తవ్యం ఏమిటని కోరగా వారు కంపిల దేవుని భూమి వీరభూమి. అక్కడి ప్రజలెన్నడూ పర పరిపాలనకు లొంగి ఉండరు. మహమ్మదును పదవీచ్యుతుని చేసి అక్కడి స్థానిక రాజులనే అక్కడి ప్రభువుగా నియమిస్తే సమస్య తీరిపోతుందని చక్కని సూచన చేశారు. ఆ సలహానే విజయ నగర సామ్రాజ్య స్థాపనకు భవిష్యత్తులో నాంది వాచకమైంది.

సుల్తాను ఆలోచించాడు. అతని వద్ద ఐదుగురు సమర్థులైన వీరులున్నారు. వారైదుగురూ అన్నదమ్ములే! ప్రతాపరుద్రుణ్ణి బందీగా తీసుకుని వెళ్ళేనాటికి ఐదుగురు సోదరులు సుల్తాను సేవలో ఉన్నారు.

వారు హరిహరుడు, బుక్కప్ప, కంపన్న, మారప, ముద్దయ్యలు. వీరిలో హరిహర, బుక్కప్పలు ప్రతాపరుద్రుని బొక్కసానికి అధిపతులు. ప్రతాపరుద్రుడు పట్టుబడినప్పుడు వీరిద్దరూ తప్పించుకుని కంపిలుని కొలువు చేరారు. అనంతర కాలంలో కంపిలి కూడా సుల్తాను చేతికి రావడంతో హరిహర, బుక్కరాయలు బందీలుగా ఢిల్లీ వెళ్ళవలసిన అగత్యం ఏర్పడింది. బలవంతంగా మతం మార్చబడ్డారు. కానీ వీరి అసాధారణ ప్రజ్ఞకు సుల్తాను ఆశ్చర్యపోయాడు. వారిని విడుదలజేసి, అన్ని రాచకార్యాలకు ముందుగా వీరిని సంప్రదించి సలహా అడిగి చేసేవాడు. అన్నిటా విజయం లభించేది. అందువల్ల వారిద్దరంటే సుల్తానుకు అమిత నమ్మకం. మంత్రులు చెప్పిన సలహాను పాటించి మహమ్మదును తొలగించి అదివరకు అక్కడ స్థానికులైన హరిహర, బుక్కరాయలను కంపిలికి పంపి దుర్గ రక్షణ బాధ్యత వహించమని కోరాడు.

తమ ఒకప్పటి రాజైన కంపిల దేవుని మంత్రులు తిరిగి రావడంతో పరిస్థితులు కొంచెం బాగుపడ్డాయి. తిరుగుబాటు మాని జీవనం సాగిస్తున్నారు. ఇంకనూ తిరుగుబాటు చేస్తున్నవారిని పరిశీలించగా వారు బల్లాలుని గూఢచారులని తేలింది. వారిని పట్టి బంధించి చెరసాలలో పడేశారు. బాధలలో ఉన్న శ్రీరంగం వారిని బల్లాలుడు ఇలాంటి తిరుగుబాటు చర్యలకు, సంఘ విద్రోహ పనులకు మోసపూరితంగా వాడుకొన్నాడని గోపన్నకు తెలుసు.

గుత్తి దుర్గాన్ని, హొూస్పేట, ఆనెగొంది దుర్గాలను క్రమంగా హరిహర, బుక్కరాయలు కైవసం చేసుకున్నారు. బల్లాలుడి సైన్యాన్ని కంపిలి వేపు కన్నెత్తి చూడకుండా బలమైన దెబ్బ తీశారు. విజయనగరమున

బల్లాలుని నీచ చరిత్ర తెలియని వారెవరూ లేరు. అందువల్లనే శ్రీరంగం నుండి వచ్చినవారు వాని పేరు ఎత్తగానే కోపోద్రిక్తుడయ్యాడు గోపన్న. ఇలాంటి చరిత్ర ఉన్న బల్లాలుడు శ్రీరంగములోని స్వామి విగ్రహము గురించి శ్రద్ధ వహిస్తాడా! భ్రమ! ఉత్త భ్రమ! అనుకుంటూ సాగిపోతున్నాడు. ఆలోచనలు మాత్రం తెగడంలేదు.

మధురలో జలాలుద్దీన్ హసన్ షా స్వాంతంత్ర్యం ప్రకటించుకొనగానే, వారి సైన్యము ఊళ్ళు దోచుకున్నారు. అక్కడి దారుణాలు భరించి భరించి ఒకనాడు ఎవరో గుర్తు తెలియని తిరుగుబాటుదారులు జలాలుద్దీన్ను అతి దారుణంగా హత్య చేశారు. అంతే కాదు అతని తర్వాత మధుర చేపట్టిన ఇరువురి సుల్తానులను అదే విధంగా కిరాతకంగా నరికి చంపేశారు. చివరకు గయాజుద్దీన్ దామమనీ అనే సుల్తాను మధుర సామ్రాజ్య పగ్గాలు అందిపుచ్చుకున్నాడు. ఈయనకు ధన దాహం ఎంతకూ తీరనిది. పూర్వం దేవాలయాలు పెద్ద ధనాగారాలుగా ఉండేవి. ధనవంతులు భూరి విరాళాలను అర్పించేవారు. అవి వేద విద్యకు నిలయాలు. నృత్యము, గాత్రము వంటి కళలకు నిలయాలు. అనేకమంది సంగీత కళాకారులు ఆ ఆలయాలపై ఆధారపడి జీవనం సాగించేవారు. వివాహాది శుభకార్యాలు అక్కడే జరిగేవి. పూజారుల ఆశీర్వాదం కోసం సామాన్య ప్రజలు పడిగాపులు కాచేవారు. పండితులు పురాణ పఠనం చేసేవారు. దేవదాసీలు దేవుని ఉత్సవాలలో నృత్యం చేసి అందరిని మెప్పించేవారు. ఒక్క ఆలయంపై కొన్ని వందలమంది జీవనం సాగించేవారు. ప్రభువు మారినప్పుడల్లా సామాన్య ప్రజానీకం గడగడలాడేవారు. కొందరి ప్రభువుల దృష్టి ఎప్పుడూ దేవాలయాల

ఆదాయం మీదే! మరికొందరు ఆ దేవాలయాల విధ్వంసానికి పూనుకుని తద్వారా అక్కడి ప్రజలను తమ చెప్పు చేతల్లో ఉంచుకునేవారు. ఈ తరహా వ్యక్తి గయాజుద్దీన్ కావడం హిందువులు చేసుకున్న పాపం.

గయాజుద్దీన్ చేసిన దారుణాలకు లెక్కలేదు. ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బ్రతికేవారు. గయాజుద్దీన్‌కు బల్లాలునికి శక.సం.1264 లో కన్ననూరు వద్ద భీకర యుద్ధం జరిగింది. ఎనభై సంవత్సరముల వయసుగల బల్లాలుడు గయాజుద్దీన్ చేతిలో హతుడైనాడు. ఆ తరువాత గయాజుద్దీన్ మరీ మితిమీరి దారుణాలు చేశాడు. ప్రజల నిత్య జీవనం స్థంభించింది. శ్రీరంగం కంచి మొదలైన ఆలయ పట్టణ ప్రజలకు దిన దిన గండమే! అడవుల పడ్డ శ్రీరంగనాథుని భక్తులకు దాదాపు ముప్పైవత్సరములు నానా బాధలు పడగా చివరకు విజయనగరం దోవ కనుపించింది. మధురను శ్రీరంగమును వదలి వచ్చినవారు తిరిగి వెళ్ళడానికి వారి వారి శపథాలు అడ్డుగా మారాయి. శ్రీరంగనాథ దర్శనం అనంతరమే శ్రీరంగపట్టణ దర్శనమని భీష్మించుకుని, లేనిచో ఆమరణాంతరం ప్రవాసంలో ఉండిపోదల్చుకున్నారు.

అలా పాలన సాగిస్తున్న వీరిరువురి సోదరులు ఒకనాడు తుంగాభద్రా తీరానికి విహారం వెళ్ళి, అచట వేటకుక్కలను తరిమి తరిమి కొడుతున్న కుందేళ్ళను చూసి ఆశ్చర్యపోయారు. శ్రీవిద్యారణ్యస్వామి ఆశీర్బలముతో హరిహర బుక్కరాయలు శక వర్షం 1258 (క్రీ.శ.1336) లో స్థాపితమైనది. వారిరువురూ కాకతీయ ప్రతాపరుద్రుని ఆస్థానంలో గడించిన అపార అనుభవం, ఢిల్లీ సుల్తానువద్ద ప్రదర్శించిన మంత్రాంగం, కంపిలి దుర్గ పాలకులుగా నేర్చుకున్న అనుభవం విజయనగర దుర్గాన్ని

పటిష్టం చేయడం ఆరంభించారు. ఒక్క మధుర సుల్తాను పాలించే రాజ్యము దప్ప, హొయసల సామ్రాజ్యమంతా వీరి అధీనంలో ఉండేది. వీరు క్రమముగా మహిశూర, కన్నడ, వనవాసి సీమలను జయించి రాజ్య విస్తరణ చేశారు. బాదామి కోటను పటిష్టం చేశారు. హరిహరుడు విజయనగరము నుండి బరకూర వరకూ గల సామ్రాజ్యాని పరిపాలిస్తూ ఉండగా, బుక్కరాయలవారు మధ్య దేశాన్ని, కంపన్న ఉదయగిరిని, మారప్ప వనవాసిని, ముద్దప్ప ముళువాయిని పరిపాలించసాగారు. హరిహరుని తరవాత వీరుడైన బుక్కరాయలు మహామండలేశ్వరుడైన పిమ్మట, ఉదయగిరి, పెనుగొండ, అరగమ లెహమ దుర్గాలను, ముళువాయి, తుళు రాజ్యాలను సమర్థులైన సామంతుల క్రింద ఉంచి పరిపాలన సాగిస్తున్నాడు. రాజగంభీరము మాత్రము మధుర సుల్తాను క్రింద ఆయన అడుగులకు మడుగులొత్తుతూ, చెప్పుచేతలలో నున్నసాంబవరాయల అధీనంలో ఉంది. దాన్ని స్వాధీనం చేసుకోవడానికి బుక్కర రాయలు సమయం కోసం వేచి ఉన్నాడు.

విజయనగరం చూడడానికి వచ్చిన యాత్రికులలో ఒకదు బల్లాలుని పేరెత్తగానే గోపన్నకు క్రోధం పెరిగిన కారణం అదే! అతడు కొన్ని విజయాలు సాధించినా, అందితే జుట్టు అందకపోతే కాళ్ళు రీతిలో వ్యవహరించిన బల్లాలుడంటే గోపన్నకు అసహ్యం. విజయనగరం ముందు బల్లాలుని ఆధీనంలో ఉండేది. ఈ నేలపై ఓడిన బల్లాలుని శరణు జొచ్చామని శ్రీరంగ వాసులు చెప్పడంతో గోపన్నకు వళ్ళు మండిపోయి “ఇవన్నీ మాకు తెలిసిన విషయములే!” అని కోపంగా అక్కడనుండి వచ్చేశాడు. వారు తెచ్చిన బల్లాలుని ప్రస్తావన వల్ల గోపన్న జరిగినదంతా ఇప్పుడు మళ్ళీ నెమరు

వేసుకోవలసి వచ్చింది.

ఇంతలో హయం విజయనగరం పొలిమేరలకు చేరింది. కంపన్నను చూచుటకు వారం పైగా ఎదురు చూస్తూ నగర పర్యటన చేస్తున్నా దర్శనం లభించలేదు. గోపన్న ప్రతి వారం తప్పని సరిగా కంపన దర్శనం చేసుకోవలసినదే! ఈసారి నాలుగు రోజులు గడచినా గడిచినా కంపన దర్శనం కాలేదు. ఏమయి ఉండనోపు అని దీర్ఘాలోచనలో పడ్డాడు. గోపన్నకు ఈ రాజ్యాధికారం మీదనే విరక్తి వచ్చింది. ఎప్పటికైనా మధుర సుల్తానును జయించి శ్రీరంగనాథుని పునఃప్రతిష్ఠించుకోగలమా? ఏమో తెలియదు. అలాంటప్పుడు ఈ రాజభోగాలు ఎందుకు? అసలు కంపన దర్శనం అవసరమా? అని ఆలోచనలో పడ్డాడు.

విజయనగర సామ్రాజ్యానికి దక్షిణాన ముళ్వై రాజ్యం ఉంది. బుక్కరాయల సామ్రాజ్యంలోని ఒక చక్కని రాజ ప్రాసాదం. ఆ ప్రాంతం చక్కని కళానైపుణ్యంతో అలరారుతున్నది. పచ్చని ఉద్యానవనాలు, ఒక చిన్న జలపాతం చూపరులను ఆకర్షిస్తున్నది. ఆహ్లాదం కలిగిస్తున్నది. అక్కడ మయూరాలు గుంపులు గుంపులుగా విహరిస్తూ నృత్య విన్యాసాలు చేస్తున్నాయి. అక్కడ గల ఒక అశోక వృక్షం క్రింద ఒక యవ్వనవతి కూర్చుని ఉన్నది. ఆమెలో రాచరికపు లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఆమె చేతుల్లో ఏవో తాళపత్రాలు ఘంటం వంటి వ్రాత పరికరాలు కనిపిస్తున్నాయి. ఆమె ప్రశాంతంగా యోచిస్తున్నది. ఏవో ఆలోచనలు రాగానే ఆమె గబ గబా ఆ ఆలోచనలను గ్రంథస్తం చేస్తున్నది. ఇలా కొన్ని గంటలు

గడుస్తున్నాయి. అంతటి గొప్ప సౌందర్య రసాధిదేవత ఎవరో కాదు. బుక్కరాయలవారి కుమారుడు కంపనరాయల భార్య గంగాదేవి. ఇలా ఆలోచనా నిమగ్నురాలైన గంగాదేవికి అక్కడకు వచ్చిన ఇంకో రాచస్త్రీ కాలి అందియల శబ్దం వినిపించడంతో తలెత్తి చూసింది. వచ్చిన స్త్రీ కంపన వారి ధర్మపత్ని కుంతలాదేవి.

''నీ ఆలోచనలకు అంతరాయం కలిగించానా గంగా!'' అన్నమాటలకు చిరునవ్వు నవ్వి "హయ్యో! ఎంతమాట కుంతలా రా! కూర్చో!" అంది.

"ఏదో పద్య రచనలో నిమగ్నమై ఉన్నట్టున్నావు?"

"అవును ఒక చక్కని దృశ్యాన్ని వర్ణిస్తున్నాను, వింటావా?" అంటూ పొడవాటి తాటియాకుపై ఆమె అందమైన వ్రేళ్ళతో వసంబు, పసుపు, మనతకాలికా ఆకురసం, మామిడాకు నల్లబూడిదలతో తయారైన సిరాతో రచన సాగిస్తున్న ఆమె ప్రక్కన మెల్లిగా కూర్చున్నది కుంతల. "ఊ! చెప్పు గంగా!" అని చెక్కిట చేయి చేర్చి కూర్చున్నది. గంగ ఆశ్చర్యపోయింది. ఎంత అందంగా ఉంది ఈ కుంతలాదేవి? ఇంత అందమైన స్త్రీని పట్టమహిషిగా వివాహమాడి కూడా తన్ను అమితంగా ప్రేమిస్తున్నాడంటే నా అదృష్టం అనుకొన్నది.

"ఏమి వ్రాస్తున్నావో చెప్పమంటే నన్ను చూస్తూ ఉండిపోయావేమిటి గంగా!" అని కుంతల కిలకిలా నవ్వింది. ఉలిక్కిపడి తనలోని ఆలోచనలను అదిమిపట్టి, ఘంటాన్ని క్రిందపెట్టి కుంతల కళ్ళలోకి చూస్తూ "కుంతలా! అడవిలోని అశోక వృక్షాలపై కోకిలలు తమ తీయని కంఠ స్వరాలతో పంచమ స్వరాలను ఆలాపిస్తున్నాయి. కోకిల తన గానమాధుర్యంతో ఆ

వనం యావత్తూ తీయని మధురోహలను నింపుతున్నది. ఆ సమయంలో వనంలో పయనిస్తున్న ఒక ఒంటరి బాటసారి చెవులకు గానమాధుర్యం కలిగిస్తున్నది" అంటూ "దీన్ని ఒక శ్లోక రూపంలో పెట్టాను అంటూ శ్లోకాన్ని రాగయుక్తంగా వినిపించింది.

అద్భుతం గంగా! అని చిరునవ్వు నవ్వి " ఆహా.. ఏమి చిత్రం! రాజు ఒంటరిగా ప్రయాణిస్తుంటే కోకిలలు కూడా పంచమ స్వరాలతో పాడడం జరుగుతుందన్న మాట. ఇలాంటి మధురమైన గానం విన్న వెంటనే మన్మధుడు తన పంచబాణాలు అంటే అరవిందం, అశోకం, చూతం, నవమల్లిక, నీలోత్పలాలతో రాజుగారి మనసుపై దాడిచేయకుండా ఉంటాడా? ఆరాజు నిన్ను తలుచుకోకుండా ఉంటాడా? ఇదే కదా నీ ఆలోచన" అనగానే గంగాదేవి బుగ్గలు కెంపులైనాయి. వెంటనే సిగ్గుతో తాటాకు పత్రాలను ముడిచి జాగ్రత్తగా కట్టకట్టి "కుంతలా! మహారాజు తిరునారాయణపురానికి వెళ్ళినప్పటినుండి మన సంతోషాలు ఆవిరయ్యాయి. వారు ఎప్పుడు వస్తారో! తిరిగి ఆ ఆనందక్షణాలను ఎప్పుడు పొందుతామో కదా!" అని పెద్ద నిట్టూర్పు విడిచింది.

"విచారమేల గంగా! వద్దు! వారు ఎక్కడికి వెళ్ళినా తిరిగి వెంటనే ఇక్కడికి చేరుకుంటారన్న విషయం నీకూ తెలుసు కదా! ఇంతలోనే అంత బేలతనమా?"

"నాకు తెలుసు కుంతలా! కానీ ఎందుకో ఎప్పుడూ వారు మనతోనే ఉండాలని ఉంటుంది కదా! రాజుగారికి మనపై ప్రేమకు ఎంత స్థానం ఉందో శక్తి సామర్థ్యాలకు రాజ్య పరిరక్షణ విషయంలో కూడా అంతే స్థానం ఉందన్న విషయం తెలియని అమాయకురాలను కాదు. వారి శక్తి

సామర్ధ్యాలకు తగిన పెద్ద సామ్రాజ్యం వారికి ఇంకా లభించలేదన్న ఆలోచన నాకు ఎప్పటినుండో ఉంది. కానీ స్త్రీహృదయం నీకు తెలియనిది కాదు కదా! కానీ వారి ముందు మనం ఈ విషయాలను బయటపెట్టి వారికి కార్యభంగం కలిగించరాదు!" అంటూ ఒకరి చేతిలో ఒకరు ఒట్టు వేసుకుంటున్న సమయంలో ఒక పరిచారిక ప్రవేశించి "క్రియాసిద్ధి పండితులవారు రాజభవనంలో వేచి యున్నారు మహారాణీ!" అని చెప్పి వెళ్ళిపోగానే వెంటనే ఇద్దరు రాణులు బయలుదేరారు. వీరి వడివడి అడుగులకు నెమళ్ళూ, రాజహంసలూ తప్పుకుని దారినిచ్చాయి.

గంగాదేవి నడుస్తూ ఆలోచించసాగింది. క్రియాసిద్ధి పండితులవారు పరమ పూజ్యులు, విద్యారణ్యస్వామితో సమాన గౌరవాలు అందుకొంటున్న వారు. ఈవేళప్పుడు రాదగిన కారణం ఏమిటి? అంటూ ఆమె ఆలోచనలు గతంలోకి వెళ్ళాయి.

– – –

మధుర సుల్తానుల దాడికి మునుపు దక్షిణాపథంలో శాంతిసౌఖ్యాలు వెల్లివిరిసి ఉండేవి. ఏవో రాజుల అంతర్గత విబేధాలు, చిన్న చిన్న దండయాత్రలు మాత్రమే ఉండేవి. అవి సామాన్యపౌరుల జీవన విధానాన్ని కానీ, వ్యాపారాలను కానీ, దేవాలయాలపై కానీ ఎలాంటి ప్రభావాన్నీ చూపలేదు. 14 వ శతాబ్దంలో ఢిల్లీ సుల్తాను దక్షిణాపథ ముట్టడితో పరిస్థితి మారిపోయింది. ఈ దాడులు ప్రజలను అల్లకల్లోలానికి గురిచేశాయి. ఈ దాడులు ప్రజల మత ధార్మిక సుఖ జీవనంపై ప్రభావం చూపాయి. ఎక్కడ చూసినా భయాందోళనలు, అనిశ్చిత వాతావరణమే తాండవించింది. ప్రజలు తమకు రాక్షస పాలన నుండి రక్షణ, విముక్తి కావాలని

అలమటించేవారు. ముఖ్యంగా తమిళదేశంపై ఎక్కువ ప్రభావం పడింది. ప్రజలు చెట్టుకొకరు పుట్టకొకరు అన్నట్టు వెళ్ళిపోయారు. ఎవరు ఎక్కడ ఉన్నారో తెలియదు. సురక్షితంగా ప్రాణాలతో ఉన్నారో లేదో తెలియదు. వర్తమానాలు లేవు. ఈ దాడుల సమయంలో పల్లవులు, చోళుల పాలన సమూలంగా అంతమై ఆఖరి పాండ్యరాజు పాలిస్తున్న రోజులు. పాండ్య రాజు బలవంతుడైనా సహోదరుల అంతఃకలహాలతో సర్వత్రా ద్వేషపూరిత వాతావరణం నెలకొని ఉంది. ఈ కారణాలవల్ల సుల్తానుల పని మరింత సులువైంది. పాండ్యులను తరిమికొట్టేసరికి మధురైనుండి పారిపోయి నుండి తెన్కాశిలో తలదాచుకొన్నారు. తమిళ జాతిని రక్షించే నాథుడే లేడు. సర్వం సుల్తానుల వశమైపోయింది. ప్రజలు తమకు రక్షణలేక విలపిస్తున్నారు. హొయసల రాజైన వీరభల్లాలుడు కూడా సుల్తానులతో యుద్ధంచేసి కన్ననూరులో మృతి చెందాడు. తమిళనాట సుల్తాను ధాటిని ఎదుర్కొనే మగతనం ఉన్న రాజే కరువయ్యాడు. అలాంటి సమయంలో విద్యారణ్యస్వామి దయవల్ల విజయనగర సామ్రాజ్యం స్థాపింపబడి హరిహర, బుక్కరాయల పాలనవల్ల కొంతమేరకు తమిళనాట ప్రజలు ఊపిరి పీల్చుకోగలిగారు. బుక్కరాయల కుమారుడైన కంపరాయలు తన్ను చేపట్టి వివాహమాడాడు. ఇప్పుడు క్రియాసిద్ధి పండితులు వచ్చిన కారణమేమిటో అని గంగాదేవి సుదీర్ఘంగా ఆలోచిస్తూ నడుస్తూ ఉండగా వారి ప్రత్యేక మందిరాలు వచ్చాయి.

క్రియాసిద్ధి పండితులవారు స్వర్ణ సింహాసనంపై ఆశీనులై ఫలాలను సేవిస్తూ ఉన్నారు. ఇద్దరు రాణులు రాగానే చిరునవ్వు నవ్వారు. వారిరువురూ పండితులవారికి వంగి వినమ్రంగా నమస్కారాలు చేశారు. ఆయన

"అమ్మాయిలూ. ఎలా ఉన్నారు? అంతా క్షేమమేనా?" అని అడిగారు. వారు ఆయన్ను చూస్తూ అలా ఉండిపోయారు. ఏమి తేజస్సు! వయసు ఎనభైకి పైబడినా ఎంత చురుగ్గా ఉంటారు. ప్రకాశవంతమైన ముఖం. అంతే తేజోవంతంగా మెరుస్తున్న నేత్రాలు. ముఖాన విభూధి రేఖలు. ధవళ వస్త్రాలు. శాస్త్రవిజ్ఞాన విశారదుడు. బుక్కరాయల కులగురువు. ఒక దేవతా మూర్తివలె కనిపించాడు వారికి. గంగాదేవి సంస్కృతాధ్యయనం నేర్చుకున్నది వీరివద్దనే. గంగాదేవి మొదట తేరుకుని "తమ దయా విశేషము వలన ఎల్లరు కుశలమే! తమరి రాకను మాకు ముందుగా తెలియపరచలేదేమి? నాదస్వరము, వేధఘోష ఏర్పాటు చేసెడి వారముకాదా గురువర్యా " అంది. "లేదమ్మా! నేను ఒక అత్యవసర కార్యార్థినై ఇటకు వచ్చితిని. అందుకే ముందుగా తెలియపరచలేక పోయాను. అవన్నీ ఎందుకు? మీ అభిమానము నాకు చాలదా?" అని నవ్వాడు.

ఇంతలో కుంతలా దేవి సైగతో ఒక స్వర్ణ పాత్రలో స్వచ్ఛమైన నీరు తెప్పించి, ఒక పళ్ళెంలో గురువుగారి పాదపద్మాలను కడిగి వాటిని ఇద్దరూ తమ శిరస్సులపై జల్లుకున్నారు. కుశల ప్రశ్నల అనంతరం "గంగా! నీ సంస్కృతాధ్యయనం ఎలా సాగుతున్నది? ఈ మధ్య ఏమైనా క్రొత్త శ్లోకములు వ్రాశావా?" అని అడిగాడు.

"ఈమధ్య కాళిదాసు రఘువంశము, భవభూతి ఉత్తర రామచరిత్ర క్షుణ్ణంగా అధ్యయనం చేశాను. మరలా మరలా చదువుతూ ఉండగా కాళిదాసు కావ్యంలోని వర్ణనలు నన్ను ఏవో క్రొత్త లోకాలకు తీసుకుని వెళ్తున్నాయి"

"మరి శ్లోకాలు వ్రాయడం ఎంతవరకూ వచ్చింది?"

"చిన్న చిన్నగా ఇప్పుడే మొదలెట్టాను గురువర్యా! అంత చెప్పుకోదగ్గవి

కావు. దండి బాణభట్టు, భవభూతి లాగా పదునైన, చిక్కనైన కవిత్వం వ్రాయాలని పట్టుదలగా ఉంది. దానికి గొప్ప అధ్యయనం కావాల్సి ఉంది"

"రాజుగారెలా ఉన్నారు? వారిని నేను కలవాల్సి ఉంది"

"కులదేవతల ప్రార్థనల నిమిత్తం తిరునారాయణపురానికి వెళ్ళారు గురువర్యా!"

"అవునా! వారిని కలవాలని ఎన్నో విషయాలు చర్చించాలని వచ్చాను"

"అయితే ఈ సమాచారం తిరునారాయణపురానికి చేరవేయమందురా? వారు వెంటనే తిరిగి వచ్చెదరు"

"వద్దు.వద్దు ఆగండి. త్వరపడకండి. నేను చెప్పేవరకూ వారిని ఇబ్బంది పెట్టకండి. వారి ప్రయాణం అనుకున్న విధంగానే సాగనివ్వండి. వేచి ఉంటాను. అవునూ..సోమప్ప నగరంలోనే ఉన్నాడు కదా!"

"సోమప్ప ముఖ్యమంత్రి వారి స్వగ్రామానికి వెళ్ళి ఉన్నారు గురువర్యా!"

"ఓహో! సాళువ మంగు.. సైన్యాధికారి?"

"ఆయన మహారాజుల వారిని విడిచి ఉండగలడా ఆయన వారితో వెళ్ళారు."

" ఇంకొక సైన్యాధికారి మోరయ నాయకుడు?"

"వారు పుత్రుని వివాహవిషయమై నగరానికి వెళ్ళారు."

"కోట రక్షకుడు రామయ్య?"

"అశ్వాలను కొనుగోలు చేయమని మహారాజులవారు వారిని బయటి ప్రాంతాలకు పంపి ఉన్నారు"

"హయ్యో! ఏమిటిదంతా? ఎవరూ నగరంలో లేకపోతే నగర సంరక్షణ ఎవరు చూసుకుంటున్నారు? మీ ఇద్దరా?"

"గోపనార్యుడు ఒక్కడే నగరంలో ఉన్నాడని వార్త వచ్చింది. కానీ వారేమో

ఇంకా ఇక్కడికి రాలేదు. రాజుగారి కోసం వేచి ఉన్నట్టున్నారు. వారు ఎవరూ లేనప్పుడు రక్షకుడుగా ఉంటారని భావించాము. వారు విడిదిలోనే ఉ ండిపోయారు. విచారంగా ఉన్నారని వేగులు చెప్పారు. కారణం తెలియదు"
"నేను వెళ్ళి అతణ్ణి కలుసుకుంటాను. విచార పడకండి. రాజుగారు లేకుండా మీ రాణీ వాసానికి రావడానికి ఆయన మామూలు సైన్యాధిపతి కాదు కదా! సద్బ్రాహ్మణ సైన్యాధిపతి. ఆయన నియమాలు ఆయనకుంటాయి" అని రథంపై బయలుదేరాడు.

క్రియాసిద్ధి పండితుల వారు వెళ్ళేసరికి గోపన్న తన విడిదిలో మద్యాహ్న సంధ్య ముగించి, ఆహారం భుజించే ముందుగా విశ్రాంతిగా ఒక ఆసనంపై కూర్చుని దీర్ఘంగా యోచిస్తున్నాడు. వారిని చూసినవెంటనే లేచి "గురువర్యా! కుశలమా? ఏమిటి మీరు నా విడిదికి రావడం? ఒక్క కబురుపెడితే మీ ముందు రెక్కలు కట్టుకుని వాలనా?" అని వారికి ఆసనం చూపిస్తూ నవ్వాడు.

"గోపన్నా! వంట్లో బాగున్నదా?"

"బాగున్నది గురువర్యా! మనసే బాగుండడం లేదు"

"ఏమి జరిగింది గోపన్నా! ఏదైనా సమస్య వచ్చిందా?"

"అవును గురువర్యా! సమస్య నా వ్యక్తిగతం. రాచరికపు సేవ వదులుకోవాలని ఆలోచిస్తున్నాను"

ఆ మాట వినగానే పండితుల వారు కించిత్ ఆశ్చర్యానికి లోనయ్యారు. గోపన్నను నిశితంగా చూశాడు. మనిషిలో ఏదో మార్పు! సైన్యాధిపతికి ఉండవలసిన వేషధారణ లేదు. తెల్లని బట్టలు ధరించి సామాన్యంగా

ఉన్నాడు. హంగు ఆర్భాటాలు ఏమీ లేవు. ముఖంలో మాత్రం ఏదో ప్రసన్నత గోచరిస్తున్నది.

"ఏమైంది నాయనా? వీరాధి వీరుడవు. బ్రాహ్మణుడై ఉండి అనితరసాధ్యమైన రాజవిద్యలను ఔపోసన పట్టావు. వేద వేదాంగాలను అభ్యసించావు. అకస్మాత్తుగా నీ వంటి ధైర్యసాహసాలుగల వ్యక్తికి ఈ మార్పు ఎందుకు వచ్చింది?

గోపన్న కొంచెం సంశయించి గొంతు సవరించుకొని ఇలా అన్నాడు "స్వామీ! నేను కొంత కాలం క్రితం మన రాజ్యంలో ప్రయాణిస్తూ కొల్లైకాలం దగ్గరకు వెళ్ళాను. అక్కడున్న గ్రామాలన్నీ పట్టించుకునే నాథుడు లేక అనాధలై పడి ఉన్నాయి. ప్రజలంతా అత్యంత దీనావస్థలో ఉన్నారు. తమిళ మాతృక కలవారు వలసలు వెళ్ళిపోతున్నారు. గ్రామాలు శ్మశానాలను తలపిస్తున్నాయి. ఇక బట్టుటా అనే విదేశీ యాత్రికుడు వర్ణించిన విధానం చాలా జుగుప్సాకరంగా ఉందంటూ అతను చెప్పిన విషయాలన్నీ ఏకరువు పెట్టాడు. బంజరు భూములు పాడుపడి కుక్కలు నక్కల పాలయ్యాయి. పిచ్చి చెట్లు మొలిచి గ్రామాలు అడవుల్లా మారిపోయాయి. ఇటీవల అలా వలస వచ్చి దేశాలు పట్టుకుని తిరుగుతున్న కొంతమైంది వైష్ణవోత్తములను కలిశాను. వారు కూడా సత్రాల్లో విడిది చేసి స్వగ్రామాలకు వెళ్ళాలంటే ప్రాణ భయంతో కొట్టు మిట్టాడుతున్నామని చెప్పారు. తండ్రులను, తాతలను, ఆస్తిపాస్తులను పోగొట్టుకొని అనాధలుగా తిరుగుతున్నారు. సంచార జీవులవలె కాలం గడుపుతున్నారు. కొంతమంది మళయాళ ప్రాంతాలకు వలసవెళ్ళిపోయారు. వారంతా నన్ను చూడగానే వల వల దుఃఖిస్తున్నారు. వారిని ఆపలేకపోతున్నాను. వారికి సరైన సమాధానం

చెప్పలేకపోతున్నాను. ఈ నేలను జయించే వారికోసం సుస్థిర సామ్రాజ్యాన్ని స్థాపించే భారతీయ రాజుల కోసం ఎదురు చూస్తున్నారు. యువకులు ప్రాణాలకు తెగించి పోరాడడానికి సిద్ధంగా ఉన్నారు. యుద్ధం ఎప్పుడని? చేవ ఉన్న రాజేలేడా? అని నన్ను ప్రశ్నిస్తుంటే ఈ కరవాలం, శూలం, ధనుర్బాణాలు, మందీ మార్బలం ఎందుకని అనిపించింది. మధురనుండి వచ్చిన కొంతమంది వైష్ణవులను కలుసుకొని మాట్లాడాను. వారి బంధు జనం ఊచకోతకు గురయ్యారు. వారి కళ్ళనుండి కారేది కన్నీళ్ళు కాదు రక్తం గురుదేవా! రక్తం! మధురలో కాలువలై పారుతున్న రుధిరాన్ని గురించి విని చలించిపోయాను. అమాయక ప్రజలను కాపాడలేని ఈ సైన్యాధికారి పదవి నాకేల?" అని కన్నీరు కారుస్తూ ప్రశ్నించాడు గోపన్న.

పండితులవారు గోపన్న చెప్పిన మాటలన్నీ కదు శ్రద్ధగా విన్నారు. విచారగ్రస్తుడయ్యాడు. కొంతసేపు మౌనం వహించి తేరుకుని మెల్లిగా "నిజమే నాయనా! నీవు చెప్పినది వాస్తవమే! సత్యదూరం, అతిశయోక్తి ఏమాత్రం కానే కాదు. మధురైలో సుల్తాను పాలన రుధిరోద్గారి నామ సంవత్సరంలో అంటే 37 సంవత్సరాల క్రితం ప్రారంభమయింది. నీవు అప్పటికి జన్మించలేదు. మీ తండ్రిగారికి ఈ విశేషాలన్నీ తెలుసు. పోగొట్టుకున్న ప్రాంతాలను తిరిగి రాబట్టుకోలేకపోయాము. చోళులు కానీ పాండ్యులు కానీ వారిని ఎదిరించలేకపోయారు. పెద్ద పెద్ద వీరులంతా మరణించారు. ఇప్పుడున్న రాజులలో ఐకమత్యం ఏమాత్రం లేదు. వారిలో వారు అన్నదమ్ముల పోరే ఆధిక్యం కనపరుస్తూ ఉన్నది. జరిగిన అకృత్యాలకు మనం విచారపడి లాభం ఏమున్నది? అయినా ఒక్కమాట! రాజు గారి కొలువు మానుకొని నీవు సాధించేది ఏమున్నది?"

"నిజమే! మిగతా సైన్యాధికారులు అంటే సాళ్వమంగు, రామయ్య, మోరయ నాయకుడు వారి పరిస్థితి వేరు. వారు రాజాశ్రయాలకై జన్మతః జన్మించిన వీరులు. క్షత్రియులు. నేను బ్రాహ్మణుడను. నాకు బాల్యం నుంచీ వస్తున్న కల గురించి మీకు గతంలో చెప్పాను కూడా! నా మనసంతా చంచలంగా ఉన్నది. ఇక ధార్మిక జీవనమే దారిగా తోస్తున్నది."

' 'నీవు ఇలా ఆలోచించడానికి ఏదో సంఘటన ముఖ్య కారణమై ఉండాలి. ఏమిటది? దాపరికంలేకుండా చెప్పు నాయనా?

"స్వామీ! నగరంలో సంచరిస్తున్న వైష్ణవోత్తముల విషయం అలా ఉంచితే మీకో విషయం చెప్పవలసి ఉన్నది. ఈమధ్య శరణార్థులకు అవసరమైన వస్తువులను, ఆహారధాన్యాలను అందివ్వడానికి నేను తిరునారాయణపురానికి వెళ్ళాను. నేను చాలా సంవత్సరాల తర్వాత అక్కడికి వెళ్ళాను. అక్కడి ప్రశాంత వాతావరణం నన్ను ఎంతగానో ఆకట్టుకొన్నది. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ, ఆలయంలో భగవంతుణ్ణి దర్శించుకొన్నాను. నా రాక తెలిసి అక్కడ చుట్టుప్రక్కల ఉన్న వైష్ణవులంతా పరుగు పరుగున నా దగ్గరకు పరిగెట్టుకుని వచ్చారు. వారు విలపిస్తూ కన్నీరు మున్నీరుగా వారి కోర్కెలు, కష్టాలు సవివరంగా వివరించారు. వీరంతా మధురై చుట్టు ప్రక్కల ప్రాంతాల నుండి పారిపోయి వచ్చినవారేనట. వారు చెప్పినదంతా శ్రద్ధగా విన్నాను. వారిలో ఒక 80 సం.ల వృద్ధుడు కూడా ఉన్నాడు. ఆయన నాకు ఒక సమాచారం అందించాడు. సుల్తానుల దురాక్రమణ జరిగినప్పుడు, రంగనాథ స్వామి విగ్రహంతో తప్పించుకుని పారిపోయినవారిలో వారూ ఒకరని చెప్పుకున్నారు. ఆయన పాండ్య రాజుల ప్రాంతం, మళయాళ సీమ మొత్తం అన్నీ తిరిగి ఆఖరున అక్కడికి వచ్చి

స్థిరపడ్డారట. నాకు వారు చెప్పిన అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే స్వామి వారి విగ్రహాన్ని అప్పటి సంరక్షకులు తిరుపతి వైపు తరలించుకుని వెళ్ళారని కచ్చితమైన సమాచారంగా వెల్లడించారు. విగ్రహం ఆప్రాంతానికి తరలి వెళ్ళి అప్పటికి 18 సంవత్సరాలైనదట. ఇప్పటివరకూ వారి విషయాలు ఎవ్వరికీ తెలియరాలేదని వాపోయారు. వారు నన్ను ఎంతో ఆతృతగా "అయ్యా! తమరు రాజప్రతినిధులుగదా! ఆ రంగడిని తీసుకువచ్చి, పూజలు చెయ్యడానికి నీవు సహాయం చెయ్యలేవా? మనం ఆ విగ్రహాన్ని తేగలిగితే మన దేశానికి మంచి జరుగుతుందని, భవిష్యత్తులో మనం ఆ శ్రీరంగాన్ని జయించడం జరిగితే అక్కడ విగ్రం పునఃప్రతిష్ట చేయవచ్చని ఎంతో దీనంగా కోరాడు.. అనడం కంటే....విలపిస్తూ ప్రార్ధించాడు అనడమే సరైన మాటగా భావిస్తున్నాను. నా పై ఆ వృద్ధుడికి గల నమ్మకానికి నాలో నేనే నవ్వుకున్నాను.

"అది నవ్వదగిన సమయమా? నీవు నవ్వకుండా ఉండవలసింది ఆ సమయంలో" అన్నమాటకు గోపన్న "నిజమే గురువర్యా! నిజమే! నేను నవ్వినది వారి దీనస్థితిని చూసి కాదు. నా అశక్తతను నేను ఎరిగిన వాడనై నవ్వాను. స్వామి విగ్రహంతో వెళ్ళిన బృందం శ్రీరంగాన్ని వదలి దాదాపు 38 సం.లైనది. ఇప్పటి వరకూ వారి విషయాలు ఎవరికి తెలియరాలేదు. ఎక్కడని వెదకాలి? ఒక పంచలోహపు విగ్రహం కోసం ఒక మనిషి వెదుకుతూ బయలుదేరి దేశ దేశాలు తిరగడం జరిగే పనేనంటారా? ఆయన నన్ను అడగడం నాకు నవ్వు తెప్పించింది. నేను రాచరికపు బాధ్యతలే నిర్వహించనా? లేక విగ్రహం వెదుకుతూ వెళ్ళాలా? నాకు ఆ సమయం ఉన్నదా? నేనప్పుడు వారికి ఏమని సమాధానం చెప్పి సంతృప్తి పరచగలను?

కానీ గురువర్యా! నేను అలా నవ్వడం తప్పని ఆ రాత్రి జరిగిన పరిణామమే నాకు బుద్ధి చెప్పింది"

"ఓహ్. అటులనా? ఏమిటా పరిణామం?"

"ఆనాటి రాత్రి నన్ను ఒక పెద్ద విషపు తేలు కరిచింది"

"హయ్యో! భరించలేని బాధను అనుభవించి ఉంటావు నాయనా!"

"అవును. బాధతో మెలికలు తిరిగిపోయాను. నా శరీరం వణక సాగింది. నేను బాధ భరించలేక అందరిని నిద్రలేపాను. ఆ రాత్రి కొంతమంది పెద్దలు వైద్యునికై పరుగులు తీశారు. వైద్యుడు వచ్చి ఏదో మెత్తటి పొడి నాకు రాసినప్పటికి బాధ ఉపశమనం కాలేదు. ఆ వైద్యుడు ఏదో మూలిక మొక్క రసం రాస్తే తప్ప విషం బాధ తగ్గదని చెప్పగానే కొంతమంది వెళ్ళి ఆ అర్ధరాత్రి నా కోసమని దివిటీ దీపాలు ధరించి వెదికి ఆ మొక్కను సాధించారు. ఆ రసాన్ని రాయగానే మెల్లిగా నొప్పి తగ్గుముఖం పట్టింది"

"చాలా గొప్ప కష్టాన్ని ఎదుర్కొని భరించావు నాయనా? కానీ నాకో సందేహం! ఈ తేలుకాటు విషయం నాకు చెప్పడంలోని ఆంతర్యం ఏమైనా ఉన్నదా?"

"అవును స్వామీ! ఆ మొక్క తెచ్చిన పెద్ద మనిషి ఒక మాట అన్నాడు. ఆమాటతో నాకు తలతిరిగిపోయింది."

"ఏమన్నాడు నాయనా!"

"సైన్యాధిపతిగారూ! మిమ్ములను ఈ విషకీటకం ఎలా కాటువేసిందో అలానే ఈ దేశాన్ని కూడా ఒక విషసర్పం కాటువేసింది. మేము నాలుగు దిక్కులా ఔషధం వెదికి పట్టుకున్నట్టు, మీ ప్రజలు, మీరు, ఆ విగ్రహం అచూకీ పట్టుకోలేరా?" అన్నాడు. అంతే కాదు. ఆ విగ్రహం త్వరగా వెదికి పట్టుకోండి. దేశ సంస్కృతి సంప్రదాయం, జీవన విధానం అంతా ఈ

విషసర్పంవల్ల సర్వనాశనమౌతున్నాయి. త్వరపడండి. దేశాన్ని కాపాడండి!" అని దీనంగా వేడుకుని అక్కణ్ణుంచీ వెళ్ళిపోయాడు. నేను చేష్టలుడిగి సిగ్గుతో నిలబడిపోయాను. ఆ పెద్దమనిషి తన మాటలతో నన్ను కాటువేశాడని అనిపించింది. అవును బాధ పడుతున్న శరణార్థుల హాహా కారాలే ఆ కాటువలన కలిగిన బాధ. ఆయన నాకు ఆవిధంగా ఆ విషయాన్ని తెలియపరిచాడు.

గోపన్న బాధతప్త హృదయంతో ఎంతో ఆవేదనతో చెప్పిన విషయం విని పండితుల వారు అలానే ఉండిపోయారు.

"ఇది ఆరంభం మాత్రమే గురువర్యా! ఆయన వెళ్ళినపిదప నేను దీర్ఘాలోచనలో పడిపోయాను. నా ప్రయాణం ఆనాడు వాయిదా వేసుకున్నాను. ఆ ప్రక్కన కొండపై ప్రస్తుతం శ్రీవేదాంతదేశికులవారు తపోదీక్షలో ఉన్నారని తెలిసింది. ఆయన్ను దర్శించడానికి బయలుదేరాను. వారికి అప్పటికే చాలా వయసు వచ్చేసింది. సన్నని దేహం. కళ్ళలో అదో గొప్ప తేజస్సు. దైవీ కాంతి నాకు గోచరించింది. వారు కారణజన్ములన్న విషయం బోధపడింది. ఆయన కాళ్ళపై పడిపోయాను. నా కన్నీరు ఆయన కాళ్ళపై ధారగా కారడం చూసి ఆయన నివ్వెరపోయారు. కొంతసేపటి తర్వాత లేచి ముకుళితహస్తాలతో ఆయనముందు నిలబడిపోయాను. ఆయన కాసేపు ప్రశాంతంగా నన్ను అలాగే చూస్తూ ఉండిపోయారు. తరువాత "నాయనా! నీ ఆత్మ ఫలసిద్ధి పొందింది" అని అన్నారు. నాకేమీ బోధ పడలేదు. అష్టాక్షరీ మంత్రం నాచే పలుమార్లు పఠింపజేశారు. నాలో ఒక అనిర్వచనీయమైన ఆనందం కలిగింది. నేను వెంటనే ఆయన కాళ్ళ మీద పడ్డాను. ఆయన "నాయనా! నీవు నా శిష్యుడవు! ధైర్యంగా ఉండు!

త్వరలోనే అన్నీ సర్దుకుంటాయి. సమయం ఆసన్నమైంది. ఇంతకంటే చెప్పలేను. దైవాజ్ఞ అయింది. దైవకృప నీపై మెండుగా ఉంది." అని మాత్రం అన్నారు. ఆ సమయం తర్వాత నాలో ఒక విరక్తి భావన, వైరాగ్య భావన కలిగాయి. నాకు ఎటువంటి పదవీ, అధికారాలు వద్దు. ఒక శుద్ధమైన వైష్ణవుడిగా మాత్రమే జీవించాలనుకుంటున్నాను." అన్నాడు గోపన్న ఆవేశంగా. ఒక్కసారి గోపన్న గతం గురించి పండితుల వారు ఆలోచించారు. విజయనగరసామ్రాజ్యంలో ముల్బగల్ రాజ్యానికి సర్వ సైన్యాధిపతి. శౌర్యవంతుడే కాక తెలివి దక్షత గల అధికారి. సాహిత్యం, తత్త్వము, రాజకీయము, తర్కము, మీమాంశ పండితులకడ పట్టుగా అభ్యసించడమే కాక యుద్ధ విద్యలలో క్షత్రియులతో పోటీ పడి బుక్కరాయలను సైతం మెప్పించినవాడు. కంపరాయలకు రక్షణాధికారిగా నియమింపబడ్డవాడు. ఒక విద్వాంసుడు, వేదశాస్త్ర సంపన్నుడు యుద్ధవీరుడైనాడంటే, అప్పటి పరిస్థితులు ఊహించుకోవచ్చు. హైందవజాతి ఎంతగా అణచబడిందో, ఎంతగా అల్లాడిపోతున్నదో తెలుస్తుంది. సుల్తాను పైశాచిక పాలనకు విరుద్ధంగా పోరాడవలసిన తరుణమది. ప్రజల జీవన విధానాలను, సంస్కృతీ సంప్రదాయాలను, నమ్మకాలను కాలరాయాలనుకునే ముష్కరులపై ధ్వజమెత్తి నిలవడానికి సమాజమంతా ముందుకొచ్చిన సమయం అది. దక్షిణా పథంలోని ప్రజలంతా తమ తమ స్వల్ప విరోధాలను మరిచి కలిసి కట్టుగా నిలబడిన తరుణమది. ఆ కారణంగా గోపన్న వంటి బ్రాహ్మణ తత్త్వవేత్తలు సైతం వారి వారి మతాచారాలను, ఘంటాలను, ప్రక్కన పెట్టి కత్తులు చేతబూనిన తరుణమది. గోపన్న క్షత్రియ వీరులను తలదన్నే విధంగా సర్వసైన్యాధ్యక్ష పదవిని సాధించడం అలనాటి పరశు

రాముని జ్ఞప్తికి తెస్తున్నది. ఎన్నో యుద్ధాలలో కంపరాయునికి అండగా నిలిచి విజయాలను అలవోకగా పొందిన గోపన్నలో ఈనాడు ఈ మార్పు అనూహ్యంగా ఉంది. శ్రీరంగనాథుని శ్రీరంగం చేర్చడానికి తన ఉద్యోగాన్ని సైతం ఫణంగా పెట్టడం ఆశ్చర్యం కలిగించింది. క్రియాశీల పండితుల వారిని కదిలించి వేసింది. గోపన్న ఈ మార్పు ఎన్నడూ కలలో కూడా ఊహించనిది, ఎదురుచూడనిది అనుకుని ఆలోచనా నిమగ్నుడైన పండితులవారు కొన్ని క్షణాల అనంతరం తేరుకుని గోపన్నవేపు చూస్తూ "గోపన్నా! నీ ఆకస్మిక నిర్ణయం నాకు అబ్బురం కలిగిస్తున్నది. నీవంటి ప్రతిభాశాలుర వల్లనే, ఈ విజయనగరం దినదిన ప్రవర్ధమానమౌతున్నది. గొప్ప మహాసామ్రాజ్యంగా రూపుదిద్దుకొంటున్నది. ఈ కారణంగానే ప్రజలు తమ హైందవ మతాన్ని, సంప్రదాయాలను రక్షించుకోగలుగుతున్నారు. మన ఈ సామ్రాజ్యాన్ని ఉత్తరాన ఢిల్లీ వలె దక్షిణాన మహాసామ్రాజ్యంగా తీర్చిదిద్దాలని మన మహారాజుల వారి కోరిక. మన దేశ ఉత్తర సరిహద్దుల్లో బహమనీ సుల్తానులు మెల్ల మెల్లగా పుంజుకొంటూ, మనకు పక్కలో బల్లెంలా తయారవుతున్నారు. వారి ఆకస్మిక ముట్టడి ఏ క్షణంలోనైనా జరగవచ్చుననే విషయం నీకూ తెలుసు. మనపై విజయం సాధించడానికి, మనల్ని పడగొట్టడానికి వారు నిరంతరం పాచికలు వేస్తూనే ఉన్నారన్న విషయం మనకు వేగుల వల్ల విదితమే! రాబోయే ఈ సంక్షోభాలన్నీ నీవు ఎరుగనివి కాదు" అంటూ ఆగి గోపన్న స్పందనకై ఎదురు చూశాడు.

"గురువర్యా! మీరు చెప్పిన విషయాలు పరిస్థితుల తీవ్రతను గురించి సంపూర్ణ అవగాహన నాకు ఉంది."

"దక్షిణాన ఉన్న మధురై పట్టణాన్ని చూడండి! సుల్తాను దుష్టపాలన అక్కడ

నడుస్తూనే ఉంది. ప్రజలు ఆక్రందనలు మనకు ఇక్కడికి వినిపిస్తున్నాయి. విదేశీ యాత్రికుడు బట్టుటా నీకు చెప్పిన సంఘటనలు నాకు క్షుణ్ణంగా తెలుసు. ఆ రాజ్యాన్ని ఇంకా మనం జయించనే లేదు. వాస్తవానికి మనం ఆ రాజ్యంలో అడుగిడడానికే సందేహిస్తున్నాం. మతం కారణాన బహమనీ సుల్తానులు, మధురసుల్తానులు ఏకమౌతారన్న అనుమానం మనలను పట్టిపీడిస్తోంది గోపన్నా! "

"ఈ భయం ఎంతో కాలంగా ఉన్నదే! కానీ ఎంతకాలం ఇలా?"

"ఒకటి గుర్తుపెట్టుకో గోపన్నా! ఈ రెండు సామ్రాజ్యాలు శత్రుత్వం, వైరంతో ఉన్నంత కాలం భయపడవలసిన భయం లేదు. మనం ఎప్పటికైనా మధురను హస్తగతం చేసుకోగలం. కానీ వారిద్దరి మధ్యా సుహృద్భావం పెరిగితే మాత్రం వారిని ఎవరూ జయించలేరు"

"అవును గురువర్యా! ఆ మధుర ప్రాంతం ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితులను గురించి ఎప్పటికప్పుడు వింటూనే ఉన్నాను. కానీ తగిన సమయం రావడంలేదు"

"చక్కగా గ్రహించావు గోపన్నా! అందుకే మన విజయనగర సామ్రాజ్యంమొత్తం తగిన సమయం కోసమే వేచి ఉన్నది. భావోద్వేగానికి లోనుకావద్దు. ఇప్పటికిప్పుడే ఆ మధుర సుల్తానులను జయించడం అసాధ్యం కాకపోయినా ఇప్పుడు కొంచెం కష్టమే! దానికి ముందు కొన్నివిజయాలు సాధించవలసి ఉంది. భుజబలం మాత్రమే అన్నివేళలా సహాయపడదు. దానికి బుద్ధిబలం, దైవానుగ్రహం చాలా అవసరం. వేద వేదాంగాలు అధ్యయనం చేసినవాడివి. నీకు అన్నీ తెలుసు. కాకపోతే అక్కడి పరిస్థితులు చూసి చలించిపోయావు అంతే! ఆ సమయం త్వరలోనే వస్తుంది. విచారం

మాని కంపరాయలు తిరిగి రాగానే కలుసుకొని నీ ఆలోచనలను వారి ముందు పెట్టు. నీ కార్యం సిద్ధించే వరకూ నీ రంగనాథుడు కూడా ఎదురుచూడడం తప్ప వేరే మార్గం లేదు" అని క్రియాసిద్ధి పండితులు అన్నారు. వివిధ రాజయకీయ సమీకారణాలు వ్యూహాలు చర్చించి, ఎటువంటి పరిస్థితులలోను బాధ్యతలు విస్మరించవద్దు. నగరంలో యోధులు ఎవరూ లేరన్న విషయం నీకు మరలా గుర్తుచేస్తున్నాను గోపన్నా! ఇప్పుడు నగర రక్షణ బాధ్యత కూడా నీ మీదనే ఉన్నది. ఒకసారి చారులను కలుసుకో! ఏమైనా ప్రమాదకర విషయాలు, పరిస్థితులు ఈమధ్య సరిహద్దుల్లో తలెత్తుతున్నాయా? గమనించు. నీ బ్రాహ్మణ నీతి నియమాలు కాస్తా ప్రక్కన పెట్టి, రాణివాసానికి వెళ్ళి ఒంటరిగా ఉన్న కుంతలాదేవిని, గంగాదేవిని కలిసి పలకరించి ధైర్యంచెప్పి రావాలని మా కోరిక నాయనా! నేను రేపు వచ్చి నీతో మరిన్ని విషయాలు చర్చిస్తాను. సెలవు". అంటూ రథం ఎక్కి వెళ్ళిపోయారు పండితులవారు.

క్రియాసిద్ధి పండితులవారు, మహారాణి గంగాదేవి బాణవిరచిత కావ్యంపై చర్చిస్తున్నారు. పరదాల చాటున ఏదో నీడ కదిలినట్టనిపించి గంగాదేవి "ఎవరక్కడ!" అంది. పరదా తొలగించుకుని ముల్బుగల్ సర్వ సైన్యాధ్యక్షుడు గోపన్న రావడం కనిపించింది. చక్కని దేహధారుద్యంతో ఉన్నప్పటికి గోపన్న ముఖంలో ఏదో తెలియని అలసట కనిపిస్తున్నది. అతని కుడి చేతిలో పట్టువస్త్రం కప్పబడిన వస్తువు ఏదో ఉన్నది.

"రా నాయనా! రా!" అంటూ పండితులవారు గోపన్నను ఆహ్వానించి ఆసనం చూపారు. గంగాదేవి కూడా మర్యాద పూర్వకంగా అభివాదం తెలియజేసింది. గోపన్న సంస్కృతాంధ్రాలలో గొప్ప పండితుడన్న విషయం ఆమెకూ తెలుసు. అప్పుడప్పుడూ ఆమెకు కావ్యాల్లో కలిగే సందేహాలను కూడా నివృత్తికూడా చేస్తుంటాడు.

"గోపన్నా! ఏమి నిర్ణయం తీసుకున్నావు? నేను చెప్పిన విషయాలను అర్థం చేసుకుని ఉంటావని భావిస్తున్నాను"

''గురువర్యా! క్షమించాలి. ఉద్యోగం వదిలివేయడానికే నిర్ణయం తీసుకొన్నాను" అనగానే పండితులవారు, గంగాదేవి ఒక్కసారి కంగారుగా చూశారు.

గోపన్న పట్టు వస్త్రం తొలిగించి పళ్ళెంలో ఉన్న రెండు వీరకంకణాలను బయటకు తీశాడు. అవి గోపన్న ధైర్య సాహసాలను సభలో గొప్పగా ప్రశంసించి బుక్కరాయలవారు స్వయంగా ఇచ్చిన వీర కంకణాలు. వాటిని తిరిగి తేవడంతో ఒక్కసారి ఆశ్చర్యానికి లోనయ్యారు.

"ప్రస్తుతం రాజుగారు రాజ్యంలో లేరు. మీరు వారితో ముఖాముఖీ మాట్లాడి నిర్ణయం తీసుకుంటే మంచిదని భావిస్తున్నాను"

''లేదు స్వామీ! మనసు ఒకదానిపై కేంద్రీకృతమైనపుడు దానిని శృంఖలాబద్ధను చేయడం నాకు కానిపని. వారు లేకపోతే ఏమిటి? వారితో సమానమైన మీరున్నారు కదా!"

"గోపన్న దేశం మొత్తం నీతి నిజాయితీలు క్షీణించి ఆపదలో కొట్టుమిట్టాడుతున్నప్పుడు స్వంత నీతినిజాయితీల గురించి ఆలోచించడం వీర ధర్మమేనా? ఈ విజయనగర సామ్రాజ్యం విద్యారణ్యులవారి కృపతో ఎందుకు అంకురించింది? యావద్భారతదేశ ధర్మము, సంస్కృతి రక్షించడానికై పుట్టింది. చక్రవర్తులు, మహామండలేశ్వరులు, రాజులు, సేనాధిపతులు పుడుతూ ఉంటారు. వారి ధర్మం నిర్వర్తించి వెళ్ళిపోతూ ఉంటారు. కానీ ధర్మం, హైందవ సంస్కృతి అవిచ్ఛిన్నంగా సాగుతూనే ఉంటుంది. ఈ విజయనగరసామ్రాజ్యం యావత్ దక్షిణాపథాన్ని ఒకే గొడుగుక్రిందికి తెచ్చేవరకూ విశ్రమించరాదు. మౌనం వహించడానికి వీలు లేదు. మన అవిశ్రాంత కృషి జరుగుతూ ఉండవలసినదే! మన లక్ష్యం సాధించే లోగా మనం మతపరమైన ధార్మిక జీవితంగాని, బంధాలను విడనాడే సన్యాస జీవితం కానీ అభిలషణీయం కాదు. ప్రస్తుతం ఇది నీతి-నిజాయితీల పరిస్థితి"

గోపన్న మారు మాట్లాడకుండా మౌనంగా కూర్చున్నాడు. గంగాదేవి వీరిరువురినీ చూస్తూ ''గురువర్యా! మీ సంభాషణలను ఆటంక పరుస్తున్నందుకు క్షమించండి. నేను ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. అనుమతివ్వండి"

"చెప్పండి మహారాణీ! మీ మందిరంలో మీకు అభ్యంతరమా? చెప్పండి" అని నవ్వాడు.

"గోపన్నా! నా గురువులలో మిమ్మలను కూడా ఒక గురువు గా భావిస్తున్నాను. మీ శిష్యురాలిగా ప్రశ్నిస్తున్నందుకు నన్ను క్షమించండి. నేను ఈ దేశపు మహారాణిగా కంపరాయలవారి అర్ధాంగిగా ప్రశ్నిస్తున్నానని మాత్రమే భావించండి. రాజరికపు ఉద్యోగం త్యజించడానికి కారణం పరమాత్మ ఆజ్ఞా?"

"మహారాణీ! నాకు మీపట్ల ఉన్న గౌరవం అపారం. అందుకు కృతజ్ఞుడిని. ఒకరకంగా పరమాత్మ ఆజ్ఞ అనుకోవచ్చునని నా భావన! నాకు గతంలో ఎన్నో స్వప్నాలు వచ్చేవి. అప్పుడప్పుడూ ఇంకా స్వప్నంలో సింహం ఇంకా గాండ్రిస్తూ నావేపు కోపంగా చూస్తూనే ఉంది. ఆ విషయం అటుంచితే, నేను కొల్లైకాలం ఇటీవల దర్శించాక ఒక స్వప్నం నన్ను సదా వెంటాడుతున్నది"

' 'దయచేసి ఆ స్వపాన్ని మాకు వివరించవలసినదిగా కోరుతున్నాను" అన్నమాటకు బదులుగా గోపన్న "తప్పక! స్వప్నంలో అంతా అయోమయం. చిక్కని చిమ్మ చీకటి. కన్ను పొడుచుకున్నా కనిపించనంత గాడాంధకారం. నేను విషయమేమిటా అని వెదికి తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నాను. ఆ సమయంలో ఒక దైవవిగ్రహం నా కనులముందు కదలాడింది. ఇంతకు ముందెన్నడూ అటువంటి దివ్య సుందర మూర్తిని చూచి ఉండలేదు. తామరల వంటి నేత్రాలు, శంఖచక్రాలు, కానీ ఆ విగ్రహానికి ఎటువంటి వస్త్రాలంకరణాలేదు, నగలు లేవు, బోసిపోయిన విగ్రహం దీనంగా కనిపిస్తున్నది. నాకు ఆ విగ్రహం మధ్య జాలితో కూడిన ఏదో తెలియని బంధం మొదలవుతున్నది. బాల్యం నుంచీ వచ్చే స్వప్నాలకు ఇది

చరమాంకమని అనిపిస్తున్నది. కలలోనే నాకళ్ళలో కన్నీళ్ళు సుళ్ళు తిరిగి ధారాపాతంగా కారుతున్నాయి. కలలోనుండి మెలుకువ వచ్చాక నేను అచేతనుడైపోతున్నాను. తల్లడిల్లిపోతున్నాను. నా స్థితి ఒక పిచ్చివానివలె ఉంది."

"బాగా ఆలోచించుకుని చెప్పండి. ఆ స్వప్నంలో ఇంకేమైనా కనిపిస్తున్నాయా? స్వామి ఎక్కడ ఉన్నారు?"

"అవును. అవును. దట్టమైన అరణ్యాలు, అనేక పర్వతాలు కూడా కనిపించాయి మహారాణీ!"

"దీన్ని బట్టి మీరేం ఊహించుకొన్నారు?"

"శ్రీరంగనాథుడు ఎక్కడో ఉన్నాడు. నన్ను పిలుస్తున్నాడని అర్థమౌతున్నది మహారాణీ!"

"స్వామీ! నాదొక చిన్న విన్నపం. దట్టమైన అడవి, పర్వతాలు అంటే తిరుమల. అది తిరుమల కొండయేనని నా మనసు గట్టిగా విశ్వసిస్తున్నది. మీ భవిష్యత్తుపై ఇలాంటి నిర్ణయం తీసుకునే ముందు ఒక సారి ఆ తిరుమల దర్శించి, ఆ ఏడుకొండలవానిని, పరమాత్మను, ప్రార్థించి రావాలని కోరుకుంటున్నాను గోపన్నగారూ!"

"చక్కని సలహా గంగా! గోపన్నా ఈ సలహా నువ్వు పాటించి తీరాలి. ఈ నిర్ణయం మామూలు నిర్ణయం అనుకోవద్దు. స్వామి మనసు తెలుసుకో! తీర్థ యాత్ర చేసిరా! ఈలోపు మహారాజుల వారు ఇక్కడికి వస్తారు. తగు నిర్ణయం తీసుకుందాం."

"రేపే బయల్దేరి వెళ్తాను. గురువర్యా! గంగాదేవీ! మీకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. సందిగ్ధావస్తలో ఉన్న నా మనసుకు స్వాంతన దొరికింది"

"సంతోషం నాయనా! శుభమస్తు! ఇష్టకార్య ఫలసిద్ధిరస్తు!" ఆశీర్వదించారు పండితులవారు.

వేదాంత దేశికులవారు ధ్యానంలో ఉన్నారు. ఆయన పవిత్ర దేహంపై రోమాలు నిక్కబొడుచుకున్నాయి. కుడి కన్ను ఉదయం నుండి అదురుతోంది. గోపన్న ప్రవేశించి నిశ్శబ్దంగా ఆయనముందు కూర్చున్నాడు.

ఆయన కళ్ళు తెరవగానే సాష్టాంగ ప్రణామం చేసి తిరుమల యాత్ర గురించి చెప్పాడు. వెంటనే ఆయన తనకు అత్యంత ప్రీతికరమైన మంగళకరమైన శ్లోకం ఒకటి చదివారు.

"అనుచరశక్త్యాదిగుణామగ్రేసరబోధవిరచితాలోకామ్

స్వాధీనవృషగిరీశాం స్వయం ప్రభూతాం ప్రమాణయామి దయామ్"

దేవ దేవుని దయా గుణాన్ని, స్వామి అర్ధాంగి శ్రీమహాలక్ష్మిని కీర్తించే శ్లోకం అది. దాని అర్థం వివరిస్తూ "నాయనా గోపనా! విను శక్తి, వీరత్వం, బలం మొదలైనవి అనుసరించే సైనికులు. జ్ఞానం ఆమె ముందు నడుస్తూ ఆమె వెలుగును నలుదిశలా ప్రసరిస్తూ ఉంటుంది. శ్రీమహాలక్ష్మి వేంకటాచలపతిని తన అధీనంలో పెట్టుకుని, తన స్వంత గుణగణాల కారణంగా స్వతంత్రంగా ఆ స్థలాన్ని పరిపాలిస్తూ ఉన్నది. భగవంతుని యొక్క దయాదేవికి నన్ను నేను సమర్పించుకొంటాను. నా యీ ఆత్మ సమర్పణకు అతనే...కేవలం ఆయనే సరైనవాడు." అన్నాడు.

గోపన్న ఒక్కసారి దేశికుల వారి విద్వత్తును తలుచుకుని పొంగిపోయాడు. వారు అప్పటికి 200 పుస్తకాలకు పైగా రచించారు. 80 యేళ్ళు పైబడ్డాయి. ఇప్పుడు చెప్పబడ్డ ఈ శ్లోకం వారి "దయా శతకం" లోనిది. 108 శ్లోకాలతో దయా శతకం రచించి, వారి యుక్తవయసులో తిరుమలలో రోజూ ఆ స్వామివారి సన్నిధిలో పఠించేవారట. స్వామికి తమను తాము సంపూర్ణంగా త్రికరణ శుద్ధిగా సమర్పించుకునేందుకు సాధనాలుగా చెప్పబడే మూడు పవిత్ర మంత్రాలలో ఇది ఒకటి. పై శ్లోకాన్ని గోపన్న ముందు పఠించి గోపన్నను కూడా తన్ను తాను స్వామికి సమర్పించుకుంటే అసాధ్యం ఏమీ ఉండదని ప్రబోధించారు.

"నాయనా! గోపన్నా! నీ మనసు నాకు అవగతమైంది. ఆ దేవాధిదేవుడు, జగన్నాటక సూత్రధారి. తనను తానే అదృశ్యం చేసుకుని, భక్తులను తనను వెదకమని చెప్తున్నాడు. చూశావా? ఏది ఎప్పుడు ఎలా చేయాలో ఆయనకు మాత్రమే తెలిసిన విషయం. ఆయన నిర్ణయానుసారమే సర్వం. నీకు దైవాదేశం దొరికింది. గోపన్నా! ఆలస్యం చేయకుండా వెళ్ళి

స్వామిని దర్శించుకో!" గోపన్నకు దయాశతకం తాళపత్ర ప్రతి ఒకటి చేతిలో పెట్టి "నిత్యం పఠించు!" అని ఆశీర్వదించి సాగనంపారు దేశికులవారు.

గోపన్న మరో ఇద్దరు సహచరులతో కలిసి తూర్పు దిక్కుగా ప్రయాణం సాగిస్తుండగా, అదే సమయంలో శ్రీరంగనాథుని విగ్రహాన్ని చాలాకాలంనుండి వెదుకుతూ ఉన్న నలుగురు అశ్వికులు కూడా, వారికి చాలా ముందుగా అదే దిక్కుగా సాగుతున్నారు.

శ్రీరంగనాథ స్వామి విగ్రహాన్ని వెదుకుతూ గోపన్నకంటే ముందు బయలుదేరిన అశ్వికులలో ఒక స్త్రీ కూడా ఉన్నది. ఆమె పేరు మంజరి. మిగిలినవారు దత్తుడు, వల్లభుడు, సింగళకరుడు. మధ్య మధ్య అడవులు దాటుకుంటూ సాగుతున్నారు. మెల్లగా చంద్రగిరిని చేరారు. వారంతా వేషాలు మార్చి ఉన్నారు. సింగళకరుడు "భేష్! మిమ్మలను ఇప్పుడు ఎవరూ పసిగట్టలేరు. మీకు నేను విగ్రహం మేము ఆరోజు వదలిన అంజనాద్రి ప్రాంతం చూపించబోయే ముందు మీకు కొన్ని విషయాలను చెప్పాలి. మీరు విగ్రహం అంజనాద్రి అడవులలో ఉందని ఎలా చెప్పగలరు? అని కదా అడిగారు ఇంతకు ముందు? వినండి. మీకు శ్రమ కూడా తెలియకుండా ఉండేందుకు ఆ రోజులలో జరిగిన విషయం చెప్తున్నాను మీకు. ఇంతవరకూ ఎవరికి తెలియని రహస్యం ఇది" అంటూ ఆగి... ఒక్కక్షణం ఆగి మట్టిగొట్టం లోని నీటిని త్రాగుతూ " నేను అంజనాద్రి గురించి చెప్పబోయేముందు, కాంచీపురంలో ఉండవలసిన నేను ఇక్కడ చంద్రగిరిలో ఉన్నానన్న విషయం మీకెలా తెలిసింది? నా కుమార్తె మంజరిని మీరు ఎలా కలుసుకొన్నారు? ఆ వివరాలను మీరు ముందు నాకు చెప్పండి" అంటూ నవ్వాడు సింగళకరుడు.

మంజరి కూడా పెద్దగా నవ్వి "నాన్నగారూ! మీరు అసాధ్యులు!" అంది. రాజవల్లభుడు సింగళకరునితో "మీ గురించి మాకు వివరాలను చెప్పింది మంజరి. మేము నా తల్లి వాసంతికాదేవి అనుజ్ఞ మేరకు, ఈ

కళాదత్తునితో కలిసి శ్రీరంగనాథుని విగ్రహాన్ని వెదుకుతూ సత్యమంగళంలో బయలుదేరాము. దారిలో ఒకచోట దత్తుడు అస్వస్థుడయ్యాడు. వానికి ఒక తాతగారి వద్ద సత్రంలో పనిచేస్తున్న ఈ మంజరి సేవలు చేసి మళ్ళీ ప్రాణంపోసింది. మా యాత్ర వివరాలు తెలుసుకుని తనూ వస్తానని బయలుదేరి, మీరు ఆనాడు విగ్రహాన్ని సత్యమంగళం నుండి తిరుమలకు తీసుకువచ్చిన బృందంలో ఉన్నారని, మీరు తప్పక సహాయం చేస్తారని మంజరి చెప్పి తీసుకు వచ్చింది. మిమ్మల్ని కలుసుకోవడం చాలా ఆనందమైనది. మాకు స్వామి దర్శనం తప్పక లభిస్తుందన్న హామీ మీ ద్వారా లభించింది."

"అవును! రాజ వల్లభా! మీ తండ్రిగారు చేసిన త్యాగం ఇంతా అంతా కాదు. కులశేఖరులవారు అత్యంత ధైర్య సంపన్నులు. వీరభల్లాలుని వద్ద అంత్యంత నమ్మకంగా కొలువు చేశాడు. హొయసల రాజ్యం భల్లాలుని మరణంతో అంతమైపోయింది. విచిత్రం కాకపోతే, యుద్ధంలో తీవ్రంగా గాయపడిన కులశేఖరునికి మీ అమ్మగారు వాసంతికాదేవి గారు సేవ చేయడం ఏమిటి? ఆయన కోరిక ప్రకారం సత్యమంగళం నుండి విగ్రహాన్ని తెప్పించి, ఆ విగ్రహం ముందు మీ తల్లిగారిని వివాహం చేసుకోవడం ఏమిటి? అంతా ఆశ్చర్యంగా అనిపిస్తున్నది. తరువాత గాయాల బాధతో మీ తండ్రిగారు కొద్దిరోజులలోనే స్వర్గస్తులయ్యారు. అప్పటికే నీవు కడుపున పడ్డావు. ఇవన్నీ నీకు తెలియదు"

"మా తండ్రిగారి వివాహానంతరం ఆ విగ్రహం ఏమైంది సింగళకరా?"

"వాసంతికాదేవి మీ తండ్రి అంత్యక్రియలు తర్వాత తిరిగి ఆ విగ్రహాన్ని సత్యమంగళానికి చేర్చింది. నీకు తెలియని విశేషాలు అనేకం ఉన్నాయి. జాగ్రత్తగా వినండి అందరూ అని కొనసాగిస్తున్నాడు సింగళకరుడు. "ఆ తరువాత విగ్రహం వేదాంత దేశికుల ఆదేశానుసారం, మారిన రాజకీయ పరిణామాల వల్ల మేల్కోట అని పిలవబడే తిరునారాయణపురానికి చేరింది. శ్రీరంగం నుండి మేము దాదాపు 60 మంది భక్తులతో బయలుదేరినది ఆ స్వామి విగ్రహం. తరువాత కొంత

మంది మార్గ మధ్యంలో ఆగిపోవడం, కొంతమంది చనిపోవడం జరిగింది. భక్తులు పలచబడ్డారన్న ఆవేదన మాకు ఎక్కువైంది. యుద్ధాలవల్ల మేల్కోట నుండి సత్యమంగళానికి, మరలా మరోసారి మేల్కోటకు మార్చాము. యుద్ధంలో వీరభల్లాలుని చంపిన ఆ ముష్కరులు కనబడిన హిందూ దేవాలయాలన్నీ ధ్వంసం చేయసాగారు. సుల్తానువల్ల ఎప్పటికైనా విగ్రహానికి ముప్పు ఉన్నదని భావించిన మేము సురక్షిత ప్రాంతానికి తరలించాలని భావించాము. అటు ఉత్తర భారతం సుల్తానుల ఆధీనంలో ఉంది. ఇటు దక్షిణాపథంలో మధురైవారి వశమైంది. అందువల్ల తీవ్రంగా ఆలోచించి తిరుమల తీసుకుని వెళ్ళాలని బయలుదేరాము.

అలా బయలుదేరిన ఐదుగురిలో నేను ఒకణ్ణి. నేను, మంగళగర్, మిగతా ముగ్గురు రక్త సంబంధీకులైన కొడవరులు. వారి పేర్లు కురుగుర దాసర్, శ్రీరామ దాసర్, విల్లిపుత్తూరు దాసర్. కురుగుర దాసర్ కుమారుడు శ్రీరామ దాసర్ కాగా వాని మామ విల్లిపుత్తూరు దాసర్. వీరంతా శ్రీరంగనాథునికి పరమభక్తులు. ఆ విగ్రహ రక్షణకోసం ప్రాణాలను కూడా తృణప్రాయంగా బలివ్వడానికి సిద్ధంగా ఉన్నవారు. స్వామివారి ఆభరణాలను ఒక సంచిలో పెట్టుకుని, విగ్రహాన్ని గుండెలకు హత్తుకుని మా యాత్ర మొదలు పెట్టాము. విగ్రహం బరువుగా ఉన్న కారణంగా వంతుల వారీగా మార్చుకుంటూ యాత్ర సాగిస్తూ స్థానికుల సాయంతో దాదాపు మండలం రోజుల తర్వాత ఇదుగో ఈ చంద్రగిరిని చేరుకున్నాము.

చంద్రగిరి కోట ఇంక ఆమడ దూరం ఉందనగా మళ్ళీ కొంతమంది స్థానికులు మమ్ములను కలిసి ఆ కోటను ముష్కరులు ముట్టడించ బోతున్నారన్న విషయం తెలియజేసేసరికి మాకు మతులు పోయాయి. ఇంత దూరం కష్టపడి నలభై రోజులు ప్రయాణించి వచ్చి ఇక్కడ చేరింది దోచుకోబడడానికా? హతవిధీ! ఎన్ని పరీక్షలు రంగ రంగా అనుకుంటూ మేము మా దారి మార్చుకుని అడవుల వెంబడి బయలుదేరాము. విషయం తెలుసుకున్న కొంతమంది ముసల్మాన్ సైనికులు గుర్రాల మీద మమ్మలని వెంబడించారు. ముగ్గురు సైనికులు మమ్మల్ని చేరుకుని మాకు దగ్గరగా

వస్తుండగా భయంతో విలవిలాలాడిపోయాము. మాతో ఉన్న కొడవరి మలయగర్ మంచి వస్తాదు. అతి ధైర్యవంతుడు. "భయపడవద్దు! నేను ఈ ముగ్గురినీ నిలువరించగలను. మీరు పారిపోండి" అని చెప్పి ఒక పెద్ద చెట్టుకొమ్మను నరికి చక్రంలా తిప్పుతూ వారిని అతి వీరోచితంగా ఎదుర్కొన్నాడు. అతని సైగతో మేము దట్టమైన ఆ అడవిలో దూరి తప్పించుకున్నాము.

"మలయగర్ మిమ్ములను మళ్ళీ కలుసుకున్నాడా?" అన్న వల్లభుని ప్రశ్నకు విచారంగా తలతిప్పుతూ "లేదు వల్లభా! చెప్తాను విను. మలయగర్ ఆ ముగ్గురినీ ఎక్కువసేపు నిలువరించలేక పోయాడు. వారు అతన్ని బంధించి నిజం చెప్పమని అతి క్రూరంగా హింసించారు. మలయగర్ రంగా రంగా అని అరుస్తూనే ఉన్నాడు తప్పనోరు విప్పలేదు. ఆ రంగని పేరు విన్న సైనికులు ఆ విగ్రహం గురించి మాట్లాడుకుని వీరి వద్ద విలువైన ఆభరణాలు ఉంటాయని అర్థం చేసుకుని "రండి! కోటకు వెళ్ళి ఎక్కువ సైన్యాన్ని తెచ్చి అడవిని శోధిద్దాం. నగలు, వజ్రాలు, వైడూర్యాలు దొరుకుతాయి. తీసుకుని వెళ్ళి సుల్తానులవారికి ఖుషీ చేద్దాం. మంచి కొలువును పొందుదాం" అంటూ నిర్దాక్షిణ్యంగా మలయగర్ రెండు కాళ్ళూ నరికివేశారు. మేము అప్పటికే అడవిలో చాలా దూరం వెళ్ళిపోయాము. మిగతా ముగ్గిరిని పొదల్లో దాచి, నేను మలయగరుని వెదుకుతూ వెళ్ళాను. ఒకచోట కాళ్ళు నరకబడి, విలపిస్తూ, రక్తం కాలువలు కట్టిన స్థితిలో కూడా మాకు చివరి సందేశం ఇవ్వడం కోసం ప్రాణాలు వదలకుండా ఉగ్గబట్టుకుని వేచి ఉన్నాడు. మలయగరుని చూసిన నాకు స్పృహ తప్పింది. కొంత సేపటికి తేరుకుని "మలయగరూ! ఏమైంది?" అన్నాను ఏడుస్తూ. మలయగరు అంత దయనీయ స్థితిలో కూడా కన్నీళ్ళు కాలువలై పారుతుండగా చిరునవ్వునవ్వి సింగళకరా! బాధపడకు. రంగనిసేవలో నా ప్రాణం పోతే బాధ పడడం ఎందుకు? మంచానపడి ముసలి తనంలో మామూలుగా ప్రాణాలు విడవడం కన్న ఇది ఎంత శ్రేష్ఠమైన మరణం చెప్పు?" అని నన్ను ఓదార్చి "విగ్రహం, ఆభరణాల విషయం ముష్కరులకు తెలిసిపోయింది. స్వామిని రక్షించండి, అని జరిగింది చెప్పి కన్నుమూశాడు.

నా జీవితంలో అత్యంత విషాదకరమైన రోజు అది. వానిని ప్రక్కన ఉన్న ఒక పెద్ద గోయిలో పాతిపెట్టి మట్టికప్పి విలపిస్తూ మా వాళ్ళను చేరుకున్నాను. త్వరత్వరగా రండి. సైన్యం మనలని వెదుకుతున్నారు. వేగంగా అని విగ్రహాన్ని గుండెలకు గట్టిగా హత్తుకుని పరుగులెత్తాము. అలా ఎంతసేపు పరుగులెత్తామో మాకే తెలియదు. చివరకు అదృష్ట శావత్తూ అంజనాద్రి కొండ మొదటికి చేరుకున్నాము. ఆ కొండ ఎక్కాలని నేను చెప్పగానే మిగతా ముగ్గురు కొడవరులు "మేము విగ్రహాన్ని తీసుకుని కొండపైకి వెళ్తాము. నీవు ఇక్కడే ఉండి శతృసైనికుల రాకపోకలు కనిపెడుతూ ఉండు. మూడు రోజులవరకూ ఎటువంటి ప్రమాదమూ జరగనట్లైతే నువ్వు కొండపైకి రా! అప్పుడు ప్రశాంతంగా తిరుమల చేరుకుందాం అని చెప్పిన మాటలు నాకూ నచ్చి, వారిని పైకి పంపించి, నేను కొండల పొదల వెనుక దాక్కుని గమనించడం మొదలుపెట్టాను. రెండు, మూడు గంటలు గడిచింది. సుల్తాను సైన్యం గుర్రాలపై కత్తులు కటార్లు శూలాలు చేతబట్టి అంజనాద్రి వైపు దూసుకుని రావడం, దూరం నుండి నేను గమించాను. హయ్యో! రంగ రంగా! ఏమిటి కర్తవ్యం అని భయపడసాగాను.

వల్లభుడూ, దత్తుడూ, మంజరి చెవులు రిక్కించి వింటున్నారు. వల్లభుడు ఎంతో భావోద్వేగం చెందాడు. ఆహా! స్వామి విగ్రహ రక్షణకు ఎన్ని అవాంతరాలెదురైనా ప్రాణాలకు లెక్కచేయని వీరి భక్తి ముందు నేను పడుతున్న శ్రమ ఎంత? అమ్మ తన్ను ఎందుకు 'విగ్రహాన్ని వెదికిన తర్వాతనే, తన వివాహం గురించి ఆలోచించమని' ఒట్టు ఎందుకు తీసుకుందో ఆ క్షణాన అవగతమైంది. ఆ విగ్రహం కాపాడడం వల్ల ఒక గొప్ప సమాజం, దాని ఆశలు పరిరక్షింపబడతాయి. అంజనాద్రిపై ఉన్న కొడవరుల పరిస్థితి విన్న వల్లభుని చెక్కిళ్ళపై కన్నీరు ధారగా కారుతున్నది. "సింగళకరా! తరువాత ఏమైంది?" అని ఆతృతగా అడిగాడు.

అంజనాద్రి క్రింది భాగాన పొదల్లో దాక్కొని ఉన్నాను. పొద చుట్టూ దట్టమైన అడవి. చూస్తూ ఉండగా సుల్తాను సైన్యం పెద్ద సముద్రంలా

అడవిలో ప్రవేశించసాగింది. ఇది గమనించిన పశువులు, పక్షులూ ఆ అలికిడికి చెల్లా చెదురయ్యాయి. ఇదంతా పొదల్లో దాక్కుని చూస్తున్న నాకు నోట మాట రాలేదు. కళ్ళలో నీళ్ళు ధారాపాతంగా కారిపోతున్నయ్. ఇక చేసేదేమీ లేదని చేష్టలుడిగి అలాగే చూస్తూ ఉండిపోయాను. కొండ దిగువకు చేరుకున్న సైన్యం డేగ కళ్ళతో మొత్తం అణువణువూ పరిశీలంగా చూస్తున్నారు.

పాపం కొండపై నున్న కొడవరులకు ఇది తెలియక ధైర్యంగా కొండ పైపైకి సాగిపోతున్నారు. సైనికులలో కొంతమంది కొండఎక్కి గబగబా కొడవరులను చేరుకుని చుట్టుముట్టారు. మళ్ళీ వేగంగా పొదల్లో దూరి కొంత దూరం పరుగెత్తి తప్పించుకున్నారు. కొడవరులు ఇలా జరిగిందేమిటి? ఒక వేళ తిరుమల చేరుకున్నా ఈ సైనికులు వచ్చి ముట్టడించడం జరుగుతుంది ఏమి చెయ్యాలని ముగ్గురూ దీర్ఘంగా ఆలోచించారు. క్రిందకు చూస్తుంటే సైన్యం కూడా కష్టపడి గుర్రాల మీద కొందరు నడిచి కొందరు కష్టపడి కొండను ఎక్కడానికి యత్నిస్తున్నారన్న విషయం వారికి అర్థమైంది. ఆపద చుట్టుముట్టడానికి ఎంతో సమయం లేదని ఏదైనా సాహసం చేసి స్వామివారిని కాపాడుకోవాలని అనుకున్నారు.

శ్రీరంగం ఆలయంలో జరిగే పది ముఖ్య వంశపారంపర్య సేవల్లో కొడవరులది రెండవ స్థానం. కురుగురు దాసు అందరికన్నా పెద్దవాడు. వయసు 82. విల్లిపుత్తూరు దాసుకు 70, శ్రీరామదాసుకు 62. కురుగురు దాసు పెద్దగా "సైన్యం మనల్ని ముట్టడించడానికి ఇంకెంతో వ్యవధి లేదు. త్వరగా ఆలోచించండి" అన్నాడు. ఆ పర్వతానికి మూడువైపులా ఏటవాలుగా ఉంటుంది. ఒక వైపు మాత్రం నిటారుగా వేయిపడగలు విప్పినిలుచున్న ఆదిశేషుని రీతిలో ఉంటుంది. ఈ పరిస్థితి గమనించిన సైన్యం మూడువైపులా నిలబడి ఉన్నారు. పైకి పోయి దారిలో ఎవరూ నిలబడలేరన్న ధీమాతో ఉన్నారు. కురగురుదాసు వెంటనే ఒక పథకం ఆలోచించి వెంటనే "ఓయీ దాసులారా! జాగ్రత్తగా వినండి. మూడువైపులా సైనికులు చుట్టుముట్టారు కానీ ఈ నాలుగవ వైపు ఎవరూ లేరు. కాబట్టి ఇక్కడి

చెట్లకు, పొదలకు ఉన్న బలమైన తీగలు వెంటనే కోసి పట్టుకుని రండి. ఆ తీగలతో నన్ను ఆ శ్రీరంగనాథునికి కలిపి కట్టండి. బలమైన తాడు నా నడుముకు కట్టి నన్ను ఈ లోయలో దించండి. చూడండి! లోయ సుమారు ఒక తాడి చెట్టు లోతున్నది. అక్కడనుండి అంతా ఏటవాలు ప్రాంతం. అక్కడ నడిచే వీలు లేదు. కేవలం దొర్లుకుంటూ వెళ్ళవలసిందే! నేను నేలపై దిగగానే త్రాళ్ళను కోసెయ్యండి నేను దొర్లు కుంటూ లోయలోనికి వెళ్ళిపోతాను. ఏ నరమానవుడూ అక్కడికి రాలేరు. నా స్వామి విగ్రహం ముష్కరుల చేతికి దొరకకుండా పదిలంగా ఉంటుంది. తర్వాత మనందరం మళ్ళీ కలుసుకుందాం.” అది మీ ప్రాణాలకు ప్రమాదం కదా! అన్నారు వెంటనే మిగతా ఇరువురూ. సమయంలేదు! మీరిలా వాదోపవాదాలతో కాలం గడిపితే వాళ్ళు వచ్చి మొత్తం దోచుకుని మనలను చంపేస్తారు కదా అన్నాడు.

మొత్తానికి వాళ్ళను ఒప్పించి స్వామి ముఖభాగం క్రిందికి, కాళ్ళ భాగం పైకి వచ్చేట్టు తీగలతో గట్టిగా బంధించారు. స్వామికి ఇద్దరూ సాస్టాంగ నమస్కారం చేసి కురగురుదాసు నడుముకు తలక్రిందులుగా విగ్రహం కట్టారు. స్వామికి ప్రార్ధనచేస్తూ దాసును క్రిందికి మెల్లిగా దింపుతున్నారు. క్రింద కంటక ప్రాయంగా, పొదలు చెట్లతో ఉండడం వల్ల వాళ్ళు క్రింద చూడలేక పోతున్నారు. తాడు ఉన్నంతవరకూ దింపి తరువాత తాడును వదిలేశారు. కురవరదాసు దొర్లుతూ క్రిందికి జారసాగాడు. అలా జారుతూ వెళ్ళడం వల్ల, ఎన్నో రాళ్ళు, ముళ్ళచెట్లు అతని శరీరాన్ని తీవ్రంగా గీచుకుని బాధించాయి. ఓం నమో నారాయణాయ! అని పెద్దగా ప్రార్ధిస్తూ దొర్లిపోతున్నాడు దాసు. అది చూసిన ఇరువురూ భయపడి, ఏమి చెయ్యాలో దిక్కు తోచక, ఒక గంట తర్వాత క్రిందకు దిగి కురవరదాసు కోసం గాలించారు. ఒక శంఖుపుష్పాలు గల పొదలో దాసు శవం దొరికింది. ఆయన కాళ్ళు విరిగిపోయాయి. ముళ్ళ చెట్లు గ్రుచ్చుకుని, కళ్ళు మొహమూ గుర్తుపట్టలేని స్థితిలో దారుణంగా తయారయింది. రక్తపు మడుగులో ఉన్నాడు. శ్రీరామదాసు దుఃఖానికి అంతులేదు “అయ్యో! నాన్నా! వెళ్ళిపోయావా!

అంటూ విలపిస్తున్నాడు. అలా విలపిస్తూ మామగారి వంక చూశాడు. ఒక రాతి గుట్టపై కూర్చుని శవాన్ని చూస్తున్నాడు. మాటలేదు పలుకులేదు. శిలా ప్రతిమవలె నిలువు గ్రుడ్లతో చూస్తున్నాడు. రామదాసు మావయ్యా! చూశావా! నాన్న గారిని, అని భుజం ఊపాడు. అంతే కూర్చున్నవాడు కూర్చున్నట్లు వెనక్కి వాలిపోయాడు. శ్రీరామదాసు గుండెలు బాదుకుంటూ ఏడుస్తున్నాడు. ఇక నాకు ఎవరు గతి అని విలపిస్తున్నాడు. అతని ఏడుపుకు చెట్లు, చేమలూ, పక్షులూ జంతువులు శిలాప్రతిమలై చేష్టలుడిగి చూస్తున్నాయి.

కురుగురదాసు, విల్లిపుత్తూరుదాసు శవాలను అంజనాద్రి అడవుల్లో చూసిన శ్రీరామదాసు శిలాప్రతిమలా ఉండిపోయాడు. కొన్ని గంటల తర్వాత తేరుకుని శ్రీరంగనాథుని విగ్రహం కోసం వెదక సాగాడు. పొదలన్నీ వెదికాడు. చివరకు చెట్ల తీగలతో గట్టిన తాడు కనిపించింది. అది శంఖుపుష్ప పూల పొదలో కనిపించింది. తాడును అనుసరించి పొదలోకి వెళ్ళి వెదికాడు. అక్కడ శ్రీరంగనాథుని విగ్రహం కనిపించలేదు. ఒక్కసారి గుండె ఆగినట్లైంది. ఏమైంది? "స్వామీ! నన్ను పరీక్షించింది చాలు. దయచేసి దర్శనమివ్వు" అని కళ్ళు మూసుకుని విలపిస్తూ కళ్ళనీళ్ళు కారుతుండగా ప్రార్థించి నిలబడ్డాడు. అప్పుడు సూర్యాస్తమానం అయింది. పొదల్లోకి సూర్యకిరణాలు చొచ్చుకుని వెళ్తున్నాయి. ఆ పొదలకు ఇంకోవైపు ఏదో మెరుస్తూ కనపడింది. అక్కడకు పరిగెత్తుకుంటూ వెళ్ళాడు. ముళ్ళు కాళ్ళలో దిగుతున్నా మోకాళ్ళకు, మోచేతులకు తుమ్మపొదల ముళ్ళు గ్రుచ్చుకుంటున్నాయన్న ధ్యాసే లేకుండా పరుగులెత్తాడు. అక్కడ ఆ పొదలో దివ్య ప్రకాశంతో వెలిగిపోతున్న స్వామివారి విగ్రహం కనిపించింది. "కనుగొన్నాను తండ్రీ!" అని ఆనంద భాష్పాలతో కాళ్ళు చేతులు ముళ్ళుదిగి రక్తం కారుతున్నా ఆ ధ్యాసే లేకుండా ఆ విగ్రహాన్ని ఒడిలో పెట్టుకుని "స్వామీ... నీకు ఎటువంటి దెబ్బ తగలకుండా తప్పించుకున్నావు. మరి నాకు ఇంత దెబ్బ తగిలిందేమిటి స్వామీ!" అని వాపోతూ విగ్రహాన్ని కౌగలించుకుని ఏడ్చాడు. ఈ లోపల నాకు పైన జరిగిన విషయాలు తెలియక ఆందోళన పడ్డాను. రాత్రి అడవి

మొదట్లో చిమ్మ చీకటి వ్యాపించింది. అలాగే దీనంగా పొదల్లో కూర్చుని, చీకటిపడి సైన్యం ఎవరూ లేరని నిశ్చయించుకున్న తర్వాత మెల్లిగా కొండ ఎక్కడం ప్రారంభించాను. కొండమీద కటిక చీకటి వ్యాపించింది. మనుష్యుల అలికిడి లేదు. దూరాన ఏదో దివిటీ వెలుగు కనిపించింది. ఒకవేళ సుల్తాను సైనికులా అని భయపడుతూ రంగడిమీద భారంవేసి అడుగులు వేశాను. ఇంతలో "సింగళకర్! సింగళకర్! నువ్వేనా? అంటూ వెదుక్కుంటూ శ్రీరామదాసు దివిటీతో వచ్చాడు. అతను పెద్దగా ఏడుస్తూ నన్ను చూశాడు. చూసిన వెంటనే, దివిటీ చెట్టుకొమ్మపై పెట్టి, శ్రీరంగనాథుని విగ్రహం ఒక పొదపై జాగ్రత్తగా ఉంచి, నన్ను కౌగలించుకుని పెద్దగా ఏడ్చాడు. ఇద్దరి శరీరాలు కన్నీళ్ళతో తడిసిపోయాయి. కొంతసేపటికి తేరుకుని, విషయమంతా నాకు వివరించి చెప్పాడు. మరుసటిరోజు ఉదయం వారిద్దరికి అంత్యక్రియలు చేయాలని చెప్పాడు. తెల్లారాక ఎంత చెప్పినా వినకుండా, స్వయంగా నేను అంత్యక్రియలు నిర్వహించి కలుస్తాను అని వెళ్ళిపోయాడు. అడవిలో ఎంతో వెతగ్గా వారి శవాలు దొరికాయి. దూరంనుండి చూస్తున్నాను. శవాలను ప్రక్కన పొదల్లో పాతిపెట్టాడు. తర్వాత ఏడుస్తూ నిలబడ్డాడు. అతని ఏడుపు కొంచెం సద్దుమణిగిన తర్వాత అటుగా వెళ్ళాను. కానీ ఆశ్చర్యం అక్కడ శ్రీరామదాసు లేడు, పొదలపై నిలబెట్టిన స్వామివారి విగ్రహమూ లేదు. చుట్టుపక్కల ఆరోజంతా సాయంత్రం వరకూ వెదికాను. అతని జాడలేదు. ఏమైపోయ్యాడో తెలీదు. విగ్రహం ఏమైందో తెలియదు.

చీకట్లు కమ్ముకున్నా ఆశ చావక అతనికై ఎదురుచూస్తూ ఉన్నాను. ఆ ఒక్క రాత్రి చూద్దాం అనుకుని అక్కడే విశ్రమించాను. తెల్లవారి లేచి లేవడానికి ప్రయత్నిస్తే నిలబడలేకపోయాను. కాళ్ళురావడంలేదు. కాళ్ళు మొద్దుబారిపోయాయి. కాళ్ళపై ఏవో విషపురుగులు కుట్టినట్టు రక్తపు చారలు ఎండిపోయి కనిపించాయి. అలాగే దేకుతూ.. ప్రాకుతూ వస్తుండగా అక్కడికి కోయజాతి వాళ్ళు రాగా సైగలతో కాళ్ళు చూపించాను. వాళ్ళు అర్థమైందన్నట్లుగా అడవిలో ఏవో ఆకు పసరులు తెచ్చి కాళ్ళకు పూసి

క్రిందనే ఉన్న వారి గూడేనికి తీసుకుని వెళ్ళి చికిత్స చేశారు. కాళ్ళు కొంచెం స్వాధీనానికి వచ్చాయి. లేచి మెల్లిగా నడవడం ప్రారంభించి వాళ్ళను వీళ్ళను బ్రతిమలాడి, ఒక కట్టెల బండిపై పడుకుని, ఎలాగో కాంచీపురం చేరుకున్నాను. తర్వాత కొంతమంది ఈ చంద్రగిరికి వలస వస్తూ, అక్కడ కాంచీపురం లో నివాసం దినదినగండమని చెప్పి, సుల్తాను సైన్యం ఏ క్షణంలోనైనా దాడిచేస్తారని చెప్పి, నన్నూ రమ్మని పిల్చారు. వచ్చి ఇక్కడే తోటా పొలము ఏర్పాటు చేసుకుని ఒంటరిగా కాలం గడుపుతున్నాను. మంజరి ఆడపిల్ల కనుక సుల్తాను సైనికుల అకృత్యాలకు భయపడి ఒక సత్రంలో పనిచేయమని చెప్పాను. సుల్తానుల అధీనంలో ఉన్న సత్రం కనుక ఎవ్వరూ ఏమీ చెయ్యలేరని ధీమా. పైగా వైద్య బృందాలను సైనికులు సాధారణంగా ముట్టుకోరు. ఇప్పటికీ ఎడమకాలు ఇంకా పూర్తి స్వాధీనం లేదు. గుర్రంపై మాత్రమే స్వారీ చేయగలను అన్న సింగరకళ్ మాటలు విని ముగ్గురూ కన్నీరు మున్నీరుగా విలపించారు. వెంటనే రాజవల్లభుడు తన కత్తిని తీసి అందరి ఎదుటా "ఈ కత్తి నా ఆవేశం చల్లారనీయ ఉండుగాక! నేను ఆ స్వామి విగ్రహాన్ని వెదికి సాధించే వరకూ నా ఆవేశం ఇలాగే ఉండాలని ఆశీర్వదించమని ఆ శ్రీరంగనాథుని కోరుకుంటున్నాను!" అన్నాడు. అందరూ అతని కత్తిని తాకి "అస్తు! అస్తు! శుభమస్తు!" అని పలికారు.

మరలా చంద్రగిరి అడవుల్లో ప్రయాణం సాగుతున్నది. అంతా మౌనంగా ఉన్నారు. వల్లభదత్తుడు ఆ నిశ్శబ్దాన్ని భేదిస్తూ "సింగరకళ్..ఇంకా విగ్రహం ఆ అంజనాద్రి లోయలోనే ఉంటుందనుకుంటున్నారా? శ్రీరామదాసు ఏమయి ఉంటాడు? అతనూ మరణించాడా? సుల్తాను సైన్యానికి స్వామివిగ్రహం దొరికి ఉంటే?" అన్న ప్రశ్నకు సింగళకరుడు "అవును నీ సందేహం సహజమే! కానీ కొడవరుడు ఆ విగ్రహాన్ని తీసుకుని వెళ్ళినట్లైతే కాంచీపురంలో అంత కాలం ఉన్న నాకు తెలియకుండా ఉండదు. సత్రంలో పనిచేస్తున్న మంజరికైనా చెవిలో పడకుండా ఉంటుందా? సుల్తానుల పాలయినా ఆ వార్త దాగదు కదా! ఆనాడే అడవిని వదిలి

రిక్తహస్తాలతో చాలా ఆగ్రహంతో అరుస్తూ వెళ్ళిపోయిన సైనికులను నేను చూశాను. వారు వెనక్కు వెళ్ళిపోయాకే నేను కొండనెక్కి శ్రీరామదాసును కలుసుకొన్నాను కదా! కనుక ఇంకా విగ్రహం అక్కడే ఉండాలని నేను నమ్ముతున్నాను.

"మరి ఆ ఆభరణాల మూట ఏమైంది?"

"మేము ఆ ఆభరణాల మూటను కొండ ఎగువ ప్రాంతంలో భూమిలో దాచి ఉంచాము. ఆ ప్రదేశం నాకు ఇప్పటికి గుర్తున్నది. కొండ అక్కడ వంపు తిరిగి చంద్రాకారంలో ఉంది. అక్కడ దాచాము"

"సింగళకరా! నిజంగా మిమ్ములను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది. మాకు ఆ స్వామివారి విగ్రహం దొరుకుందన్న నమ్మకం కలుగుతున్నది"

"తప్పక ఆ రంగనాథుడు మనలను కరుణిస్తాడు. అధైర్య పడకండి. ఇక్కడి దగ్గరగా పొగ వస్తున్నది కదా! చూశారా! అది కోయజాతి వారి గూడెం. అక్కడే నేను వారం రోజులు వారితో ఉన్నాను. వారి మూలికా వైద్యం సకాలానికి నాకు అందకపోతే శాశ్వతంగా నా కాళ్ళు చచ్చుపడి ఉండేవి"

మెల్లిగా ఆ కోయజాతి వారి నివాసాలను చేరుకున్నారు. ఒక చిన్న జలపాతం చూపించి, దీనిని దాటిన తర్వాత వారి స్థావరం వస్తుంది. మనకు తినడానికేమైనా కందమూలాలు దొరుకుతాయేమో ప్రయత్నిద్దాం. ఇన్ని సంవత్సరాల తర్వాత నన్ను గుర్తుపట్టే వృద్ధుడొక్కడైనా ఉండకపోడు" అని సింగళకరుడు అంటుండగా, జలపాతం దిగువనుంచీ "తూక...తూక" అని ఒక ఆడ గొంతు వినిపించింది. సింగళకరుడు "ఆగండి!" అన్నాడు. గుర్రాలన్నీ ఆగిపోయాయి. ఒక స్త్రీ జలపాతంలో స్నానం చేసి పైకి వస్తున్నది. వీరందరిని చూసిన ఆ స్త్రీ వస్త్రాలను బాగా కప్పుకొని నవ్వింది. దత్తుడు, రాజవల్లభుడు మొదటిసారి అంత అందమైన అడవి జాతి స్త్రీ అందాన్ని తిలకిస్తున్నారు. స్వచ్ఛమైన గాలి, వెలుతురు, ఆహారంతో పెరిగిన ఆమె యవ్వానానికి ముగ్ధులయ్యారు. ఇదంతా చూస్తున్న మంజరి ధైర్యం చేసి "ఇక్కడ ఉండడానికి వసతి ఉంటుందా?" అని సైగ చేసి అడిగింది. ఆ స్త్రీ

అర్ధమైనట్టు నవ్వి "నాతో రండి" అన్నట్టు సైగ చేసింది. వారందరూ ఒక తాళ్ళ వంతెనపై ఆ జలపాతాన్ని దాటి కోయగూడెం చేరుకున్నారు. కోయదొర తెలుగు, తమిళం కలిపి మాట్లాడడం వారికి ఆనందాన్నిచ్చింది.

సింగళకరుడు తదితర బృందం వారి ఆతిధ్యం స్వీకరించాక, తను పూర్వం ఇక్కడ వారం ఉన్న సంగతి చెప్పగా కోయదొర "అయితే మీకు ఆ తరువాత ఇక్కడ జరిగిన విషయం తెరియాదా?" అన్నాడు. అందరూ ఆశ్చర్యంగా ఏమైందన్నట్టు దొరవైపు చూశారు.

"సాములూ శ్రీరంగనాథుని విగ్రహాన్ని నగలనూ వెదికి పట్టుకోడానికి సుల్తాను సైన్యం అంజనాద్రిపైకి వెళ్ళింది. చాలాసేపు వెదికిన తర్వాత ఎవరూ దొరకలేదనే కోపంతో క్రిందికి వచ్చారు. మావైపు ఎవరూ రాలేదని చెప్పిన మాటలను విని వెళ్ళిపోయారు. వారు మాకు ముందున్న ఒక కోయగూడెం ప్రాంతానికి వెళ్ళి కొడవరులను గురించి, విగ్రహం గురించి అడిగారు. మేము వారికి అండగా నిలిచామని, మేమే వారిని దాచి అబద్ధం చెప్తున్నామని ఊహించి, మాకు ముందున్న గూడెం మొత్తం అగ్నికి ఆహుతి చేసి వెళ్ళిపోయారు. క్రమ క్రమంగా వాళ్ళు అంటించిన అగ్ని అన్నివైపులకూ అంటుకున్నది. అలా ఒక నెల రోజులపాటు అడవంతా దగ్ధమయిపోయింది. చల్లారడానికి రెండు వారాలు పట్టింది. మేము వెళ్ళి మా ప్రాంతాన్ని చూసి మావాళ్ళంతా అగ్నికి ఆహుతయ్యారని తెలుసుకున్నాం. మా ఆస్తులు, మా బంధువులు అంతా బూడిదయి పోయాయి. మేము ఎవరికి ఏ హానీ చేయం. కానీ మాకు ఇది జీవితంలో కోలుకోలేని దెబ్బ" అంటూ ముగించాడు. విన్న వారికి హృదయాలు బరువెక్కాయి. వల్లభుడు మెల్లిగా "అయితే ఆ మంటల్లో మా కొడవరుడు శ్రీరామదాసు కూడా ఆహుతయి ఉంటాడా?" అన్న ప్రశ్నకు కోయదొర "ఆ అగ్ని దక్షిణప్రాంతం నుండి క్రమంగా ఉత్తరానికి వ్యాపించింది. మీ దాసు ఉత్తరం వైపు పరుగెత్తి ఉండవచ్చు. అక్కడ చెంచు జాతివారున్నారు. వారిని అడిగితే మరిన్ని విషయాలు బయటపడతాయి" అని వారికి తినడానికి కొన్ని కందమూలాలు పెట్టాడు. ఆకలి రుచి యెరగదు అన్న

సామెతగా అందరూ ఆవురావురుమని వాటిని తిన్నారు. కోయదొర "సాములూ..ఇట్టా చెప్పానని అనుకోవద్దు. అక్కడికి ఆడవారు వెళ్ళడం అంత క్షేమం కాదు. చెంచులు మంచివాళ్ళే కానీ కొంతమంది క్రూరులు అక్కడ ఉండడం వల్ల మేము ఆ ప్రాంతాలకు వెళ్ళడంలేదు. కోయలకు, చెంచులకు అందుకే అంత స్నేహం కుదరదు. మాకూ వాళ్ళకు అన్న సఖ్యతే తప్ప లగ్గ సఖ్యత కూడా ఉండదు. మా పాటికి మేం ఉంటాం. వారి జోళికెళ్ళం. వాళ్ళూ అంతే! ఇంకా క్రూరమృగాలు, విషపుజాతి పురుగులు ఆ ప్రాంతంలో ఎక్కువ. అందువల్ల ఈ అమ్మాయిని ఇక్కడ వదలి వెళ్ళండి లేదా మా వాళ్ళతో సురక్షితంగా చంద్రగిరి చేరుస్తాను. మీరు వచ్చేవరకూ అక్కడ ఉండమని చెప్పండి" అన్నాడు.

సింగళకర్ ఆ మాటలు విని నిజమే "నాకు కూడా ఆరోజుల్లో ఒక విషపు పురుగు కుట్టింది. అందువల్ల నేను కొండకు ఉత్తరభాగాన ఉన్న ఒక చోట ఉండాల్సి వచ్చింది. ఎందుకైనా మంచిది మంజరీ! నీవు ఇక్కడే ఉంటావా? చంద్రగిరికి వెళ్తావా? చెప్పు?" అన్న ప్రశ్నకు మంజరి "మీ ఇష్టం" అంది. వెంటనే కోయరాజు, "గుర్రాన్ని ఇక్కడే ఉండనివ్వండి. తిరుగు ప్రయాణంలో తీసుకుని వెళ్ళవచ్చు" అని డోలీ ఒకటి ఏర్పాటు చేయించి, ఇంటి గుర్తులు చెప్పి, ఇద్దరు బోయీలను ఆమెను చంద్రగిరిలో సురక్షితంగా సింగళకరుని గృహంలో వదలిరమ్మని చెప్పాడు.

కోయదొరకు అనేక విధాల ధన్యవాదాలు చెప్పి ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకుంటూ ఉండగా, కోయదొర సుకలులు అనబడే ఇద్దరిని పిలిచి "సుకలులూ! సావధానులై వినండి. వీరు చెంచుజాతి వారిని సురక్షితంగా చేరుకునే వరకూ, వారినుండి ఏప్రమాదం జరగదన్న నమ్మకం కలిగే వరకూ వారితో ఉండండి" అని వల్లభుని వైపు తిరిగి "సామీ! వీరిద్దరూ గండరగండలు. భయం అనే పదం ఎరుగని వారు. రాజాస్థానం (నేటి రాజస్థాన్ రాష్ట్రం) ప్రాంతానికి చెందిన కోయవారు. వీరిద్దరూ బాణం వేసినా కత్తివిసిరినా అంతే! శత్రువు యమపురికి వెళ్ళినట్లే! ఎవరూ

తప్పించుకోలేరు. పాతికమంది వచ్చినా ఎదిరించి నిలవగలరు. ఇక్కడికి దేశాలను చూస్తూ వచ్చి, నా నియమాలు అవీ నచ్చి ఆరునెల్లనుండి ఇక్కడే ఉండిపోయారు. మన భాషకూడా నేర్చుకున్నారు. వీరి వినికిడి శక్తి, వాసన శక్తి మనకంటే పది రెట్లు ఎక్కువ. ఆమడ దూరంలో చీమ చిటుక్కుమన్నా చెప్పేస్తారు. శుభం. వెళ్ళిరండి" అని సాగనంపాడు. వల్లభుడు, దత్తుడు, సింగళకరుడు గుర్రాలపై స్వారీ సాగిస్తున్నారు. వంద గజాల ముందుగా సుకలులు పరిస్థితులను గమనిస్తూ సాగుతున్నారు. రాజవల్లభుడికి, దత్తుడికి చాలా సంతోషంగా ఉంది. సుకలులు, సింగళకరుడు వెంట ఉంటే ఎలాగైనా ఆ స్వామి విగ్రహాన్ని నగలను సాధించుకుని వెళ్ళగలమన్న నమ్మకం కుదిరింది.

సుకలులు పదునైన పెద్ద పెద్ద కత్తులతో అడవిలో ప్రయాణానికి అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను సునాయాసంగా నరుక్కుంటూ, మధ్య మధ్యలో వారిని సేద దీరమని జలపాతాల వద్ద, సరస్సులవద్ద కందమూలాలు ఉడికించి వారికి తినమని ఇస్తూ సాగుతున్నందున వారికి శ్రమ తెలియడంలేదు.

అల్లంతదూరంలో చెంచుగూడెం వచ్చిందన్న గుర్తుగా "హహ్హెహ్వా! న సుఖ! న సుఖ! ఎవరాడ?" అని ముందుగా ఏవో అరుపులతో మేము మీ స్నేహం కోరిన వాళ్లం సుమా! అని చెబుతూ ముందుకు సాగుతుండగా వీరు వారిని అనుసరిస్తున్నారు. సుకలులు లేకపోతే తమగతి ఏమై ఉండునా అని ఆలోచిస్తూ ఉండగా ఆ ప్రాంతాన్ని చేరుకున్నారు. ముందుగా సుకలులు వారితో మాట్లాడిన తర్వాత వాళ్ళ గూడెం పెద్దవద్దకు తీసుకుని వెళ్ళారు. పెద్ద వారికి తేనె, మంచినీరు అందించి "తమ రాకకు కారణం ఏమిటి?" అని సుకలులను అడిగాడు. దానికి సుకలులకు ఏమి చెప్పాలో తెలియక రాజవల్లభుని వైపు చూశారు. రాజవల్లభుడు ఏం చెప్పాలా అని ఆలోచిస్తుండగా "నాకు తెలుగు తెలుసు. చెప్పండి" అన్నాడు పెద్ద. వచ్చిన విషయం వివరించి "శ్రీరంగనాథుని వెదికి పట్టుకోవాలి. మా జీవిత లక్ష్యం అదే!" అని పెద్దకు జరిగిన విషయాలను, కొడవరుడు తప్పించుకున్న

విషయం అంతా వివరంగా చెప్పి, "మీరు ఆ రంగనాథుని విగ్రహం విషయంలో తప్పక సహాయం చేయవలసినదని" వంగి నమస్కరించారు.

గూడెంపెద్ద ఆ సమయంలో జరిగిన అగ్నిప్రమాదం గురించి చెప్తూ " అవును నాకు మొత్తం గుర్తుకొచ్చింది. కోయవారు నివసించే ప్రాంతం నుండి అగ్ని మొదలై ఉత్తరం వేపు రాసాగింది. మేము మా కులదైవమైన లక్ష్మీ నరసింహస్వామిని ప్రార్ధించాము. ఆయమ్మకు బలులను సమర్పించాము. కన్యలు ఉపవాసాలు ఉంటూ, రక్షించమంటూ స్వామి విగ్రహం ముందు నృత్యాలు చేశారు. మా అల్లుడైన లక్ష్మీ నరసింహస్వామి దయవలన ఆ అగ్ని మా అదృష్టం వల్ల సిలంబోద్దై వద్దనే ఆరిపోయి ఆగిపోయింది. అక్కడనుండి కొంత దూరం మేరకు ఎడారి ప్రాంతంలాగా ఉంటుంది. అక్కడ ఏ చెట్టూ మొలవదు. మొత్తం పెద్ద బీడుబడ్డ కొండ ప్రాంతం. అది కూడా ఒక కారణం కావచ్చు. ఏది ఏమైనా మా ప్రార్ధనలు మా స్వామి విన్నాడు. కానీ తర్వాతి పర్యవసానాలను భరించడం మాకు కొంతకాలం చాలా కష్టమైంది" అన్నాడు. దత్తుడు "అగ్ని ప్రమాదం ఆగిపోయింది కదా! ఇంక వేరే పర్యవసానాలు ఏముంటాయి?" అన్న ప్రశ్నకు ఆ పెద్ద నవ్వి "అగ్నిని తప్పించుకోవడానికి మృగాలు, పెద్ద పెద్ద పాములూ, ఎలుకలూ, ఇంకా అనేక జంతుజాలం మా గూడెం వైపుకు వచ్చి చేరాయి. అంతా సర్దుకోడానికి మామూలు జీవనం సాగించడానికి సంవత్సర కాలం పట్టింది. మీ కొడవరుడు ఎలా తప్పించుకోగలడు? మా వద్దకు వచ్చిన సాక్ష్యాధారాలేమీ లేవు" అన్నాడు.

కోయదొర చేతులనాడిస్తూ ఒక అనుచరుడికి ఏదో సైగ చేశాడు. వెంటనే గవ్వలున్న బుట్ట ఒకటి ముందు పెట్టాడు. ఇసుకపై అంజనాద్రి చిత్రం గీచాడు. అడవి మొత్తం క్షుణ్ణంగా తెలిసినట్టు అంత స్పష్టంగా చిత్రం గీయడం ఆశ్చర్యం అనిపించి దత్తుడు, వల్లభుడు, మంజరి ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. ఉత్తర దక్షిణ దిక్కులను సూచించి, పాము పడగలవలె ఉన్న ఎత్తైన కొండను కూడా చిత్రించి ఒక బాణంపుల్ల సాయంతో చూపిస్తూ "ఇప్పుడు చూడండి అయ్యలూ..ఈ ఎత్తైన ప్రదేశం

నుండే మీ కొడవరి రంగనాథుని విగ్రహంతో పాటూ దొర్లిపడ్డాడు. మిగతా ఇద్దరూ ఇక్కడ వాని శవాన్ని చూసి ఉంటారు. ఆ తరువాత ఇంకో కొడవరి మరణించి ఉంటాడు. మిగిలిన కొడవరివి నువ్వు విషపు పురుగు కుట్టి అక్కడ ఉండిపోయావు. మీ దాసు కొడవరి ఎక్కడ తప్పించుకున్నాడో మనం ఊహిద్దాం."అంటూ దొర మొత్తం ఐదు ప్రాంతాలు కళ్ళతో స్వయంగా చూసినట్టు పుల్లతో గ్రుచ్చి సూచించాడు. "ఈ ఐదింటిలో మనం ఉన్నది ఈ ప్రదేశంలో ఉన్నాం. కనుక మిగిలిన నాల్గు ప్రాంతాలను జల్లెడ పట్టాలి" అంటూ అందరిని పిలిచి నాలుగు బృందాలుగా చేశాడు. ఒక్కో బృందానికి ఒక్కొక్కడిని నాయకుడుగా నిర్ణయించాడు. రాజవల్లభుడూ, దత్తుడూ ఆ గూడెం నాయకుని అసాధారణ తెలివితేటలకు ఆశ్చర్యపోయారు. సుకలులు గూడెం దొరను మాకు సెలవిప్పించండి అని అడిగి వెళ్ళిపోయారు. వెళ్తూ మీకేమీ భయంలేదు అని వల్లభ దత్తులకు సైగ చేశారు.

నాలుగు బృందాలు కదలి బయలుదేరి నాలుగు ప్రక్కలా వెదకడం ప్రారంభించారు. చెట్లు ఎక్కారు. లోయలలో దిగి చూశారు. ఆ ప్రాంతమంతా వారికి కొట్టిన పిండి. అలా మూడు రోజులు అన్వేషణ సాగించినా కొడవరుని జాడగాని, విగ్రహం జాడగానీ దొరకలేదు. విషయాలు ఎప్పటికప్పుడు పెద్ద దొర చెవిన వేస్తూ ఉన్నారు అన్ని బృందాలు. ప్రతిరోజూ చర్చలు జరుగుతూనే ఉన్నాయి. కొండను ఒక్క అడుగు కూడా వదలకుండా చూడమని దొర ఆదేశించాడు. చివరకు ఒక ఎత్తైన ప్రాంతం మాత్రమే మిగిలింది. అక్కడికి వెళ్ళాలంటే ఒక దట్టమైన అడవిని దాటాలి. పగలే చీకటిగా ఉండే ప్రాంతమది. చెట్లు అంత దట్టంగా వ్యాపించి ఉన్న ప్రాంతం అది. కొండజాతి వారితో వీరు ముగ్గురూ కష్టం భరించారు. ఎత్తైన గుట్టను తాళ్ళ సాయంతో పైకి ఎక్కారు. క్రిందనుండి కొంతమంది పై నుండి కొంతమంది చెంచులు వీళ్ళను సురక్షితంగా కొండ ఎక్కించారు. వల్లభుడు కొండ ఎక్కాక అష్టాక్షరీ మంత్రం జపిస్తూ "స్వామీ రంగనాథ! దయచేసి మాకు దర్శనమివ్వు. పరీక్షించినది చాలు. ఇంక భరింపలేకుండా ఉన్నాము. నా కన్న తల్లి ఆకాంక్ష నెరవేర్చనివ్వు. మా తండ్రిగారి ఆత్మకు శాంతినివ్వు.

పరంధామా! ఎక్కడున్నావు తండ్రీ!" అని కళ్ళవెంట నీళ్ళు కారుస్తూ అంగుళము అంగుళము పొదలు గుట్టలు చెట్లూ గాలిస్తున్నాడు. ఆరోజు చీకటిపడగానే అందరూ నీరసంగా తిరిగి వచ్చారు.

మరుసటిరోజు మళ్ళీ బృందం మొత్తం బయలుదేరింది. కొద్దిసేపట్లో అంతా గట్టుకు చేరుకున్నారు. అక్కడంతా చిమ్మచీకటిగా ఉంది. సూర్యకిరణాలు కూడా లోనకు పోలేనంత దట్టమైన అడవి ప్రదేశం. చెంచులు ఒకరినొకరు సైగలు చేసుకుంటూ దివిటీలు వెలిగించుకున్నారు. దత్తుడు, వల్లభుడు, సింగళకరుడు వారిని అనుసరించాడే తప్ప ముందుకు పోలేక పోతున్నాడు. వయసువలన వచ్చిన వగడ్పు, అలసట, గతంలో విషపురుగు కుట్టడం వల్ల వచ్చిన నొప్పి మళ్ళీ తిరగబెట్టడంవల్ల కాలు బాగా వాచిపోయింది. కదిలించలేని స్థితి వచ్చింది. అలాగే నీళ్ళు తాగుతూ నిలబడిపోయాడు. కాళ్ళు మళ్ళీ మొద్దుబారుతున్నట్టు అనిపించడంతో అక్కడే కూలబడిపోయాడు. చెంచులు ముందుకు సాగుతున్నారు. వల్లభుడు స్వామి ఎక్కడైనా కనిపించకపోతాడా అని వేయికళ్ళతో డేగలాగా పుట్టలు గుట్టలు గాలిస్తున్నాడు. దత్తుడు అనుసరిస్తున్నాడు. మధాహ్నసమయానికి ఒక రాతి గుట్టపైకి చేరుకున్నారు. చెంచులు ఆకలికి ఆగలేక వీపున కట్టుకున్న మూటలు విప్పారు. వల్లభుడు, దత్తుడు ఉడికించిన కందమూలాలను తిని మంచి నీరు త్రాగి సింగళకరునికై చూశారు. చుట్టుప్రక్కల ఎక్కడా కనపడలేదు. వానికోసం చూడసాగారు.

ఒక చెంచు ముందుగా భోజనం చేసి చేతులు కడుక్కుంటూ రాళ్ళగుట్ట చివరివరకూ నడుస్తూ "అదుగో...అల్లాడ చూసినారా? పది గజాల దూరంలో... ఆ పెద్ద రాయిని చూడండి! ఆ రాయి మీనగానీ నిలబడి చూస్తే కొండంతా చక్కగా కనబడద్ది...అద్దీ లెక్క" అన్నాడు. అందరూ నవ్వారు. "ఎందుకెహె నవ్వులు?" అన్నాడు. "హయ్యో... ఆగాగు.. అంత పెద్ద పొడవైన నునుపైన రాయిని ఎక్కడం సాధ్యమా? నువ్వు ఎక్కుతావా? అని అడగ్గానే పౌరుషం ముంచుకొచ్చిన చెంచు "మీరెక్కుతారని నేను

చెప్పలేదు. నేనే ఎక్కుతాను? మీరేడ ఎక్కుతారు? వయసు అయినవాళ్ళు?" అని దెప్పి పొడిచి అక్కడున్న చెట్లతీగలను పేని పెద్ద మోకుగా చేశాడు. దాన్ని ఒక పెద్ద చెట్టుకు కట్టి అడుగున రెండు కాళ్ళు పెట్టేందుకు అనువుగా గుండ్రంగా ఉట్టిలాగా చేసాడు. అందరూ చూస్తుండగా రెండు కాళ్ళు దానిలో పెట్టి వేగంగా ఊపండి అన్నాడు. అలా ఊగుతూ ఊగుతూ క్రమంగా ఆ రాయి వద్దకు చేరి దాన్ని పట్టుకున్నాడు. అక్కడనుండి ఆ రాయిపై ఎగబ్రాకడం ఆరంభించాడు. చెంచు చేసిన పని నేను చేయలేకపోతే ఈ పుటుక వృధా అని వల్లభుడు తనూ ఊగి ఆరాయిని పట్టుకున్నాడు. వానికి చెంచు సంతోషంగా చేయి అందించి నిలబెట్టాడు. ఇదంతా చూస్తున్న దత్తుడు కూడా ఊగి నేలమీద పడిపోయాడు. కాళ్ళు చేతులు దోక్కుని పోయి రక్తం వచ్చింది. కానీ తన స్నేహితుడు వెళ్ళగలిగాడన్న ఉత్సాహంతో మూడు సార్లు ప్రయత్నించి, చివరకు చేరుకున్నాడు.

కష్టపడి చెంచు సహాయంతో ఆ రాతిమీదకు ఎగబ్రాకిన ముగ్గురూ చుట్టూ పరిశీలించారు. తూర్పు దక్షిణ దిశల్లో దట్టమైన అడవులు కనిపిస్తున్నాయి. ఉత్తరదిశలో కొన్ని దారులు కనబడ్డాయి. తూర్పు దక్షిణ దిశల్లో వెళ్ళడం కుదరదు కనుక ఉత్తరదిశగా చూడాలని నిశ్చయించుకొన్నారు. అంతలో చీకటిపడింది. అక్కడే ఆరోజుకు నిద్రించాలని ఉదయం తిన్నాక మిగిలిన కందమూలాలు అందరూ పంచుకుని భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు.

మరుసటిరోజు ఉత్తరదిశగా నడుస్తూ గాలిస్తున్నారు. ప్రక్కనే ఒక సెలయేరు. స్వచ్ఛమైన మంచి నీరు అంతా కడుపు నిండా తాగారు. చెంచు ఒక పెద్ద మంట వేసి కందమూలాలను భూమిలోంచి పీకి అందులో వేసి కాల్చడం మొదలు పెట్టి "మధ్యాన్నానికి బువ్వ కావాల గదా! అయ్యలూ" అని నవ్వాడు. నీళ్ళను తోలు సంచుల్లో నింపుకుని అందరూ మరో గంటకు అక్కడనుంచి బయలుదేరారు.

మరో దట్టమైన అడవి ప్రారంభం కానున్నదన్నట్లు చెట్లు అడ్డదిడ్డంగా ఉన్నాయి. దూరంగా ఒక చెట్టు నీడన ఒక నల్లటి ఆకారం

నిలబడి ఉంది. అది ఎలుగుబంటువలె ఉంది కానీ ఎలుగుబంటు కాదు. కొండముచ్చువలె రెండు కాళ్ళమీద నడుస్తున్నది. శబ్దం చేయకుండా వాళ్లంతా ఆ ఆకారాన్ని అనుసరించారు. ఆ ఆకారం మనిషా? అడవి మనిషా? కొండముచ్చా? అర్థం కాలేదు. చెంచు కత్తి బయటకు దీసి "భయంలేదు సామీ.. నడవండి చూద్దాం" అన్నాడు అందరూ ఆ ఆకారం వెంట బడ్డారు. ఆ ఆకారం నా వెంట రండి! అన్నట్టు అప్పుడప్పుడూ వెనక్కు తిరిగి చూస్తూ లోనకు వెళ్తున్నది. అందరూ బాగా అలిసిపోయారు. ఆ ఆకారం వెంటనడవలేక ఆగిపోవడంతో, అది అడవిలో మాయమైపోయింది. అది మాయమైన వైపుకు వెళ్ళారు.

అక్కడ ఏదో వింత సుగంధం అలుముకొన్నది. రాజవల్లభుడు "దత్తా! గమనించావా? ఏదో సుగంధం వస్తున్నది ఇక్కడ. ఏవైనా మనోరంజనపుష్ప సువాసనా? అని అడిగాడు. "అవును వల్లభా! నీవు చెప్పింది నిజం" అన్నాడు. చెంచుడు "సామీ.. మంచి వాసనే!" చూద్దాం పదండి అన్నాడు. ముగ్గురూ వెదుకుతూ ఉన్నారు. ఆ వాసన కస్తూరి పరిమళమే కాదు. కర్పూరం, చందనం, సింధూర పరిమళాల కలగలపుగా ఉంది. రాజవల్లభుడు "దత్తా! సింగళకరుని మాటలు మరచిపోయావా? ఆ విగ్రహం ఉన్నచోట ఈ పరిమళం ఉంటుందని చెప్పాడు కదా!" అన్నాడు. "నిజమే! సమయానికి ఆ సింగళకరుడు లేడు ఇక్కడ. ఎక్కడాగిపోయాడో ఏమో! అని బాధపడ్డారు." చెంచు "ముసలోడు సామీ. ఆరాయి రప్ప ఎక్కలేడు. ఎప్పుడో ఎనక్కు లగెత్తుంటాడు. ఒగ్గెయ్యండి. మనమే చూడాల!" అన్నాడు. నిజమే..దత్తుడు సువాసన ఆగిపోయినట్లుంది వల్లభా!" అన్నాడు. మరో పది గజాలు ముందుకు నడిచారు "దత్తా..జాగ్రత్తగా ఆఘ్రాణించు! పరిమళం మళ్ళీ వస్తోంది కదా!" అన్నాడు. ఇద్దరూ "ఔ! ఔ!" అన్నారు.

మరో పది అడుగులు నడిచేసరికి పెద్ద పొదలోనికి మనుష్యుల కాలి అడుగులు ఉన్నట్టు కనబడ్డాయి. "దత్తా! ఇక్కడే సువాసన అధికమైంది జాగ్రత్తగా ప్రతి అంగుళం గమనించు" అని హెచ్చరించాడు వల్లభుడు. అంతే! మరో రెండు క్షణాలకు దత్తుడు కుడివైపుకు వెళ్ళినవాడు పెద్దగా "

దొరికింది! వల్లభా!" అని కొండ, కోనా ప్రతిధ్వనించే విధంగా, అలనాడు హనుమంతుడు ఆకాశం నుండి "దృష్ట్వా సీతా!" అని అరచినట్టు పెద్దగా అరిచాడు. "మిత్రమా! వస్తున్నాం! అని చెంచు, వల్లభుడు అక్కడికి చేరుకుని చూశారు.

దత్తుడు వల్లభుడిని గట్టిగా ఆలింగనం చేసుకుని "మన శ్రమ ఫలించే సమయమాసన్నమైంది మిత్రమా! అటు చూడు! బంగారపు తళతళలున్న వెలుగులు" అని చూపించాడు. ఇద్దరూ! "ఓం నమో నారాయణాయ!" అని పెద్దగా ఉచ్ఛరిస్తూ పొదలోదూరారు. ఆశ్చర్యం పొదలో శ్రీరంగనాథుని విగ్రహం ఎంతో ఠీవిగా నిలబడి వింత పరిమళం వెదజల్లుతున్నది. ఇద్దరూ విగ్రహంముందు సాష్టాంగ నమస్కారాలు చేయడంతో చెంచు కూడా నమస్కారాలు చేసుకుని కళ్ళు పెద్దవి చేసి చూస్తున్నాడు. తమ శ్రమ ఫలించినందుకు చెంచుదొర ఈయబోయే బహుమానాలను తల్చుకుని సంతోషపడుతున్నాడు.

పొదకు కొద్దిదూరంలో మాయమైన వింత ఆకారం నిల్చుని వీరిని గమనిస్తున్నది. వెంటనే అందరూ వెళ్ళి ఆ ఆకారాన్ని గట్టిగా పట్టుకున్నారు. చెంచు కత్తి చేతిలో పెట్టుకుని ఎటువంటి ప్రమాదాన్నైనా ఎదుర్కోడానికి సిద్ధంగా నిలబడ్డాడు. ఆ ఆకారం కోతీ, కొండముచ్చూ కాదు. మనిషే! కాకపోతే గత 18 సం.లుగా తైల సంస్కారంలేక అడవిమనిషిలా తయారయ్యాడు. శరీరంపై రోమాలు పెరిగిపోయి అలా కనిపిస్తున్నాడు. వల్లభుడు "మీరు శ్రీరామదాసు కదూ! నిజం చెప్పండి" అన్నాడు. అతను జవాబు చెప్పలేదు. పైగా మాటలు రానట్టుగా "బె! బె! బె!" అని గుటకలు మింగుతున్నాడు. సింగళకరుడు చెప్పినట్టు తన బంధువుల మరణం చూశాక అతని మతి చలించింది. ఈ విగ్రహం మీరు కాపాడిన శ్రీరంగనాథుడే కదా దాసు గారూ! అన్నమాటకు సమాధానమివ్వకుండా "రంగా! రంగా!" అనే మాట మాత్రమే అతని నోటినుంచీ వచ్చింది. సందేహం లేదు దత్తా! ఇతడు శ్రీరామదాసు! ఇప్పుడు కర్తవ్యం ఆలోచించాలి. నాకు భయంలేదు. నాకు రంగనాథుడే తోడు నీడ. మీరంతా వెళ్ళి మిగతా

వారిని తోడ్కొని రండి త్వరగా! " అని వారిని పంపివేశాడు. కానీ రెండు రోజులైనా దత్తుడు తిరిగి రాలేదు. దత్తుడు అసలు జీవించి ఉన్నాడా అనే సందేహం కూడా వల్లభుడిని పట్టుకుంది. వారు వెళ్ళిపోయాక శ్రీరామదాసుతో మాట్లాడాలని ప్రయత్నించినా పలకడం లేదు. శ్రీరామదాసును పరిశీలించగా, ప్రక్కన ఉన్న కాసారంలో స్నానం చెయ్యడం, కాయలు పండ్లు ఏవి దొరికితే అవి కోతిలా తినడం, అక్కడే పొదలో విగ్రహం పక్కనే పడుకుని నిద్రించడం చేస్తున్నట్టు స్పష్టమైంది. ఇంతటి మహాభక్తుడు అసలు కలియుగంలో ఉంటాడా? ఒకటా రెండా 18 సం. గడచిపోయాయి. సరైన ఆహారం అదీ లేకుండా ఈ కారడవిలో ఎలా జీవించి ఉన్నాడో అర్థం కావటంలేదు. అలా రెండు రోజులు గడిచిపోయింది. వల్లభుడు ఎదురుచూపులు చూస్తూ ఉన్నాడు. దత్తుడు తిరిగి రాలేదు. దత్తుడు అసలు జీవించి ఉన్నాడా? లేదా క్రూరజంతువుల పాలబడ్డాడా? అని సందేహం కూడా వల్లభుడిని పట్టుకుంది.

అడవిలో మూడు రోజులనుండి విడవకుండా వర్షం పట్టుకుని కుంభవృష్టిని తలపిస్తోంది. ఎక్కడ చూసినా వర్షపు నీరే. కొండ చరియల మీదనుంచీ కాలువలై ప్రవహిస్తున్నది. చెట్టుపై కర్రలు పెట్టి, వాటిమీద వృక్షాలను నరికిన కొమ్మలువేసి క్రింద కూర్చున్నారు. మంట వేయడానికి కూడా వీలులేకుండా ఉంది వారి స్థితి. ఛలికి వణికిపోతున్నారు. వర్షానికి పొదలన్నీ కొట్టుకుని పోవడంతో శ్రీరంగనాథుడిని ఒక రాతిపై చెట్టుకొమ్మలతో కొట్టుకొని పోకుండా బలమైన అడవి తీగలు కట్టి కాపాడుకుంటున్నారు. కారే వర్షపు నీరు ధారలుగా శ్రీరంగనాథుడిపై అభిషేకిస్తున్నట్లుంది. వల్లభుడికి బాధతో కూడిన నవ్వొకటి వచ్చింది. స్వామిని అంత దగ్గరలో దర్శించే భాగ్యం తనకు కలిగినందుకు చాలా ఆనందంగా ఉండడం ఒక విషయమైతే, ఆ వర్షపునీరు స్వామివారికి నిరంతర అభిషేకంగా కురవడం మరో విషయం. ఒకసారి గతం కళ్ళముందు మెదిలింది. తన తండ్రి కులశేఖరుడు విగ్రహాన్ని తన

భుజాలకెత్తుకుని ఢిల్లీ సైన్యాన్ని తప్పించుకుని గుర్రాల మీద స్వారీ చేసుకుంటూ వెళ్ళిన ఘటన, తనతల్లి తండ్రికి అస్వస్థుడై ఉండగా, ఆ విగ్రహాన్ని మరలా తెచ్చి దర్శనం చేయించిన ఘటన ఒకదాని వెంట ఒకటి కనిపిస్తున్నాయి. ఇవన్నీ తల్లి వాసంతికాదేవి అనేక మార్లు చెప్పడంవల్ల మరచిపోలేకపోతున్నాడు వల్లభుడు.

నాలుగవనాటి ఉదయం వర్షం తెరిపినిచ్చింది. ఆకాశం కాంతివంతమైంది. పక్షులు ఆనందంగా ఆకాశంలో ఎగురుతున్నాయి. కుందేళ్ళు వంటి జంతువులు ఆనందంగా గెంతులు వేస్తున్నాయి. నేల తడి ఆరడం మొదలైంది. ఆరో రోజు కూడా గడచిపోయినా దత్తుడు రాకపోవడం మనసు కీడును శంకిస్తోంది. ఇంతలో దూరాన ఏవో మనుష్యుల అరుపులు వినిపిచాయి.

ఒక కొండముచ్చును తరుముతూ ఇద్దరు అడవి జాతివారు ఇటే వస్తున్నారు. వాళ్ళు కోయలూ కాదు. చెంచులూ కాదు. నల్లగా కారునలుపు వర్ణంతో చూడ్డానికి భయంకరంగా ఉన్నారు. ఏవో నలుపు తెలుపు రంగులు మొహాలకు, వంటికి పూసుకున్నారు. గోచీలు మాత్రమే ధరించారు. వారు రాగానే చెట్టుకొమ్మల మీద కూర్చున్న శ్రీరామదాసు భయంగా చూశాడు. వల్లభుడు భయం వలదని సైగచేసి చెట్టుమీదనుండి క్రిందికి దూకి కత్తి దూసి నిలబడ్డాడు. "ఓరి అయ్యలూ...మేమూ అడవిలో బతికేవాళ్ళమే! మీతో యుద్ధం చేయడానికి రాలేదు. మమ్మల్ను ఎప్పుడూ చూళ్ళేదనుకుంటాను. మమ్మల్ను నల్లని వర్ణం గలవాళ్ళం (ఇరుళర్) అంటారు. ఆ కొండముచ్చు మాంసం మంచి పసందుగా ఉంటాది. అందుకే దాని వెనక పడ్డాం. కత్తులతో పనిలేదు. దించండి" అని ఇద్దరు పెద్దగా నవ్వారు. కత్తి ఒరలో పెట్టి వల్లభుడు పలకరింపుగా నవ్వాడు. ఇంతలో భయమేమీ లేదని గ్రహించిన దాసు చెట్టు మీద నుండి దిగి దూరంగా నిలబడ్డాడు.

వాళ్ళలో పెద్దవాడు దాసును ఎగాదిగా చూస్తూ "సామీ! ఏంది కతా! మీరంటే రాజుల మాదిరిగా ఉన్నారు. వేటకోసం వచ్చిండారనుకుంటా!

సరే! ఈనేంది మా మాదిరున్నాడు ఎవరీన? మా జాతా?" అని అడిగాడు. దాసు ఇదేమీ సంబంధం లేనట్టు రంగనాథుని విగ్రహం కాళ్ళదగ్గర కూర్చొన్నాడు. వల్లభుడు నవ్వుతూ వారిని కూర్చోమని సైగ చేస్తూ జరిగినది చెప్పేసరికి వారు ఆశ్చర్యపోయారు.

"అయ్యలూ... ఈడ పులులూ, సింగాలు, ఎలుగుబంటులూ నిండా జాస్తి. నాలుగురోజులుగా నిండా వర్షం. జంతువులు మాంచి ఆకలిమీదున్నాయి. కళ్ళబడ్డామా పలారమే! ఏం చెయ్యాలా.. అని అలోచిస్తుండగా వల్లభుడు "ఇక్కడికి దగ్గరలో ఉన్న పెద్ద ఊరు ఏమిటి?" అని అడగ్గా "మీకు తెలవదా ఏంది? రాజులంటున్నారు. చంద్రగిరి ఉంది కదా పక్కన్నే" అన్నాడు. "ఆరాజ్యానికి రాజు శ్రీరంగనాథ యాదవ రాజు! మీవాళ్ళే! సహాయం జెయ్యడా ఏంది సామీ!" అన్నాడొకడు.

"మీరొక పని చెయ్యండి. ఆ రాజును ఎలాగైనా కలిసి శ్రీరంగంలోని శ్రీరంగనాథుని విగ్రహం అడవిలో ఉన్నదని, ఆ విగ్రహాన్ని సకల మర్యాదలతో చంద్రగిరికి తీసుకుని వెళ్ళవలసిందిగా చెప్పండి" అని వల్లభుడు తన మొలలో కట్టిన ఒక చిన్న తోలు సంచి విప్పి "వీరచంప కులిగై" అన్న బంగారు నాణేల్ని చెరొకటి బహూకరించాడు. "ఓహ్. బంగారమా! సామీ! ఏమైనా రాజులంటే.. రాజులే! నమ్మితే పేణాలకు పేణాలిస్తారు" అని చప్పట్లు చరిచాడు. తప్పక తీసుకుని వస్తాం సామీ!. ఇంకా మరిన్ని ఇట్టాంటి బిళ్ళలే ఇయ్యాల తిరిగి వచ్చింతర్వాత... ఈ బంగారు బిళ్ళల మీద ఆన!" అని సంతోషంగా వెళ్ళిపోయారు.

(గత చరిత్ర): చంద్రగిరికి చాలా విశిష్టత ఉంది. తిరుపతికి ఏడు మైళ్ళ దూరాన, స్వర్ణముఖీ నది ఒడ్డున చంద్రగిరి ఉన్నది. 11వ శతాబ్దిలో కట్టబడిన పటిష్టమైన కోట ఉంది. మూడు శతాబ్దాల కాలం ఈ నగరం యాదవ రాజుల అధీనంలో ఉండి 1367లో విజయనగర రాజుల పాలన క్రిందకు వచ్చింది. సాళువనరసింహరాయల కాలంలో ఈ నగరానికి

గొప్పపేరు వచ్చింది. విజయనగర సామ్రాజ్యానికి నాలుగవ రాజధానిగా ప్రాముఖ్యత సంతరించుకొన్నది. పెనుగొండను గోల్కొండ సుల్తానులు ముట్టడించినప్పుడు విజయనగర రాజులురాజధానిని చంద్రగిరికి మార్చారు. 1646లో ఈ కోట గోల్కొండ సుల్తానుల ఆధీనంలోకి వెళ్ళింది. తర్వాత మైసూరుపాలకులు చేజిక్కించుకున్నారు. కాలక్రమంలో 1792 నుండి ఈ చంద్రగిరి ప్రాముఖ్యతను కోల్పోయి శిధిలమవడం ప్రారంభమయింది. ఈ కోటలో శిధిలమయిన శివ, విష్ణు ఆలయాలు ఉన్నాయి. ఆ రాజ్మహల్ ప్రస్తుతం పురావస్తు ప్రదర్శనశాలగా మారింది. విజయనగర శిల్పకళా చాతుర్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచి ఉన్నది. ఈ మహల్ సున్నం, ఇటుక, రాయి మాత్రమే ఉపయోగించి కట్టబడింది. ఈనాడు అన్నీ శిధిలాలయి కనిపిస్తున్నది.

చంద్రగిరి (ప్రస్తుత కథాకాలానికి) చంద్రగిరి శ్రీరంగనాథ యాదవ రాజు పాలనలో ఉంది. ఇప్పటికి 360 సం.క్రితం యాదవ వంశానికి చెందిన ఇమ్మడి నరసింహరాయలు, నారాయణవనం అని పిలవబడే ప్రాంతాన్ని పాలించేవాడు. ఆయన శ్రీవేంకటేశ్వరునికి పరమభక్తుడు. ఆయన తిరుమల కొండలోని దైవాన్ని ప్రతిరోజూ దర్శించుకోదగ్గ ప్రాంతంలోనే ఉండాలని నిర్ణయించుకొన్నాడు. ఆయన కోరిక తీరే విధంగా చంద్రగిరికొండను ఎంచుకున్నాడు. ఆయన తలుచుకోగానే పెద్ద కోట, పెద్ద పెద్ద రాజభవనాలు నిర్మితమయ్యాయి. ఆ ఇమ్మడి నరసింహరాయల తర్వాత 11వ తరం రాజైన శ్రీరంగనాథ యాదవ రాయలు ప్రస్తుతంపాలిస్తూ ఉన్నాడు. ఈ చంద్రగిరి రాజులు చాలా వరకూ పెద్ద సామ్రాజ్యాలకు సామంతులుగానే వ్యవహరించేవారు. శ్రీరంగనాథ యాదవరాయలు కూడా

హొయసల రాజైన మూడవ వీరభల్లాలునికి సామంత రాజుగా ఉండేవాడు. మధురసుల్తానుతో పోరి వీరభల్లాలుడు మరణించగానే యాదవరాయలు విజయనగర సామ్రాజ్యానికి సామంతునిగా ప్రకటించుకొన్నాడు. చంద్రగిరిని ఎంతో సమర్ధవంతంగా పాలిస్తున్నాడు.

ఇద్దరు అడవి మనుష్యులు వల్లభుని సమాచారం తీసుకుని కోటలోనికి ప్రవేశించారు. రాజును కలవాలని ఎంత ప్రయత్నించినా కుదరకపోవడంతో చేసేది లేక ఘంటామండపానికి చేరుకున్నారు. ఈ మండపం తిరుమలకు సరిగ్గా ఎదురుగా ఉంటుంది. ఈ మండపంలో పెద్దఘంట వేలాడుతూ ఉంటుంది. తిరుమలలో భగవంతునికి నైవేద్యం సమర్పించిన తర్వాత ఈ ఘంటారావం జరగాలని రాజు ఆదేశమిచ్చాడు. ఘంటారావం విన్న తర్వాత మాత్రమే రాజుగారు భోజనం చేయాలి. ఇదీ నియమం. ఘంటామండపం చేరుకున్న అడవి మనుష్యులు దానిని న్యాయం కోసం కట్టబడిన ధర్మఘంటగా భావించి, ఘంటను ఒడిసిపట్టి గణగణా మ్రోగించసాగారు. ఆ సమయంలో అక్కడ రక్షక భటులు అప్రమత్తంగా లేకుండా, భోజనానంతరం, ఏదో పిచ్చాపాటి మాట్లాడుకుంటూ సేద దీరుతున్నారు. వేళకాని వేళలో మ్రోగిన ఘంటారావం విని రాజు, అక్కడి భటబృందం ఆశ్చర్యపోయాడు. వెంటనే వారిని బంధించి తెమ్మని ఆదేశమిచ్చాడు.

రాజభటులు వారిద్దరిని గొలుసులతో బంధించి రాజు ముందు ఉంచారు. రాజు గంభీరంగా "మీరెవ్వరు? ఈ ఘంటను మ్రోగించిన కారణమేమిటి? మీతలలు కోటగోడకు వేలాడతాయి. నిజం చెప్పండి!" అని గద్దించాడు. అడవి మనుష్యులు గజగజ వణికిపోతూ "రాజా!

క్షమించండి. గత 18 సం.లుగా అదృశ్యమైన శ్రీరంగంలోని శ్రీరంగనాథుని విగ్రహం జాడ ఈరోజు మాకు అంజనాద్రి అడవుల్లో దొరికింది. ఆ స్వామిని ఎంతో శ్రమ పడి పట్టుకున్న యువకుడు మీకు ఈ సమాచారం అందించమని కోరడంతో, మీ దర్శనం కోసం ఎంతో ప్రయత్నించి కుదరక ఇలా చేయవలసి వచ్చింది. క్షమించండి. ఆ విగ్రహాన్ని సకల మర్యాదలతో అడవి నుండి తీసుకురమ్మని వారు కోరారు" అంటూ వినయంగా గొలుసులతోనే క్రింద మోకరిల్లి నమస్కారం చేస్తూ చెప్పారు. వారిని బంధ విముక్తులను జేసి ఆహార పానీయలనిమ్మని ఆదేశించాడు.

యాదవరాజు సమాచారం వినగానే ఆయన మనసు గతంలోకి వెళ్ళింది. శ్రీరంగాన్ని సుల్తానుల పాలన నుండి తప్పించాలని వీరభల్లాలుడు చేసిన యుద్ధాలు, అతని మరణం గుర్తొచ్చి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వెంటనే ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ "ఏమిటీ? శ్రీరంగనాథుల వారు కనిపించారా? ఇన్నిరోజులు వారి విగ్రహం ఆ కారడవుల్లో దాగి ఉన్నదా? ఎంత ఆశ్చర్యం! వెంటనే చప్పట్లు చరిచి "ఎవరక్కడ?" అని వెంటనే మహామంత్రిని తదితర బృందాన్ని ఇక్కడ హాజరవ్వాలని, ఉన్నవారు ఉన్నట్లుగా ఇక్కడకు రావాలని ఆజ్ఞ వేశారు. రాగానే విషయం మొత్తం వివరించి చెప్పాడు.

రాజుగారి ఆజ్ఞలననుసరించి మరుసటిరోజు తెల్లవారుతూనే అడవి మనుష్యులు ముందుకు సాగుతుండగా, రాజు సపరివారంగా అడవిలో ప్రవేశించారు. అలా వెదుకుతూ వెదుకుతూ సాయం సమయానికి వారు విగ్రహం ఉన్న తావుకు చేరుకున్నారు. అలా అడవి మధ్యలో శ్రీరంగనాథ స్వామి చెట్టు తీగలకు కట్టివేయబడి ఉండడం చూసిన యాదవరాజు

విగ్రహాన్ని చూసీ చూడగానే మొదలు పెకలించిన చెట్టులా ఆ విగ్రహం ముందు సాగిలపడి, ఆర్తితో కళ్ళ నీళ్ళు ధారలై కారుతూ ఉండగా సాష్టాంగ నమస్కారం చేసి "ఓ రంగ రంగ రంగ పతీ..రంగనాథా ! నేనెంత పాపం చేసి ఉంటాను. ఇక్కడ అడవిలో కొలువున్నావని ఏమాత్రం తెలుసుకోలేని మూర్ఖుడిని? అపచారం జరిగింది..ఎంతో అపచారం జరిగింది. క్షమించు! అని ఆ విగ్రహం కాళ్ళు గట్టిగా పట్టుకుని దుఃఖించాడు. అంతా రాజు అలా ఉండడం చూసి ఆశ్చర్యపడ్డారు. కొంత సేపటికి లేచి తను తెచ్చిన పట్టు పీతాంబరాలతో స్వామి వారిని అలంకరించాడు. స్వామివారికి నాలుగు చెక్కలతో విధానాన్ని అమర్చమని భృత్యులకు ఆదేశించాడు. తను తెచ్చిన వస్తువుల మూటను విప్పి స్వామివారికి ధూప, దీప నైవేద్యాలను సమర్పించిన తర్వాత ఈ లోకంలోకి వచ్చాడు. కొంత అపరాధ భావం తగ్గి వల్లభునికేసి చూస్తూ ఆప్యాయంగా "నాయనా! బాలవీరా! ఎవరు నువ్వు? ఇంత కారడవిలోకి ఎలా వచ్చావు? చూడడానికి రాజవంశానికి చెందిన బాలుడిలా ఉన్నావు. స్వామిని ఎలా కనుగొన్నావు?" అని ప్రశ్నల వర్షం కురిపించాడు.

చంద్రగిరి యాదవరాజుకు స్వామివారి విగ్రహం శ్రీరంగం నుండి బయలుదేరిన వద్దనుండి, మేల్కోట, మేల్కోట నుండి తిరునారాయణపురం, మళ్ళీ మేల్కోట అక్కడనుండి ఈ అంజనాద్రి చేరిన విషయం, తన వివరాలు, తన తల్లి కోరిక చెప్పి, ప్రక్కన మతిస్థిమితం తప్పి ఎగాదిగా వెర్రి చూపులు చూస్తున్న కొడవరుని చూపించి, శ్రీరామదాసు కథ, సింగళకరుని గురించి కూడా చెప్పాడు. వెంటనే రాజు లేచి కొడవరునికి సాష్టాంగ దండ ప్రమాణం చేశాడు. తరువాత వల్లభుని వైపు తిరిగి "వల్లభా! నీ వృత్తాంతం వింటూ ఉంటే నా రక్తం సలసల మరిగిపోతూ ఉన్నది. నీ బాధ నేను

అర్థంచేసుకోగలను. మా తాతముత్తాతల కాలం నుండి మేము చోళ, పాండ్య, హొయసల చక్రవర్తులకు విధేయులై మసులుకుంటున్నాం. హొయసల రాజైన వీర భల్లాలుదు సుల్తానుపై దండయాత్ర వెళ్ళినప్పుడు నా సైన్యాన్ని కూడా పంపాను. యుద్ధంలో భల్లాలుడు చంపబడ్డాడు. నీ తండ్రి కులశేఖరుడు నాకు పరిచితుడు. గొప్ప యుద్ధ తంత్రం తెలిసినవాడు. వీరోచితంగా పోరాడి, విధి వశాత్తు, గాయలపాలై, చివరకు స్వామివారి విగ్రహం చూస్తూ మరణించాడని విన్నాను. ఇప్పుడు నువ్వు చెబుతుంటే మొత్తం గుర్తుకొచ్చింది. జయాపజయాలు దైవాధీనాలు. హొయసలీయుల పరాజయానంతర ప్రభావం చంద్రగిరి పైన కూడా పడింది. సుల్తాను తర్వాత మా రాజ్యంపైకి దండెచ్చి వచ్చి, చంద్రగిరి, నారాయణవనం ముట్టడించాడు. నాకు సుల్తానును ఎదిరించే సైన్యంగాని, ధైర్యం కాని లేక పెద్ద మొత్తంలో ధన, కనకరాసులను సమర్పించి ఇక్కడ ప్రజలకు శాంతిని ప్రసాదించగలిగాననన్న తృప్తి దక్కింది కానీ, శాంతికోసం నేను చేసిన పనికి ఇప్పటికి చింతిస్తూనే ఉన్నాను. ఇప్పుడు విజయనగర రాజుల ధైర్య సాహసాల మీద నమ్మకం కలిగి, ఈ మధ్య వారికి విధేయులుగా ప్రకటించుకొన్నాను” అన్నాడు.

చాలా పొద్దుపోయిన దాకా ముచ్చట్లు జరిగాయి. రాజు తనకు ఏర్పాటు చేసిన గుడారంలోకి వెళ్ళాడు. మిగతా సైన్యాన్ని విగ్రహానికి, తదితరులకు కాపలాగా ఉంచాడు. మరుసటిరోజు ప్రాణ స్నేహితుడైన, తన సహచరుడైన దత్తుడు కారడవిలో తప్పిపోయిన విషయం రాజుకు తెలియజేశాడు వల్లభుడు. రాజు వెంటనే పది మంది భటులను పిలిచి “అడవి మొత్తం గాలించండి ఎవరు కనబడ్డా నా వద్దకు తీసుకుని రండి!”

అని హుకుం జారీ చేశాడు. అడవిలో సైనికులు అణువణువూ గాలించగా, ఒక పెద్ద బండ రాయిపై దత్తుడు స్పృహతప్పి అపస్మారక స్థితిలో కనిపించాడు. సైనికులు వానికి శైత్యోపచారాలు చేసి, దెబ్బలు తగిన శరీర భాగాలకు ఆకుపసరు వైద్యంచేసి, తిండిలేక వారం నుండి శోషపోయి పడి ఉన్నానని చెప్పగానే, అరటి మామిడి వంటి ఫలాలను తెప్పించి తినిపించి, మంచినీరు పట్టాక ప్రాణం కుదుటపడ్డది. నడవడానికి ఓపిక లేదని చెప్పగా, కొమ్మలతో ఆకులతో, మెత్తని అరటి ఆకులు కప్పిన, ఒక డోలీ కట్టి తీసుకుని వచ్చి రాజు ముందు వుంచారు. వల్లభుడు స్నేహితుడు డోలీ దిగగానే కౌగలించుకుని పెద్దగా ఏడ్చాడు.

"వల్లభా! చింతించకు! నేను చెంచులతో బయలుదేరి వెళ్ళానుకదా! వారు చాలా వేగంగా నడుస్తూ వెళ్తున్నారు. నేను నా ఆలోచనలతో వెనకబడి మెల్లిగా నడుస్తూ, మధ్యలో దారితప్పాను. ఒక పెద్ద ఏనుగుల గుంపు నా వెంటబడింది. నేను ఒక పెద్ద రాయిని ఎక్కి కూర్చున్నాను. తర్వాత రెండు రోజులపాటు ఒక పెద్ద పులివచ్చి పెద్దగా అరుస్తూ అక్కడ అక్కడే సంచరించసాగింది. వర్షాల వల్ల అడవి పందులూ, నక్కలూ, విష సర్పాల సంచారం ఎక్కువైంది. మూడురోజులు తిండీ తిప్పలూ లేక అక్కడే రాయిపైనే ఉండిపోవలసి వచ్చింది. మూడవరోజు రాత్రికి స్పృహ తప్పింది. ఇప్పటికి ఎన్ని రోజులైందో కూడా నాకు గుర్తు లేదు. మళ్ళీ యిదుగో ఈ సైనికులు వచ్చిలేపేంతవరకూ నేను స్పృహలో లేను" అని కంట తడిపెట్టాడు దత్తుడు.

రాజు సంతోషం వ్యక్తం చేసి "వల్లభా! విగ్రహాన్ని ఎక్కడ ఉంచాలి?" అన్నాడు.

"ఇంకెక్కడ? శ్రీరంగంలో ప్రతిష్టిద్దాం"

"అసంభవం వల్లభా! ఆ సుల్తాను పరమ దుర్మార్గుడు. ఈ విగ్రహాన్ని కరిగించినా కరిగించగలడు. సుల్తాను మరణించిన తర్వాతనే ఆ ఆలోచన చేయాలి." అనగానే శ్రీరామదాసు ఏదో గుర్తుకు వచ్చినట్లు చివక్కున లేచి నిలబడ్డాడు. "సఖ! సఖ! ముఖ! ముఖ!" అని అర్థంకాని భాషలో అరుస్తూ ముందుకు సాగుతున్నాడు. అందరూ అర్థంకాక దాసును వెంబడించారు. విగ్రహానికి ఏభై అడుగుల దూరంలో ఒక పెద్ద గొయ్యి..ఆ గొయ్యిలో దిగి.. చంద్రవంకలాంటి ప్రదేశంలో పుల్లతో గిరిగీసి చూపిస్తున్నాడు. వెంటనే అర్థంచేసుకున్న రాజు సైనికులకు అక్కడ త్రవ్వమని సైగ చేశాడు. సైనికులు పెద్ద కొమ్మలను నరికి కూచిగా చేసి త్రవ్వ సాగారు. లోపల ఐదు అడుగుల లోతున ఒక పెద్ద గుడ్డమూట. దానిలో స్వామివారి దివ్యాభరణాలు బురదతో మట్టితో కలగలిసి కనిపించాయి. వాటికి అందరూ నమస్కరించి వాటిని ప్రక్క పారుతున్న కాలువలోని నీటిలో దివ్యాభరణాలు శుభ్రం చేసి, పల్లకీలో భద్రం చేశారు. రాజు ఆనందంతో "శ్రీ రంగనాథుడు నీకు మరుజన్మలో తప్పక మహారాజుజన్మ ప్రసాదిస్తాడు. శుభం!" అని మరోసారి కొడవరునికి నమస్కరించాడు. కొడవరుడైన దాసు మాత్రం ఇవేమీ పట్టనట్టు శూన్యంలోకి చూస్తూ "రంగా.. రంగా.." అని అస్పష్టంగా గొణుక్కుంటున్నాడు. అతని భక్తికి అందరూ ఆశ్చర్యపోయారు.

"మరి చంద్రగిరిలో మీ రక్షణలో ఉంచుదాం" అన్న వల్లభుని మాటలకు రాజు నవ్వి "నాకే రక్షణలేదిక్కడ! నేను విజయనగర రాజులకు సామంతుడనయ్యాయని సుల్తాను ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడని వేగుల వలన వార్త! ఎప్పుడైనా నామీద కక్ష తీర్చుకోవడానికి రహస్యంగా రావచ్చు. తిరుమల దిగువన నేను రాజభవనాలను నిర్మించాను. అక్కడ వందల

సంఖ్యలో సైనికులు సదా కావలి ఉంటారు. మనం ఈ విగ్రహాన్ని తిరుమల కొండపైకి తీసుకుని వెళ్ళి దాచడమే మంచిదని నా యోచన! సుల్తానుకు నా మీదనే క్రోధం కనుక, ఒక వేళ నన్ను హత్య చేయాలని ఏదైనా పన్నాగం పన్నినా అదంతా చంద్రగిరికే పరిమితం అవుతుంది తప్ప తిరుమల దాకా రాదు..” అన్నాడు.

వల్లభుడు “అమంగళం ప్రతిహతమౌగాక! రాజా! మీ మీదకు సుల్తాను దండెత్తి వస్తే విజయనగర రాజ్యాధీశులు ముఖ్యంగా కంపరాయలవారు ఊరకే చూస్తూ ఉంటారనుకున్నారా? అలాంటి ఆలోచనలు చేయకండి. మీరు చెప్పినట్లు తిరుమలకే తీసుకుని వెళ్దాం” అన్నాడు. అందరూ రాజు ఆలోచనను గౌరవించి మరుసటిరోజు ఉదయం తిరుమలకు ప్రయాణమయ్యారు.

శ్రీరంగనాథుని కోసం పెద్ద పల్లకీ సిద్ధం చేశారు. స్వామి పూజాద్రవ్యాలు, అలంకరణ సామాగ్రి, పట్టు పీతాంబరాలతో అర్చకులకు మరో పెద్ద పల్లకీ, కొడవరుడైన శ్రీరామదాసుకు, వల్లభ, దత్తులకు మరో పెద్ద పల్లకీని సిద్ధం చేయించాడు. యాదవరాయుడు ఒక ప్రత్యేక పల్లకీతో సాయుధులైన వందమంది భటులతో బయలుదేరాడు. బృందం చాలాసేపు ప్రయాణించి అడిపడి (ఇప్పటి అలిపిరి) చేరుకున్నారు. అటుపైన వడివడిగా ఆళ్వార్ తీర్థం చేరారు. తరువాత గాలిగోపురాన్ని దాటుకుని అవసరికోన గుండా మురంగల్ మురిప్పన్ చేరుకున్నారు. మధ్యలో రాజు చెప్పేవరకూ ఎక్కడా పల్లకీలు దింపరాదని ఆజ్ఞ.

శ్రీరామానుజుల వారి మండపానికి చేరుకున్న తర్వాత రాజాజ్ఞ మేరకు పల్లకీలను ఆపారు. రాజు పల్లకీ దిగి యువకుల పల్లకీ వద్దకు

వచ్చి "దిగండి! ఈ ప్రదేశం అత్యంత పవిత్రమైనది. ఇక్కడే శ్రీరామానుజుల వారు తిరుమలనంబిని దర్శించుకున్నారు. ఈ మండపంలో తిరుమలనంబి రామానుజులవారికి వాల్మీకి మహర్షి విరచిత రామాయణ శ్లోకాలను చెప్పారు. అందరూ ఆ మండపానికి వినయంగా మ్రొక్కారు. కొంతసేపు స్వామికి అలంకారాదులు పూర్తి చేసి ధూపదీపనైవేద్యాలు సమర్పించి, భోజనాదులు గావించి, కొంతవడి సేద దీరి తిరుమలకు పయనమయ్యారు.

వీరి రాక ముందుగానే కొంతమంది భటులద్వారా రాజు తిరుమల ఆలయ అధికారులకు వర్తమానం చేరవేశారు. అందువల్ల అక్కడి అధికారులు, భక్తులు, ఇతర ఆలయ సిబ్బంది భక్తి శ్రద్ధలతో శ్రీరంగనాథుని దర్శనం కోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తూ ఉన్నారు. స్వామి ఆలయం ఇంకా ఎంతో దూరం ఉండగానే ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో, వేద మంత్రోచ్చాటనలతో, నృత్యగానాలతో, కోలాట బృందాలతో ఎదురు వచ్చి జయజయ ధ్వానాలతో శ్రీరంగనాథునికి స్వాగతం పలికారు. అక్కడ చాలాసేపు "ఓం నమో నారాయణాయ!" అన్న అష్టాక్షరీ మంత్రం మారు మ్రోగింది. అర్చకులు ఆపమని భక్తులకు ఆదేశాలిచ్చేంతవరకూ ఆ మంత్రోచ్చాటన ఆగలేదు. తరువాత అత్యంత భక్తి శ్రద్ధలతో అక్కడి బృందం శ్రీరంగనాథుని విగ్రహాన్ని మలయప్ప స్వామితో బాటూ ఉంచారు.

అక్కడి ఆలయ ముఖ్య అధికారుల వసతి గృహం ప్రక్కనే వల్లభ దత్తులకు విడిది కేటాయించారు. ప్రక్క గదిలో ఎవరో వ్యక్తులు మాట్లాడుకుంటున్న మాటలు వల్లభుని చెవిన పడ్డాయి. "సామాన్య మానవునివలె మన వేంకటేశ్వరునికి కూడా ఎత్తువల్లాలు

సాధారణమయ్యాయి కదా! ఈ రంగనాథుని ఆగమనంతో అయినా పూర్వ వైభవం వస్తుందంటావా?" అన్న ఒక అధికారి మాటలకు ఒక వృద్ధుడైన అధికారి "అవును! అలాగే అనిపిస్తున్నది నాకు. రామానుజాచార్యుని అనంతరం ఈ తిరుమల అత్యంత శోభతో వెలిగింది. రోజు రోజుకీ ఆదాయం పెరగడమే తప్ప తగ్గింది లేదు. యాదవరాయల వంశ రాజులు సమర్థంగా అన్నీ నిర్వహించారు. కానీ నాకు గుర్తున్నంతవరకూ బహుశః 1310 తర్వాత దక్షిణాపథాన్ని సుల్తానులు వశం చేసుకున్నాక ఇక్కడి రాజ్యాల ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. సామాన్య జీవితాలే దెబ్బ తిన్నాయి. భక్తి, దైవం ఆలోచనే లేకుండా వారు హింసించబడ్డారు. ఇప్పుడు తీర్థ యాత్రలకు వచ్చే భక్తులు క్రమంగా పలుచనయ్యారు. అలాగే ఆదాయం కూడా తగ్గింది. రోజూ రెండు సార్లు నిండే కొప్పెర, వారానికి కూడా నిండడంలేదు. మంచి రోజులు రావాలని శ్రీనివాసుని ప్రార్థించడమే! ఇక పడుకో! చాలా రాత్రయింది" అంటూ వారు నిద్రకు ఉపక్రమించారు. కానీ వల్లభ దత్తులకు ఆ మాటలు విన్న తర్వాత నిద్ర కరువైంది. స్వామిని అక్కడ వదిలివేయడం సబబేనా? అంటూ మాట్లాడుకుంటూ బాగా పొద్దుపోయాక నిద్రలోకి జారారు.

ఉదయాన్నే సందేహిస్తూ యాదవరాజు దగ్గరకు వెళ్ళి చేతులు నులుముకుంటూ నిలబడ్డారు. "ఏదో చెప్పడానికి యోచిస్తున్నట్లున్నారు" అన్నాడు. "మహారాజా! ఏమీ లేదు. మా రంగనాథ స్వామి శ్రీరంగంలో ఉన్నప్పుడు పెద్ద పెద్ద రాజులు చక్రవర్తులు స్వామి ముందు మోకరిల్లి ప్రార్థించేవారు. ఇప్పుడు ఆయన మలయప్పతో తన సన్నిధిని పంచుకోవలసి వస్తున్నది. పైగా మనం ఎంత దైవభక్తితో ఉన్నప్పటికి, ముసల్మాన్ దుష్టుల

వల్ల తిరుమల ఇప్పుడు పూర్వ వైభవంతో లేదన్నది సత్యం. ఈ ఆలోచన మాకు కొంచెం కలవరం కలిగిస్తున్నది" అన్నాడు రాజ వల్లభుడు.

"అవును నేనూ నిన్నరాత్రి అదే ఆలోచిస్తూ ఉండిపోయాను" అనగానే వల్లభుడు ఆశ్చర్యంగా చూశాడు. "అవును! నిన్నరాత్రి మనం చేసింది సబబేనా! అని చాలాసేపు నిద్రించకుండా ఆలోచించాను. వినండి! ఇక్కడ తిరుమలేశునికి వైఖానస ఆగమం ప్రకారం సేవలు జరుగుతాయి. శ్రీరంగనాథునికి పాంచరాత్రాగమం ప్రకారం పూజాదికాలు నిర్వహించ వలసి ఉంది. అందువల్ల లేచిన తర్వాత ఈ తెల్లవారుఝామున బాగా యోచించి రంగనాథుని సన్నిధికి వేరే ప్రత్యేక సుందరమైన మండపాన్ని నిర్మించాలని నిర్ణయించాను. ఈ రంగమండపాన్ని మండపం నిర్మించాక స్వామికి తిరుగే లేదు. ప్రపంచ పగ్గాలు అందుకుని దుష్టులను శిక్షిస్తూ, శిష్టులను రక్షిస్తూ మనల్ని ఏలుకుంటాడని నా మనస్సాక్షి చెప్తోంది. అంతే కాదు తెల్లవారుఝామున ఎవరో ఒక హైందవ వీరుడు సుల్తాను తలత్రుంచి, రణరంగంలో బంతిలా ఎగురవేసినట్లు కలగన్నాను. అన్నీ శుభ శకునాలే ఎదురవుతున్నాయి" అన్నాడు. వెంటనే ఇరువురూ ఆయన పాదలపై వాలిపోయారు. అలా వాళ్ళు సాగిలపడడం చూసి రాజు ఉబ్బి తబ్బిబ్బయ్యాడు. "మీ ఇద్దరినీ చూసినప్పుడల్లా నా హృదయాంతరాళలో ఏదోతెలియని స్పందన. మన దేశంలో ముసల్మానుల వల్ల ధర్మంపూర్తిగా అంతరించిందన్న బాధ నాకు ఇప్పుడు లేదు. అంతా మలయప్ప స్వామే చూసుకుంటాడు.

యాదవ రాజు వాళ్ళకిచ్చిన మాటను తప్పకుండా తరువాతి కాలంలో శ్రీరంగనాథుడు మరియు దేవేరుల విగ్రహాలను తిరుమలలో

నేడు "రంగమంటపం"గా పేరుగాంచిన మంటపములో భద్రపరిచారు. శ్రీరంగని ఉత్సవ విగ్రహాలను అక్కడ భద్రపరచడం వల్ల ఆ మంటపానికి రంగమంటపం అని పేరు వచ్చింది. ఈ కంపరాయల కాలం నాటికి, అనగా 13వ శతాబ్దం నాటికి, తిరుమల శ్రీవారి ఆలయంలో మొదటి ప్రాకారం మాత్రమే ఉండేది. అప్పట్లో ధ్వజస్తంభం కూడా గరుడాళ్వార్లు వెనుక వైపు మొదటి ప్రాకారం లోపలే ఉండేది. ఇక రెండవ ప్రాకారం లోని మండపాలు ఏవి కట్టబడి లేవు. శ్రీ రంగనాథ స్వామి వారి కోసమే ప్రత్యేకంగా, విజయనగర సామంతుడైన, శ్రీరంగనాథ యాదవ రాజు చంద్రగిరి ప్రత్యక్ష పర్యవేక్షణలో, ఈ రంగనాయకుల మండపం నిర్మాణం చేయబడింది. ఇది శ్రీవారి ఆలయంలో అంతర్భాగం కాదు గనుక, శ్రీరంగం ఆలయ అర్చకుల అభ్యర్థన మేరకు, అప్పటి శ్రీవారి ఆలయ వైఖానస అర్చకులు, వారికి, నమ్మ పెరుమాళ్ళ ఆరాధన పాంచరాత్ర ఆగమోక్తంగా నిర్వహించుకోవడానికి సమస్త ఏర్పాట్లు చేసి, అనుమతులు ఇచ్చారు అప్పటి ఆలయ ధర్మరక్షకులు. మనకు నేటికీ సువిశాలమైన రంగనాయక మండపంలో, చివరన గర్భాలయం, దానికి ఇరువైపులా, ప్రసాదాలు మరియూ ఆరాధన పాత్రల శుద్ధి కొరకు ఏర్పాట్లు ఉన్నాయి. ఇలా ఆగమ సంకర దోషం లేకుండా, శ్రీ రంగనాథ స్వామి వారికి పాంచరాత్ర ఆగమోక్తంగా, ద్రవిడ పాశురాల సహితంగా, నిరాటంకంగా విశేష ఆరాధనలు, ఉత్సవాలు జరిగాయి. ఈ విశేషాలు అన్నీ, తిరుమల ఆలయ శాసనాలలో నమోదు చేయబడి ఉన్నాయి. ఈ సందర్భంలోనే, రంగనాథ స్వామి వారికి ద్రవిడ పాశురాలతో జరిగే అనేక విశేష ఉత్సవాలనుండి ప్రేరణ పొంది, అనంతరం తిరుమల శ్రీవారి ఆలయంలో కూడా, శ్రీవారికి

ప్రతినిత్యం, ఆయా సందర్భాలలో జరిగే కైంకర్యాలలో నెమ్మదిగా ద్రవిడ పాశురాల పఠనం ప్రారంభమయింది.

తూర్పు దిక్కుగా సాగుతున్న గోపన్న ముగ్గురు సహచరులు నిద్రిస్తూ ఉండగా, ఒక సత్రంలో ఆలోచిస్తూ సేద తీరుతున్నాడు. స్వామీ! రంగనాథా! ఇన్ని సంవత్సరాలక్రితం మాయమైన నీవిగ్రహం నాకు నిజంగా ఈ తిరుమల యాత్రలో దర్శనమివ్వగలిగితే ఎంత బావుంటుంది. ఈ ఉద్యోగం వదలడం ఎందుకు? వెంటనే కంపరాయలవారిని, మహా మండలేశ్వరుని ఒప్పించి మధుర సుల్తాను తల బొంగరంలా గాలిలోకి ఎగురవేస్తాను. ఇలా అనుకుంటూ ఉండగా, ఒక గోవు ఆ సత్రం ప్రధాన ద్వారం వద్ద నిలబడి "అంబా!" అని అదేపనిగా అరుస్తున్నది. శుభ శకున సూచకంగా గోపన్న కుడికన్ను అదిరింది. శ్రీనివాసుని దర్శనం కోసం మనసు పరితపిస్తూ ఉండగా నిదానంగా నిద్రలోకి జారుకున్నాడు.

వల్లభుడు ఎంతో కాలం సుదీర్ఘ ప్రయాణాల అనంతరం సాధించిన ఘన విజయాన్ని, వెంటనే వెళ్ళి తల్లికి తెలియజేద్దామని ఉంది కానీ, ప్రయాణ అలసట వల్ల కొంతకాలం అక్కడే ఉందామని దత్తుడికి చెప్పి ఒప్పించాడు. దత్తుడు "ఎంత త్వరగా ఈ విషయం మీ అమ్మకు తెలిస్తే, అంత త్వరగా నీకు వివాహం" అని నవ్వాడు. ఇప్పుడు ధ్యాస వేరేగా ఉన్నది మిత్రమా! మధురసుల్తాను తల రణరంగంలో బంతిలా ఎగురవేయగల మొగటిమి గల మొనగాడికోసం చూస్తున్నాను. అనంతరం శ్రీరంగంలో శ్రీరంగనాథుని ప్రతిష్ఠ అనంతరమే నా వివాహం" అనగానే దత్తుడు మిత్రుని పట్టుదలకు,

కార్య దీక్షకు ఆశ్చర్యపోయాడు. ప్రక్కరోజు ఉదయాన్నే యాదవరాయలు వల్లభ దత్తుల విడిది వద్దకు వచ్చి "మీకు ఇక్కడి విశేషాలను చూపిస్తాను రండి. నేను ముసలివాడనయ్యాక ఇక్కడనే ఎక్కువ కాలం గడుపుతున్నాను. అందుకే క్రింద రాజభవనాలను నిర్మించుకున్నాను" అంటూ వారిని దక్షిణ మాడవీధికి తీసుకుని వెళ్ళి తిరుమల నంబి నివసించిన మట్టి ఇంటిని చూపించి "రామానుజుల వారికి తిరుమల నంబి మేనమామ వరుస. ఇలా రండి! ఉత్తర దక్షిణ మాడవీధులు కలిసే ఈ గృహం అనంతాళు వారిది. అళ్వారు గారు రామానుజునికి ముఖ్య శిష్యుడు. ఇవే కాదు ఇక్కడ ఇంకా తిరుచ్చుక్కనూరు (ఇప్పటి తిరుచానూరు) కు చెందిన అనేకమంది ఆచార్యుల, దివ్య పురుషుల నివాసాలున్నాయి. ఇవన్నీ చూశాక శ్రీరంగం వలె తిరుమల కూడా ప్రసిద్ధ నారాయణ దివ్యక్షేత్రమని వారికి పదే పదే అనిపించింది. కానీ క్షేత్ర వైభవాన్ని బట్టి శ్రీరంగమే తిరుమల కన్నా ప్రముఖమైనదని తీర్మానించుకున్నారు. శ్రీరంగనాథుడు ఎందరో ఆళ్వార్లు, ఆచార్యుల పూజలనందుకున్నాడు. ఇప్పుడు ఎంత బాధామయ స్థితి ఎదురైంది! మరలా పునర్వైభవం స్వామికి ఎప్పుడో అని ఆలోచిస్తూ ఉండగా అందరూ తిరుమల ఆలయంలోకి ప్రవేశించారు.

అక్కడ శ్రీరంగనాథునికై నిర్మిస్తున్న ప్రత్యేక మందిరనిర్మాణ వైభవాన్ని వివరించి చెప్పిన తర్వాత ఇటు రండి ఒక్కసారి అంటూ గర్భగుడిలో వరదరాజ, నృసింహ సన్నిధులను చూపిస్తూ "మీకు కొన్ని విషయాలను చెప్పాల్సి ఉంది. యువకులారా! దక్షిణాపథం ఢిల్లీ సుల్తానుల ముట్టడికి గురైనప్పుడు, కంచి వరదరాజ స్వామి, అహోబిల నారసింహుడు ఇక్కడికి విచ్చేస్తారని ఊహించాను. వారికై ముందుగానే సన్నిధులను తయారు చేసి

ఉంచాను. కానీ వారు ఇక్కడికి రాలేదు. కానీ శ్రీరంగనాథుడు ఇక్కడికి వేంచేస్తారని కలలో కూడా ఊహించలేదు. మేల్కోటలో ఉన్నారని విన్నాను. అందుకే నేను మండపాన్ని తయారుగా ఉంచలేకపోయాను. కానీ, ఇప్పుడు నంపెరుమాళ్ కోసం ఒక దివ్య సుందర మండపాన్ని నిర్మించడమే నా అత్యవసర కర్తవ్యం. "కానీ మహరాజా! మీరు సుల్తానుతో వీరోచిత పోరాటం చేయలేదని మనసులో అనుకున్నాం. కానీ మీ వృద్ధాప్య స్థితి చూశాక మేం మీ గురించి పొరబాటుగా అనుకున్నాం అనిపించింది. సరే! మహారాజా! శ్రీరంగనాథుని గురించి ఒక విన్నపం చేస్తాము. మీరు అది నెరవేర్చాలని మా విన్నపం. "చెప్పండి" అన్నాడు మహారాజు వారిని సాలోచనగా పరికిస్తూ "శ్రీ రంగనాథస్వామి సన్నిధిలో ఆయనకు ఎంతో ప్రీతిపాత్రమైన తమిళ ప్రబంధాలు నిత్యం గానం చేయబడేవని విన్నాము. ఇక్కడ కూడా ఆ తమిళప్రబంధాల గానం ఏర్పాటు చేయవలసినదిగా మా ప్రార్థన" అన్నాడు వల్లభుడు.

"ఇదే మీ అభిమతమైతే తప్పక ఆ ఏర్పాట్లు చేయగలను"

"చాలా సంతోషం మహారాజా!"

మరుసటిరోజు ఉదయం నుండి ప్రబంధగానం ఏర్పాటు చేయబడింది. రెండు రోజుల తర్వాత అర్చక సిబ్బంది ఈ క్రొత్త విధానానికి ఒప్పుకోలేదు. మలయప్ప స్వామి ఆలయంలో ఆయనకు తగిన రీతిలో జరగాలి కానీ ఇదేమిటని అందరూ చర్చించడంతో పారాయాణాన్ని నిలిపివేశారు. ఎక్కడ చూసినా దీనిని గురించిన చర్చలే నడవసాగాయి.

దీనికి వల్లభ దత్తులు మనస్తాపం చెందారు.

పంద్రెండు మంది ఆళ్వార్లు కలిసి తమిళ భాషలో అద్భుతమైన పాశురాలను దివ్య ప్రబంధం పేరిట రచించారు. 8-9 శతాబ్దాలలో దివ్య ప్రబంధాలకు వేదాలతో సమానమైన గౌరవం లభించేది. ఈ పాశు రాలగానం ఆలయ పూజావిధానంలో భాగం చెయ్యాలని ఎందరో భక్తులు కృషిచేశారు. 14వ శతాబ్ది ప్రారంభంలో ఈ గానానికి శ్రీరంగంలో కూడా స్థానం లభించలేదు. తెలుగు మరియూ కన్నడ మాతృకలు గల అర్చకులకు ఈ విధానం ఇబ్బందికరంగా తోచడంతో సుహృద్భావం లభించలేదు. దీనిని గూర్చి శ్రీరంగంలో ఎన్నో వాదప్రతివాదనలు జరిగేవి. ఇటువంటి సమయంలో శ్రీరంగానికి శ్రీవేదాంత దేశికులను ఆహ్వానించారు. వీరు సంస్కృత, తమిళ, కన్నడ తెలుగు భాషలలో నిష్ణాతుడు. ఎన్నో గ్రంథాలను రచించారు. ఆగమశాస్త్రాలలో అందెవేసిన చేయి. ఆయన అందరితో చర్చించి, తమిళ ప్రబంధాలను ఆలయాలలో ప్రవేశ పెట్టడాన్ని సమర్థించారు. ఆయన ఎందరితోనో వాదప్రతివాదనలు చేసిన అనంతరం శ్రీరంగంలో దివ్య ప్రబంధాల గానానికి ఆమోదం లభించింది. అక్కడ విజయవంతంగా దివ్య ప్రబంధ గానం జరుగుతుండడం వల్ల మెల్లగా ఇతర వైష్ణవాలయాలలో కూడా ఈ పద్ధతి మొదలైంది. కానీ తిరుమలలో మాత్రం అనాదిగా వైఖానస ఆగమ పద్ధతి అమలులో ఉండడం వల్ల ఆ అర్చకులు వ్యతిరేకించడం అప్పట్లోనే జరిగింది. ఎన్నో శతాబ్దాలుగా తిరుమల పరిసరాలను ఎందరో చక్రవర్తులు రాజులు పరిపాలించినా, ఈ ఆలయ విధానాల్లో ఎవ్వరూ మతపరంగా, భాష పరంగా వేలు పెట్టలేదు. అక్కడ సంస్కృతమే ముఖ్యభాషగా వేద పారాయణ జరిగేది. అన్య ప్రాంతీయ

భాషలకు తావు లేకుండా, ఎటువంటి వివాదాలకు తావులేకుండా చేశారు.

ప్రస్తుతం, తరతరాలనుండి వస్తున్న ఆగమ సాంప్రదాయం కాకుండా ఈనాడు శ్రీరంగనాథునికి ప్రాముఖ్యత ఇచ్చి, ఈనాడు తిరుమలలో తమిళ దివ్యప్రబంధాలను గానం చేయడం చాలా మందికి నచ్చలేదు. అందువల్ల మనస్తాపం చెందిన రాజవల్లభుడు, దీన్ని కొనసాగించాల్సిందే అంటూ ఆనందవిమానానికి ఎదురుగా కూర్చుని నిరాహారదీక్షకు పూనుకున్నాడు. ఎందరు చెప్పినా వినలేదు. అర్చకులు ఏమీ మాట్లాడలేదు. దివ్యప్రబంధ గానాల విషయంలో వ్యతిరేకతే ఎక్కువగా ఉంది. ఏడు రోజులు గడచినా, నిరాహార దీక్ష కొనసాగుతున్నా, అర్చకులు దిగిరాలేదు. ఒక వంక వల్లభుని ఆరోగ్యం క్షీణించడం మొదలుపెట్టింది. దత్తునికి ఏమి చేయాలో పాలుబోలేదు. వెంటనే హుటాహుటిన చంద్రగిరికి బయలుదేరి వెళ్ళి ఘంటానాదం చేసి యాదవరాజుకు విషయం తెలియజేశాడు. యాదవరాజు జరిగిన విషయం తెలిసి చింతిస్తూ పల్లకీలో వెంటనే తిరుమల చేరుకున్నాడు. ఆలయ సిబ్బందిని సమావేశ పరచి "నా ఆజ్ఞలను ధిక్కరిస్తారా?" అని క్రోధం వ్యక్తం చేశాడు. ఆలయ సిబ్బంది గడగడా వణకిపోయారు. పొరబాటు జరిగిందని ఒప్పుకున్నారు. వెంటనే రాజు వల్లభుని రాజమందిరానికి తీసుకుని వెళ్ళి వైద్యులతో చికిత్స చేయించి స్వస్థత పడిన తర్వాత "రాజ వల్లభా! తొందరపడి ఎంత పని చేశావు? ఇంక రెండు రోజులు ఆగిఉంటే, దత్తుడు చంద్రగిరికి రాకపోతే ఎంత ప్రమాదం జరిగేది. వీరపత్ని కులశేఖరుని అర్ధాంగియైన మీ తల్లిగారికి మేము మొహంచూపగలమా?" అని అడిగిన పిమ్మట వల్లభుడు మౌనం వీడి "ఈ తిరుమల అర్చకుల వాదనలో కూడా కొంత వాస్తవం ఉన్నది.

కనుక వారిని నిందించి ప్రయోజనమేమీ లేదు. మళ్ళీ రంగనాథుడు శ్రీరంగం చేరితేనే అన్నీ సర్దుకుంటాయి" అన్నాడు.

"కానీ ఇప్పట్లో అది అసాధ్యమని నీవెరుగవా?"

"కానీ మన కర్తవ్యం మనం చేద్దాం. కనీసం నా కోరికను మీరు బుక్కరాయల వారికి నివేదించండి" అని నమస్కరించాడు.

మహారాజు అత్యవసరంగా మంత్రులతో ఒక సమావేశం ఏర్పాటు చేశాడు.

అదే రోజు ముగ్గురు యాత్రీకులు తిరుపతి చేరుకున్నారు. తమ అశ్వాలను మఠంలో పెట్టి, గోవిందరాజ స్వామిసన్నిధి, పార్థసారథి సన్నిధి దర్శించుకొన్నారు. తర్వాత అలిపిరి వేపు నడిచి పర్వతంవైపు ప్రయాణమయ్యారు. ఆళ్వారుతీర్థం, గాలిగోపురం, భాష్యకార సన్నిధుల దగ్గర స్వల్ప విశ్రాంతి తీసుకుని, మద్యాహ్నానికి తిరుమల చేరుకున్నారు. అక్కడ పుష్కరిణిలో స్నానమాచరించి, శుభ్రమైన వస్త్రాలను ధరించి శ్రీవేంకటేశ్వరుని సన్నిధికి బయలుదేరారు. మొదటగా ధ్వజస్థంభానికి మోకరిల్లి అటు తర్వాత గరుడాళ్వార్ను దర్శించుకొన్నారు. వరజరాజ సన్నిధి, నరసింహసన్నిధి, రామానుజ సన్నిధి దర్శించిన అనంతరం మూలవిరాట్టయిన శ్రీనివాసుని దర్శించుకోవడానికి బయల్దేరారు.

బంగారు వాకిలి దాటి లోనకు వెళ్ళగానే శంఖ చక్ర సహితుడై, స్వర్ణ కిరీటధారుడైన శ్రీవేంకటేశ్వరుని కన్నులారా గాంచిన మరుక్షణంలో, వారికి కన్నుల నీరు కారుతూ ఉండగా వారు దర్శనం చేసుకుంటున్నారు. ఎంత సేపు చూసినా తనివి తీరడంలేదు. అక్కడ ఉన్న అర్చక స్వామి "అర్చన ఎవరిపేరు మీద?" అని అడిగాడు. ముగ్గురిలో ఒకడు ఒకతన్ని

చూపిస్తూ " భరద్వాజస గోత్రః శ్రీ గోపనారాయణ శర్మ" అన్నాడు. అది విన్నవెంటనే అర్చక స్వామి మౌనంగా తలవంచి గౌరవంగా అర్చన కొనసాగించాడు. అర్చకుడికి వెంటనే అర్థమైంది వచ్చినది సామాన్యుడు కాడు. విజయనగర సామ్రాజ్యాంతర్భాగమైన ముల్బగల్ రాజ్య సర్వసేనాధిపతి శ్రీగోపన్న గారని. గోపన్న శ్రీనివాసుని ముందు భక్తితో తలవంచి నిలబడ్డాడు. అర్చకస్వామి గోపన్నకు కర్పూరదీప కాంతితో మలయప్పస్వామిని (మలై గునియ నిన్ర పెరుమాళ్) దర్శనం చేయించాడు. స్వామితో పాటూ ఉభయ నాచ్చియార్ల దర్శనం అయ్యాక గోపన్న అకస్మాత్తుగా తలయెత్తి "స్వామీ! మలయప్ప ప్రక్కన ఉన్న మూర్తి ఎవరు?" అని ప్రశ్నించాడు. " శ్రీరంగంలో గతంలో కొలువై ఉన్న శ్రీరంగనాథ స్వామి" అని చెప్పాడు.

రంగనాథ స్వామి అన్న పేరు విన్న వెంటనే గోపన్న సాష్టాంగ నమస్కారం చేస్తూ "స్వామీ...స్వామీ... నేను విన్నది నిజమేనా? నేను సరిగ్గానే విన్నానా? కల కాదు కదా!" అని మాట్లాడుతూ భక్తి పారవశ్యంతో మునిగి తేలుతున్నాడు. నోట మాటకూడా సరిగా రాక చాలాసేపు ఇబ్బంది పడ్డాడు. ఆందాశృవులు జాలువారి అతని ఛాతీభాగం మొత్తం తడిసిపోయింది.

"మీరు విన్నది నిజమే! రెండు వారాల క్రితం మాత్రమే ఇక్కడకు వచ్చారు"

"రంగా! నీకోసం అన్వేషణ ప్రారంభించకముందే నాకు దర్శనం ఇచ్చావా? ఎంతటి కరుణామయుడవు స్వామీ" అంటూ మరలా సాష్టాంగ నమస్కారం చేసి అర్చకునివైపు తిరిగి "మా రంగని ఎవరు ఇక్కడకు చేర్చారు? నేను ఈ రంగని అన్వేషణలోనే బయలుదేరాను."

అర్చకుడు ఇద్దరు యువకుల గురించి, అడవిలో జరిగిన వృత్తాంతం మొత్తం

పూసగ్రుచ్చినట్లు చెప్పాడు. "వారిద్దరూ ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? వారిని నేను కలవాలి. వెంటనే కలవాలి" అన్నాడు భావోద్వేగంగా. "ఇద్దరిలో ఒక యువకుడు పేరు రాజవల్లభుడు, ఒక క్షత్రియుడు, ఇక్కడ రంగనాథస్వామికి తమిళ ప్రబంధాలు గానం చెయ్యలేదని ఆగ్రహించి నిరసనవ్రతం పూని చావుబ్రతుకులలో రాజభవనంలో ఉన్నాడు. మేము దానికి ఒప్పుకున్నప్పటికి, నిన్నటిరోజున యాదవరాజుతో శ్రీరంగనాథ ప్రతిష్ట శ్రీరంగంలో జరిగేవరకూ దీక్ష విరమణ చేయనని మొండికేశాడట."

వెంటనే మరికొన్ని ఘడియల్లో గోపన్న రాజప్రాసాదం చేరుకుని కబురు పంపాడు. యాదవరాయలు వచ్చినదెవరో గ్రహించి వెంటనే ప్రవేశపెట్టవలసిందని చెప్పాడు. గోపన్న తన గురించి తన అన్వేషణ గురించి క్లుప్తంగా వివరించి, తను ఆలయంలో శ్రీరంగనాథ స్వామిని చూశానని, ఆ ఇద్దరు యువకులను వెంటనే కలవాలని ఉన్నదని చెప్పాడు. యాదవరాయలు మౌనంగా తన్ను అనుసరించవలసినదిగా కోరుతూ ఆ భవనంలోని ఒక గదికి తీసుకుని వెళ్ళాడు. అక్కడ పడకపై రాజ వల్లభుడు ఎముకలగూడు వంటి శరీరంతో పడుకుని ఉండడం, వైద్యులిద్దరు అనుక్షణం అతన్ని గమనించడం చూసిన గోపన్నకు అనుమాన నివృత్తికై అతను నిరాహారదీక్ష సాగిస్తున్న వైనం వివరించాడు. పరిచారికలు వింజామరలు వీయడం చూశాడు గోపన్న.

"ఇతని దీక్షకు కారణం?" అన్నాడు రాజవల్లభుని అరచేతిని మృదువుగా స్పర్శిస్తూ.

యాదవరాజు జరిగినదంతా చెప్పి శ్రీరంగనాథుని శ్రీరంగంలో ప్రతిష్టించేంతవరకూ దీక్ష విడవనని చెప్పి ప్రాణాల మీదకు

తెచ్చుకుంటున్నాడు. మీరైనా చెప్పండి. అది ఇప్పట్లో సాధ్యమవదని!"

గోపన్న ఆవేశంగా వల్లభుని వద్దకు వెళ్ళి అతని ముఖం తన వేపుకు తిప్పుకుని "రాజవల్లభా! చిరంజీవ! సుఖీభవ! రాజులందరూ ఏ విషయమైతే విస్మరించారో, దాన్ని నీవు నీ మిత్రుడు కలిసి సాధించారు. పెద్ద పెద్ద వీరులు, ధనవంతులు, రాజులు, సైన్యబలగాలు ఉన్నవాళ్ళు చేయలేనిపని మీరిద్దరూ కలిసి సాధించారు. ఈ విషయంలో మొత్తం విజయనగర సామ్రాజ్యమే మీకు ఋణపడి ఉన్నది. ఇంత ఘన కార్యం సాధించిన మీరు ఇలా ఉండకూడదు. దీక్ష విరమించండి. నన్ను ఈనాడు ఆ శ్రీరంగనాథుడే ఇక్కడికి పంపాడని అనుకుంటున్నాను. మీరు అనుకుంటున్న శ్రీరంగంలో స్వామిని ప్రతిష్ఠించే పని నాకు వదలిపెట్టండి. నేను వాగ్దానం చేస్తున్నాను. దీక్ష విరమించు. ప్రాణం విలువైనది. మీ తల్లి ఎంత దుఃఖిస్తుందో ఒక్కసారి ఆలోచించావా! నీ దీక్ష ఈనాటినుండి నాదిగా భావించు" అని చేతులు పట్టుకుని బ్రతిమలాడాడు.

గోపన్న చెప్పినది విని వల్లభుడు మహదానందం పొందాడు. కళ్ళవెంట నీరు కారిపోతున్నది. యాదవరాయలు గోపన్న ఎవరో ఎంతటి పరాక్రమశాలి అన్న విషయాలు చెవిలో చిన్నగా చెప్పాడు. వల్లభునిలో క్రొత్త ఉత్సాహం నెలకొనింది. మెల్లిగా లేవడానికి యత్నించాడు. గోపన్న వల్లభునిలేపి ఒక దిండు వేసి ఆనుకుని విశ్రాంతిగా ఆనుకుని కూర్చునేట్టు చేసి ఆనంద భాష్పాలతో "అవును వల్లభా! శ్రీరంగనాథ స్వామిని చంద్రగిరి అడవుల్లో వెదకడానికే నేను నిశ్చయించుకుని బయలుదేరాను. నిన్న స్వామిని మలయప్ప ప్రక్కన చూశాక నామనసెంతో ఉప్పొంగి పోయింది.

"ఇప్పుడు ఈ క్షణమే నీ ముందు వాగ్దానం చేస్తున్నాను. విను!

నేను గోపనారాయణ అనబడే గోపన్నను, ముల్బ్వె సామ్రాజ్య సర్వసేనాధిపతిగా, ప్రమాణం చేస్తున్నాను. శ్రీరంగనాథుని శ్రీరంగంలో తిరిగి ప్రతిష్టిస్తాను. అందుకు నా ప్రాణాలైనా పణంగా పెట్టి పోరాడి ఆ సుల్తాను తలను కదన రంగంలో చెండాట ఆడి తీరుతాను. ఇదే నా ప్రతిజ్ఞ! ఇకపై ఈ వాగ్దానమే నా లక్ష్యంగా భావిస్తాను"

గోపన్న ప్రతిజ్ఞ వినిన తర్వాత రాజవల్లభునికి ఆనందంతో అంత నీరసలోను కళ్ళు మెరిశాయి. చిన్నగా దగ్గి వణుకుతున్న కంఠస్వరంతో "అయ్యా! గోపనార్యా! నన్ను దీక్ష విరమింపజేయడానికి ఈ వాగ్దానం చేయడంలేదని విశ్వసిస్తున్నాను. ఇది త్రికరణశుద్ధిగా చేసిందని భావిస్తున్నాను" అనగానే గోపన్న చిన్నగా నవ్వాడు. యాదవ రాయలు వెంటనే "తప్పు! తప్పు! వల్లభా! గోపనార్యుని వీరత్వం, శూరత్వం నాకు తెలుసు" అని లెంపలు వేసుకున్నాడు. గోపన్న "నాయనా! వల్లభా! నీ సందేహంలో న్యాయం ఉందని నాకు అర్థమయింది. ఎదుకంటే ఇప్పటికే ఎంతో మందిని నమ్మి మోసపోయి ఉన్న స్థితిలో ఉన్నావు. నీవే కాదు యావత్ శ్రీరంగమూ అదే పరిస్థితిలో ఉందంటే కూడా అతిశయోక్తి కాజాలదు. నీ పరిసరాలలో జరిగిన జరుగుతున్న సంఘటనలే అందుకు తార్కాణం. నీవు ఇక మనసు ఆరోగ్యం స్వస్థత పరుచుకో! నేను నా జీవితాన్ని ఈ లక్ష్యం కోసమే వెచ్చిస్తాను" అని గంభీరంగా చెప్పిన గోపన్న మాటలు విని, తల్పం దిగి లేని ఓపిక తెచ్చుకుని "ఓం నమో నారాయణాయ!" అని ప్రార్థించి గోపన్న వద్ద నిలబడి ఆయన చేతులకు పట్టుకుని కళ్ళకు అద్దుకుని "పవిత్రుడనయ్యాను గోపనార్యా! మీకు అనేక ధన్యవాదములు. నాకు సంపూర్ణ విశ్వాసం కుదిరింది" అన్నాడు. గోపన్న వల్లభుని ఆప్యాయంగా కౌగలించుకుని వెన్ను తట్టి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశాడు.

వల్లభునికి పూర్తి స్వస్థత చేకూరడానికి దాదాపు రెండు వారాల సమయం పట్టింది. రాజు వానికి అన్ని వసతులు చేకూర్చాడు. బలమైన ఆహారం, పండ్లు, పానీయాలు, వైద్య సహాయం అందించాడు. అటుపిమ్మట దత్తునితో కలిసి "మాకు సెలవిప్పించండి మహారాజా! మా వల్ల ఏమైనా తెలియక తప్పిదాలు జరిగి ఉంటే మన్నించండి" అన్నాడు. "ఓ నా పిల్లలారా! త్వరయేల? మెల్లగా వెళ్ళవచ్చును కదా!" అన్నాడు. "మహారాజా! మా కుటుంబ సభ్యులను వదలి ఆరు నెలలయినది. పైగా ఈ సంతోష విషయాన్ని మా తల్లిగారితో పంచుకొనాలి. ఆమె కళ్ళల్లో సంతోషం చూడాలని చాలా ఆతృతగా ఉన్నది" అన్నాడు వల్లభుడు. మహారాజు వారు చేసిన సాహస కృత్యానికి వేనోళ్ళ పొగడి, ఆహార పదార్థాలు, వస్త్రాలు, బంగారం, వెండి బహుమతులు ఇచ్చి సాగనంపాడు.

వారు మరొకసారి మలయప్ప దర్శనం చేసుకుని, శ్రీ రంగనాథుని ముందు నిలుచుని ఆ సౌందర్యాన్ని తదేకంగా చూస్తూ "స్వామీ! త్వరలోనే శ్రీరంగంలో మీ పునః ప్రతిష్టకై వేయికన్నులతో ఎదురు చూస్తాము. తమ సంకల్పం లేనిదే ఏమీ జరగదని మాకు తెలుసు. కాబట్టి ఆ విషయంలో మీరు పూనుకుని జరగవలసిన తదనంతర కార్యక్రమాలకు నాంది పలకండి. మిగతా కార్యాలు మేము చూసుకుంటాం" అని సాష్టాంగ నమస్కారాలు చేసి బయటకు వచ్చారు.

బయట స్వామివారి తమిళ దివ్య ప్రబంధగానం వినవస్తున్నది. అక్కడ కాసేపు కూర్చొని వీనుల విందుగా వింటున్నారు. ఆనంద పరవశంగా వల్లభుడు "భూతం సరస్చ మహదాహ్వయ భట్టనాథ, శ్రీ భక్తిసార కులశేఖర యోగివాహాన్‌బీ భక్తాంఘ్రీం రేణు పరకాల యతీంద్ర మిశ్రాన్,

శ్రీమత్పరాంకుశమునిం ప్రణతోస్మి నిత్యమ్" అని ప్రార్థించాడు. భావాతీత స్థితిలో ఉండిపోయిన రాజవల్లభుని దత్తుడు "ఈ ప్రబంధాలు అంత మహిమ కలవా?" అని ప్రశ్నించాడు. "దత్తా! శ్రీరంగవాసివై యుండి ఈ పిచ్చి ప్రశ్నలేమిటి?" అనగానే "వల్లభా! క్షమించు! నాకు తమిళ భాష నీకు వచ్చినంతగా రాదు. మా గురువులు చిన్నప్పుడు సంస్కృతం, తెలుగు మాత్రమే నేర్పారు" అన్నాడు. వల్లభుడు "దత్తా! విను! నాలాయిర దివ్య ప్రబంధము 8 వ శతాబ్దానికి ముందు, పండ్రెండు మంది ఆళ్వారులు రచించిన 4000 పాశురాల సమాహారం. తమిళంలో నాలాయిర మనగా నాలుగువేలు. 9 వ శతాబ్దంలో నాథముని అనే భక్తుడు వీటిని క్రోడీకరించాడు. నారాయణుని, అతని అనంత రూపాలను కీర్తించే ఈ దివ్య ప్రబంధాన్ని ఆళ్వారులు పెక్కు దేవాలయాల్లో గానం చేశారు. అలా గానం చేయబడిన ప్రాంతాలను దివ్య దేశములు అని అంటారు. దక్షిణభారతంలో ముఖ్యంగా తమిళనాడులో దివ్య ప్రబంధాన్నివేదాలతో సమంగా పరిగణిస్తారు. అందుకే దీనిని ద్రవిడ వేదం అని అన్నారు. శ్రీరంగం మొదలైన ఎన్నో దేవాలయాలలో ప్రతినిత్యం విధిగా ఈ దివ్య ప్రబంధాన్ని గానం చేయడం భగవత్సేవలో ఒక ముఖ్యమైన భాగం. 4000 పాశు రాల్లో 1296 పైచిలుకు పాశురాలు తిరుక్కురుగూరుకు చెందిన నమ్మాళ్వారు "తిరువైమొళి" అన్న పేరుతో రచించాడు. ఆయన తర్వాత "పెరియ తిరుమొళి" పేరుతో 1134 పాశురాలను రచించిన వారు తిరుమంగై ఆళ్వార్. పదకొండు మంది ఆళ్వారులు తమ పాశురాలలో శ్రీమన్నారాయణుని దివ్యావతారములను కీర్తించారు. కాని మధురకవి ఆళ్వారు మాత్రం కన్నినున్ శిరుత్తంబు పేరుతో తన 11 పాశురాల్లో గురువైన

నమ్మాళ్వారునే స్తుతించాడు. నమ్మాళ్వారు రచించిన వాటినే తిరువాయ్ మొళి అని కూడా పిలుస్తారు. తిరువాయ్మొళి అనగా, పవిత్రమైన నోటి నుండి వెలువడే మాటలు అని అర్థం. ఇందులో నమ్మాళ్వారు తనను తాను, కృష్ణుని ప్రేమకై తపించే ఒక గోపికగా అభివర్ణించుకుంటాడు. నీవు ఇపుడు వింటున్న పాశురాలు ఆయన రాసినవే! తిరుమలలో ఈ ఆచారంలేకపోయినా మన ప్రోద్బలం వల్ల శ్రీయాదవరాయలు ఇక్కడ ఏర్పాటు చేశారు. మన పేరు చరిత్రలో నిలుస్తున్నందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. ఈ సంవత్సరం అనగా 1360 నుండి మొదలైన ఈ దివ్య ప్రబంధ పారాయణ ఈ కలియుగం ఉన్నంత వరకూ ఇక్కడ సాగాలని ఆ శ్రీరంగనాథుని ప్రార్థిద్దాం." అంటూ లేచాడు. ఆళ్వార్లు అన్నపదానికి అర్థం ఏమైనా ఉన్నదా? అన్న దత్తుని ప్రశ్నకు నవ్వి వల్లభుడు మెల్లిగా నడుస్తూ "ఆళ్వారులు అంటే 'దైవభక్తిలోమునిగి ఉన్నవారు' అని అర్థం. వారు శ్రీమన్నారాయణుని ఆరాధనా సంకీర్తనాదులలో పరవశించి ఉన్నందున వారికి ఆళ్వారులు అన్న పేరు వచ్చింది. ఆళ్వారులు అనగా జ్ఞానఖని అని మరియొక అర్థము" భగవద్గుణానుభవము నిరర్గళముగా స్వర్గ గంగవలె వీరి వాక్కులనుండి ద్రవిడ భాషా రూపమున వెలువడినందున వీరికి ఆళ్వారులు అను పేరు కలిగింది. ఆళ్వారు అనిన 'కాపాడువారు' అని వ్యుత్పత్తి. తమ కవితలతో వీరు మనలను కాపాడుటకే అవతరించినారు. భగవదనుభవ పరీవాహ రూపమయిన భక్తిసాగరమున మునకలు వైచి యందలి లోతులను కనుగొన్నవారని కూడ ఈ మాటకు అర్థము చెప్పవచ్చు. తమపై నమ్మకము కలిగిన బద్ధ జీవులను తమతోబాటు భక్తిరసామృత సింధువున ముంచి యుక్కిరిబిక్కిరి చేసి బ్రహ్మానందమున

తేల్చుట వీరికి వెన్నతో బెట్టిన విద్య అని ఆర్యోక్తి" బయటకు వచ్చిన మిత్రులిద్దరూ గోపురానికి నమస్కరించి శఠగోపయతి మండపాన్ని దర్శించడానికి వెళ్ళగా అక్కడ గోపన్న పద్మాసన స్థితిలో ధ్యాన నిమఙ్నుడై ఉన్నాడు. "స్వామీ! మా స్వస్థలాలకు వెళ్ళడానికి అనుమతి కోరుతున్నాం" అన్నారు నమస్కరిస్తూ. గోపన్న కళ్ళు తెరిచి "మీరు వెళ్ళిపోతున్నారా? నేను ఇక్కడే ఉంటారని అనుకున్నాను"

"మాకు కూడా ఆ రంగనాథస్వామి పాదాల చెంతనే గడపాలని ఉ ంది. కానీ మేము ఇంటి మొహం చూసి చాలా నెలలు అయింది. వారిని చూడాలని మేము తహతహ లాడుతున్నాం. వాళ్ళను ఒకసారి చూసి మరలా వస్తాం. శ్రీరంగనాథుడిని మాకంటే గొప్పగా చూసుకునే వారిచేతిలో పెట్టాం. ప్రబంధగానం ప్రారంభమయింది. ఒక దివ్య రంగమండప నిర్మాణం పూర్తికావచ్చింది. మాకు ఉన్న చింతల్లా తిరిగి ఆ స్వామిని శ్రీరంగంలో ప్రతిష్ట చేయించడమే! ఆ శుభ ముహూర్తం కోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నాం. శలవ్ అంటూ నమస్కరించి సాగిపోయారు.

సింగళకరుడు, తీవ్ర అనారోగ్య కారణంగా చంద్రగిరిలో ఉన్న ఇంటిని ఖాళీ చేసి కంచికి వెళ్ళిపోయాడని తెలుసుకున్న వల్లభుడు, దత్తుడు చీకటిపడే సమయానికి అనేక వాహనాలపై పయనించి కాంచీపురం చేరుకున్నారు. నగర ప్రవేశ ముఖ ద్వారం మూసి ఉంది. బయట నిలబడి గమనించసాగారు. లోపలనుండి చిన్న కంతలో నుండి చూసిన ఒక సైనికుడు "ఎవరది?" అని అరిచాడు.

"మేము యాత్రీకులం. వరదరాజస్వామి దర్శనానికి వచ్చాం" అని

రాజ వల్లభుడు అనగానే ఒక ద్వార పాలక సైనికుడు చిన్న తలుపు తీసి వారిద్దరినీ పరిశీలించాడు. వీరిద్దరు కూడా అదేవిధంగా సైనికులను చూశారు. ''వరదరాజ స్వామి దర్శనార్థం అంటున్నారు కాబట్టి నమ్ముతున్నాం. లోనకు రండి" అని చిన్న తలుపుద్వారా వారిని లోనకు రప్పించి మరో మారు పరీక్షగా చూసి నగరంలోకి వదిలాడు. నగరంలో పహరా తిరిగే సైనికులు తప్ప వేరే హడావిడి ఏమీ కనిపించలేదు. రహదారి ప్రక్కగా నడుస్తూ సింగళకరుడు, మంజరి ఉన్న గృహం ఎక్కడ? అని అడగ్గా వారు ఒక సారి వీరిని చూసి సింగళకరుడా? అని అనుమానంగా చూశారు. దత్తుడు ''ఆయనకు మంజరి అనే కుమార్తె ఉన్నది'' అనగానే.."ఓహో! మంజరి ఉన్న యిల్లా?" అని తెలిసిన వారి ద్వారా విచారించి చేరుకున్నారు. అది ఒక మట్టి ఇల్లు. అంతకు మునుపు చంద్రగిరికి వెళ్ళకు మునుపు సింగళకరుడు, మంజరి ఉన్న నివాసం. మెల్లిగా తలుపు తట్టి "స్వామీ! తలుపు తీస్తారా?" అని అడిగారు. ఏవో అలికిడుల అనంతరం ఒకామె తలుపు తీసి, బయటకు వచ్చి క్రీనీడలో నిలబడ్డ వారిని చూసి "ఎవరు మీరు?" అని ప్రశ్నించింది. ఆమె సన్నగా పీలగా ఉన్నది. చాలా బలహీనంగా ఉంది. అయినా 'చక్కనామె చిక్కినా అందమే' అన్న చందాన ఆమె మొహంలో మాత్రం ఏవో కాంతులు మెరుస్తున్నాయి. గుర్తుపట్టిన వల్లభుడు "మంజరీ! నువ్వేనా?" అన్నాడు. ప్రక్కన ఉన్న దత్తుడు కూడా ఆమెను గుర్తించి ఆశ్చర్యపోయాడు. మంజరి "మీరా! రండి లోనకు" ఆహ్వానించి కన్నులలో కారుతున్న నీటిని ఆపుకుంటూ, పవిట చెంగుతో తుడుచుకుంటూ ఉండగా "సింగళకరుడు ఎక్కడ? మంజరీ! వెంటనే అతన్ని చూడాలి. చాలా విషయాలు చెప్పాలి మేము" అంటూ గోడకు ఆనించి

ఉన్న అతని చేతి కర్రను చూసి సాలోచనగా "తొందరగా పిలువు మంజరీ!" అన్న మాటకు "ఎంతో దూరం ప్రయాణం చేసి వచ్చారు. చెప్తాను మొదట భోజనం చెయ్యండి! చాలా పొద్దు పోయింది. రండి. విషయాలన్నీ తీరిగ్గా చెప్తాను" అని వంట గదిలోకి నడిచింది. ఇద్దరూ మొహాలు చూసుకుంటూ వంటగదిలోకి నడిచారు. భోజనం అయ్యాక తీరిగా మంచాలపై పడుకున్న తర్వాత వారికి తాంబూలం వంటివి అందిస్తూ "నాకు నిద్దరొస్తున్నది. రేపు ఉదయం మాట్లాడుకుందాం" అని వాళ్ళను తప్పుకుని వెళ్ళబోతుండగా వల్లభుడు "మీ నాన్న ఎక్కడ?" అన్న ప్రశ్నకు పెద్దగా ఏడ్చి, "రేపు ఉదయం చెపుతాను వల్లభా!" అని వెళ్ళిపోయింది.

చాలా సేపటి వరకూ వారిద్దరికి నిద్ర రాలేదు. మంజరి ఎందుకు మాటి మాటికి ఏడుస్తున్నది? ఏదో కీడు శంకించింది. కాసేపటికి ఆదమరచి నిద్రపోయారు. తెల్లవారగానే రాజవల్లభుడు "మంజరీ! నేను సింగళకరుని తక్షణం చూడాలనుకుంటున్నాను. ఇంక ఆగేది లేదు" అని ఆమె ఇచ్చిన పాల పాత్రను తీసుకుంటూ. గోడకు ఆనించి ఉన్న కర్రను చూపిస్తూ "దీన్ని మనకు వదలి నాన్న శాశ్వతంగా వెళ్ళిపోయాడు" అంటూ దుఃఖిస్తూ గోడను ఆనుకుని అలాగే జారి జారి నేల మీద కూలబడిపోయింది. వల్లభదత్తులిరువురూ నివ్వెరపోయారు. తేరుకున్న అనంతరం "ఏమైంది చెప్పు మంజరీ!" అని బ్రతిమాలాడుకున్నాక వెక్కి వెక్కి ఏడుస్తూ చెప్పసాగింది "మీతో పాటూ అంజనాద్రి పైకి ఎక్కలేక వెనక్కు వచ్చాదు. రెండు రోజులు చంద్రగిరిలో ఉన్నతర్వాత కాలు నొప్పి బాగా ఎక్కువైంది. కాళ్ళు కదిలించలేని స్థితి వచ్చింది. అక్కడి వైద్యులు వైద్యం మావల్ల కాదని చేతులెత్తేశారు. ఒక గుర్రబ్బండి సాయంతో మేము మళ్ళీ ఇక్కడికి చేరుకుని ఒక వైద్యుడికి

చూపించాము. కాళ్ళనుండి ప్రారంభమయిన ఆ ప్రాణాంతక వ్యాధి వలనశరీరం మొత్తం నీలంగా మారింది. చనిపోయే ముందురోజు అర్ధరాత్రి పెద్దగా అరుస్తూ "మంజరీ! వల్లభదత్తులు శ్రీరంగనాథుణ్ణి అంజనాద్రిలో కనుగొన్నారు. ఆయన్ను తిరుమలకు తరలిస్తున్నారు. నేను చూస్తున్నాను. నేను చూస్తున్నాను. శ్రీరంగనాథస్వామి నీకు అన్యాయం చేయదు" అంటూ పెద్ద పెద్దగా కేకలు పెడుతూ, అదేరోజు తెల్లవారు ఝామున కన్ను మూశాడు.

విజయనగర సామ్రాజ్యం ఉత్తరాన ఉన్న కాసారంలో నీళ్ళు సుళ్ళు తిరుగుతూ ఉధృతముగా పొంగిపొరులు తున్నాయి. తిరుమల నుండి వచ్చినతర్వాత ఎప్పుడెప్పుడు కంపరాయలను కలుద్దామా అని ఉంది. గోపన్న అశ్వాన్ని అక్కడ ఆపి క్రిందికి దిగి దూరముగా ఒక బ్రాహ్మణుడు సంధ్యవార్చడం గమనించాడు. తనకు ఈ సైన్యాధ్యక్షుని పదవి కట్టబెట్టినప్పటినుండి త్రికాల సంధ్య కుదరడంలేదు. ఉదయం సాయంత్రం మాత్రమే కుదుర్తున్నదనుకుని బాధపడుతూ అంత మధ్యాహ్న సమయంలో ఎవరా అక్కడ ఉన్నది అని చూశాడు. ఆయన చారుకీర్తి పండితాచార్యులవారు. సంతోషముతో దగ్గరగా వెళ్ళి "ఆచార్యా! కుశలమా? నన్ను మరచిపోయారా! గుర్తున్నానా? గోపన్నను" అని ప్రశ్నించాడు. ఆచార్యులవారు సంధ్య ఆపి "అయ్యో! గోపనా! మిమ్మల్ని మరచిపోవడమా! మీరు కంపనగారి మిత్రులు. పైగా నారాయణపురాధీశులు. ఎప్పుడూ వారి రాచనగరునందే మీ నివాసం. మీరే మా లాంటి వారిని గుర్తుంచుకోవాలి సుమా! ఇంతకీ విషయం ఏమిటి? రాచనగరు వదలి కాసారాలవేపు గాలి

మళ్ళింది మీకు" అనగానే విచారంగా "ఏమి చెప్పమంటారు ఆచార్యా! నేను తిరుమల వెళ్ళి వచ్చి రెండు రోజులయింది. ఇంతవరకూ కంపన దర్శనమే కాలేదు. చాలా ముఖ్యమైన తిరుమల దర్శన విశేషాలు చెప్పవలసి ఉన్నది. అక్కడా ఇక్కడా తిరుగుతూ కాలక్షేపం చేస్తున్నాను" అన్న మాటకు ఆశ్చర్యంగా చూసి "అవును అంతయు గ్రహచారము. విధి!" అని తల కొట్టుకున్నాడు. గోపన్న ఏమయినది ఆచార్యా?" అనగా "గోపనా! నేను దేవాయీ మహారాణి గారి ఆస్థాన నాట్యాచారుడనే మాట పేరుకు మాత్రమే! పెత్తనమంతా ఆ దుగ్గన్నదే! కంపన జయాప సేనాని రచించిన నృత్యరత్నావళి అనే గ్రంథము గూర్చి నాతో అనేకమార్లు చర్చలు జరిపారు. కానీ దుగ్గన వస్తే మాత్రం నాతోచర్చలు మధ్యలోఆపి, ఆయనతో ముచ్చట్లు పెట్టుకుంటాడు. నేనొకణ్ణి అక్కడ ఉన్నాననే సంగతి కూడా మరచిపోతుంటారు. దుగ్గన గురించి మీకు అనేక మార్లు చెప్పియున్నాను కదా! అంతే కాదు! ఒక ముఖ్య రహస్యం. దుగ్గన కాకతీయ దేశమైన ఓరుగల్లు నుండి వచ్చిన ఒక కన్యారత్నాన్ని పరిచయం చేసి, కంపనను లోబరుచుకున్నాడు. ఇహ పవలు రాత్రి ఆమేతోనే సహవాసం. చివరకు దుగ్గన ఎంత తేనె పూసిన కత్తి అంటే.... దేవాయి మహారాణి చేతనే ఆ గంగాదేవి మహాతల్లిని కంపనకు కట్టబెట్టించాడు. కంపన ఆమె నాట్య గాన మాధుర్యాలకు కవిత్వ పటిమకు దాసుడయ్యాడు. పైగా క్రియాసిద్ధి పండితులంతటి వారిచేత సంస్కృత శిక్షణ కూడాను ఆమెగారికి! ఇలాంటి అకృత్యాలను చేయాలంటే దుగ్గన తర్వాతనే ఎవరైనా! అయ్యా గోపన్నా.. మీతో చనువు ఉందిగదా అని ఇలా చెప్తున్నాను. ఇంకెవరైనా అయితే నా తల ఎగిరిపోయే పనే! విధివ్రాతను ఎవరు తప్పించగలరు? కత్తిపట్టి

కదన రంగంలో మన హిందూధర్మానికి వచ్చిన విపత్తును నివారించవలసిన ఆ కంపన పట్టపు రాణి కుంతలాదేవిని కూడా మరచి గంగమ్మను నెత్తిన బెట్టుకున్నాడు" అని నిట్టూర్పు విడిచాడు. "గంగమ్మ అంటే గంగాదేవి కదా! ఆవిడ సంగీత, నృత్య సాహిత్యాలలో దిట్ట. ఒకసారి కోటలో దుగ్గన్న పరిచయం చేశారు. గంగాదేవి కంపనను కేవలం శృంగారానికే పరిమితం చేయదనుకుంటాను. ఆమెకు వీరరసమన్నా మంచి ప్రీతి అని విన్నాను. స్వయంగా కత్తి యుద్ధం కూడా నేర్చుకుందట. నావద్ద పలుమార్లు సాహిత్య విశేషాలు అడిగి తెలుసుకున్నది." అని గోపన్న అనగా తలయూచి "ఆడువారు దేనికైనా సమర్థులు! వారిని నమ్మడం సర్వదా శ్రేయస్కరమైతే కాదు సుమా! ఏది ఏమైనా కంపనకు నీవే మార్గోపదేశం చేయాలి అన్నట్టు ఈ విషయం ఎవరికైనా చెప్పారంటే నా పని రంగ రంగే! ఉంటాను" అని మళ్ళీ సంధ్యలో నిమగ్నుడయ్యాడు ఆచార్యులవారు.

రాచనగరులో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి, అనుకుంటూ అశ్వాన్ని ఎక్కి ముందుకు సాగిపోతూ విరూపాక్షాలయం ప్రక్క వీధిలో నున్న రామకృష్ణ పండితుల ఇంటికి ఒక్కసారి వెళ్తే ఏమైనా ఉపయోగకరమైన విషయం బయటబడుతుందా అనుకుంటూ అశ్వాన్ని అటు నడుపుతూ 'ఆహా! ఎంత గొప్ప పండితులు రామకృష్ణులవారు? విద్యారణ్యులవారి ముఖ్యశిష్యుడు. వారి తండ్రి ధర్మరాజాధ్వరులను మించి పోయాడు. వారికి ఈ సీమలో ఎన్ని అగ్రహారములు? ఎంత వైభవం? ధర్ముల వారు రచించిన 'వేదాంత వీరభూమి' లో విషయాలు ఇప్పటికి మదిలో సదా మెదులుతూనే ఉంటాయి. విద్యారణ్యులవారు గురువులు శ్రీ భారతీకృష్ణ తీర్థుల అనంతరం జగద్గురు పీఠం అలంకరించి ఆ పీఠానికే వన్నె తెచ్చిన వాడు. వారికి ఈ

రామకృష్ణ పండితులంటే ఎంత ప్రేమ? అనుకుంటూ ఉండగానే వారి గృహ ముఖద్వారం చేరాడు. రామకృష్ణులవారికి గోపన్న అంటే చాల ఇష్టం. బ్రాహ్మణుడై ఉండి వేద వేదాంగాలు అధ్యయనం చేసి, కత్తిపట్టి పరశు రామునివలె ప్రకాశిస్తున్నాడు సుమా! మన గోపన్న. ఈతని వలన మన విజయనగరానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిపెట్టే పని జరగాలని ఆ రంగనాథుడు ముందుగా ఊహించే ఈతనికి కత్తి చేతికిచ్చాడని అనేక మార్లు కంపనకు చెప్పి ఉన్నాడు.

రామకృష్ణులవారు ఏదో తాళపత్ర గ్రంథం చేత పుచ్చుకుని దీర్ఘంగా ఆలోచిస్తూ ఉండగా గోపన్న ప్రవేశించాడు. "ఎన్నాళ్ళకు గోపన్నా..రా..రా మజ్జిగ పుచ్చుకుంటావా? అని సాదరంగా ఆహ్వానించాడు. గోపన్న మౌనంగా ఉండేసరికి ఆయన "అర్థమైంది గోపనా! నీకు కంపన దర్శనం ఇంకా జరగలేదనే కదా విచారం? అని నవ్వి "చూడు! కంపన వీరపురుషుడే! ఏమాత్రం సందేహం వద్దు. కానీ వయసురీత్యా శృంగారపురుషుడయ్యాడు. ఇది రాజులలో సహజం! విచారించకు! కంపన బుక్కరాయల వారి అండలో ఉన్నాడు కాబట్టి కంపన ప్రకాశం మనకు అర్థం కావడం లేదు. కంపనలో శృంగారత్వంతో బాటూ వీరరసమూ లోలోపల ఉన్నది. బుక్కరాయలవారు కొడుకును చూసి శత్రు సైన్యాలు కంపిస్తాయని ముందే ఊహించి ఆపేరు పెట్టాడు. అదీ.. విద్యారణ్యులవారి ఆదేశంతో. సమయం వచ్చినప్పుడు నీకే అర్థం అవుతుంది. కంగారు పడకు! నీవు తుంగాభద్రా నదీ తీరంలో ఈ సాయంత్రం విహరించు! నీకు కంపన దర్శనం జరుగుతుంది. శుభం. నాకు జపానికి వేళయింది మరిసెలవా?" అని లోనకు వెళ్ళాడు.

గోపన్నలో ఉన్న సందేహాలు పటాపంచలయ్యాయి. మనసానందంతో నిండిపోయింది. కంపన సహజంగా చాలా మంచి వ్యక్తి. నేనే అపార్థం చేసుకున్నాను. నా తిరుమల ప్రతిజ్ఞ వారికి చెప్పి వారికి త్వరగా చెప్పి తీరాలని మనసు ఉవ్విళ్ళూరుతున్నది. ఈరోజు అతన్ని ఆటపట్టించి, కంపన ఖడ్గ నైపుణ్యాన్ని, వీరత్వాన్ని మళ్ళీ ఒక మారు చూడాలి అనుకున్నాడు. భోజనం కానిచ్చి ఒక కునుకు తీసి తుంగాభద్రా నదీ తీరానికి వెళ్ళేముందు గుర్రానికి కట్టిన ఒక తిత్తిని తీసి తాను కుముదిని చెంత వేసిన వృద్ధ వేషం తాలూకు గడ్డం మీసం, సన్యాసి దుస్తులు ధరించాడు. ధనుర్బాణాలు, కత్తీ కటారు ఒరలో పెట్టుకుని మనసులో నవ్వుకున్నాడు. ఇదే సరైన వేషం అనుకుంటూ నదీ తీరం చేరాడు.

కొంతసేపు అలా ఇలా తిరిగిన తర్వాత కొంచెం దూరంలో రెండు అశ్వాలపై ఇద్దరు వీరులు రావడం గమనించాడు గోపన్న. ఒకరు కంపన అని తెలిసి సంతోషించాడు. రెండవ వీరుడెవరో అర్థం కాలేదు. వాళ్ళు దగ్గరగా వచ్చి పదడుగుల దూరంలో నిలబడి తన్ను నిశితంగా పరిశీలిస్తున్నారు. తన వేషధారణేమో ముసలి వాడు, ఒరలో కత్తి, ధనుర్బాణాలు ఉండేసరికి ఎవరో అర్థం కాక చూస్తున్నారు. ఒక నిముషం తర్వాత కంపన "హే! ఎవరు నీవు?" అని ప్రశ్నించాడు. గోపన సమాధానం చెప్పకపోయేసరికి తమిళంలోను, కన్నడంలో కూడా ప్రశ్నించాడు. గోపన మాత్రం ఒరలోని కత్తిని చూసుకుంటుండేసరికి కంపనకు వళ్ళు మండిపోయి ఒరలోనుండి కత్తి తీసి మీదికి దుమకబోగా గోపన కూడా కత్తి తీసి అడ్డుకున్నాడు. ఒక ఐదు నిముషాలు హెూరా హెూరీ యుద్ధం జరిగిన తర్వాత కంపనకు ఆశ్చర్యం కలిగింది. ముసలి వ్యక్తి కంపనకు

ఏమాత్రం తగ్గకుండా కరవాల ప్రదర్శన చేస్తున్నాడు. ఈ ముసలి వీరుడెవరు? అన్నట్టు చూస్తున్నాడు. రెండో వ్యక్తి ఏమీ మాట్లాడకుండా ఇద్దరి పోరునూ గమనిస్తున్నాడు. కంపన మళ్ళీ కత్తి తీసి ఈ సారి ముసలి వ్యక్తి భుజానికి గాయం చేశాడు. రక్తం ధారగా కారుతుండగా "కంపనా! నేను గోపనను" అని పెద్దగా అరిచాడు. కంపన వెంటనే కత్తి క్రింద పడేసి మిత్రుణ్ణి కౌగలించుకొని "హయ్యో! ఎంతపని జరిగింది? ఏమిటీ మూర్ఖత్వం? ఎందుకీ మారువేషం?" అని ప్రశ్నల వర్షం కురిపించాడు. గోపన తన గాయానికి కట్టుకట్టుకుంటూ కంపన ప్రక్కన ఉన్న వ్యక్తి ఎవరన్నట్టు ఆశ్చర్యంగా చూడగా, ముసుగు తీసి నిలబడింది గంగాదేవి.

"గోపనా! నేను గంగాదేవిని. యువరాజావారికి ఏ హానీ కలగనంతవరకూ నేనుజోక్యం కలిగించుకోదల్చుకోలేదు. వారి శక్తి యుక్తులు నాకు తెలుసు. అందువల్లనే ఇలా చూస్తూ ఉండిపోయాను" అని నవ్వుతూ నిల్చుంది. "గంగాదేవికి ప్రణామాలు. నలుగురూ బయట ఎన్ని మాటలు అనుకున్నా మీ బంధం నాకు తెలుసు. మీ వీరత్వమూ విని ఉన్నాను. మీ అనుజ్ఞ మేరకు తిరుమల దర్శనం అయింది. అక్కడి వివరాలు చెప్పడానికిది సమయం కాదు. నేను నా రాజోద్యోగంలో కొనసాగాలనుకుంటున్నాను." అన్న గోపన్న మాటలకు "అవును! గోపన్నా! సరైన నిర్ణయం తీసుకున్నారు మీరు. నన్ను సరిగ్గా అంచనా వేసినవాళ్ళలో నీవొకడవు. ధన్యవాదాలు మీకు. నేను యువరాజా వారి కర్తవ్యానికి గాని మీకర్తవ్యానికి గాని ఏనాడూ అడ్డురాను. వారి కీర్తిప్రతిష్టలు ఇనుమడించేందుకే సర్వదా నాయత్నం ప్రయత్నం. వారి కీర్తి చంద్రికలు ఆచంద్ర తారార్కం నిలిచిపోయేందుకు వారి జీవిత చరిత్రను సంస్కృత గ్రంథంగా వ్రాయాలనుకుంటున్నాను"

అంది. "శుభం! త్వరలోనే కార్యరూపం దాల్చుగాక!" అన్న గోపన్న మాటలకు హటాత్తుగా ఈ తిరుమల యాత్ర ఏమిటో అర్థంకాక వారిద్దరిని అలా చూస్తూ ఉండిపోయాడు కంపన.

"యువరాజా వారు నన్ను క్షమించాలి. నేను తిరుమల నుండి వచ్చి రెండు రోజులైనది. తమతో ఎన్నో ముఖ్య విషయాలను మనవి చేసుకోవలసి ఉన్నది. తమ దర్శనం కాలేదు. అందువల్ల మీరు ఇక్కడ ఉ ండే అవకాశం ఉందని గ్రహించి ఇలా వచ్చాను. కొంచెం సరదాగా వేషం మార్చాను". ఇంకా నయం! ఎవరో ఆటవికుడో... శతృపక్షంవాడో... అనుకుని పోరాటానికి దిగాను. ఒకవేళ నేను ఆవేశపడి కత్తి భుజమ్మీద కాకుండా ఏ కంఠంలోనో గ్రుచ్చిఉంటే నాకు బ్రహ్మహత్యాపాతకం చుట్టుకునేది. నీవే నన్ను క్షమించాలి" అని నవ్వుతూ చేతులు పట్టుకున్నాడు కంపన. "మీలా ఆదర్శ స్నేహితులు చాలా అరుదు. గోపన్న బ్రాహ్మణుడై కూడా కత్తిపట్టడం, మీ విజయాలకు కారణభూతమౌతుందని నాకు అనిపిస్తున్నది. జయోస్తు గోపనార్యా!" అన్న గంగాదేవి మాటలకు సంతోషంగా "చేయవలసినది చాలా ఉన్నది మిత్రమా! మీకు చాలా వివరాలు చెప్పవలసి ఉన్నది" అన్న గోపన్న మాటలకు కంపన "రండి రాచనగరుకు పోదాం. ముందా వేషం తీయండి. ప్రజలు అపార్థం చేసుకుంటారు. ఈరోజుకు విశ్రాంతి తీసుకుని రేపటి ఉదయమే నన్ను కలవండి. శుభం!" అని గుర్రాలపై ఇరువురూ వెళ్ళిపోయారు.

మరునాడు ఉదయాన్నే స్నానాది సంధ్యాధికాలు గావించి గోపన్న విజయనగరానికి బయలుదేరాడు. రాచనగరంతా కోలాహలముగా నున్నది.

రాచభటులు వీధులలో అప్రమత్తముగా తిరుగుతూ క్రొత్త వారి జాడను పసిగడుతూ ఉన్నారు. ఈ సంరంభమంతా బసవణ్ణ దండనాయకులదేనని గమనించి, దస్తరుఖానా ప్రక్కగా ఉన్న మార్గంలో కంపన వారి రాజ ప్రసాదానికి చేరుకున్నాడు.

కంపన తన దైనందిన వ్యాయామము, స్నానపానాదులు మొదలైనవి ముగించుకుని గోపన్న కొరకు, తూగుటుయ్యాలపై ఊగుతూ ఎదురు చూస్తున్నాడు. ఏవో ముఖ్యమైన విశేషాలని చెప్పాడు. ఏమై ఉంటాయా? అని ఆలోచిస్తూ ఉండగా, గోపన ప్రవేశించాడు. కంపన లేచి ఎదురేగి గోపనను కౌగలించుకుని పరిచారకులకు గోపన్నకు వివిధ ఫలహారములను, ద్రాక్షా రసము మొదలైన పానీయములు తెమ్మని చెప్పగానే మరో రెండునిముషాల్లో అన్నీ ఎదురుగా కుదురుగా అమర్చబడ్డాయి. వాటిని ఇద్దరూ ఆరగిస్తూ కాసేపు సంతోషంగా గడిపారు. గోపన్న మాత్రం మధ్య మధ్యలో ఏదో చెప్పాలన్న ఆతృతను ఆపుకుంటున్నట్లు ఉన్న విషయం గమనించిన కంపన “మిత్రమా! ముందు తృప్తిగా ఆరగించు! ఇవన్నీ శాకాహార ఫలహారములే! నీవు నిశ్చింతగా భుజించవచ్చు! ఈ రోజు నీకోసమే కేటాయిస్తున్నాను” అని “మిత్రమా! నీవు రెండు రోజులనుండి నాకై ఎదురు చూస్తున్న విషయం నాకు ఎందుకు తెలియలేదు. అర్థం కావడంలేదు. నా ప్రాసాదములోనే నాకు తెలియని వ్యవహారములు ఏవో జరుగుచున్నవి. నాకు కొన్ని విషయాలు ఇంకా తెలియడంలేదు. ఎవరు నిరోధిస్తున్నారో తెలియ వలసి ఉన్నది” అని నిట్టూర్పు విడిచాడు.

“నిజమే దానిని గురించి ఎక్కువ ఆలోచించవలసిన పనిలేదు. దండనాయకులు బసవణ్ణగారే రాజప్రాసాదంలో ఇతరుల ప్రవేశం

నిషేధించి, ఇలా అన్ని విధములా కట్టుదిట్టం చేసింది మీ క్షేమం కోసమే! అది దండనాయకునిగా ఆయన బాధ్యత. లేనిచో, మీకు వీసమెత్తు అపకారం జరిగినా, బుక్కరాయలవారు ఆయనకు మరణ దండన విధించగలడని ఆయన భయం. రాజులకు ఇవన్నీ సర్వసాధారణం. మావలె మీరు స్వేచ్ఛగా తిరగడం కుదరని పనికదా!" అన్న గోపన్న మాటలకు గంభీరంగా తలయూచి... "చెప్పు గోపనార్యా! ఏమిటి నాకు ఆంతరంగికంగా చెప్పవలసిన విషయం" అని సూటిగా అడిగాడు.

కంపనా! బాల్యం నుండి నాకు వస్తున్న స్వప్నముల గురించి నీవెరిగినదే! కానీ నాకు రెండు రోజుల క్రితం అంటే తిరుమల దర్శనం జరిగాక వచ్చిన స్వప్నం మాత్రం భయంకరమైనదే కానీ దివ్య స్వప్నం. సావధానంగా వినండి యువరాజా! ఆనాటి తెల్లవారు ఝామున ఒక భీబత్సం నా కళ్ళ ముందు గోచరించింది. శవాల గుట్టలు, మాంసపు ముద్దలు రక్తంలా పారే సెలయేరులో కొట్టుకుని పోతున్నాయి. కొండలు..గుట్టలు..పై నుండి దొర్లిపడే కళేబరాలు. కత్తులు బల్లెములు దనుర్బాణాల సవ్వడి. ఇలాంటి స్వప్నం నాకు చిన్నతనంలో వచ్చినప్పుడు ఒక యుద్ధం జరిగింది. కనుక ఇప్పుడు కూడా ఈ నా స్వప్నం మరొక యుద్ధానికి మాత్రం సంకేతంగా తోస్తున్నది. వెంటనే ఒక మహాప్రళయం వచ్చినట్లు కనిపించింది. దానిలో వేయితలల నాగేంద్రుడు చుట్టలు చుట్టుకుని తలలను పైకెత్తి నిలుచున్నాడు. అది నా సుషుప్తియా? జాగ్రదావస్తనా? తెలియలేదు. ఇంతలో నీలమేఘశ్యాముడు శంఖు చక్రాలతో ప్రత్యక్షమయాడు. దివ్య సుందర తేజుడు. ఆ శేషశయ్యపై కూర్చుని నన్ను పేరు పెట్టి పిలిచాడు. కంపన సంభ్రమాశ్చర్యాలతో వింటున్నాడు. గోపన్నా!

నేను శ్రీరంగనాథుడను. భక్తసులభనాథుడను. త్రేతాయుగములో అరణ్యవాసము తప్పలేదు. నేడు మరి కలియుగంలో కూడా అరణ్యవాసమే నాకు శరణ్యమైనది. నేటికి ముప్పది తొమ్మిది సంవత్సరములైనది. నేను ఇంకా పరాయి పంచలలోనే కాలక్షేపం చేయవలసిన దుస్థితి ఏర్పడింది. నన్ను యధావిధిగా తిరుమలనుండి తీసుకుని వెళ్ళి శ్రీరంగంలో స్థాపించవలసిన కర్తవ్యాన్ని నీకు అప్పజెబుతున్నాను. నీ మిత్రుడు కంపన అసమాన్యుడు. శతృభయంకరుడు. ఆతను నువ్వు కలిసి ఈ కార్యమును చేయవలసిందిగా కోరుతున్నాను. మీ ఇద్దరి కీర్తి ఈ భూమండలం ఉన్నంతవరకూ నిలిచి ఉంటుంది. నీకిక నా భక్తులే అనుదినం దర్శనమిస్తారు. శుభం! అని అదృశ్యమయ్యాడు.

అంతే కాదు విచిత్రంగా ఆ కల వచ్చిన మరునాడు నా వద్దకు ఒక గూఢచారి యాదవాద్రి నుండి వచ్చాడు. అక్కడ ముదుసలి వాడైన వేదాంతదేశికుల వారున్నారు. శ్రీరంగంలో యవనుల ఊచకోతవల్ల విగ్రహాలను తీసుకుని లోకాచార్యులవారు అడవులలోకి పారిపోయిన విషయం వివరించి, వేదాంత దేశికులవారు ఆలయం నుండి బయటికి పారిపోయే సమయంలో సుదర్శన భట్టాచార్యులవారు వారి వద్దకు వచ్చి "అయ్యా! పరుగులెట్టి పారిపోయే ఓపికలేని ముదుసలనయ్యాను. ఇది శ్రీభాష్యానికి నా వ్యాఖ్య దీనిపేరు "శ్రుతప్రకాశిక". దీన్ని గైకొని కాపాడమని కోరుతున్నాను. అలాగే వారి ఇరువురు బాలురను కూడా అప్పజెప్పాడు. దేశికులవారు బహు శ్రమలకోర్చి ఆ వయస్సులో ఆ గ్రంధమును తీసుకుని యాదవాద్రికి చేరారు. ఆయన ఒక వేగు ద్వారా ఒక లేఖ నాకు వ్రాసి నారాయణపురానికి పంపాడు. దానిలో "మా కస్తూరి రంగనికి మీ పై

అవ్యాజ్య ప్రేమ కలిగినది. మీతో మాకు చెలిమిని కూర్చాడు ఆ రంగడు. మీరు విజయనగరాధీశులకు విశ్వాసపాత్రులు కాబట్టి ఆ పెరుమాళ్ళు, మీరు సమర్థులని భావించి ఈ బాధ్యతను మీపై ఉంచాడు" అని ఉన్నది అని చెప్పి గోపన్న ఆవేశంతో పైకిలేచి "అన్నా! కంపన్నా! మనమిక త్వరపడవలసిన సమయం ఆసన్నమైంది" అని తన తిరుమల ప్రతిజ్ఞ తదితర వివరాలను పూస గ్రుచ్చినట్లు చెప్పాడు. కంపన చిరునవ్వు నవ్వి "నాకీ విషయములు తెలియదనుకొంటివా గోపనార్యా! ఇంతవరకు మన దుర్గాలను పటిష్టం చేసుకోవడంలోను, సైనిక బలాన్ని సమీకరించడంలోను గడిపిన విషయము నీవెరుగనిదా? చెప్పు?" అని సమాధాన పరచి మెల్లిగా "దేవగిరి రామదేవుడు, హొయసల భల్లాలుడు, మధురాధిపతి వీరపాండ్య సుందర పాండ్యులవారు ఈ దక్షిణాపథాన్ని అల్లకల్లోలం చేస్తూ ప్రజలకు కునుకు లేకుండా చేశారు. శాంతిని బలిగొన్నారు. అన్నీ గమనిస్తూనే ఉన్నాను మిత్రమా! కానీ సమయం రావాలి. కొన్ని చిక్కు ప్రశ్నలు వీడవలసి యున్నది. మహామండలేశ్వరులైన మా తండ్రిగారు జైనులకు, వైష్ణవులకు సామరస్యం కుదిర్చే యత్నంలో ఉన్నారు. బహమనీ వారి పన్నాగాలకు నిత్యం ప్రతిక్రియలు ఆలోచిస్తూ ఉన్నారు. దక్షిణ దేశ దండయాత్రకు మేము ఎప్పుడూ సంసిద్ధులమే! కానీ తండ్రిగారి అనుమతి లేనిదే ఏమి చేయగలము? విజయనగరాధీశులు పవిత్ర కావేరీ నదిలో జలకమాడి, విరూపాక్ష స్వామిని దర్శించడానికి వెళ్ళారు. మనం వారు విచ్చేసే వరకూ కొంచెం ఓపిక పట్టడం మంచిది. మహామండలేశ్వరులకు వేయి రాచకార్యములు" అన్నంతలోనే ఒక ప్రతీహారి "జయము! జయము! కంపనాధీశులకు! మహా మండలేశ్వరులు తమను సభకు విజయం చేయమని

కోరదమైనది" అని వెళ్ళిపోయాడు. "మిత్రమా! ఇదే సరైన అదను. మీరు ఈ మధురపై దండయాత్ర విషయం మీ తండ్రిగారితో ప్రస్తావించండి. వారు తప్పక అంగీకరించగలరు. ఇది నా వ్యక్తిగత కోరిక కాదు. వేలాదిమంది హైందవ భక్తుల విన్నపంగా భావించండి" అని వంగి నమస్కరించాడు. "గోపనార్యా! ఆవేశపడవద్దు మన మధ్య విబేధం ఏమీ లేదు. మీ అభిప్రాయమే నా అభిప్రాయం! మనం స్నేహం విషయంలో పాటించేది అద్వైతమే! ఎప్పుడూ నీవూ నేనూ వేరు వేరు అని తలచ వద్దు" అని చిరునవ్వు నవ్వి వీపు చరచి "నా ప్రయత్నంలో ఏ లోపం ఉండదు. మొదట మధురపై దండయాత్రకే నా ప్రథమ తాంబూలం. ఆ పై దైవేచ్ఛ! మహా మండలేశ్వరుని పిలుపులో అంతరార్థం ఏమిటో తెలుసు కోవలసిన అవసరం ఉన్నది. నీవు కూడా ఆ విరూపాక్షుని దర్శించి, మహామండలేశ్వరుని సభా మండపానికి చేరుకో! నేను వారికి ముందే మీ రాక తెలియపరచి ఉంచుతాను. శుభం!" అన్నాడు.

కంపన తన మందిరానికి వెళ్ళి కాస్త సేదదీరి, అనంతరం, మహామండలేశ్వరుడైన బుక్కరాయల మందిరానికి బయలుదేరాడు. వెంట వంధిమాగధుల కోలాహలం, పరిచారికలు, చెలికాళ్ళు మొదలైన వారు వెంట నడుస్తున్నారు. "కంపనా మాత్యునికి జయీభవ! మహా మండలేశ్వర బుక్కరాయల వారికి విజయీభవ! అనే జయ జయ ధ్వానాల మధ్య తండ్రిగారి మందిరం చేరుకున్నాడు. బుక్కన ఎదురేగి గర్వాతిశయంతో కుమారుణ్ణి కౌగలించుకుని నుదిటిపై ముద్దాడి, తన ప్రక్కనే ఉన్న ఆసనంపై కూర్చుండబెట్టారు. వారికి క్రింది వరుసలో ప్రధాన మంత్రి సోమప్ప

దండనాయకులు, కందారకుళి మారయ్య నాయక మంత్రులు ఆశీనులై ఉన్నారు. వారి ప్రక్కన ఆర్థిక మంత్రి అనెగొంది విఠ్ఠప్ప, వారికి ఎదురుగా సాల్వ మంగు, గోపన్న ఆశీనులైనారు. బుక్కరాయలవారికి పండ్ల రసాలు, తాంబూలం వగైరా అందించేందుకై లక్కప్ప నాగప్పలు ఇరువైపులా నిలబడి ఉన్నారు. అందరూ శాంతంగా కూర్చున్నాక అందరికి ద్రాక్షా పానీయం అందజేయబడినది.

మహారాజా! శుభమగుగాక! సోమప్ప లేచి నిలబడ్డాడు. బుక్కరాయలవారు మాట్లాడమని సైగ చేసిన అనంతరం "ప్రణామాలు! సుల్తానులను తుదముట్టించడానికి మనకు లభించే అతి చిన్న అవకాశంకూడా వదలకూడదు. ఈ మధ్య మనం మౌనంగా ఉన్నామని మన సమర్ధతను అసమర్ధతగా భావిస్తున్నారని నేను అనుకుంటున్నాను మహరాజా! నా మాటల్లో దోషముంటే మన్నించండి" అని కూర్చున్నాడు. వెంటనే గోపన్న లేచి నిలబడ్డాడు. మహారాజా!

సీ."అగ్రహారములలో యజ్ఞధూమము మాసి
మాంసపు సెగపొగల్ మసిని బ్రాము
వేదస్వరోదాత్త నాదముల్ ముగిసి య
రుంతుద శబ్ద నిర్ఘోషలెగయ
నారికేళ ఫలాలనంగ శూలాలపై
మనుజుల తలలె వ్రేలును సతమ్ము
కాంతా పదాంగద ఘల్ఘలల్ కఱవులై
నడివీధి విప్రశృంఖలలె మ్రోగు

నిఖిల వేదములకు నీతికి జరితకు
ధర్మమునకు జ్యూతియె దర్శితమ్ము
సుప్తి కదను కాదు సుల్తాను లిటురేగ
ఆలసింప కింక నానతిండు"

అవును మహారాజా! దక్షిణాదిన ఉన్న తమిళప్రయుక్త రాష్ట్రాలు సుల్తాను పాలనలో నరకాన్ని చవిచూస్తున్నాయి. వారిని రక్షించే నాథుడు లేక దీనావస్థలో కొట్టుమిట్టాడుతున్నారు. ఆ ప్రాంతాలనుండి పారిపోయివచ్చి ఎంతో మంది మన నగరంలో శరణార్థులవలె కాలం గడుపుతున్నారు. మరొక వంక చోళ, పాండ్య రాజ్యాలలో ఆలయాలలో పూజా పునస్కారాలు మూలనపడ్డాయి. ఎంతో ప్రాచుర్యం వహించిన మధుర మీనాక్షి ఆలయం నేడు మూతపడింది. జగద్విఖ్యాతి గాంచిన శ్రీరంగ ఆలయం అందుకు భిన్నంగా లేదు. ఆలయం మూయబడి అక్కడి శ్రీరంగనాథుని విగ్రహమైన నంబెరుమాళ్ ప్రస్తుతం మన రాజ్య సరిహద్దులలో ఉన్న తిరుమలలో ఉన్నది. రుదిరోద్గారి సంవత్సరంలో అనగా 39 వత్సరాల క్రితం స్వస్థలం విడిచిన శ్రీరంగనాథుడు తన స్వస్థలమైన శ్రీరంగం ఇంకా చేరుకోలేదు. ఎంత దయనీయమైన స్థితి. రామేశ్వరానికి తీర్థయాత్రలకై వెళ్ళవలసిన రహదారి మూసివేయబడి చెట్లు మొలిచి అరణ్యంలా తయారైనది. మన రాజ్యానికి చెందిన ఇప్పటితరం భక్తులు ఒక్కమారు కూడా శ్రీరంగం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోవడానికి కూడా నోచుకోలేదు. పాపం మహరాజా! పాపం! ఎంత దారుణమైన పాలన సుల్తానులది?" ఉద్వేగంగా పలుకుతూ ఇప్పటికైనా సుల్తానుల పాలనకు చరమ గీతం పాడుదామని పరోక్షంగా చెప్పాడు.

బుక్కరాయలు గొంతుసవరించుకుని " అందరూ సావధానులై వినండి. కంపన మహావీరుడు కావాలని మా యోచన. నాడు బహమనీ సుల్తానులను పొలిమేరలు దాటకుండా కట్టడి చేయడంలో కంపన కృషిని బహుధ మరలా సభా ముఖంగా ప్రశంసించకుండా ఉండలేకపోతున్నాము. కానీ, నాడు ఆ సంఘటన ప్రధానంగా దండనాయకుల వారి సారధ్యంలో జరిగింది. భవిష్యత్తులో మహా మండలేశ్వరులుగా వెలుగొందవలసిన కంపన..." అంటూ కంపనవేపు దృష్టి సారించి "శత్రువులు మీ కరవాల ధాటికి భయ కంపితులవ్వాలని.. "కంపన" యని నేను ఆ విద్యారణ్యుల ఆశీస్సులతో పెట్టినపేరు వాస్తవమవాలని, మీరు స్వతంత్ర సేనా సన్నాహమున ఒక దిగ్విజయ యాత్ర గావించలని మా మనసు కోరుకుంటున్నది'' అన్నాడు. సభలో అందరూ కరతాళ ధ్వనులతో "మండాలాధీశులు కంపనా మాత్యునికి జయీభవ! మహా మండలేశ్వర బుక్కరాయల వారికి విజయీభవ!" అనే జయజయ ధ్వానాలు చేశారు. కంపనకు గోపన్న చెప్పిన మాటలే సదా గుర్తుకు వస్తున్నాయి. తండ్రి ఉద్దేశం ఏమిటో తెలియదు. నా దండయాత్ర బహమనీ సుల్తానులపైనా లేక ఏకంగా దక్షిణాపథాన్ని జయించాలంటున్నారా? అవగతం కాలేదు. ఇలా గంభీరంగా ఆలోచిస్తూ ఉండిపోయారు.

కంపన యోచన ఏమిటో స్పష్టంగా తెలియడం లేదు. కంపన మంచి యవ్వనంలో ఉన్నాడు. వీని మనసు సదా సరసశృంగారాలనే లనే కోరుకుంటున్నది. అంతఃపురమందిరాలలోనే కాక, నదీతీరాలలో విశృంఖలంగా గంగాదేవితో విహరిస్తున్నట్లు చారులు చెప్తున్నారు. ఈతనికి కోరిన విధంగా గంగాదేవితో కల్యాణం జరిపించాను. పట్టపురాణి యున్నది.

ప్రేమను కోరుకున్న గంగాదేవి యున్నది. అయినా వీనికి శృంగార తలంపులు ఇంకా మదిలోనే సదా తిరుగుతూ ఉన్నట్టున్నది. అందుకే దండయాత్రకు ఏవోశంకలుచెప్పి, ఈ సభలో నా మర్యాదను పోగొట్టవచ్చునని భయపడుతూ.."కుమారా! ఈ మౌనమేమి? సభలో నీ మౌనాన్ని మేము ఎలా అర్థం చేసుకోవాలి?" అని ప్రశ్నించాడు.

తండ్రి బుక్కరాయల మనసులో ఉన్న శంకను ఊహించలేనంత అమాయకుడు కాదు కంపన. గురువుల వద్ద అన్ని విద్యలు నిష్టతో, పట్టుగ అభ్యసించాడు. రాజుకు వీర శృంగారాల సమయా సమయాలు తెలియని అజ్ఞాని కాడు. లేచి నిలబడి ''సభాసరస్వతికి నమస్కారం. మహామండలేశ్వర్లకు పాదాభివందనాలు. మీరిచ్చిన ఈ వయసు, సద్వంశ సంజాతుడనై మీ ముందు నిలిచిన ఈ రూపము, ఆ విద్యారణ్యస్వామి ఆశీస్సులతో ఆ విరూపాక్షుడిచ్చిన వైభవమున్నది. ఈ విజయనగర సామ్రాజ్ఞి అయిన మహాలక్ష్మీ విజయరేఖ, విద్యావిభూతి పుష్కలంగా ఉన్నదని మీరెరుగుదురు. నేను కేవలం మహామండలేశ్వరుని పుత్రుడనే కాదు. ఈ రాజ్యపౌరుడనుకూడా అన్న విషయం సదాగుర్తెరిగి ఉన్నాను. ఈ విజయనగర పౌరుషాగ్నిని నిలబెట్టవలసిన బాధ్యత నాపై ఉన్నది. విజయనగర పౌరులైన వీరులు యుద్ధానికి ఎన్నడూ వెనుదీయరు. దండయాత్ర స్వయంగా నిర్వహించడానికి కొన్ని సంవత్సరాల ముందునుండే నేను సిద్ధంగా ఉన్నాను. గత ఘర్షణలో మీరు నేను బాలుడనన్న మమకారంతో దణ్ణాయకులను అధిపతిగా నియమించారు. నన్ను ఆ నాడే ఒంటరిగా పంపిఉన్నట్లైతే ఈనాడు మీకు ఇలాంటి సందేహాలు కలిగేవికావని అనుకుంటున్నాను. నా దండయాత్ర, విజయ ప్రస్థానము దక్షిణదిశవైపు

అయినట్లైతే ఈ క్షణమేసిద్ధం. రాచకార్యములందు రాకుమారులు స్వయముగా కల్పించుకొనరాదను గురువులబోధకు కట్టుబడి యున్నాను. ఇటు బహమనీ సుల్తానులైనా అటు మధుర సుల్తానులైనా రెండు దండయాత్రలకు సిద్ధంగా యున్నాను. కానీ శ్రీరంగనాథుని ఆజ్ఞను మొదటగా మన్నించవలసియున్నదని నా అంతరాత్మ కోరుతున్నది. మధురవైపు దండయాత్రకు ప్రథమంగా అనుజ్ఞ ఇవ్వవలసిందిగా మహామండలేశ్వరుని ప్రార్థిస్తున్నాను" అనగానే బుక్కరాయల వక్షఃస్థలం ఉప్పొంగింది. గోపన్న సంతోషంతో చప్పట్లు చరిచాక అందరూ అందుకున్నారు. సింహం కడుపున సింహమే పుడుతుంది అని బుక్కరాయల మనసు ఆనందంతో పొంగింది. సభలో కరతాళ ధనులు సద్దుమణిగాక "శభాష్! కుమార కంపనా! మేము కోరుకున్నది ఇదే! మా శంకలు నేటితో పటాపంచలయ్యాయి. బసవయ్య దణ్ణాయకులు నేటి ఉదయం బహమనీ వారు పంపినారని ఒక రాయబారి తెచ్చిన వార్త మమ్మలను మిక్కిలి గాయపరచినది. అది అట్లుండనిమ్ము. మధుర ప్రస్తుతము యవనుల పాలనలో కడు దుర్భరస్థితిలో నున్నది. శ్రీరంగములో జనులు చెట్టుకొకరు పుట్టకొకరు అయ్యారు. వీర పాండ్యుడు, సుందరపాండ్యుడు, బల్లాలదేవుడు ఈ నేలను శతృవులపాలు చేశారు. దేవాలయములు ప్రవాసులపాలైనవి. దేవతావిగ్రహములు ధ్వంసం గావించబడ్డాయి. నేనూ ఈ దక్షిణ యాత్రనే తలపెట్టితిని. దైవానుగ్రహము ఇద్దరి ఆలోచనలు ఒక్కటే అయినవి. ఈ లేఖను ఒక సారి చూడండి అని కంపనకు అందించాడు.

చదువుతున్న కంపన చేతి వేళ్ళు బిగుసుకున్నాయి. శరీరం ఎర్రగా మారింది. మొహం మంకెన పువ్వులా మరింత ఎర్రటి వర్ణాన్ని

సంతరించుకొన్నది. అది కలుబరిగె సుల్తాన్ మహమ్మదు షా ఆజ్ఞపై ఆతని మంత్రివరుడైన మల్లెక్ సయఫ్ ఉదీన్ సంతకంతో ఫర్మానా చేయబడిన లేఖ. "మహా వాగ్గేయ కారులైన మా అమీర్ ఖుస్రూ వ్రాసిన గజళ్ళు మాకు వీనులవిందుచేసినై. మేము మెహనతుల్లాఖాన్, ముజాఫరాలీఖాన్ వంటి ఘనులైన మూడువందలమంది కవులకు ఘనంగా సన్మానం చేయాలని నిర్ణయించాము. ఈ సన్మానానికి కావలసిన ధనము విజయనగర టంకశాల నుండి వెంటనే పంపవలయును. ఇది కలుబరిగె సుల్తాన్ మహమ్మదు ఆజ్ఞ".

"తండ్రీ! నా రక్తం మరుగుతున్నది. దుష్టులై, పొగరెక్కి వారు పంపిన ఈ లేఖను అగ్నికి ఆహుతి చేయక ఇంకా ఉంచడంలో మీ ఆంతర్యం?" అని ప్రశ్నించాడు.

"ఈ లేఖను దూత తెచ్చి ఇచ్చాడని దణ్ణాయకులు ఇచ్చారు. మధుర విషయము చాలా దినములనుండి ఆలోచిస్తూనే ఉన్నాను. ఈనాటికి ఒక కొలిక్కి వచ్చింది. ముందు తొండమండలాధిపతి సాంబవరాయలను జయించాలి. ఆ తర్వాతే మధుర."

"అవును! మీరే ఒకసారి అంటుండగా విన్నాను. సరే ఈ లేఖ తెచ్చినదెవడు?"

"దూతను చంపరాదని బందిఖానా లో ఉంచితిమి"

"మన్నించండి. ఆ దూతను వెంటనే విడుదల చేసి కొత్వాలుచే ఆతని తల గొరిగించి సున్నపు బొట్లను పెట్టించి ఒక గార్ధభముపై విజయనగర పురవీధుల్లో ఊరేగింపు జరిపించమని చెప్పండి. ఇంకొక్క దూత ఎవ్వడూ ఇట్టి దుస్సాహసము భవిష్యత్తులో చేయరాదని నా విన్నపం!"

బుక్కరాయలు లోలోపల మిక్కిలి ఆనందం పొందుతూ ఉన్నాడు.

ఇప్పటివరకూ స్వతంత్రించి దండయాత్రలు చేయలేదని, శృంగార పురుషుదని భావించాడు. ఇప్పుడు అతని వీరత్వం రాజకీయ చాతుర్యము బయటపడినవి. తాను ముందే ఈతనిని విజయయాత్రలకు పంపి ఉ ండవలసినది. అతని వీరత్వము ప్రజలకు చాటించి ఉండవలసినది అనుకుంటూ వెంటనే తేరుకుని "కుమారా! మీ విన్నపాన్ని మన్నిస్తున్నాను" అని ప్రతీహారిని పిలిచి కంపన అనుజ్ఞను పాటింపమని చెప్పాడు.

"కానీ తండ్రిగారూ!"

"చెప్పు కంపనా! సందేహాలు వలదు"

"నరరూప రాక్షసులైన ఆ సుల్తానులను ఓడించి, మన సామ్రాజ్యాన్ని దక్షిణాదిన కన్యాకుమారి వరకూ విస్తరింపజేయాలని నా ఆకాంక్ష. కానీ కొన్ని సందేహాలు...."

"అడుగు కంపనా!"

అందరూ కంపన ఏమి అడుగుతాడా అని ఆశ్చర్యంగా చూస్తున్నారు."మనకు ఇందుకు కేవలం మన మల్యేసంస్థాన సైన్యం సరిపోదు. అశేష సైన్య సమూహం కావలసి ఉంది. ఈవిషయంలో గోపన్న మంగుల అభిప్రాయమేమిటో తెలుసుకోవాలని ఉన్నది"

సాలువ మంగు లేచి "మహారాజా! మనం మొదట శంభువరాయలను ఓడించాలి, కానీ సుల్తాను సైన్యాన్ని ఓడించడానికి మన దక్షిణభాగ సైన్యం సరిపోదు"

గోపన్న గొంతు సవరించుకుని ""మహారాజా! మనం చిన్నచిన్న సేనలతో సుల్తానును జయించడం సాధ్యం కాదు. సుల్తాను గెలవడానికి భల్లాలుడు లక్ష సైన్యంతో యుద్ధం ప్రకటించాడు. ఎందరో చిన్న చిన్న

రాజులు సహాయం చేశారు కూడా! కానీ చివరకు ఏమి జరిగింది? ఓడిపోయాడు. కనుక మనం సైన్యాన్ని పెద్ద ఎత్తున సమకూర్చుకోవాలి. ఈ విషయంలో నేను చెప్పదలచినది ఒకటే!" అనగానే అందరూ ఆసక్తిగా చూశారు. దక్షిణాదిలో ఉన్న ప్రజానీకం లోని యువత యావత్తూ మన సైన్యంతో రావడంకోసం ఎదురు చూస్తున్నారు. పల్లె పల్లెలో వేలమంది సైనికులుగా తయారయ్యారు. అందరూ యుద్ధం కోసం వేయికళ్ళతో ఎదురు చూస్తున్నారు. విజయమో! వీరస్వర్గమో! అన్నట్టు పోరాడుదాం. దైవ బలం మనవేపున్నది. మనకే విజయం సిద్ధిస్తుందని నా మనసు గట్టిగా నమ్ముతున్నది. నేనేదో భావావేశంతో మాట్లాడుతున్నానని అనుకోవద్దు. అక్కడ వారి బాధలను కళ్ళారా చూశాక వారికి మాట ఇచ్చాను. పైగా తిరుమలలో ఉన్న శ్రీరంగనాథుని మళ్ళీ శ్రీరంగంలో ప్రతిష్టచేసే వరకూ నేను దీక్షలో ఉన్నాను.

మహారాజు కోరికపై తిరుమల యాత్రలో జరిగిన విషయాలన్నీ వివరించాడు గోపన్న. శ్రీరంగనాథుని కథను, తను చేసిన ప్రతిజ్ఞను చెప్పాక సభలో అందరూ మంత్రముగ్ధులై ఉండిపోయారు. సభంతా నిశ్శబ్దమైంది. బుక్కరాయలవారు సింహాసనం నుండి దిగి గోపన్న వద్దకు వచ్చి "గోపన్నగారూ! మీరు చెప్పిన విషయాలు, సంఘటనలు నన్ను ఆసాంతం కదిలించివేశాయి. మీరు చెప్పినవి విన్న తర్వాత విజయనగర స్థాపన చేసినప్పుడు ఎలా అనిపించిందో ఇప్పుడూ మా చిత్తం అలాగే మారింది. మీరు చెప్పింది అక్షరాలా సత్యం! దక్షిణాదిన ఉన్న రాష్ట్రాలకు శ్రీరంగనాథుడే ఒక గొప్ప గుర్తు. ఆ రంగనాథుడు ఎదుర్కొన్న కష్టాలను మీరు కళ్ళకు కట్టినట్టు చక్కగా వివరించారు. ఆ ప్రాంతా ప్రజలు పడుతున్న కష్టాలను

అర్థం చేసుకోగలను. ఇప్పుడు మన కర్తవ్యం ఏమిటి?" చెప్పండి.

గోపన్న ఉత్సాహంగా "మహారాజా మనం ససైన్యంగా వెళ్ళి సుల్తానుతో యుద్ధం చేయడమే కర్తవ్యం!" అనగానే మిగతా వారంతా ఏకీభవించారు. పుత్రుడు కంపన వేపు దృష్టి సారించగా "సుల్తానులతో పోరాడడానికి నేను ఎప్పుడూ సంసిద్ధుడనే! మీ అనుజ్ఞ కోసం ఎదురు చూస్తున్నాను" అన్నాడు. బుక్కరాయలు మళ్ళీ అందరిని చూస్తూ "మరి బహమనీసుల్తానుల మాటేమిటి? వారితో ఎవరు యుద్ధం చేస్తారు?"

సభంతా మళ్ళీమౌనం వహించింది. అంతా ఆలోచనలో పడ్డారు. బహమనీ సుల్తానులు విజయనగరానికి ఎప్పుడూ పక్కలో బల్లెమే! వీరితో నిరంతర పోరాటాలు లేనట్లైతే, ఎంతో సులభంగా మధుర సుల్తానును జయించి ఉండేవారు. బహమనీ సుల్తానుల వల్లనే కర్తవ్యం అయోమయమవుతున్నది. విజయనగర సామ్రాజ్య స్థాపన తర్వాత క్రీ.శ. 1347లో అల్లాద్దీన్ బహమనీ అనే సుల్తాను గుల్బర్గాను రాజధానిగా చేసుకుని బహమనీ రాజ్యాన్ని స్థాపించాడు. వీరు క్రమంగా విజయనగర రాజులకు పెద్ద తలనొప్పిగా మారారు. కొన్ని సంవత్సరాలు ఇద్దరి మధ్య నిరంతర పోరాటాలు. తర్వాత ఒకరి సామర్థ్యం మరొకరు తెలుసుకున్నాక, రాజీ ఒప్పందాలు, శాంతి నెలకొన్నప్పటికి, ఇరు దేశాల మధ్య శతృత్వం, ప్రచ్ఛన్న యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. వారు ఇంకా తగిన సమయంకోసం కోసం ఎదురు చూస్తున్న విషయం అందరికి తెలిసినదే!

బహమనీరాజ్యం విజయనగరానికి ఉత్తరంవైపు ఉన్నది. మధుర దక్షిణాదిన ఉన్నది. విజయనగర సర్వ సైన్యం ఇటు దక్షిణాదికి దండెత్తగానే అదనుకోసం చూసే బహమనీ సుల్తానులు చేతులు ముడుచుకుని కూర్చోరు

కదా! సైన్యం నగరంలో లేదని తెలిసిన మరుక్షణం దండయాత్ర చేస్తారు. దక్షిణాన ఉన్న మధుర సుల్తానును జయించడం కష్టసాధ్యం కాకపోయినా, ఇంతదనుక ఉపేక్షిస్తూ ఉన్నది అందువల్లనే. ఇన్ని సంవత్సరాలు ఎంతో కష్టపడి నిర్మించుకున్న విజయనగర సామ్రాజ్యం సులభంగా బహమనీలహస్తగతం కాకూడదనే ఈ ఆరాటం. సభాసదుల మౌనాన్ని భంగపరుస్తూ "బహమనీల వ్యవహారం తెలిసినప్పటికి, వారిని గూర్చి విచారం వద్దు" అని బుక్కరాయలవారు ప్రకటించేసరికి అందరికి ఆశ్చర్యం కలిగింది. ''నిజమే! బహమనీ సుల్తానులకు భయపడి ఎన్ని సంవత్సరాలు ఊరకుండిపోవాలి? దక్షిణాది రాష్ట్రాలన్నీ ఒకే తాటిక్రిందికి రావాలని నేను ఎప్పటినుండో భావిస్తున్నాను"

బుక్కరాయల మాటలు వినగానే కంపన ఆసనం మీద నుండి దిగి "తండ్రీ! ఇదే మాట మీ నోటి వెంట రావాలని కోరుకున్నాను. నా ఆశయం, గోపన్న ఆశయం కూడా ఇదే! తక్షణ కర్తవ్యాన్ని ఆజ్ఞాపించండి!" అని కుడిచేయి గుండెలపై పెట్టుకుని, వినయ పూర్వకంగా వంగి అన్నాడు ఉత్సాహం పట్టలేక. గోపన్న సంతోషంగా "మీ అనుజ్ఞ శిరసావహించడానికి ఎప్పుడూ సిద్ధమే మహారాజా!" అన్నాడు.

"శాంతించండి! కుమారా కంపనా! సేనాని గోపనామాత్యా! శాంతించండి. నేను పలికిన పలుకులు నావి కావు. శ్రీరంగనాథుడే ఇలా నాచే పలికించాడని భావిస్తున్నాను.

''మహారాజా! ఏమన్నారు మీరు? శ్రీరంగనాథుడు ఆజ్ఞాపించాడన్నారా? ఎంత శుభవార్త? మనకిక తిరుగులేదు. మనం ఆ ముష్కరులను మట్టుబెట్టి తీరుతాం మహారాజా!"

మండలాధీశుడు కంపన మహారాజుకు జై! మహాసేనాని గోపన్నకు జై" అన్నారు సభలో అందరూ.

"గోపనా! పట్టపురాణి దేవాయీ మహారాణీవారు దాదాపు ఇరవై సంవత్సరాలనుండి నన్ను రెండు చిన్న కోరిక కోరుతూ ఉన్నారు. కానీ నేనే వాటిని తీర్చలేక అనుక్షణం సతమతమౌతున్నాను" అనగానే సభ మొత్తం ఆశ్చర్యపోయింది. "మహామండలాధీశ్వరునికే కష్టతరమైన కార్యాలు ఉన్నాయా?" అన్న సాళ్వ మంగు మాటలకు చిరునవ్వు నవ్వుతూ "మంగూ! మహారాణి శ్రీరంగంలోని శ్రీరంగనాథుడికి రథయాత్ర జరిపించాలని వారి మొదటి కోరిక. రెండవది తామ్రపర్ణి నదిలో పవిత్ర స్నానం ఆచరించాలని కోరుకున్నది. ఏదో ఒకనాటికి ఆమె కోరికలు తీరుస్తానని మాట ఇస్తూ వస్తున్నాను. గత మాసం ఒక రోజు ఏమయిందో తెలుసా సభికులారా? అనగానే సభలో సూది పడితే వినిపించేంత నిశ్శబ్దం ఆవరించింది. "దేవాయీ మహారాణి నన్ను రాణివాసంలోని ఒక గదిలోనికి తీసుకుని వెళ్ళింది. ఆ గదిలోనికి వెళ్ళిన నేను ఆశ్చర్యపోయాను. గది నిండా బంగారు నాణెములు, పట్టుచీరెలు, పట్టు వస్త్రాలు నిండి ఉన్నాయి. ఇవన్నీ ఏమిటని ప్రశ్నించగా, తను తామ్రపర్ణిలో పవిత్ర స్నానం చేసిన పిదప అక్కడి ప్రజలకు దానంగా పంచిపెట్టాల్సిన వస్తువులు, బట్టలు అని చెప్పింది. విన్న నేను కించిత్ ఆవేశానికి లోనయ్యాను. రాణి నా మాటలపై నమ్మకం ఉంచి ఇన్నేళ్ళుగా నాణాలు, పట్టుబట్టలు దాస్తున్నది. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకూడదు కదా! ఎన్ని సంవత్సరాలని దేవాయీ దేవిని మభ్యపెట్టగలను? మొన్నటికి మొన్న తిరుపతి నుండి సామంతుడైన యాదవరాయలు నా సహాయం అర్థిస్తున్నాడు. అక్కడి తిరుమల దేవుడైన శ్రీవేంకటేశ్వరుని ఆలయానికి

మా నుంచి ఏదో సహాయం కావాలి. దానికి మార్గం కూడా యాదవరాయలే సూచించాడు దేవుడే అన్ని మార్గాలను సుగమం చెయ్యగలడు, అందుకే శీఘ్ర నిర్ణయం తీసుకున్నాను" అంటూ భావావేశంతో మాట్లాడి సింహాసనంపై కూర్చున్నాడు.

గోపన్న లేచి "మహారాజా! నేను చేసిన ప్రతిజ్ఞను తీర్చుకోడానికి చక్కని మార్గం చూపారు. ఇందులో ఎన్నో దైవకార్యాలు ఇమిడి ఉన్నాయని ఇప్పుడే అర్థం అయింది. దేవాయీ మహారాణివారి కోరిక త్వరలో తీరగలదని విశ్వసిస్తున్నాను."

అనంతరం వారు వ్యూహరచనకు శ్రీకారం చుట్టారు. వివిధ అభిప్రాయాలు విన్న తర్వాత, బుక్కరాయలు " మొదట దక్షిణాదిన మార్గం సుగమం కావాలంటే కాంచీపురాధీశుడైన శంభువరాయలను ఓడించాలి. ఆ విజయాన్ని గమనిస్తూ బహమనీ సుల్తానుల చర్యలను తుంగభద్రానదీ తీరంలో చారులద్వారా జాగ్రత్తగా గమనించి, పరిశీలించిన అనంతరమే, సమయం అనుకూలం అనుకున్న పిమ్మటే, మధుర సుల్తానుపైకి దండయాత్ర!" అని కంపనామాత్యుని ఉత్సాహం చూసి బుక్కన పొంగిపోతూ తన స్వర్ణమణిమయ హారాన్ని మెడలోనుంచీ తీసి అతనికి అలంకరించాడు. శంభువరాయునిపై దండయాత్రకు శుభముహూర్తం చూడమని ఆస్తాన జ్యోతిష బృందానికి కబురు పంపాడు.

గోపన్న విరూపాక్షుని దర్శనానంతరం సంతోషంగా గుర్రమెక్కి బయలుదేరాడు. ఎదురు చూసిన యుద్ధం, కొద్ది రోజుల్లో ఆరంభమవబోతున్నది. తన ప్రతిజ్ఞ నెరవేరబోతున్నది. ఆ శ్రీరంగనాథుని

మళ్ళీ శ్రీరంగంలో ప్రతిష్టింపబడాలి. అంతే! అదే ఆలోచనలతో గడపాలి. సుందర సాయంత్రం. నిదానంగా, ఉత్సాహంగా విజయనగర శివార్లు దాటి వెళ్తూ ఉన్నాడు. సూర్యాస్తమానం అవుతోంది. రహదారి ప్రక్కన ఏదో అలికిడి వినిపించింది. గుర్రం ఆపి దూరంగా గమనించాడు. మామిడి చెట్టుక్రింద ఒక అమ్మాయిని ముగ్గురు ముసల్మాన్ సైనికులు చుట్టుముట్టి ఏడిపిస్తున్నారు. పైట లాగుతున్నారు. ఆ పిల్ల ఏడుస్తోంది. వాళ్ళు నవ్వుతూ ఇంకా చెండాలమైన చేష్టలకు దిగారు. వెంటనే క్రిందకు దిగి, గుర్రాన్ని చెట్టుకు కట్టి, కత్తిచేతబూని వాళ్ళను సమీపించాడు. అలికిడికి వెనక్కు దిరిగిన వాళ్ళలో ఒకడు ఏమాత్రం భయపడకుండా "క్యా! భాయ్! మాకీ కూడా కత్తుల్ ఉన్నై.. దేఖో ఏక్బార్... నీకు హనవసరమైన విషయం. వెళ్ళిపో! హనవసరంగా ఛావకు!" అన్నాడు. ఆఅమ్మాయి ఏడుస్తూ దండంపెడుతూ "అన్నా... కాపాడు!" అని ప్రార్థించింది. "కాపాడ్డానికి వీడేమన్నా దేవుడనుకున్నావ్! బేవకూఫ్ గాడు! చల్" అంటూ పొడవాటి వ్యక్తి ఆపకుండా అమ్మాయిని క్రూరంగా హింసిస్తున్నాడు.

గోపన్నకు రక్తం మరిగిపోయింది. చటుక్కున వారిని సమీపించి, ఒకడి చేతిని మణికట్టువరకూ ఒకే వేటుతో నరికేసరికి తెగి క్రింద పడింది. మొండి చేతినుండి గొట్టం లోనుండి వచ్చినట్టుగా రక్తం ధారగా కారుతుండగా హాహాకారాలు చేస్తూ క్రింద కూర్చొండిపోయాడు. తెగిన చేయి నేలపై నుండి అడుగుదూరం పైకి లేచి ఎగిరి ఎగిరి పడుతోంది. ఆ భీకర దృశ్యం చూసినవెంటనే ఇద్దరూ భయపడి ఆమెను వదిలేశారు. ఒకడు ఒరలోని కత్తితీసి మీదకొచ్చాడు. అంతే కాలితో గుండెల మీద ఒక్క తన్ను తన్నగానే క్రిందకు పడిపోయాడు. వెంటనే వాడి కంఠంలో కత్తి

గ్రుచ్చాడు. వాడు నెత్తురోడుతూ నేలకొరిగాడు. అంతే! ఏడడుగుల మూడో వ్యక్తి ఆగకుండా పరుగెత్తి గుర్రంపై వేగంగా వెళ్ళిపోయాడు.

ఆ అమ్మాయిని లేవదీసి వివరాలేమిటి? ఈసమయంలో ఇక్కడుండడానికి కారణమేమిటి? అని ప్రశ్నించగానే ఆమె వలవల ఏడ్చి, కొంగుతో తుడుచుకుని "మా తండ్రిగారు భాస్కర భిషక్. ఇక్కడికి కొద్దిదూరంలో మా పల్లె. రేపు మా తండ్రిగారు ఒకరికి వైద్యం చేయడానికి ఈ ఔషధమొక్కలు తెమ్మన్నారు. ఇదుగో ఈ మొక్క చాలా సేపు వెదికితే గానీ ఈప్రాంతంలో దొరకలేదు. అందువల్ల ఆలశ్యమైంది. వచ్చి వచ్చి వీళ్ళ చేతిలో చిక్కాను" అని మళ్ళీ ఏడ్చింది. " పెండ్లికాని స్త్రీవి! ఇలా ఒంటరిగా రావచ్చా! మీ తండ్రిగారికి శిష్యులు లేరా?" అని అడగ్గానే "రోజూ వాళ్ళేవస్తారు. ఈరోజు పనిఉన్నదని విజయనగరం వెళ్ళారు" అని చెప్పింది. "పద. గుర్రమెక్కు. మీ ఇంటివద్ద దింపుతాను" అనిఆమెను వారి యింటికి తీసుకొని చేరగానే, ఆమె తండ్రి గోపన్నకు అనేక మార్లు ధన్యవాదాలు తెలియజేశాడు. ఆ రాత్రికి అచ్చటనే బస చేసి ఉదయం బయలుదేరాడు.

ఉదయాన్నే చెఱువు గట్టున కాలకృత్యాలు తీర్చుకుని సంధ్యావందనం ముగించి గుర్రం ఎక్కి ముందుకు సాగుతుండగా ముందురోజు ముస్లిం యువకులతో గొడవ జరిగిన ప్రాంతంలో పదిమంది మూగి ఉన్నారు. వాళ్ళు కూడా ముసల్మానులే! చేతుల్లో కత్తులూ, విల్లమ్ములు ఏదో యుద్ధానికి వచ్చినట్లు నిలబడి ఉన్నారు. పది అడుగుల దూరాన గోపన్నను గుర్రంపై చూడగానే వాళ్ళలో అలికిడి మొదలయింది. పారిపోయిన పొడగరి

ముసల్మాన్ గోపన్నను చూపిస్తూ ఏదో చెప్తున్నాడు. విషయం అర్థమయిన గోపన్న తనను హతమార్చడానికి వాళ్ళంతా కలిసి పన్నిన పన్నాగమని తెలిసి, శూలాన్ని చేతిలోకి తీసుకుని వేగంగా గుర్రంనడుపుతూ రెప్పపాటులో ఒకరిని వీపులో గుచ్చి తీసి, ఇంకోడి మెడపై శూలాన్ని దింపగానే "యా..అల్లాహ్" యిద్దరూ అంటూ నేలకొరిగారు. మిగతా ఎనిమిది మంది కత్తులు చేతబట్టి "పకడో..దుష్మన్కో" అని తురకంలో తిడుతూ గోపన్నపై దాడికి దిగారు. గోపన్న కత్తులు చెదరగొట్టి శూలంతో పొడిచిన పోట్లకు పది నిముషాల్లో మట్టిగరిచారు. పారిపోదామని ప్రయత్నించిన యిద్దరిని గుర్రంపై తరిమి తరిమి బాణాలతో నేలకూల్చాడు. ఆ రహదారి విజయనగరం గుండా అనేక తీర ప్రాంతాలకు వెళ్ళేదారి కాబట్టి, ఆ రహదారుల్లో ఏ ప్రాంతంవారైనా తిరగొచ్చనే నిబంధనలు ఉన్నాయి. బిడారులజోళికి, బాటసారులజోళికి సాధారణంగా ఎవరూ వెళ్ళరు. ఆ రహదారుల్లో ఎవరైనా అక్రమాలు, అల్లర్లు చేసినట్లైతే అక్కడి స్థానిక పాలకులు వాళ్ళకు బుద్ధి చెప్పడం రివాజు.

గోపన్న నారాయణపురం చేరి, సైనికోద్యోగుల ద్వారా జనం క్షేమ సమాచారాలు తెలుసుకుని అక్కడ తాను లేని సమయంలో జరిగిన ముఖ్య సంఘటనలు తెలుసుకున్నాడు. విజయనగరం విశేషాలు ముఖ్యోద్యోగులకు మాత్రమే చెప్పి "యుద్ధం ప్రారంభం అయే వరకూ రహస్యం" బయటకు పొక్కరాదు అని హెచ్చరించాడు. మాటలలో రేపే ఆళ్వార్ తిరుమంజనం అన్న సంగతి గుర్తొచ్చి "సరే! మీరంతా వెళ్ళిరండి. నేను ఒక ముఖ్యకార్యం మీద వెళ్తున్నాను. రేపు ఊరిలో ఉండడంలేదు. జాగ్రత్తగా మసులుకోమని

దేవాలయ ప్రాంగణంలో ముష్కరుల అల్లర్లు అవీ జరుగకుండా చూసుకోమని చెప్పి వాళ్ళను పంపివేశాడు.

ఉదయాన్నే అన్ని కార్యక్రమాలు ముగించి, మునుపటి ముసలి వేషం ధరించి మండపంలో సర్వసంగ పరిత్యాగిలా జపం నటిస్తూ కూర్చొన్నాడు. కొద్ది గంటల అనంతరం అనుకున్న విధంగా కుముదిని స్నేహ బృందంతో అక్కడకు వచ్చింది. కుముదిని మాత్రం కాలు నిలవకుండా దేవాలయం మొత్తం కలయ దిరుగుతోంది. కుముదిని స్నేహ బృందం మాత్రం దూరంగా మండపంలో కూర్చున్న స్వామీజీ వద్దకు వచ్చింది. కుముదిని సిగ్గుపడుతూ దూరంగా ఉండి ముదుసలి వ్యక్తిని గమనిస్తూ ఉన్నది. వారిలో ఒక అమ్మాయి " స్వామీజీ! మా కుముదిని మనసులో వున్న విషయం పసిగట్టినవారు...గోపన్న ఎక్కడ ఉన్నాడో చెప్పి పుణ్యం కట్టుకోవచ్చుగదా!" అంది.

స్వామీజీ నవ్వుతూ "ఉత్తరం తెచ్చారా?" అన్నాడు. "తెచ్చాం. కానీ గోపన్న కోసం గుడి అంతా వెదికాం. ఎక్కడా లేదు"

"అవునా! ఆయన ఈ పురానికి పాలకుడు. వేయి పనులుకదా!. నాకివ్వండి నేను భద్రంగా అందజేస్తాను."

"హమ్మో! అదిగో! కుముదిని దూరంగా ఉంది చూడండి. గోపన్నకే ఇవ్వమని చెప్పింది"

"పర్వాలేదు. గోపన్నా నేనూ ప్రతిదినం ఉదయం కోనేరు గట్టున సంధ్యావందన సమయంలో కలుసుకుంటాం. రేపు అందజేస్తాను. కుముదినిని మాత్రం రేపు ఒంటరిగా సాయంత్రం కోనేటి గట్టున గోపన్నను కలుసుకోమని చెప్పండి. నేను గోపన్నకు ఆ విషయం చెప్తాను. కుముదిని

ఒంటరిగానే రావాలి సుమా! మరచిపోకండి”
“సరే! స్వామీజీ! నీ మాటలు నమ్ముతున్నాం” అంటూ ఉత్తరం చేతిలో పెట్టి కుముదిని వద్దకు వెళ్ళిపోయారు. వెళ్ళిపోయారు. కుముదిని దూరంగా ఉండి స్వామీజీనే చూస్తూ నవ్వుతూ నిలబడి ఉన్నది.

వాళ్ళు వెళ్ళిపోయాక స్వామి దర్శనం చేసుకుని గబగబా తన భవనానికి బయలుదేరి వెళ్ళాడు. అందరు సైనికులు గుడి దగ్గర కాపలాగా ఉన్నారు. గోపన్నకు ఆ ఉత్తరం చదవడంకోసం మనసు పరితపిస్తున్నది. గుడి దాటి ఏకాంత ప్రదేశానికి వచ్చి లేఖ విప్పి ఆతృతగా ఉత్తరం విప్పిచదివి ఆ తన్మయత్వంలో సాయంత్రం వరకూ అలాగే ఉండిపోయాడు. భోజనం కూడా ముట్టలేదు. అదో తన్మయత్వంలో ఉండిపోయాడు. రాత్రికి సైనికులు కాపలాకు వచ్చి గోపన్న నగరానికి చేరుకున్నాడని తెలిసి సంతోషపడ్డారు. గోపన్న మాత్రం మరుసటి రోజు ఎప్పుడు సాయంత్రం అవుతుందా అని ఎదురుచూస్తున్నాడు.

అక్కడ కుముదిని పరిస్థితి కూడా అలాగే ఉంది. మదనతాపంతో భోజనం చెయ్యలేదు. పానీయాలు ముట్టలేదు. తల్లిదండ్రులకు ఏమీ అర్థం కావడంలేదు. గుడిలో ప్రసాదాలైన దద్ధోజనం, చక్రపొంగలి, పులిహొర అన్నీ ఎక్కువగా తిన్నందువల్ల ఆకలి లేదని స్నేహితులు సర్దిచెప్పాక వారి మనసు కుదుట పడ్డది.
“ఏమే! గోపన్న నిజంగానే వస్తాడటే!” అన్న మాటకు స్నేహితురాలు ఫక్కున నవ్వి “వస్తాడే! రాకుండా ఉంటాడా!” అంది
“నాకెందుకో భయంగా ఉందే!”
“ఓహో! అంత ఇష్టంగా ఉత్తరం వ్రాసి, ఇప్పుడు భయం అంటే

కుదురుతుందా చెప్పు?" అని బుగ్గగిల్లి వదిలింది.

కోనేరు వేగంగా ప్రవహిస్తోంది. గోపన్న సర్వాలంకరణ భూషితుడై నారాయణపురం కోనేటి ఒడ్డున విహరిస్తున్నాడు. ఈ ఒడ్డు నుండి ఆ ఒడ్డుకు ప్రయాణించడానికి ఒక పడవవాణ్ణి సిద్ధం చేశాడు. అవతలి వైపు జన సంచారం లేని చిట్టడవి ప్రాంతం. పిల్లగాలులు గోపన్నను ఏవో ఆనందతీరాలకు తీసుకువెళ్తున్నాయి. గోవులు మేతనుండి గుంపులు గుంపులుగా పల్లెగాంద్ర అదిలింపులతో ఇళ్ళకు చేరుతున్నాయి. రకరకాల పక్షులు కిలకిలారావాలు చేసుకుంటూ గూళ్ళను చేరుకుంటున్నాయి. సూర్యాస్తమయం మరో ఘడియలో జరుగుతుంది. కుముదిని రావడంలేదు. ఒక్కతే వస్తుందా? చెలికత్తెలో వచ్చి ఏకాంతం లేకుండా చేస్తుందా? ఎన్నో గుబుళ్ళు గోపన్నకు. ఇంతలో ఏదో అలికిడి. ఏవరో ఒక ముదుసలివగ్గు కర్రతో కుంటుతూ నడుస్తూ వస్తోంది. పడవ దాటించే వాడు "అయ్యా! పూర్తిగా చీకటిబడనియ్య బాకండయ్యా!" అంటున్నాడు. కుముదిని పత్తా లేదు. ఇంకో కొన్ని ఘడియల్లో సూర్యాస్తమానం కూడా కాబోతున్నది. ఏమై ఉంటుంది? యింట్లో నిర్బంధించి ఉంటారా? అని పరి పరి విధాల ఆలోచిస్తూ ఉన్నాడు.

ముదుసలి స్త్రీ చేతి కర్ర సాయంతో గోపన్నవద్దకు వచ్చి "అయ్యా! నా పేరు సుబ్బమ్మ. నా కొడుకు కోసం వెదుకుతున్నాను. దొంగ వెధవ! పారిపోయాడు. మీకు కానీ కనబడ్డాడా?" అంది. "అవ్వా! వెళ్ళు...... ఇక్కడ ఎవ్వరూ లేరు చీకటి పడుతోంది" అనగానే "ఎవరో గోపన్నకు చెబితే వెదికి పంపుతాడని చెప్పారు. గోపన్నవు నీవేనా ఇంతకూ!" అంది.

"అవ్వా! వెళ్ళు ముసలి దానివని చూస్తుంటే విసిగిస్తున్నావు. చీకటి పడుతోంది. నీ కొడుకు ఇంటికి వస్తాడులే! నేనొక ముఖ్యమైన వారికోసం ఎదురు చూస్తున్నాను" అని కోపంగా అన్నాడు.

"రాజ్యమేలే దొరలకు ఏది ముఖ్యం? ప్రజల మంచి చెడులేమీ పట్టవా? మా లాంటి ముదుసలుల కష్టాలు పట్టవా మీకు?" అంటూ మాటకు మాట రెట్టిస్తున్నది.

గోపన్న అసలే కుముదిని కోసం బెంగగా ఉంటే విసిగిస్తున్న ముసలమ్మను చూసి సహనం కోల్పోయి "ఏం మాట్లాడుతున్నావు? ఎవరునువ్వు? ఇక్కడనుంచీ వెళ్తావా! వెళ్ళవా?" అంటూ కొట్టడానికి చేయిలేపేసరికి పడవవాడు పడవదిగి పైకొచ్చాడు.

"ఆర్నెల్లు సాముచేసి మూలనున్న ముసలి దాన్ని కొట్టాడట వెనకటికి ఒకడు అట్టాగుందయ్యా..నీ ప్రతాపం" అంది.

"అవ్వా! దయచేసి వెళ్ళు విసిగించకు. ఒకరికోసం ఎదురు చూస్తున్నాను" అని దణ్ణం పెట్టాడు.

"హా..హా..హా.." అంటూ నవ్వి..."ప్రథమ కోపమే తమరికి మొత్తానికి మంచోడివే! ఈ కోపం, విసుగు, చిరాకు ఆ కుముదిని మీద కూడా చూపిస్తావా ఏమిటీ!" అంటూ మేలిముసుగు తొలగించి, ముసలివేషం తొలగించి నిలబడింది.

గోపన్న సంభ్రమాశ్చర్యాలతో " కుముదినీ! నువ్వా!" అంటూ దగ్గరకొచ్చి కౌగలించుకొని ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"మారువేషాలు మీరేనా వేసేది? మాకూ వచ్చు! ఆరోజు మీవేషం గ్రహించలేని పిచ్చిదాననుకున్నావా? నీ తెల్ల గుబురు మీసాల చాటున

దాగిన నల్లని కోరమీసాలు పసిగట్టానోయ్ గోపనా! " అంది కన్నుకొదుతూ.

పడవవాడు "హయ్యో! మా ఆచారిగారమ్మాయంటే మాటలా సామీ..తమరు తట్టుకోడం కష్టమే! యింక... " అని నవ్వాడు.

"ఏడిచావు గానీ అవతలి ఒడ్డుకు పోనివ్వు" అని అమాంతం కుముదినిని ఒంటి చేత్తో లేపి పడవలో దించాడు.

కుముదినితో మాట్లాడి భవనం చేరాడు. మనసు పరిపరివిధాలపోతున్నది. కుముదిని వాళ్ళింట్లో వాళ్ళు వివాహానికి అంగీకరించడం సంతోషదాయకమైన పురోగతి. వివాహం మాత్రం శ్రీరంగానికి ఆ శ్రీరంగనాథుని విగ్రహం చేరిన తర్వాతనే అని చెప్పడం వాళ్ళకు ఎంతో నచ్చిన విషయం. ఎలాగూ యుద్ధం కొద్దిరోజుల్లో ప్రారంభం కానున్నది కనుక కుముదిని కూడా మనస్ఫూర్తిగా అంగీకారం తెలిపింది. ఎప్పుడెప్పుడు యుద్ధం వస్తుందా అని ఎదురు చూస్తున్నాడు.

విజయనరంలో దండయాత్రకు మహామండలేశ్వరుని అంగీకారం లభించగానే రాజకీయాలు వేగంగా మారసాగాయి. విజయనగరాధీనులైన ఆరు దుర్గాలకు లేఖలు పంపించబడ్డాయి. కలుబరిగె సుల్తాను రాయబారికి జరిగిన పరాభవం తెలిసి ఆగ్రహోదగ్ధుడై ప్రతీకారానికి సమయం కోసం చూస్తూ ఉంటాడు కాబట్టి బహమనీ సుల్తానుల చర్యలను పసిగట్టడానికి చారులు నలుదిశలా తరలి వెళ్ళారు. విషయాలన్నీ వివరిస్తూ పాకనాడుకు చెందిన దుర్గాధీశుడు విక్రమసింహ పురాధిపతి సంగమరాజుకు, ములికినాటి పురాధీశుడు ఉదయగిరి దుర్గ ప్రభువుకు, గుత్తి, చంద్రగిరి దుర్గాధీశులకు, వనవాసి చంద్రగుత్తి గోవాలు కలిసిన అరగమలెహ పాలకుడైన

మారభూపతికి, ములువాయి దుర్గాధీశునికి, తుళు దుర్గాధిపతికి పంపగానే విజయనగరంలో యుద్ధవాతావరణం నెలకొనింది. గోపన్నను కంపరాయలు పిలిపించి ఇక కత్తులకు సానబట్టవలసిందని, యుద్ధానికి సమాయత్తమవమని చెప్పడంతో గోపన్న సంతోషానికి అవధులు లేవు. గోపన్న తన ప్రేమ విషయం ప్రస్తావించ గానే, మిత్రుణ్ణి కౌగలించుకుని "శుభ వార్త చెప్పావు మిత్రమా! ఆ శ్రీరంగనాథుని కల్యాణం అవగానే ఈ గోపనారాయణుని కల్యాణం! సరేనా!" అని హామీ యిచ్చాడు.

విజయనగరంలో ఎన్నడూ లేని క్రొత్త వాతావరణం నెలకొనింది. సైనికులే కాక ప్రతి యువకుడు కత్తి సాములో సైనికాధిపతుల వద్ద తర్ఫీదు పొందడం ప్రారంభించారు. అచట పుట్టిన చిగురుకొమ్మైన చేవ అన్న పద్ధతిలో చిన్న పిల్లలు సైతం కర్రసాము నేర్చుకుంటున్నారు. స్త్రీలు రోకటి బండలు, దుడ్డు కర్రలు సిద్ధం చేసుకున్నారు. సాముగరిడీల కోలాహలం వ్యాయామశాలలందు అధికమయింది. యుద్ధం వచ్చినప్పుడు కావలసిన ఆహార పదార్థాలను వైశ్యులు సేకరించడం మొదలుపెట్టారు.

గోపన్న ఈ విషయాలన్నీ చారులద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాడు. తన కల నిజమవబోతున్నందుకు విరూపాక్షునికి వేయి నమస్కారాలర్పించాడు. కత్తులకు, బల్లెములకు సానపట్టడం, క్రొత్తవి వందల సంఖ్యలో తయారు చేయడం, బాణములను అధికసంఖ్యలో తయారుచేయించడం వంటి పనులు అన్ని గ్రామలలోని వృత్తి పని వారలకు అప్పజెప్పాడు. రాజప్రాసాద సైనికులు క్రొత్త రూపు రేఖలతో కనపడసాగారు. గోపన్నకు ప్రతి రాత్రి శ్రీరంగనాథుని విగ్రహ ప్రతిష్టకు సంబంధించిన స్వప్నాలు అధికమయ్యాయి.

(మరుసటిరోజు జరిగిన వృత్తాంతం గంగాదేవి సంస్కృతంలో వ్రాసిన మధురా విజయములోని శ్లోకాల సారాంశం)

"సరస్సులలో ఉన్న కమలాలను వికసింపజేయడానికి సూర్యుడు తూర్పున ఉదయించాడు. కంపన తన ప్రాతఃకాల జపాలు ముగించుకొని, సైన్యాధిపతులను కలిసి యుద్ధానికి సిద్ధమవాల్సినదని ఆదేశించి తగు సూచనలను ఇచ్చాడు. కొద్ది సమయం తర్వాత పెద్ద శబ్దం వినవచ్చింది. అది ఎలా ఉందంటే అమృతమధనం జరిగిన సమయంలో మంధర పర్వతం నుంచి వచ్చిన శబ్దంలా ఉంది. ఆ ధ్వని విజయ దుందుభులది. ఏనుగులు తమ ముఖ కవచాలతో, అశ్వాలు తగిన అలంకరణలతో, సైనికులు కవచాలతో శస్త్రాస్త్రాలతో సిద్ధమవుతున్నారు. సామంత రాజుల పదాతి దళాల సైనికులు కత్తులు, బల్లాలు, ధనుర్బాణాలతో సిద్ధమయ్యారు. వీరాధి వీరులైన సామంతరాజులంతా యుద్ధ కవచాలు ధరించి కంపన రాకకోసం ఎదురు చూస్తున్నారు. రాజ భవనమంతా రాచరికపు ఛత్రాలతో నిండిపోయింది. కంపన తన ఆస్థాన పురోహితులు, జ్యోతిష్యుల కోసం వేచి చూస్తున్నాడు. వారు రాగానే అధర్వణ వేదం పఠించి, అతణ్ణి ఆశీర్వదించారు. ఆశీర్వాదాల అనంతరం భవన ద్వారం వద్ద ఉత్తమజాతి అశ్వం ఎక్కి సర్వ సైన్యం వెంటరాగా విజయనగరం కోట అవతలి ద్వారాన్ని దాటాడు"

కంపన 6 రోజులు ప్రయాణం చేసిన అనంతరం తన రాజ్యం చేరుకున్నాడు. సైన్యాన్ని నగర సరిహద్దులలోనే నిలిపి కొందరు అధికారులను

వెంటపెట్టుకుని నగరంలోకి ప్రవేశించాడు. కంపన రాక ముందుగానే తెలిసిన కారణంగా సుందరంగా తోరణాలతో అలంకరించారు. కంపన అంతఃపురానికి నేరుగా వెళ్ళాడు.

గంగాదేవి పరుగు పరుగున వచ్చి కంపనను గాఢంగా కౌగలించుకొంది. తిరునారాయణపురానికి వెళ్ళి వారం దినాల్లో వస్తానని చెప్పి వెళ్ళిన కంపన ఇన్ని నెలల తర్వాత వచ్చాడు. కంపన నాలుగైదు రోజులక్కడ ఉండి మళ్ళీ ససైన్యంతో బయలుదేరాడు. ఈసారి గంగాదేవి కూడా అతని వెంట నడిచింది. అలా ఒక వారం తూర్పు దిశగా ప్రయాణం చేసి పాలార్ నదీతీరన ఉన్న విరించిపురం చేరుకున్నారు. అది శంభువరాయుని రాజ్యంలోని ఒక భాగం. శంభువరాయ రాజ్యానికి రాజైన రాజనారాయణునికి విజయనగర సైన్యం పాలార్ నదీతీరంలో బస చేసిన విషయం చారులద్వారా తెలుసుకున్నాడు. ఆయన కొడుకైన వెన్న మణికొండన్ కత్తిపోటుకు గురై చికిత్స పొందుతుండగా అక్కడ బసచేసి ఉన్నాడు. రాజనారాయణుడు వెంటనే కాంచీపురం కోటను గట్టి సైన్యంతో బలపరిచే విధంగా ఆదేశాలు జారీ చేశాడు. కంపనుడు అతని సైన్యం అక్కడే బసచేసి, అదను కోసం ఎదురు చూస్తున్నారు. కంపనునికి చారులు ఒక ముఖ్య రహస్య సమాచారం చేరవేశారు. విన్నవెంటనే కాంచీపురం కోట ముట్టడికి ఉపక్రమించాడు. శంభువరాయని రాజ్యాధిపతి రాజనారాయణుడు ఆశించిన సైన్య సహాయం అతనికి అందలేదు. అది తెలిసిన కంపన ముట్టడిని ఇంకా తీవ్రతరం చేశాడు. రాజనారాయణుడు చేసేదేమీ లేదు గనక అక్కడనుండి కొడుకుతోసహా తనరాజగంభీర రాజ్యానికి పారిపోయాడు. కాంచీపురం కోట కంపనకు పూర్తిగా హస్తగతమైంది.

ధర్మాన్ని పరిరక్షించడానికి పూనుకున్న కంపరాయలను కాంచీపురం ప్రజలు ఆనందంగా స్వాగతించారు. తమ తమ ముంగిళ్ళను వీధులను రంగు రంగుల తోరణాలతో అలంకరించుకొన్నారు. వీధుల్లోకి కంపరాయలు ప్రవేశించగానే పెద్దపెట్టున జయజయధ్వానాలు మిన్నుముట్టాయి. "జై కంపరాయా! జై జై వీర కంపరాయా!" అని అరుస్తూ హర్షధ్వానాలు చేశారు. అందరూ సంతోషానందంగా ఉండగా కంపరాయలు భార్య గంగాదేవితో "దేవీ! నీవు కాంచీపురం దర్శించాలని కోరుకున్నవు కదా! వెళ్ళు! కాంచీపురం నేడు నిన్ను సకల రాచమర్యాదలతో ఆహ్వానం పలుకుతున్నది. తృప్తిగా అన్ని ఆలయాలు దర్శించిరా! " అన్నాడు. సంతోషంగా తలనూపుతూ "అలాగే స్వామీ! వెళ్ళి వస్తాను. భారవి కవి వర్ణన నన్ను ఆనందోత్సాహాలకు, కాంచీపుర దర్శనానికి వేగిర పరుస్తున్నది".
"దేవీ! ఏమా వర్ణన వివరించరాదా!" అని చిరునవ్వు నవాడు.
"పువ్వులలో ఉత్తమమైనది జాది మల్లి, పురుషలలో ఉత్తముడు శ్రీమహా విష్ణువు, స్త్రీలలో రంభ, పట్టణాలలో కాంచీపురం అన్నాడు" అంది.
"అదంతా 600 సంవత్సరాల ముందు చెప్పిన మాట దేవీ.. ఇప్పుడు అతను జీవించి ఉంటే తప్పకుండా మరోలా చెప్పేవాడు."
"అవునా! ఏమని స్వామీ!" అంది కన్నులు టపటపా కొట్టుకుంటూ ఉండగా సాలోచనగా
"పుష్పేషు జాదీ...పురుషేషు విష్ణుః..నారీషు గంగా...నగరేషు కాంచీ"
"అబ్బా.. స్వామీ! ఇంకా నయం పురుషేషు కంపరాయః అని కూడా అనెయ్యలేదు. తమరు కవి అయిపోయారు" అంది ఆనందంగా చప్పట్లు చరుస్తూ.

"నిజం దేవీ..చదువుకునే రోజుల్లో కాళిదాసు శ్లోకాలను చూసి నేనూ అలాంటి శ్లోకాలను ఎప్పుడు రాస్తానా అని ఆశపడేవాడిని. ఈ రాజ్యభారం అంతకన్నా గొప్ప బాధ్యత అనీ, హైందవ ధర్మ రక్షణ దానికంటే గొప్పదనీ భావించాను గనుకనే ఆ ఆలోచన మానుకున్నాను. గోపనామాత్యులు తనకు మధురా పట్టణానికి సంబంధించి ఒక శృంగార కావ్యమేదో ప్రబంధంగా వ్రాయాలని ఉందని ఒకసారి మాటల్లో అన్నాడు. మీరంతా ఉండగా మళ్ళీ నేను కూడా ఘంటం పట్టడం ఎందుకు? కరవాలం చాలు"

"గోపన కేవలం వీరుడు మాత్రమే కాదు గొప్ప మేధావి. ఆయనలో గొప్ప కవి కూడా ఉన్నాడు. వారు మీకు ప్రాణ మిత్రులు కావడం మన అదృష్టం. నాకు అనేకమార్లు నాకు శ్లోకాల విషయంలో సందేహనివృత్తి చేశాడు." అని బయలుదేరింది.

గంగాదేవి పట్టణ దర్శనానికి రథంపై బయలుదేరగానే నగరజనం వేల సంఖ్యలో ఆమెకు జయజయధ్వానాలు పలుకుతూ వెంటనడిచారు. జీవితంలో అదొక మధుర మనోహర దృశ్యంగా ఆమె భావించింది. శంభువరాయుడు కూడా వేదసంస్కృతికి విలువనిచ్చే భావనలు కలవాడైనా, సుల్తానుకు బానిసైనాడన్న కారణాన ప్రజలు అతణ్ణి అసహ్యించుకొన్నారు. సుల్తాను ఆదేశాలవల్ల ఆలయాల్లో పూజలు ఆపాల్సి వచ్చింది. ఉత్సవాలు, పండుగలు, తిరునాళ్ళు అన్నీ మూతబడ్డాయి. ఇప్పుడు రాజు మారగానే రాజ్యంలో మళ్ళీ హైందవ సంస్కృతి పునరుజ్జీవించింది. అందుకే విజయనగర రాజులకు అంత నీరాజనాలర్పిస్తారు. గంగాదేవి నగరదర్శనం, ఆలయాల దర్శనం ముగించుకుని వచ్చింది.

"దేవీ! ఎలా ఉంది కాంచీపురం?"

"భారవి కవి వర్ణించినదానికంటే అధిక సంతోషం కలిగింది స్వామీ!" అని

ఒక్క క్షణమాగి 'స్వామీ కాంచీనగరమే మన రాజధాని కావాలని నా కోరిక" అన్నది.

"అలాగే! మొదట మన ఈ శంభువరాయుని రాజ్యాన్ని పూర్తిగా జయించాలి అప్పుడే మనం అలా చేయడానికి సాధ్యం. అన్నట్టు రేపే మన రాజగంభీర పర్వత యాత్ర. సిద్ధంగా ఉండు"

అప్పటికే బాగా ప్రొద్దుపోవడంవల్ల, రోజంతా అలసి ఉండడం వల్ల, వారు వెంటనే నిద్రకుపక్రమించారు.

మంజరిని ఓదార్చి బయటకు వచ్చిన వల్లభుడు, దత్తుడు వారం రోజులుగా వేరే ప్రయత్నంలో పడ్డారు. వేళకు సరిగా అన్నపానాదులు కూడా లేవు. తమకు ప్రయాణంలో తారసపడిన మధురాంగి మాయమై ఎక్కడ ఉన్నదో తెలియదు. తిరుక్కురుంగుడి గురించి ఏదో తమిళ గీతం పాడుతూ వెళ్ళింది. వెళ్తున్న సమయంలో ఏవేవో అర్థం పర్థం లేని సైగలు కూడా చేసింది. సర్వశక్తులూ ఒడ్డి ఆమె అన్వేషణకు పరుగులు తీస్తున్నారు. ఇంతకాలం వల్లభుడు తల్లి మాటను గౌరవించి ప్రేమ విషయాన్ని మనసులోనే దాచుకున్నాడు. ప్రస్తుతం చాలా వరకూ పరిస్థితులు చక్కబడ్డాయి. శ్రీరంగనాథుని శ్రీరంగం చేర్చే బాధ్యత గోపన్నకు అప్పజెప్పగానే మనసు ప్రశాంతంగా మారింది. ఇక తనకు అడవిలో తారసపడిన మధురాంగిని వెదికి, తల్లిని ఒప్పించి ఆమెనే వివాహమాడాలి అని ఆలోచిస్తున్నాడు.

ఆమె పట్ల తనది నిజమైన ప్రేమే అయితే ఈ కాంచీపురంలో తప్పక ఆమె ఆచూకీ తప్పక లభించగలదు.అని వల్లభుడు తీవ్రంగా

ఆలోచిస్తూ ఉండగా దత్తుడు "వల్లభా! మీ తల్లిగారు చెప్పినదేమిటి? నీవు చేస్తున్నదేమిటి? మీ తల్లి చెప్పినట్లు విగ్రహం శ్రీరంగంలో ప్రతిష్ఠితమయే వరకూ ఈ ప్రేమలో పడడం వంటివి చేయకుండా ఉంటే బాగుండేది కదా!" అన్న మాటకు తల్లి మాటలు జ్ఞాపకం చేయగా "నిజమే కదా! నా హృదయంలో ఆ మధురాంగి ఎందుకు ప్రేమను కలిగించాలి?" అంటూ నుదురు కొట్టుకుంటుండగా "వల్లభా! ఇప్పుడు చింతించి ఏమీ లాభం లేదు. మన ప్రయత్నం మనం చేద్దాం. సరైన ఆహారం తిని నాలుగు రోజులు దాటింది. మధురాంగిని వెదుక్కుంటూ వచ్చి ఎరగక వచ్చి ఈ కోటకూ అగడ్తకూ మధ్యన ఇరుక్కుని పోయాం. ఆనాడు ఆమె బాట ఈ కోట వైపుగా సాగింది. కోటలో మధురాంగి ఉందని మన నమ్మకం. మన స్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా ఉంది" అని అంత నీరసంలోనూ నవ్వాడు.

వల్లభుడు కోటలోనికి ఎలా వెళ్ళాలా అని ఆలోచిస్తూ పైకి చూస్తూ ఆశ్చర్యపోయాడు. కారణం ఒక చిన్న బుట్టలాంటి వస్తువు కోటలోని ఒక బురుజు గుండా తమకు సరిగ్గా తలపైన పడేవిధంగా క్రిందికి దిగుతున్నది. దత్తా! అప్రమత్తంకా! అటు చూడు ఏమిటో తెలుసుకోవాలి" అంటూ కత్తి దూసి నిలబడ్డాడు. అది దిగిన తర్వాత దానిలో ఉన్న తాళపత్రాన్ని అందుకున్నాడు. ఏముందా అని ఆశ్చర్యంగా తీసి చదివాడు. దానిలో "నేను యువరాణి మధురాంగి చెలికత్తెను. నా పేరు విశ్వప్రియ. మీరు ఇక్కడ కోటప్రక్కకు చేరి ఉంటారని యువరాణి అనుకొంటున్నది. అదే నిజమైతే, వచ్చినది మీరే అయితే జవాబివ్వండి" అని ఉంది. వెంటనే సంతోషంగా "మిత్రమా! నేను చెప్పినదే నిజమైంది చూశావా! రాజకుమారి

కూడా నన్ను మరచిపోలేదు. నా కోసం వెదుకుతున్నది" అని జవాబు రాయడానికి ఒక ఎండు తాటాకు ముక్కను తుంచుతుండగా "మిత్రమా! వల్లభా! ఇలా అన్నానని అనుకోవద్దు. ఇందులో ఏమైనా కుట్ర ఉన్నట్లైతే మనమిద్దరమూ ఇక్కడే మరణిస్తాం. ఆలోచించు" అన్నమాటకు ఈలోకంలోకి వచ్చాడు. నిజమే! అందుకే బుట్టలో అదే తాళపత్రం ఉంచి దాన్ని వేగంగా ఊపాడు. ఆ బుట్ట పైకివెళ్ళి మరికాసేపట్లో మళ్ళీ క్రిందికి వచ్చింది. ఈసారి అందులో ఏమున్నదా అని చూశారు. దానిలో అంతకు ముందు పంపిన తాళపత్రమే కాక ఇంకో కంకణం కూడా ఉంది. దాని మీద పాండ్య రాజ చిహ్నమైన మీనం గుర్తు ఉంది. అప్పుడువారి సందేహం మాని ఇంకో తాళపత్రం తీసుకుని ఇలా రాశారు." మీరూహించింది నిజమే! నేనూ నా మిత్రుడు అగడ్త దాటి కోట గోడ వద్ద చిక్కుకున్నాం. ఆహారం తిని నాలుగు రోజులైంది. దయచేసి మాకు ఆహారం పంపి, ఇక్కడనుండి తప్పించుకునే ఉపాయం చెప్పండి". బుట్ట కదలిక చూసి పైకి లాగబడింది. ఈసారి కొంచెం పెద్దదైన బుట్ట దానిలో ఆహారపానీయాలతో పాటు "చింతించకండి. మీరు తప్పించుకునే సహాయం నేను చేస్తాను" అని విశ్వప్రియ సంతకం చేసి పంపింది. హమ్మయ్య అని వచ్చిన బుట్టమొత్తం ఖాళీ చేసి "బ్రేవ్" మని త్రేన్పులతో తృప్తిగా నవ్వుకున్నారు.

అలా నాలుగురోజులు వారికి ఆహారం పైనుండి బుట్టలతో వచ్చింది. ఆ తర్వాత పైనుండి ఒక తాళ్ళ నిచ్చెన యెక్కి పైకి రమ్మన్న సందేశం అందింది. వల్లభుడు, దత్తుడు మెల్లిగా ఎక్కి పైకి చేరారు. పైన వారికి రహస్యంగా ఒక గదిలో ఉండనిచ్చారు. రెండు రోజుల తర్వాత

దత్తుణ్ణి వేరే గదిలోని తీసుకుని వెళ్ళారు. రాజవల్లభుడు ఒక్కడే ఆ గదిలో ఉండిపోయాడు. విశ్వప్రియ ఇచ్చిన సూచనల ప్రకారం తను బయటకు వెళ్ళకూడదు ఇంకా ఎవ్వరితో మాట్లాడకూడదు. గదితలుపులు రెండురోజులనుండి మూసే ఉన్నాయి. వల్లభుడు తెరిచేందుకు సాహసం చెయ్యలేక పోయాడు. మూడో నాడు అతనికి ఒక కంఠం వినిపించింది. "అయ్యా! అయ్యా!" అని ఎవరిదో పిలుపు. ఆ కంఠం చాలా మార్దవంగా ఉంది. ఆ కంఠం ఎక్కడనుండి వస్తున్నదో తెలుసుకోవాలని గదంతా కలయ దిరిగాడు. ఎక్కడా ఆచూకీ దొరకలేదు. ఆమె మరలా "మీరు నన్ను చూడలేరు. నేను ఒక రహస్య ప్రదేశం నుండి మాట్లాడుతున్నాను" అని చెప్పింది.

"సరే మీరెవరో చెప్పండి?" అన్నాడు

"మొదట మీరెవరో చెప్పండి?"

"నేను...నేనూ...ఒక రత్నాల వ్యాపారిని!"

"కాదు... మీరు మారువేషం వేసుకున్నారు. ఆవిషయం నాకు తెలుసు" నవ్వు వినిపించింది.

"మీరు ఎలా చెప్పగలరు?"

"నేను మిమ్మల్ని మొదటిసారి చూసినప్పుడు గడ్డాలు లేవు"

ఆశ్చర్యంతో చూస్తున్నాడు రాజవల్లభుడు. ఎవరీమె! "మరి మీరెవరు?"

"మీరానాడు చూసిన అమ్మాయిని" మళ్ళీ అందమైన నవ్వు.

"అయితే మీరు?"

"మకర కండిక, మకర కంకణం నా మాటలకు సాక్ష్యాలు"

"అయితే నువ్వు...నువ్వు!"

"అవును! పాండ్య యువరాణి మధురాంగిణిని!"

సంతోషంపట్టలేకపోయాడు రాజవల్లభుడు. ఆనందంతో మనసు ఉరకలు వేసింది. ఇంతకాలం నుండి తను వెదుకుతున్న యువరాణి మాటలు వినేసరికి ఒక్కసారి ఏదో అనుభూతికి లోనయ్యాడు. ఆమె మళ్ళీ గొంతు సవరించుకుని "నేను మీరు ప్రయాణంలో ఉండగా ఎన్నో సంకేతాలు పంపించాను. కానీ మీరు వాటినేమీ గుర్తించలేదు"

"అవును నిజమే! నేను నా సర్వ శక్తియుక్తులూ శ్రీరంగనాథుని విగ్రహం మీదే పెట్టడం వల్ల ఇతర విషయాలేమీ పట్టించుకోలేదు...అందువల్లా..."

మొదటిసారి మీరు హడావిడిగా, నన్ను విడిచి వెళ్తున్నప్పుడు నన్ను తిరుక్కురుంగుడి తీసుకువెళ్ళమని ఒక గీతం పాడాను. మీరు ఏమీ అర్థంచేసుకోలేదు"

"అవును పాట బాగున్నది అనుకున్నాం తప్ప...విషయం అర్థం చేసుకోలేదు" అంటూ సిగ్గుపడ్డాడు.

"నేను బండిలో ఎక్కి తరలివెళ్ళేముందుకూడా నన్ను పాండ్య రాజ్యానికి చేర్చమని అభ్యర్థిస్తూ, చేతులతో అనేక సంకేతాలు చేశాను"

మళ్ళీ తనే ప్రశ్నించింది "నేను చెప్పినది నిజంకాదా! ఎందుకీ మౌనం!"

"అవును యువరాణీ తప్పు అక్షరాలా మాదే! కానీ ఆసమయంలో మాదృష్టి మొత్త మేము సాధించబోయే కార్యం మీదే ఉన్నది"

"మంచిదే! నేను ఏమాత్రం బాధపడలేదు. దానికి కారణం.. మీలో ఒక్కరు నన్ను అమితంగా ఇష్టపడ్డట్టు నాకర్థమైంది. అందుకే ధైర్యంగా సంకేతాలివ్వగలిగాను.

"నేనే యువరాణీ.. మీ కోసం ప్రాణాలివ్వడానికి కూడా సిద్ధమే!"

"అవును నాకు తెలుసు. కానీ, సాహసం చేసి, అగడ్త దాటి కోటవైపుకు

మీరెలా వచ్చారు?"

"మీ విషయం ఒక వజ్రాల వ్యాపారి అగడ్త దాటి కోటలోకి ఎలా వెళ్ళాలో చెప్పడం వల్ల ఇలా సాహసించాను"

"ఎవరా వ్యాపారి?"

"ఆయన ఎవరో మాకు తెలియదు. ఆయనకూడా మారువేషంలో ఉన్నట్టు అర్థమయింది"

"అవును అంతే కాదు. ఆయనకు కొన్ని ప్రత్యేకమైన లక్షణాలున్నాయి"

"అవునా! అతని మాటలను బట్టి మంచి విజ్ఞాన సంపన్నుడని మాత్రం అర్థమైంది. తొందరలో అంతకంటే ఎక్కువ ఆలోచనల రాలేదు"

"ఆయన ఎవరో కాదు. మీకు నిజం చెప్తున్నాను. ఆయన విజయనగర సామ్రాజ్య ప్రధానాధికారి!"

"అవునా?" ఆశ్చర్యపడింది.

"అవును! అతని మార్గదర్శకత్వం వల్లనే మిమ్మల్ని ఇలా కలుసుకోగలిగాను. ఆయన ఎందుకో మీ ప్రాణానికి అపాయం ఉందని భావించాడు. మేము రత్నాలు, వజ్రాలు అమ్ముకునే వారి వేషాలతో తిరుగుతూ ఇలా అగడ్త దాటి రాగలిగాం"

"ఈరోజే కాంచీపురం విజయనగరాధీశుడు కంపరాయల వశమయింది. రాజగంభీరపర్వతయాత్ర త్వరలో జరగబోతున్నదని వార్తలు వినవచ్చాయి"

"అవును! ఆనాడే దశలవారీగా జయించి శ్రీరంగంలో శ్రీరంగనాథుణ్ణి ప్రతిష్ఠిస్తానని గోపన్న ప్రతిజ్ఞ చేశాడు"

ఇంతలో రాజభటుల అలికిడి రావడం వల్ల వారి మాటలు ఆగిపొయ్యాయి.

కోటంతా మెల్లిగా సద్దుమణిగింది. అక్కడ యుద్ధం జరిగిందంటే నమ్మశక్యంకానంత నిశ్శబ్దంగా ఉంది నగరు. ప్రజలు సంతోషంగా తిరుగుతున్నారు. ఎక్కడ చూసినా పండుగ వాతావరణం నెలకొనింది.
ఇంతలో ఒక చారుడు మెల్లిగా గదిలోకి ప్రవేశించాడు. తమకేమైనా విపత్తు రాబోతున్నదా? అని ఇద్దరు మిత్రులు సావధానులయ్యారు. వల్లభుడు కత్తిని ఒరలోంచి ఏ క్షణమైనా తీసేందుకు సిద్ధంగా ఉన్నాడు.
దూరం నుండి శూలం పుచ్చుకుని వస్తున్న సైనికుడిని చూసి వల్లభుడు "మిత్రమా! ధైర్యం వహించు! వచ్చినవాడు ఏమి చెప్తాడో చూద్దాం! కరవాల ప్రదర్శన అనవసరమని తోస్తున్నది" అని దత్తుని చెవిలో చెప్పాడు.
"కంపరాయలవారు మిమ్మల్నిద్దరినీ దర్బారుకు వెంటనే విచ్చేయమన్నారు!" అని చెప్పి వెంటనే వెళ్ళిపోయాడు. దత్తుడు "మనిద్దరం దర్బారుకు వెళ్ళాలా?" అంటూ ఉండగా వల్లభుడు "భయం లేదు మిత్రమా! మనం వీరులమే కదా! కంప మహారాజు సహృదయుడు. వెళ్ళడం శ్రేయస్కరమని అనిపిస్తున్నది. వెంటనే బయలుదేరుదాం"

మొట్టమొదటి సారి కంపరాయల దర్శనానికి వెళ్తున్నందుకు వారికి ఒక విధమైన ఆనందము ఒక వేపు, ఒక వేపు అనుమానం కలుగుతున్నా ధైర్యంగా దర్బారు వైపు నడిచారు. మిత్రులిద్దరి ముందూ సింహాసనాధీశుడై ఠీవిగా కూర్చున్న రాజు వేరెవరో కాదు తమకు కోటలోనికి రావడానికి, పాండ్య యువరాణిని కలుసుకోడానికి సహాయం చేసిన వజ్రాల వ్యాపారి. ఇద్దరూ కొద్ది క్షణాలు ఇది కలకాదుగదా! అని ఆశ్చర్యంతో అలా చూస్తూ ఉండిపోయారు. వల్లభ దత్తులను చూడగానే రాజు సింహాసనం దిగి పెద్దగా నవ్వుతూ "స్వాగతం! సుస్వాగతం!" అంటూ ఇద్దరినీ గాఢంగా

కౌగలించుకున్నాడు. "రాజా! వజ్రాల వ్యాపారి వలె వచ్చి మమ్మల్ని ఆశ్చర్యపరచారు. "మీరెవరో తెలియక మేము కొన్ని అనకూడని మాటలు ఎగతాళి చేసిన మాట వాస్తవం. దానికి ఏ శిక్ష వేసినా సిద్ధమే! మిత్రధర్మంగా క్షమిస్తారని ఆశిస్తున్నాం!" అన్న దత్తుని మాటలకు మళ్ళీ నవ్విన కంపరాయలు గంభీరంగా " మీ గురించి గోపన్న నాకు అన్ని విషయాలు వివరించాడు. మీ ఇద్దరికి ఏమి శిక్ష వేయాలో నాకు బాగా తెలుసు. కానీ ఇప్పుడు మీరు తక్షణ కర్తవ్యం ఉన్నది" అన్నాడు.

"చెప్పండి. మహారాజా! మీ ఆజ్ఞ శిరసావహించడమే మా కర్తవ్యం! దానికి మా తలలు క్రింద తెగి పడ్డా వెనుదీయం!" అన్నాడు వల్లభుడు.

"మీరంతటి వీరులు, సాహసికులు కనుకనే మీకీ కార్యం అప్పగించడం జరుగుతోంది"

"మేము మా గృహాలు వదలి ఎన్నో నెలలయినది మహారాజా! శ్రీరంగనాథుని అన్వేషణలో మాకప్పుడు కాలమే తెలియలేదు. కానీ ఇప్పుడు మా తల్లిగారిని దర్శించాలని ఆతృతగా ఉంది. మేము ఇక్కడకు వచ్చిన కారణం మీకు తెలియనిది కాదు"

"అవును వల్లభా! నేను ఆ పని గురించే మాట్లాడుతున్నాను. నీ కోరికలు ఒకటి మీ తల్లిగారిని కలుసుకోవడం, ఇంకోటి నీ ప్రేమ విషయం. రెండూ సిద్ధించాలనే సంకల్పంతోనే ఈ పని అప్పగిస్తున్నాను" అని నవ్వాడు.

"అర్ధంకాలేదు మహారాజా!"

"జాగ్రత్తగా వినండి! పాండ్యరాజుతో మన అనుబంధాన్ని పెంచుకోవాల్సిన అవసరం మీకూ తెలుసు. ఆదేశపు యువరాణి మధురాంగిణిని గౌరవ మర్యాదలతో వారికి అప్పజెప్పడం సముచితం"

ఆమాటవినగానే వల్లభుడి మనసు ఆనందంతో తేలిపోయింది “అవును మహారాజా! తప్పక అప్పజెప్పవలసిందే!” అన్నాడు.

“కదా! అందువలన ఆమెను ఆమె రాజ్యానికి సురక్షితంగా చేర్చే బాధ్యత మీ ఇద్దరిదే!”

ఈ బాధ్యత తమకు అప్పగిస్తాడని తెలియని వల్లభుడు ఆశ్చర్యపడ్డాడు. కొంచెం తేరుకుని ‘‘రాజా! ఇంత పెద్ద బాధ్యత మేమిద్దరం చేయగలమంటారా?”

“మీరు తప్పక చేయగలరు. మీ సామర్థ్యం నాకు తెలుసు! మిమ్ములను మారువేషాలలో ఉన్నపుడు నేను చాలా నిశితంగా పరిశీలించాను. పైగా గోపన్న కూడా ఈ కార్యానికి మిమ్ములనే సిఫార్సు చేశాడు. మీరిద్దరనే భయం వద్దు. మీవెంట 100 మంది శిక్షణపొందిన అశ్వవీరులు వస్తారు. నిర్భయంగా వెళ్ళి మధురాంగిణిని అప్పగించండి. పాండ్యరాజుకు నేను మీ గురించి మీ ధైర్య సాహసాల గురించి నేను వేరే విధంగా లేఖ వ్రాసి పంపుతాను”.

“కానీ మహారాజా! ఒక సందేహం!”

“అడుగు రాజవల్లభా!”

“నేను రాజకుమారిని అప్పజెప్పడం ఒక కార్యం. మాతల్లిగారిని దర్శించడం మరోపని. మీరు రెండు కార్యాలు తీరుతాయని అన్నారు. ఏవిధంగానో అర్థం కాలేదు”

“అవును! అదే రాజతంత్రం. మీరు ఇలాంటి రహస్యాలను ఇంకా ఎన్నో నేర్చుకోవలసి ఉన్నది. ఈ విషయం జాగ్రత్తగా వినండి. యువరాణిని దగ్గర మార్గమని సుల్తానురాజ్యం గుండా పాండ్యదేశానికి తీసుకుని వెళ్ళే

సాహసం చెయ్యలేము కదా! అది ప్రమాదం కూడా. అందువల్ల మీరు కర్ణాటకరాజ్యం నుండి మాత్రమే వెళ్ళవలసి ఉంది. అందువల్ల ముల్బై ప్రాంతంలోనో, సత్యమంగళంలోనో కొంత కాలం ఆగండి. మీ స్వగ్రామాలకు వెళ్ళి వారిని కలుసుకోండి. తిరిగి మళ్ళీ రండి. ఆ తరువాత యువరాణిని అప్పజెప్పండి"

వల్లభుడు ఈ సమయోచిత మార్గం విని ఆశ్చర్యం వ్యక్తం చేశాడు.

"అవును వల్లభా! ఇదే మన ప్రస్తుత కర్తవ్యం. మనం శంభువరాయుని కాంచీపుర సామ్రాజ్యాన్ని వశం చేసుకున్నాం. దీనికి సుల్తాను స్పందన ఏమిటో ఇంకా తెలియరాలేదు. మనం అందుకే జాగ్రత్త వహించాల్సి ఉ ంది. అందుకే మీలాంటి వారి అవసరం కలిగింది. మీరు మునుపు శ్రీరంగనాథుని అన్వేషణ ఎంత కష్టసాధ్యమైనా సాధించారో అలాగే ఈ కార్యాన్ని కూడా పవిత్రంగా భావించండి. మన ఇద్దరి లక్ష్యాలు ఒకటే! అందువల్ల కార్యాచరణలో కూడా కలిసి ఆలోచించి ముందడుగు వేయడం శుభకరం! క్షేమదాయకం! "

రాజవల్లభుడు సుదీర్ఘంగా ఆలోచించి ఇదే కర్తవ్యమని సమాధానపడ్డాడు

"మీ మాట శాసనం మహారాజా! అలాగే నిర్వర్తిస్తాను!"

"వల్లభా! భేష్! శుభం జరగాలని ఆ శ్రీరంగనాథుని ప్రార్థిస్తున్నాను. మొదట మీ తల్లిగారిని కలుసుకో! ఆ పైన మధురాంగిణిని పాండ్యరాజుకు అప్పజెప్పు. తద్వారా పాండ్యునికి నీ శక్తి సామర్థ్యాలపై విశ్వాసం అధికమౌతుంది. నీ పనీ సులువవుతుంది. అంతే కాదు! మరో ముఖ్యమైన విషయం. మధురాంగిణిని అప్పజెప్పగానే నీవు ఇక్కడికి రావాలి.

వల్లభుడు తిరిగి ఆశ్చర్యానికి లోనయ్యాడు.

"అవును వల్లభా! మన లక్ష్యం చాలా పెద్దది. దాన్ని సాధించడానికి మనమంతా చేతులు కలపవలసిన సమయం ఆసన్నమైనది. నీ తండ్రి కులశేఖరుడు గొప్పవీరుడు. ఆయనకు జన్మించిన నీవు కూడా అలాంటి వీర లక్షణాలు పుణికి పుచ్చుకున్నవాడివే! నీ బలపరాక్రమాలు చూపే సమయం ఆసన్నమైనది. మీ తండ్రిగారు అసంపూర్ణంగా వదలిపెట్టిన కార్యభారాన్ని నీవు భుజస్కంధాలకెత్తుకోవలసి ఉంది. దీనికి నీ తల్లి కూడా పరమానంద భరితురాలవుతుందని నా భావన! అందువల్ల నీ సహాయం మాకు అందించమని కోరుతున్నాను! శుభం!"

మరుసటి తెలతెలవారుతూ ఉండగానే రాజవల్లభుడు, దత్తుడు, వందమంది అశ్వికులు ఆయుధపాణులై కర్ణాటక సామ్రాజ్యం గుండా పాండ్యదేశానికి పయనమయ్యారు. వల్లభునికి ఆందోళన మొదలైంది. మార్గ మధ్యంలో మధుర తనతో ముచ్చటిస్తుందా! ఎరుగని రీతిలో ఉండిపోతుందా! నిన్నరాత్రి మాటల్లో అంతదగ్గరైన మధుర ప్రయాణంలో అలాగే మాట్లాడుతుందా? లేక.. అని యోచనతో కొట్టుమిట్టాడుతున్నాడు. ప్రయాణానికి బయదేరేముందు రాణి గంగాదేవి సంభాషణ గుర్తుకొచ్చింది.

"వల్లభా! మీ ఇద్దరి ధైర్య సాహసాల గురించి నేను మళ్ళీ మళ్ళీ పొగడాల్సిన పనిలేదు. పాండ్య రాకుమారిని సగౌరవంగా వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చండి. దారిలో ముల్బైలో బస చేయండి. పాండ్య రాజ్యం చేరిన తరువాత మొదటగా మహారాణికి నా నమస్కారాలు చెప్పండి. వారికోసం మేము పంపిన పట్టుబట్టలు, చినీ చీనాంబరాలు, బంగారు నగలు, వజ్ర వైఢూర్యాలు వారికి వినయంగా అందజేయండి. యువరాణి

తప్పిపోయినందుకు వారి శక్తిసామర్థ్యాలను తక్కువచేసి మాట్లడకండి. విధి వైపరీత్యం గమనించడం ఎవరికీ సాధ్యం కాదనే విషయం మరువకండి. మధురాంగిణిని అప్పజెప్పాక తిరిగి వచ్చేటప్పుడు మీరొక సహాయం చెయ్యాల్సి ఉంది”

“ఆజ్ఞాపించండి మహారాణీ!”

“దురదృష్టశావత్తూ ఆ ప్రాంతం మధుర సుల్తానుల చేతిలో పడి దాదాపు 38 సంవత్సరాలైంది. దీని వలన మనం ఆ ప్రాంతం ప్రజలకు, కవులకు, కళాకారులకు దూరమయ్యాం. మన సంస్కృతిని రక్షించుకోలేని దుస్థితిలో ఉండిపోయాం. దీనికి అనేక కారణాలు. అక్కడి దర్బారులో మంచి కవి పండితులు ఉన్నారని విన్నాను. వారు రచించిన తాళపత్ర గ్రంథాలను వెలకట్టి, వారు సంతృప్తిచెందే విధంగా తగిన పారితోషికమిచ్చి, ఎన్ని గ్రంథాలైనా సరే! మీతో తీసుకుని రండి”

“అలాగే మహారాణీ! తప్పక! కవి గాయకులను పోషించవలసినది రక్షించవలసినదీ మహారాజులే కదా! విజయనగర సామ్రాజ్యం కవి, పండితులకు నిలయమై నిత్యం విలసిల్లాలని ఆ శ్రీరంగనాథుని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను. త్వరలో మనకు మంచి రోజులు వస్తాయి మహారాణీ! మనం స్వేచ్ఛగా ఆ మధురలో తిరిగే రోజు వస్తుంది! గోపన్న చేసిన ప్రతిన చెల్లించే రోజు వస్తుంది. శెలవు మహారాణీ!” అని బయలుదేరారు.

మొదటి వారం ప్రయాణం ప్రశాంతంగా సాగి, తమిళ ప్రాంతం దాటి కర్ణాటక పొలిమేరలు పట్టారు. అదంతా కొండలు, గుట్టలమయంగా ఉంది. చల్లని నీడనిచ్చే పెద్ద పెద్ద వృక్షాలు. ప్రతి సత్రంలోను యువరాణికి జయజయధ్వానాలు పలుకుతున్నారు. ఆలయాలలో మధురాంగిణి పేరు

వినగానే అర్చక బృందం పూర్ణకుంభంతో స్వాగతం చెప్పి పూజలు పునస్కారాలు మహా వైభవంగా నిర్వర్తిస్తున్నారు.

రాజకుమారి చుట్టూ పన్నెండు మంది చెలికత్తెలు ఉండేవారు. వారు ప్రతి నిముషం ఆమెకు కావలసిన పనులన్నీ ఆమె నోరు తెరిచి అడక్కుండానే జరిగిపోతున్నాయి. ఆలయాలకు వెళ్ళినా, సత్రాలలో బసచేసినా దూరం నుండి చూడడం మాత్రమే తటస్తించేది. అంతే గాక ఆంతరంగిక చెలికత్తెల పేరుతో కొంత మంది ఉన్నారు. వారికి ఒక ముదుసలి స్త్రీ "శ్రీకార్యం" అధికారిణిగా ఉంది. గ్రామాల్లో పట్టణాల్లో బసచేసినప్పుడు జనాన్ని కలవడానికి వీల్లేకుండా అడ్డుకుని అధికారులను పరిశీలించిన మీదట మాత్రమే ప్రవేశం కలిగించేది. ఆ అధికారిణి కత్తి, విల్లంబు ధరించి ఉండడం విశేషం. దారిలో ఎంత పెద్ద పనసపండైనా, నిమ్మపండైనా ఒక్కవేటుతో బాణంవేసి నేల కూల్చేది. ఆమె గురికి అందునా ఇంత ముసలి వయసులో ఆమె ధైర్య సాహసాలు, వీరత్వం చూసి ఆశ్చర్యం వేసింది వల్లభునికి. అంతే కాదు, ప్రతిరోజూ ఉదయంపూట దంతధావనాదులు చేసే సమయంలో 'యువరాణితో మాట్లాడకుండా ముందటిరోజు గడిచిపోయిందని' చింతిస్తూ కాలకృత్యాలు తీర్చుకునే వాడు.

ఏడవరోజు సూర్యాస్తమానం కావస్తున్నది. రథాలు, గుర్రాలు సాగుతున్నై. అంతఃపుర శ్రీకార్యం యువరాణి ప్రయాణిస్తున్న పల్లకీని ఆపమని కోరింది. "రాత్రికి ఇక్కడే బస! అందరూ విశ్రాంతి తీసుకోండి!" అని హుకుం ఒకటి జారీ చేసింది. దానితో మనసు కష్టపడ్డ వల్లభుడు "మీరు కొంచెం శాంతించండి! ఎక్కువ ఆలోచించకండి. మేమూ యువరాణి పట్ల బాధ్యత గలవారమే! ఇంక ఒక గంట ప్రయాణం చేస్తే దగ్గరలోనే

పెద్దసత్రం వస్తుందని ప్రయాణీకుడు చెప్పగా విన్నాను. అక్కడికి వెళ్దాం. అడవిలో విశ్రాంతి కంటే అదే మేలు! అని శ్రీకార్యంతో కొంతసేపు వాగ్వివాదం చేశాడు. ఈ విషయం వెంటనే శ్రీకార్యం యువరాణికి వెళ్ళి చెప్పింది. యువరాణి శ్రీకార్యాన్ని సమర్థించడంతో ఎక్కడివారక్కడ ఆగారు. కానీ ఈ విషయం వల్లభుని మనసును కలవరపరచింది. ఒక ముదుసలి శ్రీకార్యం మాటలే ముఖ్యమా? తను ఎంతో ప్రేమించిన యువరాణి తన మాటలు కాదంటుందా! అని పరిపరివిధాల ఆలోచిస్తున్నాడు. ఆమె తన రాజ్యానికి దగ్గరయ్యే కొద్దీ.. తన మనసునుండి ఆమె దూరమవుతున్నట్టు భావన కలిగింది. ఆమెతో కనీసం సంభాషించి క్షేమ సమాచారాలు అడగాలన్నా చుట్టూ దుర్భేధ్యమైన సైనికుల మోహరింపు, చెలికత్తెలు అనే బాధ తీవ్రమయింది.

అందరూ కాగడాలు వెలిగించి, డేరాలు వేసి ఆహార వ్యవహారాల ఏర్పాట్లు చూస్తున్నారు. ఇంతలో ఒక పావు క్రోసు దూరంలో ఏవో గుర్రపు డెక్కల చప్పుడు వినిపించింది. వృద్ధనారి శ్రీకార్యం దూరంగా నిలబడి, యువరాణికి కావలసిన పదార్థాల వంటపనుల ఏర్పాటులో నిమగ్నమై ఉంది. సైనికులు బడలికతో విశ్రాంతిగా నేలపైనే పండుకొని ఆహారం కోసం ఎదురు చూస్తూ విశ్రాంతి తీసుకుంటున్నారు. సవ్వడి దగ్గరవడంతో దత్తునికి సైగ చేసి కత్తి విల్లంబులు ధరించి గుర్రాలపైకి ఎక్కారు. వచ్చినవారు పదిమంది గోధుమరంగు వర్ణంలో ఉన్నారు. ఈ ప్రాంతీయులు అసలే కాదు. ఉర్దూలో మాట్లాడుకుంటున్నారు. నల్లటిమసి గుర్తు పట్టకుండా చారలు చారలుగా పూసుకుని వున్నారు. ఆటవికులో దొంగలో తెలియడం లేదు. వారిలో ఒకడు "మేము మిమ్మలని ఏమీ చెయ్యం. మీ వద్దనున్న ధనం,

బంగారం మాకు వెంటనే అప్పజెప్పండి లేదా అనవసరంగా ప్రాణాలు కోల్పోతారు" అని అనగానే వల్లభుడు వెనుక నిలబడి ఒకే సారి రెండు బాణాలు వదలడంతో, ఒకరికి గొంతులో, ఒకరికి గుండెలో దిగడంతో విరిగిన చెట్టులా కూలిపడ్డారు. మిగిలిన వాళ్ళు అప్రమత్తులై "మీరు వీరులైతే మాముందుకు రండి!" అనగానే మళ్ళీ వల్లభదత్తులిద్దరూ ముందుకు వచ్చి విడిచిన విడిచిన బాణాలకు ఇద్దరు హతులయ్యారు. మిగిలిన వారు గుర్రాలపై పారిపోతుండగా వెంబడించి పట్టుకుని కత్తితో పొడిచి చంపారు. ఈ కలకలం సాగుతున్నంత సేపూ యువరాణికి కాపలాగా, ఆమె శిబిరం చుట్టూ సైనికులు, పరిచారికలు డేరా కట్టినట్టు అడ్డు నిలబడ్డారు.

సమస్య సద్దుమణిగిన తర్వాత శ్రీకార్యం ముందుకు వచ్చి "నాదే పొరబాటు క్షమించండి. చీకటిపడితే ప్రయాణం చేయకూడదు అన్న పట్టుదల మీద ఉన్నానే తప్ప.. రాజవల్లభా! నీవు చెప్పినట్లు ఇంకొద్ది దూరం ప్రయాణం చేసి సత్రంలో తలదాచుకుంటే ఎవరికి ఏ ఇబ్బందీ కలిగేది కాదు. ఈ అడవి దొంగల పాలయ్యే వాళ్ళమూ కాదు" అనింది.

"వాళ్ళు ఔత్తరాహిక చోరులు. సమూహాలుగా దొంగతనాలు చేసేవారు. ప్రజల ప్రాణాలను అనవసరంగా తీసుకోరు. వాళ్ళకు విలువైన వెండి బంగారం వస్తువులు మాత్రమే కావాలి. సుల్తాను అసమర్థ పాలన గమనించి, అక్కడనుంచి ఇక్కడకు దోపిడీలకు వచ్చినవారని విన్నాను. పది మందే కాదు వందమంది వచ్చినా భయమేమీ లేదు. బాగా పొద్దుపోయింది. అందరం ఇవాళ్టికి ఇక్కడే భోజనాలు కానిచ్చి రేపు ఉదయం బయలుదేరుదాం! విచారించకండి. విపత్తులను తట్టుకోగలగడమే వీరుల లక్షణం. నాకు తగిలిన ఈ చిన్న గాయానికి విచారించకండి. త్వరలోనే

నయం కాగలదు. మా బాధ్యత మేము నిర్వర్తించాం" అని అన్నాడు. శ్రీకార్యానికి ఇక మాట్లాడడానికి ఏమీ లేక అలా చూస్తూ మౌనంగా ఉండిపోయింది.

భోజనాదులు అయ్యాక, వల్లభుడు, ప్రక్కపై దొర్లుతూ, మళ్ళీ మధురాంగిణి తలపుల్లో తడుస్తున్నాడు. యువరాణి గతంలో తనను "వీరుడా! అని సంబోధించింది. ఆమె తన కోరికను సగం కోరిక, సగం ఆజ్ఞలా బయటపెట్టింది. ఇప్పుడు ఇంతజరిగినా ఆ శ్రీకార్యంచేత క్షమాపణ చెప్పించింది తప్ప తను మాట్లాడలేదు. ఆమె కోరికమీదనే ఈ అడవిలో ఆగడం జరిగింది. ఇంత గొడవ జరిగినా తన ప్రాణం కాపాడుకుందే తప్ప తన బాగోగులు అడగలేదు. కనీసం గాయాలయ్యాయా! అని కూడా విచారణ కూడా చెయ్యలేదు. అసలు అమ్మ చెప్పినట్లు ఈ ప్రేమలు దోమలూ ఒక మిధ్య మాత్రమే! తనకు ఏం ప్రత్యేకత ఉందని తన్ను ఆమె ప్రేమించాలి? రాజ్యమా? లేక రాజాధికారినా? అనవసరంగా నేనే లేనిపోని ఆశలకు లోనయ్యాను" అని పడకపై దొర్లుతుండగా దత్తుడు గమనించి వచ్చి ప్రక్కనే కూర్చొన్నాడు "నీ బాధ నాకు తెలుసు మిత్రమా! నీవల్ల నేను కూడా వీరుడనయ్యాను ఇవాళ!" అనగానే "లేదు దత్తా! నీవూ వీరుడవే! సమయాసమయాలు కలిసివస్తేనే ఎవరైనా వీరుడని నిరూపణ జరుగుతుంది. లేక పోతే అందరూ ఉత్తరకుమారులుగానే భావింపబడతారు." అని పెద్దగా నవ్వాడు. "మిత్రమా! నువ్వు పైకి నవ్వుతున్నా నీ బాధ అర్థంచేసుకోగలను. ఏకారణంచేతనో యువరాణి నీతో మాట్లాడడంలేదని అనిపిస్తున్నది. మొన్న కోటలో అంత బాగా పలకరించింది కదా! మునుపు సత్రంలో కూడా సంకేత సందేశాలు నీకు మాత్రమే పంపింది కదా! విచారించకు. చివరకు కథ సుఖాంతమే అవుతుందని నేననుకుంటున్నాను" అనగానే దత్తుణ్ణి కౌగలించుకుని "నా మనసు తెలిసిన ఒకే ఒక మిత్రుడవు నీవే దత్తా!" అంటూ అలాగే ఉండిపోయాడు.

మరుసటి రెండు రోజులు ప్రయాణం ప్రశాంతంగానే సాగింది. నాల్గవరోజు గత మూడురోజుల క్రితం జరిగిన ఔత్తరాహికుల పోరులో భుజంపై తగిలిన చిన్న కత్తిదెబ్బ బాగా వాచి జ్వరం వచ్చింది. ఆకుపసరు వైద్యం చేసినప్పటికి నొప్పి పూర్తిగా తగ్గలేదు. పరివారాన్ని ఆపమని యువరాణి ఆదేశానుసారం శ్రీకార్యం ఉత్తరువులు జారీ చేసింది. ఒక మంచి చదునైన ప్రదేశం చూసి గుడారాలు వేశారు. వల్లభుడు అస్వస్తతకు గురవడంతో దత్తుడు జాగ్రత్తగా గుర్రంపై పరివారం చుట్టూ తిరుగుతూ పహరా కాస్తున్నాడు. రాత్రి ఏడుగంటలకే భోజనాదులు కానిచ్చారు. శ్రీకార్యం వల్లభునికి సపర్యలు చేస్తూ పథ్యం పెట్టింది. నొప్పి కొంత తగ్గినప్పటికి ఇంకా భుజంపైన గాయం సలుపుతూనే ఉంది. జ్వరతీవ్రతతో కలవరింతలు మొదలయ్యాయి. దత్తుడు ప్రక్కనే ఒక బండనానుకుని అలసిపోవడంతో కలత నిద్రలో ఉన్నాడు. ఎప్పుడు ఏ ఆపద ముంచుకొస్తుందో అన్న భయం అతన్ని వెంటాడుతూనే ఉంది.

అర్ధరాత్రి సమయంలో తల్లి వాసంతిక రాజవల్లభునికి పదే పదే కళ్ళముందు కనిపిస్తున్నది. “వల్లభా! నేను అప్పగించిన కార్యం పూర్తయినదా? దారితప్పలేదు కదా? ఇంకా తిరిగి రాలేదేమిటి?” అంటూ కలలో పదే పదే ప్రశ్నిస్తున్నది. వల్లభుడు “లేదమ్మా! లేదు…దారి తప్పలేదు..చేరుకున్నాం. నీవప్పగించిన కార్యం పూర్తి చేశామమ్మా..” అంటూ కలవరిస్తూ, అంతలో మెలుకువ రావడంతో ఠక్కున కళ్ళు తెరిచాడు. ప్రక్కన దత్తుడు లేడు. గుడారాల సంరక్షణ బాధ్యతపూర్తిగా తీసుకున్నందుకు దత్తుడికి ఏమిచ్చి ఋణం తీర్చుకోగలను? అనుకుంటూ గొంతెండి పోయినట్లనిపించడంతో “దాహం.. దాహం! అన్నాడు. అక్కడ

ఐదారు అడుగుల దూరంలో ఎవరో దేవతాస్త్రీ నిలబడి తననే గమనిస్తూ ఉన్నది. నిజమా! లేక కలవరింతల్లో ఉన్నానా? అనుకుంటూ కళ్ళు నులుముకొని చూశాడు. ఆ స్త్రీమూర్తి గాలిలో తేలుతున్నట్టనిపించింది.

"ఎవరు నువ్వు? గంధర్వ కన్యవా? అప్సరసవా?" అని నీరసంగా ప్రశ్నించాడు. జవాబులేదు. మళ్ళీ కళ్ళు నులుముకొని జాగ్రత్తగా గమనిస్తే రాకుమారి మధురాంగిణి వలె కనిపిస్తోంది. గుడారంలోనుండి బయటకు ఎలా రాగలిగింది? అంతమంది దాసీజనమధ్యంలో ఉన్న యువరాణి, గుడారంలోనుండి ఎలా బయటకు వస్తుంది. వచ్చినా శ్రీకార్యం ఊరుకుంటుందా? ఆమెకాదు. ఈమె ఎవరో..తెలియాల్సి ఉంది. ఆమె గబగబా బయటకు వెళ్ళి కుండలో నున్న నీటిని ఒక ముంతలో ముంచి తీసుకుని వచ్చి ఎదురుగా నిలబడింది. ఎవరీమె? ఇంతకుముందెన్నడో చూసినట్లే ఉంది అనుకుంటూ ఉండగా ఆమె "ఆశ్చర్యం తర్వాత. ముందు నీటిని త్రాగి సేద తీరండి!" అనింది. అది ఆజ్ఞా? హెచ్చరికా? ప్రేమవాక్యమా? అర్థం కాకపోయినా మంత్రముగ్ధుడై మంచి నీళ్ళు తీసుకుని గటగటా త్రాగాడు. అప్పుడు శరీరం స్వాధీనంలోకి వచ్చినట్లయింది.

"మీరు...మీరు..రాకుమారే కదా? ఇక్కడ..ఇక్కడ..ఎలా? ఎలా?"

"మీరు త్రాగిన నీరు సాక్షిగా నేనే!"

"లేదు రాకుమారీ..నా శరీరం స్వాధీనంలో లేదు. నేను కలవాస్తవాల మధ్య కొట్టుమిట్టాడుతున్నాను. క్షమించండి..అందుకే ఇలా అడుగుతున్నాను"

"క్షమించాల్సినంత తప్పు మీరేమీ చేయలేదు లెండి" అంటూ ప్రక్కన దత్తుని పడకపై కూర్చున్నది.

"ఇప్పుడు స్పష్టంగా తెలుస్తోంది. రాకుమారీ..మీరే..మీరే.."

"ష్!....అరవకండి. పరిజనం లేస్తారు. తొలి ఝాముకు ఇంకా సమయం ఉంది."

"నేను నమ్మలేకపోతున్నాను. మీరు నా ప్రక్కన కూర్చోవడం..నాతో ఇంత ఇదిగా మాట్లాడడం.. ఎలా సాధ్యం?"

"ఎందుకు సాధ్యం కాదు వల్లభా? నా స్వంత కోరికలను..నేను స్వయంగా చేయాలనుకున్న పనులను ఎవరూ ఆపలేరు"

"నేను ధన్యుణ్ణి...ధన్యుణ్ణి..ఇంతకాలం నాలో ఉన్న అనుమానాలు..శంకలు పటాపంచలయ్యాయి..ధన్యుణ్ణి..ధన్యుణ్ణి.. అని గొణుక్కుంటూ ఉండగా కళ్ళు మూతలు పడ్డాయి.

మూడు రోజుల్లో గాయంమాని జ్వరం పూర్తిగా తగ్గిపోయింది. మునుపటి స్థితిలో పడ్డానని సంతోషిస్తున్నాడు వల్లభుడు. నాల్గవరోజు ముల్వై శివార్లలోకి ప్రవేశించారు. శ్రీకార్యం, విచారణ జరిపి, దత్తుణ్ణి పిలిచి "అదుగో శివాలయం! ప్రక్కన ఉన్న వైద్యశాలలోని భిషక్కును నేను రమ్మన్నానని చెప్పు!" అంది. అక్కడి ప్రధాన వైద్యుడు వచ్చినవారెవరో తెలుసుకున్న మీదట ఆగమేఘాలుమీద వచ్చి చేరాడు. నాడీ పరీక్ష జరిపిన తర్వాత ఇంకా కొంచెం రూక్ష పీడిస్తున్నదని చెప్పి, వెంట ఉన్న సహాయక భిషక్కులను పిల్చి కొన్ని గుళికలు, ఒక సీసాలో ద్రావకం యిప్పించి, నిత్యం తాగితే మూడు రోజుల్లో పూర్తి స్వస్థత వస్తుందని చెప్పి వెళ్ళాడు.

ప్రయాణం సత్యమంగళం వేపు సాగుతున్నది. వల్లభుడు దత్తునితో గతంలో జరిగిన విషయం చెప్పి "ఇది కలా? లేక నా అనుభూతా? తెలియడంలేదు మిత్రమా!" "నీకు నిజంగా రూక్ష వచ్చాక, నీ మతి మతిలో లేదు మిత్రమా! ఎన్నో కలవరించావు. మీ అమ్మగారితో మాట్లాడావు. మీ

బంధు జనంతో ముచ్చటించావు. నేను అన్నీ గమనిస్తూనే ఉన్నాను. సంధి మాటలని తెలిసినా ఏమీ చెయ్యలేని స్థితి. అదొక మానసిక వైక్లబ్యమేమో అనిపించింది. ఏది ఏమైనా మళ్ళీ త్వరలోనే స్వస్థత చేకూరింది. సంతోషం!"

"మరి నేను చూసింది కలేనంటావా?"

"కాకపోతే..పాండ్య యువరాణి నీవు జ్వరపడ్డావని, నీకు దాహం వేసిందని స్వయంగా వచ్చి మంచి నీళ్ళు ఇవ్వడం సాధ్యమా! ఇప్పుడు ఆలోచించి చెప్పు?"

"నిజమే! ఎవ్వరూ ఆమె నా వద్దకు రావడం చూడలేదంటావా?"

"అసంభవం మిత్రమా! పగటి కలకాదు. సంధి కల మాత్రమే!"

ఆ మాటలకు ఇంతవరకూ ఆనంద పారవశ్యంలో తేలిపోతున్న వల్లభునికి నోట మాట రాలేదు. నిజమే ప్రేమలో మునిగిన వారికి ఇలాంటి అనుభవాలు తప్పనిసరిగా జరుగుతూ ఉంటాయేమో! దత్తుడు చెప్పినది నిజమే కావచ్చు అని ఆలోచిస్తుండగా హై..హై..హై..అనే శబ్దాలు బిగ్గరగా వినిపించాయి.

ఒక పల్లకీ వచ్చి తనముందు నిలిచింది. పల్లకీ పరదాలు తొలుగుతుండగా వల్లభుడు రాకుమారి కోసం ఆనందంగా చూశాడు. కానీ పల్లకీలోనుండి ఒక చెలికత్తె దిగి "మిమ్మల్ని సత్యమంగళం వెళ్ళమని రాజభవనం పరిచారికాధికారి చెప్పమన్నారు" అనగానే ఎంతో ఆశగా రాకుమారికై ఎదురుచూస్తున్న వల్లభునికి చెలికత్తె ఆదేశాలు నిరుత్సాహ పరిచాయి.

"నాకు సత్యమంగళం వెళ్ళడానికి పల్లకీ ఎందుకు?"

"అయ్యా! మీరిప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. మీరు ప్రయాణంలో

అలసటకు గురికాకూడదని ఈ ఏర్పాటు" అని చెప్పింది. 'ఏర్పాటు బాగానే ఉంది కానీ.. ఈ ఏర్పాటు రాజకుమారి మీకోసం చేసిందని ఒక్కమాట అని ఉంటే ఎంత సంతోషమయ్యేది?' అని మనసులో బాధపడ్డాడు. పైకి ఏభావమూ కనబరచకుండా "అలాగే! ధన్యవాదాలు" అని ముక్తసరిగా చెప్పి, లోపలి బాధ ఏమాత్రం బయటకు వె ళ్ళగ్రక్కకుండా ఆమెను పంపించి వేశాడు. ఇదంతా దత్తుడు మాత్రం పసిగట్టకపోలేదు. తమవెంట రావడానికి ఇరవై మంది అశ్వికులు సిద్ధంగా ఉన్నారు. దత్తుడు మరో అశ్వంపై రాగా సత్యమంగళానికి పయనం సాగుతూ ఉంది.

వారిలో ఒక సైనికాధికారి ముందు ఉండి నడిపిస్తున్నాడు. ముందు పది అశ్వాలు, వెనుక పల్లకీ, ఆ వెనుక పది మంది అశ్వికులు సాగుతూ ఉండగా.. సైనికాధికారిని పల్లకీ ప్రక్కకు రమ్మని సైగచేసాడు వల్లభుడు. "మనం ప్రస్తుతం కొంగు రాజ్యానికి వెళ్ళడంలేదు కదా! ఆ ప్రదేశం ఇప్పుడు కూడా మధురై సుల్తానుల ఆధీనంలో లేదా? అక్కడి ప్రజలు సుల్తానుకు పన్ను కడుతున్నారని విన్నాను. ఇలాంటి సమయంలో విజయనగర సైనికులు, అశ్వికులు కనిపిస్తే ప్రమాదం కదా! యుద్ధానికి మనమే కాలుదువ్వినట్లవుతుందేమో! ఇంతమంది అశ్వికులు హంగామా..హడావుడి అవసరమా!" అన్న ప్రశ్నకు, సైనికులు అందరూ ఒక్కసారి సైనికాధికారి వైపు చూశారు. వల్లభునికి విషయం అర్థం కాలేదు.

"రాజవల్లభులవారికి ఈ మధ్య జరిగిన సంఘటనలు తెలీనట్లున్నది" అని ఒక అశ్వికుడు అంటూ ఫక్కున నవ్వగానే, సైనికాధికారి మాట్లాడవద్దు అన్నట్లు "ష్.." అని సైగచేసి "వల్లభా! శంభువరాయుని ఓటమి తమరెరిగనదే

కదా! వెంటనే కొంగురాజ్యాధిపతి, ఇక తాము సుల్తానుల పాలనలో ఉండడంలేదని ప్రకటించి, ఇకపై తమ ప్రభువులు, చక్రవర్తి విజయనగరాధీశులే అని ప్రకటించి, రాజ్యం వారికి పన్ను కడుతుందని, ప్రజలంతా ఈ మార్పు గమనించాలని ప్రకటనలు జారీ చేశాడు.

విన్న వల్లభుడు పరమానంద భరితుడయ్యాడు. ఆహా ఇక కలనెరవేరే రోజు ఎంతో దూరంలో లేదు. శ్రీరంగనాథుడు శ్రీరంగం చేరాడానికి సమయం దగ్గరలోనే ఉంది. గోపన్న చేసిన ప్రతినలోని ఆంతర్యం..అంతరార్థం బోధ పడింది అని సంతోషిస్తూ ఉండగా అధికారి "ఇప్పుడు మన వరాహ రాజముద్రిక అన్నిచోట్లా చెల్లుతుంది. ఈ భూమి యావత్తూ విజయనగరానిదే అవుతుంది" అని చల్లని వార్త చెప్పాడు.

"ఆహా! ఎంత ఆనందంగా ఉంది. నా రాజ్యం స్వాతంత్ర్యం పొందింది. ఎంత గర్వంగా ఉంది" అని అన్నాడు. "రాజవల్లభా! మీకే కాదు. మాకూ గర్వకారణమే! కానీ..." అని ఆగగానే వల్లభుడు "కానీ.. ఏమైంది? ఏమైనా విపత్తా? చెప్పండి!" అనగానే అధికారి "మన మన పాండ్య రాజ్య ప్రయాణాన్ని కొద్దిరోజులు గడువు తీసుకుంటున్నాం" అన్నాడు. "గడువా? ఎందుకు?" అన్న ప్రశ్నకు, అధికారి "తొండై మండలాన్ని, కొంగు రాజ్యాన్ని, సుల్తాను ఒకేసారి పోగొట్టుకున్నాడు. కాబట్టి సుల్తాను ప్రతిచర్యలు, ప్రతిక్రియ గమనించి అడుగులు వేయవలసి ఉందని మాకు ఉత్తర్వులు అందాయి. అందుకే ఈ ప్రదేశ రక్షణార్థం కొంత సైనిక బలాన్ని ఇక్కడ ఉంచాం. మనం వెళ్ళబోయే మార్గం సురక్షితమైనదా లేదా తెలుసుకోవడానికి కొంతమంది రహస్యచారులను ముందుగా పంపించాం. ఒకవేళ సురక్షితమని వార్తలు వస్తే మనం ఇక అంత శ్రమపడి మళయాళ

ప్రాంతం నుండి వెళ్ళవలసిన అగత్యం లేదు. దగ్గరిదారైన కొంగు రాజ్యం నుండి వెళ్ళవచ్చు. ఇవన్నీ మాకు ఎప్పటికప్పుడు చారులు ప్రతిరోజూ అర్ధరాత్రి కలుసుకుని పరిస్థితులను ఎప్పటికప్పుడు వివరిస్తూ ఉంటారు, ఆవిధంగా మండలాధీశుడు కంపనతో సంప్రదించి, మహాసేనాని గోపన్న మా కదలికలలను ఎప్పటికప్పుడు నిర్దేశిస్తూ ఉంటారు.

ప్రయాణం సాగుతూ ఉంది. నాలుగురోజుల ప్రయాణం తర్వాత వారు సత్యమంగళం చేరుకున్నారు. తన మాతృభూమికి ఎంతో కాలం తర్వాత చేరుకున్న వల్లభదత్తులకు ఎంతో సంతోషంగా ఉంది. తన నేల మీద అడుగిడిన అనంతరం అక్కడి పచ్చని చెట్లను, పూలను, పండ్లను చూస్తూ పరవశించిపోయాడు. ఎంతకాలమైంది ఇక్కడి మట్టివాసన చూసి, అనుకుంటూ ఉండగా కళ్ళలో నీళ్ళు తిరిగాయి వల్లభునికి. తన తల్లికి తనంటే ఎంత ప్రేమ, వాత్సల్యం. ఇంత కాలం వాటిని పొందకుండా దూరంగా ఉన్నందుకు ఒక్కసారి బాధ కలిగింది. ఎదురుగా ఉన్న ఆలయ ధ్వజస్థంభం, గోపురాన్ని చూసి, అక్కడ తను చిన్నతనంలో ఆడుకున్న సందర్భాలు గుర్తొచ్చి, అదో భావనలో ఉండిపోయాడు. దత్తుడు “మిత్రమా..దగ్గరలోనే మీ ఇల్లు..ఏమాలోచిస్తున్నావు? ఇంకా మధురాంగిణి ఆలోచనలు వీడలేదా!” అని భుజంపట్టి ఊపాడు. దూరంగా తిరుగుతున్న సత్యమంగళ ప్రజలను సంతోషంగా ఆసక్తిగా పరికించాడు.

పల్లకీ తన ఇంటిముందు ఆగగానే ఒక్క గెంతుతో పరదాను తొలగించుకుని దూకాడు. కళ్ళలో నీళ్ళు ధారాపాతంగా కారిపోతున్నాయి. దత్తుడు విచిత్రంగా పరికిస్తున్నాడు. మెట్లెక్కి “అమ్మా!” అని పిలిచాడు. జవాబులేక పోయే సరికి ఒక్కసారి పెద్దగా “అమ్మా..నేను వచ్చేశాను..”

అని బిగ్గరగా అరిచాడు. తులసిచెట్టుకు పూజ చేస్తున్న తల్లి ఎవరా వచ్చిందని లేచి వచ్చింది. దూరంగా గడ్డంతో మీసాలతో ఉన్న వ్యక్తి ఎవరా అని ఆలోచిస్తూ చూసింది. వల్లభుడు ''అమ్మా నేను రాజ వల్లభుణ్ణి! గుర్తుపట్టలేదా!'' అనగానే, తల్లి వసంతిక ఒక ఆవు, దూడ వద్దకు వచ్చినట్టుగా పరుగు పరుగున వచ్చింది. ఆమె నేత్రాలు సజలమయ్యాయి. ఆమె వయసువల్ల, సరైన పోషణ కరువైందన్నట్లుగా కొంచెం నీరసించి చిక్కిపోయి ఉంది. అంత బలశాలిగా యౌవనం మూర్తీభవించిన కుమారుణ్ణి చూడగానే ఎంతో సంతోషం మొహంలో మెరిస్తుండగా "నాయనా వల్లభా! నా కలనెరవేరిందా! శ్రీరంగనాథుణ్ణి కనుగొన్నావా? తండ్రీ!" అంటూ నిలబడిపోయింది.

"అవునమ్మా! నీ ఆజ్ఞ నెరవేర్చాను. శ్రీరంగనాథుణ్ణి ఎన్నో ప్రయాసలకోర్చి కనుగొన్నాను"

"నాయనా! నా తండ్రీ! ఇది నిజమా! నీవు కనుగొన్నావా? నిజంగానే!"

"అవునమ్మ సత్యమే చెప్తున్నాను. శ్రీరంగనాథుణ్ణి అంజనాద్రి అడవుల్లో కనుగొనడమే కాదు. ఆయనకు తిరిగి పూజా పునస్కారాలు జరిగే పవిత్ర స్థలానికి చేర్చాను"

"మన శ్రీరంగనాథుడు ఇప్పుడెక్కడ నాయనా?"

"తిరుపతిలో కొలువుతీరి ఉన్నాడమ్మా! పూజలేకాదు. తమిళ దివ్య ప్రబంధ గానం కూడా జరుగుతున్నది. అవన్నీ నీకు తీరిగ్గా తెలియజేస్తాను. మొదట నీవెలా ఉన్నావో చెప్పు. నేను ఎక్కడ తిరుగుతున్నా నీ ఆజ్ఞ నాకు నిత్యం వినిపిస్తూనే ఉండేది. అందువల్లనే నేను విజయం సాధించాను."

దూరంగా నిలబడ్డ దత్తుడిని చూసి దగ్గరకు రమ్మని సైగచేసి ఇద్దరిని కౌగలించుకుని "శ్రీరంగనాథుని ఆశీస్సులు మీకు పుష్కలంగా ఉన్నాయి. అందుకే ఇంతటి విజయం సాధించి కూడా చాలా సామాన్యంగా ఉన్నారు" అంది. ఆమె భర్త కులశేఖరుని చిత్రపటం వద్దకు వారిని తీసుకుని వెళ్ళి నిలబెట్టి "స్వామీ! మీ పుత్రుడు కూడా మీలాగే సాహసవంతుడు. ధైర్యశాలి! ఇప్పటివరకూ మీ చివరి కోరిక సగం మాత్రమే నెరవేర్చాడు. మిగిలిన సగం కూడా నెరవేరాలని ఆశీర్వదించండి." అని వలవల ఏడ్చింది. "అమ్మా! నీవేం దిగులుపడవద్దు. మేము ఆపనిలోనే ఉన్నాం. నీకొక ముఖ విషయం చెప్పాల్సి ఉంది. ముల్వై సంస్థానాధీశుడైన కంపమహారాజు మాకు కొన్ని ముఖ్య బాధ్యతలను ఒప్పజెప్పాడు. ఈ కార్యం మధురై ముట్టడికి పూర్వమే జరిగిపోవాలి. మధురైని జయిస్తే కానీ శ్రీరంగనాథుని ప్రతిష్ఠ జరపలేము. ఇన్ని చిక్కుముళ్ళున్నాయి. నీవేమీ అధైర్య పడవద్దు. కంపన మహారాజు వద్ద గోపన్న అనే మహాసేనాని ఉన్నాడు. ఆ వీరుడు ఒక్కడు చాలు! సుల్తాను తలతెగి నేలమీద పడేరోజు దగ్గరలోనే ఉంది"

జరిగినదంతా వివరించిన తర్వాత వాసంతిక నిట్టూర్చి "నాయనా! రాజుల జీవితము కత్తిమీద సాము వంటిది. ఇటు తమ ప్రాణాలతో పాటుగా ప్రజల ప్రాణాలను కాపాడడం వారి విధి. అన్నీ తెలిసే నేను మీ తండ్రి కులశేఖరుల వారిని వివాహం చేసుకున్నాను. వారే జీవించి ఉంటే నీకు కూడా ఏదో ఒక పదవి దక్కి ఉండేది. మనం కూడా పెద్ద పెద్ద రాజభవనాల్లో ఉండేవాళ్ళం. విధి వక్రించింది. ఆయన చివరి రోజుల్లో నా కోసం చాలా దిగులుపడి చనిపోయాడు. చివరి రోజు కూడా నాక్షేమం కోసం, కడుపున బడ్డ నీ క్షేమం కోసం విలపించి ప్రాణాలు వదిలారు. వల్లభా! గతంగతః

ఏది ఏమైనా ఇదంతా శ్రీరంగనాథుని అనుజ్ఞ ప్రకారమే జరుగుతున్నదని నాకు అనిపిస్తున్నది. ఇప్పటి వరకూ ఆయనే చూసుకున్నట్లుగా ఇక మీదట కూడా మీకు ఆయనే రక్ష! "ఓం నమో నారాయణాయ!" అనే మంత్రం కష్టాల్లో ఉన్నప్పుడే కాదు. అన్నీ సంతృప్తికరంగా ఉన్నప్పుడు కూడా జపించు! శుభం! వెళ్ళిరండి! శ్రీరంగంలో శ్రీరంగనాథుని విగ్రహం ప్రతిష్టించేవరకూ నాదొక ఆజ్ఞ అని కాకుండా , తల్లి నీక్షేమం కోరి కోరుతున్న కోరిక అనుకో! నీ ఇష్టం.

"ఏమిటో చెప్పమ్మా! నీ ఆజ్ఞ మీరను!"

"శ్రీరంగనాథుడు ప్రతిష్టితమైన పిమ్మటే నువ్వు వివాహం చేసుకోవాలని" అంటూండగా "నీ మాట జవదాటడీ వల్లభుడు! ఆ శ్రీరంగనాథుని మీద ఆన! సంతోషంగా ఉండు తల్లీ..." అంటూ చేతిలో చెయ్యివేసి ప్రమాణం చేసి, పాదనమస్కారం చేసి బయలుదేరాడు. వాసంతిక గ్రుడ్లనిండా నీళ్ళతో చూస్తూ వాకిట్లో నిలబడి పల్లకీ కనుమరుగయేంత వరకూ చూస్తున్నది.

ఇద్దరు యువకులు సత్యమంగళం నుండి బయలుదేరి నాలుగు రోజుల్లో యువరాణి మధురాంగిణి పరివారం బసచేసి ఉన్న ముల్వై నగరానికి చేరుకున్నారు. అక్కడ వారితో రెండు రోజులు గడిపి చుట్టుప్రక్కల చూడవలసిన గుళ్ళు, గోపురాలు, అందమైన ప్రదేశాలు దర్శించిన తర్వాత అంతా పాండ్యరాజ్యానికి బయలుదేరారు. అందరూ చర్చించుకుని, వచ్చిన వర్తమానం ప్రకారం, నీలగిరి పర్వతాల ప్రక్కనే ఉన్న కొంగురాజ్య సరిహద్దులగుండా వెళ్ళడం శ్రేయస్కరమని, కొంచెం అక్కడక్కడా కొండలూ గుట్టలూ ఉన్నప్పటికి ఆదారి దగ్గర దారని అందరూ ఏకాభిప్రాయానికి

వచ్చి బయలుదేరారు. రెండు రోజులు ప్రయాణం చిన్నచిన్న గుట్టలమీదుగా సాగింది. మూడో రోజు చాలా పెద్దదైన నీలగిరి కొండ ఎక్కల్సి వచ్చింది. ముందూ వెనుక సాగే అశ్వవీరుల మధ్య యువరాణి పల్లకీ సాగుతోంది. ఆ కొండ ఎన్నెన్నో మెలికలు తిరిగి ఒక మహాసర్పాన్ని తలపిస్తున్నది. ఎక్కడం అందరికి సంకటంగానే ఉన్నా, వల్లభునికి మాత్రం అందాన్ని పంచడానికి కారణం వేరే ఉంది. మెలికలు తిరిగినప్పుడల్లా పల్లకీ పరదాలు ప్రక్కకు తెరుచుకుని ఆమె ముఖారవిందం కనిపిస్తోంది. ఆమె కనిపించి మందస్మిత వదనంతో వల్లభుణ్ణే చూస్తున్న అనుభూతి కలిగేది. నాలుగు రోజులనుండి ఆమె మాట వినకపోవడం వల్ల కొంచెం బాధగానూ ఉంది. కొంచెం వెనకగా దత్తుడు చిరునవ్వుతో వల్లభుణ్ణే గమనిస్తూ అశ్వం నడపడం వల్లభుడు గమనించకపోలేదు. ఒక అరంగంట ఆగి అందరూ దాహం తీర్చుకుని బయలుదేరిన పది నిముషాల్లో ఎక్కడో మదపుటేనుగుల ఘీంకారం వినిపించింది. ప్రయాణం ఠక్కున ఆగింది. అందరూ కళవెళ పడి చూస్తున్నారు. రెండు నిముషాల వ్యవధిలో ఘీంకారాలు దగ్గరై రెండు పెద్ద పెద్ద మదపుటేనుగులు పరివారం ముందుకొచ్చి ఘీంకారాలు చేయడంతో అశ్వాలు ముందు రెండు కాళ్ళు పైకెత్తి సకిలిస్తున్నాయి. కొందరు అశ్వికులు పట్టుదప్పి బొక్కబోర్లా క్రింద పడ్డారు. మరికొందరు వెనుకనున్నవారు వెంటనే అశ్వాలను దిగి యువరాణి పల్లకీ సంరక్షణార్థం పరుగులు తీశారు. కొందరు ధైర్యంగా ముందుకొచ్చి వాటిపై శూలాలు విసిరారు. కొందరు వెంటనే దివిటీలు వెలిగించి వాటిని భయపెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ అవి ఒక అంగుళం కూడా వెనక్కు పోలేదు సరికదా మరింత ముందుకు దూసుకుని వస్తున్నాయి. ఈలోగా బృందం

చెల్లాచెదురయ్యింది. అందరూ పొలోమని ప్రాణాలరచేత పట్టుకుని పరుగులు తీశారు. వల్లభుడికి అక్కడి పరిస్థితిని అదుపుచేయడానికి ఏమాత్రం వీలుకాలేదు. కొంచెం వెనుకగా వెళ్ళి మధురాంగిణి సంరక్షణకై పరుగులు తీస్తున్నాడు. పల్లకీ ఎక్కడో కూడా కనిపించకుండా దుమ్ము ధూళి ఆ ప్రాంతమంతా నిండిపోయాయి. ఆమె పల్లకీని మోస్తున్న బోయీలు, ఇక ఏమాత్రం లభంలేదని, ప్రాణాలు పోవడం ఖాయమని నిర్ణయించుకొని పల్లకీని దింపి "యువరాణీ..పల్లకీ దిగండి..పారిపోండి. పల్లపు ప్రాంతానికి వెళ్ళిపోండి. తర్వాత కలుసుకుందాం" అని కేకలు పెట్టి వెళ్ళిపోయారు. ఆ కేకలకు యువరాణీ పల్లకీ దిగి దిక్కులు చూస్తుండగా వల్లభుడు ఆమెను చేరుకుని "యువరాణీ ఇటు ఇటు దొర్లండి. లోతట్టు ప్రాంతం..చెట్లూ ముళ్ళూ లేవిక్కడ దొర్లండి త్వరగా.." అన్నా సరే భయపడిపోయి చూస్తూ ఉండగా "నేనూ దొర్లుతున్నాను భయంలేదు. రండి" అంటూ ఆమె నడుము పట్టుకుని చరచరా లోయలోకి లాగి, ఆమెతో సహా జర్రున జారాడు. వెనుకగా ఆమె జారుతున్నది. ఒక దట్టమైన చెట్లపొదల గుండా ఒక పల్లపుప్రాంతానికి దిగిపోయారిద్దరూ.

ఆమె కొంతసేపటికి లేచి దగ్గరలో ఉన్న చిన్న జలాశయంలో వళ్ళు శుభ్రపరచుకొని నిలబడింది. ఆమె మౌనంగా ఎందుకున్నదో అర్థం కాలేదు. తను చనువు తీసుకుని ఆమె నడుము పట్టుకున్నందుకు కోపమా? ఆమె తనలాంటి వారితో మాట్లాడ్డం తగదని అనుకుంటున్నదా? పరిపరివిధాల ఆలోచిస్తున్నాడు. కానీ శరీరం మాత్రం అతని అధీనంలో లేదు. పువ్వు వంటి మెత్తని ఆమెశరీరం తాకిన ఆ మధుర స్మృతిని స్పర్శను మరచిపోలేక పోతున్నాడు. ఇంతలో ఆ మధురోహలనుండి బయటకు

వచ్చి "యువరాణీ! మీరు ఆ కనపడుతున్న పెద్దబండను ఎక్కి కూర్చోండి. మృగాలు ఏమీ చేయలేవు. నేను అక్కడ ఏమి జరిగిందో.. మనవారంతా ఎలా వున్నారో చూసి మరలా వస్తాను. ఎట్టి పరిస్థితులలోను నేను వచ్చేవరకూ ఆ బండ దిగకండి" అని ఆమె వైపు చూడడకుండా నేల చూపులు చూస్తూ పైకి ఎక్కసాగాడు.

పైకి ఎక్కిన వల్లభునికి ఎక్కడా తమవారి జాడ లేనే లేదు. ఏమిటి కర్తవ్యం? ఈ రాత్రి ఎక్కడ ఎలా గడపాలి? అని ఆలోచిస్తూ ఉండగా అక్కడ దగ్గరలో పకపకా నవ్వులు వినబడ్డాయి. ఇంత దట్టమైన అడవిలో నవ్వులా? దయ్యాలు కాదుకదా? అనుకుంటూ అటు చూసే సరికి, ఒక యుక్తవయసు కోయ స్త్రీ, పురుషుడు కౌగలింతలతో పరవశం చెందుతున్నారు. వల్లభుణ్ణి చూడగానే కోయస్త్రీ చటుక్కున లేచింది. కోయ యువకుడు నవ్వుతూ లేచి "దొరా! దండాలు. మేము ముదవ జాతి కోయవాళ్ళం. ఏమైంది? ఇందాక ఏదో ఏనుగుల అరుపులు పెద్దగా వినిపించాయి. ఆ ముదనష్టపు ఏనుగులు అందరిని తెగ బాధిస్తున్నాయి. కానీచూస్తూ..చూస్తూ ఆ జీవాలను చంపలేము కదా! వాటివీ మనలాంటి పేణాలే గదా!" అని వల్లభుని వంక చూశాడు. "అవును! వాటి వల్లనే అడవిలో ప్రయాణిస్తున్న మేము ఇలా చెల్లాచెదురయ్యాము. రాత్రవుతున్నది. ఎక్కడ బస చెయ్యాలో తెలియడంలేదు. నాతో ఒక స్త్రీ కూడా ఉంది" అనగానే కోయస్త్రీ వాణ్ణి వెనుకనుంచీ కౌగలించుకొన్నది. "ఎహె! వూర్కేవో..సరసాలు..వాళ్ళేందో ఇబ్బందుల్లో ఉన్నారు" అని తియ్యగా కసురుకొన్నాడు. ఆమె తియ్యగా గలగలా నవ్వింది. ఆ నవ్వుకు మళ్ళీ మధురాంగిణి గుర్తుకొచ్చింది. తను, మధురాంగిణి ఆ కోయజాతి వారిలా

స్వేచ్ఛగా విహరిస్తున్నట్లు ఊహరాగానే.. వల్లభుడు కూడా నవ్వేశాడు. "దొరా! మేము మీ విశ్రాంతికి ఏర్పాట్లు చేస్తాము. భయపడమాకండి. రెండు గుహలున్నాయి మనకోసం. హాయిగా విశ్రాంతి తీసుకోండి. ఎవ్వరూ రాకుండా పెద్ద బండలడ్డు పెట్టుకుందాం" అనగానే కోయ జాతి స్త్రీ వాణ్ణి చూసి కన్నుకొట్టింది. "నువ్వాగవే! పొద్దుగూకులూ నీకదే రంధి!" అని గుహలోకి తీసుకుని వెళ్ళారు. యువరాణీ, వల్లభుడు కొంచెం బిడియపడుతూ లోనకు ప్రవేశించారు. రెండు గుహల్లో వేపనూనెతో చేసిన దివిటీలు వెలిగించి "భయం లేదు..దొరా..నీ భార్య నువూ ..ఇద్దరూ.. ఈడ.. చెప్పలేనంత సుఖం అనుభవించొచ్చు" అన్నాడు. వల్లభుడు ఉలిక్కిపడి "తప్పు! తప్పు! ఆమె యువరాణి..పాండ్య దేశానికి.. నేను ఆమెను వారి రాజ్యం చేర్చే సహాయకుణ్ణి!" అన్నాడు. కోయస్త్రీ నవ్వుతూ "యువరాణీ వారూ.. ఏమనుకోబాకండి. మీ ఇద్దరి జంట కను విందుగా ఉంది." అనగానే ఇద్దరూ ఉలిక్కిపడ్డారు. వారిద్దరూ వారిగుహలోకి వెళ్ళిపోయారు.

ఇద్దరూ ఏదో తెలియని ఉద్విగ్న స్థితిలో చాలాసేపు ఉండిపోయారు. తర్వాత మధురాంగిణి తేరుకుని సిగ్గుగా చూస్తూ "వారిద్దరూ ఎవరు? ఇంత స్వేచ్ఛగా విహరిస్తున్నారు? వాళ్ళ పెద్దలు ఏమీ అనరా! చూస్తే మెడలో పసుపు తాడు కూడా లేదు. పెళ్ళైనట్టులేదు. అంతగా బరితెగించి మాట్లాడుతున్నది" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. వల్లభుడు తను కూర్చున్న బండదిగి మోకాళ్ళపై కూర్చొని "శాంతించండి యువరాణీ.." అంటూ ఒక భంగిమ పెట్టగానే..ఆమె పెద్దగ నవ్వుతూ "సరేలే! చెప్పు చెప్పు!" అంది. "వీళ్ళు ఈ కొండల్లో నివసించే ముదమ జాతి కోయ వాళ్ళు. నేను తిరుమల అడవుల్లో అనేక జాతుల కోయలను, చెంచులను

చూశాను. అలాగే వీళ్ళు ఒక జాతి. వీళ్ళిద్దరూ ప్రస్తుతం ప్రేమలో (మనం ఆధునిక పరిభాషలో అనుకునే “డేటింగ్” అనుకోవచ్చు) ఉన్నారు. వీరిద్దరికి త్వరలో వివాహం జరుగుతుంది. వివాహానికి పూర్వం కొద్దిరోజులు అంటే షుమారుగా 3 నుండి 6 నెలలు జంటకలసి జీవిస్తారు. వారిద్దరికి సరిపడితేనే వివాహం. లేకపోతే ఇంకో పుంజునొకరు, ఇంకో పెట్టనొకరు వెదుక్కుంటారు'' అనగానే ''హవ్వ..సిగ్గు..సిగ్గు'' అని నోటిపై చెయ్యిపెట్టుకుంది. “మనలాంటి కట్టుబాట్లు అవీ వీరికి ఉండవు. ఒకరకంగా మనసుకు నచ్చని వారిని వివాహమాడి జీవితాంతం భరించే కన్నా.. ఇద్దరి అభిరుచులు దగ్గరై వివాహం చేసుకుంటే మంచి ఆచారమేమో అనిపిస్తున్నది''. ''నిజమే ఒకవేళ నచ్చకపోతే..ఆమె....వాడు... చెడిపోయినట్టుకాదా! అది ఆలోచించరా వీళ్ళు” అంది. వల్లభుడు నిట్టూర్చి “నిజమే.. కానీ.. మీరొక్కసారి మనసుపెట్టి ఆలోచించండి. మనలో కూడా ఎంతమంది రాజవంశానికి చెందని వాళ్ళను ప్రేమించి, మనసు చంపుకుని యిష్టమున్నా లేకపోయినా రాజుల సంతానాన్నే పెండ్లి చేసుకుని సంసారాలు సాగిస్తున్నారు. చెప్పలేం..యువరాణీ... ఒకనాటికి ప్రపంచంలో మొత్తం ఇదే ఆచారం వచ్చినా నేను ఆశ్చర్యపడబోను!” అన్నాడు. అంతే యువరాణికి ఆ సమాధానం సంతృప్తినిచ్చి ఊరుకుందో, నిద్రించే సమయం అయిందని ఊరుకుందో తెలీదు. మెల్లిగా వెళ్ళి నిద్రకుపక్రమించింది.

బయట ఏదో శబ్దం అయింది. ఇద్దరూ ఉలిక్కిపడి లేచి చూసే సరికి కోయజంట నవ్వుతున్నారు. బయట మంటల్లో మాంసం వండుకుని ఆరగిస్తున్నారు. ఆమె ఉడికీ ఉడకని మాంసాన్ని ముంతల్లోనుంచీ తీసి ఊది వాడినోట్లో పెడుతోంది. యువరాణి ఏమనుకుందో తెలీదు. దూరంగా

ఉన్న మరో బండమీదికి వెళ్ళి పడుకుంది. యువరాణి ఇంతకుముందు నిద్రించిన బండపై వకుళపుష్పాల వాసన మత్తుగా పీలుస్తూ ఉండిపోయాడు. గాఢ నిద్రలో ఉండగా ఛలితో ముడుచుకుపోతున్నాడు. ఇంతలో ఎవరో "రాజవల్లభా!" అని పిల్చినట్టవడంతో ఉలిక్కిపడి లేచాడు. యువరాణి పదడుగుల దూరంలో నిలబడి "మీకు ఛలివేస్తున్నట్టుంది. మీరు అసలే ఈమధ్య జ్వరం బారిన పడ్డారు" అంటూ ఒక శాలువాను అతనికి ఇవ్వజూచింది. "అవసరం లేదు యువరాణీ! నా అంగవస్త్రమే నా ఛలిని తీరుస్తుంది" అని మళ్ళీ పడుకుని ఆమె వెళ్ళిపోయిందా లేదా అని ఓరకంటితో చూశాడు. ఆమె వెళ్ళకుండా అలాగే నిలబడి ఉన్నది. దిగ్గున లేచి "యువరాణీ! మీకంతా సౌకర్యంగా ఉందా? నిద్రపట్టడంలేదా? చెప్పండి" అని అడగ్గానే మెల్లిగా ఏ సమస్యా లేదన్నట్టు వెళ్ళి బండపై శయనించింది.

వల్లభుడు తెల్లగా తెల్లవారినా అలానే నిద్రిస్తూ ఉండడగా అతని నడుముపై చెయ్యివేసి ఎవరో పిలిచినట్లైంది. ఉలిక్కిపడి లేచి "యువరాణీ.. ఏమైనా కావాలా?" అన్నడు. దత్తుడు పెద్దగా నవ్వి "మీ యువరాణి బయట ప్రకృతిలో విహరిస్తున్నది" అంటూ గుహబయట చూపించాడు. నిజమే! మెల్లిగా వర్షం పడుతున్నది. ఎంతో ఆహ్లాదంగా ఉంది. వల్లభుడు వెంటనే మాట మార్చి "మిత్రమా! ఏనుగుల గుంపు నుండి ఎలా తప్పించుకొన్నావు? ఏమైంది? అందరూ క్షేమమేనా?" అని ప్రశ్నలు సంధించాడు. "మనవాళ్ళంతా దగ్గరలోనే ఉన్నారు. క్షేమమే! గుర్రాలు మాత్రం అన్నీ భయానికి కళ్ళేలు సైతం తెంచుకుని పారిపోయాయి. నీవు, యువరాణిని కాపాడి, ఇలాంటి ఏర్పాటేదో చేసుకుంటావని వెదుకుతూ వచ్చాను. లోయలో నిప్పు, పొగ కనపడ్డంతో ఇలా క్రిందికి దిగి వచ్చాను. చాలా దూరమే

సుమా! ఎలా వచ్చారో ఏమో మీరిద్దరూ!" అనేసరికి వల్లభుడు "ష్..మెల్లిగా" అంటూ జరిగింది చెప్పాడు. "మొత్తానికి ఇద్దరూ జారుడుబండ ఆట ఆడి ఒకరిపై ఒకరు పడ్డారన్నమాట!" అనగానే ఇంకచాలు మిత్రమా అన్నట్లు దండం పెట్టాడు వాకిట్లోకి చూస్తూ.

మధురాంగిణి వర్షం కొంచెం తగ్గగానే దగ్గరలోని కొలనులో పరవశం పొందుతూ స్నానం చేస్తున్నది. దూరంగా కోయజంట విశృంఖలంగా కొలనులో విహరిస్తున్నారు. కొలనులో కొంగలు, బాతులు స్వేచ్ఛగా ఈదుతున్నాయి. కోయ యువతి వంటిపై నూలుపోగు లేకపోయినా ఏమాత్రం సిగ్గు బిడియం లేకుండా అతనితో కలిసి జలకాలాడుతున్నది. సరసాలాడుతున్నది. మధురాంగిణికి మొదటిసారి మనసులో ఏదో కలకలం మొదలయ్యింది. ఏదో తెలియని పరవశం.

"చెప్పు మిత్రమా రాత్రి విశేషాలు! ఎలా జరిగింది?" అని అడిగాడు.
వల్లభుడు జరిగినది చెప్పి, తనకు ఆమె శాలువా యివ్వబోవడం చాలాసేపు తన్నే చూస్తూ ఉండడం వంటివి చెప్పాడు. విన్న దత్తుడు ఆనంద పడతాడని ఆశిస్తూ ఉండగా మౌనం వహించాడు.
"మిత్రమా! ఎందులకీ మౌనం? నీకు మొదటిసారి మంజరిని చూసినప్పుడు, నువ్వు కూడా ఇలానే అనిపించిందని చెప్పావుగదా!"
"వల్లభా! వియ్యానికైనా, కయ్యానికైనా సమఉజ్జీ ఉండాలంటారు. వారిద్దరూ సమానంగా లేనప్పుడు ఆనందం ఇవ్వకపోగా సమస్యలు ఎదురవుతాయి"
"దత్తా! ఏమన్నావు. నాకు రాజ్యం కానీ, రాజ పదవులు కానీ లేవంటున్నావా? నేను మధురాంగిణికి సమఉజ్జీ కాదంటున్నావా? ఆమెకు నేను సరిపోనని

చెబుతున్నావా? నా ప్రేమ విఫలమౌతుందని ముందుగానే ఊహిస్తున్నావా?" "మిత్రమా! అపార్ధం చేసుకోకు! ప్రేమ విఫలమైతే తీవ్ర దుఃఖాన్ని కలిగిస్తుంది. అది తననే కాదు కుటుంబాన్నీ ఆవేదనకు గురి చేస్తుంది. కనుక వివాహం వరకూ చేరుకోదని తెలిసిన ప్రేమను ఆదిలోనే త్రుంచివేయడం శ్రేయస్కరం అంటున్నాను"

"నా ప్రేమ వివాహం వరకూ వెళ్ళదని చెప్పడానికి నీవేం జ్యోతిష్యుడవా?" అంతని కంఠం బాధతో రుద్ధమయింది.

"నేను మళ్ళీ మళ్ళీ అదే చెప్తున్నాను మిత్రమా! నేను నీకు నిజమైన బాల్య స్నేహితుడను కాబట్టే నీకు కుట్టబడ్డ ప్రేమకు సరైన చేదు గుళికను మ్రింగిస్తున్నాను. అడిగావు కాబట్టి చెప్పక తప్పదు. ఆరోజుల్లో నేను సత్యమంగళంలో పూజాదికాలు నిర్వహించడానికి మా తండ్రిగారితో కలిసి వెళ్ళేవాడిని. అక్కడ ఒక కోటీశ్వరుడైన వాని కుమార్తెతో నాకు పరిచయమయింది. మొదట్లో మాట్లాడుకోవడం లేకపోయినా మనసులు కలిశాయని మాత్రం రూఢీగా తెలిసింది. ఆ తర్వాత మనసులు విప్పి మాట్లాడుకున్నాం కూడా! ఆ కలయిక శాశ్వతం కాబోదని ఇద్దరికి తెలిసినా కూడా అదో ఆకర్షణ! వ్యామోహం! అంతే ఆ ప్రేమ నామనసును కలచివేసింది. అప్పుడే తెలిసింది. ప్రేమకు కాకపోయినా పెండ్లికి మాత్రం సమానస్థాయి అవసరం. భవిష్యత్తులో చెప్పలేను కానీ, ప్రస్తుతం మాత్రం మన సమాజంలో అదే ఆర్థికపరమైన స్థాయి ఉంటేనే ప్రేమ పెండ్లి దాకా వెళ్తుంది. అందుకే మంజరి అంటే అంత ఇష్టపడిన నేను ఆమె కళ్ళపడితే బాధ తప్ప మరేమీ లేదని తెలిసే ఆమె కళ్ళనుండి తప్పించుకుని వచ్చేశాను. కంచిలో ఆమె బాధ పడుతూ ఉంటే నా మనస్సు ఎంత మూలిగిందో నేను

బహిర్గతం చేయలేదు. ఆమెను చూస్తే తట్టుకోలేను మిత్రమా! గుర్తుందా! పరిస్థితులు చక్కబడ్డాక మాత్రమే, ఒకవేళ ఎన్ని సంవత్సరాలైనా మంజరి నాకోసం వివాహం చేసుకోకుండా అవివాహితగా ఉండిపోతేనే, ఆమెను ఒప్పించి వివాహంచేసుకుంటాను. మీ అమ్మ పదే పదే ఎందుకు నీ పెండ్లి గురించి ఆరాటపడుతుందో, హెచ్చరికలు చేస్తుందో అర్థమయిందా! కర్తవ్యమే ముఖ్యం! “ అని ముగించాడు.

దత్తుని దీర్ఘ ఉపన్యాసం వల్లభునికి జ్ఞానోదయం కలుగుతుందని భావించాడు. కానీ వల్లభుడు వేరే విధంగా ఆలోచిస్తున్నాడు. “ఈ ప్రేమ నాకు ఆనందాన్ని కలిగించినా..లేదా దుఃఖాన్ని కలిగించినా నేను పెద్దగా చింతించను. పద వెళ్దాం!” అని కోయజంట దగ్గర సెలవు తీసుకుని బయలుదేరారు. కోయ యువతి యువరాణిని అడవి పుష్పాలతో అలంకరించి..చెవిలో “ఈ పుంజు మంచి హృదయమున్నవాడు. నిన్ను జీవితాంతం పువ్వుల్లో పెట్టి కాపాడుకుంటాడు. వదులుకోకు!” అని వీడ్కోలు ఇచ్చింది. నవ్వి ఊరుకుందే గానీ తన మనసు మాత్రం బయటపెట్టే ప్రయత్నం చేయాలని అనుకోలేదు. వివాహం అంటే ఎన్నో కలిసిరావాలి. ముందుగా తల్లిదండ్రులకు ఇష్టం లేని పని చేయకూడదని గట్టినిర్ణయం తీసుకున్నదన్న విషయం ఎవ్వరికి తెలియదు.

ముగ్గురూ కష్టసాధ్యమైన కొండను తమ తమ ఆలోచనల్లో మునిగి త్వరత్వరగా ఎక్కేశారు. అందరినీ పేరు పేరున పలకరించారిద్దరూ. యువరాణి పల్లకీ కొమ్ము ఒక వైపు విరిగిపోవడంవల్ల అక్కడ అశ్వికుల్లో ఉన్న మేదరి, క్షణాల్లో దాన్ని మరామత్తుచేసి ఉంచాడు. మధుర వెంటనే పల్లకీ ఎక్కి కూర్చున్నది. దత్తుడు వల్లభుని వద్ద ద్రవ్యం తీసుకుని, ప్రక్కన

ఉన్న పల్లెలో రెండు గుర్రాలను కొనుక్కుని వచ్చాడు. సత్రాలలో బసచేస్తూ ఐదవరోజు పొదిగైకొండల దిగువన నున్న కులశేఖరపుదూరు చేరుకున్నారు. యువరాణికి చెందిన అనేకమంది అక్కడే నివాసముంటున్నారు. "ఆహా! తన ఊరు వచ్చేసింది" అనుకుని మనసు ఉత్సాహంతో పరవళ్ళు త్రొక్కింది. అక్కడ అగస్త్యతీర్థమనే ప్రాంతాన్ని మధుర వల్లభునికి చూపించింది. అంతే కాదు సుల్తాను సైన్యం కులశేఖర పాండ్యునిపై దాడి జరిపినప్పుడు తమ కుటుంబం చెల్లాచెదురైనట్టు, కుటుంబ సభ్యులలో ముగ్గురు ఈ పుదూరులోనే రహస్యంగా తలదాచుకున్నారని అనేక విషయాలు చిన్నపిల్లలా చెప్తుంటే వల్లభుడు చిరునవ్వుతో ఉత్సాహంగా వింటున్నాడు. వారు రాజభవనం ఇంకొద్ది క్రోసుల దూరం ఉందనగానే పల్లకీ మోసే బోయీలను "త్వరగా నడవండి. పెండ్లి నడకలు వద్దు!" అంటూ యువరాణి త్వరపెట్టింది. అర్థం చేసుకున్న బోయీలు కాసేపు ఆగి మంచినీళ్ళు త్రాగి "యువరాణీ! ఇక చూడు మా తడాఖా!" అని పరుగులు తీశారు. అశ్వాలకంటే వేగంగా వెళ్తున్న పల్లకీని చేరుకోలేక వల్లభదత్తులు వెనుకబడ్డారు. మధుర వారి వేగం చూసి చప్పట్లు చరుస్తోంది.

అశ్వవేగాన్ని మించి వెళ్తున్న బోయీలు, పరదాలను ప్రక్కకు నెట్టి కరతాళధ్వనులు చేస్తున్న యువరాణిని చూసిన ప్రజలకు విషయం అర్థమైంది. "ఆహా...ప్రజలారా.. చూడండి. మన యువరాణీ తిరిగి వచ్చేస్తోందంటూ నగర పొలిమేర్లలోని జనం దూకుడుగా పరువులెత్తి ఈ శుభవార్త రాజభవనంలోని మహారాజుకు ముందుగా తామే అందజేసి బహుమానాలు అందుకోవాలని పోటీ పడుతూ వివిధ వాహనాల మీద రాజభవనం వైపు పరుగులెత్తుతున్నారు.

యువరాణి పల్లకీ రాజభవనం చేరేసరికి అప్పటికే మామిడి తోరణాలు అలంకరించబడ్డాయి. రాజభవనం ఇంకా క్రోసు దూరం ఉండగానే జనం వీధులలో బారులు తీర్చి రెండు వైపులా నిలబడి ఉన్నారు. దగ్గరవగానే ఆమె పల్లకీ పై పూలు చల్లుతూ "యువరాణీ వారికి స్వాగతం!" అంటూ అరుస్తున్నారు. పరివారం ముఖ ద్వారం వద్ద గుంపులు గుంపులుగాజేరి ఆసక్తిగా చూస్తున్నారు. ఇదంతా చూస్తున్న వల్లభునికి యువరాణీ వారికి జనంలో ఉన్న ప్రేమాభిమానాలు చూసి సంతోషపడ్డా, ఇంతటి కీర్తి ప్రతిష్టలున్న మధురాంగిణి నన్ను వివాహం చేసుకోవడం జరిగే పనేనా? అని అనుమానం కూడా కలిగింది. మిత్రుని వంక చూశాడు. దత్తుడు చూశావా మిత్రమా! సమానస్థాయి అంటే ఏమిటో ఇప్పటికైనా తెలుసుకో అని తనను హెచ్చరిస్తున్నట్లుగా ఊహించుకుని, ఆ మాటలు ఏమాత్రం సహించలేని కారణంగా వెంటనే మొహం తిప్పుకున్నాడు.

యువరాణీ పల్లకీ దిగింది అని చెప్పడంకన్నా, పల్లకీలోని బయటకు దూకిందనే చెప్పాలి "అప్పా!" అంటూ ముఖ ద్వారంలో నిలబడ్డ తండ్రిని కౌగలించుకుని కన్నీళ్ళు పెట్టుకున్నది. కలకలం, హర్షధ్వానాలు, జయజయ ధ్వానాలు, కరతాళ ధనులు కొన్ని నిముషాలకు సద్దుమణిగేంత వరకూ మహారాజు యువరాణి తలనిమురుతూ ఉండిపోయారు. తర్వాత గుర్రాలు దిగి నిలబడ్డ వల్లభ దత్తులను గర్వంగా పరిచయం చేస్తూ "అప్పా! వీరే నన్ను శత్రువుల చెరనుండి తప్పించిన వీరులు!" అని చెప్పింది. మహారాజు అత్యంత సంతోషంతో "యువకిశోరాల్లారా! ధన్యవాదములు! నాకు ఒకే ఒక కుమార్తె ఉంది. కుమారులు లేరు. అల్లారు ముద్దుగా పెంచుకున్నప్పటికి ఈ దృష్టాంతం జరగడం దురదృష్టం. మా పూర్వీకులు గొప్ప పాండ్యవీరులని

మీరు వినే ఉంటారు. మాది ఒకనాడు మహా సామ్రాజ్యం. కానీ ఇప్పుడే నేను పేరుకు మాత్రమే ఈ చిన్న సంస్థానం లాంటి రాజ్యానికి రాజుగా మిగిలాను. దీన్ని వలనాడు అని పిలుస్తారు. ప్రజలు మాత్రం పూర్వపు వైభవం మనసులో ఉంచుకొని నన్ను ఇంకా పాండ్య చక్రవర్తిగా గౌరవిస్తున్నారు. మాకు పూర్వ వైభవం వస్తుందో రాదో తెలీదు" అంటూ వారిద్దరిని సగౌరవంగా విడిదికి విచ్చేయమని కోరగానే రాజుకు నమస్కరించి రాజభవనం లోనకు నడిచారు.

విడిదిలోనకు పరివారంతో నడుస్తూ "వల్లభా! పాండ్యులు అంత గొప్పరాజులా? నేను వినలేదు!" అనగానే వల్లభుడు "దత్తా! పాండ్య రాజులు గొప్ప యుద్ధవీరులు. మహాభారత యుద్ధ సమయానికి పూర్వమే మన దేశాన్ని పరిపాలించిన వీరులు. పాండవ మధ్యముడైన అర్జునుడు పాండ్యరాజైన మలయధ్వజుని కుమార్తె చిత్రాంగదను వివాహమాడి, గొప్ప పాండ్యరాజుగా ప్రసిద్ధికెక్కిన బభ్రువాహనుడనే కుమారుణ్ణి పొందాడు. వారు ఎన్నో శతాబ్దాలు నిరాటంకంగా రాజ్యం చేశారు. ఒక్కటిగా ఉన్న పాండ్య కుటుంబం ఇటీవలే ఐదు కుటుంబాలుగా చీలిపోయింది. దీని కారణంగా శతృవులకు లోకువయ్యారు. పొదిగై పర్వాతాలకు దక్షిణ ప్రాంతంలో ఉన్న ఆ ఐదు రాజ్యాలు విడివిడిగానే ఉన్నాయి. అంతా సరిగా ఉండివుంటే ఈ సమైక్య పాండ్యరాజ్యాన్ని కులశేఖరపాండ్యుడు పరిపాలిస్తూ ఉండవలసింది. ఆ కులశేఖరుడు ఇప్పుడు అతి స్వల్ప సైనికబలంతో మాత్రమేనిస్సహాయంగా ఉన్నాడు. ఇంకా మిగిలిన వారు సైతం గతవైభవ చిహ్నాలతో బ్రతుకుతున్న వారే!" అంటూ ఉండగా, విడిది రావడంతో, అక్కడి తల్పాలపై స్వల్ప విశ్రాంతి అనంతరం, వారు చక్కటి విందుభోజనం ఆరగించి సేదదీరారు.

అక్కడి రాజభవన కుడ్యాలన్నీ గత చక్రవర్తుల చిత్రపటాలతో అలంకరింపబడి ఉన్నప్పటికి, కుడ్యాలు చాలాభాగం దెబ్బతిన్నవే! ప్రజలే కాదు రాజులు కూడా అతి సామాన్య దుస్తులతో ఉన్నారు. అయినప్పటికి వారి స్వామి భక్తికి అబ్బురపడ్డారు. యువరాణి, రాజు ఇచ్చిన అతిధిమర్యాదలను కాదనలేక మూడు రోజులుండి, బడలికలు తీరాక తిరుగు ప్రయాణానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. రాజుగారు వచ్చి వారిద్దరిని కౌగలించుకుని "యువకుల్లారా! తుంగభద్రానది ఒడ్డున తురుష్కులను ఎదిరించడానికి ఒక మహాసామ్రాజ్యం విస్తరిల్లుతున్నదన్న విషయం పరమానందంగా ఉన్నది. తురుష్కులను మాలాంటి చిన్న సామ్రాజ్యాలు కాక విజయనగరం వంటి మహాసామ్రాజ్యాలు మాత్రమే ఎదిరి నిలువగలవు. బుక్క రాయలవారికి, కంపన రాయునికి మా ఆశీర్వాదాలు. మా మధురను అప్పగించినందుకు మేము వారికి సర్వదా ఋణపడి ఉంటామని తెలియజెయ్యండి. తురుష్కులను జయించేందుకు మా వంతు ఉడతాభక్తి సాయం చేయడానికి ఎన్నడూ వెనుకాడబోమని చెప్పండి. త్వరలో మధురను ముట్టడించి జయించాలని నిత్యం కోరుకునే వాళ్ళలో నేనూ ఒకడినని విన్నవించండి." అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. వల్లభదత్తులిరువురికీ రాజు శక్తి మేరకు ముత్యాల రాసులు మూటలు కట్టి అశ్వలపైకెక్కించించాడు. వారికి నమస్కరించి వెలుపలకు వస్తుండగా వల్లభుని మనసు బరువెక్కింది. ఈ మూడు రోజులూ మధుర తనకు సపర్యలు చేయడం అద్భుతంగా తోచింది. అది శాశ్వతం కావాలని శ్రీరంగనాథునికి మ్రొక్కు కున్నాడు. మధుర నవ్వుతూ ఇద్దరికి వీడ్కోలు చెప్పింది. మధురావల్లభుల కళ్ళు కలుసుకున్నప్పుడల్లా ఇద్దరికి ఏదో తెలియని

ఉద్విగ్నత కలగసాగింది. వల్లభుడు తిరిగి వస్తున్నప్పుడు మర్యాద సహితం మరచి వెనక్కు తిరిగి మధురనే చూస్తుండడం కేవలం దత్తుడు మాత్రమే గమనించగలిగాడు.

వల్లభుడు, దత్తుడు రాజ్య పొలిమేరలు దాటుతూ ఉండగా వెనుకగా ఎవరివో గుర్రపు డెక్కల సవ్వడి వింపించడంతో వెనక్కు తిరిగి చూసి ఒక్కసారి ఆశ్చర్యపోయారు. ఆ వస్తున్నది మధురాంగిణి. వివాహానికి అంగీకారంపొంది సిద్ధమై తనతో వస్తున్నదా! అన్న తీయని ఊహల్లో మునిగిపోయి వల్లభుడు ఆమె వంక ఆనందంగా చూస్తున్నాడు. దత్తుడు నవ్వుతూ "మిత్రమా! పానకంలో పుడకలా నేనెందుకు..నువ్వు ఒకసారి ఆమె వద్దకు వెళ్ళి విషయం తెలుసుకో! నీకేదైనా సందేశమో లేక నీతో వచ్చేయడానికి సిద్ధపడి వచ్చిందో తెలుసుకో! నేను ఈ చెట్టునీడన కాసేపు నిలబడతాను" అన్నాడు. వల్లభుని ఆ ఊహకే మనసు ఆనంద డోలికల్లో తేలిపోయింది. వల్లభుడు గుర్రాన్ని ఆపి, నడుచుకుంటూ ఆనందంగా ఆమె చెప్పే తీయని కబురుకోసం ఎదురు వెళ్ళాడు.

"మీ ప్రయాణానికి ఆటంకం కలిగించినదుకు క్షమించండి. మీకు నా తరఫున ఒక అమూల్యమైన బహుమతి ఇవ్వాలని వచ్చాను" . ఆమె ఏమిస్తుందా అని ఆతృతగా ఎదురు చూస్తుండగా "మీరు వెళ్ళిపోయాక నేను తీవ్రంగా మీ గురించి ఆలోచించాను. మీ వీరత్వానికి ఏమిస్తే సరితూగుతుందో అని వెదకగా, మా పూర్వీకుల నుండి పరంపరగా వస్తున్న ఆభరణాలలో ఈ నవరత్నఖచితఖడ్గం సముచితమని తీర్మానించించాను. నాన్నగారు నా ఆలోచన సముచితమని మురిసిపోయారు. వల్లభా! ఒక్కమాట! ఈ ఖడ్గం మా వంశంలో క్రొత్తగా రాజ్యాధికారం చేపట్టినప్పుడు ఆ రాజుకు పట్టాభిషేక సమయంలో ఇచ్చే కానుక. మా ప్రాణసమానం!" అంటూ

నడుముకు కట్టుకున్న ఖడ్గాన్ని ఒరలోంచి తీసింది. దాని పిడిపై పచ్చలు, కెంపులు ఉన్నాయి. ఈ ఖడ్గాన్ని నా కానుకగా స్వీకరించండి" అంది.

"మహా ప్రసాదం యువరాణీ! ధన్యుణ్ణి, కృతజ్ఞుడను. నా సంతోషం వ్యక్తం చేసేందుకు అవధులు లేవు" అంటూ మోకాలిపై కూర్చుని ఆఖడ్గాన్ని అందుకున్నాడు. ఆమె చేతులనుండి దాన్ని అందుకోగానే ఏదో విద్యుత్ వల్లభుని శరీరంలో ప్రవహించినట్లైంది. ఆమెసిగ్గుతో మొగ్గలైంది. ఇంతేనా! ఇంకేమీ లేదా? అన్నట్టు చూసిన వల్లభుని కళ్ళలోకి చూడలేక తలవంచుకుంది మధుర. మళ్ళీ ఆమె వద్ద వీడ్కోలు తీసుకుని దూరంగా నిలబడ్డ దత్తుడి దగ్గరకు వచ్చాడు. దత్తుడితో విషయం చెప్పగానే "ఆ...చూశాను మిత్రమా! పర్వాలేదు! తొందరగానే ముగిసింది మీ కానుకల పర్వం" అనగానే వల్లభుడు నవ్వి "పద! ఇప్పటికే ఆలస్యం అయింది" అని గుర్రాన్ని అదిలించాడు.

సత్రంలో నిదురిస్తున్న దత్తుడు ప్రక్కన వల్లభుడు లేకపోయే సరికి, అర్ధరాత్రి ఏమైందా వల్లభుడికి అని కంగారు పడ్డాడు. బయటకు వచ్చి చూసే సరికి, వల్లభుడు ఒక్కడే బయట బండపై కూర్చుని ఒక ఆనంద స్థితిలో ఉన్నాడు. అర్ధనిమీలికా నేత్రాలతో తనలో తాను మాట్లాడుకుంటూ ఉన్నాడు. "వల్లభా! నేను మీ ప్రేమ వ్యవహారంలో జోక్యం చేసుకుంటున్నానని అనుకోవద్దు. ప్రేమ ఒక అగ్ని. ప్రేమ ఒక వ్యాధి. మనిషిని ఏమీ తోచనీక అగ్నివలె కాలుస్తుంది, వ్యాధివలె కృంగదీస్తుంది. ఈ విషయమై నువ్వు ఎక్కువగా ఆలోచించి మనసు పాడుచేసుకుంటావన్న బాధ కొద్దీ చెప్తున్నాను".

"దత్తా! ఏమిటో విచిత్ర పరిస్తితిని ఎదుర్కొంటున్నాను. నీవు ఇంతగా చెప్తున్న కారణం తెలిసినా ఈ స్తితినాకు చాలా ఆనందాన్నిస్తున్నది. నా ప్రేమ యొక్క పర్యవసానం సుఖాంతమయినా దుఃఖాంతమయినా నాకు

ఎందుకో ఈ స్థితినుండి బయటకు రావాలని అనిపించడంలేదు. నాకెంతో మధురంగా అనిపిస్తున్నది" అన్న వల్లభుణ్ణి ఇక చెప్పి లాభమేమీలేదని భావించి చేయిపట్టుకుని బలవంతంగా లాగుతున్నట్లుగా తీసుకువచ్చి మంచంపై పరుండబెట్టాడు. కానీ వల్లభుడు నిదురిస్తేనా? మొలలోని కత్తిని బయటకు తీసి దానిని మృదువుగా నిమురుతూనే ఉండిపోయాడు.

మరుసటిరోజు ఉదయాన్నే నిద్ర సరిగా లేని వాలకం తెలుస్తూనే ఉన్నా ఏమాత్రం పట్టించుకోకుండా "దత్తా! నేను నీతో ఇప్పుడు చెప్పబోతున్న విషయమై దయచేసి నవ్వకుండా వింటావని, నా హృదయ జ్వాలను అర్థంచేసుకుంటావని భావిస్తున్నాను" అనగానే, దత్తుడు, అతణ్ణే చూస్తూ, మళ్ళీ ఈ ప్రేమ పిచ్చితో ఏ ఉపద్రవం తీసుకుని వస్తాడో అని భయంగా ఉన్నా, అలాగే అని తలూపాడు. "మనం బసచేసిన ఆ సత్రం ఉందికదా, ఆ సత్రం వద్ద నిన్న మధురాంగిణి నాకు వీడ్కోలు పలికిన విషయం నీవెరిగినదే కదా! ఆ ప్రదేశం ఎంతో పవిత్రమైనదని నా హృదయం చెప్తున్నది. అక్కడికి మళ్ళీ ఒక్కసారి వెళ్ళాలని మనసు ఆరాటపడుతున్నది. లేకుంటే నాకు మనశ్శాంతి ఉండదు. రాత్రంతా తీవ్రంగా ఆలోచించాను. వెళ్ళక తప్పదనిపిస్తున్నది. నాకు సగంరోజు గడువివ్వు మిత్రమా! వెళ్ళి వెంటనే తిరిగి వచ్చేస్తాను. ఒక మిత్రుడిగా నిన్ను అర్థిస్తున్నాను". దత్తుడికి మళ్ళీ మౌనమే మిగిలింది. అలాగేనన్నట్టు తలూపి ఒప్పుకున్నాడు.

వల్లభునికి గుర్రం ఎక్కడం మాత్రమే గుర్తున్నది. ఎంత మనోవాయు వేగాలతో అశ్వాన్ని నడిపాడో గుర్తులేదు. చెట్లూ చేమలూ, గుట్టలూ వాగులూ వంకలూ అన్నీ శరవేగంతో వెనక్కి వెళ్తున్నాయి. గుర్రపు డెక్కల చప్పుడు మాత్రమే వినిపిస్తున్నది. గుర్రం ఆ వేగానికి నురుగులు క్రక్కుతూ

పరుగులెత్తుదన్న విషయం పట్టించుకునే స్థితిలో లేదు. అంతకు ముందు ఆ ప్రదేశానికి చేరుకోవడానికి ఒక రోజుపైన పట్టిందన్న విషయం గుర్తులేదు. ఎలా సత్రానికి చేరుకున్నాడో తెలీదు. మూడు గంటల్లో అక్కడి చేరుకున్నాడు. గుర్రంపైనుండి ఒక్క గెంతులో ఎగిరి దూకాడు. ప్రక్కనే ఉన్న ఒక బండరాళ్ళపై కూర్చొండిపోయాడు. గుర్రం ఆగడం ఆలస్యంగా భావిస్తూ నేలపై పడుకుండిపోయి ఆ అలసటకు అటూ ఇటూ పొర్లుతున్నది. వల్లభుని బట్టలు మొత్తం స్వేదమయం. దుమ్ము కొట్టుకుని పోవడం వల్ల మొహం జుట్టూ తామ్రవర్ణంతో మెరుస్తున్నాయి. కొంత సేపటికి మెల్లిగా లేచాడు. అక్కడి పిల్ల కాలువలో తలావళ్ళు, శుభ్రం చేసుకొని, మెల్లగా అంతకుముందు మధుర వీడ్కోలు ఇచ్చిన ప్రదేశం వైపు నడిచాడు. అంతా నిశ్శబ్దంగా ఉంది. ఎవరూ లేని ప్రదేశం అది. అక్కడ నిలబడి విరహంతో బాధపడుతూ “మధురా! ఎక్కడున్నావు? నాకీ ఖడ్గాన్ని ఇచ్చి వెళ్ళిపోయావు. మధురా!” అని ఎలుగెత్తి పిలిచాడు.

“ఆర్యా! నేనిక్కడే ఉన్నాను” అంటూ ఒక కోమల కంఠం వినిపించింది. తను కలగంటున్నాడా! లేక మతిభ్రమణంతో ఉన్నాడా! ఇక్కడ మధుర నాకోసం ఉండడం ఏమిటి? నాకు బదులివ్వడం ఏమిటి? అప్రతిభుడై చుట్టూ చూస్తూ నిలబడిపోయాడు. దూరంగా ఎవరో ఆకారం నీడలా కనిపిస్తున్నది. ఆవేదనతో కళ్ళకు క్రమ్మిన నీటిపొరలు అంగవస్త్రంతో తుడుచుకుని చూశాడు. ఆమె..ఆమె..మధురాంగిణి..నా మధురాంగిణి..నాకోసం వచ్చింది...అంటూ భావావేశం ఎక్కువై స్పృహతప్పాడు. స్పృహ వచ్చేసరికి మధుర పైటచెంగుతో విసురుతూ చల్లని గాలిని తన ముఖానికి తగిలేట్టు చేస్తూ ఆవేదన పడుతున్నది. ఒక్క క్షణం

కలలా తోచింది. దిగ్గున లేచి కూర్చున్నాడు. మధుర చల్లని చూపులు తనపై ప్రేమాభిషేకం చేస్తున్నట్లనిపించింది. ఎంత మధుర క్షణాలు. ఇలాగే ఉండిపోతే ఎంత బాగుంటుంది అనుకుంటూ మృదువుగా "మధూ! నువ్వేనా? కల కాదు గదా! ఇక్కడికి...ఇక్కడికి.. ఒక్కదానివే ఎలా?..ఎలా?.. అని మాటలు మ్రింగుతున్నాడు.

ఆమె చిరునవ్వుతో "మీరే కారణం మీద వచ్చారో..నేనూ అదే కారణం ఆర్యా!" అంది.

"నిజమా! నేను వింటున్నది నిజమా?"

"నిజమే! కానీ నిన్న ఇక్కడనుండి వెళ్ళిపోయిన మీరు మళ్ళీ ఇక్కడికి రావడానికి గల కారణం?"

"ఆ విషయం అలా ఉంచు మధురా! మీరే కారణం మీద వచ్చారో..నేనూ అదే కారణం అన్న నీ మాటకు అర్థం ఏమిటో తెలుసుకోవాలని ఉంది"

"ఆర్యా! నా మాటకు అర్థం చెప్పే ముందు మీకు ఒక విషయం చెప్పాలి. వినండి. శ్రీహర్షుడు రచించిన నాగానందం కథ మీకు తెలిసే ఉంటుంది కదా! అందులో కథానాయిక ఉద్యానవనానికి వస్తుంది. అదే సమయానికి కథానాయకుడు కూడా వస్తాడు. వారిరువురూ ముందు ఏమీ ఇలా కలుసుకోవాలని మాట్లాడుకోలేదు. కానీ ఎలా రాగలిగారు?"

వల్లభుడు ఆశ్చర్యంగా వింటున్నాడు. ఈ కథ ద్వారా మధుర ఏమి సందేశం ఇవ్వాలనుకుంటున్నది? తనపై ప్రేమ ఉన్నదని పరోక్షంగా చెప్తున్నదా? అనుకుంటూ "మధూ!" అని పిలిచాడు. ఆమె కూడా ఈ సారి ఆర్యా అని కాకుండా "వల్లభా!" అని ప్రేమగా పిలిచింది. వల్లభుడు ఆమె చేతి వేళ్ళను పట్టుని మృదువుగా నిమురుతూ తన చేతి వేళ్ళతో ముడి వేశాడు. ఆమె

అతని కళ్ళలో కారుతున్న బాష్పాలను తన చీరెకొంగుతో తుడిచింది. అలా తుడుస్తున్న కొద్దీ అతనికి కన్నీళ్ళు ప్రవాహంలా కారసాగాయి.

"మీ కన్నీటితో నా హృదయాన్ని బ్రద్దలు చేయకండి". "చిత్తం యువరాణీ!" అనగానే ఇద్దరూ నవ్వుకున్నారు. ఎన్నో ఊసులు చెప్పుకున్నారు.. అరమరికలు లేకుండా కలిసిపోయారు. మధ్యాహ్న సమయానికి వల్లభుడు లేచి వెళ్ళడానికి సమాయత్తమయ్యాడు. మధుర మౌనంగానే విలపిస్తున్నది. వల్లభుడు ఆమె చెంత కూర్చొని ఓదార్చాడు. ఆమె తేరుకుని "వల్లభా! మనం మరలా ఎప్పుడు కలుసుకుంటామో మనకే తెలియదు. జీవితంలో బహుశః మరలా ఎప్పుడు కలుసుకోకపోవచ్చు. ఒకవేళ కలుసుకున్నా మాట్లాడుకోలేక పోవచ్చు. సామ్రాజ్యంలో పరిస్థితులేం అనుకూలంగా లేవు. యుద్ధవాతావరణం ఉంది. కనుక నన్ను దయచేసి ఇప్పుడే గాంధర్వ వివాహం చేసుకోండి. ఇలా ఒంటరిగా జీవించడం నా వల్ల సాధ్యపడేట్టులేదు. జీవితాంతం మీ తలపులలోనే గడుపుతాను"

వల్లభునికి ఇది ఊహించని పరిణామం. చటుక్కున తల్లి ఉపదేశం గుర్తొచ్చింది "అందమైన కళ్ళ ఉచ్చుల్లో చిక్కుకోకు!" అనడం, దత్తుడన్న ప్రేమ ఒక అగ్ని. ప్రేమ ఒక వ్యాధి అన్న వాక్యాలు గుర్తొచ్చాయి. తన తల్లికిచ్చిన వాగ్దానం గుర్తొచ్చింది. మధుర కోరిక తీర్చలేని విచిత్ర స్థితిలో ఉన్నందుకు తన మీద తనకే జాలి కలిగింది. కళ్ళ నిండా నీళ్ళు నిండగా మెల్లిగా ఆమె చేయి పట్టుకుని "మన మనసులు ఒక్కటయ్యాయని, ఎవ్వరూ విడదీయలేని బంధమని నీకు తెలుసుకదా! మన వివాహానికి ఇంకా కొద్దిగా సమయం పడుతుంది. శ్రీరంగనాథుని విగ్రహం శ్రీరంగంలో ప్రతిష్టింపబడే వరకూ వివాహం తలపెట్టవద్దని నా తల్లి వాసంతికాదేవి ఆదేశించింది.

మధురా! ఒక్కమాట విను! నేనెక్కడున్నా నీ తలపుల్లోనే గడుపుతాను. మనం త్వరలో ఒకటవుతాం. నన్ను నమ్ము. ఒకవేళ మనం మళ్ళీ కలుసుకోలేకపోతే నేను అవివాహితుడుగానే ఉండిపోతాను తప్ప అన్య స్త్రీని వివాహమాడను. ఇదే నా ప్రమాణం" అంటూ చేతిలో చెయ్యి వేశాడు. అలా ఆమెను పరి పరివిధాల ఓదార్చి వీడ్కోలు తీసుకుని అశ్వారూఢుడై తిరిగి దత్తుణ్ణి చేరుకోడానికి బయలుదేరాడు.

పది సంవత్సరాలు అలా కాలగర్భంలో కలిసిపోయాయి. శ్రీరంగనాథుని స్థితి ఏమిటి? ఇన్నాళ్ళూ ఎక్కడ? దక్షిణభారతదేశంలో వెదకి చూస్తే ఐదు కొండలు నడుమ ఒక చిన్న నదితో గూడిన అందమైన ప్రదేశం కనిపిస్తుంది. అక్కడ స్వామిని యోగదరహాసంతో దర్శించవచ్చు. అయితే అవి తిరుమల కొండలు కావు. తిరువణ్ణామలై కొండకు పశ్చిమ భాగాన కల చెంచు కొండలు. ఇవి తొన్మండల జిల్లాకు దక్షిణాన ఉన్నాయి. కృష్ణాపురం అని పిలువబడే ప్రాంతమది. అక్కడి దేవత పేరుతో చెంచి (జెంజి) గా ప్రసిద్ధి పొందింది. చెంచి రెండుప్రాంతాలుగా విస్తరించి ఉంది. ఒకటి విష్ణు చెంచి, మరొకటి శివ చెంచి. ఈ రెండు ప్రాంతాలు కొండలతో సహా ఒక పెద్ద కోటచే చుట్టబడి ఉంది. విష్ణు చెంచి ప్రాంతంలో సింగవరం అనే గొప్ప ఆలయం ఉంది. ఇది చెంచికి దాదాపు క్రోసు దూరంలో ఉంది. పాండ్య రాజులు అక్కడి కొండలపై ఉన్న రాళ్ళను తొలిపించి, చెక్కించి ఆ గుడిని నిర్మించారు. అక్కడి గర్భగుడిలోని శ్రీరంగనాథుడు మన శ్రీరంగంలోని రంగనాథస్వామి కంటే చాలా పెద్దగా ఉంటాడు. అటువంటి పుణ్యక్షేత్రంలో సింగవరపు స్వామితో పాటూ

శ్రీరంగనాథ స్వామికూడా పూజలందుకుంటూ ఉన్నాడు.

విజయనగరరాజులు తొండై మండలాన్ని జయించిన తర్వాత గోపన్న జెంజి మండలానికి అధిపతి అయ్యాడు. వెంటనే ఆ పరగణాల్లో జీర్ణించిపోయిన ఆలయాలన్నీ పునర్నిర్మాణం పొందాయి. అందులో రంగనాథ ఆలయంకూడా ఉన్నది. గోపన్న తనకు గురుతుల్యుడైన కేతన్‌పట్టి నల్లాన్ చక్రవర్తి వంశస్థుడైన సత్రయాగం శేషాద్రిస్వామిని రంగనాథ ఆలయ పూజకు నియమించాడు. అక్కడే పెద్దల సహాయంతో గోపన్న తన గురువైన వేదాంతదేశికుల విగ్రహాన్ని సైతం ప్రతిష్టింప జేశాడు. శ్రీరంగాన్ని ఉలూగ్‌ఖాన్ ముట్టడించినప్పుడు, పిళ్ళై లోకాచార్యులు మరియూ వేదాంత దేశికుల నాయకత్వంలో భక్తులంతా రాతిగోడ కట్టి స్వామిని రక్షించుకున్నారు. ఉత్సవమూర్తిని, నగలు మాత్రం తమతో తీసుకుని వెళ్ళారు. అలా భక్త బృందం మహేశపట్నం, జ్యోతిషపురం, తిరుమాలిరున్ చోళై, కొచ్చి, పుంగనూరు, తిరునారాయణపురం వంటి ప్రాంతాలలో గడిపి చివరకు తిరుమలకొండకు చేరుకున్నారు. ఆ బృందంలో దేశికులవారు తప్ప దాదాపు అందరూ మరణించారు. గోపన్నకు బాల్యం నుండి వెంటాడే స్వప్నాలు, రాజవల్లభుడికిచ్చిన వాగ్దానం, దేశికుల వారి ప్రియ శిష్యుడు కావటంచేత వలన, అనేక కారణాల వల్ల శ్రీరంగనాథ స్వామిని, జెంజికి దగ్గరగా ఉన్న సింగవరం గ్రామంలో ఒక చిన్న కొండమీద ఉన్న రాతి దేవాలయములో ఉంచినా, తిరిగి శ్రీరంగంలో ప్రతిష్టించాలన్న తపన మాత్రం అలాగే ఉండిపోయింది.

శ్రీరంగంలో శ్రీరంగనాథుని ప్రతిష్ట జరిగిన తర్వాత మాత్రమే వివాహమాడుతానన్న గోపన్న మాటలకు తల్లిదండ్రులు ఒప్పుకోలేదు.

గోపన్న తండ్రి కుమారుని ప్రేమవిషయం, కాంచీపుర విజయానంతరం బుక్కరాయలవారికి విన్నవించగా, ఆయన ద్వారా కంపన గంగాదేవి తెలుసుకొని రంగనాథుని ప్రతిష్టకు, మధురను జయించడానికి, బహమనీ సుల్తానులతో ఉన్న విరోధకారణాలు చెప్పి వివాహంతగిన సమయంలో చేసుకోవాలని, ఒప్పించి, బలవంతంగా, జెంజి శ్రీరంగనాథుని ఆలయంలో కుముదినితో వివాహం జరిపించారు. గోపన్నకొంతకాలం కుముదినితో సర్వసౌఖ్యాలు అనుభవించాడు.

ఒకరోజు తాళపత్రాలు ముందేసుకుని ఏదో వ్రాస్తున్న గోపన్నను భార్య కుముదశ్రీ వెనుకనుండి గమనించింది. గోపన్నకు వేడిపాలను తీసుకుని వచ్చిన కుముదశ్రీ నిశ్శబ్దంగా, క్రింద ఉన్న కొన్ని పత్రాన్ని చేతిలోకి తీసుకుని పద్యాలను/శ్లోకాలను వెనుక నిలబడి మనసులో చదవసాగింది.

శ్లో.యోయం సిందుమతీ విలాస మఖిలం శృంగార సంపత్కరం
వాచా మంజుద్ర వీయకం సకుముదం, నానా విధోద్వాహకం
పశ్యన్సాధు జనస్సుకార్య రచనః కోవాక్షమ స్వాపిచన్
బిందుర్వాయది గీతివాః బహువిధాః పాతర్మ మైనాయది

చం.కడు భ్రమజెంది గొంకుచు వికారము నొందుచు భిన్నమూర్తియై
పొడమిన నెవ్వ గన్విభుడు భూరి దయా రహితాత్ముడైన దా
నడరెడు పద్మినీ ముదిత యందము నాబటు సాంద్ర నాదమై
కడువడి గేకి సంఘము కెకారవమంతి చెలంగె దిక్కులన్.

ఆ ఆకులో ఉన్న పద్యమూ, శ్లోకమూ చదివాక " అహో! ఇంతవరకూ గోపనార్యుల వారి భక్తివరివస్య, యుద్ధ నైపుణ్యం మాత్రమే చూశాను. ఇప్పుడు శృంగారవరివస్య కూడా అనుభవిస్తున్నానుకోండి అది వేరే విషయం. మీరు చేస్తున్న శృంగారచేష్టలు, నఖ, దంతక్షతాలు చాలవన్నట్టు, ఆ రసరమ్య క్రీడలను గ్రంధస్తం కూడా చేస్తున్నట్టున్నారు!" అని కిలకిలా నవ్వింది. తిరిగి వెనక్కు చూసిన గోపన చిరునవ్వుతో "అవును కుముదినీ! ఏదో ఒక ప్రబంధం వ్రాయలని ఎప్పుడో అనుకున్నాను. తీరిక దొరికినప్పుడల్లా ఈ "సింధుమతీ విలాసం" అనే ప్రబంధం వ్రాస్తూ వ్రాస్తూ ఇవాళే పూర్తి చేశాను. దీనిని సంస్కృత-తెలుగు ప్రబంధం (మణిప్రవాళము)గా రచించాను. మధురాపురంలో ఉన్న సింధుమతి అనే వేశ్యాంగనకు, జయుడనే రాజకుమారుడి మధ్యగల శృంగారాన్ని లిఖిస్తున్నాను. ఈమధ్యనే వాత్సాయన కామసూత్రాలపై జయమంగలుడి వ్యాఖ్యానాలు వచ్చాయి. ఎవరు ఇలాంటి గ్రంథం వ్రాసినప్పటికీ, వ్యాఖ్యానాలు, అనుకరణలూ వచ్చినప్పటికీ వాత్సాయనుడే ఈ రకం గ్రంధాలకు నాందీ వాచకం పలికాడు" అనగానే కుముదిని రెండు చేతులూ ఎత్తి దండం పెడుతూ "చాలు మహాప్రభో! చాలు! చాలు! చూస్తున్నాను.... పైగా అనుభవిస్తున్నాను కదా!... ఇవాళ నేను ఆలయానికి వెళ్ళి శ్రీరంగనాథుని దర్శనం చేసుకోవాలనుకుంటున్నాను. మనకు సుపుత్రుడు కలగాలని కోరుకుంటూ పూజలు, వ్రతాలు చేస్తున్నాను. ఈ శృంగారవరివస్య మాటలు కట్టిపెట్టడం మంచిది. రథం సిద్ధం చేయించండి. నేను వెళ్తాను" అనగా ఇదిగో గ్రంథం పూర్తయిపోయింది నేనూ వస్తాను నీతో%ా%" అనగానే నవ్వి'అవునా! మీశరీరాన్నే కాదు మనసునూ కాస్త శుభ్రం చేసుకుని

మరీ తయారుగా ఉండండి. వెళ్ళబోయేది దైవదర్శనానికి గోపనార్యా! ఐదు నిముషాల్లో వస్తాను" అని వెళ్ళింది.

"ఇది మదాపస్తంభ సూత్ర భారద్వాజస గోత్ర, నరసనామాత్యపుత్ర, శ్రీవేంకటేశ్వర కవితావిలాస, శ్రీమత్ప్రతివాదిభయంకర, వేదాంత దేశికోపదేశ, విమలీకృత శిక్షిత, శ్రీమదష్టాక్షరీ మంత్రరాజ, జపవిరాజమాన, నిజహృదయ కమలకర్ణి కార సుకవి జనవిధేయ గోపన నామధేయ ప్రణీతంబైన సింధుమతీ విలాసంబను శృంగారరస ప్రధాన ప్రబంధంబున ద్వితీయాశ్వాసంబు, సంపూర్ణంబు." సింధుమతీ విలాసానికి గోపన ఈ విధంగా ముగింపు పలికి గ్రంథం కట్టలుగా కట్టి లోపల పెట్టి కుముదినితో ఆలయానికి బయలుదేరాడు.

ఇదే కాలంలో విద్యాభ్యాస సమయంలో జరిగిన గుర్వాజ్ఞ ప్రకారం "అగస్త్యసంహిత" కు వ్యాఖ్య వ్రాసి, గురువైన దేశికాచార్యులకు స్వయంగా చదివివినిపించి సంతోషపరచాడు. రోజులుగడుస్తున్నాయి. కుముదిని గర్భవతియై పండంటి మొగ పిల్లవాణ్ణి ప్రసవించింది. గోపన కుమారుడికి 'అయ్యన' అని పేరుబెట్టి అల్లరుముద్దుగా పెంచసాగారు.

గోపన్న శ్రీరంగంలో మాదిరిగానే జెంజిలో పూజాదికాలు జరిపించడం ఆరంభింపజేశారు. ఒకవైపు శ్రీరంగం గురించి ఆలోచిస్తూ.. కొన్ని సమయాల్లోరాచకార్యాలలో మునిగి మరచిపోతున్న సందర్భాలలో, స్వప్నంలో సింహం గర్జిస్తూనే ఉంది. మరలా గోపన్న తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించే సరికి, మధురా విజయానికి అడుగులు దగ్గర పడ్డట్టుగా కొన్ని సంఘటనలు జరిగాయి. అక్కడకు దగ్గరలో ఉన్న మధురై సుల్తాన్

దగ్గర నమ్మకంగా పనిచేసే తిరుమణత్తూన్ సింగప్పిరాన్ అనే పేరుగల భక్తుని సహాయంతో మధురై సుల్తాన్ గురించి ఎన్నో గొప్ప రహస్యాలు వల్లభదత్తుల ద్వారా రాబట్టారు. మధురై విజయానికి ఈ గోపన్న తంత్రం ఎంతగానో సహాయపడుతుందని గోపన్న ఆ సమయంలో ఊహించలేదు.

ఒకరోజు వైశాఖ మాసంలో గోపన్న రంగనాథ స్వామిని దర్శించుకుని ఆనందంగా వెలుపలకు వచ్చారు. ఆలయం బయట ఇద్దరు యువకులు ఒక ముదుసలిని తీసుకుని వచ్చి గోపన్న దర్శనార్థం వేచి ఉన్నారు. యువకుడు గోపన్న పాదాలకు సాష్టాంగ నమస్కారం చేశాడు. ఆ ముదుసలి నమస్కారంచేసి నిలబడింది. గోపన్న "చాలు వల్లభా! ఇకలే!" అనగానే వల్లభుడు లేచి నిలబడ్డ వల్లభుడు "గోపనార్యా! ఈమె నాతల్లి వాసంతిక. సత్యమంగళం నుండి మీ దర్శనార్థం శ్రమపడి వచ్చింది. ఆమెను మీరు గతంలో చూసి ఉన్నారనుకుంటాను." అని నమస్కారం పెట్టి నిలబడి ఉన్నాడు.

గోపన్న తన ఎదురుగా నిలబడ్డ వృద్ధనారిని చూశాడు. మొహంలో గొప్ప కళ, వర్చస్సు. రాచరికం గోచరమవుతోంది. గొంతు సవరించుకొని "గోపన్నగారూ...మీరు మధురై పట్టణాన్ని ఎప్పుడు ముట్టడించబోతున్నారు?" అని దాపరికమూ, మొహమాటమూ ఇలాంటివేమీ లేకుండా సూటిగా అడిగింది. గోపన్నకు ఈ హటాత్ పరిణామానికి ఏమి సమాధానం చెప్పాలో తోచలేదు. పది సంవత్సరాల క్రితం తను చేసిన ప్రతిజ్ఞ వల్లభుడికి కూడా తెలుసు. ఆమే అందుకుని "నా శ్రీరంగనాథ స్వామి విగ్రహాన్ని ఎప్పుడు శ్రీరంగం చేరుస్తారో చెప్పండి? ఆ సమయంకోసమే నేనింకా జీవించి ఉన్నాను." ఆవేశంగా అంటూ ఉండగా, గొంతు పూడుకునిపోగా శోషతో

నీరసంగా స్పృహతప్పి క్రింద పడిపోయింది. గోపన్న వల్లభుడు ఆమెను మెల్లిగా లేపి ఆలయం మెట్లమీద కూర్చొండచేశారు. ఆమె మొహంపై చల్లటినీళ్ళు తెప్పించి చల్లాడు. ఆమె లేచి పైట కొంగుతో మొహం తుడుచుకుంది. ఆమె కళ్ళ వెంట ధారాపాతంగా కన్నీళ్ళు ఉబికి ఉబికి వస్తుండడం గమనించిన గోపన్న ఆశ్చర్యపోయాడు.

"ఇంకా కొద్ది రోజులు ఓపిక పట్టవలసి ఉన్నదమ్మా! తప్పదు" అని చిన్నగా ఆమెకు వినిపించేట్టు అన్నాడు.

"ఇంకా ఎన్నిరోజులు స్వామీ! 10 సంవత్సరాలనుండి కాలయాపన జరుగుతూనే ఉంది. శంభువరాయుని కోట ముట్టడి జరిగిన వెను వెంటనే మీరు మధురైని జయిస్తారని వేయి కళ్ళతో ఎదురు చూశాను. కళ్ళు కాయలు కాస్తున్నాయి. నా స్వామి పరాయి పంచన ఇంకా ఎన్నిరోజులుండాలో సెలవివ్వండి?" అని సూటిగా బాణంలా ప్రశ్న వదిలింది.

"అమ్మా... వాసంతికా!... నువ్వు అన్నది అక్షరాల నిజం. శంభువరాయుని కోట ముట్టడించగానే మధుర వైపు సేనలను తరలించాలని నేనూ ఆశించాను. కానీ..."

"కానీ...మీకొచ్చిన అడ్డంకేమిటి? అప్పటికే సైన్యం మంచి ఉత్సాహంగా మధురై కోటను ముట్టడించడానికి ఉన్నారని విన్నాను"

"అంతలోనే అనుకోని అవాంతరం వచ్చింది. మనకు ఉత్తరాన ఉన్న బహమనీ సుల్తానులు మనలను ముట్టడించడానికి అదే సరైన సమయమని ఎత్తులు వేస్తున్నట్టు వేగుల వార్తలు వచ్చాయి"

"బహమనీలు ఎవరు స్వామీ!"

"బహమనీ సుల్తానులు అనుక్షణం విజయనగర సామ్రాజ్యం కబళించడానికి

చూస్తున్న సుల్తానులు. వీలైనప్పుడల్లా మన సామ్రాజ్యంలోకి చొరబడి మన సరిహద్దులను దాటి, భూభాగాన్ని ఆక్రమిస్తున్న సుల్తానులు. వారిది అపారమైన సైన్యం. అలా ఆక్రమించినప్పుడల్లా మనం అప్రమత్తమై, వారిని అక్కడనుండి వెనక్కు పంపేందుకు ఒక్క ఉత్తర సైన్యం మాత్రమే సరిపోదు. దక్షిణాది సైన్యం కూడా సహాయం కావాలి. వాళ్ళు అతి కిరాతకులు. అందువల్ల ఈ పది సంవత్సరాలూ వాళ్ళను నిలువరించి మన సైన్య బలాన్ని వారికి చూపడమే సరిపోతున్నది. నేను నిస్సహాయుడను. వాళ్ళకు ఇప్పుడిప్పుడే మన సైన్యబలం తెలిసి ఈమధ్యనే గొడవలకు దిగడం, మనల్ని కవ్వించడం తగ్గించారు.

"ఇప్పుడు మనం మధురను ఎదిరించడానికి ఆటంకాలేమైనా ఉన్నాయా స్వామీ!"

"మహామండలేశ్వరుడైన బుక్కరాయలవారితోను, కంపనతోను చర్చించవలసి ఉన్నది. కొంత సమయం పడుతుంది. ఇప్పటికిప్పుడే ఏమీ చెయ్యలేమని అనుకుంటున్నాను" ఆమాటలకు వాసంతిక మళ్ళీ స్పృహ తప్పి మెట్లపై వాలిపోయింది. గోపన్న రాజవైద్యుని పిలిపించి ఆమెకు స్వస్థత చేకూర్చమని చెప్పి మౌనంగా వెళ్ళిపోయాడు.

గోపన్న జెంజి కోట పైకి వెళ్ళి ధ్యానంలో కూర్చున్నాడు. ఆలోచన సముద్రంలో పడి సుళ్ళు తిరుగుతున్నాడు. ఎప్పటి తన ప్రతిజ్ఞ! పదేళ్ళు రివ్వుమని గడచిపోయింది. ప్రతిజ్ఞ నెరవేర్చుకున్న తర్వాత మాత్రమే వివాహం చేసుకొనాలనుకున్న తన మాట చెల్లనీయక తల్లిదండ్రులు, అత్తమామలు, కంపనా, గంగాదేవి అంతా కలిసి తను ప్రేమించిన

కుముదినితో బలవంతంగా వివాహం జరిపించారు. కంపన మధురను సమయం చూసి జయిద్దాం, నీ ప్రతిన తప్పక నేరవేరుతుందని ఎప్పటికప్పుడు గట్టి హామీ ఇస్తూనే ఉన్నాడు. సంసార సౌఖ్యాలనుభవిస్తూ ప్రతిజ్ఞ నేరవేర్చలేదన్న రంపపు కోతను మనసులో భరిస్తూ, శ్రీరంగనాథుని ప్రతిరోజూ ఉదయం రాత్రీ క్షమాపణలను కోరుతూనే ఉన్నాడు. మనసును సమాళించుకోవడానికి గ్రంధ రచన చేపట్టాడు. మధురై సుల్తానులు తమిళ రాష్ట్రాన్ని హస్తగతం చేసుకుని ఇప్పటికి 43 సంవత్సరాలైంది. దీనికి అంతం ఎప్పుడో అర్ధం కావడంలేదు. సుదీర్ఘ ఆలోచనలతో ఉన్న తనను మేడ పైకి వచ్చి ఎవరో సైనికుడు "మీకు ఆహారం సిద్ధమైందని కుముదినీదేవి గారు చెప్పమన్నారు" అన్నాడు. అప్పటికే ఊరు మొత్తం ప్రశాంతమయింది. అందరూ నిద్రలోకి జారుకుంటున్న వేళ. భోజనం గురించిన ఆలోచన లేకుండా వేగంగా మెట్లు దిగి గుర్రం ఎక్కి బయలుదేరి ఆలయ పూజారి ఇంటికి చేరుకున్నాడు.

అయ్యా! గోపనగారా! ఇదేమిటి ఈసమయంలో వచ్చారు?" అని ఆశ్చర్యం ప్రకటించాడు.

"అయ్యా! అర్చకోత్తమా! ఒక సారి ఆలయం ద్వారాలు వెంటనే తీయాలని మిమ్మల్ని ప్రాధేయపడుతున్నాను"

"ఎంతమాట! మీ అనుజ్ఞల మేరకు నడుచుకునే జీవితాలు మావి. ఒక్క క్షణం స్వామీ!"

తాళాలు తీసుకుని ఇద్దరూ కొండపైకి ఆలయం మెట్లెక్కి గబగబా చేరుకున్నారు. తాళాలు తీసిన ఉత్తరక్షణంలో గోపన్న శ్రీరంగనాథుని సన్నిధి వద్దకు చేరుకున్నాడు. కాళ్ళకు ఏదో తడిగా తగలడంతో చేతితో ఏమిటా

అని ముట్టుకుని దివిటీ వెలురులో చూసి అది రక్తం అని గుర్తించాడు.
"ఇక్కడ రక్తం ఉన్నది. ఎలా వచ్చింది?"

పూజారి భయపడుతూ "గోపన్నా ఉదయం వచ్చిన ముదుసలి రక్తం వాంతి చేసుకున్నట్లున్నది. నేను గమనించలేదు. ఆమె మూతికి మాత్రం రక్తం చారికలు చూశాను. నేను గమినించే ఉంటే శుభ్రపరిచేవాడిని క్షమించండి!"

"మీరు దయచేసి ఇక్కడే ఉండండి! నేను వెంటనే వస్తాను" అని చకచకా మెట్లు దిగి వెళ్ళిపోయాడు గోపన్న.

జెంజిలో ఉన్న అన్ని సత్రాలలో వాకబు చేయించగా ఆఖరికి ఒక సత్రంలో వల్లభుడు, అతని తల్లి వాసంతిక ఉన్న విషయం తెలిసి లోనకు వెళ్ళాడు.

వల్లభుని తల్లి స్పృహలోనే ఉంది. కానీ ఆయాసంగా ఉండడంతో వల్లభుడు వైద్యుడిచ్చిన కషాయాన్ని తాగిస్తున్నాడు. ఆమె వెంటనే కంచికి వెళ్ళాలని అంటున్నది. వల్లభుడు కొద్దిరోజుల తర్వాత వెళ్ళవచ్చునని వారిస్తున్నాడు. ఆమె మాట వినడంలేదు. తనను చూస్తే ఇంకా ఆమె ఆవేశపడుతుందేమోనని గోపన్న మెల్లిగా బయటకు వచ్చేశాడు. సత్రపు నిర్వాహకుడు నమస్కరించి ''ప్రభూ!..వారు మీకు కావలసిన వారనుకుంటాను. ఆమె మొండి పట్టుదలతో ఉన్నది. ఎవరు చెప్పినా వినడంలేదు. ఇప్పటికిప్పుడే కంచికి తీసుకెళ్ళమని పోట్లాడుతున్నది. ఆమెను వల్ల ప్రయోజనం లేకపోగా నష్టమే వాటిల్లుతుందని గ్రహించిన గోపన్న మెల్లిగా బయటకు వచ్చేశాడు. దారిలో ఆలోచిస్తున్నాడు. ఒక స్త్రీకి అంత పట్టుదల ఎలా వచ్చింది? ఎంతటి భక్తురాలు ఆమె? ఆ స్వామి పరిస్థితిని గూర్చి ఆమెకు అంతటి పట్టుదల వచ్చి, జెంజి పాలకుణ్ణైన నన్నే నిలదీసే

శక్తి ఆమెకు కలగడం దైవ నిర్ణయమే! తనకు శూలం గ్రుచ్చుకున్నట్లున్నది. ఆలోచిస్తూ మెట్లెక్కి ఆలయం చేరుకునే సరికి ఆలయం శుభ్రం చేసి ఉన్నది. గోపన్నను చూడగానే కునికిపాట్లు పడుతున్న పూజారి లేచి నిల్చున్నాడు.

"స్వామీ! నేటి ఉదయం నేను వెళ్ళిపోయిన తర్వాత ఆ ముదుసలి స్త్రీ, అదే వాసంతికాదేవి ఆమె పరిస్థితి ఏమిటి? ఏమి మాట్లాడింది?"

మీరు వెళ్ళగానే వైద్యుడు వచ్చి భస్మాలు కొన్ని మ్రింగించి, కషాయం తాగించి వెళ్ళిపోయాడు. కొడుకు విసనకర్రతో వీవడం చేశాడు. ఆమె కొంత సేపటికి లేచి శివంగిలా గర్భగుడిలోకి పరుగులు తీసింది. వెనుక ఆమె కొడుకు పరుగులు తీశాడు. ఆమెకు పిచ్చెక్కిందేమో అనుకునేట్టుగ్గా ఊగిపోతూ నిల్చుని "స్వామీ! రంగనాథా ! నీ స్వాధీనంలో ఉన్నవారికి ఏమీశక్తిలేదు. నిష్ప్రయోజకులైనారు. ఇంకెన్నాళ్ళు పరాయి ఆలయాలలో కాలం గడపాలనుంకుంటున్నావో నాకు తెలియదు. నా ఆరోగ్యం క్షీణిస్తున్నది. నిన్ను శ్రీరంగంలో ప్రతిష్టించేందుకు నా వంతు కృషి నేను చేస్తాను. ఈ రాజులు, చక్రవర్తులు అంతా అధికారాలు అనుభవించేందుకే! నిన్ను శ్రీరంగంలో ప్రతిష్టించేంతవరకూ నా ప్రాణాలు కాపాడుకుంటాను. అంతవరకూ ఈ క్షయరోగమే కాదు. ఏ రోగము నన్ను ఏమీ చేయలేదు. నిన్ను ఇలా చూడలేక పోతున్నాను. అందుకే నేనే ప్రయత్నించి నిన్ను కదిలిస్తాను. నిన్ను కదిలించలేకపోతే నేను వాసంతికాదేవినే కాదు! " అంటూ ఒక సవాల్ విసిరినట్టు మాట్లాడి గబగబా వెళ్ళిపోయింది.

ఆమాటలు వినగానే గోపన్నకు తలకొట్టేసినట్లైంది. వెంటనే అక్కడ ఉన్న పెద్ద స్తంభానికి తలను కొట్టుకోవడం మొదలుపెట్టాడు. పూజారి

గారు "అయ్యా! ఆపండి! ఏమిటీ ఆగాయిత్యము! శాంతించండి. అన్నీ మనచేతిలో ఉండవు కదా!" అని ఆపాడు. గోపన్న తీవ్ర ఆవేదనాపరుడై "లేదు పూజారి గారూ! ఇదే నాకు తగిన ప్రాయశ్చిత్తం! శంభువరాయుని జయించిన తర్వాత మధురపై దండెత్తుతానని, స్వామిని పునఃప్రతిష్ట చేస్తానని ఉత్తర కుమారుని ప్రగల్భాలు పలికి, చివరకు, జెంజికి చేరుకుని, సంసార సుఖాలను హాయిగా అనుభవిస్తూ, ఎదురుగా ఉన్న మధురై సామ్రాజ్యాన్ని దురవస్థను ఈరెండు కళ్ళతో చూస్తూ కూర్చున్నాను. నేనైనా సాహసించి మధురపై దండెత్తి ఉండవలసినది. నా వెంట వేల సైన్యం ఉన్నా ఏమీ చేయలేని అసమర్థుణ్ణి. పూజారిగారూ! నాకిప్పుడే ఒక మంచి ఆలోచన వచ్చింది. మీరు స్వామి వద్దకు వెళ్ళి ప్రార్థించి రెండు పూబంతులలో ఒకదానిలో తులసి ఆకు, ఇంకోదానిలో అరటి ఆకు ముక్క పెట్టి తీసుకురండి. ఆ స్వామి ఆంతర్యం ఏమిటో ఇప్పుడే తెలుసుకోవాలని ఉంది" అన్నాడు. పూజారి ఈ పరీక్ష ఏమిటో అర్థం కాక చెప్పినట్లు చేశాడు. గోపన్న "ఓం నమో నారాయణాయ!" అంటూ కళ్ళు మూసుకుని ఒక బంతిని చేతిలోకి తీసుకుని తెరచి చూశాడు. అందులో తులసి పత్రం ఉన్నది. ఆనందంతో పరవశించి పోతూ "పూజారి గారూ...నా ఆలోచనలకు స్వామి అంగీకారం తెలిపారు. ఇక ఆగే పని లేదు. అంటూ స్వామికి సాష్టాంగ నమస్కారం చేసి బయలుదేరాడు.

మరుసటిరోజు మంచి ముహూర్తం చూసుకుని కాంచీపురానికి బయలుదేరే సమయానికి, ఇద్దరు రాజభటులు వచ్చి మూడు రోజుల అనంతరం ఒక అత్యవసర సమావేశం ఉన్నదని కంపన మహారాజులుంగారు

మిమ్మల్ని తప్పక కంచికి విచ్చేయమని సెలవు!" అని వెళ్ళిపోయారు. గోపన్న ఎంతగానో సంతోషిస్తూ బయలుదేరాడు. ప్రస్తుతం కాంచీపురం విజయనగర రాజుల పాలనలో పూర్వ వైభవం సంతరించుకుని ప్రఖ్యాతి గాంచింది. శంభువరాయుని పాలనలో తగ్గిన పవిత్రతను పునరుద్ధరించారు. బుక్కరాయలు, కంపనలపాలనలో ధార్మిక ఆధ్యాత్మిక జీవనం మళ్ళీ చిగురించింది. వ్యాపారస్తులు మళ్ళీ వర్తక సంబంధాలను పునరుద్ధరించాక రాజవీధుల్లో ప్రజలు హాయిగా స్వేచ్ఛగా కిటకిటమంటూ సంతోషంగా తిరుగుతున్నారు. కంపరాయలు తన నివాసాన్ని కాంచీపురానికి మార్చిన తర్వాత క్రొత్త క్రొత్త రాజ భవనాలు వచ్చాయి. రాజభవనాల్లో ఉద్యానవనాలు, రాచస్త్రీలు జలక్రీడలకు సరస్సుల లాంటివి నిర్మించబడ్డాయి.

గోపన్న కంచికి చేరుకునే ముందుగా కాంచీపురంలో కంపరాయలు గంగాదేవితో కలిసి సరస్సులో క్రీడిస్తూ జలవిహారం చేస్తున్నాడు. రాయలు క్రీడించే సమయంలో శ్రద్ధగా గమనించిన గంగాదేవి రకరకాల వర్ణనలతో కంపనుణ్ణి తన కావ్యంలో వివరించేది. కంపరాయలు క్రీడించడం దేవలోకంలో ఇంద్రుడు అప్సరసలతో జలక్రీడలాడినట్లున్నదని ఆమె వర్ణించేది. గోపన్న కాంచీపురం చేరుకునే సరికి కంపన స్నానాదులు ముగించి, పూజాదికాలు గావించి, అల్పాహార విందు, ఫలాహారం కానిచ్చి సభకు బయలుదేరాడు. ప్రముఖులతో మాట్లాడిన పిమ్మట అన్య మనస్కంగా రాజభవనం చేరుకుని "గంగా! శరీరంతో పాటూ మనసూ అస్వస్థతకు గురైనది" అంటూ హంసతూలికాతల్పం మీద పడుకున్నాడు.

"స్వామీ! ఏమిటీ అకాల అలసట! కొలనులో జలకాలాడి రాచకన్యలతో సరససల్లాపాల కారణమా?" అంది చమత్కారంగా ఒక పుష్పాన్ని కంపన

చెంపకు తాకిస్తూ.

"గంగా! నీవు రచయిత్రివి కాబట్టి ఆ దిశలోనే నీ ఆలోచనలు సాగుతాయి. నాకు బాధ్యతలెక్కువ! అందుకే ఈ శిరోభారం!

"ఏమైంది స్వామీ! మళ్ళీ బహమనీ సుల్తానులు ఏదైనా కల్లోలం సృష్టిస్తున్నారా?" అని కంగారు వ్యక్తం చేసింది.

"కాదు కానీ.. ఒక్క విషయం చెప్పు. వచ్చే గురువారమే కదా! మన ముఖ్య మంత్రి మారయ్య నాయకుని మనుమరాలి మొదటి పుట్టిన రోజు వేడుకలు?"

"అవును నిజమే! ఇప్పుడు ఆ విషయం యిప్పుడెందుకు జ్ఞప్తికొచ్చింది తమరికి?"

"సమయం చూశావా గంగా ఎలా పరుగులెత్తుతున్నదో! మనం కాంచీపురానికి వచ్చి పది సంవత్సరాలైంది. నీకు గుర్తుందా! ఆ సమయంలో మారయామాత్యుని కుమార్తె పద్మిని ఐదేళ్ళ పసిపిల్ల. ఇప్పుడా పిల్లకు వివాహమై మరో పాప కూడా పుట్టింది. అయినా మధురై ఇంకా సుల్తాను పాలనలోనే ఉంది. సభలో ప్రధానమైన చర్చ దానిమీదే సాగింది. గోపన్నతో సహా నేనూ సిగ్గుపడుతున్నాను. గోపన్న ప్రతిజ్ఞ చెల్లించకుండా మనం అతని బలవంతంగా వివాహానికి ఒప్పించాం. అతను బాధపడుతున్నాడు. కంటికి నిద్ర రావడంలేదని, భోజనం రుచించడంలేదని, రతికేళీ విలాసాలుకూడా మానేశాననిచెప్పి, కలిసినప్పుడల్లా, మధురపైదండయాత్ర గుర్తుకుతెస్తూ కన్నీళ్ళు పెట్టుకుంటున్నాడు.

"నిజమే! గోపన్నగారు సద్బ్రాహ్మణుడు! విద్యావంతుడు! అతని ప్రతిన చెల్లింపజేయవలసిన బాధ్యత మనకున్నదనడంలో ఎలాంటి సందేహం

లేదు. నాకూ మనసులో ఉన్న బాధను అణచుకొని ఉన్నాను. మధుర సుల్తానును జయించడానికి సమయం ఆసన్నమైనట్లు సంకేతంగా నిన్న రాత్రి మధుర మీనాక్షి నాకు కలలో కనబడి అశీర్వదించింది. ఆ వివరాలు తర్వాత ముచ్చటిస్తాను. మీరు చాలా అలసిపోయారు. నిద్రించండి! అంటూ నుదిటి మీద చేయివేసి "స్వామీ! జ్వరం కూడా ఉన్నట్టుంది. మీరు విశ్రాంతి తీసుకోండి" అని చెప్పి వెళ్ళిపోయింది.

కంపనకు రెండు రోజులకు గాని జ్వరం తగ్గలేదు. మూడో రోజు దీపాలు వెలిగించాక విశ్రాంతిగా తన మందిరంలో పడుకుని, మధుర దండయాత్ర సన్నాహాల గురించే దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. అంతలో పరదాల వెనుక ఏదో ఆకారం కదిలినట్లైంది. ఎవరో మేలిముసుగుతోఉన్న స్త్రీ మూర్తి! కంపన అనుమతిలేకుండా చీమైనా దూరలేని మందిరంలోకి వచ్చిన స్త్రీ ఎవరు? దిగ్గున లేచి కూర్చున్నాడు. ఆ స్త్రీమూర్తి చిన్నగా రోదిస్తున్నది. శిలా ప్రతిమలా తెరల వెనుక నిలబడి ఉన్నది. ఒక్కసారి నేను కల కనడంలేదు కదా అని కళ్ళు నులుముకుని చూశాడు. "ఎవరు నువ్వు? లోపలికి ఎలా వచ్చావు? నీ రోదనకు కారణం ఏమిటి?" ప్రశ్నించాడు.

"నేనెవరో కూడా గుర్తుపట్టలేకపోతున్నావా కంపనా?"

"చెప్పమ్మా ఎవరు నువ్వు?"

"మధుర మీనాక్షినే గుర్తుపట్టనంతటి దుస్థితిలో మహారాజే ఉంటే ఇంక ప్రజల గతేమిటి?"

కంపనకు వళ్ళంతా చెమటలతో తడిసి ముద్దయిపోయాడు. గుండె వేగంగా కొట్టుకుంటుండగా భావోద్వేగంతో తల్పం దిగి మోకాళ్ళపై కూర్చుండి

పోయి "దేవీ! ఆజ్ఞ!" అన్నాడు.

"కంపనా! ఒక్క సారి శ్రీరంగాన్ని చూడు. ఆలయం క్రమక్రమంగా కూలిపోవడం గమనించిన ఆదిశేషుడు తన పడగలడ్డుపెట్టి కాస్తున్నాడు. కేవలం శ్రీరంగమే కాదు. ఈ ప్రాంతంలోని ఆలయాలన్నీ దుస్థితికి చేరుకున్నాయి. ఆలయాల తలుపులు చెద పురుగులు తినేస్తున్నాయి. పిచ్చి మొక్కలు ఆలయమంతా ప్రాకిపోయాయి. వాటిని ఆలయాలనే కంటే చిట్టడవులు అంటే మేలు. చక్కని మృదంగ తరంగాలు వినబడాల్సిన చోట నక్కలు, తోడేళ్ళ అరుపులు వినిపిస్తున్నాయి. కావేరీ నది తన ఇష్టం వచ్చినట్టు ప్రవహిస్తోంది. దాని గతిని నియంత్రించే వారే, నిర్దేశించేవారే లేరు. వేదాధ్యయనం జరిగినచోట మద్య మాంసాల వ్యాపారం సాగుతోంది. ఉద్యానవనాలు రాచబాటలు కనుమరుగై, అక్కడి చిట్టడవుల్లో అస్తిపంజరాలు వేలాడుతున్నాయి. చెరసాలలన్నీ ధార్మికులతో, ఆధ్యాత్మిక పండితులలో నిండిపోయాయి. చక్కని చందన సుగంధాన్ని విరజిమ్మే తామ్రపర్ణీ నది నేడు శవాలతో రక్తమయమైంది. ఈ ప్రాంత ప్రజల దుస్థితిని నీకు వినిపిద్దామని వచ్చాను" అనగానే – "తల్లీ.. నన్ను క్షమించు!" అంటూ కన్నీరు కార్చాడు.

"కంపనా ఇటు చూడు! ఇది ఒక దివ్యకరవాలం. దీన్ని విశ్వకర్మ మహాశివునకు సమర్పించాడు. మహాశివుడు పాండ్యులకు కానుకగా ఇచ్చాడు. వారు తరతరాలుగా దీన్ని దాచుకొని క్షత్రియ ధర్మం కాపాడారు. ఇప్పుడు పాండ్య వంశం ఏమైందో తెలుసుగదా! అందుకే అగస్త్యమహర్షి దాన్ని నాకు సమర్పించి నీ వద్దకు వెళ్ళమని, మధురపై దండెత్తమని చెప్పి

పంపాడు” కంపన ఆ ఖడ్గాన్ని మీనాక్షీదేవి అక్కడ పెట్టడం చూశాడు.

“కంపనా విజయనగరవంశరక్తం నీలో ప్రవహిస్తున్నది. నీవు సహజంగానే వీరుడవు. శతృభయంకరుడవు! నీకు సరిజోడు గోపనామాత్యుడు. కారణజన్ముడు! ఆ బ్రాహ్మణోత్తముడు, ఈ వీర ఖడ్గం నీ వద్ద ఉన్నంతవరకూ దేవతలు కూడా నిన్ను తాకలేరని అగస్త్యముని చెప్పాడు. నీవు అలనాడు శ్రీకృష్ణుడు కంసుణ్ణి చంపి మధురను కాపాడినట్టుగా నువ్వు మన మధురను కాపాడు. మీ ఇద్దరూ విజృంభించి సుల్తాను తల తెగనరికి విజయస్తంభాన్ని నాటించండి. మీ యిద్దరి చరిత్ర శాసనాల్లో ఈ కలియుగం ఉన్నంతవరకూ చిరస్థాయిగా ఉండిపోతుంది. నీవు ఈ తమిళ ప్రాంతానికి తిరుగులేని మహామండలేశ్వరుడవవుతావు. జయోస్తు! విజయోస్తు కంపనా!” అంటూ చెయ్యెత్తి ఆశీర్వదించి తెరలచాటున మాయమయింది మీనాక్షీ దేవి. మీనాక్షీదేవి అలా అంతర్ధానం అవగానే తెరలు గాలికి అదేపనిగా ఊగడంతో అక్కడున్న పెద్ద దివిటీ ఆరిపోయి కటిక చీకటి అలుముకొంది.

ఎవరక్కడ! అని కంచుఫలకాన్ని పలుసార్లు మ్రోగించాక పరిచారకుడు వచ్చి ‘‘జయము! జయము! మీ ఆరోగ్యం సరిగాలేదని..మిమ్మల్ని పూర్తివిశ్రాంతి తీసుకోనివ్వమని, ఎట్టిపరిస్థితుల్లోనూ మీకు అంతరాయం కలిగించరాదని గంగాదేవిగారి అనుజ్ఞ! క్షమించండి” అంటూ దివిటీలను, దీపాలను వెలిగించాడు. “అటువైపు ఎవరైనా స్త్రీమూర్తి వచ్చారా?” అన్న ప్రశ్నకు “లేదు ప్రభూ! మాకు తెలియకుండా ఈ గదిలోకి ఈగ కూడా ప్రవేశించలేదు” అని వెళ్ళిపోయాడు.

“మీనాక్షీ మాతా!” అంటూ నమస్కరించి తనకు ఏదో ఖడ్గం

బహూకరించానన్న మాట జ్ఞప్తికి వచ్చి చుట్టుప్రక్కల ఉన్న బల్లలపై చూశాడు. తెరకు దగ్గరగా ఉన్న ఒక వింతవస్తువు అతని చేతికి దొరికింది. అది మధుర మీనాక్షీదేవి బహూకరించిన ఖడ్గం. కంపనుడికి మళ్ళీ శరీరం చమటతో తడిసి ముద్దయింది. కళ్ళలో నీళ్ళు కారుతున్నాయి. మోకాళ్ళ మీద నిలబడి "తల్లీ.. ఈ దీనుణ్ణి వెదుక్కుంటూ వచ్చావా? నా సహాయం అర్థించావా అమ్మా!" అని ఆ ఖడ్గాన్ని పదే పదే కళ్ళకు అద్దుకున్నాడు.

– – –

"అమ్మా! నువ్వైనా చెప్పు! నీవు చేసింది గొప్ప అపరాధం తల్లీ!"

"ఏమిటి అపరాధం వల్లభా! మధుర వల్లకాడైపోతూ ఉంటే చూస్తూ ఉండమంటావా?"

"నీవు చేసింది మోసం కాదా?"

"కానే కాదు వల్లభా! ముమ్మాటికీ కాదు" అంటూ ఆయాసపడుతూ చెప్పసాగింది. కంపన ఏకాంత భవనానికి ముందు ఉన్న పరిచారిక అంతకుముందు మీ నాన్న కులశేఖరుని వద్ద పనిచేసిన స్త్రీ. ఆమెను బ్రతిమాలి, బామాలి ఒప్పించాను. మధుర మీనాక్షి వేషం ధరించి రాజుకు ఉపదేశం చేశాను. అతను నన్ను నమ్మి నా ఆజ్ఞను స్వీకరిస్తున్నట్లు చెప్పాడు. త్వరలో మధుర మన వశం కాబోతున్నది."

"నీవైనా చెప్పమ్మా నా మనసు అపరాధభావంతో నిండిపోయింది. రేపు నిజం తెలిస్తే అందరిని చెరశాలలో వేయడం ఖాయం"

"లేదు వల్లభా! అందుకే కంపనకు నమ్మకం కలిగేందుకు నేను ఇంకొక పని కూడా చేసి వచ్చాను. నువ్వు నన్ను మన్నించవలసిన పని అది!"

"ఏమిటా పని?" ఆసక్తిగా చూశాడు.

"నీకు పాండ్యులు బహూకరించిన ఖడ్గాన్ని కంపనకు ఇచ్చి దాన్ని దగ్గర ఉంచుకుంటే ముసల్మాన్లను అవలీలగా జయిస్తావని చెప్పి ఒక ధృఢనమ్మకం కూడా కలిగించాను"

"ఎంతపని చేశావమ్మా! అది నా ప్రాణ సదృశమైన ఖడ్గం! అంటూ నేలమీదకు ఒరిగిపోయి రోదించసాగాడు.

"ఏమిటి నాయనా? ఎందువల్ల?"

"ఇచ్చేముందు ఒక్కమాటకూడా నాకు చెప్పకుండా ఇచ్చావు గదమ్మా!" అంటూ తనకు మధురాంగిణి ఏ పరిస్థితులలో బహూకరించిన ప్రేమ కానుకన్న విషయం వివరంగా చెప్పి రోదించసాగాడు.

"నాయనా! విను! పాండ్యరాజులకు చెందిన వస్తువుపై నీకంత మక్కువ ఉండరాదు. అంతటి రాజవంశానికి చెందిన ఖడ్గంపై మనకు హక్కు లేదు. మనం అనర్హులం. నీ తండ్రి కులశేఖరుని మరణానంతరమే మనమన్నిటికి దూరమయ్యాం. మనం ఇప్పుడు సామాన్య ప్రజానీకం మాత్రమే! ఆమెను మరచిపోవడం మంచిది. మనకు అది అంత శుభాన్నివ్వదు" అంటూ తల్లి మళ్ళీ స్పృహకోల్పోయింది.

జెంజి నుండి వస్తున్న గోపన్న, మధ్యలో ప్రజల సభలు, మహజర్ల సమర్పణలవల్ల, మూడు రోజులకు గానీ కంచికి చేరుకోలేక పోయాడు. కొద్దిసేపు విడిదిలో విశ్రాంతి తీసుకుని కంచి వరదుణ్ణి దర్శించుకొని కంపనను కలవడానికి రాజభవనానికి వెళ్ళాడు. అక్కడ సోమప్ప, మారప్ప నాయకుడు, విఠ్ఠప్ప, సాళ్వమంగు, రాణి గంగాదేవి మొదలైన వారంతా ఉన్నారు. కంపన లేచి "స్వాగతం! గోపనార్యా! మీకోసం అంతా వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నాం. అందరూ విచ్చేసినా మీరు ఇంకా రాలేదన్న

కారణంతో ముఖ్యమైన విషయాలు సభలో ఇంకా మాట్లాడలేదు" అంటూ ఆహ్వానం పలికాడు.

మామూలు పాలనా విషయాలు మాట్లాడిన అనంతరం గోపన్న ఏదో విషయమై విచారంగా ఉండడం చూసిన కంపన "ఏమిటి! మీ విచారం? ఏమైనా సమస్యలా చెప్పండి?" అనేసరికి జెంజిలో జరిగిన వాసంతికా వృత్తాంతం చెప్పి "నాకు నిద్రపట్టడంలేదు మహారాజా! కళ్ళు మూసుకున్నా తెరుచుకున్నా నాకు మధురా పట్టణమే జ్ఞప్తికి వస్తున్నది"

"నిజం. నాకు జరిగిన సంఘటన అంతకంటే పెద్దది" అంటూ మధుర మీనాక్షి విచారంగా దర్శనమిచ్చిన విషయము, నవరత్న ఖచిత ఖడ్గాన్ని చూపే సరికి సభ మొత్తం నివ్వెరపోయింది.

"మహారాజా! మీరు అదృష్టవంతులు మీనాక్షీదేవిని కళ్ళారా చూడగలిగారు. నాకు భయంకర స్వప్నాలే ఇంకా కనిపిస్తున్నాయి." అని గోపన్న అన్నవెంటనే "నాకు మాత్రం చాలా విచారంగా ఉంది. శంభువరాయుని జయించి పదిసంవత్సరాలు దాటింది. ఈ ఆలోచనలతో నేను కృంగి పోతున్నాను. నాకు నేనే హీనంగా కనిపిస్తున్నాను. మీనాక్షమ్మకు ఏమీ సమాధానం చెప్పలేని వాణ్ణయిపోయాను"

వీరిద్దరి మాటలు భావోద్వేగాలు విన్న మారప్ప వెంటనే లేచి "మహారాజా! మీరు, గోపనామాత్యుల వారు అనవసరంగా విచారిస్తున్నారు. పది సంవత్సరాల నుండి మహామండలేశ్వరులు బుక్కరాయలవారు కాంచీపురానికి వచ్చి దర్శనం చేసుకోలేదంటే, ఎంత క్లిష్టపరిస్థితులలో బహమనీసుల్తానులను నిలువరించవలసి వస్తున్నదో ఒక్కసారి ఊహించండి. మనం చేతకాని వారమై చేతులు ముడుచుకుని కూర్చొని వుండడంలేదు.

ఉత్తరదిక్కు సమస్యే కంటక సదృశంగా ఉన్నది"

"అవును ప్రతి సారీ ఉత్తరదిక్కుకు ఎన్నో వేలమంది సైనికులను వంతుల వారీగా పంపిస్తూనే ఉన్నాం. మనకు తగిన సమయం రావాలి అంతే" అన్నాడు విఠప్ప.

"ఈ విషయాలందరికి తెలిసినవే! మనవంతు కృషి దక్షిణ దిశను జయించేందుకు మనం చేసిన వ్యక్తిగత కృషి ఏమీ లేదు" అని గోపన్న అనేసరికి "ఎటువంటి వ్యక్తిగతకృషి చేయాలి గోపన్నగారు? మనం ఉత్తర దిక్కును రక్షణలోనే అందరం నిమగ్నమై ఉన్నామా లేదా?" అని గద్దించాడు. మహారాజా! క్షమించండి! 10 సంవత్సరాల కాలం గడిచిపోయింది. మనకు కనీసం ఈ మధుర గురించి ఆలోచించే వ్యవధి కూడా లేదు. చాలా బాధగాను, ఆవేదనగానూ ఉంది. ఇకనైనా మనం తక్షణం ఆ విషయమే ఆలోచించమని ప్రార్థిస్తున్నాను" అన్నాడు గతంలో తండ్రి చెప్పినట్లు ఎవరితోనూ ఘర్షణగాను మనసు నొప్పించే విధంగానూ మాట్లాడకూడదన్న నిబంధన పాటిస్తూ.

"గోపనా! నాకూ ఆవేదనగానే ఉన్నది. మధురై సుల్తాను వద్ద ఉన్న సైన్యం రెండు లక్షలు. మనం వారిని కదిలించగలమంటారా? మీరే యోచించి చెప్పండి."

"మనకు అంత సైన్యబలగం ఉందా చెప్పండి గోపన్నగారూ!" అనేసరికి అంతా నిశ్శబ్దం. గోపన్న కూడా ఏమీ బదులు పలక కుండా అలా కాసేపు ఉండిపోయాడు. తర్వాత నిలబడి "మహారాజా! దేనికైనా మొదలంటూ ఉండాలికదా!" అన్నాడు.

"ఆ మొదలేంటో మీరే సెలవియ్యండి! అందరం వింటాం!" అని సోమప్ప

ఎత్తిపొడిచాడు.

"సోమప్పా! నీ విచారం రెండు లక్షల సైన్యం గురించేనా?"

"అవును నిస్సందేహంగా!"

"వివేకం, తెలివితేటలు, బుద్ధికుశలతలతో వ్యూహంపన్నవచ్చు!"

"అదే ఎలా?"

"అదే నేను ఆలోచిస్తున్నాను. కొంచెం సమయం కావాలి" అని గోపన్న అనగానే కంపన "నిజమే! గోపన్న చెప్పినట్లు అంత సైన్య బలం లేకపోయిన ఒక వ్యూహం ప్రకారం యత్నిస్తే మనం జయించవచ్చుననిపిస్తున్నది. మీ ఆలోచన ఏమిటో మొదట చెప్పండి"

"మహారాజా! సుల్తాను సైన్యం సుమారు రెండు లక్షలు. కానీ వారిలో సగం మంది మాత్రమే మధురలో ఉన్నారు. మిగిలిన సగం సైన్యం సమయపురంలో ఉన్నారు. అందువల్ల మనం మొదట ఒక బృందాన్ని ముట్టడించి సగం మందిని నాశనం చెయ్యగలిగితే మిగిలిన సగం మంది మనం చెప్పినట్లు మనవెంట బానిసలై వస్తారు. అప్పుడు తరువాతి బృందాన్ని జయించవచ్చని నేననుకొంటున్నాను"

"కానీ ఆ లక్ష సైన్యాన్ని ముట్టడించాలంటే మనవద్ద కనీసం 40 వేల సైన్యమన్నా కావలసి ఉంది" అన్నాడు సోమప్ప.

"వారిని జయించాలంటే ఎంత సైన్యం ఇంకా జమ కావలసి ఉంది?"

"దక్షిణాన మన సైన్యం 25 వేలమంది తయారుగా ఉన్నారు. ఇంకా కనీసం 20 వేల మందన్న ఉన్నట్లైతే... మనపని సులువవుతుందని ..."

"ఆ పని సులభంగా చెయ్యవచ్చు. వలనాడు మండల ప్రతినిధులను ఆహ్వానిద్దాం. పల్లె పల్లెలో మనతో కలసి నడిచే సైన్యం వేలకు వేలుగా

ఉంది. ఇది ధర్మంకోసం జరిగే యుద్ధం కనుక అందరూ సహాయం చేస్తారని నాకు నమ్మకం ఉంది"

"సరే! గోపన్న గారూ.. సైన్య సమీకరణ చేశాక మన వ్యూహం ఏమిటంటారు?"

గంగాదేవి కంపనుని వంక చూసి "మహారాజా!" అంది

"చెప్పండి మీ ఆలోచన, సలహా నిరభ్యంతరంగా చెప్పవచ్చు!"

"సుల్తాను బలాన్ని సైన్యంతో కాక వ్యూహంతో జయించాలని కదా మన అందరి ఆలోచన!"

"అవును"

"లక్ష సైనిక బలం ఉన్న వీరభళ్ళాలుని సుల్తాను ఎలా జయించాడంటారు? దీనికి చాలా మంది గూఢచారులను నియమించాడు. వారిద్వారా సులభంగా జయించాడు"

"కనుక.."

"కనుక మనం కూడా మొదట సుల్తాను అలవాట్లు, బలహీనతలు గమనించాలి. సైనికులెంతమంది ఉన్నారు? వారి పనితీరేమిటి? గమనించే గూఢచారులను నియమిస్తే మంచిదని అనుకుంటున్నాను. ఒక చక్కని ప్రణాలిక అమలు జేయగలిగితే లక్షమందిని మన సైనిక బలంతో లొంగదీసుకోవడం కష్టమేమీ కాదు. ఇది చరిత్ర చెప్తున్న సత్యం!"

"గంగా! భేషైన ఆలోచన!" కంపన అనగానే అంతా కరతాళ ధ్వని చేశారు. గోపన్న లేచి "మహారాణీ..మీ ఆలోచనను మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తూ.... మన రాజవల్లభుడిని అతడి స్నేహితుడైన దత్తుడిని గూఢచారులుగా నియమిస్తే మనపని సులువవుతుంది. వారు వీరులే కాక బుద్ధిబలం కూడా ఉన్నవారన్న విషయం మనకు ఇదివరకే ఋజువయింది"

అందరూ ఆ ఆలోచనకు సమ్మతించగా ఆ బాధ్యత గోపన్న మీదనే పెట్టారు.

గోపన్న రాజవల్లభుడిని దత్తుణ్ణి రావించి వారికి విషయం చెప్పాడు. మాకు తురక భాష వచ్చు. కానీ వాళ్ళతో ఎలా ఉండాలో, కావలసిన కార్యక్రమం ఏమిటో మీరే చెప్పండి అని గోపన్నను అడగ్గా, వారికి అప్పటికే గడ్డం బాగా పెరిగి ఉన్నందున ముస్లిం ఫకీర్ల వేషాలు వేయించి, మహమ్మదీయుల అలవాట్లను ఒక వారం పాటు నేర్పించగా, జెంజి ద్వారా వారు సుల్తాను సీమకు చేరుకున్నారు.

కొద్ది రోజుల ప్రయాణం తర్వాత వారికి ఎన్నో విషయాలు అర్థమయ్యాయి. గ్రామాలన్నీ క్రమ క్రమంగా జీర్ణించుకొని పోయాయి. చాలామంది సుల్తాను బాధలను భరించలేక మతం మార్చుకుని, ఉద్యోగాలలో చేరిపోయారు. దాదాపు 47 సంవత్సరాల కాలం గడిచాక అక్కడి ప్రజలలో ఎవరు ముస్లిం? ఎవరు హిందువు? పోల్చుకోలేని స్థితిలో ఆ సీమ తయారైంది. అందరూ గడ్డాలతోనే దర్శనమిస్తున్నారు. కొంతమందికి మీసాలు ఉంటే కొంతమందికి లేవు. ఒక తరం వారు అంతరించారు. క్రొత్త తరం వారు రహస్యంగా తమ మత విధానాలను ఇంట్లో పాటిస్తూ బయటికి వచ్చి ఉద్యోగాల నిమిత్తం "క్యాజీ..హాజీ.." అంటూ కాలం గడుపుతున్నారు. ఏ గ్రామానికి వెళ్ళినా రాత్రిపూట వీరభల్లాలుని గాథలు చెప్పుకోవడం, తోలుబొమ్మలాటలు ఆడడం చేస్తున్నారు. ఇలా వీరు ఫకీర్ల వేషంలో బాగా కుదురుకుని (కన్ననూర్) సమయపురం చేరుకున్నారు. సుల్తాను ఆ సమయంలో సమయపురంలోనే ఉన్నాడని విన్నారు.

వల్లభుడు “దత్తా! మనం ఒకసారి కావేరీ నదీ తీరం చేరుకుందాం. నాకు ఒకసారి కావేరీ నదిలో పవిత్ర స్నానం చేసి మన కార్యక్రమం అమలు చేయాలని ఉంది” అన్నాడు.

“నిజమే వల్లభా! అలాగే చేద్దాం. దానికంటే ముందు మన కార్యక్రమానికి యువకుడు కాక అప్పటితరం వాణ్ణి వెదకి పట్టుకుందాం. ఆ తరువాత నీ మాట ప్రకారం వెళ్దాం”

“సరే! ఇప్పుడు ఇంత కాలం తర్వాత తర్వాత ఎవరిని పట్టుకుంటాం?”

“నేనొక మాట చెప్తాను విను. మా తల్లిగారు కొంత కాలం ఈ ప్రాంతంలో అంటే ఉత్తరభాగంలో ఉన్నారు. ఆమె ఎప్పుడూ అళగియమనవాళం అనే ప్రదేశంలో సింగప్పిరాన్ అనే వ్యక్తి చాలా మంచివాడని, మా వంశానికి దూరపు బంధువని చెప్తూ ఉండేది. నాకు మొదట అళగియమనవాళం వెళ్ళాలని ఉంది.

“సరే అలాగే అదే మంచి పని. మనవాడంటూ మనకొకడుంటే మనం ఇక్కడి వాళ్లమని జనం అనుకునే అవకాశం ఎక్కువ”

ఇద్దరూ ఉత్తరంగా నడిచి నడిచి అళగియమనవాళం చేరుకున్నారు.

– – –

ఆ గ్రామం మొత్తం జీర్ణావస్తలో ఉంది. ఫకీర్ల వేషాల్లో ఉండడం వలన ఎవరూ వీరిని కనీసం పలకరించకుండానే తలుపు వేసుకుంటున్నారు. కొందరు స్త్రీలు నాట్యగత్తెలుగా వేషం వేసుకుని, కళ్ళకు గజ్జెలు కట్టుకుని ఒక ఇంటి ముందు నిలబడి ఉన్నారు. ఒక వ్యక్తి పసిమి ఛాయలో ఎంతో అందంగా ఉన్నాడు. వీళ్ళ దగ్గరకు వచ్చి “లోనకు దయచేయండి! తమకు తోచింది ఇవ్వండి బలవంతమేమీ లేదు” అంటూ ఆ ఇంటిలోనికి తీసుకుని

వెళ్ళి "ప్రస్తుతానికి మద్యం దొరకడంలేదు..అందువల్ల..నాట్యాన్ని మాత్రం తిలకించండి" అన్నారు. వాళ్ళు నాట్యం చేయసాగారు. వారిలో ఒక స్త్రీ మాత్రం నాట్యం చేస్తూనే వల్లభుణ్ణి కన్నార్పకుండా చూస్తూ ఉన్నది. నాట్యం చేస్తూ వల్లభుని దగ్గరగా వచ్చేది. వల్లభుడు సిగ్గుతో ప్రక్కగా జరుగుతున్నాడు. నాట్యం ఆగిన తర్వాత ఇంటిలో నలుదిక్కులూ పరికించాక అది వైష్ణవుల ఇల్లని వీరికి తెలిసింది.

లోనకు తీసుకుని వచ్చిన వ్యక్తిని వల్లభుడు "మీరు వైష్ణవులా స్వామీ!" అని వైష్ణవ యాసలో అడిగే సరికి ఆశ్చర్యపోయారు. ఆయన "ష్.. చిన్నగా మాట్లాడండి" అన్నాడు.

"మేము ఫకీర్లము కాదు. వైష్ణవులం. కార్యార్థులమై వచ్చాం. మీకు ఈ ఊరిలో ఒకప్పుడు సింగప్పిరాన్ అనే వ్యక్తి ఉండేవాడు తెలుసా?" అనాడు దత్తుడు.

సింగప్పిరాన్ పేరు వినగానే ఎంతో సంతోషంతో "ఆయన మీకు తెలుసా! ఆయన కుమారుడైన తిరుమణత్తూన్ నంబి ఇక్కడే ఉంటున్నాడు. దయచేసి నాతోరండి" అని వారిని బయటకు తీసుకుని వచ్చాడు. కొంతదూరం నడిచి రెండు వీధుల తర్వాత ఒక ఇంటిముందు ఆగిన ఆ వ్యక్తి "ఇదే ఇల్లు మీరు వెళ్ళండి లోనకు. భయమేమీ లేదు" అని వెళ్ళిపోయాడు.

దత్తుడు, వల్లభుడు నంబికి నమస్కరించారు. నంబి కూడా వారికి ప్రతి నమస్కారం చేసిన పిమ్మట వారు తమ్ము పరిచయం చేసుకున్నారు. దత్తుడు తల్లిగారు చెప్పిన సింగప్పిరాన్ విషయాలు కొన్ని చెప్పాడు. కంపన గోపన్నల గురించి వచ్చిన కార్యం కూడా చెప్పగానే నంబి "ఇన్నిరోజులు

అంత బలవంతులైన విజయనగర రాజులు మమ్మలను ఈ దీనావస్థలో ఉంచడం న్యాయమేనా?" అంటూ తాము పడుతున్న బాధలను వెళ్ళగ్రక్కాడు.

"మీరు ఇలాంటి వాతావరణంలో ఇంకా ఇక్కడే ఉండడం నాకు ఆశ్చర్యంగా ఉంది" అని వల్లభుడు అనగా విన్న నంబి "ఓం నమో నారాయణాయ!" అని నమస్కరించి "మేము ప్రతిరోజూ కావేరీ నదికి అటువైపున్న శ్రీరంగం గోపురం దర్శించిన పిమ్మటే భోజనం చేస్తాం. అందువల్ల మా ప్రాణాలున్నంత వరకూ మాకు ఈ ప్రాంతమే గతి!" అన్నాడు కన్నీరు తుడుచుకుంటూ. వల్లభుడు వారి భక్తికి నివ్వెరపోతుండగా ఆయన కల్పించుకుని "గతంలో శ్రీరంగం విడిచిన వారు కూడా క్రమంగా మళ్ళీ ఈప్రాంతానికే తరలి వస్తున్నారు. వారికి శ్రీరంగం గోపురం దర్శనం చేసుకోనిదే రోజూ అన్నపానాదులు కూడా సహించడంలేదని వాపోతున్నారు."

"అవునా! సుల్తాను వాళ్ళను ఏమీ అనడంలేదా?"

"అదంతా క్రొత్తల్లో కొన్నేళ్ళు సాగింది. ఇప్పుడు మనుషులను చంపడం తగ్గింది. వ్యవసాయం చేసేవారు, వివిధ వృత్తులు చేసేవారి జోలికి పెద్దగా రావడంలేదు. సైనికులకు లంచాలో.. వాళ్ళడిగిన సంభారాలో ఇస్తే చాలు. ఏమీ అనరు. మీకో విషయం తెలుసా! సత్యమంగళం నుండి కొన్నేళ్ళ క్రితం ఒక శ్రీరంగనాథవిగ్రహం ఒకటి ఒక ముదుసలి వ్యక్తి తెచ్చాడు. దాన్ని ఒక ప్రత్యేక మందిరంలో పెట్టి పూజలు చేస్తున్నారు. స్వామిని మళ్ళీ శ్రీరంగం ఆలయానికి చేర్చాలి." అనేసరికి రాజవల్లభుడు, దత్తుడు ఒక్కసారి అవాక్కయ్యారు. కొంతసేపటికి తేరుకుని శ్రీరంగనాథుని విగ్రహమా?

ఇక్కడా?" అనగానే నంబి "దురదృష్టశావత్తూ ఆ ముదుసలి వైష్ణవ భక్తుడు విగ్రహం మా చేతుల్లో పెట్టిన ప్రక్కరోజే మరణించాడు.

"అయ్యా! నంబిగారు..క్షమించండి. మీరు చూసిన విగ్రహం అసలైనది కాదు. అసలైన విగ్రహం జెంజిలో ఉంది" అంటూ జరిగిన కథ మొత్తం చెప్పి తామే స్వయంగా ఆ విగ్రహాన్ని కొడవరి సహాయంతో వెదికి తిరుమల చేర్చిన విషయం, ఆ పిమ్మట గోపన్న ద్వారా జెంజి చేరిన విషయం చెప్పారు. ఆ విషయాలన్నీ విన్న నంబి ఆశ్చర్యపోయాడు. ఆరాత్రి నంబి ఇంట భోజనం చేసి నిద్రించారు.

మరుసటి రోజు నంబి వీరిని త్వరగా కాలకృత్యాలు తీర్చుకుని అల్పాహారం సేవించి తయారవమని, కన్ననూరు కోటకు త్వరగా చేరుకోవాలని చెప్పాడు. దారిలో నంబి "మా తండ్రిగారు సింగప్పిరాన్ అంటే సుల్తానుకు వల్లమాలిన అభిమానం. తండ్రిగారు కోటలో సుల్తాను పనులలో నిమగ్నమై ఉంటాడు. ఒక్కోసారి ఆదేశిస్తే అనేక ప్రాంతాల్లో శిస్తు వసూలుకు బృందాలతో వెళ్ళవలసి ఉంటుంది. మా తండ్రిగారిని నేను దర్శించే చాలా రోజులయింది. అన్నట్టు మనం అక్కడ యదేచ్ఛగా తిరగొచ్చు. ఎవరైనా ప్రశ్నిస్తే సింగప్పిరాన్ కుమారుడు నంబి స్నేహితులమని చెప్పండి చాలు!" అన్నాడు. మనం కలవవలసిన వాళ్ళనే కలిశామని వల్లభదత్తులు ఎంతో ఆనందం పొందారు.

"స్వామీ! మా పట్ల సుల్తాను ఎందుకు ఇంత అభిమానం చూపుతున్నాడో చెప్తాను. మీరు అన్యదా భావించకండి. సుల్తాను వద్దకు వెళ్ళినప్పుడల్లా మేము మధువు, కానుకలతో పాటూ, ఒక స్త్రీని కూడా బహుమతిగా ఇవ్వాలని

నిబంధన. ఈ పనికి ఇక్కడ ఉన్న దేవదాసీలు మొత్తం ఒక్కొక్కరుగా బలవుతున్నారు. వాళ్ళను బ్రతిమాలో..బామాలో.. కాళ్ళు గడ్డాలు పట్టుకుని ఒప్పించి అక్కడికి తరలిస్తున్నాం. ఇదంతా పాపకార్యమని తెలిసినా చేయకపోతే అసలు ప్రాణాలకే ప్రమాదమని చేస్తూఉన్నాం. అలా చేస్తాం కనుకనే సుల్తానుకు మేమంటే ప్రాణం. ఇక మనం బయల్దేరే ముందుగా మీకొక విషయం చెప్పాలి" అన్న నంబి మాటలకు వల్లభుడు "మాకు గోపన్నగారు అప్పజెప్పిన కార్యం సఫలం అయ్యేట్టు చేయండి చాలు. మిగతా విషయాల్లో మీకెలాంటి అభ్యంతరాలు మానుండి ఉండవు" అన్న వల్లభుని మాటకు "నిన్న మిమ్మల్ని ఇక్కడకు తీసుకుని వచ్చిన వ్యక్తి ఇంట్లో మీరు నాట్యం చూసే వుంటారు. వాళ్ళు దేవదాసీలు. మేము వెళ్ళినప్పుడల్లా ఒక దేవదాసిని సుల్తానుకు సమర్పించుకుంటేనే మాకు గుర్తింపు గౌరవం. నిన్న రాత్రి ఇద్దరు నాట్యగత్తెలలో సన్నగా ఉన్న స్త్రీ, ఇవాళ సుల్తాను వద్దకు రావడానికి ఒప్పుకున్న స్త్రీ." వల్లభునికి ఒక స్త్రీ తనతో చనువుగా ఉండడం, తాను దూరం పెట్టడం గుర్తొచ్చింది. "అవును..ఒక స్త్రీ సన్నగా ఉన్నది. ఆమె అద్భుత సౌందర్యవతి కూడా!" అన్నాడు.

"దేవదాసీలు ఈపని శ్రీరంగంకోసం చేసే పవిత్ర కార్యంగా భావిస్తూ మా మాటలను వింటున్నారు. ఆమె పేరు రుక్మిణి. ఆమె మిమ్మల్ని చాలా ఇష్టపడుతున్నది. ఆమెతో మీరు ఒక గంట ఏకాంతంగా గడిపిన అనంతరమే మన ప్రయాణం సాగుతుంది"

"క్షమించండి. నేను ఒకామెను ప్రేమించాను. నా తనువు మనసూ ఆమెకే అర్పితం! నేనీ పని చేయలేను!" అన్న వల్లభుని మాటకు నంబి ఏమీ బదులివ్వకుండా బయటకు వెళ్ళాడు.

దత్తుడు రహస్యంగా "వల్లభా! మొదట ఏకాంతంలో ఏమి మాట్లాడుతుందో చూడు! మనం సింగప్పిరాన్‌ను కలవాలికదా! నీవు అభ్యంతరం చెబితే ఏమి సమస్య వస్తుందో తెలియదు. మనకు గోపన్న అప్పగించిన కార్యం మాత్రం ఎట్టి పరిస్థితులలోను ఆగిపోకూడదు" అని ప్రాధేయపడ్డాడు.

నంబి బయట ఎవరితోనో మాట్లాడుతూ "మీరు కొద్దిసేపు ఆ గదిలో విశ్రాంతి తీసుకోండి" అని చెప్పి లోపలికి వచ్చాడు. "వల్లభా! శ్రీరంగం కోసం ఒక స్త్రీ ఎంత త్యాగం చేస్తున్నదో వింటున్నావు గదా! నీవు ఏకాంతంగా కలిసిన విషయం ఈ అళగియమనవాళంలో మన నలుగురికి తప్ప వేరెవ్వరికి తెలియదు. ఇప్పుడు కూడా ఆమె నీతో ఏకాంతంగా ముచ్చటించాలని ఉందే అన్నదే తప్ప నీ నుంచి ఆ 'సుఖం' కోరుకోవడంలేదని ఆమె చెప్పింది" అని ఎంతో నచ్చచెప్పాక ఆమె ఉన్న గదిలోకి వెళ్ళాడు.

రుక్మిణిని కన్నెత్తి చూడకుండా అక్కడ ఉన్న ఒక ఆసనంలో కూర్చున్నాడు. ఆమె మంచంపై కూర్చొని ఉన్నది. తనను ఇబ్బంది పెడుతున్న రుక్మిణి వైపు చూసి ఆ విషయం అడగబోతూ ఉండగా ఆమె వంగి వల్లభుని పాదాలకు నమస్కరించి నిలబడి "స్వామీ! మీ నుండి ఆ సుఖం ఆశించి మిమ్ములను లోపలికి రప్పించానని అనుకుంటున్నారా?" అని సూటిగా తనే బాణం వదిలింది. వల్లభుడి మౌనం చూసి తనే మళ్ళీ చెప్పసాగింది. "మీతో ఏకాంతంగా ఒక గంటసేపు ఉండాలని కోరుకున్నాను. అంతే! నిన్న కూడా ఎంత సేపు ప్రయత్నించినా మీరు కనీసం పలుకరించలేదు. కనీసం కన్నెత్తైనా చూడలేదు." అని కన్నీళ్ళు కార్చి ఒక్క క్షణం నిట్టూర్చి కళ్ళు తుడుచుకుని "స్వామీ! నాకిప్పుడు లభించిన స్వర్గతుల్యమైన ఈక్షణాలను

ఆనందంగా అనుభవిస్తున్నాను. దేవదాసీగా జీవిస్తున్న నేను ఏనాడో ఆ శ్రీరంగనాథుణ్ణి వివాహమాడాను. కానీ నేను ఇంతవరకూ ఏ పురుషుని పట్లా ఆకర్షితురాలిని అవలేదు. నాకు ఎందరెందరో ఎన్నో ఆభరణాలు, విలువైన వజ్ర వైఢూర్యాలు ఇస్తామని ఆశ చూపారు. నాకు విచక్షణ తెలుసు. మీలో దైవాంశ నాకు గోచరించింది. దైవం మానుషరూపేణా అన్నట్టుగా అనిపించారు." అనగానే ఆమెపై కొంచెం మంచి భావం కలిగింది.

"నేను మీరు నన్ను తాకను అన్నారంటే మీరు ఎవరినో ప్రాణప్రదంగా ప్రేమించి ఉంటారన్న విషయం ఒకటి నాకు అనిపించింది. ఇంకొకటి అన్యులు సాధించలేని కార్యమేదో భగవంతుడు మీకు అప్పజెప్పాడనికూడా అనిపిస్తున్నది. నిజమేనా? నా ఊహ ఎప్పుడూ తప్పుకాలేదు చెప్పండి" అని వందనం చేసింది.

"అవును రుక్మిణీ! యదార్ధం చెప్పావు. ఒకటి నేను దైవకార్యార్థినై వచ్చాను. ఈ శ్రీరంగంలో శ్రీరంగనాథుని ప్రతిష్ఠకై పరితపిస్తున్న గోపనార్యుని తరపున వచ్చాను. అలాంటి సమయంలో రతి, మధువు, మగువలను ముట్టకూడదు. రెండవది నేను పాండ్య రాకుమారిని ప్రేమించాను. ఆ వివాహం జరగదని అందరూ చెప్తున్నా ఆమెను మరువలేను. ఆమెను పెళ్ళాడడం లేదా సన్యాసిలాగా ఉండిపోవడం. ఇంతకంటే చెప్పలేను. నీ త్యాగానికి మనస్ఫూర్తిగా నమస్కరిస్తున్నాను" అన్నాడు. ఒక గంట సమయం తర్వాత ఇద్దరూ సంతోషంగా బయటకు రావడంతో నంబి కాని, దత్తుడు కానీ రుక్మిణి విషయమై ఎలాంటి ప్రశ్నలు వల్లభుణ్ణి వేయలేదు. ఆవిషయం వల్లభుడికి బాగా నచ్చింది.

కన్ననూరు కోటకు వారి ప్రయాణం పల్లకీలలో ఆరంభమయింది. కోట చేరుతూ ఉండగానే యూరోపియన్ సైనికులు నంబిని చూసి ఆనందంగా పలకరించారు. వారు సరాసరి సుల్తాను మందిరానికి వెళ్ళారు. అక్కడ సుల్తానులేడని ఉద్యానవనంలో విహరిస్తున్నాడని చెప్పగా, ఉ ద్యానవనానికి వెళ్ళినా, నంబి బృందాన్ని సుల్తాను, ఏమీ ప్రశ్నించకుండా ప్రేమగా ఆహ్వానించడం వల్లభ దత్తులకు ఆశ్చర్యం కలిగించింది.

"ఈసారి ఎలాంటి కన్యను తెచ్చావు?" అనగానే మొహంపై కప్పుకున్న మేలిముసుగు తొలగించి రుక్మిణి వచ్చి నిలబడింది. సుల్తాను పొంగిపోయాడు "మరో అద్భుత సౌందర్యాన్ని విందు చేశావు. సెహబాశ్! నంబీ! తండ్రీకొడుకులిద్దరూ నాకు అత్యంత ఆప్తులయ్యారు" అంటూ నంబిని కౌగలించుకున్నాడు. సుల్తాను ఆ గ్రామం ఆదాయ వ్యయాలు అడిగి తెలుసుకుని, వల్లభదత్తులకు మంచి శాకాహార విందుభోజనం వడ్డింపజేశాడు. నంబి పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టకుండా ఏదో ఉపవాసమున్నట్లు ఉండిపోయాడు తప్ప కనీసం ఫలాలను కానీ పానీయలను కూడా ముట్టుకోనే లేదు. వల్లభదత్తులు మంచి భోజనం చేశాక సుల్తాను సైగతో రుక్మిణిని లోనకు తీసుకు వెళ్ళారు. ఆమె వెళ్తూ వెళ్తూ తనను చూసిన చూపు వల్లభుడు బహుశః తన జీవితాంతం మరచిపోలేడేమో అన్నట్టుగా ఉంది. చివరిరోజు వెళ్ళిపోతూ మధురాంగిణి చూసిన చూపు గుర్తుకు వచ్చి మనసు బాధగా మూలిగింది.

రాజభవనం విడిదిలో ఒక రోజు ఉన్న తర్వాత వల్లభదత్తులు నంబికి వచ్చిన విషయం గుర్తు చేశారు. నంబి వారిని వెంటపెట్టుకుని సైన్యాధికారి వద్దకు బయలుదేరాడు.

సైన్యాధికారి "ఆయీయే నంబీజీ.. కైసా హై..ఆప్ లోగ్.." అంటూ అహ్వానించాడు.

"వీరిద్దరూ నా ప్రాణ స్నేహితులు! మీ కోట, రాజభవనాలు మీరాజ్యం చూడాలని వీరు కోరుతున్నారు"

"అయ్యో! ఎంతమాట! నంబీ! వెళ్ళండి!" అని భటులను ఇద్దరిని అప్పజెప్పి ఎక్కడికైనా స్వేచ్ఛగా తిరిగే అవకాశం కల్పించండి. అన్నీ దగ్గరుండి చూపించండి" అని హుకుం జారీ చేశాడు.

నంబితో పాటూ రెండు రోజులు అన్నీ తిరిగి చూసి సంతృప్తి చెందాక తిరిగి అళగియమనవాళం దారి పట్టారు. వారిని కూడా సగౌరవంగా పల్లకీలలో గృహాలకు చేర్చమని సుల్తాను ఆదేశమైంది.

అళగియమనవాళం చేరాక నంబి చాలా నీరసంగా కనిపించాడు. అతడు సుల్తాను వద్ద ఉన్నంతవరకూ పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టలేదు. వారి తండ్రిగారైన సింగప్పిరాన్ కూడా అదే విధానమని తెలుసుకున్నారు. రాగానే నంబి భార్య దిష్టితీసి, నిమ్మరసం ఇచ్చింది.

"మీ ఉపవాస దీక్ష తెలియక మిమ్మల్ని మూడురోజులు ఇబ్బంది పెట్టాం. క్షమించండి!" అని దణ్ణం పెట్టాడు వల్లభుడు.

"వల్లభా! కన్ననూరుకోటకు వెళ్ళిరావడమంటే నాకు నరకానికి వెళ్ళివచ్చినట్లే! అందుకే ఎప్పుడూ ఒకరోజు మాత్రమే అక్కడ ఉండి వస్తాను. నేను చేసే పాపాలకు ఆ శ్రీరంగనాథుడు ఏమి శిక్ష వేస్తాడోనన్న భయం ఒకవైపు, ధర్మదీక్షకై చేస్తున్న ఈ పనులను ఆ రంగడు క్షమించడా? అని మరొకవైపు నన్ను నేనే సమర్థించుకొంటూ నా స్థితి డోలాయమానంగా ఉంటుంది.

"అవును! ఆ రంగడు నిన్ను తప్పక క్షమిస్తాడు. అధైర్య పడకండి"

"అవును వల్లభా! ఇప్పుడు ఏంచెయ్యాలనుకుంటున్నావు? కన్ననూరు పరిస్థితి నీ దృష్టిలో వివరించు"

"సుల్తాను సైన్యంలో సగమంది అంటే 50వేలు ఐరోపా సైనికులున్నారని గమనించాను. వాళ్ళెప్పుడూ విందు విలాసాలలోనే మునిగి ఉండడం చూశాను. మిగిలిన 50వేల మందే పోరాటయోధులనిపిస్తున్నది. వీరే కోట వెలుపల ఉండి సంరక్షిస్తున్నారని నా భావన"

"సత్యం చెప్పావు వల్లభా!"

"వారిని మీ సైన్యం జయించగలదా?"

"తలపడితే కొంచెం కష్టమే!"

"వ్యూహం ఏదైనా ఆలోచించవచ్చుగదా!"

"అవును! దత్తా! నీ అభిప్రాయం ఏమిటి?"

"ఆలోచించగా నాకొకటి తట్టింది. యూరోపియను వారు సుల్తాను ఆదేశిస్తేనే యుద్ధానికి తరలి వస్తారు. వాళ్ళు సుల్తాను ఆజ్ఞలను తప్ప, ఇతర సైన్యాధికారులు, మంత్రులను లెక్కకూడా చేయరట. సుల్తాను లిఖిత పూర్వకమైన అనుజ్ఞ ఉంటే తప్ప కోటలో నుండి అడుగు బయటపెట్టరు. కోటలోనే ఉంటారు. కనుక మనం సుల్తాను యూరోపియనువారికి అనుజ్ఞలు జారీ చేయకుండా, వారిని కలిసేఅవకాశం లేకుండా దృష్టి వేరొక ప్రదేశానికి మరల్చాలి. అప్పుడు 50 వేలమందిని మనం సునాయాసంగా జయించవచ్చు. వారిలో కొంతమందిని పలుకరించి, ఇక్కడి పాలన ఎలా ఉందని అడిగితే, వారు ఛీ! అంటూ ఉమ్మేశారు. ఎప్పుడెప్పుడు హైందవ పాలన వస్తుందా అని ఎదురు చూస్తున్నామన్నారు. యుద్ధం అంటూ వస్తే

వారు సుల్తానుకు సహాయనిరాకరణ చేస్తారేమో అని కూడా అనిపించింది.
"

"అవునా! ఇదీ మంచిదే! ఇందాక సుల్తాను దృష్టి మరల్చడం అన్నావు చూడు అది సాధ్యమా దత్తా!"

"నాకు సాధ్యమేనని తోస్తున్నది"

"అదే ఎలా" ఇద్దరూ ఆసక్తిగా ప్రశ్నించారు ఒకేసారి.

"సుల్తానుకు మధువు ఇచ్చే సమయంలో విషం కలిపితే?"

"కుదరదు! దానికి కొంత మంది పరీక్షలు చేసి గానీ పంపరు. రాజా వైద్యులు అనుక్షణం గమనిస్తూ ఉంటారు. తరువాత సుల్తాను భోజనం చేసే పళ్ళెం మీరెప్పుడూ చూడలేదు కదా! పెద్ద వెండి పళ్ళెం. ఆహారంలో విషపదార్థాలు ఉంటే ఆ పళ్ళెం మొత్త నీలం రంగులో మారిపోతుంది"

"హమ్మో! ప్రమాదమే!" అన్నాడు వల్లభుడు.

"ఇంకో దారి! అది కొంచెం కష్టమైన మార్గం. సుల్తానుకు నయంకాని సుఖ వ్యాధిని సంక్రమింపజేయాలి"

"అది సాధ్యమా!" అన్న నంబి మాటలకు "పూర్వం రసికరాజులను చంపడానికి విషకన్యల ప్రయోగం వినలేదా? ఇదీ అంతే కాకపోతే ఇంకో సుఖవ్యాధి సోకిన దేవదాసిని ఒప్పించాలి"

"సుఖవ్యాధి ఉన్న దేవదాసిని ఎక్కడ వెదకాలి?" అన్నాడు వల్లభుడు.

"వెదకనక్కరలేదు. సుఖవ్యాధి ఉన్న పురుషునితో సాంగత్యం చేయగలిగే ధైర్యమున్న దేవదాసి కావాలి. ఆ తరువాత సుల్తానుకు ఆ కన్యను బహుమతి ఇచ్చి కొన్ని రోజులు ఆగితే సుల్తానుకు కూడా సుఖ వ్యాధి సోకుతుంది"

"అవును"

"సుల్తాను వ్యాధి సంగతి తెలిస్తే ఐరోపా వైద్యులు దగ్గరకు కూడా రారు. మనం అప్పుడు సుల్తానును పెరియమలై లో ఉన్న సిద్ధయోగి వద్దకు తీసుకొని వెళ్ళి వైద్యం పేరుతో విష రసాయనాలను మ్రింగిద్దాం. అప్పుడు సుల్తాను క్షీణించి మరణిస్తాడు"

"ఇదంతా అంత సులభంగా అయ్యేట్టు లేదు"

"ఇంతకంటే మార్గం లేదు. సైన్యాధికారులు మంత్రులు సుల్తానుకు వ్యాధిసోకిందని బ్రతకడని తెలిస్తే వారిక సుల్తాను మాట వినరు. స్వతంత్రించినా ఆశ్చర్యంలేదు. ఆ సమయంలో మనం దాడిచేస్తే సులభంగా కోట మన వశం కాక తప్పదు."

తిరుమణత్తూరునంబికి ఈ పథకం బెడిసికొడితే ప్రాణాలు పోతాయని మనసు పదేపదే చెప్తున్నా, లోపల భయంగా ఉన్నా, దేశంకోసం, శ్రీరంగనాథునికోసం ఒప్పుకున్నాడు.

ఒకరోజు తెల్లవారుఝామున నంబి శ్రీరంగనాథుణ్ణి ధ్యానించి తన పథకం అమలు జేశాడు. మొదట కన్ననూరు వెళ్ళి సుల్తానుకు ఇష్టమైన వారెవరని విచారించాడు. వారందరూ రుక్మిణి వచ్చాక సుల్తానుకు ఆమెతోడిదే లోకం అయిందని చెప్పారు. వెంటనే ఒక పుష్పమాల కట్టించి దానిలో రుక్మిణికి తను అనుకుంటున్న పథకాన్ని వివరంగా తాళపత్రం మీద వ్రాసి రహస్యంగా ఆమెకు అందించి లోపల చీటీ చదవమని సైగచేసి వెళ్ళిపోయాడు.

రుక్మిణి తీవ్రంగా ఆలోచించింది. ఎలాగైనా ఈ సుల్తాను చేతిలో జీవిత ఖైదీగా బ్రతకడం కన్నా దేశంకోసం ప్రాణాలర్పించడమే మంచిదని

భావించి తిరుగు ఉత్తరం వ్రాసి లోన పెట్టుకుని, సాయంత్రం సుల్తానుతో నంబి ఇష్టాగోష్టి జరుపుతూ ఉండగా వెనుకగా అక్కడికి వెళ్ళి "నంబిగారూ! మా తల్లిగారు అస్వస్తురాలైనదని పోయిన మారు వచ్చినప్పుడు చెప్పారు. ఇప్పుడెలా ఉంది?" అని అడిగి నంబికి ఒక క్రొత్త పరిష్కారం పరోక్షంగా చూపించింది. వెంటనే విషయాన్ని ఇట్టే అలవోకగా అల్లుకునిపోయే తెలివితేటల్లున్న నంబి "అమ్మా! నిన్నే కలవరిస్తున్నది. ఒక్క వారం వచ్చిపొమ్మని బ్రతిమలాడింది. సుల్తానుగారికి కోపం వస్తుందని చెప్పలేదు. తార తర్వాత నువ్వే ఇష్ట సఖివని అందరూ అనుకోవడం వల్ల సుల్తానుగారికి భయపడ్డాను. విషయం దాచినందుకు నన్నుక్షమించు. ఆమె ఇంక ఎక్కువరోజులు బ్రతకదు తల్లీ..." అంటూ కాసేపు దుఃఖం నటించి అంగీతో కళ్ళు తుడుచుకున్నాడు."

"నంబీ! ఇలాంటి విషయాలు దాచడం ఎందుకు? నిన్ను ఎన్నడైనా కోపపడ్డానా? వెంటనే రుక్మిణిని వెంట తీసుకువెళ్ళి జాగ్రత్తగా అప్పజెప్పు. వచ్చేటప్పుడు పాశ్చాత్య మధువు కూడా తేవాలని గుర్తుపెట్టుకో! ఈ మధ్య తార నాపై కోపంగా ఉంది ఆమె 'సంగతి' కూడా చూడాలి కదా!." అన్నాడు సుల్తాను వికటాట్టహాసం చేస్తూ. అంతే! నంబి పని సులువైంది.

నంబి వెంట మరో పల్లకీ పై రుక్మిణి ప్రయాణం సుఖంగా సాగింది. గ్రామం చేరాక రుక్మిణి కాళ్ళపై బడి "నేను చేస్తున్నది చాలా భయంకరమైన తప్పు. క్షమించు తల్లీ..." అన్నాడు. "లేదు నంబిగారూ..నీవూ నేనూ అందరం ఆ శ్రీరంగనాథుని సేవలో ప్రాణాలర్పిస్తున్నాం. ఈ విషయం తెలిస్తే మీ ప్రాణాలు పోతాయని మీకు తెలియదా? ఎందుకు ధైర్యం చేశారు? దేశంకోసం! అంతే మీ తప్పేమీ లేదు. ఇష్టంలేకపోతే నాకై నేను మాఅమ్మ

ప్రస్తావన తెచ్చి, మీతో నేను రావడానికి సిద్ధమేనన్న సూచన ఇచ్చి మరీ మీ వెంట ఎందుకు వస్తాను. మీరు విద్వాంసులు. నా పాదాలంటకూడదు. తప్పు లేవండి" అంది నంబికి ప్రతి పాద నమస్కారం చేస్తూ.

వెంటనే అక్కడి వైష్ణవ వైద్యుని సహాయంతో యువకుడై సుఖవ్యాధిగ్రస్తుడైన వాడు దగ్గరి గ్రామంలో ఉన్నాడని తెలిసి అక్కడకు వెళ్ళి నంబి చూపిన అతని ఇంట ఒక వారం గడిపి వచ్చింది రుక్మిణి. మొహంలో కొంత కాంతి తగ్గినా పైపై మెరుపులతో తళుకులతో బయట పడనీయకుండా ఉంది.

తిరిగి అళగియమనవాళం వచ్చాక "నంబిగారూ! మనం కణ్ణనూరుకోటకు వీలైనంత త్వరగా చేరాలి" అని రుక్మిణి పట్టుబట్టింది. "స్వామీ! నా మరణానంతరం మధుర ప్రజలు స్వేచ్ఛగా శ్రీరంగనాథుని సేవించుకుంటారు. నేను అప్పుడు స్వర్గంలో స్వామి వారి పాదసేవలో ఉంటాను. నా మరణానంతరం నా అంత్యక్రియలు ఇక్కడే జరిపించి నా త్యాగాన్ని అందరి ఎదుటా ప్రశంసించండి. నాకు అమరత్వం లభిస్తుంది. నన్ను ఈరోజు దేవదాసియని ఈసడించుకునే వారు నేను చేసిన పనిని చూసి మెచ్చుకునేలా చేయండి. అది మీవల్లనే సాధ్యం! పదండి. ఇప్పటికే కాలాతీతమైంది." అని బయలుదేరింది. కన్ననూరు ఇంక కూతవేటు దూరంలో ఉందనగా రుక్మిణి "నంబిగారూ నాదొక మనవి" అంది.

"చెప్పమ్మా!" అన్నాడు అప్పటికే కనులవెంట నీరు ధారాపాతంగా కారుతోంది.

"కళ్ళు తుడుచుకోండి. ఆ కొలనులో శుభ్రపడండి."

"ఫరవాలేదులే అమ్మా..చెప్పమ్మా!" అన్నాడు మళ్ళీ.

"దయచేసి ఆ వీర యువకుడైన రాజవల్లభునిని అడిగానని చెప్పండి."

"ఎందుకమ్మా?"

''వారి క్షేమసమాచారాలను నేను అడిగానని చెప్పండి. నేను మరణించేంతవరకూ వారిని మరువలేను." అంటున్నప్పుడు ఆమె కళ్ళల్లో ఏదో తెలియని ఆనందం. కోట చేరారు వారిద్దరూ.

రుక్మిణిని ఆలస్యంగా తీసుకొని వచ్చినందుకు మొదట్లో కొంచెం చిర్రుబుర్రులాడినా తర్వాత, తల్లి చావుబ్రతుకుల్లో ఉందని చెప్పాక శాంతించి చాలామర్యాదగా వ్యవహరించాడు. తార మాత్రం అసహనంగా "నీ తల్లి చచ్చాకనే రావచ్చుగదా! అప్పుడే ఇక్కడికి చావడమెందుకు?" అంది అక్కసు వెళ్ళగ్రక్కుతూ.

సుల్తాను "తారా! ఇక నీవు వెళ్ళవచ్చు. మాటలు మిగిలితే శిరచ్ఛేదం చేయిస్తాను! రుక్మిణి నా ప్రియసఖి" అని హెచ్చరించాడు. తార మూతి తిప్పుకుని వెళ్ళిపోయింది.

నంబి వెంటనే తిరుగు ప్రయాణం కట్టాడు. రుక్మిణిని మళ్ళీ చూడగలనా అనుకుంటూ ఆమెవేపు చూశాడు. ఆమె నిర్లిప్తంగా ఉంది. మొహంలో ఏ భావమూ కనిపించడంలేదు. ఒక్కసారి కళ్ళతోనే నమస్కరించింది. నంబి ఆమె సంస్కారానికి ముగ్ధుడయ్యాడు.

ఒక నెల తర్వాత సుల్తానుకు రోగబాధ తీవ్రమయింది. ఎవ్వరిని దగ్గరకు రానివ్వడంలేదు. ఘోరంగా ఆ పుండ్లు రసికారి బాధించడంతో కేకలు పెడుతున్నాడు. యూరోపియన్ వైద్యులు ఈ వ్యాధి మా మందులకు లొంగదు. ఆయుర్వేదం వంటివి ప్రయత్నించమని చెప్పారు. ఆ సమయంలో

నంబి అక్కడకు చేరాడు. సుల్తాను ఉద్యానవనంలో ఒక పరుపుపై పండుకుని మూలుగుతున్నాడు.

"సుల్తానుగారూ.. మీ కెలాంటి దురవస్త వచ్చింది" అని సాష్టాంగ నమస్కారం చేసి నిలబడ్డాడు

"నంబి గారూ! నా రాజవైద్యులంతా దొంగలు. అందుకే వారిని ఖైదు చేశాను"

"విన్నాను ప్రభూ! మీ వైద్యం గురించే నేను ప్రస్తుతం వచ్చింది"

"అవునా..నంబీ.. నీదెంత మంచి మనసు! నన్ను చూసి అందరూ దూరంగా వెళ్తున్నారు చూడు!"

"లేదు ప్రభూ! మీరేమీ చింత పడవద్దు! మీకొక శుభవార్త! మీ వ్యాధి నయమవుతుందని చెప్పడానికే వచ్చాను"

"చెప్పండి నంబీజీ! ఏం చెయ్యమంటారు?"

"నేను ఒక వైద్యుణ్ణి తేవడమా లేక మనమే ఈ ఊరుమార్పు, గాలిమార్పు కోసం కొద్దిరోజులు వేరే మంచి వైద్యశాలకు తరలివెళ్ళడమా? అని చూస్తున్నాను"

"ఏదైనా సరే! ఈ బాధ భరించలేకపోతున్నాను"

నంబి అటూ ఇటూ తిరుగుతూ ఆలోచిస్తుండగా రుక్మిణి కనిపించింది. ఆమె అంత రోగపీడితగా కనిపించలేదు. ఆమెను చాటుగా కలిసి "అమ్మా! ఎలా ఉన్నావు? అని అడిగాడు.

"దేవుడి దయవలన రోగం అంత పీడించలేదు. ఉదయాన్నే ప్రాణాయామం, యోగా, నృత్యం సాధన చేస్తూ ఉన్నాను. మాఅమ్మ చెప్పిన కొన్ని మూలికలు తెచ్చుకుని రహస్యంగా వాటిని నూరి, క్రమం తప్పకుండా కషాయం

తాగుతున్నాను."

"చాలా సంతోషం! ఈ సుల్తాను నేను చెబితే మరోలా అనుకోవచ్చు. నీవు ఎలాగైనా మధుర దగ్గర ఉన్న చికిత్సాలయం వెళ్దామని నూరిపోయి. ఎట్టిపరిస్థితులలో సుల్తానుతో మాత్రం కలవకు. కలిస్తే వైద్యుడు ప్రాణాలకు ప్రమాదమని చెప్పాడని చెప్పు. నీ మాట వింటాడు. మిగతా విషయాలు మనం అక్కడ చూసుకుందాం" అని గ్రామానికి వచ్చేశాడు.

రుక్మిణి మాటల మాయ నమ్మి, ఒక రోజు మందీ మార్బలంతో మధురకు దగ్గరలో ఉన్న పెరియమలై లో ఉన్న సిద్ధయోగి ఆశ్రమానికి చేరాడు. యోగికి రహస్యంగా సుల్తాను విషయం చెప్పి ప్రాధేయపడి సాష్టాంగ నమస్కారం చేసి హైందవధర్మరక్షణకు చేయూతనిమ్మని సాష్టాంగ దండప్రమాణం చేసే సరికి ఆయన సంతుష్టుడై "తధాస్తు!" అని ఆశీర్వదించాడు.

సుల్తాను వ్యాధిగ్రస్తుడై మధురను చేరిన విషయం నంబి వల్లభదత్తులకు వర్తమానం పంపడం, వెను వెంటనే ఈ వార్త గోపన్నకు, కంపనకు చేరింది. ఈలోపు కంచిలో సైన్య సమీకరణ మొదలయింది. పాండ్య చేర (కేరళ) రాజులకు వర్తమానాలందాయి. సుల్తానుకు వ్యతిరేక పోరాటమనే విషయం సామంతులందరికి రహస్య వర్తమానాలు అందించారు.

గోపన్న వెంటనే ముళ్బైకి బయలుదేరాడు. వివిధ సేనాధిపతులు వివిధ దిక్కులకు వెళ్ళిపోయారు. సత్యం, ధర్మం కోసం జరిగే ఈ పోరాటానికి సహాయం కోరిన గోపన్న మాటలకు ఎవరూ అడ్డు చెప్పకపోగా యుద్ధం

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారు. గతంలో గోపన్న ఎన్నో యుద్ధాల్లో పాల్గొన్నాడు. అప్పుడు సైన్యం మాత్రమే యుద్ధానికి కదలి వెళ్ళేవారు. కానీ ఈ యుద్ధం విచిత్రంగా ఉంది. ప్రజలు, అందునా యువతులు సైతం, మాకు యుద్ధంలో అవకాశం కల్పించమని తనను కాళ్ళా వేళ్ళా ప్రాధేయపడడం ఆశ్చర్యంగా తోచింది. గత 40 సంవత్సరాలనుండి సుల్తానుల పాలనలో ప్రజలు విసిగిపోయారు. శ్రీరంగం వంటి కోవెల తలుపులు తెరుచుకోక పోవడం వల్ల అళ్వార్లచే వేనోళ్ళ పొగడిన వైష్ణవాలయాలు మూతబడ్డయి. అందుకే సైనికులకు కావలసిన బల్లాలు, బాణాలు, ఖడ్గాలు, విల్లంబులు వేల సంఖ్యలో తయారీకి ప్రతిపల్లెలో పురమాయించారు. ఎంతో మంది ప్రజలు గోపన్న అడగ్గానే గుర్రాలు, ఎద్దులను ఉచితంగా సమర్పించారు. ప్రజలందరూ కత్తి యుద్ధాల్లో తర్ఫీదు పొందుతున్నారు. వారి లక్ష్యం మధురావిజయమే!

ముళ్ళై ప్రాంతంలో యుద్ధ సన్నాహాలను పర్యవేక్షించి గోపన్న తిరునారాయణపురానికి బయలుదేరాడు. శిఖరాగ్రానికి చేరుకుని సరాసరి వేదాంత దేశికులవారి ఆశ్రమానికి వెళ్ళి ఆయన పాదాలపై వ్రాలాడు. వంద సంవత్సరాల వయసులో ఉన్న దేశికులవారిని చూసి గోపన్న అమితానందం పొందాడు. ఆయన శరీరం సన్నని చందనం కట్టెలా ఉంది. తలముగ్గు బుట్టలా తెల్లగా ప్రకాశిస్తున్నది. ఆయన ఒక దేవతా మూర్తిగా గోపన్న కళ్ళకు గోచరించాడు.

"గోపన్నా! సమయం ఆసన్నమైనట్లుంది" అని మందహాసం చేశారు.

"అవును స్వామీ..ఇక కొద్దిరోజులే!"

"శుభం గోపన్నా! నీ శ్రమ తప్పక ఫలిస్తుంది. ఇక యవనులు మధురపై

మరోసారి దండయాత్రలు చేసేందుకు కనీసం ఆలోచించేందుకు కూడా భయపడేట్టు సమాధానం చెప్పగలవన్న నమ్మకం నాకుంది. ఈ ప్రాంతం సుభిక్షంగా మారబోతున్నది. అష్టాక్షరీ మంత్రం జపించి యుద్ధం ప్రారంభించు! శుభం!" అని దీవించాడు.

"స్వామీ! దాదాపు 10 సంవత్సరాలు ఈ కార్యం చేయలేకపోయిన ఆలస్యానికి, వివాహం చేసుకుని, సంసార మరియూ రాజభోగాలలో మునిగి తేలినందుకు, ఏదైనా ప్రాయశ్చిత్తం సెలవివ్వండి"

"గోపన్నా! వేద వేదాంగాలు చదివిన వాడవు. సామాన్య మానవునివలె మాట్లాడుతున్నావు. నిగ్రహంగా ఉండు. కేవలం నీ తప్పే అనుకోకు! అనేక కారణాలు. లేడి ఎన్నడూ పులినోటికి కాళ్ళు లేక చిక్కదు. కర్మంచాలక చిక్కుతుంది. తప్పులు చేయడం మానవసహజం. తప్పుచేసినప్పుడు నిజాయితీగా ఒప్పుకునేవారు సంస్కారవంతులుగా, ఉత్తములుగా పేరుపొందుతారు. గతంలో చేసిన తప్పుల్ని నెమరు వేసుకుంటూ బాధపడడం కూడా తగదు. ఒక్కోసారి మన ప్రమేయం లేకుండా జరిగిన వాటికి చింతించకూడదు. పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం లేదు. ఒక్క విషయం విను! కైకేయి చేసిన తప్పువల్ల శ్రీరాముడు అడవులకెళ్ళాడు. అందువల్ల రాక్షససంహారం జరిగి లోకానికి మేలు జరిగింది. పరీక్షిత్ మహారాజు వేటకు వెళ్ళి తపోనిష్ఠలో వున్న శమీక మహర్షి మెడలో చచ్చిన పామును పడేసి, శమీక మహర్షి కుమారుడైన శృంగివల్ల తక్షకుడు అనే సర్పరాజు కాటు వలన ఏడు రోజుల్లో మరణిస్తావని శాపం పొందాడు. అప్పుడు వేదవ్యాసుని పుత్రుడైన శుకమహర్షి, భగవద్భక్తుల కథలతో నిండివున్న శ్రీమద్భాగవతాన్ని బోధించి చదివిన వారికీ, విన్నవారికి

పునర్జన్మ లేకుండా చేశాడు. తద్వారా పరీక్షిత్తుకే గాక సర్వమానవాళికి మంచి జరిగింది. తప్పు ఎల్లవేళలా పాపం కాకపోవచ్చు కూడా! తప్పు అనేది పునర్జన్మ లేకుండా చేసే సాధనం కావాలి. బాధ పడకు!" అని ఓదార్చాడు. భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ చెప్పిన మాటలే మనసులో తలుచుకో! అభీతిస్తవం గుర్తుకు తెచ్చుకో! ఇన్నాళ్ళకైనా నేను జీవించి ఉండగానే ఈ కార్యం జరుగుతున్నందుకు నేను ఆ రంగనాథుణ్ణి మళ్ళీ శ్రీరంగంలో సేవించడం కోసమే ఇంతకాలం జీవించి ఉన్నానని అనిపిస్తున్నది. శుభమస్తు! బయలుదేరు" అన్నాడు.

అది తమిళుల పరితాపి సంవత్సరం చిత్తిరై మాసం (1371 ఎ.డి), తూర్పున కాంచీపురము నుండి, వాయవ్య దిశలోని సత్యమంగళం నుండి, ఇలా రెండు దిక్కులనుండి బయలుదేరిన సైన్యం సుల్తాను సేనలతో పోరుకు సిద్ధమై మధుర వైపు నడిచాయి. సైన్యం యావత్తూ యుద్ధంలో విజయమో వీరస్వర్గమో అన్నత కసిగా ఉన్నారు. రెట్టించిన ఉత్సాహంతో ముందుకు ఉరుకుతున్నారు. కాంచీపురం నుండి బయలుదేరిన సేనకు సారథ్యం వహిస్తూ కంపన మహారాజు, గోపన్న తగిన సూచనలిస్తున్నారు. మధుర పొలిమేరలకు చేరిన తర్వాత అక్కడ పూజాదికాలు నిర్వహించారు. అనంతరం విజయోత్సాహంతో గర్జిస్తూ ముందుకు కదిలారు. మొదటి సరిహద్దులో ఉన్న ఇరవై మంది సుల్తాను ముఖ్య అనుచరులు భయంతో పారిపోయారు. మొదటి గ్రామంలో ప్రవేశించాక విజయనగర రాజులను చూసి గ్రామ ప్రజలు ఆనందోత్సాహాలతో పెద్ద పెట్టున విజయ ధ్వానాలు చేశారు. ఊహించని పరిణామం. 40 సం.ల తర్వాత మొదటిసారి సుల్తాను

సైన్యం పైకి హైందవ సైన్యం రావడం పట్టరాని ఆనందం కలిగించింది. భయం వదలి వందలమంది ఆ సైన్యం వెంట సముద్రంలా నడిచారు. స్త్రీలు హారతులిస్తూ వీధుల్లో బారులు తీరి నిల్చున్నారు. పుష్పవర్షం కురుస్తూ ఉండడంతో సైనికుల ఆవేశానికి పట్ట పగ్గాలు లేవు. ఎప్పుడెప్పుడు తలపడదామా అన్న పౌరుషాగ్ని వాళ్ళలో నిండిపోయి ఉంది.

జై కంపరాయా! జై గోపనార్యా! జై జై విజయనగర సామ్రాజ్యం!! అంటూ కేకలు మిన్నుముట్టుతుండగా రెండవ గ్రామంలో కొంతమంది మేమూ ఉన్నాం ప్రభూ! అంటూ ఆయుధాలు తీసుకుని వందల మంది ప్రజలు సైన్యంలో కలిసిపోయారు. శ్రీరంగనాథుని విగ్రహంతో ప్రవేశించాలన్న గోపన్న కోరిక మన్నించి కంపన వెంటనే పల్లకీని పంపి జెంజి నుండి విగ్రహాన్ని తెప్పించి అలంకరింపజేశాడు. శ్రీరంగనాథుని విగ్రహాన్ని కన్నులారా తిలకిస్తున్న గ్రామ ప్రజలు తన్మయం చెందారు. బాలురు వృద్ధులు తప్ప అందరూ సైనికులుగా మారిపోయారు. గోపన్న "మహారాజా! శత్రుప్రాంతం నుండి కూడా మన వెంట వచ్చే సైన్యసమీకరణ నాకు ఆశ్చర్యం కలిగిస్తున్నది" అన్నాడు. "శ్రీరంగనాథుడే మనకు దారి చూపిస్తున్నాడు" అన్నాడు కంపన ధైర్యంగా. మనం వెళ్ళే దారిలో ఉన్నవారు మొత్తం సైన్యంలోకి వస్తామని ముందే నాకు వర్తమానం అందింది మహారాజా! అందుకే ఆనాడు 30 వేలతో లక్ష సైన్యాన్ని ఎదుర్కోగలమని సభలో అంతనమ్మకంగా చెప్పాను. సోమప్పకే నా మాట మీద నమ్మకం కలుగలేదు" అన్నాడు. గోపన్న వల్లభ దత్తులను మారువేషాలలో తమకంటే ముందే కన్ననూరు కోటలో ప్రవేశించి పరిస్థితులను ఆకళింపు చేసుకొని అనుకూలంగా ఉంటే యుద్ధం ప్రారంభించాల్సిన సరైన సమయం

తెలపాల్సిందిగా ఆదేశించి పంపాడు. వారు అడవులగుండా కన్ననూరు పయనిస్తున్నారు.

తరువాతి గ్రామాల్లోకి ప్రవేశించే ముందే ఆటవికులు కొందరు వీరి ఆగమన వార్త ముందే చేరవేసి సుల్తానులతో జరుపబోయే యుద్ధాన్ని గురించి వివరించడంతో ఉత్సాహం నిండిన అక్కడి ప్రజలు అప్రమత్తమయి ఎవరెవరు సైన్యంతో తరలి ముందుకు వెళ్ళాలో నిర్ణయించుకొని ఆయుధాలతో తయారుగా ఉండేవారు. జయజయధ్వానాలతో స్వాగతం పలికేవారు. శ్రీరంగనాథుని విగ్రహంకూడా వెంట నడిపించడంవల్ల ప్రజల్లో దైవభక్తి పెరిగిపోయి వయసుతో తారతమ్యంలేకుండా యుద్దానికి తయారయ్యేవారు.

ఇలా నాల్గవనాటికి సమయపురం (కన్ననూరు) చేరుకున్నారు. అదే సమయానికి సోమప్ప ఆధ్వర్యంలో సత్యమంగళం నుండి బయలుదేరిన సాయుధ సైన్యం పశ్చిమ దిశకు చేరుకుంది. రెండు బృందాలు తమ తమ రాకలను వార్తాహరులద్వారా ఒకరికొకరు తెలుపుకున్నారు. వారు యుద్ధం చేయడానికి గోపన్న సర్వసన్నద్ధం చేశాడు. సుల్తాను సైన్యాన్ని జాగ్రత్తగా పరిశీలించారు. కోట వెలుపల 50 వేలమంది ఉండగా, కోటలోపల 50 వేలమంది ఉన్నట్టు తెలుసుకున్నారు. కోట బయట ఉన్న సైనికులు, కోట లోపల ఉన్న సైనిక బృందాన్ని ఎట్టిపరిస్థితులలోను కలవకూడదని గోపన్న ఆలోచనకు వచ్చాడు. ఒక రోజు గడిచిపోయింది. వల్లభదత్తులిరువురూ కోటలోపలికి వెళ్ళినవారు తిరిగిరాలేదు. గోపన్న సైన్యాధ్యక్షతన సైన్యం యుద్దానికి ఎప్పుడెప్పుడా అని వువ్విళ్ళూరుతున్నారు.

గోపన్నకు ఎన్నో సందేహాలు. వల్లభ దత్తుల విషయం పసిగట్టి

ముస్లిం సేనలు వారిని బంధించేశారా? తమ పథకం విఫలమయిందా? అని పరిపరి విధాల యోచిస్తుండగా, గమనించిన కంపన గోపన్నతో "యువకులిద్దరూ ధైర్యవంతులు, ప్రజ్ఞావంతులు. వారు తప్పక ఎన్ని ఆటంకాలుపెట్టినా ఏదో మాయచేసి వచ్చి మనకు విషయం చెప్తారు. రాలేదు అంటే ఏదో బలమైన కారణం ఉంటుంది. తొందరపడకు గోపన్నా! వారు రాకపోయినా మనకు వారు వర్తమానం ఏదో విధంగా అందజేయకుండా ఉండిపోరు. కొంచెం శాంతం వహించు! " అని ధైర్యం చెప్పినప్పటికి, గోపన్న మనసు వికలంగా ఉంది. ఏదో తెలియని ఆందోళన పడుతున్నాడు. దిక్కుతోచక క్షణక్షణం దేశికాచార్యులవారు చెప్పిన మంత్రాలను పఠిస్తూ అటూ ఇటూ కాలినడకన తిరుగుతున్నాడు.

ఒకవైపు వీరవనితల యుద్ధ బృందం కూడా తయారుగా నిలబడి ఉంది. గ్రామ గ్రామాలనుంచి వచ్చిన వనితలు కత్తులు, బాణాలుపట్టుకుని వేలమంది ఎదురుచూస్తున్నారు. వీరి మధ్యలో గంగాదేవి గుర్రంఎక్కి అందరికీ ఆజ్ఞలు జారీచేస్తూ అప్రమత్తంగా ఉంది. వసతిసౌకర్యాలు లేని ప్రదేశాలైనా ఎంతో ఓపిగ్గా వీరవనితలు యింకా ప్రవాహంలా వచ్చి చేరుతున్నారు. గంగాదేవి గుర్రాన్ని మధ్యభాగం నుండి ముందుకు ఉరికించి కంపనను చేరి "స్వామీ! నా ఎడమ కన్ను అదరడం ప్రారంభమయింది. అంటే ఇదే శుభ ఘడియ అనిపిస్తున్నది. మీరంతా ఎందుకు ఇక్కడ ఆగారో నాకు అర్థం కావడంలేదు. వీరవనితలు సుల్తాను సైనికులను చీల్చి చెండాడడానికి వేచి ఉన్నారు. కదలండి!" అంది.

"వల్లభదత్తులు మారువేషాలతో కోటలోనికి వెళ్ళి ఉన్నారు. వారి కోసమే ఈ ఎదురుచూపులు. వారు అంతా సిద్ధం అనగానే మనం

బయలుదేరుదాం" అని కంపన జవాబిచ్చాడు.

దూరమునుండి శ్రీరంగనాథుని ఢంకార ధ్వనులు వినపడుతున్నాయి. రాణి "గోపన్న స్వామీ! శ్రీరంగనాథుడు వెనుకటి గ్రామంలో ప్రజల పూజలు అందుకున్న అనంతరం ఇక్కడికి చేరుకున్నాడన్న సంకేతమే కదా! సైన్యం వెనుక భాగంలో మన వెనుక సాక్షాత్ రంగనాథ స్వామే అండగా ఉండగా భయం ఎందుకు? ఇంకా ఆలశ్యం చేయాలా?"

గోపన్న గంగాదేవికి నమస్కరించి, కొద్ది సమయం ఆగమన్నట్టు సైగ చేసి, శ్రీరంగనాథుడు ఉన్న వెనుక భాగానికి చేరుకున్నాడు. కాళ్ళకు చెప్పులు కూడా లేకుండా, ముళ్ళల్లో తుప్పల్లో నడుస్తూ, విగ్రహం ఉన్న పల్లకీని చేరుకున్నాడు. నేలమీద ఉన్న ముళ్ళు, రాళ్ళు రాప్పలు ఏమీ లెక్కచేయకుండా భక్తితో సాష్టాంగ నమస్కారం గావించాడు. "స్వామీ! రంగా నిన్ను మళ్ళీ శ్రీరంగం లో ప్రతిష్టిస్తానని ప్రతిన పూనాను. కానీ ఇక్కడ ఇలా చిక్కుకుని ఉన్నాను. నాకుతెలిసి నేను ఎలాంటి అపరాధాలు చేయలేదు. నీవే దారి చూపించు. అన్యథా శరణం నాస్తి!" అని ప్రార్థించి లేచిన తర్వాత స్వామి ముఖం ఎంతో ప్రసన్నంగా ఉన్నట్లు తోచింది.

ఆ చిట్టడవిలో ఒంటరిగా నిలబడి ఆదిత్యహృదయం లోని ప్రధాన శ్లోకాలను పఠించాడు. విజయం ఇవ్వమని ప్రార్థించాడు. అంతవరకూ యుద్ధంచేసినా, రావణుని తాను వధించలేకపోయానని బాధపడుతూ, ఏం చేయాలో తెలియని స్థితిలో ఉన్న శ్రీరామచంద్రుని కర్తవ్యపరాయణుని గావించి అగస్త్యుడు చెప్పిన 'ఆదిత్యహృదయం' పఠనంతో శ్రీరాముడు తిరిగి, సముజ్జ్వల శక్తితో యుద్ధరంగానికి చేరి రావణుని వధించాడు. అలాగే ఈనాటి యుద్ధంలో కూడా విజయం కలగాలని ప్రార్థించి,

మానసికంగా యుద్ధానికి సన్నద్ధమయ్యాడు.

ఇంతలో ఆయనకు దక్షిణదిశలో ఏదో కదలిక, అలికిడి వినిపించింది. తాను స్వామి పల్లకీ ఉన్న ఎత్తైన ప్రదేశంలో ఉన్నాడు. వెనుక అంత చెట్లుపుట్టలు పొదలమయంగా ఉంది. ఏదో ఒక ఆకారం తనవైపు కదులుతూ వస్తున్నది. మనిషా? కాదు. కాదు. జంతువా? కాదు. కాదు. మరెవరు? అలా చూస్తూ ఉండిపోయాడు.

ఆ ఆకారం చాలా నిదానంగా వస్తూ ఉండడం వల్ల కీడుతలచి, కత్తి ఒరలోనుండి తీసి ఆవైపుకు ఉరికాడు. పది గజాల దూరంలో రెండు కాళ్ళపై తీవ్రమైన కత్తిపోట్లతో, డొంక యావత్తూ రక్తంధారగా కారుతున్నా లెక్కచేయకుండా ఒక శ్రీవైష్ణవుడు దోగాడుతూ రావడం కనిపించింది. ఆశ్చర్యపోయాడు.

"స్వామీ! తమరెవరు? ఏమైంది?" అని ప్రశ్నించాడు కత్తి ఒరలో పెట్టుకుంటూ.

"నా పేరు కృష్ణరాజ ఉత్తమనంబి. నేను వెంటనే గోపనార్యుణ్ణి కలవాలి. ఒక అత్యవసర సందేశం. నన్ను వారి వద్దకు తీసుకుని వెళ్ళండి" అని ప్రార్థించాడు.

"మీరు కలవాలనుకుంటున్న గోపన్నను నేనే! ధైర్యంగా చెప్పండి"

"ఓం నమో నారాయణాయ! ఇది కూడా దైవలీలలో నాటకమేమో! నన్ను వల్లభుడు పంపించాడు. మిమ్మల్ని తక్షణం కోటను ఆక్రమించుకోమని వారి సందేశం!" అని తల నేలకు వాలుస్తున్నాడు. కాళ్ళంతా రక్త మోడుతూ కనిపించాడు.

"మేము ఈ సమచారం కోసమే ఎదురు చూస్తున్నాం. మీకేమైంది? వాళ్ళెక్కడ?"

"అవన్నీ చెప్పే ఓపిక నాకు లేదు గోపన్నగారూ! నేను మాట్లాడలేక పోతున్నాను. తర్వాత అన్నీ చెప్తాను. సైన్యాన్ని తక్షణం యుద్ధానికి తరలివెళ్ళే ఏర్పాట్లు చేయండి. యుద్ధం ప్రారంభించండి" అని రెండు చేతులెత్తి నమస్కరిస్తూ నంబి స్పృహకోల్పోయాడు. గోపన్న వెంటనే ఒక సైనికుణ్ణి పిలిచి నంబికి పల్లకీ ఏర్పాటు, చికిత్స చేయించమని అనుజ్ఞలు జారీ చేసి, గుర్రాన్నిసేనాసమూహం వైపు ఉరికించాడు.

కొద్ది నిముషాల అనంతరం భేరీనాదాలు మిన్ను ముట్టాయి. డప్పు ఢంకార ధ్వనులు మిన్నుముట్టాయి. విజయనగర సైన్యం సముద్రంలా ముందుకు కదులుతోంది. అశ్వదళాలు, ఏనుగు బృందాలు, కాల్బలం, కత్తులు, కటార్లు ధరించిన వారు, విల్లంబులు ధరించినవారు ఉత్సాహంగా ఒక పెద్ద వరదలా ముందుకు పరుగులు తీస్తున్నారు. సైన్యంలో యువతుల బృందానికి నాయకత్వం వహిస్తున్న గంగాదేవి వీరనారిలా కత్తి ఝుళిపిస్తూ సాగుతోంది. ఏనుగులు ఘీంకారాలు చేస్తున్నాయి. అశ్వాలు సకిలిస్తున్నాయి. సైన్యం "రంగా! రంగా!" అని అరుస్తున్నారు. వెనుక శ్రీరంగనాథుడు చిన్మయానందంగా యుద్ధాన్ని పల్లకీలో కూర్చొని పర్యవేక్షిస్తున్నాడు.

కన్ననూరు కోట వెలుపల సుల్తాను సహాయార్థమై విదేశీ సైన్యం ఒక ఏభై మంది కాపలా కాస్తున్నారు. మొదట వాళ్ళ తలలను నరికి బంతుల్లా గాలిలో ఎగురవేయడంతో సమర శుభారంభం జరిగింది. గోపన్న సైగతో యుద్ధం మొదలైందన్న గుర్తుగా సైన్యం ఆకాశంలో అందరూ

ఒక్కసారి వేలాది బాణాలు వేశారు. ధర్మ రక్షణ, స్వాతంత్ర్య కాంక్షల కారణంగా సైనికుల్లో ఎవ్వరినీ ఆపడానికి తరం కావడంలేదు. పది మంది సుల్తాను సైనికులకు ఒక్కళ్ళం సమాధానం చెప్తాం అన్నట్టు ఉంది వారి ఆవేశం. మానసిక స్థితి. వెనుక శ్రీరంగనాథుడు ఉండడం కొండంత ధైర్యంగా ఉన్నారు. సాళువ మంగు, అనైగుండి విట్ఠప్పర్, మారెయ్య నాయకులు అశ్వారూఢులై సైన్యాన్ని ముందుకు నడిపిస్తున్నారు. సుల్తాను సైన్యం బయటకు వచ్చీ రావడంతో భీకర పోరు జరిగింది. విజయనగర వీరుల కరవాలవిన్యాసాలకు ముస్లిం సేనలు కుప్పలు తెప్పలుగా నేల కూలుతున్నారు. మొదటి రెండు గంటల్లో కొన్ని వేలముసల్మాన్ సైనికుల తలలు నేలమీద పడ్డాయి. గోపన్న సైన్యం కూడా కొంత నష్టపోయింది. వాళ్ళ సైన్య సంపద అపారంగా ఉంది. గోపన్న కంపనతో ఇతర సైన్యాధికారులతో చర్చించిన మీదట పోరాటానికి తగ్గే ప్రశక్తే లేదని ముందడుగులు వేస్తున్నారు. కానీ వారి అపార సైనిక సంపదముందు గోపన్న సైన్యం తక్కువే! వ్యూహం ఏమి పన్నాలి? ఎలా పన్నాలి? అని ఆలోచిస్తున్న సమయంలో ఒక విషయం జరిగింది.

సోమప్ప ఆధ్వర్యంలో సత్యమంగళం నుండి బయలుదేరిన సైన్యం మధ్యలో ఎన్నో అవాంతరాలను ఎదుర్కొంది. నదులను దాటవలసి వచ్చింది. అందువల్ల కొంచెం ఆలశ్యమైంది. వారు ఇదే క్షణానికి భీకరంగా ఢంకా నినాదాలు చేస్తూ ఒక సన్నదారి గుండా లోనకు ప్రవేశించారు. ఆ సన్నదారి ద్వారా వచ్చేది కొన్ని వేలమందే అయినా కొన్ని లక్షలన్నట్లుగా, దూరంనుండి గమనించిన సుల్తాను సైనికులకు, కొన్ని యోజనాల దూరం వ్యాపించి ఉన్నట్టు అనిపించడంతో కృంగిపోయారు. ఇటు గోపన్న సైన్యాన్ని

అటునుండి వస్తున్న సైన్య ప్రవాహాన్ని ఎదుర్కోవడం అసాధ్యమని నీరసపడ్డారు. వందమంది ముందున్న సుల్తాను సైన్యం ప్రక్కలకు పరుగులెత్తడంతో మిగతావారు కూడా అపాయం ఏదో ముంచుకొస్తున్నదని భావించి, భయపడి అరుస్తూ కత్తులు, విల్లంబులు క్రిందపడవేసి పరుగులు తీశారు. వారిని సోమప్ప సైన్యాధికారి క్రింద ఉన్న బృందం ఎదుర్కొని బంధించారు. గోపన్న, సుల్తాను సైన్యాధికారి ఉన్న వేపు గుర్రాన్ని పరుగులెత్తించి, గుర్రం మీదకెక్కి నిలబడి వాణ్ణి ఒక పదునైన కత్తితో కంఠం భాగంలో గ్రుచ్చి క్రిదికి లాగడంతో, రక్తం కాలువలు కడుతూ ఉండగా వాడు క్రిందకు జారిపోయాడు. తన గుర్రం మీదనుండి వాడి గుర్రం మీదకు దూకి వారి పతాకాన్ని తీసి విజయనగర వరాహ పతాకాన్ని గుర్రం మీద ఉంచి నలువైపులా వీర విహారం చేసే లోపు, సుల్తాను సైన్యం లొంగిపోయినట్లు తెలియజేస్తూ కదనరంగంలో బందీలుగా మోకాళ్ళ మీద నిలబడ్డారు. గోపన్న సలహాతో వారి గుర్రాలను, ఏనుగులను స్వాధీనం చేసుకున్నారు. సూర్యాస్తమానం అయింది. అంతటా మౌనమే నెలకొనింది.

సుల్తాను సగం సైన్యం మృత్యువాత పడ్డారు. మిగిలిన సగం మందిని సోమప్ప సైన్యం బృందం బందీలుగా పట్టుకుని కట్టుదిట్టమైన పహరా ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. కొన్ని వందల గుర్రాలు తమ అధీనమయ్యాయి. ఆయుధాలను మొత్తం సుల్తాను సైనికుల వద్దనుండి ప్రోగుచేసి తమ అధీనంలో ఉంచుకున్నారు. గోపన్న తీవ్ర ఆవేశంగా ఉన్న సమయంలో సుల్తాను సైన్యాధికారులైన ఐదుగు ధృఢకాయులైన వారు మోకాళ్ళపై నిలబడి గోపన్నను "శరణు శరణు! గోపనార్యా! ప్రాణబిక్ష పెట్టండి. తమకు విధేయులై ఉంటాము!" అన్నాడు వాళ్ళలో ఒకడైన ముఖ్య

సైన్యాధికారి.

గోపన్న "సుల్తాను సైనికులను నమ్మడమా! అసాధ్యం! మీకు మరణదండనే శరణ్యం!" అన్నాడు కరవాలాన్నెత్తి చూపిస్తూ. ఒకడు లేచి నిలబడి "స్వామీ! అంతమాట అనకండి. మేము ఈ గడ్డకు చెందిన వారము. ముసల్మాన్ సైనికులందరిని ఏమైనా శిక్షించండి. పొట్టకూటికి సుల్తాను వద్ద చేరిన మన వారిని మాత్రం క్షమించండి. మేము ప్రతిగా మీకొక ఉపకారం చేయగలం" అన్నాడు.

"మాకు మీరు చేయగల ఉపకారమా? నమ్మగలమా? అందునాసుల్తాను సైనికులను...." అంటూ చుట్టూచూస్తూ వికటాట్టహాసం చేశాడు.

"గోపన్నగారూ! మేము బలవంతంగా మతం మార్చబడి గత్యంతరం లేక ఇలా పడి ఉన్నాము తప్ప, హైందవ మతంపై ప్రేమ లేక కాదు. మాకు భరతఖండాన్ని రక్షించుకోవాలి అన్న కాంక్ష యింకా తీవ్రంగా మనసుల్లో ఉంది కాబట్టి....

"హూ... కాబట్టి..చెప్పండి"

"మమ్ములను హిందూ మతంలో తిరిగి చేర్చుకోండి. మీకు ఋణపడి ఉంటాం" అని సాష్టాంగ నమస్కారం చేశాడు.

గోపన్నకు రెండవ వీరభళ్ళాలుడు కన్ననూరులో ఇలాగే అంత సైన్యం ఉన్నా మోసపోవడం గుర్తొచ్చింది. ఏమి చెయ్యాలో అర్థం కాలేదు. ఇంతలో ఒక అధికారి లేచి "ఆర్యా! తమరు అనుజ్ఞ ఇస్తే..మేము సుల్తాను సైనికులం కనుక, వారికి ఏమాత్రం అనుమానం రాకుండా కోటలోనికి వెళ్ళి ఐరోపా సైన్యాన్ని ముక్క ముక్కలుగా నరికి మీ పాదాల ముందు పోగులు పోస్తాం! మా మాట నమ్మండి. శరణు..శరణు.." అని కాళ్ళ మీద పడ్డాడు.

రామరావణ యుద్ధంలో విభీషణ శరణాగతి గుర్తొచ్చింది.

"ఒక పని చేయండి" అనగానే అందరూ సమ్మతంగా "చెప్పండి గోపనార్యా!" అన్నారు.

"మీరెంతమంది బందీలుగా ఉన్నారు ఇక్కడ?"

సైన్యాధికారి చుట్టూ ఉన్నవారిని చూసి "దాదాపు ఐదువందలమంది స్వామీ!" అన్నాడు.

"మీలో సగం మంది ఇక్కడ బందీలుగా ఉండండి. సగంమంది కోటలోనికి వెళ్ళి మీరు చెప్పినట్లు చేయండి. వెంట కొంతమంది మా వారు మీ దుస్తులతో మీ తలపాగాలతో మిమ్ములను అనుసరిస్తూ ఉంటారు. అక్కడ ఏమైనా పొరబాటు జరిగిందా? ఆ వార్త వినగానే ఇక్కడి సగం మంది తలలు నేలకు రాల్తాయి. అంగీకారమేనా?" అన్నాడు.

"నిరభ్యంతరంగా ఒప్పుకుంటున్నాం. బేషరతుగా ఒప్పుకుంటున్నాం. మేము పుట్టిన గడ్డ మీద మా ప్రేమ ఎలా ఉంటుందో ఇప్పుడు చూపిస్తాం. శ్రీరంగనాథుడే దీనికి సాక్షి!" అన్నాడు ఆవేశంగా. వారిపై కన్ను వేసి ఉంచమని కొందరిని సుల్తాను సైనికుల దుస్తులు విప్పించి విజయనగర సైనికులకు తొడిగించాడు. వాళ్ళ తలపాగాలు పెట్టించాడు. వారంతా సుమారు రెండు వందలమంది కి పైగా సుల్తాను సైన్యంలాగా అనిపించే విధంగా తయారయ్యారు. మెల్లిగా కోటలోనికి వెళ్ళడానికి రంగం సిద్ధం చేశాడు. వాళ్ళకు కోటలోనికి వెళ్ళడానికి సమయమాసన్నమైందని, ఉత్తర్వులు జారీ చేయాలని అనుకొంటూ ఉండగా, ఇంతలో ఒక సైనికుడు గుడారాల నుండి వచ్చి "గోపనార్యా! ఒక్కసారి దయచేయగలరా!" అన్నాడు రొప్పుతూ నిలబడి.

"ఏమైంది? పదండి" అని గుర్రమెక్కి దౌడు తీశాడు.

అక్కడ కృష్ణరాజ ఉత్తమనంబికి స్పృహ వచ్చింది. గోపనార్యా! గోపనార్యా! అని కలవరిస్తూ ఉన్నాడు.

"అచార్యా! ఎలా ఉంది?" అని మంచంపై కూర్చుని అతని చేతులను తన రెండు చేతుల్లోకి తీసుకుంటూ.

"మీతో కొన్ని విషయాలు చెప్పాలి. నేను అళ్వార్ల వంశానికి చెందినవాడిని. గోదాదేవి కూడా మా వంశజురాలే! ఆళ్వార్ల కథలను మొదటి సారి సేకరించి గ్రంథస్తం చేసిన గరుడవాహన పండితుని వారసుణ్ణి. మేమంతా శ్రీరంగ నాథుని సేవకులం. సైనికులం. మాకు చావైనా బ్రతుకైనా రంగనాథుడే!"

"సంతోషం ఆచార్యా! కానీ, ప్రస్తుతం అవన్నీ వినే సమయంలేదు. కోటను ఆక్రమించుకునే దశలో ఉన్నాం. నేను మొదట మన వల్లభ దత్తులేమయ్యారో తెలుసుకోవాలని ఆసక్తిగా ఉన్నాను"

"అదే చెప్తున్నాను గోపనార్యా! సుల్తాను వ్యాధిగ్రస్తుడై, రుక్మిణి అనే దేవదాసితో మధురను చేరుకున్నాడన్న విషయం మీకు తెలిసిందే. మీ ముట్టడి విషయం ఆయనకు తెలిసిపోయింది. అంత మత్తులో ఉన్నా సైన్యానికి ఆదేశాలు జారీ చేశాడు. ఐరోపా సైనికులను యుద్ధంలో దిగమని ఒక తాటాకుపై సందేశం వ్రాసి రాజముద్ర వేసి, ఇరవై మంది ముసల్మాన్ సైన్యాన్ని కన్ననూరుకు పంపాడు. వారు తొండమాను అడవుల గుండా ప్రయాణం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న వల్లభుడు, దత్తుడు ధైర్యంగా వారిని పట్టుకుని హతమార్చారు. వారిద్దరూ దేశం కోసమే పుట్టినట్లు అనిపిస్తున్నది. "ఎట్టిపరిస్థితులలోను ఐరోపా సైనికులు, లిఖితపూర్వకంగా నేను అనుమతి ఇచ్చేంతవరకూ కోట బయటకు రావద్దు" అని సందేశం మార్పు చేసి,

దాన్ని తీసుకుని బయలుదేరి వెళ్తూ, “మీరు వెంటనే కోటముట్టడి ప్రారంభించవచ్చునన్న విషయం నాకు చెప్పి మీకు అందజేయమన్నారు. కోటలో ఐరోపా సైనికులను బయటకు రాకుండా చేసే ఆయుధం మా వద్ద ఉంది” అంటూ త్వరత్వరగా వెళ్ళిపోయారు.

ఇంతలో వాళ్ళలో పారిపోయిన సుల్తాను సైనికుడు కొంతమందిని తీసుకుని అడవుల్లో ఉన్న మా గ్రామానికి వచ్చారు. మేమంతా ఖడ్గవిద్యలో సుశిక్షితులమని తెలియని సుల్తాను సైనికులు మా చేతిలో హతులయ్యారు. ఊహించని రీతిగా ఐదుగురు సైనికులు గుర్రాలపై మాపై దాడి చేశారు. తిరుమణత్తూరు నంబి తీవ్రంగా గాయపడి మృత్యువుతో పోరాడుతున్నాడు. మేము ఆ ఐదుగురిని చుట్టుముట్టి ఖండఖండాలుగా నరికివేశాం. కానీ... తిరుమణత్తూరు నంబిని రక్షించడానికి వెళ్ళిన నాకు, వెనుకనుండి వచ్చిన సుల్తాన్ సైనికుడొకడు హటాత్తుగా నామీదకు దూకి, కత్తితో రెండు కాళ్ళపై కత్తిపోట్లు వేశాడు. మేం మొదట్లో లెక్కచేయకుండా వాళ్ళను హతమార్చిన తర్వాత వల్లభుని సందేశం గుర్తొచ్చింది. అందరూ గాయపడ్డ వాళ్ళే! నాకంటే తీవ్రంగా, పైగా పెద్ద వయసువారు. అందుకే సందేశం చేరవేసే నిమిత్తం నేనే అడవుల్లో అడ్డదారులగుండా దోగాడుకుంటూ ఇలా కన్ననూరు శివార్లకు చేరేసరికి చాలా ఆలస్యమైంది. క్షమించండి!” అన్నాడు. ఆశ్చర్యపోయాడు గోపన్న! ఎంతదేశభక్తి! ఎంతటి శ్రీరంగనాథుని భక్తి..” కన్నులవెంట అప్రయత్నంగా నీళ్ళు కారిపోయాయి.

‘‘నాగురించి చింతించకండి. కోట ముట్టడి ప్రారంభించండి. ఆ శ్రీరంగనాథుడే మనందరికి రక్ష!” అన్నాడు.

మరుసటిరోజు పెద్ద పెట్టున భేరీ నాదాలతో కోట ముట్టడి ప్రారంభం అయింది. గోపన్న ప్రణాలికా బద్ధంగా అందరికి తగు హెచ్చరికలు జారీ చేశాడు. ఒకవేళ మధుర నుండి సైన్యం వస్తే అక్కడికక్కడే నరికి వేయడానికి కొందరిని కావేరీ ఒడ్డున నిలబెట్టాడు. కోట బయటవారు లొంగిపోయారు. కోటలోపలి వారు ఎట్టి పరిస్థితులలోను సుల్తాను లిఖితపూర్వక అనుమతులు లేనిదే రారు. కోటలోపలి వారికి రెండు రోజులు ఆహార పానీయాలను నిలిపివేశారు. కోటలోపలి జనం అన్నపానాదులు లేక నకనక లాడసాగారు. బయటకు వచ్చేందుకు అనుమతులు కావాలి. బయటకు కదలవద్దని సుల్తాను సందేశం కూడా ఉంది. ఐరోపా సైనికులకు మద్యం, మాంసం, మగువ లేనిదే ఉండలేరు. అప్పటికే సగం బిక్క బిక్క చచ్చిపోయారు.

సైనికాధికారి ఒకడు ఆవేశంగా లేచి "అయా! గోపనార్యా! ఇదే తగిన సమయం మమ్మలను వదలండి. ఐరోపా సైనికుల శవాలను, తలలను ఎలా పైనుండి క్రిందికి విసురుతామో తమరు దర్శించండి" అన్నాడు. "సరే! వెళ్లండి" అంటూ వెంట మారువేషాలలో ఉన్న తన సైనికులను కూడా వెంట పంపాడు.

సంతోషంగా కోట దగ్గరకు వెళ్ళి "మేమంతా గోపన్న బంధికానా నుండి తప్పించుకున్నాం. మమ్మల్ని లోపలకు పంపండి లేకపోతే మా ప్రాణాలు పోతాయి" అని బ్రతిమలాడిన తర్వాత వారికి కోటలోపలికి ప్రవేశం నిషిద్ధం కనుక తాళ్ళ నిచ్చెనల ద్వారా పై వారికి సందేశం పంపాక, వారి అనుమతితో ఆ నిచ్చెనలద్వారా లోపలికి ప్రవేశం లభించింది. వీరిని ఒక కంట కనిపెడుతూ మారువేషాలతో ఉన్న గోపన్న సైన్యం వారిని మెల్లిగా అనుసరిస్తూ ఒక కంట కనిపెడుతూ వెళ్తున్నారు. ఆ రాత్రంతా మొత్తం

రెండువందల పైచిలుకు సైనికులు తాళ్ళనిచ్చెనలపై వెళ్ళారు.

ఉదయాన్నే కోటలో జరగబోయే కల్లోలం కోసం గోపన్న వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నాడు. సమయం గడుస్తున్నకొద్దీ గోపన్నకు అనేక అనుమానాలు. ఒకవేళ సుల్తాన్ సైన్యం తనను మోసం చేశారా? అని యోచిస్తున్న సమయంలో ఒక ఆశ్చర్యం జరిగింది. ఒకే సారి కోట నలు వైపుల నుండి ఒకేసారి పొగలు రావడం ప్రారంభమయింది. ఏం జరిగిందో అర్థం కావడం లేదు. కోటలో జనం హాహాకారాలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. మంటలు ఉన్నట్టుండి ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. సైనికులు కోటలో అటూ ఇటూ పరుగులు తీస్తున్నారు. క్రింద సైనికులు ఆశ్చర్యంగా చూస్తున్నారు. గుర్రాలు సకిలిస్తున్నాయి. ఏనుగులు ఘీంకరిస్తున్నాయి. మా పని ఎప్పుడా అన్నట్టు సైనికులంతా ఎదురు చూస్తున్నారు.

తూర్పు వైపు కోట తలుపులు భళ్ళున తెరుచుకున్నాయి. పై నుండి ఐరోపా సైనికుల తలలు బంతుల్లా నేల రాలుతున్నాయి. గోపన్న ఇదే తగిన సమయం అని సైనికులకు సూచన ఇచ్చాడు అంతే! ఐరోపా సైనికులు కొంతమంది అరుస్తూ తాళ్ళ నిచ్చెనలనుండి దిగబోతూ ఉండగా సైనికులు బాణాలతో వారిని గాయపరచే సరికి పైనుండి ధబేలుమని పడిపోతున్నారు. కోట ద్వారం నుండి వచ్చే సైనికులను అక్కడికక్కడే నేలకు పడగొట్టారు. మొత్తం అందరూ నేల కూలడానికి ఆరు గంటల సమయం పైన పట్టింది. అప్పటికి సాయంత్రం మూడు గంటలు కావస్తున్నది.

విజయనగర సైన్యాధిపతి గోపన్న విజయ ఢంకా మ్రోగించే ఏర్పాటు చేసి కన్ననూరు కోటలోనికి ప్రవేశించి అక్కడక్కడా మిగిలిఉన్న ఐరోపా

సైన్యాన్ని ఊచకోత కోయించాడు. కన్ననూరు కోట పరితాపీ సంవత్సరం వైశాఖ మాసంలో (క్రీ.శ. 1371 మే/జూన్) విజయనగరానికి స్వాధీనమైంది. సుల్తాను గతంలో చేసిన మోసానికి, అమానుష కృత్యానికి, తగురీతిలో అదే విధంగా జవాబిచ్చి గోపన్న చరిత్రలో నిలిచిపోయాడు.

కోటలోనికి ప్రవేశించిన విజయనగర సైన్యం వీరవిహారం చేశారు. ఐరోపా సైనికుల స్థావరాలకు నిప్పు పెట్టారు. ఐరోపా సైనికుడన్న వాడు మిగలకుండా మాడ్చి మసి చేశారు. కోటపై అన్ని దిక్కులా విష్ణుమూర్తి వరాహావతార పతాకం రెపరెపలాడింది. కోటలోపల ఉన్న స్త్రీజనంలో ఎక్కువమంది హైందవులే. వారు ఇంకా ముస్లిం సైనికులు దాక్కున్న రహస్య ప్రాంతాలను, సొరంగాలను గోపన్నకు, సైనికులకు వెంటవచ్చి చూపించారు. ఒక సొరంగ మార్గం లోనకు ప్రవేశించే సరికి వల్లభ దత్తులిరువురు బందీలుగా కట్టబడి ఉన్నారు. వారిని చూడగానే గోపన్న స్వయంగా కట్లు విప్పి వారిని గాఢాలింగనం చేసుకున్నాడు. గోపన్న తన మెడలో ఉన్న ముత్యాలహారాన్ని రత్నాలహారాలను వారికి వేసి "మీరే నిజమైన విజయనగర వీరులు!" అని ప్రస్తుతించి, వారిని చికిత్స కోసం గుడారాలకు పంపించాడు. కన్ననూరు కోట మొత్తం ఆ విధంగా విజయనగర సామ్రాజ్యానికి స్వాధీనమయింది.

సమయపురం విజయానంతరం గోపన్న పరివారంతో హొయసళేశ్వరుని ఆలయంలోకి ప్రవేశించాడు. ఆలయం మొత్తం టర్కీనుండి వచ్చిన ముసల్మానుల స్వాధీనంలో ఉంది. అది ఆలయం అనడం కన్నా, ఒక ఆయుధ కర్మాగారం అనడమే సరైన మాట. అక్కడ ఉన్న

దేవతల విగ్రహాలను తొలగించి ఎక్కడో ఒక మూల పాడు పడిన గదిలో పడేశారు. గోపన్న అక్కడివారిని విచారించి, ఆ విగ్రహాలను తెప్పించి యధాస్థానాలలో ఉంచి, స్థానికంగా వంశపారంపర్య పూజారిని పిలిపించి, కంపన, గంగాదేవి తదితరులతో గూడి ప్రార్ధనలు చేశారు. రేపటి మధుర దండయాత్రను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోపన్న ఒక పెద్ద నాలుగు కాళ్ళ మండంపంలోనికి వచ్చి గుమికూడిన జనం మధ్యలో "రేపు మనం శ్రీరంగనాథ స్వామి విగ్రహాన్ని శ్రీరంగంలో మళ్ళీ ప్రతిష్టించబోతున్నాం" అని ఎలుగెత్తి ప్రకటించాడు. పెద్ద పెట్టున హర్షధ్వానాలు వెల్లివిరిశాయి. ఆనందంతో కేకలు వేశారు. "కంపన మహారాజుకూ జై, గంగాదేవి మహారాణీ వారికీ జై, గోపనామాత్యులకు జై" అని చాలాసేపు నినాదాలు చేసిన తర్వాత గోపన్న సైగతో అందరూ ఆగారు.

మరుసటిరోజు తెలతెలవారుతున్నది. ఆరోజు వైశాఖ మాసం 17వ రోజు. తమిళులకు అత్యంత పవిత్రమైన పర్వదినం. వాతావరణం సుగంధపరిమళాలతో విరజిమ్ముతున్నది. శుభ శకునాలు కనిపిస్తున్నాయి. కన్ననూరు కోటను విజయనగరాధీశులు కైవసం చేసుకున్నారన్న వార్త అంతటా వ్యాపించింది. చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు సమయపురంలో శ్రీరంగనాథుని దర్శనానికై బారులు తీరి నిల్చుని ఉన్నారు. ఆనంద తాండవాలు అక్కడ వ్యాపించాయి. కొందరు తమదైన శైలిలో "కునలై కూత్తు" (తలక్రిందులుగా నర్తించడం) నృత్యాన్ని ప్రదర్శించారు. బ్రాహ్మణులు వేదపారాయణ ఘోష అదే పనిగా వినిపిస్తున్నారు. కొందరు వైష్ణవులు ప్రముఖులు తమిళ ప్రబంధ గానం వినిపిస్తున్నారు. శ్రీరంగనాథుడే ఆ

యుద్ధాన్ని దగ్గర ఉండి కురుక్షేత్రం లాగా నడిపిస్తున్నాడని ప్రజలు వేనోళ్ళ కొనియాడుతున్నారు.

చంద్రగిరి రాజు తిరుపతిలో చేయించిన శ్రీదేవి భూదేవి విగ్రహాలు స్వామికి ఇరువైపులా గొప్ప శోభనిస్తున్నాయి. ఈ సంఘటన చూసేందుకు ప్రస్తుతం చంద్రగిరి రాజు జీవించిలేడని వల్లభదత్తులు తమ బాధను వ్యక్తం చేశారు. శ్రీరంగనాథుని ప్రయాణం మంచి సుముహూర్తం లో ప్రారంభమయింది. దక్షిణ కావేరీ తీరంలోని కొల్లిడం, శ్రీరంగం తీర్థాలలో ఇసుకవేస్తే రాలనంత భక్తులు నిలబడ్డారు. విగ్రహం అక్కడక్కడా భక్తుల దర్శనం కోసం ఆగుతూ అళగియమనవాళ గ్రామం చేరుకున్నది. అక్కడ స్వామికోసం యుద్ధంలో మరణించిన వారికోసం ఘన నివాళులర్పించారు.

శ్రీరంగనాథ స్వామి కావేరీ ఒడ్డుకు చేరుకున్నాడు. దాదాపు 48 సంవత్సరాల అనంతరం స్వామి కావేరీ తీరాన్ని దర్శిస్తున్నాడు. ఉత్తర కావేరీ నదిని దాటి శ్రీరంగం ఒడ్డుకు చేరగానే కొన్ని వేల మంది భక్తులు పెద్దపెట్టున “ఓం నమో నారాయణాయ” మంత్రాన్ని పెద్దగా శరణుఘోష వలె చెప్పగానే గంగాదేవి మహారాణికి ఒడలు పులకించింది. భక్త్యావేశంతో సంస్కృత శ్లోకాలను ఆశువుగా పఠించడం మొదలు పెట్టింది.

సాళువ మంగు (అన్నమయ్యకాలంలో జీవించి, తిరుమలలో వేయికాళ్ళమండపాన్ని నిర్మించిన సాళువ నరసింహరాయుడు వీనికి ముదిమనుమడు), సోమప్ప, మారయ్య నాయకుడు మిగతా బృందం గొంతులు చించుకుని బిగ్గరగా శ్రీరంగనాథుని “రంగా! రంగా!” అని పెద్దగా అరుస్తూ నమస్కారాలు చేశారు. కంపరాయలు శ్రీరంగనాథుని విగ్రహమున్న పల్లకీ మోయడానికి ముందుకు రాగానే ప్రజలు హర్షధ్వానాలు చేశారు.

మరో ప్రక్కన ఇతర సేనానాయకులు పల్లకీని తమ భుజాలమీదకు ఎత్తుకున్నారు. గోపనార్యుడు స్వామికి చామరం వీయ సాగాడు. ఆ దృశ్యం చరిత్ర పుటల్లో ఒక చిత్రపఠంలా పదిలంగా నిలిచిపోయిన సంఘటన. ఇక గంగాదేవి ఆవేశం పట్టనళవి కావడంలేదు. కొన్ని వందల శ్లోకాలు ఆమె నోటినుండి ఆశువుగా ఆ కావేరీ నదీ ప్రవాహ వేగంకంటే ఎక్కువగా వరదలెత్తుతున్నాయి.

నదిని దాటిరాగానే కొన్ని వందల మంది ప్రజానీకం సేవకులుగా మారి ఆ దారులన్నిటిని శుభ్రం చేయసాగారు. వేలాది మంది భక్తులతో స్వామి ఉత్తర దిశనుండి శ్రీరంగం చేరుకున్నాడు. ఒకప్పుడు కళకళ లాడిన వీధుల పరిస్థితి, నేడు పాడుపడిన రీతిని చూసి గోపన్నకు అప్రయత్నంగా కళ్ళవెంట నీళ్ళు కారుతున్నదనడం కంటే శ్రీరంగనాథుడే స్వయంగా ఆలయ పరిస్థితికి గోపన్న ద్వారా విలపించాడనడం సబబు.

ఆరోజు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు. సర్వాలంకార భూషితుడై, కస్తూరి తిలకంతో స్వామి ముఖం ప్రకాశిస్తుండగా, ఇద్దరు దేవేరులు ఇరువైపులా ఉండగా, ఏనుగుల బృందం, అశ్వబృందం ముందు నడుస్తూ ఉండగా, వేదపారాయణం దార్లు, ప్రబంధ పారాయణందార్లు పారాయణలు చేస్తూ ఉండగా, సీతారామస్వామి పుష్పకం విమానం దిగి అయోధ్యానగరంలోకి తిరిగి ప్రవేశిస్తున్నట్టుగా ఉంది. కంపరాయలే లక్ష్మణునిగా, గోపన్న హనుమంతుడుగా అభివర్ణిస్తున్నారు వైష్ణవ భక్తులు. ఇవన్నీ పరికిస్తూ తన గ్రంథంలో లిఖించాల్సిన శ్లోకాలను పఠిస్తూ, మననం చేసుకుంటూ మౌనంగా నడుస్తున్నది గంగాదేవి.

స్వామి ఊరేగింపు ఆలయం వేపు సాగుతుండగా భక్తుల ఆవేశానికి అదుపు లేకుండా పోయింది. ప్రతి వ్యక్తీ రంగ! రంగా! అని ఎలుగెత్తి అరుస్తున్నాడు. సైనికులు భక్తులను అదుపుజేసుకుంటూ ఆలయ ముఖద్వారం చేరారు. స్వామి గరుడ మండపాన్ని దాటి, నాళిగై కేట్టాన్ మండపాన్ని కూడా దాటుకుని గర్భగుడి ముందున్న ప్రదేశం ప్రవేశం చేశాడు. గోపన్న ఎత్తైన ప్రదేశంపై నిలబడి ప్రజలందరిని నిశ్శబ్దం పాటించమని చేతులెత్తి ప్రార్థించగా అక్కడా అంతా నిశ్శబ్దమయింది.

గోపన్న అక్కడి ప్రజలనుద్దేశించి "శ్రీరంగనాథుని భక్తులారా! నేడు పవిత్రమైన రోజు. మన రంగనాథుడు మళ్ళీ శ్రీరంగ చేరాడన్న విషయం నాకూ మీకు ఎంతో ఆనందానిచ్చే ఘటన. ఇప్పుడు ఒక ముఖ్య విషయం. శ్రీవేదాంతదేశికుల వారు గర్భగుడిని స్వయంగా రాతిగోడకట్టి మూసి వేశారు. ఆయన శతాధికవయస్కుడు. ఆయనను జాగ్రత్తగా సగౌరవంగా మేళతాళాలతో, పల్లకీలో ఇక్కడికి తీసుకుని రండి. రావడానికి సమయం పట్టినప్పటికీ, వారిచేతులతోనే ప్రతిష్ఠ! వారే స్వయంగా మళ్ళీ తన హస్తాలతో గోడను పెళ్ళగించి మంత్రప్రోక్తంగా ప్రతిష్ఠ చెయ్యాల్సిందిగా కోరుతున్నాను." అనగానే జనం సంతోషం అధికమయి పెద్దగా కరతాళధ్వనులు చేస్తుండగా, కొంతమంది మంచాలలో పడుకుని ఉన్న తిరుమణత్తూర్ నంబి, కృష్ణరాజత్తూనంబిలను జాగ్రత్తగా మోసుకుని వచ్చారు. వారిద్దరిని మంచాలపై కూర్చుండ జేశారు.

ఇంతలో కొంతమంది గుంపుగా తిరుమణత్తూర్ నంబి, కృష్ణరాజత్తూనంబిలను మంచాల వద్ద చుట్టూ చేరి ఏదో ముచ్చట్లు చేస్తున్నారు. ఏవో వాదోపవాదాలు జరుగుతున్నాయి. కొంతమంది వీల్లేదు

అని పెద్దగానే అరుస్తున్నారు. గోపన్నకు గానీ ఇతర బృందానికి గానీ విషయం ఏమిటో అర్థం కాలేదు. గోపన్న వారిని సమీపించి వల్లభుని "ఏమి జరుగుతున్నది? ఏమిటీ యోచనలు? ఎందుకీ వాదనలు?" అని ప్రశ్నించాడు. వల్లభుడు మెల్లిగా "స్వామీ! ఇక్కడ ఉన్న భక్తులు ప్రస్తుతం యిక్కడ ఉన్న విగ్రహం కాదని, ఎక్కడనుండో తెచ్చిన విగ్రహాన్ని ఎలా పూజిస్తాం? ఏది అసలైనది? అని వారు వాదులాడుకుంటున్నారు" అనగానే గోపన్నకు అంతా అయోమయంగా తోచింది. చివరకు ఏది అసలైన శ్రీరంగనాథుడే తేల్చేవరకూ రెండూ పూజార్హమైనవే అని నిర్ణయించారు పెద్దలు. ఇంతలో భటులు వచ్చి గోపన్నను కలిసి కంపనమహారాజు కబురు చేశాదని చెప్పారు.

"ఈ విగ్రహాలు రెండూ మీరు చెప్పినట్లే చేద్దాం. దీనికి ఏదైనా ఉపాయం ఉండకపోదు. మనం అష్టకష్టాలు పడి తిరిగి పొందిన విగ్రహానికి మళ్ళీ పరీక్షలు అవసరమయ్యేట్టు ఉన్నది. మళ్ళీ కలుద్దాం. అంతవరకూ ఎవరూ ప్రతిష్ట గురించి ఆవేశపడకండి!"

గోపన్నగబగబా ఆలయ ప్రాగణం నుంచి బయటకు వచ్చి "వల్లభా! రేపే మధురపై మన దండయాత్ర!" అన్నాడు.

"మరి విగ్రహ ప్రతిష్టాపన?"

"చేద్దాం! వేదాంత దేశికులవారు వృద్ధులు. వారిద్వారానే జరగాలి. వారు వచ్చేలోపు మనం మధురను జయిద్దాం. ఈలోపు మీ తల్లి వాసంతికాదేవిగారిని, ఇంకా భక్తులను ఇక్కడకు రావించండి మీ తల్లిగారి జీవితేచ్ఛ కన్నులారా దర్శించాలి."

"మరీ ఇంత వెంటనేనా? గోపనార్యా!" అన్నాడు వల్లభుడు.

"అవును వల్లభా! ఆలస్యం అమృతం విషం. మన సైనికులను చూశావు కదా! ఎంత ఉత్సాహంగా ఉన్నారో! ఇంకొద్ది రోజుల్లో నేను చేసిన ప్రతిన నెరవేరుతుంది. శ్రీరంగనాథుని ప్రతిష్ఠ, వేదాంతదేశికుల వారు వచ్చాక వారి సలహా తీసుకుని ప్రతిష్టిద్దాం. ''మీకు యుద్ధంలో సహకరించాలనుకుంటున్నాం. ఆ సుల్తాను తలతెగి నేలమీద పడ్డ సంఘటన మాకన్నులారా చూడాలి. మేము ఆ శ్రీరంగనాథుని విగ్రహాన్ని కనుక్కోవడానికి పడ్డశ్రమ ఆ ఘటనతో పూర్తవుతుంది గోపనార్యా!" అన్న వల్లభుని మాటలకు మీరిద్దరూ కంపనకు రక్షణగా ఇరువైపులా నిలవండి. కంపనపై ఈగకూడా వాలడానికి వీల్లేదు. మన ప్రాణాలడ్డుపెట్టి రాజును రక్షించుకోవడం మన కర్తవ్యం"

''అలాగే వల్లభా కంపనమహారాజావారికి కుడిఎడమల రక్షణగా నిలబడతాం"

"అస్తు! శ్రీరస్తు! శుభమస్తు!"

మరుసటిరోజు దండు దక్షిణదిశగా ప్రయాణంచేస్తూ మధుర వైపు కదిలింది. ప్రళయ కావేరిలా ఉంది సైనికుల ఉత్సాహం. పట్టనలవి కావడంలేదు.

వల్లభునికి ఆలోచనలు గుర్రం కంటే వేగంగా సాగుతున్నాయి. ఈ సమయంలో మధురాంగిణి ఉంటే ఎంత బావుండేది. తన శౌర్య ప్రతాపాలు కన్నులారా చూసి పరమానందం చెందేది. సైన్య ప్రవాహం సాగుతున్నంతసేపూ చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు వారికి దారిపొడుగునా అహారపదార్థాలు అందిస్తున్నారు. సైన్యం వెనుక కలిసిపోయేవారు

కలుస్తున్నారు. ఒక నది చిన్న పాయగా ప్రారంభమై మహానదిగా మారినట్లు, ప్రతి గ్రామంలో కొన్ని వందల మంది కత్తులు, బాణాలు ధరించి సైన్యంతో కలుస్తూనే వున్నారు. గోపన్నకు ఆనందం అవధులు లేకుండా పోతోంది. చిన్న సైన్యమని నిరుత్సాహం చెందిన సేనానాయకులకు కరవాలమెత్తి ప్రతి గ్రామంలో చేరుతున్న సైనిక బృందాన్ని అందరికి చూపిస్తూ "జై రంగనాథా! ఓం నమో నారాయణాయ!" మంత్రాల్ని ఆవేశంగా పలికిస్తున్నాడు. 30 వేలతో బయలుదేరిన సైన్యం ఇప్పటికే 50 వేలు దాటింది. ఇక ఈ ప్రయాణంలో తమిళ మాతృభాషకలిగిన వాళ్ళు కూడా చేరడంతో అంతా కలిపి ఒక లక్ష పైచిలుకేనని వల్లభదత్తులు ఒకసారి సైన్యం వెనకదాక వెళ్ళి గోపన్న చెవిన వేశారు.

"వల్లభా! ఇంక భయంలేదు. మధుర చేరడమే ఆలస్యంగా సుల్తాను సైన్యాన్ని ఊచకోత కోయడమే!" అన్నాడు. మధుర చేరడానికి ఎంతలేదన్నా మనకు వారం పైనే పడుతుందని వల్లభుడు చెప్పాడు. కానీ శ్రీరంగనాథుని మహిమ ఐదురోజుల్లోనే సైన్యం పెల్లుబికిన ఉత్సాహంతో పరుగులు తీస్తూ మధుర ఎల్లలను చేరుకున్నారు.

మొదట కావేరీ నది దాటి సైన్యం దక్షిణ దిశగా సాగి వైఘై నది ఒడ్డున గల మధురవేపు సాగింది. కంపనుడు గంగాదేవి ఏమో చెప్పబోతుందని గమనించి గోపన్నకు సైన్యాన్ని కొద్దిసేపు ఆపమని సైగ చేశాడు. గోపన్న కరవాలం పైకెత్తి "ఆగండి కాసేపు! కంపన మహారాజు ఆజ్ఞ!" అన్నాడు. ప్రకృతి ఎంతో ప్రశాంతంగా ఉంది. గంగాదేవి అక్కడ అనేక శ్లోకాలను చెప్పింది. నది నీటిని కంపన శిరసు పై చల్లి తనూ

చల్లుకుంది. గోపన్న, సైన్యాధికారులు కూడా అదే పని చేశారు. అక్కడికి దూరంగా మధుర మీనాక్షి ఆలయ గాలిగోపురం కలశం కనిపిస్తోంది. "తల్లీ మీనాక్షీ! వచ్చాను తల్లీ...నీ ఆజ్ఞ నెరవేరుస్తాను" అని శిరసు పైకెత్తి ఆకాశంలో చూశాడు. అక్కడ మేఘం ఒకటి స్త్రీ ఆకారం ధరించి రెండు చేతులతో వారిని ఆశీర్వదించినట్లు అనుభవమైంది కంపనుడికి.

"ఏమైంది స్వామీ!"

"మీనాక్షీ దేవి నన్ను ఆశీర్వదించింది గంగా చూడు" అని చూపించాడు.

"తల్లీ.. నువ్వు నాకు కనబడకపోయినా నా భర్తను వెంట ఉండి నడిపిస్తూ కర్తవ్యోన్ముఖిణ్ణి చేస్తున్నందుకు కృతజ్ఞతలు అని అక్కడే సాష్టాంగ నమస్కారం చేసి నిలబడి "తల్లీ.. నేను వ్రాయబోయే కావ్యానికి "మధురా విజయము"అని పేరు పెడతాను తల్లీ". అని ముకుళిత హస్తాలతో ప్రార్థించింది.

ఇంతలో గోపన్న గుర్రంపై వేగంగా అక్కడికి వచ్చాడు. "గోపనార్యా! నీవు కన్ననూరుపై యుద్ధం చేసి విజయం సాధించావు. కానీ మీనాక్షీ దేవి ఆజ్ఞననుగ్రహించి మధురపై యుద్ధంచేసి సుల్తానును వధించే అవకాశం నాకివ్వు!" అన్నాడు కంపన ఆవేశంగా. "అలాగే ప్రభూ! మీ వెంట వల్లభదత్తులు కుడియెడమల ఉంటారు. నేను వెనుక, ముందు సైనికాధికారులు ఉంటారు. సుల్తాను తలతెగి నేలపైబడే వరకూ ఈ వ్యూహం మాత్రం దయచేసి కాదనకండి! మార్చకండి!" అని దణ్ణం పెట్టాడు.

"గోపనార్యా!" అంటూ గాఢంగా కౌగలించుకుని నీవు నేనూ చేతులు కలిపి నిలిస్తే ఆ హరిహరాదులు కూడా మనలను జయించలేరు.

"సాహెబూ! గోపనార్యా!" అన్నాడు.

"ప్రభూ నేనూ మీ వెంటే!" అంది నవ్వుతూ గంగాదేవి.

"నీ నిష్కల్మషమైన ప్రేమ, దేశభక్తి నాకెప్పుడూ ఆవేశాన్నిచ్చే అంశాలు గంగా!" అన్నాడు కంపన కరవాలం పైకెత్తి ఆవేశంగా. అలా ఆరోజు మధ్యాహ్నం వేళకు మధుర కోటకు చేరుకున్నారు. సూర్యకాంతి ఆయుధాలపైబడి తళతళా మెరుస్తున్నది. గోపన్న సాలోచనగా అగడ్తవేపు చూస్తూ.. దాదాపు పదడుగుల లోతున్న అగడ్తయని గ్రహించి, "మొదట ఈ అగడ్తలోకి నీళ్ళు రావడం ఆపండి" అన్నాడు. ఒక సైనిక బృందం కోట వేపు నడిచి, పైనుండి అగడ్తలోకి నీళ్ళు ప్రవహించే రాతిగొట్టాలకు కొయ్య బిరడాలను గట్టిగా బిగించారు. అలాగే అగడ్తనుండి నీటిని బయటకు పంపే ఏర్పాటు కూడా చేశారు.

కోటలోని సైన్యం బయటకు వస్తారని బాహాబాహీ తలపడదామని వేచి ఉన్న కంపనకు వారెంతకూ రాకపోయే సరికి మరుసటి రోజు ఉదయాన్నే గోపన్న తదితర సైనికాధికారులతో చర్చించి, కోట ముట్టడి ప్రారంభించారు. తమిళ ప్రాంత సైనికులు మరీ ఆవేశం ప్రదర్శిస్తున్నారు. ఒక్క చిన్న సైగతో కోటను ముక్క ముక్కలు చేసేట్టు కనిపించారు. ఒకటా రెండా.. ఒక తరం వెళ్ళిపోయింది సుల్తాను హయాంలో. ఇక ఆగేది లేదన్నట్టు తెగించారు.

అగడ్తలో నీటి మట్టం బాగా తగ్గిపోయి, మోకాళ్ళలోతు కంటే దిగువగానే ఉంది. అగడ్తదాటి కోటపైకి అగ్ని గోళాలను విసిరే బృందం ఒకటి, గాలిని చీలుస్తూ కురిసే బాణవర్షం కురిపించే బృందం ఇంకోటి, లోపలి వారిని కకావికలయ్యేట్టు చేశాయి. సుల్తాను సైన్యం పలచబడ్డట్టుగా

సంకేతాలు రాగానే విజయనగర సైనికుల తాళ్ళనిచ్చెనల బృందం, గోపన్న సైగలు అర్థంచేసుకుని కోట చుట్టూ తాళ్ళ నిచ్చెనలు ఏర్పాటు చేశారు. వాటిమీద ఎక్కి సైనికులు చిన్న చిన్న చీమల్లాగా పై పైకి ప్రాకి వెళ్తున్నారు.

ఇంకో బృందం దాదాపు ఇరవై ఏనుగులను గుంపుగా తీసుకొని వచ్చి కోట తలుపులను బ్రద్దలు కొట్టించారు. కొద్ది సమయంలోనే కోట మొత్తం విజయనగర సామ్రాజ్య సైనికులు నిండిపోయారు. ఇక తూర్పు ద్వారాలు తెరవమన్న కంపన ఆదేశంతో భళ్ళున తెరిచారు. అంతే సైన్యం దూసుకుని వెళ్ళింది. తురుష్కులు భయంతో అన్ని దిక్కులకు పారిపోయారు. ఇంతలో కంపన తన బృందంతో ముందుకు కదిలారు. బహృద్దీన్ ఇక కోట తన చేతులు దాటిపోతుందని గ్రహించి గుర్రంపై స్వయంగా యుద్ధానికి వస్తున్నాడన్న వార్త ఒక తురుష్క సైనికాధికారి ప్రకటించాడు.

కంపనకు కుడియెడమల నిలబడ్డ వల్లభదత్తులు ముందుగా గుర్రాలను దౌడు తీయించి ఇద్దరూ ఒకేసారి సుల్తాను రాగానే పైకి రెండు కొదం సింగాల్లా దూకడానికి వెళ్తున్నారు. గోపన్న వారికి సైగచేసి ప్రక్కకు తప్పుకోమనడంతో కంపన సుల్తానుతో తలపడ్డాడు.

గోపన మనసులో "కలి ప్రణిధి లక్షణై: కలిత శాక్య లోకాయతైః , తురుష్క యవనాదిభిర్జగతి జృంభమాణం భయం, ప్రకృష్ట నిజశక్తిభిః ప్రసభమాయుధైః పృభిః , క్షితి త్రిదశ రక్షకైః క్షిపయ ర్గనాధ క్షణాత్" అంటూ విద్యారణ్యస్వామి ద్వారా విన్న వేదాంత దేశికుల అతిభీస్తవ శ్లోకం మననం చేసుకుంటున్నాడు. ఇద్దరూ రెండు సింహాలమాదిరి పోరాడుతున్నారు. కత్తుల శబ్దాలు మాత్రమే వినిపిస్తున్నాయి. అందరూ కంపన రక్షణకై చుట్టూ నిలబడ్డారు. అలా అరగంటపైన భీకరపోరు జరుగుతూనే ఉంది. సుల్తాను

ఒకానొకక్షణంలో 'అల్లా' అంటూ నీరసపడి కొంచెం వెనక్కు తగ్గగానేక్షణాల్లో పసిగట్టిన కంపన, నాలుగడుగుల ఇరువైపుల పదునున్న వేరొక కరవాలాన్ని సర్రున ఒరలోనుండి లాగి సుల్తానునాభిలో బలంగా పొడవగానే కత్తి వెనుక నడుము నుంచీ బయటకు వచ్చింది, "జై మీనాక్షీ దేవీ!" అంటూ కత్తిని రెండు చేతులూ ఉపయోగించి గొంతుదాకా బలం ఉపయోగించి పైకి లాగగానే, సుల్తాను శరీరం రెండు ఖండాలయి నేల కూలడానికి సిద్ధంగా ఉన్న క్షణంలో, తలను కూడా నేలకు పడగొట్టాలని, కత్తిని సర్రుమని వేగంగా బయటకు లాగి పైకెత్తి మెడమీద బలంగా దెబ్బ వేయగానే, సగం మెడ తెగి మొండెంపై వేలాడుతూ, తోటకూర కాడవలె సుల్తాను శరీరం ఒరిగి నేలమీద పడుతుండగా, గోపన్న ఎప్పుడు, ఎక్కడనుండి గమనించాడో తెలీదు. గుర్రంపై మెఱుపు వేగంతో వచ్చి, శూలంతో సుల్తాను సగం తెగిన తలను పదునైన శూలానికి గ్రుచ్చి పైకిలేపాడు. తల శూలానికి అంటుకోగా సుల్తాను మొండెం క్రిందకు ఒరిగిపడిపోయింది. గోపన్న శూలానికి గ్రుచ్చిన సుల్తాను తలను తలను పైకెత్తి "ఓం నమో నారాయణాయ!" అని అరుస్తూ కదనరంగం మొత్తం తన ప్రతిన నెరవేరిందన్న ఆనందం, ఆవేశంతో కలియతిరిగాడు. విజయనగర సైనికులకు ఆ తలను పదినిముషాలు ప్రదర్శించిన అనంతరం కసిగా నేలకుపడగొట్టాడు. విజయనగర సైనికులు హర్షంతో " జై కంపరాయా! జై గోపనార్యా! జయహో" అని కేకలు పెట్టారు. విజయనగర సైనికులు, ముఖ్యంగా తమిళ గ్రామాలనుండి వచ్చి చేరిన సైనికులు, ఆ సుల్తాను తలను బంతిలాగా కాళ్ళతో తన్ని ఒక క్రీడలా ఆడుకొంటూ వికటాట్టహాసాలు చేస్తున్నారు.

తురుష్కులు కోటలో మచ్చుకుకూడా ఒక్కడు కనుపించలేదు. ప్రాణాలరచేతబట్టుకుని అడవుల్లోకి పరుగులు తీశారు. కంపన దూరంగా ఉన్న గంగాదేవి వేపు చూస్తున్నాడు. గంగాదేవి కంపరాయుని ధైర్య సాహసాలను అచ్చెరువంది తిలకిస్తోంది. గుర్రం దిగి కంపన గంగాదేవిని గాఢంగా కౌగలించుకున్నాడు. కుడిచేత్తో మీసాన్ని తిప్పుతూ గోపన్న వేపు చూశాడు. గోపన్నతో సహా అందరూ "మండలేశ్వరుడు కంపనాధీశునికి జై!" అని నినాదాలు చేశాడు. గోపన్నను గాఢాలింగనం చేసుకుని "అందరూ ఒక ఎత్తు! మా గోపనార్యుడు ఒక ఎత్తు! ఈ విజయం మీదే గోపనార్యా!" అన్నాడు. "కాదు ప్రభూ! సుల్తాను గుండెల్లో మీరు కత్తిదించిన తీరు చరిత్రపుటల్లో అపూర్వంగా నిలిచిపోతుంది, మధురా విజయం మీదే!" అన్నాడు. అందరు సైన్యాధికారులు కంపన ధైర్య సాహసాలను మెచ్చుకున్నారు. అందరి జయజయ ధ్వానాల మధ్య సైన్యాధికారులందరిని పేరు పేరున పలకరించి గాఢాలింగనం చేసుకున్నాడు.

సాయం సమయమయింది. భానుడు పడమటి పర్వతం మాటున అస్తమిస్తున్నాడు. ఆ ఎరుపువర్ణం అక్కడున్నవారిపై బడి నేలపై పారుతున్న తురుష్కసేనల రక్తాన్ని గుర్తుకు తెచ్చింది. కోటలో అన్ని మూలలా, మధురా నగర వీధుల్లో విజయ నగర వరహపతాకం రెపరెపలాడింది. ఈ దృశ్యాలన్నీ గంగాదేవి మనఃఫలకం మీద లిఖించబడి తరువాయి కాలంలో మధురా విజయమనే మహాకావ్యంగా రూపుదిద్దుకొన్నది.

అప్పటికే వందిమాగధులు అక్కడకు విచ్చేసి "శ్రీమద్విజయనగర సామ్రాజ్య రక్ష ధౌరేయ! శ్రీమహామండలేశ్వర, అరి రాయ విభాళ భాషెగె

తప్పువ రాయరగండ శ్రీ కంపరాయ మహీపాల" అంటూ నుతిస్తుండగా, వేదపండితులు పూర్ణకుంభంతో ఎదురొచ్చి, వేదం పఠిస్తూ, పవిత్ర జలం సంప్రోక్షణ చేసిన అనంతరం, అందరినీ పవిత్ర నదీ స్నానాలు చేయించి మధుర మీనాక్షి ఆలయానికి దారి తీశారు.

శ్రీరంగం మాదిరిగానే మధుర మీనాక్షి ఆలయం కూడా మూలవిగ్రహం రాతిగోడలతో కప్పబడి ఉంది. మధుర మీనాక్షి మూల విగ్రహం అలా ఉండడం చూసి చలించిపోయాడు గోపన్న. వెంటనే ఆ రాతిగోడలను పగులగొట్టమని ఆదేశాలు జారీ చేయగానే, పని వారు ఆపనిలో నిమగ్నమయ్యారు. కంపనుడు, గంగాదేవి, గోపన్న, విఠప్ప, సాళువ మంగు, సోమప్ప ఎవరు కూడా తమ జీవితంలో మధుర మీనాక్షి మూలవిగ్రహాన్ని ఒక్కసారి దర్శించుకోనందున ఆతృతగా దర్శనం కోసం ఎదురు చూస్తున్నారు. రాతిగోడ కూలి అక్కడంతా పరిశుభ్రం చేయగానే వారందరికి మధుర మీనాక్షీ దేవి మూల విగ్రహ సాక్షాత్కారం జరిగింది. అందరూ సాష్టాంగ నమస్కారాలు చేసి నిలబడ్డారు. వారందరికి ఆశ్చర్యం కలిగించిన విషయం ఏమిటంటే 48 సం.ల క్రితం అలంకరించబడ్డ విగ్రహం ఇప్పటికి వాడకుండా తాజాగా ఉండడం. కంపన "తల్లీ...మధుర మీనాక్షీ మాతా..ఈ క్షణం నీ పాదాల సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను. అతి త్వరలో ఇక్కడ పెద్ద కోవెల వెలుస్తుంది. నీకు పూర్వ వైభవాన్ని తీసుకొస్తానని ప్రమాణం చేస్తున్నాను. ఇంతవరకు నన్ను ఆశీర్వదించి ముందుకు నడిపినందుకు కృతజ్ఞుడిని తల్లీ..." అని ఆనందాబాష్పాలు నేల జారుతుండగా, సాష్టాంగ దండప్రమాణం చేస్తూ అన్నాడు. కంపరాయల బృందం వెలుపలికి రాగానే మిగతా జనం బిలబిలమంటూ లోనకు దూరారు.

కంపన ఆలయ ప్రాంగణంలో నిలబడి తక్షణం, తురుష్కుల దండయాత్రకు ముందున్న ఈ ఆలయ వంశపారంపర్య ఆలయ పూజారులను రావించి, వారితో "ఈ క్షణం నుండి ఈ ఆలయంలో మీరు మీనాక్షీ దేవి సేవకులు!" అనే సరికి వారంతా కంపనకు సాష్టాంగ పడ్డారు. "సాష్టాంగ నమస్కారాలు చేయవలసింది నాకు కాదు. ఆ తల్లికి. అందునా గుడిలో దైవానికి తప్ప ఎవరికి నమస్కరించరాదు!" అనే సరికి కంపన జ్ఞానానికి, అమ్మపట్ల ఉన్న భక్తికి జనం హర్షానందాలతో "మహారాజు కంపనుల వారికీ జై!" అన్నారు. ఇవి కూడా ఇక్కడ వద్దు సుమా! అన్నీ బయటనే అన్నట్టు గోపన సైగతో అందరూ నిశ్శబ్దం అయిపోయారు. కంపన సంతోషపూర్వకంగా గోపన్న భుజంపై చేయి వేసి ప్రశంసించాడు.

"ప్రభూ! వేదాంతదేశికులవారు శ్రీరంగానికి కాలినడకన బయలుదేరారట. పల్లకీని త్రిప్పి పంపేశారట. రేపు ఆలయానికి చేరుకుంటారని వార్తాహరులు తమకు విన్నవించమని నాకు మనవి చేశారు. మనం తక్షణం అక్కడికి కదిలివెళ్ళి ఆ ఆలయంలో శ్రీరంగనాథుణ్ణి ప్రతిష్ఠించాలి" అనగానే "గోపనా! అక్కడివారు లేవదీసిన సమస్య పరిష్కారమయితేనే కదా ప్రతిష్ఠ విషయం" అన్నాడు. "లేదు ప్రభూ! ఈ సమస్యను దేశికులవారే పరిష్కరించగలరని నా విశ్వాసం" " అనగానే అందరూ బయలుదేరి శ్రీరంగం చేరుకున్నారు.

మహామండలేశ్వరుడైన బుక్కరాయల వారి ఆదేశం ప్రకారం శ్రీరగనాథుని ప్రతిష్టాపన తర్వాత కంపరాయలవారికి రాజ్యాభిషేకం కూడా జరుగవలసి ఉన్నది. ఈ కారణాలవల్ల శ్రీరంగం క్రొత్త శోభ

సంతరించుకొన్నది. సుల్తాను పాలనలో గ్రామాలను ఖాళీ చేసి వెళ్ళిపోయిన వాళ్ళు బండ్లు కట్టుకుని శ్రీరంగం చేరుకుంటున్నారు. కొన్ని కుటుంబాలు కావేరీ నదికి ఆవల వెళ్ళినవారు తిరిగి పడవలపై చేరుకుంటున్నారు. అందరి ముఖాల్లో చిరునవ్వు తాండవిస్తోంది. రహదారులన్నీ పరిశుభ్రం చేశారు. పాడుబడిన ఇళ్ళకు మర మ్మత్తులు చేసుకుంటున్నారు. ఈ గృహనిర్మాణ, మరమ్మత్తులకయిన కర్చు తరువాత విజయనగర ఖజానా భరిస్తుందని ప్రజలెవ్వరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదనే ప్రకటన, కంపన గోపన్న ద్వారా చేయించాడు. మళ్ళీ ప్రజలకు శ్రీరంగంలో కావేరీ నదీ పుష్కరాలో, తిరునాళ్ళో వచ్చినంత సంబరంగా ఉన్నారు.

ఆలయంలో ఏది అసలైన విగ్రహం అనే విషయం మీద వాదోపవాదాలు పెద్ద పెట్టున జరుగుతున్నాయి. అక్కడి రాజమందిరానికి చేరుకున్న కంపనకు, గోపన్నల బృందానికి ఇవన్నీ చూసి ఆందోళనగా ఉంది. పాత విగ్రహం పట్ల మక్కువ ఉన్నవారు పట్టు వీడడంలేదు. వల్లభుడికి మాత్రం చాలా విచారం వేసింది. కొన్ని సంవత్సరాలు శ్రమించి తెచ్చిన విగ్రహం అసలైనదేనా అని భక్తులు శంకించడం నిరుత్సాహాన్ని మిగిల్చింది. గోపన్నను ఇరుపక్షాలవారు చర్చకు రమ్మని ఆహ్వానం అందింది. గోపన్న వల్లభుని సాక్ష్యంగా చూపి ఎంత వివరించినా వారు నమ్మడంలేదు. శ్రీరంగం బృందంలో మొదట విగ్రహాన్ని తీసుకుని వెళ్ళినవారిలో ఎవరిచేతైనా సాక్ష్యం చెప్పించమని చివరకు ఒక అంగీకారానికి వచ్చారు. “ఎంత అపనమ్మకం. మా అమ్మ వాసంతికను పిలుస్తాను. ఆవిడే వచ్చి సాక్ష్యం చెబుతుంది” అన్న వల్లభుని మాటలకు వారు నవ్వి “మీ అమ్మ ఒకసారి విగ్రహాన్ని చూసి ఉండవచ్చు కానీ.. విగ్రహం తీసుకెళ్ళిన బృందంలో ఉన్నదా?” అని వారు

అడిగిన ప్రశ్నకు మిన్నకున్నాడు. శతాధిక వయసున్న వేదాంత దేశికులు కాలినడకన చేరుకున్నారు. వారి వయసు 102 సంవత్సారాలైనా పల్లకీని ఎక్కడానికి ఒప్పుకోకుండా మేల్కోటనుండి శ్రీరంగానికి కాలినడకన రావడం భక్తులకు ఆశ్చర్యం కలిగించింది. ఆయన రావడం ఆలస్యం, గోపన్న వారికి సాష్టాంగ నమస్కారం చేశారు. "గోపన్నా! విజయనగర సామ్రాజ్యం దినదినాభివృద్ధి చెందుతుంది. చాలా సంతోషంగా ఉంది. ఈ సీమలోని ఆలయాలన్నిటిని జీర్ణోద్ధరణ బాధ్యత నీదే!" అని ఆశీర్వదించారు.

గోపన్న కొంచెం దిగులుగా ఉండడం, అక్కడ ప్రజలు కొన్ని వర్గాలుగా చీలి వాదోపవాదనలు చేసుకోవడం గమనించిన దేశికులవారు గోపన్నను విషయం ఏమిటో చెప్పమని అడిగారు. గోపన్న ఈ విగ్రహాల సమస్య ఎంతకీ తేలడంలేదని, ఒక పక్షం వారు శ్రీరంగం బృందంలో మొదట విగ్రహాన్ని తీసుకుని వెళ్ళినవారిలో ఎవరిచేతైనా సాక్ష్యం చెప్పించమని కోరుతున్నారని అనడంతో "గోపన్నా! ఈ విషయంలో ఇంత చర్చ అనవసరం. శ్రీరాముడు అన్ని సంవత్సరాల తర్వాత కలిసిన సీతకే అగ్ని పరీక్షకు గురిచేశాడు. మనమంతా మానవ మాత్రులం. రెండు విగ్రహాలు ప్రక్క ప్రక్కన పెట్టించు. శ్రీరంగంలో 60 సంవత్సరాల పైబడి ఉన్న వారిని తీసుకునిరా. వారిలో కొంతమంది తప్పక పాత విగ్రహం చూసే ఉంటారు. వారు సరిగా గుర్తుపట్టగలరు" అన్నడు.

గోపన్న అధికారులతో మాట్లాడి "శ్రీరంగ పట్టణంలో అరవై సంవత్సరము పైబడినవారు, గతంలో శ్రీరంగనాథ స్వామిని దర్శించుకున్నవారు ఆలయాని రేపు ఉదయం ఆలయానికి రావాలని మహాసేనాని గోపనార్యుని ఆజ్ఞ!" అని నగరంలో అన్ని చోట్లా దండోరా

వేయించాడు.

కానీ ఎంత వెదికినా ఒక్క వృద్ధుడూ కనిపించలేదు. ఎక్కువమంది పట్టణాన్ని వదలి వలసలు వెళ్ళిపోయిన కుటుంబాలే కనిపించాయి. చివరకు 90 యేళ్ళ వృద్ధుడు తాను పాత విగ్రహాన్ని చూశానని చెప్పడంతో ప్రజలు అతన్ని గుర్రంబండిలో ఎక్కించుకుని తీసుకుని వచ్చారు. అందరూ ఆత్రంగా..ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రెండు విగ్రహాలు చూపించిన మీదట అందరికి తెలిసిన విషయమేమిటంటే వాని వాని రెండు కళ్ళు తురుష్క సైనికులచే పీకివేయబడి లొట్టలైనాయి. "నాకు కళ్ళు కనిపించవు." అనగానే సమస్య మళ్ళీ మొదటికే వచ్చింది.

వృద్ధుణ్ణి వెనక్కు తీసుకెళ్ళమని అధికారులు చెప్తుండగా ఆ వృద్ధుడు ఏదో గుర్తొచ్చి "ఒక్క క్షణం ఆగండి! నేను మాట్లాడాలనుకుంటున్నాను!" అని పెద్దగా తన శక్తి కొద్దీ, అంత వయసులోను పెట్టిన పొలికేక ఆలయంలో ప్రతిధ్వనించింది. గోపన్న అధికారులకు ఆగమని సైగచేసి అతణ్ణి సమీపించి "మీరేం చెప్పాలనుకుంటున్నారు?" అని ప్రశ్నించాడు. వృద్ధుడు గొంతు సవరించుకొని "గౌరవనీయులైన శ్రీరంగపట్టణ వాసులారా! దయచేసి నా మాటలు ఆలకించండి! నేను రజకుణ్ణి. నా కళ్ళు తురుష్క సైనికులతో రంగణ్ణి గూర్చి మాట్లాడినందుకే పీకి వేయబడ్డాయి. ఆరోజుల్లో స్వామి వారి బట్టలను అభిషేకం అయిన తర్వాత ప్రతిరోజూ శుభ్రం చేసిన వాణ్ణి నేనే!" అనేసరికి అందరూ ఆశ్చర్యంగా అతనిపట్ల గౌరవ భావంతో చూడసాగారు. అప్పటి వరకు అతడిని బయటకు పంపాలనుకున్న అధికారులు అతనికి కొంచెం దూరం జరిగి చెప్పేది శ్రద్ధగా వినసాగారు. వృద్ధుడు కొనసాగిస్తున్నాడు. "స్వామి దివ్య వస్త్రాలను శుభ్రం చేసి ఉతికే

ముందు నాకొక అలవాటు ఉండేది!. అదేమిటంటే..." అని గుండె పట్టుకుని ఆయాసపడుతుండగా, అధికారి ఒకడు అతణ్ణి కూర్చుని మాట్లాడమని కూర్చోబెట్టబోతుండగా వద్దని వారించి, రంగ.. రంగా! అని ఒకసారి ప్రార్థించి "స్వామి వారి వస్త్రాలను ఉతికేముందుగా ఆ బట్టలను నీటిలో ముంచి, పిండి, ఆ నీటిని పవిత్ర తీర్థంగా సేవించేవాడిని" అనే సరికి అందరూ హర్షధ్వానాలు, కరతాళ ధ్వనులు చేశారు. "అందువల్ల స్వామి అసలైన కస్తూరి రంగడి విగ్రహ అభిషేకానికి వాడిన బట్టలకు ఒక ప్రత్యేకమైన రుచి, వాసన ఉంటాయని నేను చెప్తున్నాను. అది నేను మాత్రమే కనుక్కోగలను. అందుచేత, మీకు సర్వజనామోదమయినట్లైతే, రెండు విగ్రహాలను అభిషేకించి, అభిషేకం అయ్యాక ఆ కట్టిన రెండు బట్టలను నాకు ఇవ్వండి. చాలు! అసలు విగ్రహమేమిటో నేను చెప్తాను" అన్నాడు. వేదాంత దేశికులు "భేష్! నాకు సమ్మతమనే సరికి ఇరుపక్షాలు "మాకూ సమ్మతమే! మాకూ సమ్మతమే! అని పెద్దగా కేకలు వేశారు.

దేశికులవారు ప్రక్క ప్రక్కన ఉన్న రెండు విగ్రహాలకు వస్త్రాలు కట్టి అభిషేకం చేయమని ఆజ్ఞాపించగా, గోపన్న తెచ్చిన విగ్రహానికి ఎర్రటి పట్టు అంచున్న వస్త్రం, ఇదివరకు ఉన్న విగ్రహానికి ఆకుపచ్చటి పట్టు అంచున్న వస్త్రం కట్టించి, శాస్త్రప్రకారం మునుపటి తీరులో ఒకే విధంగా రెండు విగ్రహాలను పూజారులు అభిషేకించారు. అభిషేకం పూర్తయిన తర్వాత గోపన్న దేశికుల వారి ఆదేశం తీసుకుని రెండు బట్టలను వృద్ధుడికి ఇచ్చాడు. "ఏ వస్త్రం ఏ విగ్రహానికి కట్టినదో మీరు గుర్తుంచుకున్నారు కదా!" అని రెండు వస్త్రాలను తీసుకుని "ఓం నమో నారాయణాయ!" అని అరిచాడు. అందరూ ఊకుమ్మడిగా ఆ మంత్రాన్ని పఠించాక, అక్కడ

ఇసుకవేస్తే వినబడనంత నిశ్శబ్దం! అంతా వృద్ధుణ్ణి చూస్తున్నారు. ఏమి జరగబోతున్నదా అని ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. వృద్ధుడు మొదట ఆకుపచ్చటి పట్టు అంచున్న బట్టను పిండి ఆ నీళ్ళు నోట్లో పోసుకున్నాడు. అతడి మొహంలో ఏమార్పూ లేదు. తల అడ్డంగా ఊపుతూ దాన్ని తీసి భుజంపై వేసుకున్నాడు. తర్వాత ఎర్రటి పట్టు అంచున్న రెండో బట్టను పిండి నోట్లో పోసుకున్నాడు. అతని ముఖం ప్రకాశవంతమైంది. "రంగ...రంగా...నన్ను ఇన్నాళ్ళకు కరుణించావా స్వామీ!" అంటూ ఆ వస్త్రాన్ని కుడి చేతిలో పట్టుకుని పైకెత్తి అందరికి చూపిస్తూ "ప్రజలారా! ఇది కట్టిన వస్త్రమున్న విగ్రహమే అసలైన శ్రీరంగనాథుడు. నాకు మునుపటి రుచి ఈ బట్టనుండే వస్తున్నది. ఇదేసత్యం! రంగనాథుడే దీనికి సాక్షి!" అన్నాడు. ఇది విని గోపన్న వల్లభదత్తులు హర్షధ్వానాలు చేశారు. వారు తెచ్చినదే అసలైన విగ్రహంగా గుర్తింపబడ్డందుకు పరమానందం చెందారు. ప్రజలంతా నారాయణ మంత్ర ఘోషతో ఆ ప్రాంతం ప్రతిధ్వనించింది.

గోపన్న ఆనందం వ్యక్తపరుస్తూ "తనను తాను ఆ శ్రీరంగనాథుడే నిరూపించుకున్నాడు" అని తన మెడలోని హారాన్ని వృద్ధుడికి వేసి "నీవు జీవించి ఉన్నంతవరకూ, నీకు నేత్రాలు లేకపోయినప్పటికి, నీవే దగ్గరుండి స్వామి వస్త్రాలను శుభ్రం చేయించాలి. నీ అనంతరం నీ వంశీకులే ఈపని చేస్తారు. వారికి ఆ విధంగా తర్ఫీదు ఇవ్వవలసిన బాధ్యత కూడా నీ మీదే పెడుతున్నాను!" అనగానే వృద్ధుడు ఆనందంతో "ధన్యోస్మి రంగనాథా !" అని సాష్టాంగ నమస్కారం చేశాడు. వెంటనే అక్కడి గుంపును చీల్చుకుంటూ వచ్చిన ఒక వస్తాదు "తాతా! నీ చివరి కోరిక తీరడమే కాదు శ్రీరంగనాథుడి విగ్రహాన్ని గుర్తించే మహద్భాగ్యమే నీకు దక్కింది. నీ జన్మ చరితార్థమైంది!"

అంటూ కౌగలించుకున్నాడు. ఆ వస్తాదును తన్ను విజయనగరం కోటలో కలిసిన బృందంలోని వాడిగా గుర్తుపట్టిన గోపన్న సంతోషంతో వస్తాదు భుజం తట్టాడు.

వెంటనే క్షణం కూడా ఆలస్యం చేయకుండా వేదాంత దేశికులవారు ఎంతో ఆతృతగా గర్భగుడికి కట్టిన రాతిగోడ దగ్గరకు వెళ్ళి నిల్చున్నారు.

గోపన్న "స్వామీ! ఆనాడు రాతిగోడ నిర్మించింది మీరే! కాబట్టి, మొదటి రాయిని మీ చేతితోనే పెకలించండి" అని ఒక పనిముట్టును స్వామి చేతికిచ్చాడు. అంత వయసులో కూడా దేశికులవారు గరుడ పురాణాంతర్గతమైన సుదర్శన చక్ర స్తోత్రం సుస్వరంతో స్పష్టంగా పఠించారు.

నమః సుదర్శనాయైవ సహస్రాదిత్యవర్చసే
జ్వాలా మాలా ప్రదీప్తాయ సహస్రారాయ చక్షుషే
సర్వదుష్ట వినాశాయ సర్వపాతక మర్దినే
సుచక్రాయ విచక్రాయ సర్వమంత్ర విభేదినే
ప్రసవిత్రే జగద్ధాత్రే జగద్విధ్వంసినే నమః
పాలనార్థాయలోకానాం దుష్టాషుర వినాశినే
ఉగ్రాయ చైవ సౌమ్యాయ చండాయచ నమోనమః
నమశ్చక్షుః స్వరూపాయ సంసారభయభేదినే
మాయాపంజర భేత్రేచ శివాయచ నమోనమః
గ్రహతిగ్రహరూపాయ గ్రహాణాంపతయే నమః
కాలాయ మృత్యవేచైవ భీమాయచ నమోనమః
భక్తానుగ్రహదాత్రే చ భక్త గోప్త్రే నమోనమః.

విష్ణురూపాయ శాంతాయ చాయు ధానాంధరాయచ
విష్ణుశస్త్రాయ చక్రాయ నమోభూయో నమోనమః
ఇతి స్తోత్రం మహత్పుణ్యం చక్రస్య తవ కీర్తితం
యః పఠేత్ పరయాభక్త్యా విష్ణులోకం సగచ్ఛతి.
చక్రపూజా విధియంశ్చ పఠేద్రుద్ర జితేంద్రియః
సపాపం భస్మసాత్కృత్వా విష్ణులోకాయ కల్పతే.

స్వామి వారిని పరిపరివిధాల ఎన్నో ఘడియలు మౌనంగా ప్రార్థనలు, శ్లోకాలు పఠించిన పిమ్మట, ఆ ప్రదేశమంతా ఒక పెద్ద విష్ణుచక్రం తిరుగుతున్న శబ్దం, దాని యొక్కనీడ అందరికి కనిపించి అంతర్ధానమయింది. అందరూ ఆశ్చర్యంలో మునిగితేలుతుండగా ఇంతలో వారికి ఒక బీషణ శంఖారావం వినపడగానే అందరు భక్తులు ఉలిక్కిపడ్డారు. ఒక గరుడపక్షి ఆలయం చుట్టూ అదేపనిగా ప్రదక్షిణలు చేస్తున్నది. పనిముట్టుతో అంత గట్టిగా మోదడం చూసి ప్రజలంతా దైవబలం అని చెప్పుకున్నారు. ఐదు నిముషాలు కష్టపడి గోడను బీటలు వారేట్టు చేసి మొదటి రాయిని పెకలించి క్రింద పడవేసి ఆయాసపడుతూ..నవ్వుతూ ఉండగా గోపన్న తదితరులు స్వామికి నమస్కరించి ఒక ప్రక్కన నేలపై ఆశీనులను చేసి సేద దీరమని, అందరూ కలిసి గోడను నిముషాల్లో కూల్చి వేశారు. రాళ్ళను తీసి దారి శుభ్రం చేసిన అనంతరం దేశికులవారు నారాయణమంత్రాన్ని పఠిస్తూ రంగ..రంగా..అని చేతులెత్తి మ్రొక్కుతూ గర్భ గుడి లోనకు ప్రవేశించారు. వెంటనే కొందరు అక్కడ ఉన్న దివిటీలను వెలిగించారు. లోపల క్రమంగా వెలుగులు చిమ్మి స్వామి విగ్రహం స్పష్టంగా కనిపించసాగింది. స్వామి రూపం అందరూ అన్ని సంవత్సరాల తర్వాత

కన్నులారా ఆనంద భాష్పాలతో "ఓం నమో నారాయణాయ!" మంత్రాలతో వీక్షించసాగారు. స్వామికి అన్ని సంవత్సరాల క్రితం వేసిన తులసిమాలలు వాడనే లేదు. ఇంకా గర్భగుడి మొత్తం సువాసనలు వెదజల్లుతూనే ఉంది. స్వామి విగ్రహంతో పాటు అప్పుడు వెంట తీసుకు వెళ్ళిన నగలు ఆభరణాలతో దేశికులవారు స్వామికి తొడిగారు. అందరూ ఆనంద పారవశ్యంలో ఉండగా అప్పటివరకూ ప్రశాంతంగా ఉన్న వాతావరణం మబ్బులు కమ్మి పెద్ద కుంభవృష్టిలా వర్షం కురిసింది. తురుష్కుల పాలనలో ఉన్న స్వామి ఆలయం, స్వామే శుభ్రపరచుకొన్నట్లు భక్తులు భావించారు.

ఇంకో విచిత్రం కూడా జరిగింది. సంపంగె వృక్షం మొదట్లో పడ్డ వర్షానికి అక్కడ మెరుస్తూ ఏదో కనిపించేసరికి ప్రజలు "స్వామీ! స్వామీ! ఇటు రండి" అని కేకలు వేశారు. వేదాంత దేశికులకు అంతా గుర్తొచ్చి గోపన్నకు సైగ చేయగానే దానిని వెలికి దీశారు. అది ఒక విగ్రహం. శ్రీరంగనాయకి మూల విరాట్టు. ముస్లిముల దాడి జరిగిన సమయంలో వారు దాచిన విగ్రహం. వల్లభుడు తన తల్లి ఒకసారి తనకు ఈ విషయం చెప్పిందని తనకే చెప్పడానికి ఈ ఆనందసమయంలో గుర్తు రాలేదని బాధ పడ్డాడు. అక్కడివారు అంతకు ముందు పూజిస్తున్న అమ్మవారి విగ్రహాన్ని కూడా అక్కడే ప్రతిష్టించారు. ఆ విధంగా రెండు ఉభయ నాంచారుల విగ్రహాలు నాటినుండి పూజకు నోచుకుంటున్నాయి.

గోపన్న అక్కడ ప్రజలకు నిర్భయంగా స్వామివారిని, అమ్మవారి ద్వయాన్ని దర్శించుకోవచ్చునని ధైర్యం చెప్పాడు. నగరంలోని ప్రజలు మొత్తం రంగనాథుని నామభజనలతో పరవశం పొందారు. ఊరు మొత్తం మామిడి తోరణాలతో అలంకరించబడింది. ఇక శ్రీరంగం ఆలయం ఎన్నడూ

లేనంత శోభను సంతరించుకొన్నది. ఆ సాయంత్రం వంశపారంపర్య బృందం సంగీత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆలయంలో హెూమశాలలు పునరుద్ధరించబడి యజ్ఞ, యాగాది క్రతువులకు నగరం మొత్తం ఆ దివ్యమైన పొగలను చూసి నగరం మొత్తం పులకించిపోయింది. ఆళ్వార్ల దివ్య ప్రబంధగానాలు సాగుతున్నాయి. స్వామి వారి విగ్రహాన్ని గర్భగుడిలో "యాగబేరం"లా ప్రతిష్టించారు. ఘనంగా పూజలు జరిగిన అనంతరం గోపన్న పారవశ్యంతో ఆలయానికి 16 వేల స్వర్ణ కడ్డీలను కంపమహారాజు తరపున, తను స్వంతంగా సంపాదించిన ధనం నుండి వెయ్యి స్వర్ణ కడ్డీలను స్వామివారికి బహూకరించాడు. సాళు వమంగు తన శక్తిమేర అరువేల స్వర్ణ నాణేలను, వెయ్యి సాలగ్రామ శిలలను బహూకరించాడు. కృష్ణరాజ ఉత్తమనంబి భక్తిశ్రద్ధలతో ఈ బహుమతులను, ఇంకా ప్రజలు సమర్పించిన బహుమతులను స్వీకరించి ఆలయంలో భద్రం చేశాడు. శ్రీవైష్ణవుల త్యాగానికి ప్రతీకగా అష్టాక్షరి గుర్తుగా చుట్టుప్రక్కల ఉన్న ఎనిమిది గ్రామాలు వారికి దానశాసనం ద్వారా అందించారు. వాటి ఆదాయం వారు వంశ పారంపర్యంగా అనుభవిస్తూ స్వామివారి సేవలో తరించాలని ఉత్తర్వులు జారీ చేయబడ్డాయి

ఆలయంలో తూర్పు ప్రాకారంపై వేదాంతదేశికులు ఒక శ్లోకాన్ని సుద్దముక్కతో ఈవిధంగా వ్రాస్తున్నారు. అందరూ అక్కడికి చేరి ఆ దృశ్యాన్ని కన్నులారా తిలకిస్తున్నారు.

"అనీయానీల శృంగద్యుతిరచిత జగద్రంజనా దంజనాద్రేః
చంజ్యామారాధ్య కంచిత్సమయ మథనిహత్యోధనుష్కాంస్తు రుష్కాన్
లక్ష్మీక్ష్మాభ్యాముభాభ్యాం సహ నిజనగరే స్థాప యన్రంగనాథం
సమ్యక్చర్యాం సపర్యాం పునరకృత యశః ప్రాపణో గోపనార్యః"

(శా.శ.1293 - క్రీ.శ.1371 సం-A.R.No.55 of 1892)

దీనికి అర్థం చెప్పమని కోరిన వారికి "నీలశిఖరాల నిగనిగలతో జగద్రంజకముగనున్న అంజనాద్రిలో ప్రవాసియైఉన్న శ్రీరంగనాథుని స్వస్తానమునకు జేర్చ యత్నించినవాడు గోపన్న. గోపన్న స్వామిని ముందు తన దుర్గమైన జెంజికి తరలించుకొన్నాడు. అచట స్వామిని అర్చించి అనుగ్రహమును పొందిన తరువాత యవనులను జయించి శ్రీరంగమును వశపరచుకొన్నాడు. శ్రీదేవీ భూదేవులతో రంగనాథుని యధాస్థానమున ప్రతిష్టించినాడు. స్వామి పూజాదురంధరుడై సమ్యక్సపర్యా పరుడై యశః ప్రాపణుడైనాడీ గోపనార్యుడు" అని వేదాంత దేశికులు చెప్పగానే అందరు కరతాళధ్వనులు చేయగానే, అక్కడి శాసన లేఖకులకు ఈ శ్లోకాన్ని ఇక్కడే యధాతథంగా శిలాశాసనంగా చెక్కించవలసినదిగా కోరారు దేశికాచార్యులు. కలలో కూడా శ్రీరంగనాథ స్తుతి తప్ప, వేరొక నరుని కాని, చివరకు రాజులులను చక్రవర్తులను కానీ పొగడని దేశికాచార్యులవారు, గోపన్నను ఈ విధంగా పొగడడం అక్కడి శిష్యబృందానికి కాస్తా ఆశ్చర్యాన్ని కలిగించింది.

ఆరాత్రి గోపన్నకు పట్టరాని సంతోషంవల్ల త్వరగానిద్రపట్టలేదు. తెల్లవారుఝామున స్వప్నంలో నరసింహావతారం ఎలాంటి గర్జనలు లేకుండా చాలా ప్రశాంతంగా కనిపించి, క్రమేణా మాయమయింది. వెనువెంటనే లక్ష్మీనారసింహస్వామి దర్శనం, లక్ష్మీనారసింహ స్వామి లక్ష్మీదేవిని ఎడమ తొడపై కూర్చుండబెట్టుకుని దర్శనమిచ్చి ఆశీర్వదించాడు. క్రమేణా మాయమయి క్షీరసాగరంలో శయనించి ఉన్న విష్ణుమూర్తి దర్శనం కనుపించి, చివరకు శ్రీదేవి భూదేవులతో ఉన్న శ్రీరంగనాథస్వామి దర్శనంఅయింది. వెంటనే పరమానందంతో లేచి కూర్చుని, తల్లిదండ్రులను

స్మరించి గురువులైన దేశికాచార్యులవారిని వారుపదేశించిన అష్టాక్షరీమంత్రాన్ని అనేక మార్లు జపియించి లేచి స్నానాది, సంధ్యాకార్యక్రమాలకుపక్రమించాదు.

శ్రీ కంపరాయలవారికి మధురలో రాజ్యాభిషేక కార్యక్రమ సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఆనిమాసం (వైశాఖ) 19వరోజున పట్టాభిషేకమని రాజ పురోహితులు, పండితులు, జ్యోతిష్యులు నిర్ణయం చేశారు. శ్రీరంగం మొత్తం తోరణాలతో అలంకరింపబడినది. అన్ని సామంత రాజ్యాలకే గాక మిగిలిన రాజ్యాలకు కూడా వర్తమానాలు పంపబడ్డాయి. ఆ వర్తమానంలో పాండ్యరాజానికి కూడా ఆహ్వానం ఉందా అని రాజవల్లభుడు లేఖకులను ప్రశ్నించాడు. వారు “ఉంది వల్లభా!” అనగానే సంతోషపడి, ఇంతకాలం తర్వాత మధురాంగిణిని చూడబోతున్నందు మనసు ఆనందంతో గంతులు వేసింది. దత్తుడు మాత్రం గోపన్న అనుమతి గైకొని, వల్లభుని తల్లి వాసంతికాదేవిని, మంజరిని, తదితర ముఖ్యులను పట్టాభిషేకానికి రావలసినదిగాను, మధురలో తిరిగి ప్రతిష్ఠించబడ్డ శ్రీరంగనాథుని దర్శనం చేసుకోవలసినాదనిగాను ఒక లేఖ వ్రాసి మూడు ప్రత్యేక పల్లకీలలో వర్తమానాలు పంపాడు.

శ్రీరంగం మొత్తం తోరణాలతో అలంకరింపబడినది. నగరంలో ఎక్కడ చూసినా తిరునాళ్ళ వాతావరణం నెలకొనింది. ఊరంతా చలువపందిళ్ళు, రకరకాల తినుబండారాలు అమ్మే అంగళ్ళు వెలిశాయి. వివిధ వేదికలమీద చక్కని సంగీత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్ణయింపబడ్డాయి. ప్రజలకు కంపరాజు ఉదారంగా బుక్కరాయల

అనుమతితో ధనాన్ని అక్కడి ప్రజలకు పంచిపెట్టించాడు.

కంపరాయలవారి పట్టాభిషేకం వేదాంత దేశికుల దివ్యఆశీర్వచనాలతో ఆరంభమయింది. వందిమాగధులు భటులు జయజయ ధ్వానాలు చేశారు. అప్పటికే శరవేగంగా నిర్మింపబడ్డ ఒక పెద్ద రాజ ప్రాసాదానికి దక్షిణ దిక్కులో విశాలమైన ఒక పెద్ద మండపము, అష్టదళ పద్మాలతో నిర్మించిన ఈ మండపము అష్టదిగ్జయ స్తంభములతో నిర్మింప జేశారు. మండపం పట్టు వస్త్రాలతోను, చినీ చీనాంబరాలతోను కప్పబడింది. నేలపై భూమి కనిపించనంతగా తివాచీలు పరచబడ్డాయి. మండపం మీద ఎనిమిది ఉన్నతాసనాలు అలంకరించబడి ఉన్నాయి. మధ్యలో ప్రత్యేక పట్టాభిషేక ఆసనము నిలిపారు క్రింది భాగాన వర్తులాకారంలో అనేక ఆసనాలతో అలంకరించారు. వాని వెనుకభాగాన కొంచెం ఎత్తుగా విశాలమైన నాపరాయి అరుగులు. విచ్చేసిన అతిధుల అర్హతలననుసరించి కూర్చుండజేయడానికి భటులను ఏర్పాటు చేశారు. రాజాతిధులు, రాయబారులు, రాజోద్యోగులు, పురప్రముఖులు, వేదవేదాంగ పండితులు, కవులు, గాయకులు, చతుష్షష్టి కళాకారులు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆసీనమవడానికి ఏర్పాట్లు చేశారు. మండపానికి ఇరువైపులా మదకరీంద్రములు, అశ్వములు నిలుపబడ్డాయి. వేదిక మీద ప్రథమంగా బుక్కరాయలవారు, దేవాయీ మహారాణి, వేదాంతదేశికుల వారు అశీనులయ్యారు.

ముహూర్తమాసన్నమవగానే కంపన, కుంతలాదేవి, గంగాదేవి, వెనుక గోపనార్యుడు వేదమంత్రోచ్చాటన జరుగుతుండగా ప్రవేశించారు. వారందరిని వేదికమీద కూర్చుండజేశాడు వేదాంత దేశికులవారు. ఆయనకు

సహాయంగా ఇద్దరు వైష్ణవ ప్రముఖులు ఉన్నారు. మండలేశ్వరులు, రాయరగండ, గండరగండ శ్రీశ్రీశ్రీ కంపరాయలవారికి వేదోక్తంగా పట్టాభిషేకము ప్రారంభమయింది. బుక్కరాయలవారు, దేవాయీ మహారాణి ఇరువైపులా నిలబడి కంపనను నవరత్నాలతో పొదగబడిన కిరీటధారులను చేశారు. దేవాయీ మహారాణి ప్రక్కనే ఉన్న గంగాదేవికి కూడా కిరీటధారణ జరిపించి ఈరోజునుండి కుంతలాదేవి, గంగాదేవి ఇద్దరూ పట్టమహిషులే! అని ప్రకటన చేసింది. రాణులిద్దరూ కంపనకు అటూ ఇటూ ఆశీనులయ్యారు.

ఇంత జరుగుతున్నా రాజవల్లభుడు మాత్రం తన ప్రాణ సదృశమైన పాండ్యరాజకుమారి మధురాంగిణి ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తుండగా ఆమె భర్తతో సహా వచ్చి ఆశీనురాలవడంతో ఖిన్నుడయ్యాడు. పాండ్య రాజ వంశస్తులతో వచ్చిన వారిని మెల్లిగా విషయం అడగ్గా మధురాంగిణి తండ్రి చనిపోతూ చివరికోరికగా ఆమె వివాహం చూడాలనుకోవడం వల్ల వివాహం జరిగిందని విని, ఏమీ మాట్లాడకుండా మౌనంగా అక్కడనుండి నిష్క్రమించాడు. మధురాంగిణి వల్లభుని కళ్ళలోకి చూసే ధైర్యం లేక నేలచూపులు చూస్తున్నది.

కంపనమహారాజు ప్రజలనుద్దేశించి మాట్లాడిన అనంతరం, గంగాదేవి వేదాంత దేశికుల అనుమతితో లేచి నిలబడి అందరికి నమస్కరించి "నేను కంపన మహారాజులవారి పరాక్రమాలను వర్ణిస్తూ "మధురావిజయం" అనబడే "వీరకంపరాయ చరిత్రము" అనే గ్రంధాన్ని రచించాను" అని చెప్పగానే సభలో కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. ఆ గ్రంధంలో కొన్ని విషయాలు వేదాంత దేశికుల వారి అనుమతితో చదివి

వినిపించాలనుకుంటున్నాను.'' అనగానే అందరూ పెద్ద పెట్టున హర్షధ్వానాలు చేశారు. గంగాదేవి ఇలా చెప్పసాగింది.

"ఇది ఎనిమిది సర్గల మహాకావ్యం. వైదర్భీ రీతిలో రచించాను. ఒక్కో సర్గలో ఒక్కొక్క ఛందస్సు వాడాను వరుసగా అనుష్టుప్, ఉపజాతి, వశస్థ, అనుష్టుప్, ద్రుతవిలంబిత, పుష్పితాగ్ర ఛందం ఇత్యాదిగా వాడాను. దీనిలో నాలుగైదు సర్గలలో నా స్వామి కంపనమహారాజు దండు బయలుదేరి చంపనృపతిని జయించి రాజగంభీరాన్ని వశపరచుకోవడం ఉన్నది. ఐదవ సర్గలో కాంచీపురాన్ని రాజధానిగా చేసుకొనుట. ఎనిమిదవ సర్గలో కాంచీపుర మధుర మీనాక్షీ దేవి నా స్వామికి దర్శనమిచ్చి "మధురావిజయము" గురించి కర్తవ్యోన్ముఖుని చేయడం ఉంది.

"కరోతి కీర్తి మర్థాయా, కల్పతే హంతి దుష్కృతం
ఉన్మీల యతి చాహ్లాదం, కిం ననూతేః కవేః కృతిః"

"అనగా కావ్యరచన కీర్తిని కలిగిస్తుంది. పాపాలను తొలగిస్తుంది. హృదయాహ్లాదాన్నిస్తుంది. కావ్యం దేనినీయదో మీరు చెప్పండి?" అనగానే అందరూ కరతాళ ధ్వనులు చేశారు.

ఇంకొక్క శ్లోకంతో ముగిస్తాను.

"హత అవశిష్టాన్ అథవీరయోధాన్, సమ్రక్ష్య పాద పణతాన్ శరణ్యాః
కృత అభిషేకః ప్రశశాస మేదినీం, దివం మరుత్వాన్ ఇవ కంపభూపతిః"

దీనికి అర్థం మీకందరికి నేడు విదితమైన విషయమే! యుద్ధంలో మరణించినవారిని గాక మిగిలిన యోధులను అంటే గాయపడ్డవారిని రక్షించి, తన పాదాలపైబడి శరణు వేడినవారికి అభయమిచ్చి, స్వర్గంలో ఇంద్రునివలె అభిషిక్తుడైన కంపభూపతి రాజ్యాన్ని పరిపాలించెను" అనగానే

"మండాలీధీశుడు కంపభూపతికి జై, గంగాదేవి మహారాణికీ జై" అని జనం పెద్ద పెట్టున హర్షధ్వానాలు చేశారు. నా సంస్కృత విద్యకు, ఈ గ్రంథానికి మూలకారణమైన క్రియాశీల పండితుల వారిని తగురీతిలో సన్మానించవలసిందిగా కోరుతున్నాను. అలాగే ఈ రచనలో తగు సలహాలనిచ్చిన గోపనామాత్యులు కూడా నాకు గురుతుల్యులే! అనగానే క్రియాసిద్ధి పండితుల వారికి ఘన సన్మానం గంగాదేవి చేతుల మీదుగా జరిగింది. దేవాయీ మహారాణి గంగాదేవిని కౌగలించుకుని "మా కంపన నిన్ను నీ అందాన్ని చూసి మోహించాడనుకున్నాం కానీ కాకతీయ రాజవంశ లక్షణాలన్నీ పుణికి పుచ్చుకున్న మరో రుద్రమదేవివి! మా కంపనకు రక్షణగా యుద్ధభూమికి వెళ్ళి, స్వయంగా దర్శించిన దానవు. నిన్ను ఏ విధంగా సత్కరించాలో నాకు అర్థం కావడంలేదు" అన్నది.

కంపభూపతి లేచి "మహాజనులారా! ఈ మధురావిజయానికి ముఖ్య కారకుడు, నా ప్రాణసదృశుడు అయిన శ్రీగోపనార్యులను ఉచిత రీతిన సన్మానించాలనుకుంటున్నాను. "సర్వ సైన్యాధ్యక్షుడు వీర గోపనకు జై! " అని జనం ఆవేశం గా కేకలు పెట్టారు. కంపన అతనికి జెంజికి ప్రభువుగా ప్రకటించి "ధనుర్విద్యా విశారదుడైన ఈ వీరుడు బుద్ధిచే బృహస్పతి, పరాక్రమంలో ఫల్గుణుడు, భక్తిచే ప్రహ్లాదుడు. నన్ను వెన్నంటి ఉండి, మధుర సుల్తాను తలను త్రెంచుటలో నాకు సహాయపడినవాడు. ఇతనికి ఏమిచ్చిన నా ఋణము తీరదు. ఈతని విజయాలను కంచిలోను, శ్రీరంగములోను శిలా శాసనములుగా చెక్కించమని మహామండలేశ్వరులైన బుక్కరాయలవారిని ప్రార్థిస్తున్నాను" అనగానే బుక్కరాయలు "విప్రుడై వేదవేదాంగములు నేర్చి వీరుడైన ఈ గోపన్నను చూస్తే మాకు నిత్యం

ఆశ్చర్యమే! విప్రులు కూడా శౌర్యప్రతాపాలున్నట్లైతే మహారాజు కావచ్చునని మాగోపనార్యుడు ఋజువు చేశాడు. గుణములెప్పుడు కులాశ్రయములు కావు" అని అనేక ఆభరణాలను గోపన్నకు బహూకరించి గాఢంగా కౌగలించుకొన్నాడు. ఇంకో ముఖ్య విషయం ఏమిటంటే ఈ మధురా విజయము వలన దేవాయీ మహారాణి కోరికలైన శ్రీరంగనాథుని రథయాత్ర, తామ్రపర్ణి నదిలో వారి పవిత్ర స్నానం, పిమ్మట రాజభవనంలో చిరకాలంగాదాచిన సువర్ణ, రజత నాణెములు, వస్త్రాలు మొదలైన దానధర్మ కార్యక్రమాలు రెండూ త్వరలో తీరనున్నాయి" అని బుక్కరాయల వారు ప్రకటించగానే హర్షధ్వానాలు జేజేలు మిన్నుముట్టాయి ఇంతలో అక్కడికి చేరుకున్న వాసంతిక ఆ దృశ్యం చూసి మహదానందం చెందింది. అక్కడ దత్తుడు మంజరి చేయి పట్టుకోవడం గమనించిన వాసంతిక ఏమీ గమనించనట్టు ప్రవర్తించింది. వాసంతిక క్షయవ్యాధి నుండి స్వస్థత పొందడం కేవలం ఆ శ్రీరంగనాథుని కరుణా కటాక్షాలే అని అక్కడి ప్రజలు వ్యాఖ్యానించారు. రాజ వల్లభుడు అక్కడికి దగ్గరలో ఉన్న ఒక మండపంపై ఒంటరిగా పవళించి, ఆకాశం వంక చూస్తూ భవిష్యత్ కార్యక్రమం ఆలోచించుకొంటున్నాడు.

గంగాదేవి కంపనలు కాంచీపురానికి తిరుగుప్రయాణానికి రంగం సర్వం సిద్ధమయింది. అప్పటికే గోపన్న జెంజి దుర్గం చేరుకున్నాడు. అక్కడి కవులు వ్రాసిన తాళపత్ర గ్రంధాలను ఒక టేకు పెట్టెలో పెట్టించింది. తన గ్రంధాన్ని ఒక స్వర్ణమంజూషలో ఉంచి పల్లకీలో పెట్టించింది. పల్లకీ ఎక్కకుండా ఏదో పరధ్యానంగా ఆలోచనలో గంగాదేవి వైఖరి కంపనకు

అర్థం కాక ఆశ్చర్యంగా చూస్తున్నాడు. గంగాదేవి “స్వామీ! ఒక్కసారి ఆ శ్రీరంగనాథుని దర్శనం చేసుకోవాలని ఉంది” అనగానే, అందరు పరివారాన్ని ప్రక్కకు వెళ్ళమని సైగ చేసి, స్వయంగా మొత్తం దగ్గరుండి విశేషాలను వివరిస్తున్న సమయంలో తూర్పు ప్రాకారం దాటుతుండగా “క్రొత్తగా ఇప్పుడు మళ్ళీ ఈ తూర్పుగోపురం ఎందుకు పునర్నిర్మిస్తున్నట్టు? పాతగోపురం బాగానే ఉంది కదా! తైలవర్ణాలతో అలంకరించి ఉంటే ఇంకా బాగుండేది కదా! ఈ తెల్లసున్నం వేయడమెందుకు స్వామీ!” అని అడిగిన గంగాదేవిని చూస్తూ కంపన చెప్ప సాగాడు. “శ్రీరంగములో ఉన్న ఈ తూర్పు గోపురానికి “వెల్లాయి గోపురం” అని వేదాంతదేశికుల వారి సూచనమేరకు పేరు పెట్టాము. ఆయన నాతో చెప్పిన వృత్తాంతం నీకు చెప్పడం మరచాను దేవీ! అందరూ ఈ గోపురానికి తెల్లసున్నం వేయడం వల్ల అది వెల్లాయి గోపురం అనుకుంటారు. ఇది కూడా దేశికులవారి యోచనే! నిజానికి ఓ దేవదాసి త్యాగానికి చిహ్నంగా ఆమె పేరుతో వెల్లాయి గోపురంగా యిలా మార్పులు చేయించాను. వెల్లాయి అందములోనూ, నాట్య గానాలలోనూ చతురతలోనూ ఆమెకు సాటి లేరు. లేతవయసులోనే ఆమె శ్రీరంగని సేవకు అంకితం అయింది. ఆమె ఎంతటివారినైనా తన చతురతతో ఇట్టే మెప్పించేది. ఆమెకు పాండిత్యమూ, శ్రీరంగని కరుణాప్రసాదముతో చిన్నతనంలోనే లభించాయి. ఆమె కథ, త్యాగం గురించి నీవు “మధురావిజయం”లో లిఖించవలసి ఉన్నది.

జాగ్రత్తగా విను. అవి శ్రీరంగం మీద అల్లా ఉద్దీన్ ఖిల్జీ సైనికులు ఆతని సైన్యాధిపతులు దాడులు జరిపి ఇరువదిమూడు వేలమంది బ్రాహ్మణులను, శ్రీవైష్ణవ భక్తులను ఊచకోత కోసిన సమయం. ఆలయం

మీద దాడి జరిపినపుడు ప్రతిఘటించిన మరో 12000 మంది ప్రజలను కూడా ఊచకోతకోసి ఆలయములోని విలువైన నగలు, సంపద అంతా దోచారు. అక్కడ ఉన్న దివ్య మూర్తులు పూర్తిగా స్వర్ణమయం. వాటినీ డిల్లీకి తీసుకుని పోవాలని వారు గుడి అంతా వెదికారు. కానీ ఆలయ ఆచార్యులు పిళ్లై లోకాచార్యుల వారు అప్పటికే రాత్రికి రాత్రే ఆ మూర్తులును తీసుకుని మారువేషాలలో మధురకు పారిపోయారు. ఆ ముష్కరులు స్వర్ణ విగ్రహాలకోసం, పిళ్లై లోకాచార్యుల కోసం చాలానే వెదికించారు. పిళ్లై లోకాచార్యుల వారు తరువాత ఆ మూర్తులను తిరునల్వేలికి తీసుకుని పోతూ మార్గ మధ్యమములో అనారోగ్యంతో మరణించారు. తరువాత ఆ మూర్తులను తిరుపతికి చేర్చడం, 1323 లో శ్రీరంగం నుండి బయటకు వెళ్ళిన మూర్తులు దాదాపు 1371 వరకూ తిరిగి ఆలయాన్ని చేరలేదన్న విషయం నీకు సంపూర్ణంగా తెలుసు.

శ్రీరంగం ఆలయం మీద దండయాత్ర చేసినపుడు, దేవదాసి "వెల్లాయి" వెంటనే తన వాద్య, గాత్ర పండితుల ను అప్పటికప్పుడు రావించి, వారి సహకారముతో ఓ శృంగార నాట్యప్రదర్శన చాతుర్యంగా ఏర్పాటు చేసింది. సైన్యాధిపతి మరియు అనేక మంది సైనికులు ఆమె అందం, శృంగారనాట్యం అందం చూసి విచలితులయ్యారు. ఆమె చేసే అద్భుత నాట్యం గంటలకొద్దీ సాగింది. ఈ సమయములోనే పిళ్లై లోకాచార్యులు సైనికుల కనుగప్పి ఆ మూర్తులను తీసుకుని మారువేషములో మధురకు పారిపోయారు. వెల్లాయి అందం హొయలు చూసి విచలితుడై ఆమె వెంటబడిన సైన్యాధిపతిని అటు-ఇటు అంటూ త్రిప్పి-త్రిప్పి ఈ తూర్పుగోపురం ప్రాంతానికి తీసుకుని పోయింది. అక్కడ మెల్లగా గోపురం

పైకి తన చతురతో మూర్తులు, ధనసంపద ఎక్కడ ఉన్నాయో చూపిస్తాను రమ్మంటూ కవ్విస్తూ తూర్పు గోపురం మీదకు తీసుకుని పోయి ఆతణ్ణి అక్కడ నుండి తోసి వేసింది. ఆ ముష్కరుల చేతిలో బందీ అవడం ఇష్టంలేక ఆ గోపురం మీద నుండి శ్రీరంగనాథుని తలుస్తూ తానూ దూకి చనిపోయింది. ఆ ఘటన విన్న నేను చలించిపోయాను. నాడు స్వామి వారి మూర్తులను సంరక్షించేందులకు తన ప్రాణాలకు సైతం వెరువక త్యాగం చేసిన దేవదాసి వెల్లాయి స్మృత్యర్థం నేను ఆ తూర్పు గోపురాన్ని పునరుద్ధరించి ఆమె పేరుతో, ఆమె స్మృత్యర్థం, వెల్లాయి గోపురం అని పేరు పెట్టించాను. దేవదాసీలు మరణిస్తే వారి త్యాగాలకు చిహ్నంగా గౌరవపూర్వకంగా శ్రీరంగని ఉగ్రాణం నుండే వారి దహన అంత్యక్రియలకు నిప్పువెళ్లేఆచారం నేటికీ అమలులో ఉంది" అనగానే వెల్లాయి వృత్తాంతాన్ని తన గ్రంథంలో లిఖించాలని నిర్ణయం తీసుకొంది గంగాదేవి. వారి రథాలు శరవేగంగా కంచి వైపు నడిచాయి.

జెంజి కోటపై నలువైపులా వరాహ పతాకం రెపరెప లాడుతున్నది. కోట పైభాగంలో పండువెన్నెలలో గోపన, కుముదశ్రీలు ఆశీనులై ఉన్నారు. గోపన్న "కుముదినీ! ఈవిషయం విన్నావా? అంజనాద్రిలో స్వామివిగ్రహాన్ని అంత సాహసంతో కనిపెట్టిన రాజవల్లభుడు పాండ్యరాణి మధురాంగిణిని ప్రేమించి, ఆమెకు వివాహమైనదన్న విషయంతెలిసి, వివాహంచేసుకోకుండా విరాగియై, శ్రీరంగనాథుని సేవలో ఉండిపోయాడన్న బాధనన్ను మిక్కిలి బాధిస్తున్నది" అన్నాడు. కుముద నోటిపై చెయ్యి అడ్డుపెట్టుకుని "హయ్యో! అవునా స్వామీ!" అన్నది.

ఇంతలో కుమారుడు అయ్యన వారికి దగ్గరగా నిలబడి ఆకాశాన్ని గమనిస్తూ " నాన్నగారూ! ఆ మేఘాలను చూశారా! నాకు శ్రీదేవి, భూదేవి సమేతులైన శ్రీరంగనాథ స్వామిలా గోచరిస్తున్నాడు. అనగానే ఇద్దరూ ఆశ్చర్యపడి పైకి చూశారు. నిజమేనన్న భావనతో కుమారుణ్ణి ముద్దా డిన అనంతరం "స్వామీ! మీ శపథం, ప్రతిజ్ఞ చెల్లించుకున్నారు కదా! ఇకనైనా యుద్ధాలు ఆపి భక్తివరివస్య చేయకూడదా? ఇంతకీ..మన అయ్యన్నను మహావీరుణ్ణి చేస్తారా? లేక అమాత్యుణ్ణి చేస్తారా?" అని కుముదశ్రీ అడిగిన ప్రశ్నకు నవ్వి **"దాస భూతమిదం తస్య జగస్థావర జంగమం, శ్రీమన్నారాయణ స్వామీ జగతాం ప్రభురీశ్వరః"** అన్న పద్మ పురాణ శ్లోకం వినలేదా కుముదా! మనం నిమిత్తమాత్రులం! సమస్త సృష్టికి ఆ దేవుడే ప్రభువు, చర-అచర ప్రాణులు, వస్తువులన్నీ అతని సేవకులే! శ్రీరంగనాథుడే సమస్త జగత్తుకి స్వామి, యజమాని, భోక్త. నేను కేవలం శ్రీరంగనాథుని సేవకుడిని మాత్రమే! ఆ శ్రీరంగనాథుడు ఈ సరికి అయ్యన్న విషయంలో నిర్ణయం తీసుకునే ఉంటాడు. మనం కేవలం కాలాన్ని అనుసరిస్తూ వెళ్ళడమే!" అన్నాడు. ఈ విజయనగర సామ్రాజ్యము అత్యున్నత స్థితికి రావాలని కృషిచేయడమే నా విధి. ముఖ్యంగా ఈ నేలపై తురుష్కుల పాలనలో జీర్ణమైన ఆలయాలనన్నిటిని పునరుద్ధరించడమే ప్రస్తుత నాధ్యేయం!" మిగతా విషయాలన్నీ శ్రీరంగనాథుని నిర్ణయానుసారమే జరుగుతాయి" అన్నాడు.

-000-

ఆధార గ్రంథములు


1. మధురా విజయము, శ్రీ పేరాలభరత శర్మ, రీం పబ్లికేషన్స్, న్యూఢిల్లీ, 2015.
2. "వాక్" మాసపత్రికలో వచ్చిన, శ్రీరంగనాథుని పర్యటన-2, సి.ఎస్.ఎల్ నరసింహన్ మరియూ సుధారంగరాజన్ - దాదాపు ఐదారు సంవత్సరముల ధారావాహిక.
3. కోయిల్ ఒళుగు, డా.వి.ఎన్ హరిరావు, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం,1961.
4. ఇబిన్ బట్టుటా, ట్రావెల్స్ ఇన్ ఏషియా మరియూ ఆఫ్రికా (1325-54) హెచ్.ఎ.ఆర్. గిబ్, జార్జి రౌట్లెట్ అండ్ సన్స్ పబ్లికేషన్,1929.
5. (ఎ) మధురా విజయము పై సిద్ధాంత వ్యాసము, బి.ఎ దోడామణి, కర్ణాటక విశ్వవిద్యాలయం, 1991
   (బి) మధురా విజయము పై సిద్ధాంత వ్యాసము, గాయత్రీ కణ్ణన్, మదరాసు విశ్వవిద్యాలయం, 2002.
6. ది హిస్టరీ ఆఫ్ విజయనగర ఎంపైర్ (1368-1569), ఎం.హెచ్.రామ శర్మ, ఎం.హెచ్.గోపాల్, బాంబే పాపులర్ ప్రకాషన్, 1956.
7. హిస్టరీ ఆఫ్ శ్రీరంగం టెంపుల్, వి.ఎన్.హరి రావు, ఆర్కీవ్స్లో దొరికిన కవరుపేజీ లోని పుస్తకం.
8. మధురా విజయం ఆఫ్ గంగాదేవి, ఎస్.తిరువేంకటాచారి, కారైకుడి, అణ్ణామలై విశ్వవిద్యాలయం, 1957.
9. సోర్సెస్ ఆఫ్ విజయనగర హిస్టరీ, ఎస్.క్రిష్ణస్వామి అయ్యంగార్, 1919.
10. ఆంధ్ర వైష్ణవ వ్మాయము, భారతి మాసపత్రిక నిడదవోలు వెంకటరావు, (1952 అక్టోబరు - ఖర-మార్గశీర్ష) మాసం.
11. ది హీరోస్ గోపనార్య అండ్ విజయాలయ దేవ-1, మానస తరంగిణి, వర్డ్ప్రెస్ బ్లాగు, 9-3-2009.
12. అంతర్జాలంలో ఉన్న అనేక వ్యాసములు.

VIJAYANAGARA
KAMPANA
No.286
(A.R.No. 55 of 1892)
II Prakara East Wall

Records that Gopanna took the image of Ranganatha from Tirupati to Chenji, his capital and after defeating the Muslims restored the image to Srirangam and had it installed there with Lakshmi and Bhudevi, the consorts of the Lord. The record is dated in Saka year 1293 expressed by the chronogram of *bandhupriya*

(Published in Ep. Ind., Vol. VI, P.322)

Text



(శ్రీరంగంలో రెండవ తూర్పు ప్రాకారంపై ఉన్న శాసనం – ఎపిగ్రాఫికా ఇండికాలో ప్రచురితం వాల్యూం 6, పుట 322)